నేనూ - నా దేశము

AOU4IDIBIT7

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10233

రచయిత :

దరశి చంచయ్య

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10233

ఆదర్శ గ్రంథమంజరి
విజయవాడ-2

ENU NAADESAM by Darisi Chanchai
ఆదర్శ ప్రచురణ Published by
Adarsa grandha mandai
Vijayawada-2.

తొలికూర్పు :
సెప్టెంబరు, 1952
మలికూర్పు :
జనవరి, 1967

వెల రు. 1 0

920
CHAN

కృతజ్ఞత:

ఈ గ్రంథాన్ని వెలువరించుటలో మా కన్నివిధముల తోడ్పడిన మిత్రులు శ్రీ అన్నవరపు సుబ్బారావు గుప్త,
శ్రీ అద్దేపల్లి సత్యనారాయణ గార్లకు.

—సంపాదకుడు

తొలికూర్పు
సంపాదకుడు :
కే॥ కే॥ గద్దె లింగయ్య
ముద్రణ :
సరోదయ ప్రెస్ పటమట.

AOUA101B1F7

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఉరి

కొయ్య కెరయైన అమరజీవి—

నా మిత్రుడు సర్దార్ బలవంత

సింగుకు, ఆ య న భా ర్య కు

అంకితం

"నేను సైతం ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ధరవోశాను"

—శ్రీ శ్రీ

పీఠిక

ఇంగ్లీషులో సంవత్సరానికి కనీసం పది, పదిహేను ఆత్మకథల ప్రచురణ జరుగుతుంది. కాని, మన తెలుగులో గడచిన నలభై రెండు సంవత్సరాలలో పట్టుమని పదైనా వెలువడలేదు. ఇక్కడ నేను ఈ "నలభై రెండు సంవత్సరాల" ప్రస్తుతిని నిర్మిత్తంగా తీసుకురాలేదు. మన తెలుగులో తొలి ఆత్మకథ ప్రచురణ సరిగా నలభై రెండు సంవత్సరాలనాడు. అంతకు ముందు ఈ సాహిత్య విభాగం మనకు లేనేలేదా అనే సందేహానికి ఆస్కారం 5 ఇండ 1910 లో "స్వీయ చరిత్రము" అనే పేరుతో ఆత్మకథను ప్రచురిస్తూ శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు "తెలుగు భాషలో స్వీయ చరిత్రమును వ్రాయబూను కొనుట కిదియే ప్రథమ ప్రయత్నము" అని స్పష్టపరిచారు. తమ ఇతర ప్రథమ ప్రయత్నములలో వలె దీనిలో కూడా పంతులుగారు తెలుగుజాతికి చక్కని బాటనే తీర్చారు. అయినా దానివెంట నడచినవారిని వేళ్ళమీద లెక్కించవచ్చు.

శ్రీ వీరేశలింగం పంతులుగారి తర్వాత ఆత్మకథలను ప్రచురించిన తెలుగువారు నాకు తెలిసినంతవరకు— శ్రీ రాయసం వెంకటశివుడు, శ్రీ పల్లూరి సూర్యనారాయణ, శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం, శ్రీ టంగుటూరి

ప్రకాశం, డా॥ కె. యన్. కేసరిగార్లు మాత్రం. ఈ అయిదుగురి కృషిలో కూడా ఒకరిది అసమగ్రం. రెండవవారిది ఇంకా గ్రంథరూపం ధరించలేదు. ప్రకాశం పంతులుగారి "నా జీవిత యాత్ర" బాల్యంనుంచి ఒక మజిలీ మాత్రం చేసి, "పంచాశద్వత్సరాల" వద్ద నిల్చిపోయింది. డాక్టర్ కె. యన్. కేసరిగారి "నా చిన్ననాటి ముచ్చట్లు" ఇంకా "గృహలక్ష్మి" సంచికలలోనే వుండిపోయింది. ఇంత కొద్ది మంది మాత్రమే నడచిన ఈ బాటవెంట సాహసించి ఇప్పుడు కొత్తగా నడచినవారు శ్రీ దరశి చెంచయ్యగారు.

స్వీయ చరిత్ర వ్రాయడం నిజంగా సాహసంతో కూడిన పనే. శ్రీ వీరేశలింగంగారే ఈ విషయాన్ని కొంత వరకు సూచించారు. "స్వీయ చరిత్రము వ్రాయుటలో నితర గ్రంథ రచనలో నున్న వానికంటె నెక్కువ కష్టములు కానవచ్చుచున్నవి" అని చెప్పి, ఆ కష్టము లేవో వారే వివరించారు. "తన్నుగూర్చి తాను వ్రాసికొనినపుడు ఈశ్వర ముఖము జూచి సత్యమునే చెప్పబూనినను సమకాలపు వారది యాత్మస్తుతిగానో, పరనిందగానో చేకొని యన్యథా భావించవచ్చును. ఒకానొకప్పుడు పరులనుగూర్చి యప్రియ ములగు సత్యమును బయలుపఱుప వలసివచ్చినప్పుడు వారి కిని వారి మిత్రులకును, బంధువులకును మనస్తాపము కలుగ వచ్చును."

స్వీయచరిత్ర రచనలో పంతులుగారు చెప్పిన చిక్కులున్నా, ఆత్మస్తుతి, పరనిందల ఆరోపణలకు బెదిరినందు

వల్లనే, అప్రియ సత్య ప్రకటనకు సంకోచించినందువల్లనే ఆత్మకథా రచన జోలికి పోచ్చుమంది పోలేదని నేనను కోను. "కథ" అంటూ వుంటేనే తప్ప ఆత్మకథ" వ్రాయడం సాధ్యం కాదు. ఎవరికి వారికే తమ జీవితం ఒక కథ కావచ్చు గాని, ఇతరులకు దాన్ని గురించి అన్యభావాలుండవచ్చు నిత్యజీవితంలో "నా కథ కాస్త వినండి" అంటూ వచ్చేవారిలో వెయ్యికి 999 మంది నిజానికి మనకు వినిపించేది "ఆత్మకథ"ను కాదు. "ఆత్మక్షోభ"ను. మన క్షోభ సాహిత్య గౌరవం పొందగల కథ కావడం సమకాలిక సంఘ జీవిత విస్తృతిని, వైవిధ్యాన్ని, వైశిష్ట్యాన్ని— దాని వెలుగునీడల సమేతంగా-మన జీవితచరిత్ర బహుధా ప్రతిఫలింపజేయగలిగి నప్పుడే. ఈ మహదాభాగ్యానికి నోచుకొన్నవారు మనలో కొద్దిమంది. వారిలో ఆత్మపరీక్షను చేసుకొనగలవారేమి, తమను గురించి, ఇతరులను గురించి న్యాయమైన తీర్పులను రాగలవారేమి మరింత తక్కువ. ఈ దశత వున్నా, కొన్ని నెలల తరబడి రచనను కొనసాగించగల ఓర్పు చూపగలవారు అసలే తక్కువ. ఇందువల్లనే మనకు ఆత్మకథలు ఇంత తక్కువని అనుకొంటాను.

కారణాలేవైనా మనకున్న స్వీయ చరిత్రలు బహు కొద్ది. ఈ పరిస్థితిలో ఒక కొత్తది వెలువడ్డమే సంతోషం కలిగిస్తుంది. ఇక, ఆ వెలువడింది—పరభాషలలోనివాటితో పోల్చినప్పటికీ-ఉత్తమ శ్రేణికి చెందినదైతే పరమ సంతో

షమే. శ్రీ చెంచయ్యగారి "నేనూ - నా దేశము" నిస్సం
శయంగా ఉత్తమ శ్రేణికి చెందిన ఆత్మకథ. నిజానికి అది
ఆయన ఆత్మకథ కాదు; మన దేశ చరిత్ర. పోయిన అర్ధ
శతాబ్దిలోను మనదేశంలో ఆర్థిక, సాంఘిక, రాజకీయ,
సాంస్కృతిక రంగాలలో వచ్చిన ప్రతి మహోద్యమం
శ్రీ చెంచయ్యగారి జీవిత దర్పణంలో తన ప్రతిబింబాన్ని
మిగిల్చింది. పైగా, అవి నిర్జీవ ప్రతిబింబాలు కావు; సజీవ
మైనవి. సాక్షీభూతులై తీరాన నిలపడం చెంచయ్యగారి
ప్రవృత్తికి విరుద్ధం. తమను ఆకర్షించిన ప్రతి మహోద్యమ
వాహినిలో ఆయన తల మునకలు కావలసిందే. ఈ విశిష్టతే
ఆయన జీవితగాథకు సమకాలిక దేశచరిత్ర కాగల గౌర
వాన్ని కూర్చి, "నేనూ - నా దేశము" అనే నామకరణాన్ని
సార్థకం చేసింది.

అయితే వరసపెట్టి ప్రశంస లేకపోతే, తెంపులేని
దూషణతప్ప, మనకు నిష్పాక్షిక విమర్శలేదనే నింద
నిష్కారణమైంది కాదని నమ్మేవాడిని కాబట్టి, మామూలు
తప్పిదాన్ని చేయక, శ్రీ చంచయ్యగారి రచనలలో నాకు
లోపాలుగా తోచిన విషయాలను ముందుగానే చెప్పివేస్తు
న్నాను. తమ బాల్యదశకు ఆయన "కట్టె-కొట్టె-తెచ్చె"
ఘోరణిలో సరిపుచ్చారు. ఇందువల్ల ఇరవయ్యో శతాబ్ది
ప్రారంభంలో ఆంధ్రదేశ-ముఖ్యంగా సెల్లూరుజిల్లా-సాంఘిక
పరిస్థితులను గురించి సవిస్తరంగా తెలుపడానికి వీలులేక
పోయింది. గదర్ పార్టీ పుట్టుపూర్వోత్తరాలను గురించి
కొంత విపులంగానే వ్రాసినా దాన్ని గురించి చెంచయ్య

గారు మాత్రమే తెలుపగలవి మరెన్నో కలవని అనుకుంటాను. జయిళ్ళలో—ముఖ్యంగా ఇండియన్ జయిళ్ళలో తమ అనుభవాలను గురించి అనవసరంగా పెంచి వ్రాశారనికూడా నా నమ్మకం. ఈ భాగాలను తగ్గిస్తే, యితర వ్యక్తులకు కొందరికి బాధ కలిగించే విషయములను యెత్తుకోవడం జరిగేది కాదేమో! స్వీయచరిత్ర రచన సందర్భంలో ఎవ్వరికీ, ఏవిధమైన నొప్పి కలిగించకుండా వ్రాయడం—అప్రియ సత్యాలను పలుకనేరని భీరునికి తప్ప—సాధ్యం కాదనుకోండి. శ్రీ వీరేశలింగం పంతులు గారు కూడా "సాధ్యమైనంతవర కన్యులమనస్సులకు నొప్పికలిగించెడి విషయల ననావశ్యకముగా జొప్పించుట మానితినిగాని, కొందరినిగూర్చి మనస్సున కింపుగాని విషయము లనివార్యముగా వ్రాయవలసివచ్చినది" అని తమ "స్వీయ చరిత్రము"లో చెప్పినారనుకోండి. అయితే, శ్రీ చెంచయ్యగారు "నివార్యము" లైనప్పటికీ అన్యులకు బాధకలిగించగల సంఘటనలను నాలుగైదింటిని అనవసరంగా పేరొక్కన్నారని నా అభిప్రాయం.

నా బుద్ధికి లోపాలుగా తోస్తున్న లోపాలను విడిచిపుచ్చితే "నేనూ-నా దేశము" సర్వోత్కృష్టంగా వున్నది. తాను రచయితను కానన్న సంకోచం శ్రీ చెంచయ్యగారికి వున్నట్టుంది. కాని, ఆయన సూటిగా ఆలోచిస్తారు: సూటిగా బ్రతుకుతారు. అందుపల్ల సూటిగానే వ్రాయగలరు. రచయిత కావడానికి దీన్ని మించిన అర్హత నా మట్టుకు నాకు తెలియదు.

స్వీయ చరిత్రలో ఒక చోట శ్రీ చెంచయ్యగారు ఎప్పటికప్పుడు తాము తమ వయస్సుకంటే పిన్నగా కను బడుతుంటామని వ్రాశారు. ఆయన అంతరంగంలోకి తొంగిచూడగలిగితే దానికి ఈ వైచిత్రి మరింతగా వర్తి స్తుందని మనం తెలుసుకోగలము. మానసికంగా నిత్య యౌవనం ఒక విశిష్టత కాబట్టి, షష్టిపూర్తి చేసుకొన్న తర్వాతకూడా ఏ కొత్తవుద్యమాలను నడిపి, నా దేశానికి కొత్తసేవ చేయగలనన్న తపన ఆయనలో కనబడుతుంది. ఆయన జీవితంలో ఈ నవ నవోన్మేషం ఆయన రచనలో కూడా వెల్లివిరుస్తున్నది.

దాపరికం లేకుండా చెప్పాలంటే "నేనూ - నా దేశము"లోని కొన్ని భాగాలను "కిన్నెర"లో చదవక ముందు శ్రీ చెంచయ్యగారు నా దృష్టిలో — ఏమని చెప్పను?-సరే — ఒక చంచయ్యగారు. ఆ భాగాలను చదువుతుండగానే ఆయన ఒక విశిష్టవ్యక్తి అని గ్రహించగలిగాను. తర్వాత ఆయన ఆత్మకథను గ్రంథం లలో పూర్తిగ చదవగలగడం మరపురాని ఒక విశిష్టాను భూతిని పొందడంగా — లేదు, జీవించడంగా — పరిణమిం చింది. "నేనూ-నా దేశము" పాఠకులందరు "నిజమే సుమా!" అని నాతో ఏకీభవించగలరన్న ఆశ నాకు పూర్తిగా వున్నది.

మద్రాసు
18—1—52

నార్ల వెంకటేశ్వరరావు.

ఒక మాట:

నే నీ రచన నారంభించేముందు తటపటాయించాను. రచయితను కానుగదా, ఏం వ్రాయగలను గనక, అని పించింది. కాని నా రచనలో కవిత్వం లేకపోయినా, నా జీవితంలో ఎంతో కొంత కవిత్వం లేకపోలేదనిపించింది, సాహిత్యదృష్టితో కాక స్వాతంత్ర్య సమరాంగణంలో సైనికుల అనుభవాలను వారిముఖతః వినాలన్న కుతూ హలం నా సోదర ప్రజలలో ఉన్నదన్న విశ్వాసంతోనే ఈ పుస్తకాన్ని వ్రాయసంకల్పించాను.

దేశంకోసం, స్వతంత్రంకోసం తమ జీవితాలను బలి పెట్టిన వీరుల గాథలను నాకు తెలిసినంతవరకు మీ కిందులో వినిపిస్తున్నాను మన దేశ స్వాతంత్ర్యోద్యమా లతో సన్నిహిత సంబంధమేకాక, వాటిలో స్వయంగా పాల్గొనే భాగ్యం నాకు కలిగింది. ఆ గాథలను వినిపించా లన్న ఉబలాటాన్ని అణచుకోలేక ఈ సాహసానికి దిగ వలసి వచ్చినది.

ఆత్మ పరిశీలన అంత సులభమైనపని కాదని నే నెరుగుదును. సాధ్యమైనంతవరకు మనిషి తన్నుతాను చూచుకొనేందుకు వెనుకంజ వేస్తాడని మన శాస్త్రజ్ఞులనే మాటలు విన్నాను. అయినా, ఈ కష్టమైన పనికి పూను కొన్నాను. ఎంతవరకు కృతార్థుడనైనదీ చెప్పవలసినది మీరు కాని, నేను గాదు.

మనదేశ మహోద్యమానికి మకుటప్రాయమైన మహా. త్మ్నిని జీవితచరిత్ర తలపుకు వచ్చి హడలిపోయ్యాను

అంత గొప్ప ఆత్మకథ తర్వాత నేనూ వ్రాయడమేమిటి? అని నాలో నేను నవ్వుకున్నాను.

కాని, ఆ మహోద్యమంలో ఆయన జీవిత మొక మహాగ్ని గుండమైతే నా సమిధకూ అందులో తావులేక పోలేదు కదా అన్న భావం మాత్రమే కాదు నన్ను ప్రేరేపించినది మరొక కారణ మున్నదని మనవి చేసు కొంటున్నాను.

మనదేశంలో స్వాతంత్ర్యసముపార్జనకై జరుగు తున్న మహోద్యమము, ఆ యా ప్రత్యేక దశలలో అనేక రూపాలను ధరిస్తూవచ్చింది. విప్లవకారులయుగం, గదర్ ఉద్యమము, కమ్యూనిస్టు ఉద్యమము—ఇవన్నీ ఆ మహా ప్రజోద్యమరూపాలే.

వీటిలో గదర్ ఉద్యమాన్ని గూర్చి మన ప్రజల కెక్కువగా - ఈనాటివారి మాట చెబుతున్నాను— తెలి యదు. ఆ వుద్యమము 1913-1919 ల మధ్య వెలసినది. గదర్ అంటే సైనికులు తిరుగుబాటుచేసి, నూతన ప్రభుత్వ స్థాపనకై సాయుధ పోరాటాన్ని సాగించడమని అర్థం.

అవి ప్రథమ ప్రపంచ యుద్ధం జరిగుతున్న రోజులు. గదర్ ఉద్యమము అప్పుడే విజృంభించినది; కాని, బ్రిటిష్ ప్రభుత్వం దానిని అణచివెయ్యగలిగింది. ఆ ఉద్యమ వివ రాలు మన ప్రజలలో వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం మరుగుపరిచింది.

1947 ఆగస్టు వరకూ ఈ ఉద్యమ వివరాలను రహస్యంగా తప్ప బాహాటంగా ప్రాయ వీలులేకపోయింది. అదొక ప్రమాద భూయిష్టమైన పనిగా తోచినది. అందు వల్లనే ఆ ఉద్యమ చరిత్ర అంతగా ప్రచురణ కాలేదు. అందులో పనిచేసిన వీరు లెందరో మరణించారు.

నే నీ ఉద్యమారంభంలో పాల్గొన్నందుకు గర్వపడుతుంటాను. ఆ ఆరంభచరిత్ర నెరిగినవారు పట్టుమని పదిమందికంటె యెక్కువలేరు. వారిలో తొమ్మండుగురిప్పుడు మనమధ్యలేరు. మిగిలిన నేను- నే నెరిగినంతవరకు - సంగ్రహంగా ఈ వీరగాథను తెలియచేయడం విధిగా భావించాను. ఆ ఉద్యమం అంతిమదశలో తిరిగి పాల్గొంటిని. ఈ సందర్భంలో వచ్చిన లాహోరు కుట్రకేసులో (Lahore Conspiracy Case second Supplementary) "నేరస్తులలో" నే నొకడను. ఈ ఘట్టానికి చెందిన మిగత సోదరులలో జీవించిననారెవరున్నారో లేదో నాకు తెలియరాలేదు. వారు పంజాబీయులు, బెంగాలీలు. నే నెనిగినంతవరకు, జ్ఞాపకమున్నంతవరకు ప్రాసినాను. కాని, సమగ్ర చరిత్ర ప్రాయగల సమర్థులకు నేను ప్రాసినది సహాయపడగలిగితే ధన్యుడను.

"పంజాబులో మాత్రమే, రాజద్రోహం అనే నేరం ఆరోపించి, ఫుమారు అయిదువేలమంది మీద కేసులు పెట్టారు. మిలిటరీ కోర్టు (కోర్టు మార్షల్) అయిదువందల మందికి ఉరిశిక్ష విధించెను. ఎనిమిదివందలమందికి యావ

జీవ శిక్ష విధించి అండమాను దీవులకు పంపెను; ఏలాంటి జ్యూరీ కేసులు ఆరోపించబడకనే పదివేలమంది "ఇంటరన్" చేయ బడిరి; ఎందరో అజ్ఞాతవాసంలో ఉండవలసివచ్చెను. ♦

అట్లే, ఆంధ్రదేశంలో సంఘసంస్కరణోద్యమా లెన్నో జాతీయోద్యమములోని శాఖలుగా బయలుదేరినవి. కుళ్ళుకంపు గొడుతున్న మూఢాచారాలకు, మూఢవిశ్వ్ వాసాలకు తావలమైన వ్యవస్థను కదిలించి, దుమ్ము దులిపి వేయగలంత గట్టి గాలిదుమారం లేచిననది. సనాతనులు ఊపిరి తిప్పుకోలేక, కళ్ళు తెరవలేక, అల్లల్లాడిపోయిన రోజులవి. ఈ నాడు హిందూకోడ్ బిల్లును ప్రతిఘటించ గల పెద్దలు, అభ్యుదయవాసులుగా రొమ్ములిరిచి నడవ గలుగుతుండడం చూస్తుంటే, ఆనాటి సంస్కరణోద్యమాల మహత్తరత్వం గోచరిస్తుంది.

ఆ ఉద్యమాలు కొన్నింటిలో నేను చాలాకాలం పనిచేశాను. వానిలో నా పాత్ర ఎంతో కొంత ముఖ్య మైనదే. అందువల్ల వీనిని గూర్చికూడ కొంత స్వయంగా కని విని చవి చూచిన సంఘటనలనుగూర్చి వ్రాయగలి గాను. మన ఆంధ్రుల సంస్కరణోద్యమ చరిత్ర సమగ్ర ముగా వ్రాయవలసిన అవసరమెంతైనా కలదు. అందుకు సమర్థులు పూనుకుంటారని విశ్వసిస్తున్నాను. వారికీ భాగం ఉపకరించగలుగుతుందని ఆశిస్తున్నాను.

♦ "పొలిటికల్ ఇండియా" అనే గ్రంథములో 136వ పేజీలో నుండి. దీనికి మెడిటరు సర్ జాన్ కుమ్మింగ్

తర్వాతభాగంలో కమ్యూనిస్టు ఉద్యమంలో నేను పని చేసినప్పటి జ్ఞాపకాలు వ్రాశాను. కమ్యూనిస్టులతో కలిసి నేను సుమారు పదిహేనేళ్ళు పనిచేశాను. సన్ని హితంగా వారిని నే నెరుగుదును. వీరెవరో కాము: జాతీ యోద్యమంలో పాల్గొన్నవారి సంతానం. పూర్వకాలం మహాభారత యుద్ధాదులు జరిగిన వివరం మనము చదువు కొన్నాము. మన పూర్వులు చేసిన తప్పులనే మనము పునశ్చరణ చేయవలసినపనిలేదు. అది మన తెలివితేటలను ప్రదర్శించదు. గత చరిత్రనుండి మనం నేర్చుకొనవలసిన గుణపాఠాలెన్నో గలవు.

పెద్దలు తమవిజ్ఞానాస్ని, అనుభవాన్ని, తమ సంతాన విధ్వంసనకై ఉపయోగింపరాదు. అట్లే మన అర్జునులు, అభిమన్యులు వృద్ధుల నుసుమాడ కూడదు. వీనిలో ఏ ఒక్కటీ గర్వించదగినది కాజాలదు.

యువకుల వాంఛలెన్నో న్యాయమైనవని, వివాదా లను న్యాయదృష్టితో పరిష్కరించుకొన వీలున్నదని, అలా చేయవలసినదని సవినయంగా మనవిచేయుచున్నాను. సహృదయంతో, సానుభూతితో ఈ భాగాన్ని చదవమని సోదరులను ప్రార్థించుతున్నాను. ఈ విషయంలో ఈ రచన ఆవగింజంత సహాయపడినా సంతోషిస్తాను.

ఇలా నా జీవితం నాలుగుపాయలుగా పారినది. గదరుపార్టీ జీవితం, సంస్కరణోద్యమాలలో పనిచేయడం,

కమ్యూనిస్టు ఉద్యమం ఇలా ఈ మూడింటినే రెండు మూడు నాల్గు భాగాలలో వివరించాను.

ఈ రచనలో తోడ్పడినట్టి, సాయపడినట్టి మిత్రులెందరో ఉన్నారు వారి సహాయ సానుభూతులకు కృతజ్ఞతను వెల్లడిస్తున్నాను. శ్రీ చదలవాడ పిచ్చయ్య, ఏలూచ్చేరి సుబ్రహ్మణ్యం గారలకు ఈ సందర్భంలో సమస్కృతులర్పిస్తున్నాను. వ్రాతపతిని చదివి అమూల్యములైన సలహాలిచ్చిన శ్రీ గొఱ్ఱెపాటి వెంకటసుబ్బయ్యకవి, సెట్టి ఈశ్వరరావు, పందిరి మల్లిఖార్జునరావుగార్లకు అభివందనాలర్పిస్తున్నాను.

నా భార్య సుభద్రమ్మగారి సహకారం ఉన్నందువలనే నీ రచనను ముగించగలిగానని నా సంపూర్ణ విశ్వాసం.

ఏదో ఈ వయసులో, ఎన్నో పనితొందరలలో ఆనాటిరోజులు జ్ఞాపకం తెచ్చుకొని ఆ వుత్సాహంతోనే ఈ పుస్తకం వ్రాశాను. మీ చేతులలో ఉంచుతున్నాను. నా పని తీరినది. మీ పని ఇక ఆరంభం కావాలి. అందుకే కొంత ఉపకరించినా నా కంటె ధన్యాత్ములెవ్వరని గర్వపడతాను.

మదరాసు
1-10-51

దరిశి చెంచయ్య.

విషయ సూచిక

1. నా జీవితపు పునాదులు (1890—1912)

అప్పటి ఆంధ్రదేశము	29
పేద కుటుంబము	30
నన్ను కలవరపెట్టిన సంఘటన	32
విద్యాసక్తి	33
మా తండ్రి యిచ్చిన శిక్షణ	35
పితృ హృదయం	36
ఇంకొన్ని విషయాలు	39
అప్పటి మెట్రిక్యులేషన్ పరీక్ష	44
స్వశక్తిపై నమ్మకము	45
విదేశ విద్యాభిలాష	46
ఆంక్షలపై తిరుగుబాటు	48
విద్యార్థి వేతనం	48
విపరీత ప్రేమ	50
సంస్కరణోద్యమ బీజాలు	50

వీడ్కోలు 54

ఓడలో వింతలు 55

జపానులో 57

కొత్త జిజ్ఞాస 64

2. గదరు పార్టీలో

అమెరికాలో మొదటి అనుభవాలు 65

జితేంద్రనాథ లాహిరీ 73

విప్లవ సంకల్పం 74

ఎత్తుగడలు - చర్చలు 77

లాలా హరదయాల్ 79

శ్యాంజీ కృష్ణవర్మ 80

బ్రిటిష్ ప్రభుత్వ నిర్బంధం 84

వివిధ దేశాల విప్లవకారులు 85

గదర్ పార్టీ సన్నాహం 87

హర్దయాల్ అరెస్టు - అలజడి 88

బ్రిటన్ అమెరికాలమధ్య పోటీ 88

హర్దయాల్‌పై అమెరికా బహిష్కారం 89

జితేంద్రనాథ లాహిరీ 93

తిలక్ ప్రోత్సాహము 95

విప్లవ శిక్షణ 97

కొరరిస్టుల నియమాలు 101

పిరికితనం రక్తంలో లేదు 104

తర్కీదు 106

ప్రపంచయుద్ధ ప్రారంభం (1914) 111

గదరుపార్టీ పరిసితులు 111

తర్జన భర్జనలు 114

చదువు 116

లాహోరు కుట్ర కేసులు (1915-18) 121

సైన్యంలో కల్లోలము 121

బర్మా పట్టుకోవాలి 125

సన్‌యట్‌సేన్ సందేశము 129

బ్రిటిష్ ప్రభుత్వాన్ని తలక్రిందులు చెయ్యాలి 132

సి. ఐ. డీ. లు 137

అరెస్టు 141

బాధలు ప్రారంభం 143

సింగపూరులో భారతసైనికుల తిరుగుబాటు 145

మిలిటరీ రాజసులు 149

నేరారోపణ 151

ద్రోహి 155

కోర్టుమార్షల్-కాల్చమని శిక్ష 159

వీరుడు బల్వంత సింగ్-అతని వీరపత్ని పుత్రులు 161

ద్రోహం చెయ్యి-చావు తప్పిస్తా 162

పంద జోద్‌సింగ్ 163

ఛటర్జీ ఎత్తుగడ 165

నరకంలో సంతోషం 168

ఆరునెలల ఏకాంత వాసం తరువాత 169

కలకత్తాకు - ఓడలో ముచ్చట్లు 171

ఇండియా జైళ్ళలో 174

నరకకూపం 185

కొత్తకేసుకు - లాహోరు జైలుకు 192

తిరిగి కన్ననూరు జైలుకు-పోలీసులతో పోట్లాటలు 195

కుటుంబ కష్టాలు 203

బిపిన్ బిహారీ గంగూలీ 205

చిదంబరం పిళ్ళై - నీలకంఠబ్రహ్మచారి 207

జైలులో పోరాటం 209

జైలరుకు దేహశుద్ధి 216

కోయంబత్తూరు జైలులో 225

కుక్కకాటుకు చెప్పుదెబ్బ 226
విడుదల 232
కొత్త త్రోవ 233

3. జాతీయోద్యమము - సంఘ సంస్కారము

మరొక ప్రపంచం 239
సభలు, సన్మానాలు 245
కులపిశాచం 248
దేశభక్తే కారణం 251
జట్కాపనికి ప్రయత్నం 253
అడయారులో ఉద్యోగం - రాజీనామా 254
దారి తోచలేదు 257
కాంగ్రెసులో చేరుటకు ప్రయత్నాలు
ఆటంకాలు 258
ఉద్యోగం - రాజీనామా 262
కాంగ్రెసు ఉద్యమం 264
కళావంతుల వివాహాలు 268
శ్రీమతి యామినీపూర్ణతిలకమ్మ 270
సంఘస్థాపన - ఉద్యమవ్యాప్తి 272
వైశ్యులలో సంస్కరణం 279

వితంతు వివాహాలు	298
వైశ్యయువకుల ముందంజ	302
వైశ్యులలో మొదటి వితంతు వివాహము	305
వ్యతిరేకుల హడావుడి	308
ఏలూరులో వైశ్య వితంతు వివాహము	317
వరాపహరణం	318
ఎత్తు-పైఎత్తు	319
ఉద్యమవ్యాప్తి	325
కె. యస్. గుప్తగారి ఎదురుదెబ్బ	326
బందరులో	327
ఇంకా అనేకం	328
వితంతు శరణాలయ స్థాపన	329
వైశ్య సంస్కర్తలు	330
కమ్మవారిలో వితంతు వివాహాలు	336
కమ్మనాయుకుని అడ్డు	340
విశ్వబ్రాహ్మణులలో—వితంతువివాహం	347
ఓటమి	352
ఇంటగెలవాలి	355
పర్యావలోకనం	357
వితంతు శిశు శరణాలయ స్థాపన	360

రంగాగారి రాజకీయాలు 448

చర్చలు - కోపాలు 450

నే నెందుకు కమ్యూనిస్టునైయ్యానను ? 451

తర్క వితర్కాలు 452

నవచైనా 453

నిరసనవ్రతం-కాంగ్రెసునాయకులు 455

జైలుకోడులో కాంగ్రెసువారి మార్పు 457

భయంకరాచారి 459

విభజించి పాలించడం 460

కాంగ్రెసు నాయకుల ప్రత్యేకత 460

పరారీ 462

గౌరవనీయులైన సాంబమూర్తి 465

రష్యాపై హిట్లర్ దాడి; కాంగ్రెసు నాయకుల కలలు 466

సమిష్టి జీవితం - కాంగ్రెసునాయకులు 468

కాళేశ్వరరావుగారి లేఖ 470

కాంగ్రెసు యువకులు కమ్యూనిస్టులయ్యారు 471

తారుమారైన ప్రపంచం 473

బ్రిటిష్ వ్యతిరేకత-ఫాసిస్టు అనుకూలత 475

కాంగ్రెసు రైతునాయకుని కలలు 478

కమ్యూనిస్టు వ్యతిరేకత 479

అతిక్లిష్ట సమస్యలు 482

క్షామంతో స్వరాజ్యం 486

ఎందుకు మారాను? 488

పేద బీడీ కార్మికులు 491

చుట్టల కార్మికులు 495

స్పెన్సర్ కంపెనీ కార్మికుల సమ్మె 598

కార్పొరేషన్ కార్మికుల సమ్మె 506

అభ్యుదయ రచయితల మహాసభ—

చదలవాడ పిచ్చయ్యగారు 513

ప్రజానాట్యమండలి 515

కొండను ప్రవ్వాము! 517

వాడుకభాష - శ్రీరామలింగారెడ్డిగారు 518

అగస్టు - డిసెన్సును 520

నిలువు దోపిడి 521

ఇంకా ఎన్నో బాధలు 522

పునర్విమర్శ 525

రెండు దృక్పథాలు 527

యన్. కె. కృష్ణన్ 527

కాంగ్రెసు మిత్రులు 529

'మాభూమి' నాటక ప్రదర్శనాలు 530

శ్రీ సీతారామరాజు బ్రతికథ 532

మహాత్ముని హత్య 533

పరేశలింగం శతవార్షికోత్సవం 541

గోవిందరాజాచారిగారు 542

ఎలెక్షనులు - రాజకీయపు ఎత్తులు 543

పరేశలింగంగారి సంస్థల పాట్లు 544

మధ్యలో అరెస్టు 546

జైలులో నిరసనవ్రతాలు

పార్టీలో పదవీ వ్యామోహం

ఉటినూ్యలతో పోలీసులు

36 సం॥ల రాజకీయజీవిత

కమ్యూనిస్టుపార్టీలో వ్యక్తిస్థానం 557

ఒక మహత్తర సంస్కృతీ ఉద్యమం 558

విడుదల-డొంకతిరుగుళ్ళు 560

నేను చేసిన నేరాలు 563

ప్రధాని రెడ్డిగారు 565

ఎనిమిది జైళ్ళలో 566

ముగించే సమయంలో నా నమ్మకాలు 567

ఇకమీదట సాహిత్యసేవ 569

సుభద్రమ్మగారు - బిడ్డలు 5[illegible]

స్వతంత్ర యాత్ర

—o—

నే నూ — నా దే శ మ ు

1. నా జీవితపు పునాదులు

అప్పటి ఆంధ్రదేశము

నా జన్మస్థానం నెల్లూరు జిల్లా కనిగిరి గ్రామం. 1890 సంగిలో జన్మించాను. కనిగిరి, సింగరాయకొండ స్టేషనునుండి కంభంకు పొయ్యే రస్తామీద 42 మైళ్ళ దూరంలో వుంటుంది. చుట్టూ కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలు. వర్షాలు అరుదు. భావులు, చెరువులలో నీరు అతి స్వల్పం. వానకురిస్తే ఏళ్ళలో, వాగుల్లో నీరు, లేకపోతే రాళ్ళు. ఆనకట్టలు అసలే లేవు. ఎప్పుడూ ఎట్టని ఎండలే. పచ్చని పొలాలే కనపడవు. దరిద్ర ప్రకృతి, దరిద్ర ప్రజలు.

ఆ కాలంలో దొంగలబాధ విపరీతం. కనిగిరికి ఐదు మైళ్ళ దూరంలో పట్టపగలే వచ్చేపొయ్యే వాళ్ళను చెట్టుకు కట్టిసి దోచుకునేవారు. తరువాత దొంగలు పారిపోయి

కొండల్లో దాక్కునేవారు. 1922 సం॥రం వరకూ మా ప్రాంతంలో పరిస్థితులు యిలాగుండేవి. 1930 సం॥ తరువాత బస్సులు వచ్చాయి. అంతవరకు బండ్లపై ప్రయాణం. బండ్లవెంట పోలీసుల కాపలా. పదిమైళ్ళ దూరంలో ఉన్న గ్రామాలతో మాత్రమే వివాహ సంబంధాలు వుండేవి. ఇచ్చి పుచ్చుకోటాలు జరిగేవి. అ
వల్ల నాగరికత, నాజూకు జీవితాలకు అవకాశం లే
యింది. పురుషులకు చెఱి రెండు చెంగావిపంచెలు, స్త్రీల
చెఱిరెండు ముతకచీరెలు వుండేవి. తువాళ్ళు లేవు. నులక
మంచాలు, కంబళ్ళు, జోరాలు, నల్లులు వుండేవి. ఇక
స్త్రీల ఆభరాలు – చేతులకు వెండి మురుగులు, నడుముకు
వెండి వడ్ధ్యాణాలు. వంట పాత్రలు – కుండలు, చట్లు.
1910 సం॥ నాటికి బంగారు ఒత్తులు, ఇత్తడి పాత్రలు నేనే
ఒంప్రథమంగా ప్రవేశపెట్టాను. 1922లో బంగారు మురు
గులు, బంగారు వడ్ధ్యాణాలు, పట్టుచీరెలు, వాడడం మా
యింటిలోనే మొదలు. ఇట్టి ప్రదేశం, ఇట్టి పరిస్థితులు,ఇట్టి
వాతావరణంలో నేను పుట్టి పెరిగాను.

పేద కుటుంబం

నాది వైశ్యకులం. మా తండ్రి పుట్టుకతో కడు
బీదవాడు. కొని క్రమేణ పదిహేను వేల రూపాయల ఆస్తిని
ఆర్జించాడు. ఆ కాలంలో ఆ ప్రదేశంలో షావుకారే.
పడువు, ప్రతిష్టలకు యెంతమాత్రం లోటులేనిస్థితిలో ఉండే

వాడు. అంతేగాదు; న్యాయశీలుడు, వివేక విచక్షణలు గలవా డనిపించుకున్నాడు. కాబట్టి యిరుగు పొరుగు కుటుంబాలలోగాని, స్వగ్రామములోగాని, పరిసర గ్రామాల్లో గాని కలహాలు, తగాదాలు యేర్పడితే మా తండ్రిని మధ్యవర్తిత్వం చెయ్యమని ప్రజలు కోరేవారు. ఆయన తీర్పుకు బద్ధులయ్యేవారు. ఆయనయందు ప్రజలకు పరిపూర్ణ విశ్వాసం.

ఆ రోజుల్లో కోమట్లంటే అధికార్లు నిరసనగా చూచే వారు. పోలీసులు వీరిని యెన్నో బాధలు పెట్టేవారు. నిర్నిమిత్తంగా న్యూసెన్సు కేసులుపెట్టేవారు. భయపెట్టేవారు. తహసీల్దార్లే ఎంతో హింసించేవారు. ఆ కాలంలో తహసీల్దారంటే తగని భయం. కారణం - అనేక అధికారాలతో పాటే ఇన్కంటాక్సు వసూలు చేసే అధికారం కూడా వీరికుండేది. బ్రాహ్మణులు, కాపులు, ముసల్మానులు కొంచెం ధైర్యశాలులు. వైశ్యులు మాత్రం ఎక్కువ భయస్తులు. అందువల్ల వైశ్యులను మాత్రమే సర్కారు వుద్యోగస్థులు నానాబాధలు పెట్టేవారు; అగౌరవపరచేవారు, ఇతర కులాలన్నింటికి వైశ్యులే కొంచెం లోకువగా ఉండేవారు. ఇలాంటి సంఘటనే ఒకటి నన్ను 1898 - 1900లో చాల కలవర పెట్టింది.

నన్ను కలవరపెట్టిన సంఘటన

కనిగిరిలో కలకాలం కరువే. బావులు చాలా లోతు; అధఃపాతాళంలో నీరుండేది. ఆ నీరు ఊప్పన. త్రాగడానికి ఉపయోగపడదు. దొరువులోదే మంచినీరు. అయితే ఎండాకాలంలో ఎండిపోయ్యేది. అప్పుడు "చుట్టు బావి" అనబడే ఒక చిన్న ఊటనుండి నీరు తెచ్చుకోవాలి. అది గ్రామానికి రెండు మైళ్ళ దూరంలో వుంది. కొండ ప్రదేశం. రాత్రిళ్ళు ఎలుగుబంట్లు, చిఱుతపులులు విచ్చల విడిగా సంచరించేవి. దీనికి తోడు దొంగల భయం. వంతు ప్రకారం ఏ 24 గంటల కాలమో, 36 గంటల కాలమో కనిపెట్టుకొనివుండి నీళ్లు తెచ్చుకోవాలి. ఇట్లా అష్టకష్టాలూ పడందే త్రాగటానికి నీరు లభించదు.

1899 సం. ప్రాంతంలో రంగారావు అనే తాసిల్దారుండేవాడు. అతను రెండెడ్ల బండిమీద గంగాళాలుపెట్టి నౌకర్లచేత నీరు తెప్పించుకొనే వాడు. స్నానానికి, బట్టలకు కూడా ఆ నీరే. అతని నౌకర్లుకూడా అతనిలాగే చేసేవారు. పాత్రలు తోమి, బట్టలుతికి స్నానపానాలు చేసి, బండెడు గంగాళాలతో నీరు నింపుకొని తీసుకెళ్ళేపారు. వంతుపంతులు పాటించేవారు కాదు. ఎంతవరకని ప్రజలు ఓర్చుకొంటారు? చివర కొకనాడు కొందరు తిరుగబడ్డారు. వంతుల ప్రకారం తీసుకుపొమ్మన్నారు. వారికి నాయకుడు ఒక మిఠాయి దుకాణదారుడు—వైశ్యుడు. ఈ విషయం

తాసీల్దారుకు తెలిసింది. మరుక్షణమే ఒక సిపాయిని పంపాడు. వీరిని తన్ని రమ్మన్నాడు. మిఠాయి వ్యాపారి తిరుగబడ్డాడు కాని ఇద్దరు అన్నదమ్ముల తలలు బద్దలయ్యాయి. వీళ్ళ ధైర్య సాహసాలను తహసీల్దారు సహించలేక పోయ్యాడు. వైశ్య నాయకుల్ని తన్నిరమ్మన్నాడు. వైశ్యులకు మా నాయన ఒక ముఖ్యనాయకుడు. ఆయనకు పరాభవం జరిగింది. అప్పుడు నేను 8, 9 ఏళ్ళ కుఱ్ఱవాణ్ణి. నాకన్న పెద్దవారు ఇద్దరు అన్నలు, ముగ్గురు బావలు, మరెందరో దాయాదులు, బంధువులు, ఉండిరి. కాని కసి తీర్చుకోలేకపోయ్యారు. ఇంతమాత్రమే కాదు. మా తండ్రిని, ఇతర నాయకులను పోలీసుస్టేషన్‌లో లాకప్ చేయించాలని తాసిల్దారు ప్రయత్నం చేశాడు. ఆ ప్రయత్నాన్ని పడగొట్టి పరువు ప్రతిష్ఠలను నిలుపుకోవాలి. అందుకు వందలు వేలు ఖర్చు పెట్టారు. ఈ సంఘటన నన్ను కలవర పెట్టింది. కత్తితో పొడిచినట్టయింది. చెప్పరాని బాధ; హృదయంలో తుపాను చెలరేగింది. మరచిపోవాలన్నా మరపురాదు. గౌరవంగా జీవించడం ఎలాగు? ఈ సంఘటనే నా భావిజీవితానికి పునాది అయింది.

విద్యాసక్తి

అప్పటినుంచి మా బంధువులు "ఇంగ్లీషు చదువుకో నాయనా! తాసిల్దారు ఉద్యోగం చేస్తువుగాని. ప్రస్తుతం మన బ్రతుకు గౌరవం లేని బ్రతుకు" అని ప్రోత్సహించ

సాగారు. వారి బోధ నాకు చాలా నచ్చింది. ఆ వయసులో, ఆ వాతావరణంలో, అంతకంటె గొప్ప ఆదర్శం నాకు తోచలేదు. దానిని సాధించుటకు ఎంతో ప్రయాస పడ్డాను.

అపుడే నాలుగో తరగతిలో ఉత్తీర్ణుడ నయ్యాను. అంతకన్న ఉన్నత విద్యకు అవకాశాలు లేవు. మా అన్నయ్యకు, నాకు వ్యాపారం నేర్పించడానికి మా తండ్రి ఒక చిల్లర దుకాణం పెట్టించాడు. ఒక అనుభవశాలిని భాగస్వానిగా ఏర్పరచాడు. కాని, నా కేమో ఉన్నతవిద్యనభ్యసించాలని, తాసిల్దారు కావాలని కోరిక. మరొక వ్యాపారికి పంపమని మా తండ్రిని అడుగలేను. తగనిభయం.

ఇలాంటి పరిస్థితులలో కనిగిరికి ఒక వైశ్య తాసిల్దారు (తుంపాటి భగవంతం గుప్తగారు) 1903లో వచ్చారు. వీరికి తక్కిన కులస్థులేకాక బ్రాహ్మణులు కూడా దణ్ణాలు పెట్టేవారు. నాకు చాల ఆశ్చర్యం. నేను కూడ బ్రాహ్మల చేత దండం పెట్టించుకోవా లనుకున్నాను. తాసిల్దారయితేనే నాకు బ్రాహ్మలు దణ్ణం పెడతారు. అందుచేత నేను కూడా గొప్ప చదువులు చదవాలి. తాసిల్దారు కావాలి అనే కోరిక పుట్టింది. బంధువుల బోధకూడ ఈ కోరికను మరింత తీవ్రపరచింది. "నాన్నగారూ! నన్ను ఒంగోలు పంపండి. పెద్ద చదువులు చదివి తాసిల్దారవుతాను" అని మా తండ్రిని బ్రతిమిలాడ సాగాను. నేను చదివి తాసిల్దారు

కావాలని మా తండ్రి గారికి కూడా కోరిక పుట్టింది. కాని వేరే వూరికి నన్ను పంపటానికి మా తల్లి సమ్మతింపలేదు. అందుచేత మా తండ్రి మా స్వగ్రామంలోనే ఒక స్కూలు పెట్టించి నన్ను ఫస్టు, సెకండు ఫారాల్లో చదివించాడు. స్కూలుకు, వచ్చిన నష్టాన్నంతా ఆయనే భరించేవాడు. తరువాత థర్డుఫారం చదవడానికి ఒంగోలుకు పంపక తప్పింది కాదు.

మా తండ్రి యిచ్చిన శిక్షణ

ఎప్పుడూ మా తండ్రి మా అన్నయ్యల విషయం, నా విషయంలో ఎక్కువ శ్రద్ధాళువై ఉండేవాడు. మమ్మల్ని క్రమశిక్షణలో పెట్టేవాడు. నా నడవడిని ఆయనెంతో చక్కగా సరిదిద్దేవాడు. మచ్చుకి ఒకటి రెండు విషయాలు చెప్తాను. నేను వ్యాపారం నేర్చుకొనే రోజుల్లో మా తండ్రిగారు ప్రతి సాయంకాలం నా దుకాణం వద్ద మంచం వేసుకుని కూర్చొనేవారు. గ్రామపెద్దలు అనుదినం ఆయనవద్దకు వచ్చి కబుర్లతో కాలక్షేపం చేసేవారు. మా తండ్రి ఒకవైపు కబుర్లువింటూ మరొకవైపు నా చిల్లర వ్యాపారంపై దృష్టి వుంచేవాడు. అంటే నేను చిల్లర వ్యాపారం సరిగా నేర్చుకొంటున్నానా లేదా అని పరికించేవాడు. ఒకరోజున ఒక కాతాదారుడు వచ్చి ఏదో వస్తువు కావాలన్నాడు. అది మాదుకాణంలో లేదు. నేను ప్రక్క అంగట్లో ఆ వస్తువును అణ్ణరకు కొని, అణాముక్కానీకి

అమ్మాను. దీన్ని మా నాన్న కనిపెట్టాడు. కాతాదారుడు వెళ్ళిపోగానే మా తండ్రికి, నాకూ యీలాగున సంభాషణ జరిగింది :

"ఒక కానీ యెక్కువ యెందుకు తీసుకున్నావు?" అన్నాడు మా తండ్రి.

"నేను ప్రక్క దుకాణానికి వెళ్ళి తెచ్చియిచ్చాను. నా కష్టానికి గాను ఒక కాని ఎక్కువ తీసుకున్నాను" అన్నాను.

"అతనే వెళ్ళి కొనుక్కుంటే అణన్నరకే లభించేది కదా? అతనికి మనయందు చాల నమ్మకం. నిన్ను నమ్మి నందుకు మోసం చేశావు. అంతేగా? అలాంటి మోసగాడివి నీ జీవితంలో వృద్ధికి రాలేవు. పో! కానీ తిసుకెళ్ళి ఆయన కిచ్చి క్షమాపణ అడుక్కో" అని మా తండ్రి ఉత్తరువు జారీ చేశాడు. వెంటనే వెళ్ళి తండ్రి ఆజ్ఞప్రకారం చేసి వచ్చాను. ఈ విషయం నా జీవితాన్నే సరిదిద్దింది.

పితృహృదయం

దీనివల్ల పొందిన గుణపాఠం నే నెప్పుడూ మరచి పోలేదు. రెండో విషయం. నేను థర్డుఫారం చదువుకో డానికి వెళ్ళబోయే ముందు జరిగింది. మా వూరునుంచి ఇద్దరు విద్యార్థులు ఒంగోలుకు చదువుకోటానికి వెళ్ళారు. ఒకరిది భోగంకులం. తల్లి ఎంతో కష్టపడి కుమారుడిని

పోషించింది. అయితే వాని మనస్సు ఘాషన్ల మీదనే పోయింది. షోకిల్లా కావడంతో చదువు ముగిసింది. వాని నడత తరువాత తరువాత వారికి పెద్ద ఆటంకంగా ఏర్పడింది. రెండవవాడు వీడికంటె ఒక ఆకు ఎక్కువే చదివాడు. కనిగిరిలో చాలామంది మహమ్మదీయులున్నారు. వాళ్ళు చాలామట్టుకు బీదవాళ్లు. ముఖ్యంగా గవర్నమెంటు ఆఫీసుల్లో ప్యూన్లు. పోలీసులు మొదలైన చిన్న చిన్న నౌకరీలలో చేరుతుండేవారు. అయితే చాలా పౌరుషశాలురు. వారికి నాయకుడు పోస్టు బంట్రోతు—హసన్నా సాయిబు. ఇతన్ని చూస్తే వైశ్యులకు తంతాడనే భయం వుండేది. అతనికి బిడ్డలు లేరు. ఒకణ్ణి పెంచుకొని చదివించసాగాడు. పెద్ద ఉద్యోగం చెయ్యాలని తండ్రి కొండంత ఆశపెట్టుకున్నాడుకూడా. అయితే చిన్నవయస్సులోనే ఒంగోలులో సుఖరోగాలు సంపాదించుకున్నాడు. కాళ్ళు చేతులు పడిపోయినై. తండ్రి కృంగిపొయ్యాడు. హసన్న సాయిబు ఆశలన్నీ నిరాశ లయినయి. నన్ను ఒంగోలుకు పంపడానికి మా నాయన అప్పుడు నాకు చొక్కాలు కుట్టిస్తున్నాడు. హసన్న సాయిబు మా నాన్నతో ♦ "మామా! అబ్బాయిని ఒంగోలుకు పంపు

♦ ఆ కాలంలో ఆ గ్రామంలో అన్ని కులాలవారే గాక, హిందూ మహమ్మదీయులలోకూడ వావివరుసలతో పిలుచుకొంటూ, సరసాలా[illegible]వారు. మా బట్టలంగట్లో

తాతా!" అని అడిగాడు. హాసన్న కళ్ళలో నీళ్ళు కమ్మినయి.

అతని కళ్ళలోకి చూస్తూ మా నాన్న "నాకు అందుకే భయంగా వుంది. మీవాడిలాగే మావాడూ ఆరోగ్యం పాడుచేసుకుంటాడేమో నని దిగులుగానే ఉంది. బంగోలుకు పోయిన తరువాత పిల్లవాళ్ళ మనస్సు పోకుల మీద, స్త్రీలమీద పోతున్నదేకాని చదువుల మీద వుండడం లేదు" అని నా వైపు ఎంతో దుఃఖంతో చూచాడు.

ఆ తండ్రులు యిద్దరి దుఃఖమూ, బాధ చూచాను. ఈ సంఘటన నా హృదయానికి హత్తుకపోయింది. నా జీవితంలో యెంతో మార్పు తెచ్చింది. వెంటనే నా కొక తీర్మానం ఏర్పడింది. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు జపాను అమెరికాలలో కూడ ఇలాంటి లోపాలు రాకుండా నా

దర్జీగా వుండిన పాశ్చా సాహెబు మా నాన్నను మాలాగే నాన్న అని పిలిచేవాడు. మేము పాశ్చాను అన్న అని పిలిచేవాళ్ళం. మా బావలను అతను "బావ" అని పిలిచేవాడు. అతని మామలను, బావలను, మేముకూడా అలాగే పిలిచే వాళ్ళము. ఇప్పటికీ ఆయన బిడ్డలు మా బిడ్డలు ఈ సాంప్రదాయాన్నే సాగిస్తున్నారు. అయితే ఇప్పుడు జనసామాన్యంలో ఈ సాంప్రదాయం క్షీణించిపోతోంది. మతద్వేషాలు పెరిగిపోత

విద్యార్థి జీవితాన్ని కొనసాగించాను. నాలాగే అనేక
మంది విద్యార్థులుకూడా ఒంగోలులో చదువుకునేలాగు
చేశాను. వాళ్ళని చెడిపోకుండా కాపాడటంలో ఎన్నో
ప్రయత్నాలు చేశాను. అయినా కొందరిని కాపాడలేక
పోయ్యాను.

ఇంకొన్ని విషయాలు

ఒంగోలులో చిన్నప్పుడు విద్యార్థిదశలోని విష
యాలు మరికొన్ని జ్ఞాపకం వస్తున్నాయి. సుబ్బరామయ్య
అనే కోతి ఒకడుండేవాడు. వాడు నాకు సహాధ్యాయి.
పుస్తకం ముట్టడు. నాల్గవఫారం దాటలేకపోయ్యాడు. బల
శాలి. కుస్తీ పట్టేవాడు. పోకిరి విద్యార్థులను పెంచి డబ్బు
లాక్కునేవాడు. ధారాళంగా మార్కులు వెయ్యని టీచర్లని
ప్రాయర్లలో తిట్టడాన్ని విడిచేవాడు. దసరాకు టీచర్లయింట్లో
మీద రాళ్ళు వేసేవాడు. వేయించేవాడు. వాడికి భయపడి
డబ్బియివ్వడం నాకు ఏమాత్రం గిట్టలేదు. అందువల్ల నా
పుస్తకాలు లాక్కొనిపోయాడు. నామీద రాళ్ళుర్వ్వాడు.
ఎన్నెన్నో చేశాడు. నన్నుమాత్రం లొంగదీయలేక
పోయాడు. ఈ స్వగౌరవమనేది నన్ను ఎన్నో బాధలకు
గురిచేసింది, కాని అందుకు సంతోషపడుతూనేవున్నాను.

మూడవఫారంలో హెడ్‌మేస్టరు కాళిదాసు వెం
కటసుబ్బయ్యగారి క్లాసులో సరిగా ప్రత్యుత్తరం ఇవ్వ
జాలని విద్యార్థులను జుట్టుపట్టుకొని వంగతీసి బాదేవాడు.

ఈచర్య నాకు చాలాఘోరంగావుండేది. చదువుచాలించు కొని పోలేకపోయాను. అయితే అలా అగౌరవం చేయించు కొనుటకు యిష్టంలేదు. అందువల్ల ఎంతో కష్టపడి చదివి, తప్పించుకొనేవాడిని. పదేళ్ల వయసప్పుడుకూడ నాకు యిలాంటి మనఃప్రవృత్తివుండేది.

ఒకసారి అంగట్లో చెప్పకుండా నే నొక కానీ తీసు కెళ్లడం మాతండ్రి కనిపెట్టాడు. అలాచెయ్యడం అదే మొదలు. పెన్నలుపోయింది. కొనుకోకడానికి నాకుమరో మార్గం కనబడలేదు. దొంగిలించినందుకు మాతండ్రి నన్ను "వెధవ" అని తిట్టి ఒకదెబ్బవేశారు. అందుకని మూడు రోజులు ఉపవాసంచేశాను. టీచరు బెదరించారు. మా తండ్రి డబ్బులిచ్చి నన్ను లాలించాలని చూచాడు. ఉప యోగం లేకపోయింది. రెండోనాటిరాత్రినుండి నా తల్లి దండ్రులు కూడా నాకోసరమని భోజనం మానేశారు. అయినా నిష్ఫలమయింది వారిప్రయత్నం. మూడవరోజున వాంఛలయి స్పృహతప్పి పడిపోయినతరువాత నా మనస్సు శాంతించింది. ఇలాంటి ప్రవృత్తి ఎన్నోసందర్భాలలో తప్పులుకాని, నీచపుపనులుకాని చేయకుండా కాపాడింది. 1915-1919 వరకు గదరుపార్టీలో పనిచేసేరోజుల్లో పోలీసులు, మిలిటరి, సి. ఐ. డీలు, జైలుఅధికారులు, నన్ను చిత్రహింసపెట్టారు. చాలా కిష్టసమయాలలో ఒంటరిగానే నా గౌరవం, నా పార్టీగౌరవం, నా దేశగౌరవం కాపాడు

రించారు. బెంగుళూరులో వున్న శ్రీ బోడగిరి చిన్నస్వామి శెట్టిగారు నెలకు 50 రూ. వంతున 2000 రూ. దాకా వడ్డీ లేకుండా అప్పిచ్చారు. వారు నాలాంటి విద్యార్థులనేకులకు ఈలాగున సాయపడ్డ విషయం నాకు తెలిసి వారివద్దకు వెళ్ళి అప్పు తీసుకున్నాను. కాబట్టి అమెరికాలో నా ఖర్చులకు నెలకు 100 రూ. మాత్రమే మన దేశమునుండి వచ్చేది. అమెరికాలో అసలు ఖర్చు అయ్యేది నెలకు 250 రూపాయలు. మిగత రు. 150 లు కూలిపని చేసి సంపాదించుటకు నిశ్చయించుకున్నాను. ప్రయాణ ఖర్చులకు కూడ సుమారు రు. 1000 లు వైశ్య ప్రముఖులు వసూలు చేసియిచ్చారు.

వ్యవసాయశాస్త్రం చదవాలని తీర్మానించుకొంటిని గాని, ఈ వ్యవసాయం ఏమిటో నాకు తెలియదు. ఆ కాలంలో వ్యవసాయ డిపార్టుమెంటును వృద్ధికి తెచ్చుటకు గవర్నమెంటు తీర్మానించింది. అమెరికాలో చదివివచ్చిన రామశాస్త్రిగారనే ఆయనకు డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఉద్యోగం రాష్ట్రీయ ప్రభుత్వం ఇచ్చింది. జీతం రు. 250 లతో ప్రారంభమయింది. నాకు కూడా కనీసం అంత జీతంతో ఉద్యోగం ప్రారంభంలో లభిస్తుం దనే ఆశతో అమెరికా వెళ్ళాను. నేను కూడా బెంగాలీ విద్యార్థుల వలెనే కూలిపనిచేసి సంపాదించుకొంటూ నా విద్యను పూర్తి చేసుకొని రాగలననే దృఢనిశ్చయం చేసుకొని అమెరికాకు వెళ్లటానికి సాహసించాను. కాని

దూర దేశాలకు నేను వెళ్ళటం మా కుటుంబంలో ఎవ్వరికీ ఇష్టం లేదు. అప్పటికి మాతండ్రి చనిపోయాడు. మిగిలిన వారెవ్వరూ నన్ను శాసించ లేదు.

విపరీత ప్రేమ

నన్ను ప్రేమించి, అభివృద్ధికి తేవలెనని పట్టుదలతో ప్రయత్నించిన వారిలో మా బావ గురవయ్యగారు ముఖ్యులు. అయితే పూర్వాచారపరాయణుడు; భయస్తుడు. నన్ను అమెరికా పోనిచ్చుటకు యిష్టపడక ఎన్నో ఆటం కాలు పెట్టిరి. మాబావగారు మొన్ననే నాకొక రహస్యం చెప్పారు. నేను కనిగిరినుండి ఒంటెద్దు బండిలో రాత్రివేళ బయలుదేరి ప్రయాణం చెయ్యాలి. మార్గ మధ్యంలో నా కాళ్ళు విరుగగొట్టించుటకు మా అన్నగారు బసవయ్యకు సలహా యిచ్చాడు. మా అన్న అందుకు సమ్మతించలేదు. ఈ విషయాన్ని నాకు చెప్పి క్షమించమని కోరారు. ఆ కాలంలో విదేశ ప్రయాణ మంటే అంత అసహ్యమూ, భయమూ, కోపమూ ఉండేవి.

సంస్కరణోద్యమ బీజాలు

అటు తరువాత అసలు వైశ్య కులంలోనే రెండు పక్షాలు పడ్డాయి. 1) దరిశివారి పార్టీ 2) గొంట్లావారి పార్టీ. అయితే ఈ రెండవ కక్ష్యలోని విద్యార్థులు నా ప్రాణమిత్రులు. వారికి నాయందు మంచి గురుత్వం.

శ్రీ సి. యస్. గుప్తా (అటు తరువాత పోలీసు సర్కిలు ఇన్‌స్పెక్టరు అయ్యాడు) శ్రీ గొంట్లా శ్రీరాములు శెట్టి అడ్వకేటు) మేము ముగ్గురము కలసి కులపెద్దలను హేళన చేసే వారము. మా మధ్యనున్న స్నేహాన్ని, ప్రేమను భగ్నపరచడానికి ఎంతమాత్రము మా పెద్దలు సాహసించ లేక పోయారు. నేను విదేశాలనుండి వచ్చిన తరువాత, వితంతు వివాహాలు చేయించుచున్నప్పుడు, నన్ను కులం నుండి వెలివేసి నప్పుడు, నా కెలాంటి హాని రాకుండా నా మిత్రులు నన్ను కాపాడారు. వారే నాతో కలసి భోంచేసి పెద్దల తీర్మానాల్ని మట్టిలో గలిపేస్తుండేవారు. కందుకూరి వీరేశలింగంగారి పుస్తకాలు చదవడం వల్లనే యీ పని నేను చెయ్యగలిగాను.

సంఘ సంస్కరణలంటే నా కమిత ప్రేమ. నేను బ్రహ్మసమాజ సభ్యుడ నయ్యాను. శ్రీ కె. వైకుంఠరావు గారి ఆదర్శ జీవితమే నన్ను బ్రహ్మసమాజకుని చేసింది శ్రీ ఆచంట రుక్మిణీలక్ష్మీపతిగారి వివాహానికి, శ్రీమతి రాధాబాయి సుబ్బరాయన్ పెండ్లికి ఆహ్వానింపబడకనే వెళ్ళాను. అంతమాత్రమే గాదు. మా బ్రహ్మసమాజానికి సుబ్బరాయన్ దంపతుల నాహ్వానించి గౌరవించాము. షర్ణాంతర వివాహాన్ని మా బ్రహ్మసమాజము చేయించ గలిగినదని మేము గర్వపడ్డాము.

నేను అమెరికాకు వెళ్ళే విషయం నా మిత్రుల కమిత ఆశ్చర్యాన్ని కలిగించింది. "అన్యదేశం ఎంత

దూరం! ఎంత సాహసం! అగాధమైన అయోమయంలో దూకుతున్నాడే మనవాడు!" అని వారు విచారిం సాగారు. ఇక మా అమ్మ, మా అన్న దమ్ములు, అక్క చెల్లెండ్రు, బంధువుల అభిప్రాయాలు చెప్పడానికి అల కాదు. నే నేదయినా సాహసకార్యం చేస్తానంటినా, ఇక చేసే తీర్తాను అని మావారికి నమ్మకం. వీళ్ళంతా చాలా భయస్తులు. చివరకు ఈత అయినా నేర్చుకోనివ్వరు. వారికి తెలియకుండా ఒంగోలుల్లో నేను, నామిత్రులు ఈత నేర్చుకున్నాం. ఏ దిగుడుభావిలోనూ మేమే. ఒకరు ఒక చేదుడు భావిని త్రవ్వించారు. కాకతాళన్యాయంగా వారి వంశం నశించింది. ఇక మూఢనమ్మకాలకు అంతంలేదు. ఆ భావి దగ్గరకుకూడా ఎవరూ పోరు. మొదట నేను స్నానం చేయడానికి ప్రారంభించాను. నన్ను మా తల్లి నివారించేదిగాని, నేను మానలేదు. ఆమె విచారపడేది. వద్దని మా వారెంత చెప్పినా వినలేదు. "మొండిబండ" అని తిట్టి వూరుకున్నారు. ఒక నెలతరువాత, ఆ నుయ్యి చుట్టూ స్త్రీలుమూగి నీరుతోడుకోవడం పరిపాటి అయింది. అలాగే దయ్యాలని, శకునాలనే, మూఢనమ్మకాలను ప్రతిఘటించాను.

నా అమెరికా ప్రయాణ సందర్భంలో నా పట్టు పలను చెల్లించుకున్నాను. నా ప్రయాణానికి ఆటంకపెట్టనని, తన్ను ముందుగా చూచిపొమ్మని మా తల్లి నాకు వ్రాసింది. అప్పుడు నేను వ్రాసిన రెండు షరతులకు ఆమె

సమ్మతించింది. ఆమె అడ్డుపెంచినా, దుఃఖించినా నేను ఆమెకు తెలియకుండానే వెళ్ళిపోవచ్చు. మాస్వగ్రామంలో నే నున్న కొద్దిరోజులూ, నా తల్లి నా ఎదుట కంటినీరు పెట్టుకోలేదు. అడ్డుపెంచలేదు. పాపం ఆమె ఇరుగుపొరుగు వారింటికెళ్ళి మరుగున తన దుఃఖాన్ని వెళ్లబోసుకొని వచ్చేదట. కాని నా ఎదుటికి మాత్రము నవ్వుమొగముతో వచ్చేది. విదేశాటనంవల్ల విద్యార్థులు చెడిపోతారని అనేకం చెప్పి మాతల్లిని ఎవరెవరో భయపెట్టారు. అందువల్ల ఒకనాడు నాతో నెమ్మదిగా ఇలా అన్నది. "అమెరికాలో అందరూ మాంసం తింటారట, సారాయి తాగుతారట, స్త్రీలు వ్యభిచారులట." ఆమె దగ్గర వాదప్రతివాదములతో ప్రయోజనం లేదు. అందువల్ల "అమ్మా! లేనిపోనివి చెప్పి నిన్ను ఎవరో భయపెట్టారు. కాని అవి శుద్ధ అబద్ధాలమ్మా! పోనీ. నే నలాంటి పనులు చేస్తానని నమ్మ్రతావా?" నే నిట్లా అనగానే "ఛీ! ఛీ! నీ వలాంటివాడవు గాదురా నాయినా! నిన్ను తప్పకుండా నమ్మ్రతాను" అన్నది. మా అమ్మకు నా మీద ఎంతో ప్రేమ ఎంతో విశ్వాసం.

బ్రాహ్మణులకు బియ్యం పెట్టవద్దనేవాడిని. నా తల్లి నాకు తెలియకుండా దొడ్డిగుమ్మానికి రమ్మని పెట్టిపంపేది. మా వంశానికి పారంపర్యంగా గురువులున్నారు. మావారు వారి పాదాలు కడిగి ఉదకాన్ని తలమీద ప్రోక్షించుకొని, దక్షిణ తాంబూలాదులు బహుమతు లిచ్చేవారు. నాకు

ఈ అలవాటంటే పరమ అసహ్యం. విద్యార్థి దశలోకూడా వారిని గౌరవించటానికి గాని, చివరకు లేచి నిల్చుని నమస్కరించటానికి గాని నే నెప్పుడూ అంగీకరించలేదు. పెద్దవాడైన తరువాత, వారు నాకు నమస్కరించేవారు. కాని మావారు మాత్రం మామూలు ప్రకారం వారిని గౌరవించి పంపుతుంటారు. పురాతన ఆచారాలను వదిలెయ్యాలంటే మరీకష్టం. సంస్కరణభావాలు పెంపొందించటానికి నా మిత్రులగు శ్రీ కారుమూరి వైకుంఠరావుగారు (పర్రాకిమిడి) డాక్టరు కారుమూరి వీరభద్రస్వామి గారు (రాజమండ్రి) మరికొందరు తోటి విద్యార్థులు కారకులు. కాని మదరాసులో వున్నంతకాలం నాకు రాజకీయాలు లేవనే చెప్పవచ్చును.

వీడ్కోలు

నన్ను సాగనంపడానికి నా మిత్రులందరూ ఎగ్మూరు స్టేషనుకు వచ్చారు. కంట తడి పెట్టని వా రుండరు. నా తమ్ముడు గురుస్వామి దుఃఖముతో కుంగిపోయాడు. నే నేదో తెలివితక్కువ పనిచేస్తున్నాననీ, నా సాహసం నన్ను ప్రమాదాలకు గురిచేస్తుందేమోననీ నా బంధుమిత్రులను కుంటున్నట్లు నాకు తోచింది. ఖర్చులకు కావలసినంత డబ్బు కూడా నా చేతిలో లేదనే విషయం వారికి బాగా తెలుసు. ఇక నా విషయమా, ఏమి చెప్పను! రైలు ఆగే చోట దిగేసి మద్రాసు చేరుకుందామా అని ఆలోచన!

"ఛీ! నా ఆరంభ శూరత్వాన్ని, నన్ను చూచి నలుగురూ నవ్విపోతారే! నా మర్యాద మట్టి గలిసిపోతుందే! చస్తే చస్తానుగాని వెనక్కడుగు వెయ్యనని గట్టిపట్టు పట్టాను. మనస్సు మరల ఎంతమాత్రం చలించకుండా దృఢపర్చుకున్నాను. నన్ను మెత్తపరచే ఆలోచనలు వచ్చీరాకముందే వాటిని మందలించేవాడిని. చివరకు నా ప్రయత్నం ఫలించింది. మరల మనసు చలింపలేదు.

కొలంబోలో జపాను స్టీమరు మీద జపానుకు ఇంటరు క్లాసులో ప్రయాణం. మాగదిలో 8మంది ప్రయాణీకులు. నేను తప్ప తక్కినవారు జపాను, చైనా వ్యాపారస్తులు. స్త్రీలు, పురుషులు; వారిలో బెల్జియంలో చదువుకొని ఆదేశపు యువతిని వివాహమాడి, ఆమెతో చైనాకు వెళ్ళుచుండిన చైనా విద్యార్థి ఒకడున్నాడు. కులాసాగానే కాలం గడిచింది వారితో.

ఓడలో వింతలు

రాత్రి 10గంటలు. గాలి స్తంభించిపోయింది. ఉక్కపోస్తున్నది. ప్రయాణీకులు నిద్రపోతున్నారు. జపాను నావికులు స్నానంచేసి, బట్టలు విడిచి నగ్నంగానే డెక్కుమీద పచారు చెయ్యడం చూచాను. నాకు కోపంవచ్చి ఆక్షేపించాను. నా మాటలకు వారు పరిహసించారు. మరుసటి ఉదయం స్టీమరు కెప్టెనుకు కంప్లయింట్ చేశాను. ఆయన పొట్ట చక్కలయ్యేట్టు నవ్వాడు. ఇండియా మొదలు సూయజు వరకున్న దేశాలలో తప్ప తక్కిన దేశాలలో

ఈ ఆచారం సర్వసామాన్యంగా వుంది. నా కనుభవం లేనందుచేత కోప్పడ్డానని కూడా చెప్పాడు. ఆరోజు మొట్ట మొదటిసారి బట్ట విడిచి స్నానం గదిలో స్నానం చేశాను. నా దేహాన్ని చూచుకోటానికి సిగ్గుపడలేదు. ఆ రోజునుండి ఈలాంటి వింత భావాలు, కోపాలు నాకు రాలేదు. అమెరికాలో నున్నప్పుడు జిమ్నిజియం (Gymneseme) లో కసరత్తు చేసిన తరువాత బహిర్మండలమైన స్నానవాటికలో వందల మందిని ఒకేసారి నగ్నదేహాలతో షవర్ బాత్ (శీకర స్నానం) చేసేవారం. అలవాట్లు మార్చుకోడం అతి కష్టం. పాశ్చాత్య దేశాచారాలను, మన ప్రాచ్యదేశాచారాలను అవగతం చేసుకొన్నవారే వాటి మంచిచెడ్డలు నిర్ణయించగలరు.

నేను ప్రయాణం చేస్తున్న స్టీమరులో చీనా దేశస్థులు, జపానీయులు, భారతీయులు మొదలగువారు అనేకులు మూడవ తరగతిలో ప్రయాణం చేశారు. వారిలో జపాను దేశస్థులుమాత్రం కసరత్తుచేస్తూ, కుస్తీలుపట్టుతూ కర్రలతో సాముచేస్తూ వుండేవారు. ధైర్య సాహసాలను ప్రదర్శించేవారు. చైనావారు ఎలాంటి చైతన్యం లేకుండ నిర్జీవప్రతిమల్లాగ, మన్ను తిన్న పాముల్లాగ పడివుండేవారు. అస్తమానం సిగరెట్లు మాత్రం కాల్చేవారు. ఒక భారతీయులో! వీరి కెప్పుడూ వాగ్వాదాలే, మత చర్చలే. వాటికి అంతులేదు.

అమెరికాలో చదివేటప్పుడు కూడ వీరిలో ఈలాంటి గుణాలే గోచరమయ్యేవి. జపాను విద్యార్థులు క్లాసులలో మొద్దుల్లాగు వుండేవారు. చదవరు. మార్కులలో వీరిది అంత్యస్థానం. కసరత్తు, కుస్తీ, సాములలో వీరిదే అగ్ర తాంబూలం. వీరి తూకం సగటున ఒక్కొక్కరు 100 పౌన్లు కన్న తక్కువ. అయినా 150 మొదలు 200 పౌన్లు దాకా బరువున్న అమెరికన్ విద్యార్థులను సునాయాసంగా కుస్తీలో ఓడించేవారు. చైనా విద్యార్థులకు అదే క్లాసులో ప్రథాన స్థానం, మంచి మార్కులు. ప్రొఫెసర్లకు ప్రియశిష్యులు. కాని సాము, కుస్తీలు, ఆటలలో మాత్రం సున్న. అసలు జిమ్నాజియముకు గాని, ఆటలకుగాని వచ్చుటే అరుదు.

విద్యార్థుల నైజ గుణాలకు, వారి వారి దేశాలలో రాజకీయాలకూ సన్నిహిత సంబంధా లున్నవన్న విషయం ఆనాడు నాకు బోధపడింది కాదు.

జపానులో

నేను అమెరికాలో చదవవలసిన "కాలిఫోర్నియా యూనివర్సిటీ" బర్కిలే పట్టణంలో ఉంది. పశ్చిమ తీరంలో ఉన్నది. జపాను ద్వారా వెళ్ళడమే సమీపమార్గం. అందు వల్లనే జపానుకు వెళ్ళవలసివచ్చింది. అమెరికాలో చదువు పూర్తి అయిన తర్వాత ఐరోపా ద్వారా రావలెనని నా అభిలాష. కాబట్టి ఇప్పుడే జపానులో ఒక నెలరోజులుండి, ఆ దేశ ప్రజలను, వారి ఆచారవ్యవహారాలను తెలుసుకో వలెనని నిశ్చయించుకున్నాను.

రష్యా - జపాన్ యుద్ధములో జపాను గెలిచినందుకు ఆ కాలంలో జపాన్ని ప్రశంసిస్తూ వివిధ విషయాలు ప్రతి కలలో ప్రచురింప బడుతుండేవి. ఆ వ్యాసాలు అతి ఆకర్ష ణీయంగా వుండడంచేత, అనేకులకు వాటిని చదవడం పరి పాటి అయింది. అందువల్ల నే నక్కడ ఒక నెల మకాం వేశాను. జపానీయుల నాగరికత, సాంప్రదాయాలను తెలు సుకోవలెనని అభిలాష ఉన్నందువల్ల నేను యూరపియన్ స్టైయిల్ ననుసరించిన హోటలుకు వెళ్ళక జపాన్ నారి హోటల్‌లో మకాం వేశాను. జపానీయులలో అభివృద్ధి యైనంత "శుభ్రత" మరే దేశ ప్రజలలోనూ నేను చూడ లేదు. వారు సౌందర్య పిపాసులు. శుచి, సౌందర్యములు వారి సొమ్మనిచెప్పుట అతిశయోక్తి కాదు. వారి ఇండ్లలో బూజు, దుమ్ము, చీమలు, దోమలు వెదకినా కనబడవు. స్నాన సౌఖ్య మనుభవించాలంటే జపానులో తప్ప మరే దేశంలోనూ లభించదు. టర్కీ దేశంలో మాత్రం కొంత ఉందట. కాని యింత శుభ్రత ఉండదని విన్నాను. ఇంక మిలిటరీ పిచ్చకు అంతులేదు. 20 యేండ్లు ఈడు రాగానే ప్రతి యువకుడు సేనలో చేరి ఒకటి రెండు సంవత్సరములు తరిఫీదు కావాలి. సైనిక విద్య నభ్యసించ యువకుడు వెళ్లే టప్పుడు ఆ వూరిలోని స్త్రీలు, పురుషులు, పిన్నలు, పెద్దలు ఆబాలగోపాలం ప్రతివారు జాతీయ పతాకాన్ని చేత పట్టు కొని ఆయువకుని వూరంతా వూరేగించి పంపేవారు. ఇంక నాటకాల విషయం: మన పల్నాటి వీరుల చరిత్రలు,

బొబ్బిలియుద్ధం లాంటి వీరగాథలు ప్రదర్శింపబడుతాయి. జపాను ప్రజల దేశభక్తి, ధైర్య సాహసాలు, స్వాతంత్ర్య కాంక్ష, సౌందర్యార్చన, యెంతో ఆకర్షణీయంగా కనుపించటంలో ఆశ్చర్యం లేదు. అమెరికాలో అడుగుపెట్టేదాక జపానీయుల నాగరకతలో యెలాంటి లోపం తెలుసుకోలేక పోయ్యాను. అమెరికా వెళ్ళిన తరువాత అమెరికా జపానుల మధ్య దోమకు ఏనుగ కున్నంత భేదం కనిపించింది.

ముఖ్యంగా జపానుకు సంబంధించిన ఒకటి రెండు విషయాల్లో నాకు పరమ అసహ్యం కలిగింది. స్త్రీల విషయంలో పూజ్యభావం అనేది వారిలో పూజ్యం. అంతే కాదు. అక్కడి మహిళల మాన - శీలాలకు ఎంతమాత్రం విలువ లేదు. వారు అతినీచంగా చూడబడుతారు. అక్కడ వేశ్యాగృహాలు, వేశ్యానగరాలు అనంతం. "యొషావరా" అనే నగరభాగంలో వేశ్యలు మాత్రమే వుంటారు. అసలు అక్కడ ప్రభుత్వమే యీ వేశ్యల కామందులకు యిండ్లు కట్టించి అద్దెకిస్తుంది. పైగా లైసెన్సుల నిచ్చి సుంకం వసూలు చేసుకొంటుంది. మన దేశంలో కల్లు దుకాణాలు ఎలాగో అక్కడ వేశ్యాగృహాలు అలాగే. యొషావరాలో ప్రతి యింటి పంచలోనూ ఏ పదిమంది వేశ్యలో శృంగారించుకొంటూ వుంటారు. వారికి ఒక మేనేజరుంటాడు. ఆ మేనేజరు ఆ పంచలోనే ఒక మేజాబల్ల వేసుకొని కూర్చొని వుంటాడు. మన కాఫీ హోటళ్ళలోలాగు. గవ

ర్మమెంటు నిర్ణయించిన రేటు వుంటుంది. సాయంత్రం పిటగాండ్రు గుంపులుగా – చైనా బజారులోను, తిరువళ్ళి క్కేణి బీచ్‌లో మాదిరిగా – యెుపావరా యెుక్క రమణీయమైన విశాల వీధుల్లో షికార్లు చేస్తూ వుంటారు. వేన వేల స్త్రీలు యిట్టి నీచాతినీచమైన దుర్భర జీవితం గడుపు తుంటారు.

జపానులో వేశ్యలనుండి తప్పించుకొనుట అతి కష్టమని, అతి జాగ్రతగా వుండమని నా ప్రేయోభిలాషి ఫాదిరీ బ్రాకుదోర (కనిగిరిలో అప్పుడున్న ఫాదిరీ) నాకు బాగా బోధించాడు. జాగ్రత్తగా ఉండడానికి దృఢప్రతిజ్ఞ కూడా చేశాను. కాని నా ప్రతిజ్ఞను పదిలంగా కాపాడుకో డానికి పలుపాట్లు పడవలసి వచ్చింది. పడ్డాను కూడా. చివ రకు నెగ్గాను.

ప్రతి దేశంలో విదేశీయుని అవలీలగా ఆనవాలుపట్టి రిక్షాబళ్ళవాళ్ళు విదేశీయులను నానా బాధలు పెట్టుతుం టారు. ప్రయాణీకులు చెప్పిన చోటికి తీసుకువెళ్ళరు. సరే అంటారు, కాని వారి మనస్సులో నున్న గమ్యస్థానానికే చివరకు చేర్చివేస్తారు. అంటే వేశ్యావాటికలకు పోవటం మనకు అయిష్టమని తెలియగానే, యిక బోధప్రారంభిస్తారు. ప్రబోధమలాడినాసరే, బెదరించినాసరే వాడి పని వాడు నెర వేర్చుకుంటాడు. ఇట్లా చేస్తే వాడికి మంచి కమీషను వస్తుంది. అలాంటి రిక్షావాడే నన్ను పట్టుకున్నాడు.

నేను తరచుగా నగరసౌందర్యాన్ని, వింతలు, వినోదాలు చూడడానికి రిక్షాలో పోతూండేవాడిని. ఒకనాడు ఒక రిక్షావాడు వేశ్యవీధికి తీసుకుపోబోయాడు. నే నెంతగా వాడిని బతిమిలాడినా, బెదరించినా వాడు తనపట్టు వదల లేదు. రిక్షా ఆపలేదు. దిగనివ్వ లేదు. నాకమిత ఆగ్రహము వచ్చింది. కూర్చున్నవాణ్ణి చటుక్కునలేచి రిక్షాను నాబలం కొద్దీ అణగద్రొక్కాను. రిక్షా వాడి చేతులనుండి జారిపడి కొయ్య విరిగిపోయింది. జనాసీయులు గుంపుగూడారు. రిక్షా విరిగినందున నన్ను నష్టము కట్టి యిమ్మంటారు. వారిభాష నాకు బోధపడదు. నా భాష వారికి తెలియదు. తప్పువాని దైనా, తమ దేశీయుని పక్షమే వహిస్తారు. విదేశీయుని పక్షము వహించరు. ఇంతలో పోలీసువాడు వచ్చాడు. స్టేషనుకు తీసుకు వెళ్ళమన్నాను. ఆఫీసర్లకు ఇంగ్లీషు తెలుసు. చెప్పవలసినదంతా చెప్పాను. రిక్షావాణ్ణి చివాట్లు పెట్టి పంపేశారు. మరొక రిక్షాను కుదిర్చి మెలకువగా మెలగమని చెప్పి పంపారు.

జపాను హోటల్లో మొదటినాడు స్నానం గదిలోకి వెళ్ళి నగ్నంగా స్నానం చేస్తూ వున్నాను. గది తలుపుకు గడియలేదు. ఒక స్త్రీ నవ్వుతూ లోపలికి వచ్చింది. భయ

పడి బిగ్గరగా కేకవేశాను. హోటల్లోని మేనేజరు మొదలు నౌకర్లందరూ నా స్నానం గదిలోకి వచ్చారు. మేనేజరుకి మాత్రమే యింగ్లీషు తెలుసు. "నేను స్నానం చేస్తుండగా ఈ స్త్రీ నా గదిలోకి వచ్చింది. వెళ్ళిపొమ్మంటే పోవడం లేదు" అని కంప్లయింట్ చేశాను. వారందరూ నవ్వారు. తమ దేశంలో స్త్రీలే ఒళ్ళు తోముతారు. నగ్నదేహం చూడ కూడదనే "దురలవాటు" జపానులో లేదన్నారు. నాకు ఆశ్చర్యం వేసింది, కాని నా దేహాన్ని తాక నివ్వ లేదు.

సీమ ప్రయాణంలో కూడ రాత్రి నిద్రించేటప్పుడు ఉక్క పోస్తుంటే జపాను స్త్రీలు బొడ్డుకుపైగా బట్టలన్నీ పూర్తిగా తీసేసి పురుషులతో మాట్లాడుతూ ఉండేవారు. జపాను హోటల్లో నా గదిని శుభ్రపరచి, సకాలమునకు అన్నపానీయాదుల సమకూరుస్తూ వుండిన ఒక పరిచారికకు (Waitress) పొయ్యేటప్పుడు నేను బహూమానంగా కొంత డబ్బు యిచ్చాను. మేనేజరు ఆ పిల్లవై పుచూచి విపరీతంగా నవ్వసాగాడు. "ఏమిటీ?" అని అడిగాను. "మీరు ఎక్కువగా యిచ్చారు" అన్నాడు. విపులంగా చెప్పమన్నాను. "మా దేశంలో హోటళ్ళలో స్త్రీలను మాత్రమే నౌకరీకి పెట్టుతాము. వారికి అన్నం బట్టలు మాత్రమే యిస్తాము. జీతం ఇవ్వం. హోటళ్ళకు వచ్చేవారి వద్ద డబ్బున

సంపాదించుకోటానికి సర్వాధికారం, సర్వస్వాతంత్ర్యం వాళ్ళకుంది" అన్నాడు. ఇంతకన్న మరింత దారుణమైన ఆచారంగూడ అక్కడ వేళ్ళు పాతుకొనివుంది.

భర్తయే తన అప్పులను తీర్చుకోటానికి భార్యకొంత కాలం యెషావరాకు అమ్మివేస్తాడు. పెండ్లి కట్నానికి డబ్బు సంపాయించుకోమని కన్నకూతుర్ని తండ్రి యెషావరాకు అమ్మివేస్తాడు. రాజు తమ జమీందారు ఇంటికి వెళ్ళితే, జమీందారు భార్య రాజుతో పడక గదిలో వుండాలి. అప్పుడే నిజమైన ఆతిధ్య మవుతుందట! అలాగే జమీందారు భూస్వాముల ఇండ్లకు వెళ్ళినా, భూస్వాములు పాలేర్ల ఇండ్లకు వెళ్ళినా ఇలాంటి ఆతిధ్యం జరుగుతుంది. స్త్రీల శీలాని కెంత మాత్రం విలువలేని ఫ్యూడల్ (జమీందారీ) నాగరికతను, స్త్రీల నీచాతి నీచ స్థితిని చూడాలంటే జపానులోనే చూడాలి [1]. ఇట్టి నీతి బాహ్యులు దేశాలను జయించి, తమ నాగరికతను వ్యాపింపచేయటానికి ప్రయత్నించారు. జపానులోను, ఫ్రాన్సులోను, టర్కీలోను వేశ్యావృత్తి గొప్పవ్యాపారం.

---

[1] ఆ కాలంలో మన దేశంలో జమీందారీ ప్రదేశాల్లో వ్యవసాయ కూలీ స్త్రీల గతి ఎంత హీనస్థితిలో వుండినది నాకు తెలియదు.

సంపాదనకు ముఖ్యమార్గం. గవర్నమెంట్లే ఈ వ్యాపారానికి సౌకర్యాలన్నీ కల్పిస్తాయి. దేశదేశాల శ్రీమంతులు ఇక్కడకు వచ్చి స్త్రీలకోసం ద్రవ్యం ఖర్చు పెట్టుకుంటారు. కొందరు అమాయకులు బికారులు అయిపోతూవుంటారు.

కొత్త జిజ్ఞాస

రెండు మూడు నెలల తరువాత జపాను నుండి అమెరికాకు వెళ్ళే స్టీమరులో ఎక్కాను. స్టీమరులో చాలామంది జపాను వాళ్ళను కలుసుకున్నాను. వారిలో విద్యార్థికులు, మిషనరీలు, (ఫాదరీలు) వ్యాపారస్తులు వున్నారు. రెండవ తరగతిలో ప్రయాణం చేశాం. వారి దేశాన్ని ఏమాత్రం చులకన చేసి మాట్లాడినా, వాళ్ళ తోకతొక్కిన త్రాచుల్లాగ మీద పడేవారు. వారి చక్రవర్తే వారికి పరమ దైవం. వారికన్న గొప్పవారు పృథ్వీలోనే లేరంటారు. వాగ్వాదాల్లో వారికి నామీద కోపం వచ్చినప్పుడు "మీ రాజెవరు? ఒక విదేశీయుడు! మీకు స్వరాజ్యం సగౌరవం అనేవే లేవు" అని తలవంపులయ్యేట్లు మాట్లాడి నన్ను అగౌర పరచేవారు. ఆ ప్రయాణ సమయంలో ఒకనాడు ఢిల్లీలో వైస్రాయి (Lord Hardinge) మీద బాంబు వేశారనే వార్త విన్నాము. అప్పుడు జపానీయులకు (స్టీమరుమీద) భారతీయులమీద కొంత గౌరవం

కలిగింది. నేను బైసాకే అనే ఒక బెంగాల్ విద్యార్థి మాత్రమే ఆ స్టీమరు ప్రయాణీకులలో భారతీయులము. ఈ సంఘటనను ప్రశంసిస్తూ మా యిద్దరిని జపానీయులు అభినందించారు.

జపాను చూచినప్పటి నుండి "మన మెప్పుడు స్వరాజ్యం సంపాయించుకొంటాము? ఎప్పుడు యంత్ర పరిశ్రమల నభివృద్ధి చేసుకుంటాము? మంచి బలవంతుల మనపించుకుంటాము? వివిధ దేశముల మధ్య మన దేశానికి, మనకు ఎప్పుడు గౌరవస్థానం ఏర్పడుతుంది? అనే జిజ్ఞాసనాలో రేకెత్తసాగింది. విదేశీయులకు పరాధీనులమై ఉండడమనేది ఎంత ఏహ్యమో మొట్టమొదటిసారిగా గుర్తించాను. నామీద నాకే అసహ్యం పుట్టింది.

నా నా — నా దేశము

గదర్ పార్టీలో

అమెరికాలో మొదటి అనుభవాలు

1912 సం॥ డిసెంబరు మాసంలో అమెరికా చేరాను. స్టీమరు సేన్ ఫ్రాన్సిస్కో చేరింది. 'కాలిఫోర్నియా యూనివర్సిటీ' బర్కలే పట్టణంలో, సేన్ ఫ్రాన్సిస్కోకు 12 మైళ్ళ దూరంలో వుంది. నేనూ, బైసాక్ అనే బెంగాలు విద్యార్థి రాత్రిపూట బర్కలేకు చేరుకున్నాం.

ఆ పట్టణాలు, ఆ కట్టడాలు, రైళ్ళు, ట్రామ్‌లు, ఎలెక్ట్రిక్ దీపాలు, అందమైన శుభ్రమైన వీధులు, ఆ ప్రజలు, స్త్రీల అందచందాలు, వారి ఉన్నత నాగరిక జీవితం, మాకు దిగ్భ్రమ కలిగించాయి. వారి హోటళ్ళలో ఎలా ప్రవర్తించాలో, ఏ పొరపాటు చేస్తామో, వారేమను కుంటారో అని మా కంగారు. వెయ్యేందుకు - ఒకపక్క ఆశ్చర్యం, మరొకపక్క అయోమయం. ఏమీ తోచదు. కొంత సేపటికి తెప్పరిల్లుకున్నాము. చివరకు ఒక హోటలుకు వెళ్ళాము. మమ్మల్ని "ఎలక్ట్రిక్ లిఫ్టులో" (విద్యు

శ్చక్తితో పైకి తీసికొనుపోవు యంత్రం పై అంతస్తుకు తీసుకెళ్ళారు. అక్కడి కట్టడాలకు అనేక అంతస్తులుంటాయి. "లాలా హరదయాళ్ గారెక్కడ వున్నారు?" అని ఆ లిఫ్ట్ నౌకరుని అడిగాము. ఇండియన్ విప్లవనాయకుడు ఉన్నచోటు చెప్పారు. ఆయన ఇంటికి వెళ్లుతామని చెప్పి సెలవు పుచ్చుకున్నాము. వీధిలో నడుస్తుండగా ఒక కుబ్జనాడు లాలాహరదయాల్ వుండే వీధి, యిల్లుచూపించు తానని మావెంట వచ్చాడు. మా యిద్దరిచేతుల్లోను సూటు కేసులున్నై. ఒకటి ఆ కుబ్జనాడే మోసుకొచ్చాడు. వాని ఆదరణ చూచి, అమెరికావారు ఎంతో మంచవారని, ఆ దేశంలో సుఖంగానే వుండగలమని మాకు ధైర్యం, నమ్మకం కలిగాయి.

(1910 ప్రాంతంలో ఒక బెంగాలుస్వామి అమెరికా నుండి ఇండియాకు తిరిగివచ్చాడు. ఒకరిద్దరు వృద్ధులులైన తను అమెరికన్ శిష్యురాండ్రతోవచ్చి మద్రాసులో విక్టోరియా హాలులో ఉపన్యసించారు. అతనిపేరు "భారతి" అనుకుంటాను. అమెరికాలో స్త్రీ పురుషులు తప్పతాది పబ్లిక్ - వీధులగట్టర్లలో పడివుంటారని, పండ్లు తోమరని, ప్రతిరోజు స్నానం చెయ్యరని, ముడ్డికడగరని ఏమేమో చెప్పాడు. ఆయన చిత్రించినదానికి, నేను అమెరికాలో చూచినదానికి పోలికే లేదు.

అదేమాదిరిగా అమెరికా ఫాదరీలు భారతీయులను గురించి శుద్ధ అబద్ధాలు అమెరికాలో ప్రచారం చేస్తున్నారని తెలుసుకున్నాను.)

అమెరికాలో అడుగు పెట్టినక్షణంనుండి "మననూ, మన దేశమూ ఎప్పుడు అమెరికాలాగు అభివృద్ధి చెందుతాము? యంత్రపరిశ్రమలు ఎప్పుడు ఏర్పడతాయి? స్వాతంత్ర సౌభాగ్య సౌఖ్యాలు ఎప్పుడనుభవిస్తామా?" అనే అభిలాష, ఆరాటం నన్ను వెన్నంటాయి. జపానులో రేకెత్తిన యీ దేశాభిమానం అప్పుడు బలంగా నాటుక పోయింది.

నేనూ, బైసికే బర్కలే పట్టణంలో హరదయాల్‌గారింటిలో ప్రవేశించాము. అది పంజాబు విద్యార్థులహాస్టలు. అక్కడ పదిమంది విద్యార్థులే వున్నారు. వారు మమ్మల్ని కుశల ప్రశ్నలువేసి ఆదరించారు. కాని, ఆ ఆదరణ హృదయపూర్వకమైనది కాదని గ్రహించాము. భోజనమైన వెంటనే మమ్మలను ఇంకో హాస్టలుకు తీసుకెళ్లారు. అక్కడ బెంగాలీలు, ఆంధ్రులు, తమిళులు, ఉత్కళులు, మహారాష్ట్రులు కలిసివుండిరి. అనగా పంజాబీలుతప్ప తక్కినవారందరూ వున్నారు. మొత్తం 12 మంది మాత్రమే. వారిలో గుంటూరు పట్టణవాసి శ్రీ భాగవతుల సోమయాజిశర్మ బి.ఎ. బి.యల్., గారు నన్ను కౌగలించుకున్నారు. మదరాసులో ఆయన లా కాలేజీలో చదివే టప్పుడు మాయిద్దరికి పరిచయం కలిగింది. ఇక్కడ విద్యార్థులందరూ మమల్ని ఆదరించినందువల్ల మాసామానులను ఈ హాస్టలుకే తీసుకవచ్చి ఇక్కడే మకాంపెట్టాము.

కాలిఫోర్నియా యూనివర్సిటీలో 3500 మంది విద్యార్థులున్నారు. వీరిలో సుమారు 1000 మంది స్త్రీలు. దేశదేశాల నుంచి వచ్చిన విద్యార్థులు సుమారు 500 మంది వుండిరి. భారతీయులు 30 మంది. వీరిలో రెండు రాజకీయపార్టీలుండేవి.

ఇండియాలో బ్రిటిషు ప్రభుత్వాన్ని హతమార్చి, స్వరాజ్యాన్ని స్థాపించుకోవాలనే కక్షి ఒకటి. పంజాబీ విద్యార్థులందరు ఈ కక్షిలో వుండిరి.

మరొక కక్షి ఆశయమేటంటే అమెరికాలో ఉన్నత విద్యనభ్యసించి ఆరితేరాలి: ఇండియాకు వెళ్లి ఉన్నతోద్యోగాల్లోచేరి పుష్కలంగా సంపాదించుకొంటూ ఇతోధికంగా దేశసేవ చేయాలి: కాని, దార్జన్యాలకు దిగినా, ఏవిధంగా పోరాడినా బ్రిటిషు ప్రభుత్వం పెట్టే అష్టకష్టాలకు గురిఅవు తామని ఈ పార్టీకి భయంకూడా. నాకుకూడ ఈ మితవాద పార్టీయే నచ్చింది. వీరితో కలిసిపోయాను. అతివాద, మితవాదపార్టీలు రెంటినీ ఏకైకపార్టీగా చేయుదలచి హరదయాల్‌గారు, భాయి పరమానంద్‌గారు ఈ విద్యార్థులందరినీ సమావేశపరిచారు. ఈ సమావేశం నేను ఆదేశం వెళ్లిన ఒకవారంరోజులకు జరిగింది. అంటే 1912 సం. డిసెంబరు చివరలో జరిగివుటుంది.

ఆ సభలో హరదయాల్‌గారు ఉపన్యసించారు. అలాంటి విప్లవ వీరవాక్కులను, ప్రతిభాశాలిని, నా జీవితంలో ఆరోజు వరకు చుళ్లేదు. ఆతని రాజకీయ వుపన్యా

పం అనన్యంగా, అత్యద్భుతంగా అనిపించింది. బ్రిటిష్ సామ్రాజ్య విధానంలోని అమానుషకృత్యాలను అద్దంలో లాగు చుపెట్టాడు. ప్రపంచంలోని ప్రజాకోటికే అసలది ఎంత అరిష్టదాయకమో నిరూపించాడు. ఇట్లాంటి రాక్షస ప్రభుత్వాన్ని నాశనం చేయకపోతే అసలు మానవజాతే నాశనమైపోతుందన్నాడు.

"ప్రపంచ ప్రజానీకాన్నే బలిగొంటున్న బ్రిటిష్ సామ్రాజ్య విధానానికి మన భారతదేశమే ఆయువుపట్టు. ఈ ప్రభుత్వాన్ని కూలద్రోయాల్సిన విధి మనదే: విముక్తికై పురోగామిలోకం మనవైపే చుస్తున్న"నని ఉద్ఘాటించాడు. అట్లా ఖచ్చితంగా ఖండించే శక్తిగల నిశిత విమర్శకుణ్ణి, స్పష్టంగా కండ్లకు కట్టినట్లు రాజకీయా లను చిత్రించిన మరొక వ్యక్తిని అదివరలో నేను ఎరిగి యుండలేదు.

"ఇట్టి పైశాచిక ప్రభుత్వాన్ని కూకటి వ్రేళ్లతో పెక లించి పారవేయుటకు దేశభక్తులు, మానవాభ్యుదయాన్ని ఆకాంక్షించే మహాపురుషులు మహావీరాధివీరులు కావాలి. ఈ కార్యాన్ని కొనసాగించడంకన్న ఉత్తమవిద్య, పవిత్ర లక్ష్యం, మతం వేరేలేదు. విద్యార్థులారా ! దేశభక్త శిరోమణు లనిపించుకోండి !" అని ప్రభోధించాడు. ఈ విప్లవవీరుని ప్రభోదం నాలో ఒక విచిత్రమైన ఉద్రేకాన్ని పురికొల్పింది. నా జీవిత ధృక్పథమే మారిపోయింది. అట్లాగే నా సహాధ్యాయులు, సహచరులైన కొందరిలో

గూడా దేశభక్తి, త్యాగా లుద్భవించాయి. మాలో కలిగిన ఈ పరిణామం మా ముఖాల్లో ప్రదర్శితమవడం జితేంద్ర నాథ లాహిరీ అనే ఒక బెంగాలీ యువక చెరరిస్టు కని పెట్టాడు.

హరదయాళ్ ఈ సమావేశంలోనే తన ఉపన్యా సంలో మతబోధకులను నిరసించి మాట్లాడాడు. స్వామీ వివేకానంద కొలంబో మొదలుకొని హరిద్వారం వరకు ఉపన్యసించిన ప్రసంగాలన్నిటిని చదివాననీ, ఆత్మ - పర మాత్మలు, ఇహలోక పరలోకములనుగురించి మాట్లాడు టంటే అతిసులభమేగాని, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గురించి పలెత్తుమాట అనలేదనీ, అందువల్ల అతనువట్టి పిరికిపంద యనీ దూషించసాగాడు. జితేంద్రనాథ లాహిరీ హరద యాళ్ళుయొక్క విమర్శను ముక్కలుముక్కలుగా ఖండిస్తూ "వివేకానంద ఆంతరంగిక సంభాషణలలో బ్రిటిషు సామ్రాజ్యతత్వాన్ని అతికఠినంగా ఖండించాడనీ, బెంగా లులో విద్యార్థులను, యువకులను, దేశభక్తులుగాను, మృత్యువును ఎదిరించి పోట్లాడే ధీరులుగాను చేసి దేశ స్వాతంత్ర్య సంపాదనయే భారతీయ యువకుల విద్యుక్త ధర్మమని ప్రబోధం చేశాడనీ చెప్పి అప్పటి దుర్భర రాజ కీయపరిస్థితులలో ఆయన ఎంతవరకు దేశ విముక్తికొరకు పాటుపడసాధ్యమో అంతవరకు చేశాడు. కాబట్టి ఆయన దేశభక్తి శిరోమణి, పరమత్యాగి, ధీరుడు, వీరుడేగాని పిరికి పందకాదు" అని సమర్థించాడు. అంతేగాక, హరదయా

ఘని రాజకీయ ప్రవర్తనను లాహిరీ ఇట్లా విమర్శించాడు - "ఇండియాలో పోలీసుల బాధలు భరించలేక మాతృభూమిని వదలివేసి పరదేశాలకు పారిపోవడంవల్ల, బ్రిటీషు ప్రభుత్వం వల ఏలాంటి బాధలులేని అమెరికాలో ప్రశాంతంగా కూర్చొని బ్రిటీషు ప్రభుత్వాన్ని ఖండించడం వల్ల హరదయాళ్ పిరికిపందయని నిరూపించుకున్నాడు." అందుకు హరదయాళు తానెన్నటికి పిరికిపంద కాలేదు – కానేరను అని నిరూపిస్తూ ఈ విధంగా సమాధానమిచ్చాడు. "ప్రాంచి విప్లవానికితరువాత వచ్చిన గొప్పవిప్లవం ఇటలీ స్వాతంత్ర్య విప్లవం. ఇటలీ దేశస్వాతంత్ర్య పోరాటాన్ని స్వదేశంలోనే వుండి జరపడానికి వీలుపడదని గ్రహించిన ఇటలీ దేశభక్తశిరోమణి 'మాజినీ' విదేశాలకువెళ్ళి అక్కడ ఇటలీ దేశస్థులను దేశభక్తులయ్యేట్లు ప్రబోధించాడు. వారిని సంఘటితపరచి సైన్యాన్ని చేకూర్చుకున్నాడు. ఇటలీలో స్వాతంత్ర్యాన్ని నెలకొల్పాడు. ఈవిప్లవపితానే చైనా దేశస్థుడు 'సన్ యట్ సేన్' తనదేశ విముక్తివిషయంలో ఉపయోగించుకొని కృత కృత్యుడయ్యాడు. నాదేశ విముక్తికై ఈ లోకిక దేశభక్తుల, విప్లవనాయకుల అడుగు జాడలనే నేనూ అనుసరిస్తూ విదేశాలకువచ్చాను" అని చెప్పాడు.

హరదయాళుని ఆలోచనలలో పొరపాటువుండేవుండవచ్చును, కాని ఆయన దేశభక్తుడు, త్యాగి, విప్లవయోధుడు నని విద్యార్థులలో సంపూర్ణవిశ్వాసం ఏర్పడింది.

అదేవిధంగా స్వామీ వివేకానంద దేశభక్తుడనితీర్మానించుకొంటిమి. జితేంద్రనాథలాహిరీ సామాన్య విద్యార్థికాడని, నివురుకప్పిన నిప్పు అని భావించాము.

జితేంద్రనాథ లాహిరీ

హరదయాళు చెప్పిన సమాధానానికి లాహిరీ ఈ లాగున ప్రశ్నలవర్షం కురిపించాడు— "మీరు విదేశ పర్యటనం ప్రారంభించి ఐదారు సంవత్సరాలైంది. మీ ఆదర్శ విప్లవనాయకులు మాజినీ, సన్‌యట్‌సేనులలాగు దేశస్వాతంత్ర్యం కొరకు విదేశాల్లో మీరేమిచేశారు ? * అనార్కిజం స్వచ్ఛందప్రేమ, తత్వశాస్త్ర గుణగణ విచక్షణలు (Comparative Philosophy) మొదలైన వాటిని అమెరికనులకు బోధించుటవల్ల మనకు స్వతంత్రం లభిస్తుందనుకున్నారా ? అమెరికాలో ఐదారువేల 15000 మంది పంజాబీ వ్యవసాయకూలీలు వున్నారుకదా? వారిలో అనేకులు బ్రిటీషుసేనల్లోవుండి యుద్ధాలుచేసిన యోధులే

---

* అనార్కిజం (Anarcism) అనగా తెలుగు నిఘంటువులలో "అరాచక వాదము" "అనాయకత్వము" అని వ్రాశారు. దానికి వుత్పత్తి అర్థము - రాజు లేక ప్రభుత్వములేని సంఘము. అలాటి సంఘములో ప్రతివ్యక్తి తన విధిని, ఏలాంటి నిర్బంధము లేకుండా నెరవేరుస్తాడు.

ఫ్రీలవ్ (Free love) అనగా స్వేచ్ఛాప్రేమ అని వ్రాస్తారు; అనార్కిజంలో "స్వచ్ఛందప్రేమ" అంటారు.

కదా ? అట్లాగే ఇండియాకు వెలుపలి దేశాల్లో లక్షలాదిగా భారతీయులు, ముఖ్యంగా సిక్కులు వున్నారన్న విషయం మీ రెరిగినదే ! దేశస్వాతంత్ర్యంకొరకు విరిలో విప్లవ ప్రబోధం ఎందుకు చెయ్యలేదు ? 1857 సం॥లో జరిగిన స్వాతంత్ర్యపోరాటం (గదర్ అనగా సాయుధ సైనిక తిరుగు బాటు) విచ్ఛిన్నంకావడానికి కారణం తెలుసుకోలేక పోయారా ? అప్పుడు పంజాబీ సైన్యం బ్రిటిషు ప్రభుత్వానికి సహాయం చెయ్యకపోతే, మనకీపాటికి స్వాతంత్ర్యం వచ్చివుండేదికదా ? రాబోయే స్వాతంత్ర్య సమరంలో పంజాబీయులు పాల్గొనకపోతే మరల పరాజయం తప్పదుగదా ! ఈ ప్రమాదకరమైన పొరపాటును అత్యవసరంగా సరిదిద్దుకోవాలన్నమాట మరచారా ? వీరందరిని సంఘటిత పరచి ఒక విప్లవ నిర్మాణకార్యక్రమానికి ఎందుకు తల పెట్టలేదు ? కనీసం వారికొక విప్లవప్రబోధంచేసే పత్రిక నైనా ఇంతవరకు ఎందుకు ప్రకటించలేదు ? ఈ ఉద్యమానికి మీకంటే తగినవారెవరు ?"

కఠినంగావున్న లాహిరీగారి విమర్శలో నిర్మాణయుక్తమైన కార్యక్రమం గర్భితమైయున్న విషయాన్ని హరదయాళు గ్రహించాడు. లాహిరీని చాల మెచ్చుకున్నాడు.

విప్లవ సంకల్పం

హరదయాళులో లాహిరీ ప్రబోధంవల్ల ప్రబలమైన నూతన నిర్మాణశక్తి వికసించింది. వెంటనే కార్యాచర

ణకు ఉద్యుక్తుడయ్యాడు. అమెరికాలో వున్న పంజాబీయులకు విూటింగులు, కాన్ఫరెన్సులను పెట్టాడు; విప్లవాత్మకమైన ఉపన్యాసాలను ప్రారంభించాడు. వారిని సంఘటిత పరిచాడు. వీరి ఉపన్యాస ఘోరణే మారిపోయింది. ఒక నూతన విప్లవ చైతన్యం తొణికిసలాడ సాగింది. ఫలితం—పంజాబీయులలో – ముఖ్యంగా సిక్కులు ఈయన ఉద్బోధన వల్ల ఉత్సాహపూరితులయ్యారు. వేలకొలదిగా సభలకు వచ్చేవారు. వీరిని ఆహ్వానించి తీసుకెళ్లేవారు. కార్యక్రమమేమని అడిగేవారు.

అమెరికాలో ప్రతి పంజాబీ కార్మికుడు నెలకు సుమారు రు 300 లు సంపాయించుకొనేవాడు. కాబట్టి, విప్లవపత్రిక నొకదాన్ని స్థాపించాలనగానే వేలకొద్దీ డబ్బు వసూలు కాజొచ్చింది. పత్రిక పేరు నిర్ణయించవలసి వచ్చింది. "రాబోవు స్వాతంత్ర్యసమరంలో భారతసైన్య సహాయం అత్యవసరం. ఈ మహాకార్యాన్ని పంజాబీయులమగు మనం మాత్రమే నెరవేర్చగలం. గత 1857 సం॥లో జరిగిన "గదరు" (సిపాయీల తిరుగుబాటు) లో పంజాబీయుల సహాయం లేనందుచేతనే పరాజితుల మయ్యాము. ఈ పర్యాయం మనం గదరును జయప్రదంగా సాగిస్తాం! విజయం చేకూరుస్తామనే ప్రతిజ్ఞ చేద్దాం! మన విప్లవ పార్టీ పేరు 'గదర్' పార్టీ. మన పత్రిక పేరు 'గదర్'. మనం సాధించాల్సినది భారతదేశ స్వాతంత్ర్యం అని హరిదయాళ్ ఉద్ఘాటించాడు. సమావేశాని కేతెంచిన

వేలకొలది పంజాబీల ఉత్సాహానికి అంతులేదు. హర్షధ్వనులతో ఆమోదించి అంగీకరించుటే గాక కనకవర్షం కురిపించారు. ఈ విధంగా 1913 సంవత్సరారంభములో 'గదర్ పార్టీ' పుట్టింది. గదర్ పార్టీ కేంద్ర కార్యాలయం సేన్ ఫ్రాన్సిస్కో నగరములో స్థాపించబడినది. గదర్ పత్రిక కూడా కేంద్రస్థానం నుంచే ప్రకటింపబడింది.

అది స్థాపింపబడిన వెంటనే పంజాబీలు అనేకులు వాలంటీర్లుగా పనిచేయడానికి వచ్చారు. అలా వచ్చిన వారే పృథ్వీసింగ్, సోహన్‌సింగ్ భాకనా మొదలగు గదరు బాబాలు. వీరు భారత స్వాతంత్ర్యోద్యమంలో ఎంత ప్రముఖ పాత్ర వహించినది భారతీయులకు తెలిసిన విషయమే.

ప్రపంచంలోని వివిధ దేశాలలో కోరినవారందరికి గదర్ పత్రికను ఉచితంగా పంపుతూ వచ్చాము. విరాళాలు విస్తారంగా రాసాగాయి.

అప్పట్లో భారత స్వాతంత్ర్య సంపాదనకు నిర్మాణయుక్తమైన ఒక కార్యక్రమాన్ని నిర్మించుకొన్నాము. పంజాబీయులకు సైనికవృత్తి వందలకొద్దీ ఏండ్లనుండి పరిపాటి అయిపోయింది. అమెరికాలో కూలిచేసుకొని జీవించుతున్న పంజాబీయులుకూడా సామాన్యంగా బ్రిటీషు సైన్యంలో ఉద్యోగాలు చేసి యుద్ధాలకు అలవాటుపడ్డవారే. వీరి బంధుమిత్రులెందరో సైన్యంలో ఉన్నారు.

Acc No. 10233

గదర్ పార్టీలో కాబట్టి వీరు 1857 సంలో వలెనే సైన్యంలోచేరి ఇప్పుడు మళ్ళీ తిరుగుబాటు తెస్తామన్నారు. మొదటి సైనిక విప్లవాన్ని (1857 సిం) ఎదిరించి యుద్ధం చేసిన బ్రిటీషు సేనలలో తమ తాత ముత్తాతలున్నారని, బ్రిటీషు సామ్రాజ్యానికి తోడ్పడ్డారని విచార పడ్డారు. తమ పూర్వీకులు అజ్ఞానంతో చేసిన మహాపరాధాన్ని, కళంకాన్ని తుడిచి వేయటానికి, మాతృదేశ విముక్తికొరకు పాటుపడడానికి వారు సిద్ధపడ్డారు.

ఎత్తుగడలు - చర్చలు

ఆదిలోనే ఒకేపర్యాయం ఆసేతుహిమాచలపర్యంతం జయించటం సాధ్యంకాదు. సమతల ప్రదేశాలనుండి గాని, తీరప్రాంతాలనుండి గాని, బ్రిటిష్ ప్రభుత్వాన్ని తరిమి వేయటం దుస్సాధ్యం; కాని పర్వత ప్రదేశాల నుండి సాధ్యమవుతుంది. పర్వత ప్రదేశాలగు కాశ్మీర్ నుంచి గాని, పశ్చిమోత్తర పరగణాల (North-west Frontier) నుండిగాని మొట్టమొదట బ్రిటిష్ ప్రభుత్వాన్ని తరిమి వేసి, అక్కడ రిపబ్లిక్కును (ప్రజా ప్రభుత్వాన్ని) స్థాపించుకోవాలి. అంటే ఐరోపా ఖండంలోని స్విట్జర్లాండు లాగా, క్రమేణా పంజాబు, యు. పి. మొదలగు రాష్ట్రాలను జయించుకొంటూ, యావద్భారత దేశాన్ని జయించుకో

వాలి; ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించుకోవాలని మేము నిర్ణయించుకొన్నాం.

ప్రథమంలో కాశ్మీర్‌లో ప్రారంభించాలని కొందరు, పశ్చిమోత్తర పరగణాలలోనని మరికొందరు వాదోపవాదాలు జరిపారు. చివరకు కాశ్మీర్‌లో ప్రారంభించాలని తీర్మానించుకొన్నాము. కారణం ఏమంటే - కాశ్మీర్ దేశంలో జమీందారీ ప్రభుత్వం వుంది. అక్కడి రాజులు, జమీందారులు, బ్యాంకర్లు, విద్వాంసులు, పాలకవర్గము హిందువులే; వీరు చాలా కొద్దిమంది. ప్రజలేమో మహమ్మదీయులు: పారు శైతులు మొదలగు నిరక్షరకుక్షులు; కడు బీదలు. పాలక పాలితుల మధ్య పొత్తు ఎంతమాత్రం లేదు. ఇలాంటి పరిస్థితులుగల కాశ్మీరంలోని ప్రజలలో తిరుగుబాటు తీసుకొని రావటం సులభసాధ్య మని మేము నిశ్చయించుకొన్నాము. 1925 సం॥ లోగా కాశ్మీరులో రిపబ్లిక్కును స్థాపించాలని మా సంకల్పం. ఒక పెద్ద ఇండియా మ్యాపును గోడకు తగిలించాము. కాశ్మీరు సరిహద్దులను ఎఱ్ఱసిరాతో చక్కగా కనపడేలాగు గీచి, '1925 సం॥లోగా కాశ్మీర్ రిపబ్లిక్' అని అందరి దృష్టిని ఆకర్షించేలాగా వ్రాశాము. ఇలాంటి గొప్ప కార్యాలలో నేను కూడా కలసి చేస్తున్నాకదా అని గర్వపడేవాడిని.

సాధారణంగా ప్రజానీకం మాట్లాడే వాడుక భాషల్లో - అంటే పంజాబి, ఉరుదూ, గురుముఖి భాషల్లో

గదర్ పత్రికను ప్రచురించాము. బ్రిటిష్ సామ్రాజ్య తత్వాన్ని బహుకఠినంగా ఖండిస్తూ తిడుతూ వ్రాసేవాళ్ళం. పంజాబీ కార్మికులు చదువరులు కారు; గాని, దేశభక్తి పల్లె కలిగిన చైతన్యంతో పాటలూ, పద్యాలూ అల్లి పత్రికకు పంపేవారు. తత్ఫలితంగా వారికి సాహిత్యంలో అభిరుచి కలిగి కవిత్వం చెప్పడం, వ్రాయడం వచ్చింది. వారి వాడుక భాషలో కొన్ని అసభ్యమైన మాటలుండేవి. అయినా ఆ భాషే వారికి నచ్చేది; హృదయాలకు హత్తుక పోయ్యేది. అసలు అక్షరజ్ఞానం లేనివా రెందరో చివరకు రచయిత లయ్యారు; స్వాతంత్ర్యోద్యమ నిర్మాత లయ్యారు.

గదర్ పత్రికలు అనేక దేశాలకు పంపబడ్డవి. దేశ భక్తి, ఉత్సాహాలు నానాటికి పెరిగిపోతూ వచ్చాయి. వీటితోపాటు బ్రిటీషు ప్రభుత్వం యొక్క ఆగ్రహంకూడా గదర్ పార్టీ మీదకసి తీర్చుకోటానికి ఎన్నో మాయోపాయాలు, కుట్రలు పన్నడం మొదలెట్టింది ప్రభుత్వం. అమెరికా ప్రభుత్వంమీద బ్రిటిష్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది. గదర్ పార్టీని స్థాపించిన ఒక సంవత్సరానికే హరదయాళుని అమెరికానుండి తరిమివేయించారు.

లాలా హరదయాళ్

గదర్ పార్టీని స్థాపించిన విప్లవ నాయకుడు హరదయాళుని గురించి కొన్ని వివరాలు వ్రాయటం అవసరం.

హరదయాళు జన్మస్థానం ఢిల్లీ. పంజాబు యూనివర్సిటీలో యమ్. ఏ., పరీక్షలో ఉత్తీర్ణు డయ్యాడు. యూనివర్సిటీ ప్రతి పరీక్షలోను ఈ ప్రతిభాశాలికి అత్యధికంగా మార్కులు వచ్చేవి. యమ్. ఏ., లో అప్పటి వరకూ ఎవరికీ రానన్ని మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. ప్రతి సబకులోను సాటిలేనివా డనిపించుకున్నాడు. ముఖ్యంగా కొన్ని జట్ల కళలలో, శాస్త్రములలో (Subjects) ఆయనకు వచ్చినన్ని అధిక మార్కులు అంతవరకూ ఎవరికీ రాలే దని పంజాబీయు లంటారు. సునిశిత మేధావి. ఇలాంటి ప్రతిభాశాలులను బ్రిటిష్ ప్రభుత్వం తమ బుట్టలో వేసు కోటానికి విద్యార్థి వేతనాలను ధారాళంగా యిచ్చి, ఇంగ్లాండుకు ఐ. సి. యస్. చదవటానికి పంపుతుండేది. కాని హరదయాళ్ విషయంలో ప్రభుత్వ యత్నం ఫలించలా. ఆయన బ్రిటీషు సామ్రాజ్యానికి తొత్తు అవటానికి బదులు శత్రువయ్యాడు; విప్లవ నాయకు డయ్యాడు. ఈయనలో మార్పు కలగడానికి కారకుడు శ్రీ శ్యాంజీ కృష్ణవర్మగారు.

శ్యాంజీ కృష్ణవర్మ

శ్రీ శ్యామ్‌జీ కృష్ణవర్మగారు జయపూరు, ఉదయపూరు మొదలయిన రాజపుత్ర సంస్థానాలలో దివానుగిరి చేశాడు. 1857 సం॥ స్వాతంత్ర్య యుద్ధం విఫలమైన తరువాతకూడా స్వాతంత్ర్య ప్రియులు కొందరు మాతృ దేశ విముక్తికై స్వాతంత్ర్యజ్వాలలను రగుల్చుతూనే వచ్చారు.

అట్టి దేశభక్తులలో వర్మగారొకరు. తన వుద్యమాని కనేక ప్రతిబంధకా లుండడంచేత ఇటలీ దేశ భక్తుడు - మాజినీ లాగా విదేశాలకువెళ్ళి తన ఉద్యమాన్ని ప్రారంభించాడు. తన లక్షల ద్రవ్యాన్ని వెంటతీసుకొని యూరపు వెళ్ళాడు. ఇంగ్లాండులో "ఇండియన్ సోషియాలజిష్టు" అనే ఒక విప్లవ పత్రికను స్థాపించాడు. "మేడమ్ కామా"అనే పార్శీ మహిళ వర్మగారి వలెనే మాతృ భూమిని, కుటుంబాన్ని వదలి, భారత స్వాతంత్ర్యంకోసం ఈయనతో కలిసి పాటు బడుతూ వచ్చింది. 1900 సం॥ ప్రాంతంలో ఇంగ్లాండులో వేలకొలది భారత విద్యార్థులు ఉన్నత విద్య నభ్యసించు తుండేవారు. ఈ విద్యార్థులలో వర్మగారు తమ విప్లవప్రచా రాన్ని సాగించారు. వీరి ప్రబోధ ప్రభావంవల్ల విప్లవోద్య మంలో ముఖ్యంగా ప్రతిభాశాలులైన నలుగురు విద్యా ర్థులు చేరారు. వారు బెంగాలు విద్యార్థి అరవింద ఘోష్, మహారాష్ట్ర విద్యార్థి వి.డి.సావర్కార్, పంజాబు విద్యార్థి లాలా హరదయాళ్, మదరాసు విద్యార్థి శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి గార్లు. రెడ్డిగారు తప్ప తక్కిన ముగ్గురూ భారత దేశ విప్లవోద్యమంలో ప్రముఖపాత్రను వహించిన వారే.

హరదయాళులో వర్మ ప్రబోధంవల్ల దేశభక్తి, త్యాగాలు వికసించసాగినై. తన విద్యార్థి వేతనమును, ఐ. సి. యస్. చదువును హరదయాళు ఒక్కసారిగా పరిత్య జించివేశాడు. స్కాలర్‌షిప్పును నిరాకరిస్తూ ప్రభుత్వానికి

వ్రాసిన ఉత్తరాన్ని సార్లమెంటులో చదివారు. దాని సారాంశం యిది: "అరాకలితో అలమటించి పోతున్న నా రయితు రక్త మాంసాలతో నిర్మించబడ్డ ఈ బ్రిటీషు సామ్రాజ్యానికి తోత్తునవడానికి నేను చదువవలెనా? పీడితులయిన నా సైతు సోదరులను శాశ్వత దాస్యానికి గురిచేయవలసిందేనా? నే నెన్నటికీ అట్లా చెయ్యను. బ్రిటీషు సామ్రాజ్య విషవృక్షాన్ని నా పవిత్ర మాతృక్షేత్రంనుంచి కూకటి వ్రేళ్ళతో పెకలిస్తాను. భారత స్వాతంత్ర్య సంస్థపన కంటే నా జీవిత పరమావధి మరొకటి లేదు. ఇదే నా జన్మ సాఫల్యం!"

హరదయాళు ఇంగ్లాండునుండి ఇండియాకు వచ్చేశారు. మోడరన్ రివ్యూలో అనేక వ్యాసాలు వ్రాసేవాడు. అందులో అతి ముఖ్యమైన వ్యాసం "ఇండియాను సాంఘికంగా జయించడం (Social Conquest of India)". ఈ వ్యాసాన్ని ఇండియా ప్రభుత్వం నిషేధించింది. ఈ వ్యాసం యొక్క సారాంశం యిది:

ఒక దేశాన్ని మరొక దేశం కత్తిబట్టి పశుబలంతో జయించి ప్రజలను బానిసలుగా చేసికొనుట సులభమే. కాని, కలకాలం కత్తితో పరిపాలన సాగించడం కల్ల. ఒక జాతిని మరొక జాతి ఆజన్మ దాసులుగా చేసుకోవాలంటే వారిని ఆధ్యాత్మికంగా, నైతికంగా, వైజ్ఞానికంగా వశపరచుకోవాలి. అందుచేతనే బ్రిటిష్ ప్రభుత్వం క్రైస్తవ మత ప్రచారాన్ని శక్తివంచన లేకుండా సాగించింది. గుడు

పదవిని పొందడానికి ప్రయత్నించింది. మన దేశ భాషలను సాంప్రదాయాలను, విజ్ఞానాన్ని విచ్ఛిన్న పరుస్తున్నది. ఈ విధంగానే పూర్వం ఆర్యులు ప్రస్తుతం పంచము లనబడే ఆదిమ నివాసులను మత విషయికంగాను, ఆధ్యాత్మికంగాను జయించినందువల్లనే వారిని ఆజన్మదాసులుగా చేసుకో గలిగారు. ఆర్యులు అనార్యులకు ఏనాడు మత గురువు లయ్యారో ఆనాడే వారి పరిపాలనకు కత్తితో అవసరం లేకుండా సిరపడిపోయింది. అయితే ఆంగ్లేయులు వివిధ సంస్థలలో పెత్తనాన్ని స్థాపించుకొని నాయకు లయినప్పటికి, భారతీయుల మీద ఆధ్యాత్మిక యాజమాన్యాన్ని మాత్రం సంపాదించి గురుపదవిని పొందలేక పోయారు. పైన చెప్పినట్లు క్రైస్తవ మత ప్రచారం ప్రబలంగా సాగించినప్పటికి, వారి ప్రయత్నం నెరవేరలేదు. కారణం మనం మత విషయికంగాను, తత్వశాస్త్రజ్ఞానంలోను క్రైస్తవులకంటె అధికంగా అభివృద్ధి చెందివుండడమే. కాబట్టి వారా ప్రయత్నంలో విఫలు లయ్యారు. అందుచేత వీరు మరొక ఎత్తుగడ వేశారు. హింసామతమే తక్కిన మతములకన్న కడుశ్రేష్ఠమని పొగడుతూ హింసామత సంస్థలకు గురువు లగుటకు అనిబిసెంటు, లెడ్‌బీటరులాగా ప్రయత్నిస్తున్నారు. పాలకులే మతగురువులై వారి పాలన శాశ్వతంగా, నిరాటంకంగా సాగే కత్తితో పని వుండదు. కాబట్టి మాత్రం కూడ సాగనివ్వ

వ్యాసాలను హరదయాళ్ ప్రాస్తూ వచ్చారు. విభిన్న వేదికలపై ఉపన్యసిస్తూ వచ్చారు.

బ్రిటిష్ ప్రభుత్వ నిర్బంధం

ఈ విధంగా హరదయాళ్ రాజకీయ విప్లవ ప్రబోధాలను సాగిస్తుంటే ఇండియా ప్రభుత్వానికి కన్నుకుట్టింది. ఆకాలంలోనే అరవింద ఘోష్‌గారు బెంగాలులో విప్లవం ప్రారంభించారు. భారతదేశ మంతటా ఎందరో దేశ భక్తులు జైళ్ళపాలయ్యారు. హరదయాళు పోలీసు బాధలకు గురి అయ్యాడు. ప్రభుత్వ బాధలను పడలేక ఇటలీ దేశభక్తుడు మాజినీలాగా విదేశాలకు వెళ్ళిపోయాడు. ఇండియా స్వాతంత్ర్య సమరాన్ని మాజినీవలె విదేశాల్లో వుండి సాగించవచ్చని ఆయన భావం. మొదట ఇంగ్లాండుకు వెళ్ళాడు. కాని బ్రిటీష్ ప్రభుత్వం అక్కడినుంచి తరిమివేసింది. రష్యా విప్లవయోధుడు-ప్రిన్స్ క్రోపాట్కిన్ లాగా దేశదేశాలు తిరుగుతూ అక్కడి ప్రజల జప్తనిష్టూరాల నివారణార్థం ప్రయత్నాలు సాగిస్తూ, ఆ యా ప్రభుత్వాలచే తరిమివేయబడి చిట్టచివరకు అమెరికా చేరుకున్నాడు. ♦

♦ గడచిన 150 సం॥లలో మూడు గొప్ప ఆదర్శ
జరిగాయి. మొదటిది ఫ్రాన్స్‌లో సుమారు
ము తరువాత విప్లవాలకు విప్లవ
రెండవది ఇటలీలో 1850

అమెరికాలో హరదయాళ్ వివిధదేశాల స్వాతంత్ర్యోద్యమ చరిత్రలను, గొప్ప రాజకీయ వేత్తల, అర్థశాస్త్రజ్ఞుల రచనలను చదువసాగాడు. "కారల్ మార్క్స్ అభినవ ఋషి (Karl marx - the modern rishi) అనే వ్యాసాన్ని మోడరను రెవ్యూలో 1910 సం॥ ప్రాంతంలో వ్రాశాడు. కాలిఫోర్నియా రాష్ట్రంలో స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో అనార్కిజాన్ని గూర్చి బోధించుతూ తత్వశాస్త్రాలన్నిటిలోను దానికంటె శ్రేష్ఠమైనది లేదని నిష్కర్షగా వాదిస్తూ వచ్చారు. తత్ఫలితంగా అక్కడకూడా ఉద్యోగానికి ఉద్వాసం జరిగింది.

వివిధ దేశాల విప్లవకారులు

ఆ కాలంలో వివిధ దేశాలకు సంబంధించిన విప్లవ సంఘాలు సేన్‌ఫ్రాన్సిస్కోలో వుండేవి. అంటే రష్యా, ఐర్లండు, టర్కీ, ఈజిప్టు, [redacted]యిన్, చైనా, జపాన్ మొదలయిన అనేక దేశాల విప్లవసంఘాలు వీటన్నిటిలోను హరదయాళ్ది ప్రముఖ పాత్ర. అప్పుడే (1913 సం॥) గదర్

సంవత్సర ప్రాంతంలో జరిగింది. అప్పటినుండి జరిగిన విప్లవాలకు ఇటలీ - ముఖ్యంగా మాజినీ ఆదర్శమూర్తి అయ్యాడు. మూడవది రష్యాలో 1917లో జరిగిన విప్లవం. అప్పటినుండి ఏ దేశంలో విప్లవం జరిగినా రష్యా విప్లవ ఛాయలు కనపడుతున్నవి. కాబట్టి హరదయాళ్, అరవింద, సన్‌యట్ సేన్ గార్లకు మాజినీ మార్గదర్శకుడయ్యాడు.

పార్టీని స్థాపించాడు. ఆయన ఇంగ్లీషు, ఫ్రెంచి, సంస్కృతము, ఉర్దూ, పర్షియన్ భాషలలో గొప్ప పండితుడు, ఉపన్యాసకుడు, రచయితాను. ఆయా దేశాల్లో విప్లవ నాయకులు ప్రచ్ఛన్నంగా ఉండి, వారి వారి స్వాతంత్ర్యోద్యమాలను ఏ విధంగా నడుపుతున్నారో ఆయా దేశాలనాయకులచే మాకుపన్యాసా లిప్పించేవాడు. వీరిలో రష్యన్ విప్లవ నాయకులు కూడా ఉండేవారు. బ్రిటిష్ ప్రభుత్వం భారతీయ విప్లవ నాయకులను దేశాంతర శిక్ష విధించి, అండమాన్ దీవులకు పంపుతున్నట్లే, అప్పట్లో రష్యా విప్లవకారులను యేడాది పొడుగునా మంచుమయమైవుండే సైబీరియాకు రష్యన్ జారు ప్రభుత్వం పంపుతూండేది. సైబీరియానుంచి తప్పించుకొని అమెరికాకు వచ్చినవీరులు వారు. ట్రాట్స్కీ అనే రష్యన్ విప్లవ నాయకుడు కూడా మా గదర్ పార్టీ సమావేశాల్లో ఉపన్యసించారు. అప్పట్లో ఆయన అంతగా ప్రసిద్ధి చెందలా. పూల అంగడి పెట్టుకొని జీవిస్తూ తన మాతృభాషలో ఒక విప్లవ పత్రికను నడుపుతూండేవాడు.[1]

---

[1] ఈ విధంగా వివిధ దేశాల విప్లవ వీరులవల్ల స్వాతంత్ర్యోద్యమాలను గురించీ, వారి సాహసకార్యములను గురించీ వినుటవల్ల మేముకూడ అలాంటి మానవాభ్యుదయోద్యమాలలో కలసి పనిచేస్తున్నామని గర్వపడుతూండే వాళ్ళం. మాలో వుత్సాహము, త్యాగము అభివృద్ధి అవుతూ వచ్చాయి.

గదర్ పార్టీలో

గదర్ పార్టీ సన్నాహం

హరదయాళుని గొప్పవా డనటానికి అనేక ముఖ్య కారణా లున్నాయి. ఆయన పదే పదే ఆలోచించుకొని స్థిరపరుచుకొన్న ఆదర్శాలను ఆచరణలో పెట్టేవాడు. ఇతరులకు బోధించిన ప్రకారం ఆచరించేవాడు. నిరాడంబర జీవి. ఉన్నతాదర్శాలు, ఋజు ప్రవర్తన గల తత్వవేత్త. ఈ విప్లవ యోధునిచే మే మందరం ఆకర్షింపబడేవాళ్ళం. "గదర్ పార్టీ వీరులు" అనే పుస్తకంలో అభిమన్యుల్లాంటి అసమాన వీరులైన కర్తార్ సింగ్, కేదార్‌నాథ్ మొదలగు వారిని గురించి చదివే వుంటారు. వీరు లాహోర్ కుట్ర కేసులో ఉరితీయబడ్డారు. వీరు విద్యార్థి రంగంలోనుంచి వచ్చిన హరదయాళుని శిష్యకోటిలో ముఖ్యులు.

గదర్ పార్టీ పత్రిక దేశదేశాలకు పాకిపోయింది. ద్రవ్యసహాయం విస్తారంగా రా సాగింది. ఆర్థిక బాధలు లేవు. జన సహాయం, వాలంటీర్ల సహాయం విస్తారంగా ఏర్పడసాగింది. అనేకులు వచ్చి పనిచేయసాగారు. అనేక దేశాల్లో అనేకచోట్ల సానిక గదర్ పార్టీ ఆఫీసులు ఏర్పడినై. పార్టీ రెప రెపా పెరిగిపోతోంది. బ్రిటిష్ సామ్రాజ్య ప్రభుత్వానికి ఆయువుపట్టయిన పంజాబీ సేనలో గదర్ ప్రచారం ప్రారంభమైంది. మన విదేశపాలకుల గుండెలు దడదడ కొట్టుకోసాగాయి.

హర్దయాళ్ అరెస్టు - అలజడి

ఇక ఊరుకోలేక బ్రిటిష్ ప్రభుత్వం తన కుట్రలు ప్రారంభించింది. కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాసనసభ్యులను, ఉన్నతోద్యోగులకు డబ్బు వెదజల్లి కొనివేసింది. చివరకు హరదయాళు మీద కేసు బనాయించి అరెసు చేయించింది.

హరదయాళుని తక్షణమే విడుదల చేయమని అమెరికా కాలేజీల ప్రొఫెసర్లు, పత్రికా సంపాదకులు, మేధావులు, తత్వశాస్త్రజ్ఞులు. విద్యాధికులు మొదలగు అభ్యుదయవాదులు అతి ఆగ్రహంతో ఆందోళన చేయసాగారు. ఒక ఐరిష్ విప్లవ వీర రమణి రు. 35,000 లు జామీనిచ్చి హరదయాళుని విడుదల చేయించింది.

అప్పట్లో అమెరికాకు వుడ్రో విల్సన్ ప్రెసిడెంటు. హరదయాళుని మీద పెట్టిన కేసు ఆయనకు సుతరామూ యిష్టంలేదు. ఆయన ఆంతరంగిక కార్యదర్శి విలియమ్ జెన్నింగ్సు బ్రయన్‌గారికి కూడా యిష్టంలేదు.

బ్రిటన్ అమెరికాల మధ్య పోటీ

అప్పటికే (1914 సం॥) ఇంగ్లాండు అమెరికాలమధ్య వ్యాపారపోటీ ప్రపంచమంతటా వ్యాపించినది. ఇంగ్లాండును ప్రపంచంలో అగ్రస్థానా న్నుంచి తొలగించి, ఆ స్థానాన్ని ఆమెరికా ఆక్రమించాలని ప్రయత్నించుచుండిన పార్టీలో

గదర్ పార్టీలో

బ్రబయన్ ముఖ్యుడు. ఇండియాకు వచ్చి పరిస్థితులను లించి బ్రిటిష్ ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఒక పుకాన్ని బ్రబయన్ వ్రాశాడు. దానివల్ల నశించిన బ్రాదరప ణను తిరిగి సంపాయించగోరి, బ్రిటను - అమెరికా మాజీ బ్రెసిడెంటు ఫ్రెడరిక్ రూజువెల్టును తమ దేశానికి రప్పించి, తమ సామ్రాజ్య రాజనీతిని పొగిడేలాగా ప్రోత్సాహ పరచింది.

హర్దయాళ్‌పై అమెరికా బహిష్కారం

అమెరికా ప్రెసిడెంటు, ప్రయివేటు సెక్రెటరీ - ఇద్దరూ హరిదయాళు కేసును తొలగించడానికి శాయశక్తులా పాటుపడ్డారు. కాని, అమెరికా ప్రభుత్వనిర్మాణచట్టం అనుకూలించలేదు. అమెరికా సంయుక్తరాష్ట్రాలలో ప్రతి రాష్ట్రానికి స్వపరిపాలన (autonomy) అత్యధికంగా వుంటుంది. హరదయాళు కేసులో చట్టప్రకారం కేంద్రప్రభుత్వం జోక్యం కలుగజేసికో జాలదు. అందువల్ల హరదయాళుని అమెరికాను వదలివెళ్లమని సలహాయిచ్చారు. ఆయన్ను మార్గం మధ్యలో అడ్డుపెట్టవద్దని రహస్యంగా వివిధరాష్ట్రాల అధికారులకు సలహా యిచ్చారు. అందువల్ల హరదయాళు స్విట్జర్‌లాండుకు వెళ్ళాడు.

ప్రథమ ప్రపంచ సంగ్రామం ప్రారంభమైనవెంటనే హరదయాళ్ జర్మనీ, టర్కీలతో కలసి ఇంగ్లాండుపై పోట్లాడాడు. అటు తరువాత స్వీడనులో సర్వకళాశాలలో

ఘసుగా చేరాడు. ఆయన్ను మాతృభూమికి రప్పించు
ం చేయబడిన కాంగ్రెసు నాయకుల ప్రయత్నాలు నెర
వేరలేదు. లండనులో నివసించుటకు మాత్రమే మన
విదేశీ ప్రభువులు అంగీకరించారు. కొద్ది వారాలలో లండ
నులో హరదయాళ్ చనిపోయారు.

నా జీవిత దృక్పథంలో కొందరు మహనీయులు
మార్పులను తేగలిగారు. వారందరిలోను హరదయాళు
నా మాతృదేశ స్వాతంత్ర్యోద్యమానికి ప్రాణత్యాగము
నైతం చేయుటకు సంకల్పించుకోనేలాగు నన్ను మార్చి
వేసిని. నాలాగే వేలవేలమంది ఆయనప్రభావంవల్ల మారి
పోయారు. గదరు ఉద్యమంలో ఎందరో ఉరికంబా
లెక్కారు;తుపాకికాల్పులకు రొమ్మువిరిచి నిలబడ్డారు; అండ
మానులో నిరాహారదీక్షలో మరణించారు. హరదయాళు
అద్భుతశక్తిని విపులంగా వ్రాయగలశక్తి నాకు లేదు*

---

* హరదయాళుని గొప్పతనాన్ని గురించి కొన్ని నా అనుభవంలో తెలిసినవిషయాలు.

1. తన బట్టలమీద శ్రద్ధపెట్టుకోడు. తన ఓవరు కోటు చాలా పాతది. క్రొత్తది కొనవలసిందని ఎంతో చెప్పితిమి. వినిపించుకోలేదు. కోటును దాచిపెట్టాము. కొంది రోజులకు ఒక పాతకోటు వేసుకొనివచ్చి "చూడండి! మంచికోటు ! చౌకగా కొన్నాను" అన్నాడు. చూచాము- ఏనో రంధ్రాలుఉన్నై. ఎంత చెప్పినా ఉపయోగముండ దని బట్టలు విషయంలో చెప్పడం మానేశాము.

2. మరొకప్పుడు బూటులు అరిగి చిల్లులు పడ్డాయి. వర్షపు నీరు లోపలికి వచ్చేది. జలుబు, జ్వరం వస్తుందేమోనని భయపడితిమి. ఎంత చెప్పినా కొత్తవికొనలేదు. మేమే ఒక జతకొని, రాత్రిసమయంలో నిద్రపోతూండగా పాతవాటిస్థలంలో కొత్తవిపెట్టి, పాతవాటిని మూరంగా ఎత్తుకవెళ్ళి పారవేస్తిమి. తెల్లవారిలేచి పాతబూటులు మరి కొంతకాలము ఉపయోగపడునని వెతకడం ప్రారంభించాడు.

3. గదరుపార్టీ ఆఫీసులో భోంచేస్తూ వుంటిమి. మాలో ఒకరైన గోవింద బిహారీలాల్ (1949లో అమెరికానుండి ఇండియాకు వచ్చి ఇండియన్ సైన్సు కాంగ్రెసు చరిత్ర వ్రాస్తున్న ప్రముఖ జర్నలిస్టు) ఉప్పు చాలదన్నాడు. "రాత్రికి కొంచెము ఎక్కువతినులే!"అన్నాడు. లాల్ ముఖం చిన్నపోయింది. హృదయాళుకు రుచులబూద దృష్టే వుండదు.

4. ఒక ఉదయం కాఫీ త్రాగుచుండగా తినుటకు ఏమీ ఉండలేదు. యువకులు అటూఇటూ వెతుకనారంభించిరి. రాత్రి మంచి బిస్కత్తులు తెచ్చానని పెద్ద పార్సెలు తెరిచాడు. నోటిలో పెట్టుకొన్నాము. కొరికితే పండ్లు విరిగేలాగు గట్టిగా వుండినయి. "భాయిజి! ఏలాగు తినడం" అని నవ్వసాగితిమి. "ఏముందీ! కాఫీలోముంచితే నానుతాయి"అని నవ్వాడు. ఆయన ఏమితింటూవున్నాడో

ఏలాంటి రుచో యీ విప్లవయోధునికి తెలియదు. ఎక్కడో ఆలోచన ! ఎక్కడో చూపు !

5. తెల్లవారు జామున చూడగా మెల్లమీద పడుకొని యుండెను. తనగదిలో తన మంచముమీద ఎందుకు పడుకోలేదు ? అని అడిగితిమి. "రాత్రి రెండు ఘంటలకు వచ్చాను. మీరందరు గాఢనిద్రలో వుంటిరి. మీ నిద్రను పాడుచేయుటకు యిష్టం లేకపోయినది" అన్నాడు. ఎంత సంస్కారము ?

6. ఢిల్లీనుండి తనభార్య నెలనెలకు రు 100- లు పంపుచుండెను. తనకు డబ్బుమీద నమ్మకంలేదు. తాను ఒక అనార్కిస్టు. అడిగినవారికల్లా యిచ్చేవాడు. మూడు నాలుగు రోజులలో చిల్లిగవ్వకూడా తనవద్ద మిగలదు. ఆకలయినప్పుడు సమీపంలో కనపడ్డ స్నేహితుని యింటికి వెళ్ళేవాడు. స్నేహితులకు ఆయన విషయాలు బాగా తెలుసు. వారే భోజనం పెట్టేరు.

7. అనార్కిస్టులు, సోషలిస్టులు కమ్యూనిస్టులు, సిండికలిస్టులు, విప్లవకారులు మొదలయిన వివిధదేశాల అభ్యుదయవాదులు ఏదోవార్షికోత్సవము జరుపుకొనుచుండిరి. వెయ్యి మందికిపైగా స్త్రీ పురుషులు మీటింగుకు వచ్చిరి. హృదయాళుని ఉపన్యాసం గొప్పగా వుంది. చప్పట్లు విపరీతంగా కొట్టుచుండిరి; టోపీలు ఎగురవేస్తుండిరి. ఒక అందమైన స్త్రీ పుష్పహారం ఎక్కడ హృదయాళుని మెడ్డ పెట్టుకున్నది. 'మరొకతడవ' అని

జితేంద్ర నాథ లాహిరి

అమెరికాలోని పంజాబుకార్మికులలోను, భారతీయ విద్యార్థులలోను దేశభక్తి రేకెత్తించి, విప్లవ బీజాలను నాటింది శ్రీ లాలా హరదయాళుగారు. ఐతే గదరుపార్టీని స్థాపించమని నిర్మాణయుక్తంగా ఒక ప్లానునిచ్చి అమెరికాలోని భారతవిద్యార్థులను పెరరిష్టులుగాను, గొరిల్లా యోధులుగాను తర్ఫీదునిచ్చినది బంగాళా విద్యార్థి జితేంద్రనాథ లాహిరి♦ వీరు బెంగాలులో పెరరిష్టు నాయకులలో ఒకరు. ప్రచ్ఛన్నంగానుండే కార్యకర్తలలో నొకరు. బెంగాలు విభజనకాలంలో బహిరంగసభలో ఉపన్యసించుచూన్న ఒకగవర్నరును రివాల్వరుతో కాల్చి చేజిక్కక తప్పించుకొన్నది. ఈ లాహిరే. గ

ందరు ఎందుకు అలాచేశావో చెప్పమని మరికొందరు న్నారు. ఆమె శీలవతియని అందరికీ తెలుసు. "హరదయాళ్ ధైర్యసాహసాల్లో సాటిలేనివాడు. అలాంటి వానిని యిద్దుపెట్టుకొనే అదృష్టంలభించింది" అని అన్నది. ఆయను గురించి ఈలాంటి వాస్తవగాథలు ఎన్నోవున్నాయి.

♦ ఇదివరకు బొంబాయిలోని "పీపుల్సు పబ్లిషింగు హౌస్" వారు ప్రచురించిన "గదరు వీరులు" "సర్దార్ పృథ్వీసింగు" మొదలగు గ్రంథములలో గదరు పార్టీ పుట్టుకను గురించి సరిగా వ్రాయబడలేదు. జితేంద్రనాథ లాహిరీపేరు నేలేదు. గ్రంథకర్తలకు వివరములను యిచ్చిన గదరు

లాహిరీ కలకత్తా యూనివర్సిటీలో బి. యస్. సి. (కెమిస్ట్రీ) లో ప్రథముడుగా ఉత్తీర్ణుడైన మేధావి. బెంగాలీ యువకులకు తర్ఫీదిచ్చి పెరరిష్టులనుగా చేశాడు. పోలీసులతో పోటాడుట, ఆయుధములను సంపాదించుట, బాంబులు వేయుట, మొదలగు ధైర్యసాహసకృత్యాలలో ఆరితేరాడు. శత్రువులకు పట్టుబడకుండా తప్పించుకోనుటలో నేర్పరి. ఉపన్యాసకుడుకాడు; రచయితాకాడు; కాని నిపుణుడైన నిర్మాత. యువకులనేకులను సంఘటితపరచి, వారిచేత అనేక మహాకార్యములను చేయించే సూత్రధారుడు.

బాబాలు, నాయకులకు సయితం, ఈ విషయం తెలియదు. గదరు పార్టీని నిర్మించిన కొంతకాలానికి వీరు పార్టీలోచేరి, గదరు ఉద్యమాన్ని ఎంతో వృద్ధికితెచ్చిరి. గదరు పార్టీని స్థాపించినవారిలో నే నొక సభ్యుడను. అందువలన యీ వివరాలను వ్రాయగలుగుచున్నాను. స్థాపించిన సభ్యులలో మరొకరు మాత్రమే జీవించివున్నారు. (ప్రొఫెసరు రంజిత్ సింగ్ జెయిన్, బెనారస్ హిందూ యూనివర్సిటీ.)

ఈ విషయం లాహిరీని అడిగాను. "ఎవరు కాల్చారు అనేది అంతముఖ్యంకాదు. బాహాటంగా ఎంత ధైర్యసాహసాలతో ఒకకార్యాన్ని నిర్వహిస్తామో అది అంత భద్రమైనది. ('The Breavst deed is the Safest') అనే సూత్రం పెరరిష్టు ఎత్తులలో ప్రధానమైనది. ఇందుకు కాల్పే ఉదాహరణ" అని అనేక వివరాలను అతివిపులంగా

తిలక్ ప్రోత్సాహం

వంగ విభజన తరువాత బయలుదేరిన విప్లవోద్యమములో బెంగాలీ యువకులకు ఆత్మరక్షణకు సంబంధించిన విద్యలను, అనగా కత్తిసాము, లాఠీతిప్పుట, కుస్తీ, బాక్సింగు మొదలయినవి నేర్పుట అత్యవసరమని తిలకు మహాశయుడు భావించాడు. కత్తి సాములో మహారాష్ట్రం ప్రసిద్ధి కెక్కింది. ఈ విషయంలో మహారాష్ట్ర మంతటికి అజేయుడనిపించుకొన్న యోధుని అరవింద ఘోష్ గారి వద్దకు తిలకు మహాశయుడు తీసుకవెళ్ళారి. "మా బెంగాలీ యువకులు కూడా స్వయం సంరక్షక శిక్షణలో నిపుణులవుతూ వచ్చారు. అయితే వారి కృషి ఎంతవరకు సఫలీకృత మయినదో నాకు బాగా తెలియదు; పోటీ పెట్టి చూద్దాం" అని అరవింద ఘోష్ గారు తిలకు గారికి సూచించిరి. అయితే కత్తిసాములో బెంగాలీ యువకులలో సాటిలేనివాడనిపించుకొన్న వ్యక్తిగాని, రెండవవాడుకాని ఆ సమయంలో లేకపోవడం వల్ల నూతోవాడుగా పరిగణించబడ్డ జితేంద్రనాథ లాహిరీని ఆ మహారాష్ట్రినితో పోటీ చేయమన్నారు. పోటీలో రెండు నిముషములలో

ఆయన చెప్పుతూంటే శరీరం పులకరించేది... టెరరిజం (Terrorism) అనగా నిరంకుశ ప్రభుత్వంలో ప్రజలను హింసించే ప్రభుత్వాధికారులను విప్లవపార్టీవాళ్ళు చంపివేయుటే.

మహారాష్ట్ర యోధుడు ఓడిపోయాడు. తిలకుగారి ఆనందా శ్చర్యాలకు అంతులేకుండా పోయింది. లాహిరీని కౌగ లించుకొని అంత అవలీలగా ఎలాగు ఓడించావో చెప్ప మన్నారు. "మొదట్లో దెబ్బ కాచుకుంటూ వుండి ఎదిరి యొక్క సామర్థ్యాలను, లోపాలను ఒక నిముషంలోనే గ్రహించాను. మరుక్షణమే విజృంభించి ఓడించాను" అని లాహిరీ వివరించారు. "సాము విద్యలో ఎలా ఇంత నేర్పరులు కావిగారో" చెప్పమన్నారు తిలకుగారు. బెంగాలు విప్లవోద్యమం ప్రారంభం కాగానే తెల్లసోల్జర్ తోను, పోలీసులతోను పోట్లాటలు ప్రారంభమైనయి. స్వయంరక్షక శిక్షణాలోను, ఆటల (స్పోర్ట్సు) లోను ఆంగ్లే యుల కన్న బెంగాలీలే మేటికావలెనని సంకల్పించుకొని ప్రయత్నించవలసి వచ్చినది. కత్తిసాములో నేర్పరియైన బెంగాలీ యువకుని ఇతర దేశాల్లో నేర్చుకొనిరమ్మని పర్షియా, ఇటలీ, ఫ్రాన్సు, స్పెయిను దేశాలకు పంపాము. ఈ నేర్పరి ఆరితేరి వచ్చి మాకు నేర్పాడు. అలాగే ప్రతి విద్యయందును విప్లవసంఘం నేర్పు సంపాదిస్తున్నదని లాహిరీ చెప్పిరి. బెంగాలీల విప్లవ కార్యసాధనను తిలకు గారు ప్రశంసించారు.

మందు గుండు, బాంబులు తయారుచేయుట మొద లగు ప్రేలుడు (Explosives) వస్తువులలో క్రొత్తవిషయా లను కనిపెట్టడానికి(Researches). సైనిక విద్యను అభ్య సించడానికి, బెంగాల్‌విప్లవపార్టీవారు లాహిరీని అమెరికాకు

పంపిరి. (లాహిరీ రసాయన శాస్త్రంలో కలకత్తా విశ్వ విద్యాలయంలో ప్రథముడుగా ఉత్తీర్ణు డయ్యాడు. సర్. పి. సి. రేగారి ప్రియ శిష్యుడు.) కాలిఫోర్నియా యూనివర్సిటీలో కెమిస్ట్రీలో యం. యస్. సి. క్లాసులో చేరి "యకే న్లోజివ్ను" లో పరిశోధన చేయుచుండిరి.

విప్లవ శిక్షణ

లాలాహరదయాళుగారి ప్రబోధ ఫలితంగా దేశ స్వాతంత్ర్యోద్యమము కొరకు ప్రాణత్యాగము సయితము చేయుటకు సంసిద్ధులయిన విద్యార్థి లందరికీ ప్రత్యేకంగా ఒక హాస్టలు పెట్టించాడు లాహిరీ. వారిలో నే నొకడిని. "టెరరిజమ్" పద్ధతిని, గొరిల్లా యుద్ధవిధానాన్ని మాకు నేర్పసాగాడు. కత్తిసాము, కుస్తీ, బాక్సింగు మొదలగు స్వయంసంరక్షక విద్యలేగాక, తోటాలు చెయ్యడం, రివాల్వారు, తుపాకీలు కాల్చడం మొదలయినవి నేర్పాడు.

బెంగాలీ విప్లవకారులు బాక్సింగుకు ప్రాముఖ్యత నిచ్చారు. వారి అనుభవం వల్ల అలాచేశారు. ఎందుకంటే, మన యువకులు సాధారణంగా తెల్లదొరలను చూస్తే భయపడుతారు. ఈ భయాన్ని పోగొట్టాలి. సోలర్ మీద పోట్లాడమని కవ్వించేవారు. ఈలాంటి పోట్లాటల్లో కుస్తీ కంటె బాక్సింగు ఎక్కువ ప్రయోజనకారి యని తెలుసు కున్నాను. మాకుగూడ బాక్సింగులో మంచి శిక్షణ యిచ్చాడు. ఇంతేకాదు; మాలో విప్లవ భావాలు, దేశ

భక్తి, త్యాగదీక్ష, ధైర్య శౌర్య-సాహసాలు పెంపొందించ టానికి అనేక ఉద్గ్రంథాలను మాచే చదివించాడు. వాటిలో ముఖ్యమైనవి: విప్లవ చరిత్రలు (ఫ్రాన్సు, రష్యా, ఇటలీ, చైనా, ఇంగ్లాండులను గూర్చినవి); విప్లవ వీరుల జీవితగాథలు - ముఖ్యంగా ఫ్రెంచి విప్లవాన్ని గురించి, రూసో సోషల్ కాంట్రాక్టు, మాజినీ 'డ్యూటీస్ ఆఫ్ మాన్' (మానవుని విధులు); దేశభక్తుల ప్రచ్ఛన్న జీవితాలను, సాహస కృత్యాలు, కారాగృహ అనుభవాలను చిత్రించే గ్రంథాలు చదివేవాళ్ళం. ♦

♦ ప్రిన్సు క్రోపాట్కిన్ తన జైలు జీవితాన్ని చిత్రిం చిన గ్రంథం నాకు బాగా నచ్చింది; అందువల్ల ఆయన వ్రాసిన గ్రంథ రాజముల నన్నింటిని చదివితిని. ఆయన "పరస్పర సహాయం" (Mutual Aid) అనే గ్రంథమును చదివి, సంఘం ఎలా అభివృద్ధి చెందుతుందో తెలిసికో గలిగాను. "పొలాలు, ఫ్యాక్టరీలు, కారానాలు" Fields, factories an5 workshops) అనే గ్రంథంలో ప్రతి దేశంలో కావలసినన్ని సహజ సంపదలు (Natural re-sources) వున్నవని, అభివృద్ధి చెందుచున్న శాస్త్రీయ విధానాల ద్వారా వాటిని మన హస్తగతం చేసికొని, ఆ దేశ ప్రజల నిత్యజీవితావసరాలన్నింటికి సమృద్ధిగా ఉప యోగపడే లాగు చెయ్యవచ్చునని, పరదేశాలను జయించి అక్కడి ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పిచేయ నవసరంలేదని స్పష్టం చేశాడు. అప్పట్లో పరిణామ సిద్ధాంతాన్ని

రాణా ప్రతాప్‌సింగు, గురు గోవిందసింగ్ మొదలగు వీరోత్తముల జీవితాలు నన్ను అమోఘంగా ఆకర్షించాయి. ఇవిగాక, అనేక సాంఘిక రాజకీయ గ్రంథాలను చదివేలాగు చేశాడు లాహిరీ. సావర్కారుగారి భారత స్వాతంత్ర్యసమరం (Indian War of Independence) అను పుస్తకాన్ని చదువుచున్నప్పుడు బ్రిటీషు పాలనలో మనదేశం ఎంత అధోగతికి వచ్చిందో కన్నులకు కట్టినట్లు స్పష్టమైంది. బ్రిటీషు సామ్రాజ్యాన్ని నాశనం చెయ్యవలె

(Theory of evolution) ప్రతిపాదించిన డార్విన్ (Darwin) పోటీ ప్రకృతిసిద్ధమని, ఒక దేశం మరొక దేశాన్ని దోచుకోవడం, ఒక వ్యక్తి మరొక వ్యక్తి దోచుకోవడం సహజమేనని చెప్పాడు. దీనివల్ల ఒక తత్వశాస్త్రమే ఏర్పడింది. దీనిని పెట్టుబడిదారులు, ఇంపీరియలిస్టులు తమ స్వార్థానికి ఉపయోగించుచుండిరి. ఈ నీతి బాహ్యమైన దృక్పథాన్ని ఖండించుచు క్రోపాట్కిన్ పైన జెప్పబడిన గ్రంథాలలో శాస్త్రీయంగా వివరించాడు. ఒక్క మానవజీవితంలోనే గాక, పెంపొందే పశు పక్ష్యాదులలో కూడ అభివృద్ధికి "పరస్పర సహాయసూత్రం" అని స్పష్టీకరించాడు ... అనాదిగ మను తత్వశాస్త్రమును గురించి వ్రాసిన గ్రంథాలలో మనుష్యుడు ఇంకనూ ఎంతసంస్కృతి పొందగలడో, నైతికంగాను, ఆధ్యాత్మికంగాను మనుష్యుడు ఎంత అభివృద్ధికి రాగలడో, అట్టి మానవ సంఘం ఎలాగుండునో ఈ వేదాంతి వ్రాశాడు.

ననే ఉద్రేకం పుట్టేది. కర్నలు టాడ్ అనే ఆంగ్లేయుడు వ్రాసిన "రాజసాన కథావళి" చదివినప్పుడు, మన దేశ స్వాతంత్ర్యం కొరకు మన పూర్వులు చేసిన అఖండ త్యాగాలు అనంతమైనవని గర్వపడే వాణ్ణి. రమేశచంద్ర దత్తుగారి గ్రంథరాజాలు 'బ్రిటిష్ ఇండియా ఆర్థిక చరిత్ర' చదివాను. బ్రిటీషు సామ్రాజ్యతత్వం మన దేశాన్ని ఏవిధంగా దోస్తూ మన ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పిచేసిందో, తత్ఫలితంగా క్షామదేవత మనదేశంలో ఏవిధంగా సుస్థిర నివాసం ఏర్పరచుకొని విలయతాండవం చేస్తున్నదో నాకు స్పష్టంగా బోధపడ్డది. ఇటలీ స్వాతంత్ర్యోద్యమ నాయకుడు మాజినీ వ్రాసిన "మానవుని బాధ్యతలు" అనే గ్రంథాన్ని చదువగానే భారత బంధవిముక్తి కొరకు నా జీవితాన్ని అర్పించడం నా విద్యుక్తధర్మం అను నా సంకల్పం స్థిరపడసాగింది. మాక్స్‌ముల్లరు లండనులో ఐ. సి. యస్. విద్యార్థులకు ఇచ్చిన ఉపన్యాసాలు చదివితిని. అతి పురాతనకాలంలో కూడ. భారతజాతి నాగరికత ఎంత ఉత్కృష్ట స్థితిలో వుందో గ్రహించి గర్వపడ్డాను.

వంగ విప్లవచరిత్ర విచిత్రమైనది; అద్భుతమైనది. వంగ విభజన వరకు బెంగాలీలు మాటలలో మహాశౌర్యం చూపేరేగాని, వస్తుతః కార్యశూరులుగారని అందరూ హేళన చేసేవారు. ఇండియా అంతటా బెంగాలీ లంటేనే ఉత్త వాచాలురని గౌరవముండేదికాదు. కాని, వంగ విభజన జరగగానే, వీరు ఏలాగు కార్యశూరులయ్యారో

తెలుపుటకు ఒక గాథ వున్నది. బ్రిటీషు గవర్నమెంటు మీద ప్రజలకు ఆగ్రహం, ఉద్రేకం చెలరేగిపోయినవి అవి సభలు, తీర్మానాల మూలకంగా మాత్రమే ప్రదర్శిత మైనవి. అట్టి తరుణంలో లాలా లజపతిరాయిగారు కలకత్తాలో ఉపన్యసించుతూ "నా బెంగాలీ సోదరులారా! ఎంతకాల మని ఆలోచిస్తూ కార్యశూన్యులై యుంటారు? దేశభక్తులారా! ఇక చాలు. మీ ఆలోచనలు కట్టిపెట్టండి; కార్యనిరతులు కండి; వట్టి ప్రగల్భాలవల్ల ప్రజలకు ముక్తి కలుగదు. దేశ విముక్తికి మార్గం కార్యశూరత! లెండు!" అని లాలా లజపతిరాయిగారు చేసిన ప్రబోధంవల్ల బెంగాలీలు వీరావేశపరులయ్యారు: కార్యాచరణకు నడుంకట్టారు. ఈఘట్టం బెంగాల్ చరిత్రనేకాదు, యావద్భారత చరిత్రనే మార్చింది. పెరరిష్టు ఉద్యమానికి దారితీసింది. §

పెరరిష్టుల నియమాలు

పెరరిష్టు విధానవిషయంలో ముఖ్యసూత్రాలను లాహిరీ మాకు ఈ విధంగా నేర్పాడు——

---

§ స్వాతంత్ర్యోద్యమాన్ని విచ్ఛిన్నంచేస్తూ, అడ్డంకులు కల్పించే క్రూరులను, ప్రభుత్వ తొత్తులై దేశభక్తులను హింసించే ఉద్యోగస్థులను నాశనంచేసి ప్రజాక్షేమం కోసం పాటుపడే దేశభక్తుల ఉద్యమాన్ని "పెరరిజమ్" అని అంటారు. ఈ ఉద్యమములో పాల్గొనేవారిని పెరరిష్టులంటారు. ప్రతిదేశంలోను విప్లవోద్యమ చరిత్రలో కొన్ని

1. మౌనంగా ఉండడం నేర్చుకో. (Keep your lips shut.

2. అనవసరంగా మాట్లాడకు. (Do not tell others what they need not know)

3. రహస్యాలోచనలకు బహిరంగ ప్రదేశమే భద్రమైన స్థలం (Walls have got ears).

4. ఎంత ధైర్య సాహసాలతో ఒక కార్యము నెరవేర్చగలిగితే అంత సురక్షితం (The bravest deed is the safest) .

5. రహస్య కార్యాలు యెంత తక్కువమంది కలసి చేస్తే అంత భద్రం. (The lesser number of persons involved in a conspircy, greater is the chanca of success.

ఈ సూత్రాలేగాక కొన్ని నియమాలు, నిబంధనలు కూడా వుండేవి....

1. 30 యేండ్ల వయసు వచ్చేవరకు బ్రహ్మచారిగా వుండాలి. అప్పటికే వివాహమైతే బ్రహ్మచర్యం అవలం

అంతస్థులు కనుపించును. మొదటి స్టేజి పెరరిజము. వ్యక్తిగతమైన సాహసకృత్యాలు (Adventurism) . ఇవి చివరకు విఫలం అవుతాయి, రెండదశలో ప్రజాపుద్యమము బయలుదేరుతుంది. కడపటి దశలో సాయుధపోరాటము, ఆశయసిద్ధి.

భించాలి. అయితే ఈ విషయంలో భార్యను ఒప్పించాలి. ఈ రహస్యాన్ని భార్యాభర్తలు రహస్యంగా వుంచాలి.

2. 30 యేండ్ల వయసువరకు దేశసేవలోనే నిమగ్నుడై వుండాలి. (అంతవయసు వరకు దీక్షతో వుండగలిగితే యావజ్జీవం మానవసేవా దురంధరుడై వుండగలడని వారి దృఢ విశ్వాసం.)

3. స్త్రీలు తమ మాన ప్రాణములను రక్షించుకోవాలి. కాబట్టి భార్యకు బాకును బహుమతిగా యిచ్చి, పోట్లాడటం నేర్పాలి.

4. పౌరులు తమ తమ శక్తి సామర్థ్యాలను బట్టి తమ తమ విధులను విభజించుకోవాలి.

(ఎ) బోధకులు

(బి) తాలింఖానా అధ్యాపకులు(ఆత్మరక్షణ కోసం గరిడీ, సాము, కుస్తీ, కజ్జితిప్పుట, భాక్సింగు మొదలగు విద్యలు నేర్పువారు.

(సి) పోట్లాడువారు, శత్రువులను ప్రతిఘటించి చచ్చుటకు, చంపుటకు సయితము సిద్ధపడువారు.

(డి) కార్యక్రమం నిర్ణయించి ప్లానులను వేయువారు.

(ఇ) మందుగుండు, ఆయుధములను సేకరించువారు.

(యఫ్) డబ్బును పోగుచేసేవారు.

(జి) పోలీసు, సి.ఐ.డి. శాఖలలో చేరి రహస్యములను తెచ్చేవారు.

ఈ విధంగా ప్రత్యేక కార్యకలాపాన్ని నెరవేర్చు బాధ్యతలను వారి వారి శక్తులనుబట్టి తీర్మానించుతారు.

5. ధైర్యంతో కూడిన పనులను, రహస్య కార్యములను చేయువారు అయిదుగురికన్న యెక్కువ గాకుండా వుండాలి. రహస్యం ప్రభుత్వానికి తెలిసినా అంతకంటె యెక్కువమంది నశించిపోకూడదు.

6. హింసలకు ఓర్చుకోలేని సమయంలో విషం త్రాగి గాని, ఉరివేసుకునిగాని చనిపోవాలి.

7. డబ్బును పోగుచేయుటలో ప్రభుత్వ గులాములు, తొత్తులు అయిన జమీందార్లు, గొప్ప వుద్యోగస్తుల ఇండ్లు దోచుకోవాలి. ఈ పనిని స్థానికంగా వుండేవారిచేత చేయించక యితర ప్రదేశాలవారి చేత చేయించాలి.

ఇన్ని నియమాలు, జాగ్రతలు, క్రమశిక్షణలు వుండినా బ్రిటీషు ప్రభుత్వం ఎలాగో రహస్యాలను తెలిసికొని కొందరిస్టులను నాశం చెస్తూ వుండేది.

పిరికితనం రక్తంలో లేదు

కాలిఫోర్నియా యూనివర్సిటీ బర్కిలే నగరంలో వున్నది. గదర్ పార్టీలో చేరిన భారత విద్యార్థులం ప్రత్యే

హాస్టలో యుంటిమి. దానిపేరు నలందాహాస్టలు. దానిలో పది మందిమి యుంటిమి. మా నాయకుడు జితేంద్రనాథ్ లాహిరీకి నా మీద ఎంతో ప్రేమ. మేమిరువురం ఒకే గదిలో వుంటిమి. మేమంతా కలిసిమాట్లాడుకుంటూ వేళాకోళం చేసుకొనేటప్పుడు నా మిత్రుడు వెంకయ్యనాయుడు (హైదరాబాదు - ఇంజనీరింగు విద్యార్థి) ఎగతాళిగ ఇలా గన్నాడు: "లాహిరీ! చెంచయ్యను వీరుణ్ణి, ధీరుణ్ణి, విప్లవ కారుణ్ణి చేయాలనుకుంటున్నావే! నీ ప్రయాస వృథా అవు తుంది సుమా! తరువాత విచారపడుతావు. వాడు కోమటి. అంతకంటె పిరికిజాతి ఇండియాలోనే కాదు; పృథ్వీలోనే లేదోయ్" అన్నాడు.

"పిరికితనంగాని, స్థైర్యంగాని, జాతిలక్షణం కాదు. రక్తంలో లేదు; శిక్షణలోఉంటుంది" అన్నాడు లాహిరీ. దీనితోయెగతాళి మాటలు మాయమైనవి. చివరకు అందరము అందుకున్నాం. తర్క-వితర్కాలు తీవ్రంగా ప్రారంభమయివవి.

"చంచయ్యను ధీరుణ్ణిగా చెయ్యలేవు"అని వెంకయ్య ఇతర మిత్రులు నొక్కి చెప్పారు.

"ఏం పందెం జెప్పండి?" అన్నాడు లాహిరీ.

"నీకు ఆరు నెలలు గడువు యిస్తాం. ధీరుణ్ణి చెయ్యి చూద్దాం" అని తక్కినవారు

"చెంచయ్య చేత మిమ్మల్నందరినీ తన్నిస్తే పండెమేమి?"టని లాహిరి.

"అందరం కలసి నీకు టీ పార్టీ చేస్తాం. మానవ స్వభావాన్ని తెలిసికోలేక పోతిమని మా అజ్ఞానాన్ని ఒప్పుకొంటాం. నువ్వు యివ్వబోయ్యే తర్పీదును ప్రపంచమంతటా చాటుతాం" అని అందరూ పందెం వేసుకున్నారు.

నేను సరదాగా వింటున్నా. "వీ రందరినీ నే నెలా తన్నగలను ? వీరిలో అభిమన్యుల్లాంటి కర్తార్ సింగు, ముకుందలాల్ గారు ఉండిరి. (ప్రథమ లాహోరు కుట్ర కేసులో నవ్వుతూ ఉరికంబాని కెక్కినవారు వారే). లాహిరీ నా కెలాంటి తర్పీదు నిస్తాడు?"అనే భయం,కుతూహలం నాలో రేకెత్తినయ్. ఏసందేహం యెలావున్నా, లాహిరీ శక్తిసామర్థ్యాలలో నాకు గట్టి నమ్మకం వుండేది. నేను సరే నన్నాను. కాని ఈ మాట కంఠంలో నుంచి గట్టిగా రాలేదు.

తర్పీదు

నాకు తర్పీదు ప్రారంభమైంది. బాక్సింగు, కుస్తీ, కత్తితో పోట్లాడుట, రక్తంకారినా భయపడకుండేట్లు నేర్పసాగాడు."ఆత్మరక్షణ సామర్థ్యం (Deffensive tactics) చాలదు. పోట్లాడే నైపుణ్యాన్ని (Offensive tactics) నేర్చుకో. శత్రువుపై బడి పోరే (Attack) విధానాన్ని సాధించు" అని లాహిరీ ఎంతబోధించినాసరే నాకు మాన

ఏది దొరికినాసరే, మొగిరిపోయేది. నా గురువు, లాహిరీ తప్ప విద్యార్థు లందరూ నే నెక్కడ కోప్పడతానో, నే నెక్కడ తంతానో అని నాతో ఎంతోజాగ్రతగా మాట్లాడే వారు. నాతో ఎగతాళి మాటలు, నవ్వులాటలు పోయి యి. "పిచ్చికుక్క" అని నాకు పేరుపెట్టారు. ఒకరోజున భోజనాలవద్ద చిన్న పొరపాటు మాటకు చేతిలోవుండే ఫల హారాన్ని నా గురువు లాహిరీ మొహాన కొట్టాను. అంద రికీ నామీద కోపం వచ్చింది. అందరూ నాతో మాట్లా డటం మానివేశారు. అందరూ ననున్న బాయికాట్ చేశారు. "రాక్షసుడ్ని చేశావు, అనుభవించు" అని లాహిరీని అం దరూ నిందించారు. లాహిరీ నాతో మాటాడకపోవడం నాకు చాలా మనోవ్యథను కలిగించింది.

కొన్నిరోజుల తరువాత క్షమించమని వేడుకున్నాను. రాజీపడడానికి పదిమందీ కలిశారు. లాహిరీ ఇలాగన్నాడు: "మనుష్యుడు దేవుడూ కాగలడు, రాక్షసుడూ కాగలడు. రెండు శక్తులూ మనలోనే వున్నాయి. పరులకు ఉపకారం చేసేవాడు దేవుడవుతాడు. అపకారం చేసేవాడు రాక్షసు డవుతాడు. ఇప్పుడు చంచయ్య తన శక్తిని అన్యాయాన్ని నిర్మూలించడానికి ఉపయోగించితే దేవుడవుతాడు. ఇపుడు చేసేలాగునే చేస్తూవుంటే రాక్షసుడు కాకమానడు. తన బలాన్ని, సాహసాన్ని, త్యాగాన్ని - పరులను అన్యాయం నుండి రక్షించడానికి ఉపయోగపెట్టుతానని, ప్రతిరోజూ

అలాగు ధ్యానము, సాధన చేస్తానని, దేశభక్తుడు, మానవ సేవాప్రియుడవుతానని వాగ్దానం చేస్తే, చంచయ్యతో తిరిగి మాట్లాడుతాను. లేకపోతే మాట్లాడను" అని చెప్పి లాహిరీ కూర్చున్నాడు. నే నెంతో సంతోషంతో ఒప్పుకున్నాను. అందరూ నన్ను కౌగలించుకొన్నారు. లాహిరీ తనపంతం గెలిచాడు. నా మనసులో బరువు యెంతో దిగిపోయినట్టయింది.

అటు తరువాత, అయిదు సంవత్సరాలకాలం గదర్ పార్టీ కార్యక్రమం వల్ల పోలీసు, మిలిటరీ, సి. ఐ. డి. ల స్వాధీనంలో ఉండినప్పుడు, ఒంటరిగా జైళ్ళలో వుండినప్పుడు కూడా లాహిరీ ట్రైనింగ్, ఆయన చేసిన ధర్మబోధ నా కెంతో ఉపకరించాయి.

ప్రాణానికి తెగించి పోట్లాడేవాడితో, తెగతెంపులేక పోట్లాడేవాళ్ళ యెందరైనా సమానం కాజాలరని నాకు ప్రత్యక్ష అనుభవం. ఇలాంటి సాహస కార్యాలను కొన్నింటిని సందర్భానుసారంగా ప్రస్తావిస్తాను. వ్యక్తిగతంగానే కాదు; సైన్యాలు చేసే యుద్ధాల్లో కూడ; వాలంటీర్లతో కూడిన సైన్యానికీ యుద్ధం చేయుటే వృత్తిగా ఏర్పడ్డ సైన్యానికి మధ్య యుద్ధం జరిగినప్పుడు, సాధారణంగా వాలంటీర్లు సైన్యం గెలుస్తూ వచ్చినట్లు చరిత్రలు నిరూపించాయి. వృత్తిగా ఏర్పరచుకొనిన సైన్యానికి యుద్ధం చెయ్యడం బాగా తర్ఫీదు అయివుంటుంది. జయించగలమనే మనోనిశ్చయంతో యుద్ధ రంగా

నికి వస్తారు. కాని చావడానికి సిద్ధపడిరారు. వాలంటీర్లకు ట్రైనింగు చాలదు. ఆయుధా లుండవు. అయితే చావడానికి తెగించుతారు. దాంతో శత్రునాశనం కావడం ప్రారంభము కాగానే శత్రుసైన్యం పారిపోతుంది. ప్రపంచ విప్లవ చరిత్ర, ఇంగ్లాండు, అమెరికా, రషియా, ఐర్లండు, చైనా స్వాతంత్ర్య యుద్ధ చరిత్రలూ, సిక్కులు, మహారాష్ట్రులు మొగలాయి సైన్యంతో చేసిన యుద్ధాల్లోను ఈ సత్యాన్నే నిరూపించాయి. మొదటి, రెండవ ప్రపంచయుద్ధాలు కూడ ఈ విషయాన్నే దృఢపరిచాయి. విప్లవాలు జయించుటకు కారణం విప్లవ సైన్యాలు, వాలంటీర్ల సైన్యాలు అవడంవల్లనే ప్రజలు తిరుగబడగానే పోలీసులు తమ తుపాకులు, టోపీలను పారేసి, కాళ్ళకు బుద్ధిచెప్పడం భారతీయులు ఎరిగిన విషయమే.

ప్రపంచయుద్ధ ప్రారంభం - గదర్‌పార్టీ పరిస్థితులు

1925 సంవత్సరం లోగా కాశ్మీరును యుద్ధంలో జయించి, రిపబ్లిక్‌గా చెయ్యాలనీ, గదరుపార్టీని స్థాపించగానే ప్లాను వేశామని, లోగడ వ్రాశాను.[1] కామగాటో

---

[1] కామగాటోమారో అనేది జపాను సీమరు. దీని పేరు మనరాజకీయచరిత్రలో ప్రసిద్ధికెక్కినది. 1913-14లో జరిగిన విషయం. భారతీయులు—ముఖ్యంగా పంజాబీయులు కెనడాకు వ్యవసాయ కూలీలుగా వలసపోతూ వచ్చారు. మనలను ఆ దేశానికి రానివ్వడం కెనడావారికి యెంత

మాత్రమూ యిష్టం లేదు. ఇందుకు జాతి ద్వేషమే ముఖ్య కారణము. అయినా ఒకే బ్రిటీషుసామ్రాజ్యంలో ఉండిన కారణంవల్ల మనలను ప్రత్యక్షంగా రాకూడదని శాసనం చేయుటకు మాకుగా ఒక ఉపాయం కనిపెట్టారు. ఆసియా నుండి ఒకే స్టీమరులో నేరుగా ప్రయాణంచేసి రావాలి అనే సాకు పెట్టారు. ఆకాలంలో ఇండియా నుండి జపాను వరకు స్టీమర్లు వెళ్ళి నిలిచిపోయేవి. జపాను నుండి మరొక స్టీమరులోఎక్కి కెనడాకు వెళ్ళాలి. అందువల్ల ఆ శాసనం చేశారు. అయితే గురుదత్ సింగ్ అనే దేశభక్తుడు ఒక జపాను స్టీమరును ప్రత్యేకంగా బాడుగకు ఏర్పాటు చేసి, హాంకాంగు రేవులో చాలామంది పంజాబీయులను ఎక్కించి కెనడాకు తీసుకెళ్ళాడు. వీరిలో చాలామంది కొంతకాలం సైన్యాల్లో ఉండి యుద్ధాల్లో ఆరితేరినవారు. ఆ కాలంలో పంజాబులో రోజుకూలి ఎనిమిది అణాలు మాత్రమే; కెనడాలో పదిరూపాయలు. కెనడాలో వీరిని దిగనివ్వలేదు. కెనడా పోలీసులు, సోల్జర్లకు మనవారికి పోట్లాటలు, కొట్లాటలు, కాల్పులు జరిగాయి. నీరుగాని, ఆహారంగాని, సప్లయి చెయ్యటానికి కెనడా గవర్నమెంటు వారు నిరాకరించడమేగాక, స్టీమరును ముంచేస్తామన్నారు. చివరకు తిరుగు ప్రయాణం చెయ్యవలసి వచ్చింది. దీని వల్ల మనదేశంలో బ్రిటీషు ప్రభుత్వంమీద ద్వేషం పెరిగి పోయింది. ఇండియాకు తిరిగి వచ్చారు. కలకత్తావద్ద డమ్మడమ్ స్టేషనులో సర్కారు ఒక స్పెషల్ ట్రైయినును

మారోస్ట్రీ మరువిషయంలో గదరుపార్టీ విద్యార్థులం జోక్యం కలుగజేసుకోలేదుగాని పంజాబీ వ్యవసాయకూలీలైన గదరు పార్టీవారు ఉద్రేకంతో పనిచేశారు. రివాల్వర్లు, పైపిల్లు, తోటాలువగైరా కొనియిచ్చారు.* ఇండియాలో ఇంగ్లీషు ప్రభువులను చంపండి, చావండి అని నినాదం యిచ్చారు. గదరు పార్టీ సాహిత్యాన్ని చాలా యిచ్చారు. కొందరు వీరితో కలసి ప్రయాణం చేశారు. చాలా తీవ్రప్రచారం జరిగింది. ఇండియాకు చేరగానే గవర్నమెంటుతో పోట్లాడి కొందరిని కాల్చి చంపారు; చచ్చారు.

గదరు పార్టీని స్థాపించిన హరదయాళు విధిలేక యూరపుకు వెళ్ళాడు. ఈ సమయంలో రామచంద్ర అనే పంజాబీ తన భార్యతో ఇండియా నుంచి అమెరికాకు

వీరిని పంజాబుకు నేరుగా తీసుకెళ్ళటకు తయారుగావెట్టి, దానిలో కూర్చుండమని అన్నారు. కొందరు సమ్మతించ లేదు. చివరకు కాల్పులు జరిగాయి. ఇరువైపులవారు కాల్చారు. కొందరు మరణించారు. కొందరు పంజాబీ యులు తప్పిలచుక పొయ్యారు. మన పోరాట చరిత్రలో అదొక గొప్ప సంఘటనగా నిల్చిపోయింది. నాయకుడైన గురుదత్ సింగ్ సుమారు 30 సం॥ల తరువాత తనంతట తానే పోలీసులకు దొరికిపోయిరి.

* అమెరికాలో కొనుటకు పైసన్ను అవసరంలేదు. ఎవరైనా ఎన్నైనా కొనుకోవచ్చు, కొన్న షాపులో రిజిష్టరులో సంతకం చేస్తే చాలును.

వచ్చాడు. ఇతడు రాజకీయంగా పాటుపడి బాధలు పడ లేక విదేశానికి వచ్చాడు. గదరు పార్టీవారు యీాయనను నమ్మి హారదయాళు స్థానే గదరు పత్రికకు సంపాదకునిగా నియమించిరి.

తర్జన భర్జనలు

అమెరికాలో విద్యార్థులకు షుమారు మూడు నాలుగు మాసాలు ఎండాకాలం శలవులు ఇస్తారు. డబ్బు సంపాదించు కొనుటకు వ్యవసాయపు పనులు చాలా లభించుతాయి. భారత విద్యార్థులం స్వయంపోషకులమే గాని, ఇండియా నుండి డబ్బు తెప్పించుకొని చదువు కొనేవారు అరుదు. కాబట్టి కూలినాలి చేయుటకు మేము తలా ఒకచోటికి వెళ్లాము. ఆ శలవుల్లోనే ప్రథమ ప్రపంచ యుద్ధం 1914 లో ప్రారంభ మయింది. వెంటనే మా కార్యక్రమం తీర్మానించుకొనుటకు విద్యార్థివిప్లవకారులం పదిమందిమి బర్కిలే పట్టణంలో సమావేశ మయ్యాము. ఈ యుద్ధాన్ని ఉపయోగించుకొని, భారత దేశాన్నంత టిని పారతం త్యంనుండివిము క్తి చేయుటకు ప్రయత్నించుటే కర్తవ్యమని తీర్మానించు కొన్నాము. ఇదివరకే గదరు పార్టీ వేసుకొన్న ప్లానులో, కాశ్మీరును 1925 సంవత్సరం లోపల రిపబ్లిక్కుగా చేయాలన్న విషయం చాలా స్వల్ప మయినదని తోసివేశాము. ఎలా మన దేశానికి సేవ చేయాలో, సంపూర్ణ స్వాతంత్ర్యం సంపాదించాలో, అన్న

చర్చలు దీర్ఘంగా గదరు పార్టీ నాయకులు జరిపారు; కాని వెంటనే తీర్మానానికి నాయకులు రాలేకపోయిరి. విద్యార్థులలో నూతన ప్రధాన అభిప్రాయాలు ఏర్పడ్డాయి. (1) మనము ఇండియాకు వెంటనే వెళ్ళి విప్లవాన్ని తేవాలి; అమెరికాలో ఉండి మనము ఏమీ చెయ్యజాల మని కొందరు; వీరిలో ముఖ్యులు : శ్రీ భాగవతుల సోమయాజిశర్మగారు, గుంటూరు. (2) ఇండియాకు వెళ్ళి మన మేమి చెయ్యగలము? తీగలు నరుకగలమా? వంతెనలు నాశనం చెయ్యగలమా? ప్రజలను పోగుచేసి మిలిటరీ తర్ఫీదు ఇవ్వగలమా? ఏ యే కోటలలో ఎన్నెన్ని ఫిరంగులున్నాయో, ఎంతెంత సైజో, ఎన్నెన్ని రైఫిల్సు ఉన్నాయో వగైరా విషయాలు తెలుసునా? యుద్ధం కొంత సాగగానే ఇండియాకు స్వాతంత్ర్యం సంపాదించడానికి మన కితరదేశాల వారు సహాయపడుతారు; మనకు సహాయం నస్తుంది. మనం వెంటనే మిలిటరీ విద్య నేర్పే కాలేజీలో చేరి రిటైరైన అమెరికన్ మిలిటరీ ఆఫీసర్ల సహాయంతో ఇండియాలోని కోటలు వగైరా ప్లానులను సంపాయించి, బాగా ఆలోచించుకొని ప్లాను వేసుకొని ఇండియాకు వెళ్ళాము అని లాహిరీ సలహా. ఇది పంజాబీయులు కాని విద్యార్థులకు నచ్చింది. (3) పంజాబీ విద్యార్థులు ఇండియాకు వెళ్లి, సైన్యంలోచేరి 1857 లో లాగే సిపాయిల సాయుధపోరాటం ఏర్పాటు చెయ్యాలన్నారు. శర్మగారు మాత్రం ఒప్పుకోలేదు. వెంటనే ఇండియాకు

ఆవేశంతో వెళ్ళారు. కాని, ఆయనవద్దనుండి చాలాకాలం మాకు ఉత్తరాలు రాలేదు. ఇండియాలో పరిస్థితులెలా వుండునో మాకు తెలియలేదు. మిగిలిన తొమ్మిదిమందిమి మిలిటరీ విద్యను నేర్పే కాలేజీలో చేరిపోయ్యాము. అందువల్ల చెదిరిపోయ్యాము. నేను లోగన్ టవున్‌లో యూటా రాష్ట్రపు వ్యవసాయ కాలేజీలోచేరితిని.

చదువు

ఆకాలంలో వర్షాధారంవల్ల మాత్రమే పండే పంటలను గురించిన వ్యవసాయశాస్త్రంలో, ప్రపంచమంతటిలో ప్రథానశాస్త్రజ్ఞుడు డాక్టర్ విడ్‌టో (Dr Widtsoe) ఆ కాలేజి ప్రిన్సిపాలు. ఆయనవద్ద చదువుకోవాలని నాకు ఎంతో కుతూహలంగా వుండేది. మిలిటరీ సబకుకూడా నేర్చుకొనుటకు యిష్టపడి చేర్చుకున్నారు. కాలిఫోర్నియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఆంగ్లేయులకు సానుభూతి పరుడు. మిలిటరీ క్లాసులో మమ్మల్ని చేర్చుకోటానికి నిరాకరించాడు. మనదేశంలో పండించే చెఱకు, పొగాకు, దూది వగైరా పంటలనుగూర్చి లూజియానా రాష్ట్రం కాలేజీలోచేరి నేర్చుకోవాలని కుతూహలపడితిని; కాని, నీగ్రోలు, నల్లరంగు జాతులమీద ద్వేషం విశేషంగా పెరిగిపోయిన ఆ కాలేజీలో చదువుకొనుట దుస్తరమని ప్రిన్సిపాల్‌గారు నాకు ప్రాసిరి. నేను క్రొత్తగా చేరిన లోకను కాలేజీలో 800 మంది యువకులు 400 యువతులు

ఉండిరి. ఆ కాలేజీలో ఆసియాఖండవాసిని నే నొక్కడనే. 12 వేల మైళ్ళ దూరం నుంచి తమ కాలేజీలో చదవడానికి వచ్చానని ప్రిన్సిపాలు మొదలుకొని విద్యార్థుల వరకు నన్ను జూచి గర్వపడ్డారు. నన్ను ఆదరించి సహాయం చేశారు. వారి యిండ్లలో వారి బిడ్డలలాగే కాలం గడిచి పోయింది.

మిలటరీ విద్య చాలా ఉత్సాహంగా నేర్చుకొ[illegible]ను. మిలటరీ ఆఫీసరు నాకు కావలసిన మ్యాపులు, [illegible]లు, అమెరికన్ మిలటరీ డిపార్టుమెంటుకు వ్రాసి తెప్పించి యిచ్చేవాడు. నా ఉత్సాహాన్ని మెచ్చుకొనేవాడు మిలిటరీ ట్రయినింగుకు బలమయిన దేహం అవసరం. అమెరికనులతో పోలిస్తే నా శరీరబలం చాల తక్కువ. అమెరికా చేరినప్పుడు నా తూకం 100 పౌనులు మాత్రమే. కాలిఫోర్నియా యూనివర్సిటీలో 3500 విద్యార్థులలో; తూకంలో కట్టకడపటివారు నలుగురూ భారత విద్యార్థులే. బలహీనతవలన చలికాలంలో రెండు మూడు గుల మంచు (snow) లో అమెరికను విద్యార్థులతో సమానంగా రైఫిల్ మోసుకుంటూ నేను పరుగెత్తలేకపోయాను. బాయనెట్ ఛార్జి యక్సర్సైజు చేయలేకపోతిని. రెండున్నర సంవత్సరాలలో అమెరికాలో 125 పౌనులవరకు నా తూకం పెరిగింది. కొన్ని శిక్షణ పోరాటా (mockfights) లలో పాల్గొంటిని. నన్ను బయలుదేరి రమ్మని 1915 మే నెలలో గదరుపార్టీనుండి పిలుపువచ్చింది. పరీక్షలసమయం.

ఇండియాకు అర్జంటుగా తిరిగిపోవాలనీ, వెంటనే ప్రత్యేక పరీక్షలు చేసి పంపమనీ, కాలేజీ అధికారులను అడిగాను. లోగడ లాహిరీ ఒక చక్కని సలహా యిచ్చాడు. బాగా చదివి పరీక్షలలో బాగా మార్కులు తెచ్చుకొంటూ వున్నంతకాలం మన తలిదండ్రులు మనలను సంశయించ కని చెప్పి బాగా చదివించేవాడు. ఆ అలవాటు ప్రకారం చాలా ఎక్కువ మార్కులు సంపాదించేవాణ్ణి. కాబట్టి ఏడు గురిలో నలుగురు ప్రొఫెసర్లు పరీక్ష చేయకనే మామూలు ప్యాసుమార్కులు (అమెరికాలో 60%) యిచ్చారు. మిగిలిన ముగ్గురు పరీక్షచేసి ప్యాసుచేశారు. ఎందరో స్నేహితులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, విద్యార్థినీలవద్ద ఎంతో కష్టంతో శలవు పుచ్చుకొని శాన్‌ఫ్రాన్సిస్కో గదరుపార్టీ ఆఫీసుకు హాజరయ్యాను. *

---

* లోగను కాలేజిలో చేరిన కొన్ని రోజులవరకు ఆ దేశంలో సర్వసాధారణమైన వర్ణద్వేషంవల్ల విద్యార్థులు నన్ను వారి హాస్టలులో చేర్చుకోలేదు. ప్రిన్సిపాలుగారైన డాక్టర్ విడ్‌ట్జో, వృక్షశాస్త్రం ప్రిన్సిపాలుగారైన డాక్టరు హైటసుగారు పట్టుపట్టి అన్నిటిలో ముఖ్యమయిన బోర్డింగు హౌసులో చేర్పించారు. అమెరికాలో కుటుంబాలవారు తమ యిండ్లలో కొందరు విద్యార్థులను పెట్టుకొని తమ బిడ్డలలాగే అన్ని సౌకర్యాలు చేస్తూ, పూట కూళ్ళ యిండ్లవలె గాక, విద్యార్థులు సుఖంగావుండేలాగు చేస్తారు. ఒక్కొక్క కుటుంబంలో 6 మొదలు 10 మందిని

చేర్చుకొంటారు. అట్టి బోర్డింగుహౌసులో నన్ను చేర్పించారు. క్రమేణ విద్యార్థులు నాకుస్నేహితులవుతూవచ్చిరి. విద్యార్థులు మాత్రం కొంతకాలం దూరంగానే వుండేవారు. నా అంతట నేనే స్నేహం చేసుకొనే అలవాటు నాకు అప్పుడూ ఇప్పుడూ కూడ లేదు. ఒకానొక సందర్భంలో నా స్నేహితులు క్రొత్తగారు. బోగం యింటికి వెళ్ళారు. నేను వారితో కలసివున్నా క్రొత్తగలేదు, గదిలోకి వెళ్ళలేదు. ఈ సంగతి కాలేజీలో యెలాగో తెలిసిపోయింది. అప్పటినుండి ఎంతోమంది విద్యార్థినులు నాకు స్నేహితులయ్యారు. డాన్సు చెయ్యమని బాధపెట్టేవారు. వారి యిండ్లకు పిలిచి ఫలహారాలు యిచ్చేవారు. ప్రేమ సంబంధాల తగాదాలు నేను రాజీ చేయాల్సి వచ్చేది. క్రిస్మసు పండుగలో తమ యిండ్లకు తీసుకెళ్ళి తలిదండ్రులకు, బంధుమిత్రులకు పరిచయం చేసి, చాక్‌లెట్లు, కేకులు బహుమానం యిచ్చేవారు. ఒక సంవత్సరం ఎంతో సౌఖ్యముగా అమెరికను విద్యార్థులతో గడచింది. వివాహానికి ముందు వారు ప్రేమించుకునే పద్ధతి చాలా తమాషాగా వుంటుంది. వారి జీవితాలలో అదొక సౌఖ్యదాయకమైన ముఖ్య ఘట్టము. మనము సాధారణంగా తలంచే కేవల కామవాంఛ (lust) స్వేచ్ఛా ప్రేమలు చాల అరుదు. కొన్ని నెలలు, సంవత్సరాలు, ప్రేమించుకొని, స్నేహితం పెరిగిన తరువాత వివాహ మాడుతారు. భార్యా భర్తల మధ్య ప్రేమలు, బిడ్డలను పెంచేపద్ధతి, శిక్షణ, వారి కుటుంబ

జీవితం, సంఘజీవితం నాకు అనుభవంలోకి వచ్చేకొద్ది వారిని చూచి గర్వించేలాగు చేశాయి. స్త్రీలలో నిగ్రహం చూడాలంటే వారిలోనే చూడాలి; నేను ఒక మనిషిని అని గర్వపడేవారిని చూడాలంటే వారిలోనే చూడాలి. యుద్ధకాలంలో తలిదండ్రులకుగాని, ప్రియురాండ్రకు గాని చెప్పకుండా రైఫిల్ తీసుకుని రహస్యంగావెళ్ళి సైన్యంలో చేరే దేశభక్తులను, సాహసవంతులను చూడాలంటే అమెరికాలో చూడాలి. రెండున్నర సంవత్సరాలు అలాంటివారితో నా జీవితం గడచింది. ఇప్పటి ప్రపంచ రాజకీయాల్లో అమెరికా ప్రభుత్వ పాత్ర అక్రమంగా వున్నప్పటికీ, నా అనుభవంలోని ఆ ప్రజల ప్రజాస్వామిక నాగరకతమీద నాకు యెంతో గౌరవం వున్నది. అమెరికాకు వెళ్ళిన వెంటనే, యూనివర్సిటీలో చేరే సమయంలో ఒక ప్రొఫెసర్‌ను నేను "సర్" అని పిలిచాను. "నిన్ను నేను "మిస్టర్" అని పిలుస్తున్నాను గదా, నీవు నన్ను "మిస్టర్" అని పిలవాలి, లేదా "ప్రొఫెసర్" అని పిలవాలిగాని "సర్" అని పిలవకూడదు. అమెరికాలో మేము యెంత పెద్దవానిని గాని "సర్" అని పిలువము. త్వరలో అమెరికా ప్రజాస్వామిక పద్ధతులను నేర్చుకో!" అని ప్రప్రథమములో నేర్పాడు. ఆ స్వేచ్ఛా వాతావరణం, ఆ స్వతంత్ర భావాలు, సమతా బుద్ధి చూచి అమెరికన్ నాగరకతయందు నాకు ఆకాలంలో యెంతో గౌరవం, కృతజ్ఞత కలిగింది. ఈలాంటి ప్రజలను నాగరకతను, స్నేహితులను విడిచిపెట్టి రావడం చాలా

లాహోరు కుట్రకేసులు
(1915 – 1918)

గదరుపార్టీ వారిమీద ముఖ్యంగా నాయకులమీద లాహోరులో మూడు కుట్రకేసులు మాండలే (బర్మాలో) ఒకటి పెట్టారు. అవిగాక గదరుపార్టీ ప్రోత్సాహంతో ఇండియా గవర్నమెంటు సైన్యం తిరుగబడినందువల్ల, సైనికులమీద పెట్టిన కేసులు ఇంకనూ యెన్నోవున్నాయి. సుమారు 5000 మంది పంజాబీయులు డిటెన్యూలుగా వుండిరి. వీరుగాక శిక్షింపబడినవారు ఎన్నో వందలు. అదే కాలంలో బెంగాలులో ఎన్నో కేసులు జరిగాయి. అక్కడ కూడా సుమారు 5000 మంది డిటెన్యూలుగా నుండిరి. కొన్ని వందలమంది శిక్షింపబడిరి. బెంగాలు కేసులతో నాకు సంబంధము లేదు. గదరుపార్టీకిన్ని, బెంగాలు విప్లవ పార్టీకిన్ని సంబంధాలుండినయి. నాకు గదరుపార్టీ కేసు లతో మాత్రమే సంబంధ ముండినది.

సైన్యంలో కల్లోలం

యుద్ధం ప్రారంభం కాగానే గదరుపార్టీలో చేరిన పంజాబీయులు అమెరికానుండి మాత్రమే కాక అనేక

కష్టమనిపించినది. అయితే మన భారతదేశాన్ని కూడా స్వతంత్ర దేశంగా చెయ్యాలిగదా; వెంటనే స్వతంత్ర యుద్ధానికి, గదరుపార్టీ యిచ్చిన పిలుపును సంతోషంతో అందుకున్నా.

విదేశాలనుండి ఇండియాకు వచ్చిరి. వారి ముఖ్యోద్దేశం సైన్యంలో చేరిగాని, సైన్యంలోవుండే తమ బంధుమిత్రుల సహాయంతోగాని బ్రిటిష్ ప్రభుత్వంమీద సాయుధ పోరాటము జరపాలనీ, స్వాతంత్ర్యం సంపాదించాలనీ, వీరు గదరుపార్టీ సాహిత్యాన్ని ఇండియాకు తెచ్చారు. ప్రభుత్వాధికారులకు కొందరివద్ద సాహిత్యం దొరికింది. అప్పటినుంచి ప్రయాణీకులను ఇండియా రేవులవద్ద జాగ్రత్తగా సోదా చేసేవారు. ఈ కారణంచేత, తరువాత తరువాత గదరుపార్టీ సాహిత్యం తెచ్చుటకు వీలుపడలేదు. అప్పుడు మరొక ఉపాయం చేశారు. మన పూర్వులు వేదాలు పఠించి వల్లించినట్లు వల్లించి, ఇండియాలో దిగగానే కాళీలమీద కెక్కించి సైనికోసయిల్ చేయించిగాని, అచ్చు వేయించిగాని సైన్యంలో ప్రచారం సాగించారు. మొదటి గ్రూపు(ముఠా) ఇండియాలో సైన్యం తిరుగుబాటు చేయుటకు ఒక తేదీని నిర్ణయించింది. సావర్కారుగారి 1857 వ సం॥పు స్వాతంత్ర్య యుద్ధమనే పుస్తకంలో విప్లవ వైఫల్యానికి ముఖ్య కారణం, అందరూ నిర్ణయింపబడిన రోజు తిరుగబడక ముందుగా మంగళ్ సింగ్ మొదలగు వీరులు తిరుగబడుటవల్ల చాలా హానికలిగిందని వ్రాశారు. ఇపుడు గదర్ వీరులు ఒకేరోజున తిరుగుబాటు చెయ్యాలని తీర్మానించుకొన్నారు. కాని గదర్ పార్టీలో చేరుతామని వచ్చిన వారందరిని విచక్షణలేకుండా చేర్చుకుంటూ వచ్చినందున వెయ్యిందరో సి. ఐ. డీ.లు చేరి సర్కారుకు యెప్పటి సమాచా

రాలు అప్పుడు అందజేస్తూవచ్చారు. కాబట్టి నిర్ణయింప బడిన తేదీనాటికి మిలటరీ డిపార్టుమెంటు సైన్యాలను వేరు వేరు ప్రదేశాలకు, దేశాలకు మార్చివేసింది. చివరకు అందరిని ఫ్రాన్సుకు తీసుకువెళ్ళారు. పోవుటకు నిరాకరించి తిరుగబడ్డ కొందరు సైనికులను జైళ్ళలో వేశారు. కొందరు కాల్చబడ్డారు. ఫ్రాన్సు చేరిన తరువాత అక్కడ పరిస్థితు లెలాగున్నాయనగా జర్మనులను వైప్రస్ గండి దాటకుండా ఇంగ్లీషు సైన్యమూ, వర్డమ్ దాటకుండా ఫ్రెంచి సైన్యం హోరాహోరీగా పోరుచుండిరి. ఒక్కొక్కప్పుడు కుప్పలు తిప్పలుగా చచ్చిపోతూ ఉండిరి. లక్షల ఇండియా సైన్యము వైప్రసు యుద్ధానికి తీసుకరాబడ్డారు. జర్మనులతో యుద్ధం చెయ్యడం వారికి యిష్టం లేదు. ఇంగ్లీషు వారిని నాశనం చేయడమే వారికి యిష్టము. వీరు యెలాగయినా ఓడిపోవాలి. కందకాలలో తమ ఆఫీసర్లు యిన ఇంగ్లీషువారిని గాల్చి చంపుతూవుండిరి. ఎక్కువగా తమ ఆఫీసర్లు చావడంవల్ల, సైనికుల విప్లవ రాజకీయ భావనలను గ్రహించి వెంటనే వైప్రసు యుద్ధానికి పంపారు. ఎదుట జర్మనుసైన్యం; వెనుక ఇంగ్లీషు సైన్యం మెషిను గన్‌లతో సన్నద్ధులై యుండిరి. ఈ వ్యూహం వల్ల మన భారతీయ సైనికులకు యెటు చూచినా మరణం తప్పేట్టు లేదు. అప్పుడు చాలామంది రైఫిల్సుపారేసి, జర్మనువైపు వెళ్ళారు. జర్మనులు వారిని ఆహ్వానించి, గౌరవించారు.

ఇలాంటివారు లక్షలమంది యుద్ధంలో చచ్చిపోగా వేనవేల మంది జర్మను యుద్ధ ఖైదీలుగా వుండిరి.

ఆ కాలంలో టర్కీ దేశము జర్మనీతో కలసి ఇంగ్లాండుమీద యుద్ధం చేస్తోంది. అప్పుడు టర్కీ మిలిటరీ ఆఫీసర్లు భారతసైనికులను తమతోచేరి ఇంగ్లీషు సైన్యంతో పోరాడమని కోరారు. వేలాది ముసల్మాను సైనికులు టర్కీ సేనలో చేరి మెసపొటోమియా మొదలయిన ప్రదేశాలలో ఆంగ్లేయులతో పోరాడిరి. కడపటికి కొన్నివేల మంది టర్కీలో స్థిరనివాసం ఏర్పరచుకొని టర్కీ స్త్రీలను వివాహమాడి, టర్కీ గవర్నమెంటు యిచ్చిన భూములను దున్నుకుంటూ ఆ దేశవాసులయిరి.

ఈలాగు ప్రచారాలు, కుట్రలుచేసి, తిరుగబడేలాగు చేశారని గదరు నాయకులమీద కేసులు పెట్టిరి. లాహోరు మొదటి కేసు, మొదటి సప్లిమెంటరీ కేసు పై విషయాలకు సంబంధించినవి. చాలామంది ఉరి తీయబడిరి. ఎందరో అండమాన్లకు పంపబడిరి. వీరే ప్రసిద్ధి కెక్కిన గదరు బాబాలు. ఇంకనూ దేశసేవ చేయుచునే ఉన్నారు. వీరికి నాయకులుగా పనిచేసి ఉరితీయబడిన కర్తారుసింగు, కేదార్‌నాథ్ మా పదిమంది విప్లవ విద్యార్థులలో చేరిన వాడే. నాతోకలసి గదరుపార్టీ సంస్థాపన నుండి సభ్యులుగా చేరి, లాహోరీ వద్ద తర్ఫీదు పొందిరి. ఈలాంటి వీరాధి వీరులు నా మిత్రులు అని గర్వపడుచున్నాను.

నాకు సంబంధించిన కుట్ర కేసులను మరొకచోట వ్రాస్తాను.

బర్మాను పట్టుకోవాలి (1915 సం.)

ప్రథమ ప్రపంచయుద్ధంలో పరిస్థితులు మారిపోతూ వచ్చాయి. అలాగే గదరు పార్టీలో ప్లానులు మారుతూ వచ్చాయి.

యుద్ధానికి ముందుగా కొందరు బెంగాలీ విప్లవ నాయకులు ప్రభుత్వం పెట్టే బాధలు పడలేక, అనేక కుట్ర కేసులలో అరెస్టులు తప్పించుకొని ఇండియా విడిచి వెళ్ళారి. వీరు జర్మనీలో ఉంటూ వచ్చారు. ఇండియా స్వాతంత్ర్యము కొరకు కొన్ని ప్లానులు వేస్తూనే వుండిరి. యుద్ధం ఆరంభంకాగానే జర్మనీ కైజరు ప్రభుత్వ సహాయం పుచ్చుకొని, బ్రిటిష్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ఒక ప్లానువేసి సాగిస్తూ వచ్చారు. యూరపు, అమెరికాలలో గడుపుచుండిన భారత విద్యార్థులలో 250 మందికి జర్మనీలో యుద్ధ శిక్షణ యిప్పించుటకు ఏర్పాట్లు అయినవి. అమెరికాలో బి. ఎ., లేక బి. ఎస్. సి., ప్యాసయినవారికి మాత్రమే యీ అవకాశం లభించినది. అందువల్ల నాకు లభించలేదు; రెండవమాటు అవకాశం యిస్తామన్నారు. లాహిరీ మొదటి గ్రూపులో జర్మనీకి వెళ్ళాడు. కొంత కాలానికి యూరపులో ఉండే ఇండియా విద్యార్థులు

చాలామంది చేరిపోవుచుండినందున అమెరికానుండి కొత్త వారిని తీసుకోలేదు. అందువల్ల నాకు ఆ ఛాన్సు లభించ లేదు. నన్ను ఇండియా వైపు వెళ్ళమని ఆజ్ఞాపించారు.

లోగన్ టవున్లో బయలుదేరే సమయంలో చాలా మంది స్నేహితులు, స్నేహితురాండ్రు సాగనంపడానికి మా యింటికి వచ్చారు. కాంపౌండు గేటు చేరీచేరగానే ఒక పోస్టు బంట్రోతు నాకు ఒక కార్డు యిచ్చాడు. అది గుంటూరు నుండి శ్రీ బి. యస్. శర్మగారు వ్రాసినది. "అమెరికాలో తీవ్రమైన ఉత్సాహం వున్నది. కాని ఇక్కడ ఎంతమాత్రం ఉత్సాహకరంగా లేదు" (It is red hot there, but it is ice cold here)" అని వ్రాశారు. నేను నిర్ఘాంతపోయ్యాను. "నే నిప్పుడేమి చెయ్యాలి? పార్టీ తీర్మానం ప్రకారం నేను సేన్ఫ్రాన్సిస్కోకు పోయి పార్టీ యిచ్చిన కార్యక్రమం చెయ్యడమా లేక మానివేయడమా" అని ఒక నిముషం ఆలోచించి, కార్డును చించేసి రైలు ఎక్కాను.

పగలు పన్నెండు గంటలకు గదరు పార్టీ ఆఫీసుకు చేరాను. "స్టీమరు 2 గంటలకు జపానుకు బయలుదేరుతుంది. పార్టీ వారు ఇద్దరు దానిమీద వెళ్లుతున్నారు. "నీవు వెంటనే బయలుదేరుతావా? లేక ఒకవారం తరువాత వెళ్ళతావా?" అని రామచందర్ (గదరు పార్టీ కొత్త సంపాదకుడు) అడిగాడు. అప్పుడు పార్టీకి అమెరికాలో ప్రధాన నాయకుడు ఆయనే. "నాకు ఇక్కడ పనేమీ

లేదు. ఇప్పుడే బయలుదేరుతాను" అని స్టీమరు ఎక్కాను. అంతవరకు ప్లాను ఏమిటో, నే నేమిచెయ్యాలో, ఎక్కడ పనిచెయ్యాలో, ఒకటీకూడ నాకు తెలియదు. స్టీమరు మీద తెలుపుతారు అని చెప్పారు. జర్మను కాన్సలు యిచ్చిన కొన్ని ఉత్తరాలను మసీలాలో జర్మను రాయబారికి యివ్మని నా చేతికిచ్చారు. దానిని బట్టి నేను ఫిలిప్పీన్స్ దీవులకు వెళ్ళుతున్నానని తెలిసింది. రెండు స్టీమర్లు ఆయుధాలతో నింపి జర్మనులు అమెరికానుండి పంపారు. ఒకటి బెంగాలులో సుందరబాను దీవులలో అడవులలో ఆయుధ సామాగ్రిని దింపేసిందని వింటిని. రెండో స్టీమరు ఆయుధాలను సయామములో రహస్య ప్రదేశములో దింపేయాలి. ఆ సామాగ్రిని బర్మా పట్టుకొనడానికి మా గ్రూపు ఉపయోగించాలి నా చేతికి యిచ్చిన ఉత్తరాలు ఈ రెండవ స్టీమరుకు సంబంధించినవే.

ఇప్పటినుంచే సాహస కృత్యాలు ఒకదాని తరువాత ఒకటి ప్రారంభ మయ్యాయి. హరదయాళుగారి దేశభక్తి ప్రబోధం, లాహిరీ యిచ్చిన శిక్షణ ఈ పరిస్థితులలో నాకెంతో తోడ్పడ్డాయి. ఈ సాయుధ విప్లవవాలు సాగించటానికి తెగించి ప్రాణాలు బలిపెట్టాల్సిందే.

స్టీమరుమీద ఇద్దరు గదరు పార్టీవారు ఉన్నారు - బెంగాలీ యువకుడు చటర్జీ; పంజాబీ జోద్‌సింగ్. చటర్జీ ఒక విద్యార్థికుడు. హిందూ వేదాంతం మొదలయిన విషయాలమీద ఉపన్యాసాలిస్తూ అమెరికాలో సాఖ్యంగా

జీవితం గడిపేవాడు. సంగీత, సాహిత్య, చిత్రలేఖనములలో ప్రవేశం వుంది. శరీరానికి సిల్కు-బట్ట తప్ప మరే బట్టగాని అంటకూడదని తీర్మానించుకొన్న వ్యక్తి. భోగి; సాహసుడు. ఎలాంటి కష్టసమయంలో కూడా ఏదో ఉపాయం చేసి తప్పించుకొనే నేర్పరి. బెంగాలులో పెరరిస్టు ఉద్యమాలలో జైళ్ళకు వెళ్ళాడు. ఇండియానుండి విదేశప్రభువులను పారదోలి స్వరాజ్య సంస్థాపనకు ఉద్యమించిన వ్యక్తి.

జోద్‌సింగు జర్మనీనుండి వచ్చాడు. అసలు ప్లానును అతనికి బాగా తెలుసు. ఈ ప్లానును ముందుముందు విపులీకరిస్తాను. బర్మా పట్టుకోవాలి అనే ఉద్యమములో ప్లానుదానికి వచ్చాడు. రెక్రూటును సంపాదించడం ఆతని ముఖ్యపని. అందుకుగాను ఉత్తర దక్షిణ అమెరికాలు సంచారంచేసి వచ్చాడు. అయితే చాలా పిరికివాడు. సి. ఐ. డి. లని అందరినీ అనవసరంగా అనుమానిస్తూ వుంటాడు. ఎవరినీ నమ్మడు. ఏరహస్యాలులేని మామూలు మాటల సందర్భంలోకూడా కండ్లు అటూ ఇటూ త్రిప్పి "వాడు సి. ఐ. డి, వీడు సి.ఐ.డి." అంటాడు. టేబిల్ వద్ద భోంచేసే సమయంలోకూడా తల త్రిప్పుతూనే వుంటాడు. కండ్లలో భయంతో కూడిన చూపులు. స్టీమరుమీద ఎవరితోనో మాట్లాడినా "ఎందుకు మాట్లాడావు" అని ఆక్షేపణ చేస్తాడు. స్టీమరుమీద ఒక జపాను విద్యావతి మాతృదేశానికి ప్రయాణం చేస్తూవుంది. నేను, ఆమె స్నేహితుల సుయ్యాము. ఆవిడతో మాట్లాడ వద్దంటాడు. మా గదికి

వస్తే, తన పెట్టెలు ఏవో చూడటానికే వచ్చిందంటాడు. జపాను చేరడానికి 12 రోజుల ప్రయాణం. ప్రాణంమీద విసుకెత్తించాడు. వీడితో నే నెలా కలసి పనిచెయ్యడం? అమెరికానుండి నాకు యివ్వవలసిన ప్రయాణం ఖర్చులు యివ్వడం మానేశాడు. కాని, నా స్వంతడబ్బు చేతి నిండా వుంది.

మేము మనీలా వెళ్ళాలి. హాంకాంగు, సింగపూరు మొదలయిన బ్రిటీషు రేవులకు వెళ్ళకుండా తప్పించుకొంటూ మేము ప్రయాణం చేస్తూవుండాలి. మనీలాలో జర్మను మిలిటరీ ఆఫీసర్లు, రాయబారి, మేము కలసి ముందు కార్యక్రమాన్ని నిర్ణయించుకోవాలి.

సన్‌యట్ సేన్ సందేశం

జపానులో సన్‌యట్ సేన్ గారిని సందర్శించాను. ఆయన కుమారుడు ప్రస్తుత చైనా కొమింటాంగ్ ప్రభుత్వ ప్రధాన మంత్రి. సన్‌ఫో ♦ నేను కాలిఫోర్నియా యూనివర్సిటీలో కలసి చదువుకొన్నాం. సన్‌యట్ సేన్ చైనాలో

♦సన్‌ఫో సన్‌యట్ సేన్‌గారి ప్రథమభార్య పుత్రుడు. ఆమెను డైవర్సుచేసి తనకు ప్రయివేటు శ్రకటరీగా పని చేయుచుండిన మిస్ సూంగును (మదాం చాంకై షేక్ అక్కను) వివాహ మాడిరి. సన్‌ఫో అప్పుడు మాతో చదువుచుండిరి. తండ్రిమీద ఆగ్రహం ఏర్పడింది. తండ్రి

1911 ప్రాంతంలో రిపబ్లిక్కును స్థాపించి, మొదటి ప్రెసిడెంటుగా వుండి, విప్లవ కార్యక్రమాన్ని జయప్రదంగా నడుపుటకు అవకాశం లేక "వార్‌లార్డు" అయిన యూవాన్ షి కాయికి ప్రెసిడెంటు పదవిని వదలివేసి, చివరకు ఆయన కుట్రలను తప్పించుకొని, జపానులో ఉంటూ, చైనాలో రెండవ ప్రజావిప్లవానికి ప్రయత్నాలు చేస్తూనేవుండిరి.

టోకియోలో ఆయన అడ్రసు లభించక, చివరకు జపాను సి. ఐ. డి. కేంద్ర కార్యాలయానికి వెళ్ళి అడిగాను. వారు నన్ను ఎన్నో ప్రశ్నలు వేసి కడపట ఒక ఆఫీసరు నన్ను తన కారులో సన్‌యట్ సేన్‌గారి యింటి వద వదలిపెట్టి వెళ్ళాడు. నా విజిటింగు కార్డును పంపగానే సన్‌యట్ సేన్ సర్వసామాన్యమైన బట్టలతో ఎదురువచ్చి చేతులు పట్టుకుని తనకుమారుని చూచినట్లు వాత్సల్యంతో నన్ను లోపలికి తీసుకెళ్ళాడు. తన కుర్చీలో నన్ను కూర్చోబెట్టి యినుప కుర్చీలో కూర్చున్నాడు. అంతకన్న చవుక కుర్చీలు, బట్టలు ఏ బీదవాని ఇంటిలోనూ ఉండకపోవచ్చు అతి నిరాడంబరజీవి.

"ప్రపంచంలో అనేక దేశాలను జయించి, పీల్చి పిప్పిచేస్తూ వున్నది ఈ బ్రిటీషు సామ్రాజ్య ప్రభుత్వం. పంపుతూవుండిన డబ్బును తీసుకొనుటకు నిరాకరించాడు. భుక్తి కొరకు ఒక కాఫీహోటలు స్థాపించాడు. దానిలో సంపాదించే డబ్బుతో కాలేజీలో చదువు కొంటూ వచ్చాడు.

చైనాను కబళించి ప్రపంచాన్నే ఏలా లని ఆంగ్లో పెట్టు బడిదారుల కోరిక. జపానుకు ద్రవ్యమిచ్చి ఆయుధాల నిచ్చి, వేటకుక్కలను ఉసికొల్పిన రీతిగా చైనామీదికి పురికొల్పి, చైనాను కాలికింద రాచేస్తున్నది. ఇంగ్లాండు ఈ ప్రపంచ యుద్ధంలో ఓడిపోయి దాని ఆ సామ్రాజ్య నాశనం కానిది చైనాలో స్వాతంత్ర్యంగాని, ప్రజా ప్రభుత్వంగాని స్థిరంగా ఏర్పడజాలవు. కాబట్టి ఇండి యాలో భారతీయులు ఆంగ్లేయ ప్రభుత్వాన్ని కూలద్రో సిన నాడు చైనాకు విముక్తి కలుగుతుంది. భారతీయులు చేసే విప్లవ ప్రయత్నాలన్నీ నా కెంతో నచ్చాయి" అని అన్నాడు సన్‌యట్‌సేన్. "జపాను మీకు ముఖ్య శత్రువు కాదా" అని ప్రశ్నించాను. జపాను వాస్తవంగా బల హీనమైనదే నని, ఒంటరిగా చైనాను పట్టుకొని రాజ్యం చెయ్యజాలదని, ఇంగ్లాండు ఆసరాతో నాటక మాడుతూ న్నాడని చెప్పి, బ్రిటీషు సామ్రాజ్యాన్ని ఇండియాలో నాశనం చెయ్యనంతవరకు మానవజాతికి శాంతి-సౌఖ్యాలు ఏర్పడజాలవని నొక్కి చెప్పాడు. నాకు ఈ ఉపదేశం ఎంతో నచ్చింది. నేను చేయబూనుకొన్న పనులలో ఎంతో ఉత్సాహం కలిగింది. సన్‌యట్‌సేన్‌గారి ఆశయాలు, త్యాగాలు ఎంత ఉన్నతమైనవో వారి జీవితం అంత సామాన్యమైనది.

బ్రిటీషు ప్రభుత్వాన్ని తలక్రిందులు చెయ్యాలి

స్టీమరులో మనీలా నగరం (ఫిలిప్పైన్ దీవులు) చేరాము. ఆయుధాలను తెచ్చిన రెండవ స్టీమరుకు సంబంధించిన ఉత్తరాలను జర్మను రాయబారికి యిచ్చాను. చటర్జీ, జోడ్‌సింగ్, నేనూ ముగ్గురమూ నూడు ప్రత్యేక హోటళ్ళలో చేరాము. జోడ్‌సింగుతో మాట్లాడటం మానేశాను. నేను ఒక స్పానిష్ హోటల్లో ఉంటిని. ఒక రాత్రి దిండుక్రింద ఫర్సు పెట్టుకొని, గదితలుపులు తెరచి పడుకొని నిద్రపోతుంటిని. తెల్లవారేసరికి నా ఫర్సులేదు. రాత్రి కాపలావాడే దొంగిలించి పారిపోయాడు. రొక్కమూ, నోట్లూ పోయాయి. అంతర్జాతీయ ప్రయాణీకుల బ్యాంకు చెక్కులు (ఇంటర్‌నేషన్ టూరిస్టు చెక్కులు) మాత్రము మిగిలాయి. ఏ బ్యాంకుకు వెళ్ళి రొక్కం యివ్వమన్నా బ్రిటిష్ కాన్సల్ అనుమతి లేనిది యివ్వమన్నారు. కాన్సలు వద్దకు వెళ్ళగా "ఈ దేశంలో నీకు ఏంపని? బెంగాలీ వాడివా? బాంబులు వెయ్యడానికి వచ్చావా? జర్మను వాళ్ళతో సంబంధం వుందా? బ్యాంకు నోట్లు మార్చుకోనడానికి అనుమతి యిచ్చేది లేదు" అన్నాడు. ప్రయాణం ఖర్చులకు యివ్వవలసిన జోడ్‌సింగు యివ్వడు. మా కార్యక్రమాన్ని తీర్మానించవలసిన జర్మను మిలిటరీ ఆఫీసర్లు రాలేదు. హోటల్లో నుండి వెళ్ళిపొమ్మన్నారు. ఎన్ని రోజులు ఊరకే ఉండనిస్తారు?

ఎక్కడికి పోవాలి? ఎలాగు జీవించడం? పూరంతా తిరిగాను, విచారించాను. అమెరికాలోపొందినబ్రౌయినింగు వల్ల ఏవిధంగానైనా గౌరవంగా పదేశంలోనైనా జీవించ గలననే నమ్మకం నాలో ఉంది. ఆసియాఖండంలో ఏ రేవు పట్టణానికి వెళ్లినా ఫాస్సీవస్తువులు అమ్మే సింధి వర్తకులు, కాపలా పనులు చేసే పంజాబీయులు (మన నగరాల్లో గూర్ఖాబంట్రోతుల్లాగ) ఉంటారు. వీరిని కలుసుకొనగా కాపలా నౌకరీకి పగలుచేసేవారికి నెలకు రు 90-0-0 అనీ, రాత్రిళ్ళు చేసేవారికి రు 120-0-0 అనీ తెలిసింది. రాత్రి కాపలా నౌకరీ కుదుర్చుకొన్నాను. ఇంతలో జర్మను మిలిటరీ ఆఫీసర్లు వచ్చారు. ప్లానులు పూర్తి అయినాయి. కాపలా నౌకరీ అవసరం లేకపోయింది.

జర్మనీలో బెంగాలీ విప్లవ నాయకులు తయారు చేసిన ప్లానును గురించి వివరాలు తెలిశాయి. ఇండియాలో వుండే బ్రిటిష్ సైన్యము చాలాకొద్ది. ఇండియాలో శాంతి భద్రతలు పోయి, మన సిపాయీలుగాని, ప్రజలుగాని ఎదురు తిరిగితే, ఇండియా పెద్దదేశమయినందున అడవులు, కొండలు, నదులు విశేషంగా వున్నందున గొరిల్లాయుద్ధాలకు ఎన్నో అవకాశాలున్నాయి. తిరిగి శాంతి భద్రతలు ఏర్పడుటకు ఎన్నో లక్షల సైన్యము, ఎన్నో సంవత్సరాలు అవసర మవుతుంది. ఇండియాను పోగొట్టు కొనుటకు ఇంగ్లాండు ఎంతమాత్రం యిష్టపడదు. బ్రిటీషు సేనలను ఇండియాకు విరివిగా పంపుతుంది. అందువల్ల జర్మనులతో

యుద్ధం చేయుటకు సైన్యం చాలదు. యూకప్పుకో ఆంగ్లేయులు ఓడిపోతారు. ఓడిపోయి ధైర్యము, బలము క్షీణించిన ఈ విదేశ ప్రభువులను ఒక తెంపకాయ వేస్తే వెళ్ళిపోతారు. ఇండియాకు స్వతంత్రం వస్తుంది. ఇది జర్మనీకోని విప్లవనాయకుల యోచన.

ఇండియాలో అశాంతిని రేపడం యెలాగు?

1. ఇండియా సైన్యంలో చేరి తిరుగుబాటు చెయ్యడం,
2. అరేబియా సముద్రం మొదలు బంగాళాఖాతము వరకు ఇండియా ఉత్తరాన కొండలు బారులుతీరి వున్నాయి. ఈ కొండలలో నివసించేవారు నాగరికులు కారు. వారికి యూనిఫారం దుస్తులు, తుపాకి యిచ్చి సిపాయి అని పేరు పెడితే యెవరిని కాల్చివేయ మంటే వారిని కాల్చివేస్తారు. ఇలాంటివారితో చేరి డబ్బిచ్చి సైనికులను తయారు చెయ్యాలి. 3. జర్మను సైన్యం ఇండియావైపు వస్తున్నది. ఇండియా ప్రభుత్వం వణుకుతూ వుంటుంది. ఇండియా కొండలలో తరిఫీదు అయిన సైన్యం మైదానాల మీద పడాలి. ప్రభుత్వసేనలు కొన్ని తిరుగబడేలాగు చెయ్యాలి. ఈ విధంగా బ్రిటిష్ మిలిటరీబలం నాశనమవుతుంది. పోలీసులు, మాజిస్ట్రేటులు పారిపోతారు. ప్రభుత్వం ప్రజల వశమవుతుంది. ఇవీ అప్పట్లో మా ఆలోచనలు. 4. జర్మనీకి వెళ్ళటకు వీలుపడక విదేశాలలో నిలిచిపోయిన జర్మను ఆఫీసర్‌లు మాకు సహాయం చేయాలి. 5. ఈ పనులను కొనసాగించటానికి రెండుస్టీమర్లనిండా ఆయుధాలను జర్మ

నులు అమెరికాలో కొని పంపాలి. 6. ఖర్చు లన్నిటికి జగ్మను గవర్నమెంటు రెండుకోట్ల రూపాయలు యిస్తుంది.

పై ప్లానులో ఒక భాగం సయామ కొండలు దాటి వచ్చి బర్మాను పట్టుకోవాలి. ముందుగా కొందరు బర్మాలోని భారత సైనికులను కలుసుకొని వారు తిరుగబడుటకు ఏర్పాటు చెయ్యాలి.

జావాలో బటేవియా నగరం వెళ్ళి ఆయుధాల స్టీమరు రాగానే సయామకు పంపి రహస్యమైన సముద్ర తీరంలో ఆయుధాలను దింపించివేయుటకు నన్ను వెళ్ళ మన్నారు. అటుతర్వాత జావాలో ఒక అచ్చాఫీసును కొని ద్రావిడ భాషలు నాల్గింటిలోను గదరు పత్రికను ప్రచు రించి ఇండియా వెలుపలి దేశాలలో ఉండే మన ప్రజలకు విప్లవ పత్రికలను, సాహిత్యాన్ని అందజేయమని కోరారు. నేను ఇలాంటి ప్రాతపనులకు ఒప్పుకోలేదు. బర్మానుపట్టు కొనుటకు నియమింపబడిన యెనిమిదిమంది ముఖ్యులలో ఒకనిగా నన్ను చేర్చుకున్నారు. సయామలో మాకేంద్రం ఉండాలి. మలయా, చైనా, జావా మొదలయిన దేశాల నుండి మాలో చేరే ఇండియన్ రిక్రూటులను సయామకు రప్పించాలి. కొండలమీదుగా బర్మాలోకి పోయి యుద్ధం చెయ్యాలి.

అమరసింగు మలయాదేశంలో కంట్రాక్టరు గదర్ పార్టీ ఆర్గనైజరు. బర్మాలోని భారత సైన్యంతోను, మిలిటరీ పోలీసులతోను (30000 పంజాబీయులు) రహస్య

యేర్పాట్లు చేయించటం ఆయన పని. ఈ సందర్భంలో శివ దయాళ్ ఆయనకు సహాయం చెయ్యాలి.

బల్వంత్ సింగు గ్రంథి కెనడాలో వాంకోవరు నగరంలో సిక్కుల గురువు. ఆయన మా యెనిమిది మందిలో ఒకరు. యుద్ధ సంబంధమయిన విషయాల్లో ఆయన మా నాయకుడు. కొద్ది వయసప్పుడు ఇండియా సైన్యంలో చేరాడు. యుద్ధాలు చేశాడు. ఆయన, చటర్జీ, నేను కాల్బలానికి (Infantry) ఆఫీసర్లం. ముగ్గురు జర్మనులు ఫిరంగి దళాలకు ఆఫీసర్లుగా చేరారు. ఇవన్నీ యిప్పుడు నాకే నవ్వు పుట్టిస్తాయి. అనేక లోపాలు కూడ యిపుడు కనుబడుతున్నాయి. ప్రజలను సంఘటితపరచి వారు విప్లవ కార్యక్రమాలలో పాల్గొనేలాగు చేయకపోతే అపజయం తప్పదని బాగా తెలుసు. ఒక్క సైన్యమే తిరుగబడినంత మాత్రాన జయంరాదని కూడా యిప్పుడు నాకు తెలుసు. కాని ఆ కాలంలో యివన్నీ సాధ్యంగానే తోచాయి మా అందరికీ.

మనీలా నగరంనుండి సయామునకు ఎలా చేరటం? సింగపూరు రేవులోగాని, హాంకాంగ్ రేవులో గాని ఆగకుండా వెళ్ళే స్టీమర్లుండవు. ఆ రెండు రేవుల్లో బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేస్తుంది. వేరే ప్రత్యేకప్లాను అవసరం. చైనా సముద్ర తీరంలో అంతర్జాతీయమయిన రేవుపట్టణాలున్నాయి. అక్కడికి నేరుగా వెళ్ళే చైనా స్టీమర్లలో వెళ్ళాము. అక్కడ ప్రత్యేకంగా ఒక స్టీమరును ఏర్పరచు

కొని ఫ్రాంకాంగులో ఆగకుండా సరాసరి సయాంలో బాం కాక్ చేరాము.

సయాం స్వతంత్ర రాష్ట్రమని, మమ్మల్ని అరెస్టు చేయరని, చేసినా అంతర్జాతీయ చట్టప్రకారం మేము ఏ విదేశపు రేవులోంచి వచ్చామో ఆ రేవుకు పంపివేయగల వారేగాని మరే హాని జరగదని తీర్మానించుకొని వెళ్లాము.

చటర్జీ, జోడ్‌సింగు, నేను బాంకాక్‌లో వేరే వేరే హోటళ్ళలో చేరాము. వెళ్ళిన సాయంత్రమే కార్యక్రమం ప్రారంభించాము. ఒక పంజాబీ మిఠాయికొట్లో యజమా నికి సంగీతమంటే యిష్టమన్న సంగతి చటర్జీ గ్రహించి పాటలుపాడమని తానేపాడడం ప్రారంభించాడు. గుంపులు చేరారు; తబలాలు వచ్చాయి. అభినయాలు, నాట్యాలు ప్రారంభ మయినయ్. విందు చేశారు. మాకు స్థానికంగా కావలసిన సదుపాయాలు ఏర్పడ్డాయి. బలవంత సింగు, ఠాకూరుసింగు షాంగైనుండి వచ్చారు. అమరసింగు, శివ దయాళు బర్మాలోసైన్యాలతో ఆలోచనలు పూర్తిచేసుకొని వచ్చారు సయాం కొండల మీదుగా మేము చిన్న సైన్య ముతో బర్మాలోకి వెళ్ళి యుద్ధం ప్రారంభించగానే భారత సైనికులు మాతో చేరిపోతామన్నారు.

సి. ఐ. డీ. లు

అయితే ఇండియా గవర్నమెంటుకు సంబంధించిన సి. ఐ. డీ. లు పంజాబునుండి వచ్చారు. మావెంటపడ్డారు.

మా రహస్యాలను తెలుసుకుంటున్నారు. సయామ్ గవర్న మెంటు పోలీసు డిపార్టుమెంటులో ముఖ్యోద్యోగులు అంగ్లేయులే. వారు ఇండియా పోలీసు డిపార్టుమెంటులో ఇన్సెపక్టరు జనరలు, సూపరింటెండెంటు ఉద్యోగాలుచేసి రిటైర్ అయి పించన్లు పుచ్చుకుంటూ, సయామ్ పోలీసు డిపార్టుమెంటును తమ హస్తగతం చేసుకొంటున్నారు. కాబట్టి పోలీసుశాఖ మాకు విరోధంగా పనిచేసింది.

ఈ బాధలనుండి తప్పించుకొనుటకు కొండలకు, అడవులకు వెళ్ళడం మంచిదని నిర్ణయించుకున్నాం. బాంకాకులో కొంతకాలం ఒకరుమాత్రం వుండి వచ్చేవారిని రహస్య ప్రదేశాలకు పంపుతుండాలి. బహిరంగంగావుంటూ రహస్య కార్యకలాపాలను నిర్వర్తించడానికి నేను బాగా ఉపయోగపడతానని వారి నిర్ణయం. కారణం - నేను ఒక్కడినేయూనివర్సిటీలో చదువుకున్నవాడిని, బి.ఎస్.సి.ని బాంకాకు కాలేజీలో వృక్షశాస్త్ర ప్రొఫెసరు పదవి ఖాళీ అయింది. ఆ ఉద్యోగం సంపాదించుకోమని నన్ను ఆజ్ఞాపించారు. 1_2 నెలలలో రహస్యాలు బయటపడేలోగా నా పనులు పూర్తిచేసుకుని కొండలకు చేరుకోవాలి. కాలేజీకి దరఖాస్తు చేశాను. పేరు కూడా మారుపేరే. ఉద్యోగం నాకే యిస్తామన్నారు. కాని ఈ ప్లాను పూర్తి కాకముందే ఒక తప్పు జరిగింది.

బాంకాక్‌కు ఒక పంజాబు సి ఐ. డి. ఆఫీసరు గట్టి వాడు వచ్చాడు. మా అందరివెంటా పడ్డాడు. మా ఇండ్లకు

పచ్చి మాత్రో స్నేహం చేసుకోవాలని ప్రయత్నించాడు. ఆర్యసమాజకుడనని చెప్పుకొని, ప్రముఖ ఆర్యసమాజ నాయకుని యింట్లో బసపెట్టాడు. పంజాబులో గదరుపార్టీ వారు చేసిన సాహసకార్యాలను చాటిస్తూ దేశభక్తుడనని ప్రకటించుకున్నాడు. ఇంతేగాదు. ఎంతోమంది సి ఐ.డీ లు గదరుపార్టీ లో చేరుతూవచ్చారు. ఎవరు యెలాంటివారో పరీక్షచేయటానికి మాకువ్యవధిలేదు. గదరుపత్రిక ప్రపంచ మంతటా ప్రచారం చేసింది. దాని ఫలితంగా యెందరో పార్టీలో చేరి తమ దేశభక్తిని ప్రకటించారు.

బాంకాకులో మా ఏడుమందిలో జోద్‌సింగు చాలా పిరికివాడు; అసమర్థుడు. ఇదివరలో చెప్పినట్లు సి. ఐ. డీ.ల అనుమానం ఎక్కువగా వున్నవాడు. ఏకాలంలో, ఎవరితో ఎలాప్రవర్తించాలో బొత్తిగా తెలియదు. కాబట్టి బాంకాక్‌కు వచ్చింది మొదలు చాలా రహస్యంగా కాలంగడిపాము. చివరకు మేము కూడ ఆయన్ను కలుసుకోవడం యిష్టపడ డని దూరంగా వుంటూవచ్చాం. మిగిలినవారందరం ఒకరి అనుభవాలను మరొకరికి తెలుపుకుంటూ వచ్చాము. మేము మాత్రం పంజాబు సి. ఐ. డీ. ఆఫీసరు విషయంలో మాత్రం జాగ్రత్త పడ్డాం. ఇది జోద్‌సింగుకు తెలియదు. ఆఫీసరు జోద్‌సింగును కలుసుకొని, ఏమేమో చెప్పి మోస గించి వలకో వేసుకొని, తన బసకు తీసుకుని వెళ్ళి విందు చేస్తూన్నట్లు నాకు తెలిసి ఆఫీసరు యింటికి వెళ్ళాను. ఇద్ద రినీ కలుసుకున్నా. జోద్‌సింగును ప్రత్యేకంగా కలుసు

కొనుటకు అవకాశ మివ్వలేదు. చివరకు కంటితో సైగ చేయుటకు కూడా నాకు వీలుపడలా. సెలవు తీసుకోడానికి అనే సాకుతో జోద్‌సింగుకు షేక్ హాండు యిస్తూ అరచేతిని గిరి వెళ్ళిపోయాను. ఐతే జోద్‌సింగు జాగ్రత్తపడనేలేదు. క్షణాగి రహస్యా లన్నీ చెప్పాడు. నన్ను తప్ప మిగిలిన ఆరు గురిని ఆ రాత్రి అరెస్టు చేశారని, తెల్లవారు జామున నాలుగు గంటలకు ఆర్యసమాజ నాయకుడు నన్ను నిద్ర లేపి చెప్పాడు. తనను ఆఫీసరు మోసగించాడని విచార పడ్డాడు. ఇప్పుడు నన్ను తప్పించడానికి సహాయం చేస్తా నన్నాడు. అడవులగుండా చైనాచేరే మార్గం చూపుతా నన్నాడు. అయితే సాయంత్రం 7 గంటల వరకు కాల్లు లేదు. అంతవరకు మరెక్కడయినా దాక్కోవాలి. అతనిని నమ్మను. పెట్టెలు యెలాగున్నయ్యో అలాగేవుంచి చేతి పెట్టె, చిన్న బట్టలమూట తీసుకుని చీకటిలో బయలు దేరాను. ఎక్కడ దాగుకోవాలి? చేతిపెట్టెలో రహస్యపు కాగితాలు, ప్లానులు, ఉత్తరాలు, డైరీలు, రివాల్వారు ఉన్నాయి. సాయంత్రంలోగా నేనుఅరెస్టయినా యీచిన్న పెట్టె పోలీసులకు లభించకుండా చెయ్యడం ఎట్లా? ఇదే నా ఆలోచన. చివరకు ఒక యూరోపియన్ హోటలుకు వెళ్ళాను. తెల్లవారలేదు. ఆ హోటలు మొదట నేను ఉన్నదే. ఒక గదిని నాకు ప్రత్యేకించి ఉంచమని చెప్పి, చేతిపెట్టెను భద్రంగా పెట్టమని ఆఫీసుకో యిచ్చేసి వెళ్లాను. మమ్మల్ని యెవరూ కనిపెట్టలేదు. దోవలో జపానువాళ్ళ

భోగం యిల్లు కనబడింది. సాయంత్రం చీకటిపడే వరకు నేను రహస్యంగా ఉండుటకు అనుకూల ప్రదేశమని సలహా యిచ్చాము. తెల్లవారుజామున మేము అక్కడికి వెళ్ళడం వారికి ఆశ్చర్యాన్నికలిగించింది. ఎలాగో ఒకగద సంపాదించాము. ఆయన తిరిగి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి 8 గంటలకు నేను బాంకాక్ సమీపంలో వుండే రైలెక్కి ఆయనను ప్రైయినులో కలుసుకోవాలని, చైనావైపుకు ప్రయాణం చేయాలనీ, హోటల్లో వుంచిన పెట్టెను తానే తెస్తానని అన్నాడు. అప్పటికి అదిస్తానన్నాడు.

అరెస్టు

ఆ యింటిలో నాకు అసహ్యంగా వున్నది. వారికి నామీద సంశయాలు యెక్కువవుతూ వచ్చాయి. నాకు విసుగుపుట్టింది. సాయంత్రం 5గంటలకే బయటకువచ్చాను. రిక్షాపై రైలుస్టేషనుకు బయలుదేరాను. మూడు నాలుగు మైళ్ళదూరం పోయేసరికి ఒక మోటారుకారు వెంబడించింది. ఒక ఆంగ్లపోలీసు ఆఫీసరు నన్ను అరెస్టుచేసి తన కారులో ఎక్కించుకొని తన బంగళాకు తీసికొని వెళ్ళాడు. టీ పంపుతానని ఇంటిలోకి వెళ్ళాడు. ఒక పోలీసు అక్కడే వున్నాడు. ఆఫీసరుకు నే నొక స్నేహితుడనని పోలీసు అనుకొన్నాడు. నా డైరీని పూర్తిగా చించి అక్కడే చిత్తుకాగితాల బుట్టలో వేశా. ప్రాతమూలకమయినది నావద్ద ఏమీ లేదు. బాంకాకులో నన్ను విదేశీయుల జెయిల్లో

పెట్టారు. నా యింటిలోని సామాను లన్నియు తెచ్చి యిచ్చారు. హోటల్లో పెట్టిన చిన్న పెట్టె మాత్రం రాలేదు.

జెయిల్లోకి అడుగు పెట్టేసరికి, భాయి బలవంతసింగ్ గ్రంథి, భాయిఠాకుర్‌సింగ్, జోద్‌సింగ్, ఛాటర్జీ, భాయి అమర్‌సింగ్, శివప్రసాద్‌గుప్త ప్రత్యేకగదులలో ఉన్నారు. జోద్‌సింగ్‌వద్ద వున్న డైరీ పోలీసులకు దొరికిందన్న వార్తతో గుండెలు పగిలాయి.

అంతర్జాతీయ చట్టం ప్రకారం మమ్మల్ను ఏ విదేశ రేవులనుండి వచ్చామో ఆరేవులకు—చైనాతీరంలోవున్న ఆమాయ్‌పూచౌ, స్వాటోవ్, హాంగ్‌కాలకు—తిరిగి పంపాలి. అయితే మాకు కలిగిన కొంచెం పరిచయాన్నిబట్టి, సయాం దేశము ఆంగ్లేయులకు లోబడి యున్నదని, పోలీసుశాఖ ఆంగ్లేయుల స్వాధీనంలో వున్నదని, మాకు అంతర్జాతీయ చట్టం వర్తింపచెయ్యరని తలచితిమి. మమ్మల్ని ఇండియాకు పంపించేస్తారని, జెయిలుసూపర్నెంటు సయాము దేశస్తుడు- ఎప్పటి రహస్యాలు అప్పుడే చెపుతూవచ్చాడు. జెయిలునుంచి మేమందరం తప్పించుకపోవటానికి అమర సింగు ప్లానువేశాడు. ఆయన విగ్రహం చాలచిన్నదైనా ధైర్యసాహసాలలో అతనికి అతనేసాటి. జయిలుబయట వుండే విప్లవకారులతో సంబంధం పెట్టుకున్నాడు. జెయిలు గోడను బాంబుతో పడగొట్టడం, ఆ గందరగోళంలో మేము పరుగెత్తి బయట తయారుగావుండే కారులో కూర్చోవడం, దగ్గరఅడవులకు వెళ్ళి దాక్కొని తప్పించు

కోవాలన్నాడు. అయితే ఈ ప్రయత్నం కొనసాగలేదు. రెండు నెలలకు సింగపూరు నుండి మిలిటరీ పోలీసుదళం వచ్చి మమ్మల్ని అందరిని సింగపూరు కోటకు తీసుకెళ్లారు.

బాధలు ప్రారంభం

స్థూలకాయుడు, ఎత్తైన ఒక బ్రిటిష్ పోలీసు ఆఫీసరు యిరవైమంది మలయా పోలీసుదళంతో వచ్చి మా ఏడు గురిని సకూం పోలీసులనుండి స్వాధీనం చేసుకొని తమ స్టీమరులోకి తీసుకెళ్ళారు. వీడు మమ్మల్ని పెట్టిన హింసలు ఇన్నీ అన్నీ అని చెప్పటానికి వీలులేదు. కారణమేమిటో అప్పుడు మేము ఊహించలేకపోయ్యాము. ఒక్కొక్కరికి ప్రత్యేకంగా సంకెళ్లువేసి, తిగి యిద్దరిద్దరిని కలిపి సంకెళ్లు వేశాడు. మూడున్నర జతలు అయ్యాం. అటుతరువాత అనవసరంగా నాలాంటి సన్నని వానిని డొక్కలో పొడిచాడు. అమరసింగు, చటర్జీ, నేను చాలా సన్నటివాళ్లము. మిగిలినవారు ఆజానుబాహులు; ముఖ్యంగా భాయి బలవంతసింగ్. మమ్మల్ని స్టీమరుమీద బయలు ప్రదేశానికి (డెక్కు) తీసుకెళ్లాడు. స్టీమరులోని సామానులను తీయటానికి పెట్టటానికి డెక్కుమీద ఒకకంత వున్నది; 15 అడుగులు × 12 అడుగులు వున్నది. దానికిపక్కగా మూడడుగుల దూరంలో చుక్కానికి స్టీమరు వెనుకభాగంలో దిక్కులను మార్చేదానికి మణికట్టంత లావైన యినుపగొలుసాకటి వుంటుంది. చుక్కానిని అటూయిటూ త్రిప్పుతూ

వుండాలి. అప్పుడు గొలుసు కదులుతూ వుంటుంది. ఈ కంతకు గొలుసుకు మధ్యవుండే 15 అడుగుల పొడవు మూడడుగుల వెడల్పు స్థలంలో మమ్మల్ని కూర్చో పెట్టాడు. నెత్తిమీద నీడలేదు. ఎండకు యెండాము, వానకు తడిశాము. కప్పుకోడానికి మా బట్టలయినా మాకు యివ్వలేదు. ఒరుసుకుపోతున్న సంకెళ్లతో జతలప్రకారం పడుకోవాలి. మాకు కాళ్లు చాచుకోటానికి పొడుగు చాల లేదు. వెడల్పుచాలక యినుపగొలుసు రాచుకపోతున్నది చలి, తడిగుడ్డలు, రాత్రిళ్ళు. డస్సిపోయాము మొదటి రాత్రే. ఉదయాన పళ్లు తోముకోడానికి నీళ్ళు యివ్వలేదు. దొడ్డికికూడా జతగావెళ్లాలి; అప్పుడైనా సంకెళ్లు తీసివెయ్యలేదు. ముడ్డితుడుచుకోమని న్యూసుపేపరుయిచ్చాడు. తుడుచుకోవడం ఎట్లా? ఓపికలేదు; తిండిలేదు; ఏమిచెయ్యటానికీ సాధ్యపడదు. బొంకాకు జెయిలువిడిచిన 36 గంటలకు, అప్పుడాలవంటి సన్ననిపైదాపిండి చపాతీలు, వెడల్పుగా చేసి ఒక్కొక్కరికి ఒక్కొక్కటి యిచ్చాడు. ఈ పోలీసు దొరగారు ఒక దొరసానిని వెంటపెట్టుకొని ఒక కెమెరాతో ఫొటోఎత్తాడు. దొరగారు దొరసానితో గప్పాలు కొట్టుకొంటున్నాడు.

"తిండిచాలిందా" అని మాతో పరిహాసం ప్రారంభించాడు.

ఆకలి ఉన్నప్పటికి మాకు తిండిమీద ఆలోచనలేదు. కసితీర్చుకోవాలని మాత్రమే మాకోరిక. ఎవరమూ

పలక లేదు. తిరిగి నవ్వుతూ ఏంకావాలన్నాడు. "ఒక ఊల్లిపాయ కావాలి" అన్నాడు చటర్జీ.

"మరేం కావాలి" అన్నాడు ఆఫీసరు.

"ఉప్పు కావాలి" అన్నాడు చటర్జీ

"యింకేమి కావాలి" అన్నాడు ఆఫీసరు

"టీ కావాలి" అన్నాడు చటర్జీ.

"దొంగరాస్కెల్ ! నీకు టీ కావాలా?" అని లెంపకాయ వేశాడు.

చటర్జీ అంతం లేకుండా నవ్వాడు.

"ఓరి పిరికివెధవా! ఒరే, బలిసినపందీ! ఒరే కొడీ!" అని నవ్వుతూనే తిడుతున్నాడు చటర్జీ. మాకే ఆశ్చర్యం వేసింది. పోలీసు దొర తెల్లపోయాడు. దొరగారిముఖం దొరసానిముఖం ముడుచుకుపోయాయి. దొర నిర్ఘాంత పోయాడు. దొరగారిని దొరసాని చెయ్యిపట్టి లాక్కు పోయింది. ఆరురోజుల ప్రయాణం సాగింది. కాని వాడు తిరిగి మాకంటపడలేదు. సంకెళ్ళు ఆలాగే వున్నై. కాని మలయా పోలీసులు కొంతసాయం చేశారు. నీళ్ళిచ్చారు. అప్పడాలు చపాతీలుగా మారాయి. ఇంకా ఎంతో చెయ్యాటం మలయాపోలీసులకు యిష్టము; కాని దొరగారి భయమో !

సింగపూర్‌లో భారతసైనికుల తిరుగుబాటు

సింగపూర్‌లో బ్రిటిష్ పోలీసుఆఫీసరు మమ్మల్ని

ఎందుకు అంతగా హింసించాలి ? కారణం మలయా పోలీసులు చెప్పారు.

సింగపూర్‌లో మన రెజిమెంటు ఒకటి ఉంది. అది రాజపుత్రస్థానం ముసల్మానులది. వారిలో గదరుపార్టీ ప్రచారం జరిగింది. టర్కీబూచి మతాభిమానం ఉంది. అందువల్ల బ్రిటిష్ ప్రభుత్వం నాశనం కావాలని వారి కోరిక. రెజిమెంటును యూరపుకు పొమ్మని ఉత్తరువు చేశారు. పోవడానికి ఎవరికీ యిష్టంలేదు. తీవ్రవాదులు కొందరు తమ వైపుల్ని తీసుకొని సింగపూరు నగరంలోకి వెళ్లారు. 343 మంది ఆంగ్లేయ స్త్రీలను పురుషులను బిడ్డలను కాల్చివేశారు. సింగపూర్‌లో ఆంగ్లేయులు ఎవరూ మిగలలేదు. ఈలాగు కాల్చి వేసేవారికి, తమ రెజిమెంటులో ఒక్కరైనా అప్పగింపడలేదు. సింగపూరును పట్టుకున్నారు నాలుగు రోజుల తరువాత. ఆ కాలంలో ఇంగ్లాండుకు ఆప్తులైన జపానువారి యుద్ధనౌకలువచ్చి సింగపూరును స్వాధీనం చేసుకొన్నాయి. కొద్దిరోజులు గడిచాక, తిరిగి బ్రిటిష్ సైన్యానికి సింగపూరును జపానీయులు యిచ్చేశారు. వెంటనే మార్షల్ లా ప్రయోగించారు. ప్రజలను చాలా భయకంపితులను చేశారు.

సర్కారుకు అనుకూలంగా సాక్ష్యం యిచ్చేవారందరికీ పెద్ద పెద్ద జీతాలతో ఉద్యోగాలు యిచ్చారు. వారిలో ముఖ్యుడు ఒక ఆంగ్లో - పార్శీవాడు. అతని రు 100/- జీతాన్ని రు 500/- కు పెంచారు. కుట్రలను పరిశోధించే

ముఖ్య ఆఫీసరు (Special Investigaton Officer) అయ్యాడు. చాలామంది సిపాయీల మీద లేనిపోనివి కల్పించి, కోతిపుండు బ్రహ్మరాక్షసి చేశాడు.

అతని ముఖ్య ఉపాయం ఏమంటే "పిరికిగాడిదా"! నిజం చెప్పడానికి భయపడ్డావా? చావడానికి భయపడుతున్నావు"? అని తిట్టేవాడు.

సిపాయీలు పౌరుషశాలురు. వారికి కోపమువచ్చి "మేము చేసిందేదో చేశాము! నీ యిష్టమంటే కాల్చేయి తిట్టితేమాత్రం ఊరుకోము. జాగ్రత్త" అని జవాబు ఇచ్చేవారు. ఇల్లా రెచ్చగొట్టాడు. ఈవిధంగా ఎందరో నిరపరాధులైన సిపాయీలను మార్షల్ కోర్టుసహాయంతో కాల్పించాడు. ఈలాంటివారు ఎందరయినది నాకు జ్ఞాపకములేదు. కాని, ముఖ్యంగా ఒక జమేదారుని గురించి ఇతడు చాలాచాలా చెప్పేవారు. ఎంతవరకు సత్యమో, ఎంత పెద్దదిచేసి చెప్పారో కాని తెలిసికొనదగిన విషయం.

జమేదారు షుమారు 400 పౌనులకు పైగా తూకం. చాలా ఎత్తూ, లావూ, ఏనుగు పిల్లలాగుండేవాడు. ఆయన కాళ్లను, నడుమును, చేతులను, రెక్కలను ఇనుప గొలుసులతో బిగించారు. బ్రిటిష్ గవర్నమెంటు మిలిటరీ గదిలోనుండి వెలుపలికి తెచ్చినప్పుడు ఎనిమిదిమంది సోల్జర్లు ఆ గొలుసులు పట్టుకొనేవారు. చివరకు మరణ దండన విధించి కాల్చుటకు తీసుకెళ్లారు. అప్పుడు అక్కడ వున్న ట్రూప్‌షైరు రెజిమెంటులోని సోల్జర్లు (వాలంటీర్లు)

చిన్నవయసు వారయినందున ఆ జమేదారుని కాల్చుటకు భయపడ్డారు. వారిని వెనుకకు పంపివేసి, కాల్చివేయుటకు ధైర్యంగల వారిని, అయిదుగురిని, తమంతటతామే సమ్మతించి రమ్మన్నారు. ఆ లాగున వచ్చినవారు మామూలు ప్రకారం గురిపెట్టి గుండెలో కాల్చారు. నేలమీద కూలిపోయాడు కాని చావలేదు. ఒకమేజరు, ఆ జమేదారు రొమ్మ్ల మీద కాలుతో తొక్కిపెట్టి రివాల్వరుతో మెదడులో కాల్చాడు; చావలేదు! గుండెల్లో కాల్చాడు; అప్పటికీ ప్రాణం పూర్తిగాపోలేదు. వూపిరితిత్తులను గట్టిగా చేతులతో ఒత్తి గాలి పోయ్యేలాగుచేశాడు. సింగపూరునుండి కలకత్తాకు మమ్మ్లను స్టీమరులో తీసుకెళ్లిన ప్రొవిజనల్ రెజిమెంటు సోలరు ఈ సంఘటనను ఆశ్చర్యంతోనూ ఉత్సాహంతోనూ చెప్పారు. వారిప్రుద్దేశం ప్రపంచానికి మాద్వారానైనా తెలియపరచాలనే కుతూహలం ఉన్నట్లు భావించాము. ఆ జమేదారు ఎవరో, భోగట్టా చెయ్యడం నాకు సాధ్యపడలేదు. ఇంతవరకు మాత్రమే తెలుసు. రాజపుత్ర ముసల్మాను రెజిమెంటులో జమేదారు. సింగపూరులో సిపాయీలు తిరుగబడిరి; జమేదారు నిలువలేదు; వెనుకనుండి ప్రోత్సాహం చేశాడనే నెపంతో మార్షల్ కోర్టువారు కాల్పించారు. (1915 సం.)

ఈలాంటి వీరగాథ సింగపూరులో జరిగిన తరువాత, అక్కడి బ్రిటిష్ మిలిటరీ పోలీసులకు మావంటి గదర్

పార్టీవారు చేతచిక్కితే చిత్రహింసలు పెట్టారంటే విచిత్రమేమిటి? ఇంకా చెప్తా.

మిలిటరీ రాక్షసులు

బాంకాకునుండి మమల్ని తీసుకవచ్చి సింగపూరులో మిలిటరీవారికి మా ఏడుగురిని స్వాధీనంచేశారు అప్పుడు అక్కడ మార్షల్‌లా రాజ్యం. మిలిటరీ డిటెన్షన్ బ్యారక్సులో (మిలిటరీ జైలుపేరు) ఒక్కొక్కరిని ఒక్కొక్క గదిలో పెట్టారు. చక్కతలుపులతో పూర్తిగా మూసేశారు. వెనుకవైపు గోడలో సీలింగుకు సమీపంలో వెలుతురు రావడానికి ఒక చిన్నకంత వుండేది. గాలి రావడానికి సాధ్యంకాదు. లోపల ఏమిచేస్తున్నామో వెలుపలనుండి చూడడానికి, గ్లాసుతో మూసినకంత వుండేది. ఒక మంచం (బెంచి), దోమతెర, కక్కసుచట్టి, లోటా, సన్నటికాగితాలచుట్ట యిచ్చారు. తువ్వాళ్లుగాని, పండ్లబ్రష్‌గాని, దువ్వెనగాని, అద్దంగాని, సోపుగాని యివ్వలేదు. మా స్వంత వస్తువులను చూడనివ్వలేదు. స్నానానికని బకెట్టు నీళ్లువారానికి ఒక తడవ యిస్తారు. పుస్తకాలు చదువ కూడదు. ఒకరిని కలుసుకోడానికిగాని, ఒకరితో మాట్లాడడానికిగాని వీలులేదు; పాడుకోకూడదు. ఈలాగు ఆరు నెలలు ఏకాంతవాసము. మా కంఠంలోనిశబ్దమే మాకు కొత్తగా తోచేది. గడ్డాలు మీసాలు పెరిగాయి, తలలో పేలు. నోరు వాసన; పండ్లుగార; ఒకటిరెండు నెలల త

వాత వ్యాయామం పేరిట, మిట్టమధ్యాహ్నం కాలే కాలే పన్నటి గులకరాళ్ళమీద తప్పక నడవాలి. బూట్సుగాని చెప్పులుగాని వుండవు. బొబ్బలుపడితే సోల్జర్లు చేతులుపట్టి లాగి నడిపించేవారు. మేము ఏడుగురితో ప్రారంభమై, తొమ్మిదిమందితో స్థిరపడ్డాము. మాతోకలసి పనిచేయుటకు నియమింపబడ్డ జర్మను ఆఫీసర్లు అరెస్టుచేయబడారు. కొద్ది రోజులలో మరొకచోటికి తీసుకెళ్లారు. బెనారసులోని కోటీశ్వరుడు - కాంగ్రెసు నాయకుడు - శివప్రసాద్ గుప్తా గారు కొద్ది రోజులు మాత్రమే ఆ జెయిలులో వున్నారు. ఆయనమీద అనుమానం ఏమంటే బెంగాలు పెరరిష్టుల ద్రవ్యాన్ని ప్రపంచయాత్ర అనే నెపముతో, దేశ దేశాలలో వారి మెంబర్లకు అందచేశాడని. అయన చాల లావాంటి వాడు. మెట్లు ఎక్కడం దిగడం ఆయనకు చాల కష్టం. ఇద్దరు సోల్జర్లు రెక్కలుపట్టి "పందీ! ఎక్కు" అని లాక్కొని పోయ్యేవారు. గులకరాళ్ళమీద నడవలేక కూలపడాడు. చేతులుపట్టిలాగి పరుగెత్తమనేవారు.

ఈలాంటి రాక్షసులమధ్య ఏకాంతవాసంవల్ల మనో వ్యాధులు ఏర్పడ్డాయి. ఒకరికి తాత్కాలికంగా పిచ్చెత్తింది. నాకు ఒకవ్యాధి (న్యూరాస్ కొలైటీస్) క్రానిక్ అయింది. ఇది ఒక నరాల వ్యాధి. కారం ఎంతస్వల్పంగా తిన్నా బేధులు, రక్త బేధులు అవుతాయి. నా రోగలక్షణ మేమిటో తెలిసికోలేక, అన్ని పద్ధతుల వైద్య శిఖామణులు

1920 మొదలు 1931 వరకు నా ఆరోగ్యాన్ని మరీమరీ పాడుచేశారు.

నేరారోపణ

జోద్‌సింగ్ డైరీ ప్రభుత్వానికి చిక్కింది. అతను జర్మనీనుంచి అనేక దేశాలు తిరిగివచ్చాడు. కొన్ని డజన విప్లవకారుల పేర్లేగాక, వారు ఏమిచేస్తున్నది డైరీవల్ల బ్రిటీషు గవర్నమెంటుకు తెలిసింది. మమ్మల్నిగురించి జోద్‌సింగుకు తెలిసింది స్వల్పమే. మేముచేసింది ఏమీ లేకపోయినా, ప్లానులువేశాము, ఆయుధాలు సేకరించాము, జర్మనీలతో కలసి కుట్రలుచేశాము అనే నేరములున్నవి. మాలో యిద్దరు- అమరసింగు, శివదయాళ్ (పంజాబీ) పైది బర్మాలో సైన్యము, మిలిటరీపోలీసులు తిరగబడటానికి ఏర్పాట్లు చేసినందుకు మోపనున్న నేరము పెద్దది. నాఁబాద ఆయుధాల స్మీమరును, దానికి సంబంధించిన ఉత్తరాలు తెచ్చాననన్న నేరమున్నది. మే మందరమూ రెండు మూడు సంవత్సరాలుగా గదర్ పార్టీతో సంబంధాలు పెట్టుకొని పనిచేశాము. ముఖ్యంగా భాయి బలవంతసింగు మీద ఎన్నో నేరాలున్నవట. పూర్వ చర్యలను గురించిన రిపోర్టులు గవర్నమెంటుకు చేరేవుంటాయి. అమెరికాలో వున్నప్పుడే, మావిద్యార్థులమీద, తోటివిద్యార్థి హెన్రీ యుడ్వర్డు పాండ్యన్ (తిరునల్వేలిజిల్లా) రిపోర్టులుయిచ్చి డబ్బు సంపాదించుకొంటూ వున్నట్టు మాకు కొంతకాలం

తరువాత తెలిసింది. * శాన్ ఫ్రాన్సిస్కోలో గదరుపార్టీ హెడ్ ఆఫీసులో ఒకప్పుడు నాయకుడుగా వున్న రామచంద ర్‌ను సి. ఐ. డి. అని తెలుసుకొని గదర్‌పార్టీవారు కోర్టు లోనే కాల్చిచంపారు. జోద్‌సింగు డయిరీ ప్రభుత్వానికి చాలా సహాయకారి అయింది. మమ్మల్ని ముగ్గురు ఆఫీసర్లు ప్రత్యేకంగా విచారణచేశారు:— (1) ఆంగ్లో పార్సీవాలా- పేరు జ్ఞాపకంరాలేదు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసరు (2) స్కాట్‌లాండుయార్డునుండి వచ్చిన యక్సుపర్టు (3) డెన్హామ్. ఈ డెన్హామే లాహోరు కుట్రకేసులో చీఫ్ ప్రాసి క్యూషన్ ఆఫీసరు.

మొదటివానిని సర్కారు నమ్మినట్లుగా లేదు. రహస్య రిపోర్టులను—బ్లూబుక్సు—వాని కివ్వలేదు. అందువల్ల మా పూర్వచరిత్ర వానికి తెలియదు. ప్రమోషను కొరకు మసిపూసి మారేడుగాయను చెయ్యాలి. తన దురాశకొరకు, మా స్వభావాలను గ్రహించి, తనలాభంకొరకు ఉపయోగ పర్చుకొన్నాడు. మేము పంజరంలో పెట్టబడిన పక్షులలాగు దొరికిపొయ్యాము. నావిషయంలో వాడి ఎత్తుగడ వివ రిస్తాను. నేను కోపదారినని తెలుసుకొన్నాడు. రోషము కలిగేట్టు రెచ్చకొట్టాడు.—

---

* హెన్రియడ్వర్డు పాండ్యన్, ఇండియను సివిల్ సర్వీసును, ఇండియాకు రాగానే పోలీసు డెప్యూటీ సూపర్నెంటు ఉద్యోగం యిచ్చారు. జిల్లా సూపర్నెంటు నౌకరిచేసి రిటైరు అయ్యాడు.)

... వాలా:— "నీవు ఇండియన్ కదా! కాబట్టి ఒక పిరికి వెధవవు! ఒక ఆవునైనా చంపలేవు! కాని, తెల్లదొరలను చంపగలవా ?

నేను :- "ఇండియను లందరూ పిరికివారుకారు ఇతర దేశాలలో మాదిరే ఇండియాలోకూడ ధైర్యశాలు రున్నారు, పిరికివారున్నారు. అయితే నాకూ దీనికి సంబంధం ఏమిటి ?"

... వాలా :- "మద్రాసువాడివి. ఇండియాలో మీకంటె పిరికి వాళ్లు మరెవరు ? ఇంగీషుదొరలనే చంప దలచావుగా ?"

నేను :- "మద్రాసువారిలోకూడా ధైర్యశాలురున్నారు; పిరికి వారున్నారు. అయితే, నాకేసుకూ దీనికి ఏమిసంబంధం ?"

... వాలా :- "నీవు తెలుగువాడివికదా ! మద్రాసు వాళ్లలో కూడా అధమం ! ఇంగ్లీషు వాళ్లనే చంపుతావూ ?"

నేను :- "....."

... వాలా :- "నీవు కోమటివాడివికదా ? ప్రపంచ మంతటిలోకి పిరికి సన్నాసులు. "తెల్లవాళ్లను చంపడమే!"

చివరకు నేను కోపం పట్టలేకపోయాను. ఏం కష్టాలు వచ్చినా రానీ అనుకొని ఈలా గన్నాను :- కోమట్లలోకూడ ధైర్యశాలు లున్నారు. నీ డ్రాయర్లో

రివాల్వర్లున్నాయి ఒకటితీసుకో; ఒకటి నాకుయివ్వు! ఆంగ్లోపారీస్ సంకరజాతివాడికంటె ధైర్యశాలికోమట్లలో ఒక్కడైనా వున్నాడని చూపిస్తా! పిరికివెధవా!"

ఊలిక్కపడిలేచాడు. వాడికి ఎదురుగా వెళ్లాను. అలారంయిచ్చాడు. సోల్జర్లు వచ్చి నన్ను పట్టుకొన్నారు. మా అందరి మెదుట టెలిఫోనులో మిలిటరీ హెడ్ క్వార్టరుకు యిట్లా రిపోర్టు చేశాడు, "రివాల్వరును తనకు యిస్తే నన్ను కాల్చేస్తానని బెదరించి నామీద పడబోయాడు. సోల్జర్లు పట్టుకొనియున్నారు."

సోల్జర్లు నన్ను నెట్టి నాగదిలో వేసిపోయారు. 15 నిమిషాల్లో మిలిటరీ ఆఫీసర్లు ప్రత్యక్షమయ్యారు. ఒక కర్నలు, ఒక మేజరు నగ్నారా వదుసగా నిలుచున్నారు.

కర్నలు :- స్పెషల్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసరును కాల్చివేస్తానన్నావా? నేను సమాధానం చెప్పలా.

కర్నల్ :- నీవు మాశత్రువులడబ్బు పుచ్చుకొని, బ్రిటీషు ఇండియా సైన్యాలను తిరుగుబాటు చెయ్యమని ప్రోత్సహించి మిలిటరీ జైల్లో ఉంటూనే మా లాయర్ ఆఫీసరును కాల్చేస్తా నంటావా?— అని గర్జించాడు.

నేను జవాబు చెప్పలేదు. చెప్పినా ఉపయోగం లేదు. ఏమిచేసినా చేసికోనిమ్మనుకున్నాను.

"వారంరోజులు చేతులకు సంకెళ్లు, రోజుకు ఒకపౌను రొట్టె, నీళ్ళుమాత్రమే" అని శిక్షచెప్పి వెళ్లాడు. అంత తక్కువ శిక్షకు ఆశ్చర్యంవేసింది.

అంతటితో ఆ స్పెషల్ ఆఫీసరు విచారణచెయ్యడం మానేశాడు. మిగిలిన మిత్రుల విషయాలు అలాగే వుంటాయి. ఒకరి విషయాలు మరొకరికి తెలియవు. ఎంత ప్రయత్నించినా మా వివరాలు మాదగ్గర తెలుసుకోలేక పోయాడు. మా పూర్వచరిత్ర వాడికి ఏమాత్రం తెలియదు.

ద్రోహి

గోప్ప డిటెక్టివ్ ఆఫీసరు సాక్రమెంటో నుండి వచ్చాడు. అప్పటికే లాహోరు మొదటికుట్ర కేసు పూర్తి అయిపోయిందట - (1916 లో) రెండవది ఇంకా ఆరంభం కాలేదట.

మా పూర్వ చరిత్రల పుస్తకాలు - పెద్ద పెద్ద వాల్యూములు తెచ్చాడు. తేదీవారీగా మేము అమెరికాలో చేస్తూవచ్చిన పనులు వివరాలతో జరిగినవి జరిగినట్లుగా అచ్చువేయబడివున్నై. నాకు ఆశ్చర్యం వేసింది. మా విద్యార్థుల్లోనే యెవడో గూఢచారిఅయి ఉండాలి.

కాలిఫోర్నియా యూనివర్సిటీలో చదువుతూ నలంద హాస్టలులో విప్లవసంఘవిద్యార్థులము కలిసివుండగా ఒకరికి ఒక మేలుచేశాము. అది పాముకు పాలుపోసినట్లు విషమయింది.

అమెరికాలో బాబా జ్వాలాసింగు అనే దేశభక్తుడు ఇండియను విద్యార్థులకు వేతనములిచ్చి చదివించుటకు అమెరికాకు రప్పించాడు 1912 సం॥ లో. ఆ నల్గురూ విప్లవసంఘంలో చేరుతారని ఆశించాడు. వారిలో ఒక్కడు కూడా అందుకు సమ్మతించలేదు. అందువల్ల సహాయం చెయ్యడం మానేయడంతో నలుగురు విద్యార్థులూ చిక్కుల్లో పడ్డారు. తెగిపోయిన గాలిపటాలగతి పట్టింది. వారిలో (1) బి. సోమయాజిశర్మ, అడ్వొకేటు: గుంటూరు (2) కొకటూరు మహారాష్ట్రీడు- ప్రస్తుతం గొప్ప యిండస్ట్రియల్ సైనిషు, అమెరికా (3) గోవింద బిహారీలాల్, ఢిల్లీ; ప్రస్తుతం అమెరికాలో న్యూసుపేపర్లకు సైన్సుఎడిటర్- వీరు మాత్రం గట్టెక్కారు. కాని, నాల్గవవాడు- హెన్రీ యడ్వర్డు పాండ్యన్ (తిరునల్వేలిజిల్లా) మాత్రం కష్టపడుతూ వచ్చాడు. నవంబర్ మాసం వచ్చింది. చలి అధికమవుతూ వచ్చింది. చలిగాలికి మనుషులు పశువులు చచ్చిపోయే గోజు లవి. పాండ్యన్ మీద జాలిపుట్టింది. లాహిరీ, నేను అతన్ని చేరదీసి భోజనంపెట్టి మా గదిలోనే వుంచుకొన్నాం. అతనికి సహాయం చెయ్యడం మిగిలిన మిత్రులకు యిష్టం లేదు; అయినా అడ్డుపెట్టలా. వానికి కష్టంలో సహాయం చేస్తే, విప్లవోద్యమంలో చేరకపోతాడా అని లాహిరీ ఆశ. ఆయన చెప్పినట్లు ఒప్పుకొనే శిష్యుణ్ణి నేనూ అంతే అనుకొన్నాను.

1914లో యుద్ధం ప్రారంభంకాగానే మేము వేర్వేరు కాలేజీలలో చేరిన తర్వాత "మీలో యెవరో ఒకరు రహస్యాన్ని గవర్నమెంటుకు అందిస్తున్నారు; జాగ్రత్తగా వుండాలి" అని బెంగాల్ పార్టీనుండి వుత్తరం వచ్చింది. అప్పటికే పాండ్యన్ ఆపని చేస్తున్నట్టు బయటపడింది; ఒకసారి విద్యార్థులు పట్టుకొని కొట్టారు, తన్నారు.

డిటెక్టివ్ ఆఫీసరు తనపుస్తకాలు తెరచి నాచరిత్ర చదివాడు. అది తూ. చ. తప్పకుండావుంది. నేను చేసిన ఒకపని పాండ్యన్‌కుతప్ప మరెవరికీ తెలియదు. గదరు సాహిత్యాన్ని పోస్టులో రహస్యంగా పంపటానికి ఒక దూరప్రాంతాల్లో మారుమూలవుండే ఒక ప్రెస్సులో ఒక కంపెనీపేరు కల్పించి పెద్దకవర్లు అచ్చు వేయించాను. అప్పట్లో గదరు పత్రికను దేశదేశాలకు పంపేశాఖలో పని చేస్తుంటిని. పాండ్యన్ నాతో ప్రెస్సుకు వచ్చాడు. రిపోర్టులో వున్న వివరాలు మరొకరికి తెలియవు. పాండ్యనే నమ్ముకోడానికి మరొక కారణం ఉంది. భాగవతుల సోమయాజీశర్మగారిమీద తప్ప తతిమ్మా వారందరిమీద రిపోర్టుచేశాడు. శర్మ అంటే పాండ్యన్‌కు చాలయిష్టం. నన్ను డిటెక్టివ్ ఆఫీసరు ప్రశ్నించినప్పుడు పాండ్యన్ అచ్చు వేయించి ఉంటాడని సూచించా. ఆఫీసరు కోపంతో "పాండ్యన్ నమ్మదగినవాడు; రాజభక్తి గలవాడు; నీవు అబద్ధమాడుతున్నావని" జవాబుచెప్పాడు. నామీద నేరా

రోషణలను పూర్తిచేసి ఆఫీసరు "నీకు ఏమి శిక్ష విధిస్తారో తెలుసునా? నిన్ను కాల్చేస్తారు! నీకు తెలిసిందంతా చెప్పు, రహస్యంగా ఉంచుతాను. నీవు కోర్టులో సాక్ష్యమియ్యనవసరంలా నిన్ను విడిచిపెట్టేస్తాము. లేదా ఉద్యోగంలో చేర్చే అన్నివిధాలా సహాయం చేస్తాను" అన్నాడు. అందుకు నేను "నేను చేసిందేదో చేశాను. ఇకముందు అట్లాంటివి చెయ్యను. వీల్లైతే నాకు మిలిటరీ ఆఫీసర్ ఉద్యోగం యివ్వండి. నేను ఫ్రాంసుకువెళ్ళి జర్మనీతో యుద్ధం చేస్తాను" అన్నాను.

దాని కాయన ప్రత్యుత్తరం యిది: "[redacted] మేము నమ్మలేము. నీవు సైన్యంలోచేరి, అక్కడ [redacted] ద్రోహ చర్యలు సాగించాలని చూస్తున్నావు! సరే, ఇకపో! నిన్ను తప్పకుండా కాల్చెయ్యాలి."

మిగతా మిత్రుల విషయంలోకూడా అట్లాగే జరిగి వుండొచ్చు. నాకేమి తెలియదు. దగ్గర గదుల్లోవున్నా ఒకరినొకరం చూచుకోటానికి సాధ్యపడదు. 24 ఘంటలూ గదిలో ఉంచేవారు. నా మనోధైర్యంమీదనే ఆధారపడాల్సివుంది. తోటిమిత్రులకు నేను సహాయం చెయ్యగల స్థితిలో లేను.

ఉదయం కక్కసుకు వెళ్ళటానికీ, కక్కసుచట్టిని శుభ్రం చేసుకోటానికీ, మధ్యాహ్నపు టెండలో గులక రాళ్ళమీద నడిపించటానికీ తీసుకెళ్ళేవారు; నా మిత్రులను

ఆఫీసుకు తీసుకెళ్ళేప్పుడు తిరిగి తీసుకొచ్చినప్పుడు తలుపులు తెరచి మూసిన చప్పుడు వినిపించేది.

పాండ్యన్ కొంతకాలానికి ఇండియాకు వచ్చాడు. మామీద కోర్టులో సాక్ష్యం ఇచ్చేందుకు నిరాకరించాడనీ, అందుచే అతన్ని కొన్నిరోజులు లాకప్‌లోపెట్టి బెదరించారనీ, తుదకు డెప్యూటీ పోలీసు సూపరింటెండెంటు ఉద్యోగం సంపాదించుకొన్నాడని మా యిద్దరికీ మిత్రుడైన శ్రీ భాగవతుల సోమయాజీశర్మగారు 1920 లో నాతో చెప్పారు.

కోర్టు మార్షల్ - కొల్చుని శిక్ష

మా ఏడుగురిని కలిపి కోర్టుమార్షల్ చేశారు. చక్రవర్తికి ద్రోహం చేశామని ఏవేవో నేరాలారోపించారు. అందరిని మూడు రోజులకు కాల్చివేస్తామని తీర్మానించారు. జోద్‌సింగుకుకూడ అదే శిక్ష. అతను డైరీ తనది కాదని చెప్పొచ్చు. కాని, మా కెదురు తిరగలా.

లాహోరు కుట్ర కేసులో చీఫ్ ప్రాసిక్యూటరైన డెన్హాము (ఈయన్ను ప్రత్యేకంగా ఇంగ్లాండునుండి యీ కేసులు నడుపుటకు స్పెషల్‌ఫీజు యిచ్చి రప్పించారు.) కోర్టు మార్షల్‌లో మామీద కేసులుపెట్టి శిక్షించేలాగు చేయించారు. అతను దీర్ఘకాయుడు; బలశాలి, మా గదులకు వచ్చి మాకు తెలిసిందంతా చెప్పి తప్పించుకోమని ఆ మూడురోజులు ఎంతో ప్రయత్నంచేశాడు. పెద్ద జీతాలలో ఉద్యోగాలు ఇప్పించుతానని ఆశలుపెట్టాడు. మా

తల్లిదండ్రులు, భార్యా-బిడ్డలు మమ్మల్ని చూడాలని గంపెడాశతో వున్నారన్నాడు. చిన్నవాడివి, చాలాకాలం జీవించవలసినవాడవు. వృధాగా చచ్చిపోవడం బుద్ధిహీనత అని ప్రత్యేకంగా నాకు బోధించాడు. నేను చలించలేదు; కాని, ఆ మూడురోజులూ మనసులో ఆందోళన చాల ఘోరంగావుండేది. ఆ మూడురోజులూ పడ్డ బాధ మరెప్పుడు పడలా. వేంటనే కార్చేసివుంటే ఎంతో బాగుండేదని అనుకొనేవాడిని ♦

మూడోనాడు కాల్చివేయుటకు మా అందరినీ కోటకు తీసుకెళ్లి కూర్చోబెట్టారు. మొదట భాయి బలవంత్ సింగ్ ప్రగంధి, తరువాత నేను...చివర జోద్‌సింగ్ కూర్చున్నాము.

♦ చంపివేయమని శిక్షింపబడిన తరువాత ఏవేవో మంచిచెడ్డ ఆలోచనలతో కుంగిపోతూవచ్చాను. అలాంటి వారికి ఆ కష్టం తప్పదనుకుంటాను. కాని ఒకరి విషయంలో మాత్రం అలా జరగలేదు. ఖుదీరాంబోసు 1907 ప్రాంతంలో బెరరిష్టుల కేసులో దేశద్రోహిని జైలుఆసుపత్రిలో కాల్చి సాక్ష్యంలేకుండా చేశారు. ఎందరి ప్రాణాలో దక్కినవి. కాని, ఆయనకు ఉరిశిక్ష పడింది. పదిహేను రోజులకు ఉరితీసేముందు ఋణంచిపోవుటకు మారుగా అతని బరువు సంతోషము, శాంతము అధికమాతూవచ్చాయి. ఆయన ఎంత మహానుభావుడోకదా!

వీరబల్వంతసింగు, అతని వీరపత్ని, పుత్రులు

ధైర్యసాహసాల్లో, త్యాగంలో, నైతికగుణాల్లో బలవంతసింగు మా అందరిలోకి మేటి. షుమారు ఆరడుగుల ఎత్తు, ఎత్తుకుతగ్గ దేహము; బలశాలి. ముఖంలో స్వాతికం తాండవమాడుతుంది. నల్లని పొడుగాటిగడ్డం; బ్రిటిష్ ఇండియన్ సైన్యంలో ఉద్యోగం మానేసిన మామూలు సిఫాయి. అమెరికాలో సిక్కులకు గ్రంథి— అనగా గురువు. తమ మతగ్రంథాన్ని చదివి తెలియ చెప్పడం అతనిపని. వాస్తవంగా గుణాతిశయంవల్ల గురువు 35 సం॥ల వయస్సు. పడుచు భార్య, ఇద్దరు బిడ్డలు. షాంగైలో వారిని విడిచేసివచ్చాడు. ఆ వీరుడు మళ్ళీ తమ జీవితాల్లోకి కలుసుకోడని భార్యనమ్మినా కంట నీరుపెట్టిందే కాని, భర్త మనసు చలించేలాగా అడ్డుపడలా. ఇద్దరు కొడుకులు (5, 8, సం॥ల వయసువారు) "అమ్మా భయ పడొద్దు! నాన్నను చంపివేస్తే మేమున్నాం! పెద్దవాళ్ళ మయ్యాక అంగ్రేజివాళ్ళను నరికేసి కసి తీర్చుకుంటాం" అని తల్లినిఓదార్చటకు తెలిసీ తెలియని మాటలతో చెప్పారు. ఆ చిన్నపిల్లలు అర్థంచేసికొని అన్నమాటలు కావు. అయినా తండ్రి బిడ్డలను, భార్యను కాగలించు కొని ముద్దాడి వచ్చేశాడు.

మేజరు మావద్దకువచ్చి "బలవంతసింగ్! లేచి నుంచో! ఏమయినావుంటే చెప్పి తప్పించుకో! లేదా,

కాల్చేయక తప్పదు," అన్నాడు. బల్వంతసింగ్ యిలా అన్నాడు. "మీరు చంపివేయకపోతే నేను చావకుండా వుంటానా? ఎప్పటికైనా చావాల్సిందే! ఎందరో ఎన్నో రోగాలతో చస్తారు. నేనో! బ్రిటిష్ సామ్రాజ్యవాదం అనే అంటురోగంతో చస్తున్నా." ఆఫీసరు "అలాగయితే నడువు!" అన్నాడు. మమ్మల్నందరినీ కౌగిలించుకొని, బల్వంతసింగ్ కదంతొక్కుతూ నవ్వుముఖంతో వెళ్లాడు.

మా ముఖాల్లో నెత్తురుచుక్క లేదు. దుఃఖ సముద్రంలో మునిగినట్లయింది. కొన్ని నిముషాలకు తుపాకులు కాల్చిన శబ్దం వినపడింది. భాయీ చచ్చిపోయాడని మేము ఒకరినొకరం చూచుకొని విచారపడ్డాం. నిట్టూర్పులు విడిచాము. మేము అలాగే ధైర్యంగా చావాలని స్థిరపరచుకొన్నాము.

'ద్రోహంచెయ్యి, చావు తప్పిస్తా'

కొంచెంసేపటికి మిలిటరీ ఆఫీసరు మళ్ళీవచ్చాడు. "నీవు చాలా చిన్నవాడివి. నీ తల్లి మొదలయినవారు నిన్ను చూడాలని ఎంతో ఆశపడుతుంటారు. తెలిసిన విషయాలు చెప్పు. వృథాగా ఎందుకు చచ్చిపోతావు" అన్నాడు నాతో, "భాయి బలవంతసింగుకు భార్యా-బిడ్డలున్నా లక్ష్యపెట్టక ప్రాణాలర్పించాడు. నాకు భార్యా బిడ్డలుకూడా లేరు నేను విచారపడేందుకు కేమి లే" దన్నాను.

లేవమన్నాడు మిత్రులను కౌగలించుకొని నవ్వు ముఖంతో ఛాతీవిరిచి నడిచాను. లోపల ఒక పొడుగాటి హాలు, ఒకచివర అయిదుగురు సోల్జర్లు రైఫుల్స్‌తో నిలబడి వున్నారు. మరోచివర ఒక కొయ్యస్తంభాన్ని నిలబెట్టి వుంచారు. దానికి ఆనించి నన్ను నిలబెట్టారు. "ఏయ్! చంచయ్యా! కాల్చమని ఆర్డరు యిస్తే, చచ్చిపోతావు. ఒక్క నిముషం టైమిస్తాను, ఆలోచించుకో, నీకు తెలిసిన విషయాలుచెప్పి తప్పించుకో" అన్నాడు. మళ్ళీ. "నాకు టైము అవసరంలేదు. కాల్చుకో"మన్నాను. కాల్చడానికి ఉత్తరువిచ్చాను. అయిదు తుపాకులు మోగాయి. కాని గుండ్లు నాకు తగల్లా♦. నా వైపు తిరిగి నవ్వాడు ఆఫీసరు.

కొంతదూరంలో ఒకగదికి తీసుకెళ్లారు. బలవంత సింగ్ కూర్చొనివున్నాడు. ఇద్దరం కౌగలించుకున్నాం. "ఎంత హింసపెట్టారు! రహస్యాలు లాగడానికి ఎంత ఉపాయంచేశారు!" అనుకొన్నాము. అటుతరువాత అమర సింగ్, ఠాకూర్‌సింగ్, శివప్రసాద్‌గుప్త, చటర్జీకూడ వచ్చారు.

పంద జోద్‌సింగు

కడపట కూర్చుండిన జోద్‌సింగు రాలేదు. తుపాకుల శబ్దం వినబడలేదు. మా ఆరుగురిని మాత్రమే తిరిగి మిలి

♦ బ్లాంకు తోటాలు కాల్చారు. వాటిలో గుండ్లు ఉండవు; అవి శబ్దంమాత్రమే చేస్తవి. సీసం గుండ్లకు బదులు మైనంగుండ్లు పెట్టారు. అవి కరిగిపోతై.

టరీలో ఎక్కించుకొని తీసుకెళ్లారు. త్రోవలో మాలో మేము "జోద్‌సింగ్ చెప్పాడేమో! మిగిలినవారు చచ్చిపోయారుగదా! భయపడవద్దు చెప్పి జీవించు" అని ఆశ పెట్టివుంటారు. చెప్పేవుంటాడు. పిరికి వెధవ! చివరకూర్చున్నాడు. మనమధ్యలో కూర్చుండబెట్టివుంచే ఎంతో బాగుండేది అని అనుకుంటూ తిరిగి మిలిటరీ జైలుకు చేరుకున్నాం. చావునుండి తప్పించుకున్న సంతోషం ఈ సంశయంతో దుఃఖంగామారింది. తిరిగి మామూలుగా ఒక్కొక గదిలో వేశారు. జోద్‌సింగు జీవించేవున్నాడు. సర్కారుకు సాక్షి (ప్రభుత్వపు) అయ్యాడు. తన డైరీలో వ్రాసిన దంతా ఒప్పుకొన్నాడు. రహస్యాలన్నీ చెప్పేశాడు. వీడిని నాశనం చెయ్యనియెడల ఎందరో నశించిపోతారు; పార్టీ నశించుతుంది.

శిక్షపొందిన సోల్జర్లు తినేతిండినే మాకుకూడ పెట్టారు. మాకు ఈ భోజనం విసుగెత్తింది. చపాతీలు కావాలని బలవంతసింగు కోరాడు. తానే చేస్తానన్నాడు. చేస్తూవుండినాడు అయితే తన ఉద్దేశం వేరు. జోద్‌సింగును బయటకుతీస్తే, కట్టెలు నరికే మొద్దుకత్తితో వానిని చంపేయాలని బలవంతసింగు ఆశయం, లేకపోతే!...జోద్‌సింగు దేశదేశాలు తిరిగి, గదరుపార్టీ ప్లానులనుయిచ్చి, గదరు పార్టీ సైన్యంలో చేర్తానన్నవారికి ప్రయాణ ఖర్చులు అడ్వాన్సుగా యిచ్చివచ్చాడు. జర్మనీనుండి వచ్చాడు. ఉత్తర దక్షిణ అమెరికాలు సంచారంచేశాడు. జపాను-

చైనా, ఫిలిప్పీన్స్ దీవులలో సైనికులను రిక్రూటు చెయ్యమని పార్టీ ఆర్గనైజర్లతో ఏర్పాటుచేసి వచ్చాడు. ఈ విషయాలను డైరీలో ఎక్కించాడు. కోర్టులో సాక్ష్యమిస్తాడు. వానిని చంపివేస్తే సాక్ష్యం లభించదు; కేసులు నిలవ్వు; గదరుపార్టీ మెంబర్లు ఎంతోమంది చావు తప్పించుకొంటారు. అందువల్ల బలవంతసింగు జోద్‌సింగును చంపడానికి చపాతీలు చేస్తాననే మిషతో వంటచేయటానికి ఒప్పుకొన్నాడు సమయంకోసం కాచుకొన్నాడు.

ఛటర్జీ ఎత్తుగడ

ఛటర్జీ మరొక ఎత్తువేశాడు. ఆహారాన్ని ప్లేటులో పెట్టి మాగదుల గుమ్మాల్లోపెట్టి వెళ్ళేపని ఆయనది. జోద్‌సింగు విషయంలో జాగ్రతపడవలసిందని ఒక ఎత్తుగడ వేశాడు. ఆఫీసుకు వెళ్ళినప్పుడు కాపీయింగు పెన్సిలును సంగ్రహించాడు. తనగదిలోనీటిలోవేసి,సీసాన్ని లేసి, కాగితంలో చుట్టి జోద్‌సింగుకు తప్ప మిగిలినవారికి చపాతీల మధ్య పెట్టాడు. కాగితంలో యీలా వ్రాశాడు. జోద్‌సింగు డైరీ, వాని సాక్ష్యం కలసి మనమీద కేసు గెలవడానికి, మనకు శిక్ష పడటానికి చాలు. మనలో ఎవరయినా అప్రూవరు అయి జోద్‌సింగుకు వ్యతిరేకంగా సాక్ష్యంయిస్తే, వాని సాక్ష్యాన్ని పాడుచెయ్యొచ్చు. మనమందరం చేసిన పనులను అప్రూవరు తానేచేశానని చెప్పి శిక్షను తప్పించుకోవచ్చు. మేము ఎవరమూ అప్రూవరగుటకు

సమ్మతించనిచో తానే అప్రూవరవుతానని వ్రాశాడు. మే మెవరమూ అప్రూవరవటానికి యిష్టపడలా. చటర్జీ అవటంకూడ మాకు యిష్టంలేదని తెలిపాము. కాని, తాను అప్రూవరయ్యాడు.

విచారణలో ఏమి జరుగుతున్నది ఒకరినొకరం ఏ రోజుకారోజు తెలుపుకోడానికి ఒక ఉపాయం పన్నాము. ముడి తుడుచుకోటానికి యిచ్చిన కాగితాలు సమృద్ధిగా ఉన్నై. వాటిమీద వ్రాసి ఉదయం కక్కసుకు వెళ్ళినప్పుడు పైజాములో దాచుకొనిపోయి కక్కసుమూలలో పెట్టటం, ఒకరితరువాత ఒకరు చదువుకొని చివరవాడు పెంట బకెట్‌లో వెయ్యడంద్వారా సి.ఐ.డీ ఆఫీసరు ఎత్తులు మాకు ముందుగానే తెలుస్తూవచ్చాయి.

చటర్జీ అప్రూవరు కావడంతో నాకు మాత్రం ఒక అనుకూలం చేశాడు. ఆయుధాల స్టీమరును గురించిన ఉత్తరాలను మనిలాలో జర్మను రాయబారికి తెచ్చియిచ్చింది నేను కాదనీ, జోద్‌సింగు తెచ్చాడనీ, చంచయ్యమీద విరోధంవల్ల అబద్ధం చెప్పాడనీ సాక్ష్యం యిచ్చాడు. జోద్‌సింగు మందబుద్ధి; భయస్తుడు. చటర్జీది చురుకుబుద్ధి; భయపడడు; మసిపూసి మారేడుకాయ చేయగలడు. కాబట్టి తలక్రిందులు చేసేవుంటాడు.

అయితే చటర్జీ ఏమేమి రహస్యాలు చెప్పాడో లేదో మాకు తెలియదు. కాని, సి. ఐ. డీ. లు వానిని నమ్మి,

డబ్బుయిచ్చి, ఇతర దేశాలలో పనిచేయుటకు పంపారు. అట్లా తప్పించుకొని తిరిగి అమెరికా చేరాడు. ♦

♦ 1928-29 లో నేనూ నా మిత్రుడు శ్రీ మోతే నారాయణరావుగారు కలసి వితంతు వివాహాలు చేయిస్తూ వచ్చాము. మదరాసుకువెళ్ళే మెయిల్‌లో బెజవాడలో తనను సెకండు క్లాసులో కలుసుకోమన్నారు. వెళ్ళాను. అయిదారుమంది ఆ కంపార్టుమెంటులో ఉన్నారు. శ్రీ మోచర్ల రామచంద్రరావుగారుకూడా ఉన్నారు. ప్రసంగం ప్రారంభంకాగానే ఒక వ్యక్తి హటాత్తుగా లేచి వచ్చి నన్ను కౌగలించుకొని "చంచయ్య! ఇంకా జీవించే వున్నావా?" అని ప్రశ్నించాడు. నాకు ఆశ్చర్యంవేసింది. అతను ఛటర్జీ. రామచంద్రరావుగారు; నారాయణరావు గారు మొదలైన మిత్రులు "యిదేమిటి, చెప్పండి" అని ప్రశ్నించారు. ప్రొయిను కదలబోతూంది. నేను దిగాను. ఛటర్జీ యీ కథంతా వారికి చెప్పాడు. శ్రీ మో. రామచంద్రరావుగారు నేను కలుసుకున్నప్పుడు "చంచయ్యా! నిన్ను బాగా యెరుగుదును. ఛటర్జీ చెప్పిన సాహసకార్యాలను నీవు చేసే వుంటావా! అనే సంశయం నన్ను బాధిస్తూ వున్నది" అన్నారు.

ఆకాలంలో శ్రీ మోతే నారాయణరావుగారివద్ద సినిమా ఫోటోగ్రాఫరుగా ఛటర్జీ కొంతకాలం పనిచేశాడు. జబల్‌పూరులో మకాం.

నరకంలో సంతోషం

జైళ్ళలో ఎన్నో "నేరాలు" చేశాను. అందరం చేస్తాం. అయితే మిలిటరీ జైలులో "మార్షల్ లా" కాలంలో చేసే నేరానికి శిక్ష చాల కఠినంగా వుంటుంది. అయితే చెయ్యక తప్పనిసరి ఒకొకప్పుడు ఏర్పడ్తుంది. ఒక సాయంత్రం గులకరాళ్ళమీద నడచుటకు విడిచారు సోల్జర్లు. నాకు ఎదురుగా నడవటానికి క్రొత్తవానిని తెచ్చారు అతను పంజాబీ. క్రొత్తగా ఇద్దరు గదరుపార్టీ వారిని తీసుకవచ్చి గదులలో పెట్టారు అని గ్రహించుకో గలిగాను చప్పుడువల్ల. అప్పటికి వీరు ఎవరయినది నాకు తెలియదు.

మాకు కాపలాఉన్న సోల్జరు సిగరెట్టు కాల్చుకో డానికి వెళ్ళాడు. ఆ సమయంలో, ఈవ్యక్తి, తనను కాల్చి వేయుటకు తీర్మానించినట్లు చెప్పాడు. భయపడుతున్నాడని తెలుసుకొన్నాను. జోద్‌సింగులాగు ఎందరికైనా హానికలిగే లాగున, మాలో ఏవరమైనా చెయ్యగలము. ఆలాగున జరుగనియ్యకూడదు వెంటనే నేను ఇట్లా చెప్పాను:— "కాల్చరు; మమ్మలను ఇట్లాగే కాల్చివేయుటకు తీసు కెళ్ళారు. కాల్చేశారు. భయపెట్టి రహస్యాలు తెలుసు కొనుటకు ఇట్లా చేస్తారు. మనందరిని ఇండియాకు తీసుకెళ్ళి కేసుపెట్టుతా"రని స్పష్టంగా చెప్పాను. మేము మాట్లా డడం విని సోల్జర్లు పరుగెత్తుకొని వచ్చి గదిలోకి లాక్కు పోయారు. కేసుపెట్టారు. ఒక వారం రోజులు చేతులకు

సంకెళ్ళ వేశారు. రోజూ ఒక పొనురొట్టె, త్రాగుటకు నీళ్ళ మాత్రమిచ్చారు.

కొందరి ప్రాణాలు రక్షించాననే సంతోషమే తప్ప. సంకెళ్ళ బాధగాని, ఆకలి బాధగాని నన్ను కలవరపెట్టలేదు. ఎంత సంతోషించానంటే. సంకెళ్ళను ముద్దుపెట్టుకొనేవాడిని.

క్రొత్త వ్యక్తి పేరు హరిచరణ్ దాస్. ఇతను, మరి కొందరు వాలంటీర్లు ఆయుధసామగ్రి స్టీమరుమీద నావికులుగా అమెరికా నుండి బటేవియాకు వచ్చారు. బ్రిటిష్ యుద్ధనౌకలు ఆ స్టీమరు వెంటపడ్డాయి. బటేవియా హార్బరులో ఆ స్టీమరు నిలబడిపోయింది. నావికులుగా వచ్చిన వాలంటీర్లు కొందరు ఇండియాకు స్టీమరుమీద వెళ్ళుండగా, బ్రిటిష్ పోలీసులు ఇద్దరిని పట్టుకొని సింగపూరు మిలిటరీ జైలులో మాతోవుంచారు. వారు హరినామ్‌చంద్, హరిచరణ్ దాస్, లాహోరు కుట్ర కేసులో, రెండవ సప్లిమెంటరీ కేసులో వీరిని మాతోకలిపి కేసుపెట్టారు. ♦

ఆరునెలల ఏకాంతవాసం తరవాత

మాతోకలిసి పనిచేసే జర్మను ఆఫీసర్లను ఎక్కడనో యుద్ధఖైదీలుగా వుంచేశారు. ఛటర్జీ, జోదుసింగులు– ఈ

♦ ఈ హరిచరణదాసుకు చుట్టలు, సిగరెట్లు, బీడీలు త్రాగకపోతే పొట్టలో నొప్పివస్తుండేది. చాల బాధపడ్డాడు అతని స్నేహితుడు హరినామ్‌చంద్ చాల ధైర్యము,

యిదరు అ్రపూవర్లను మాతో కలపలేదు. ్రపత్యేకంగా వుంచేశారు. అమర్ సింగ్, శివదయాళ్ గుప్తను బర్మాలో మాండలే కుట్ర కేసు నేరస్తులుగా తీసుకెళ్ళారు. మిగిలినది బలవంత్ సింగ్, ఠాకుర్ సింగ్, నేను, హరినామ్‌చంద్, హరి చరణ్ దాస్- అయిదుగురం మాత్రమే. ఆరునెలలు ఏకాంత వాసము, ఇతర హింసలు అనుభవించిన తర్వాత ఇతరులతో కలసి మాట్లాడుటకు అవకాశం వచ్చింది. ఆరు నెలల తరువాత కువరం చేయించారు. మా పెట్టెలు, బట్టలు యిచ్చారు. చదువుకోడానికి పుస్తకాలు లభించాయి. "సాలిటరి ఇంప్రిజన్‌మెంటు" ఎంతఘోరమో తెలుసుకోవాలి. ఎంత్రవాసినా, చెప్పినా బోధపడదు.

బలము, త్యాగముగల గొప్ప గుణశాలి. రామలక్ష్మణుల వలె వీరిరువురు ఉండేవారు. హరిచరణదాసును బయటకు పంపితేనే పొట్టనొప్పి పోతుందని తలచి, హరిచరణదాసు చేసిన నేరాలన్నీ తానే చేశానని చెప్పుటకు హరినామ చంద్ తయారయ్యాడు. కాని అవసరంలేకపోయింది. వెంటనే ఇండియాకు తీసుకెళ్ళారు.

కలకత్తా ఆలీపూరు సెంట్రలు జయిలులో అనుకూలత సంపాదించుకొనేందుకు మేము చేసిన ్రపయత్నాలలో వీరిదరి ధైర్యసాహసాలు చాలా అనుకూలించాయి. కలకత్తా జైలు అనుభవాలను గురించి ్రవాసినప్పుడు వీరిని గురించి ్రవాస్తాను.

మా సామాన్లు చాలా కనపడలేదు. సోల్జర్లు దొంగిలించారు. నా హాట్, బూట్, కాలర్లు, నెక్ టైలు, రిష్టువాచి, ఫవుంటెన్ పెన్, కెమెరా, ఉపవరం సామానులు, ప్రయాణం చెక్కబుక్కు, రొక్కము, పుస్తకాలు వగైరా దొంగిలించారు. సోల్జర్లు ఇలా దొంగిలించడం సర్వసామాన్యం. సాధారణంగా అనేకమంది వ్యాపారస్తులు ముఖ్యంగా సింధివర్తకులు, చైనావర్తకులు రోజూ స్టీమరుమీద సింగపూరులో దిగుతూవుంటారు, వీరివెంట పెట్టెలనిండా ఫాన్సీ సామానులు, ముఖ్యంగా సిల్కులు ఉంటవి. వీరిని అరెష్టు చేసి కోటకు తీసుకవచ్చారు "బాంబులు, రివాల్వర్లు, ఆయుధాలు ఏమైన ఉన్నవేమో తనిఖీచేస్తాం" అనే నెపంతో సామాన్లను చిందరవందర చేస్తారు. ఈ గందరగోళంలో, ఆఫీసరు పిలుస్తున్నాడని లోపలికి ఒక సోల్జరు తీసుకెళ్ళాడు. మిగిలిన సోల్జర్లు సామాన్లను దొంగిలిస్తారు. సింధి వర్తకులు, చైనా వర్తకులు, చాలా భయస్తులు. సింగపూరులో మార్షల్ ఉంది. ఎప్పుడు తప్పించుకు పోదామా అనే ఆతురతతో, ఎన్ని సామాన్లను దొంగిలించినా, నష్టపడినా ఆక్షేపణ చెయ్యకుండా సలాముపెట్టి వెళ్తారు. మేము మాత్రం ఆక్షేపణ చేశాము. కాని వృధా అయిపోయింది.

కలకత్తాకు ప్రయాణం - ఓడలో ముచ్చట్లు

సింగపూరునుండి స్టీమరుమీద కలకత్తాకు సుమారు ఎనిమిది రోజులు పట్టింది. ఈ ప్రయాణంలోని ఒకటిరెండు

విషయాలుమాత్రమే జ్ఞాపకమున్నై. "మిలిటరీ యస్కార్టు" (Escart Shropshire Regiment) మాకు చాలా అనుకూలంచేశారు. భోజనాలకు అడిగినంతా యిచ్చారు; మాయిష్టప్రకారము మేమే వంటచేసుకొన్నాము. హరినామ్ చంద్ వంటలలో ప్రవీణుడు. పూర్వము రాణీసంయుక్త భర్త-పృథ్వీరాజు వంశీకుడు. పంజాబులో నగలు చేసేవాడు. అమెరికాలో వ్యవసాయకూలీ పనిచేసి బాగసంపాదించాడు. దేహబలం, మనోబలంగలవాడు. వస్తాదు. 250 పౌనుల తూకం. స్టీమరుమీద బస్కీలు, దండాలు ప్రారంభించాడు. ఒకరోజున హల్వాచేశాను. ఒక వీశెకంటె ఎక్కువ వుంటుంది. చుట్టూ కూర్చుండి ఎప్పుడు తయారగునా, ఎప్పుడు తిందామా అని ఉవ్విళ్ళూరుతూన్నాము. తమకు "భాయీజీ! ఈ హల్వా అంతా తినగలవా?" అన్నాము. తినగలనన్నాడు హరినామ్‌చంద్. మాకు ఆశ్చర్యంవేసింది. అంతతింటే కడుపినొప్పి వస్తుందన్నాము. కడుపునొప్పిరాదు; జీర్ణంచేసుకోగలనన్నాడు. అయితే తినమాట నిలుపుకోమన్నాము. వుండలుచేసి మింగేవాడు. నవలనేలేదు. జీర్ణమెలాకాగలదా అని మా సందేహం. తిన్న వెంటనే లంగోటి కట్టాడు; బస్కీలు ప్రారంభించాడు. చమట కారిపోతూంది. చమటను చూపించి "ఇదిగో! హల్వా జీర్ణమయిపోతున్న"దని నవ్వాడు. కడుపునొప్పిగాని, మరేబాధగాని రానేలేదు.

మరొక విషయంకూడ జ్ఞాపకమున్నది. మాత్రో ఒక పఠాను తాత ప్రయాణంచేశాడు. చాలా బలమైన నరాలు ముఖంలో తేలిఉండేవి. హాంగ్‌కాంగ్‌లో వాచ్‌మన్ నౌకరీ చేశాడు ఆయన ముఖం చూచేకొద్ది నాకు ఆశ్చర్యం హెచ్చుతుండేది. మన ఆంధ్ర దేశంలో అంతటి బల శాలులు అరుదుగావుంటారు. చిన్నప్పుడు సైన్యంలోచేరి కొండల్లో అడవుల్లో ఎలా యుద్ధంచేసిందీ వర్ణించేవాడు. అప్పుడు నాకు 25 సం॥ల వయస్సు; 125 పౌనుల తూకం. నా కండలు పట్టిచూచి "నీవేమి యుద్ధం చెయ్యగలవు?" అని పరిహాసం చేసేవాడు. తన బలాధిక్యత నా బలహీనత ప్రదర్శించమంటావా అని ఒకతమాషా పందెంచేశావాడు. నా రెండు చేతులతో తన చెవును గట్టిగా పట్టుకొని, సాధ్యమైనంత గట్టిగా లాగమన్నాడు. లాగాను కాని, అతను నాచేతుల్లో బలములేదని హేళనచేస్తూ తిరిగి లాగమని ప్రోత్సాహపరిచాడు. తాను నొప్పిని లక్ష్యంచెయ్యలేదు. నా చెవిని తన ఎడమచేతి రెండు వేళ్ళను మడచిపట్టుకొని కూర్చుంటే తాను లాగుతానన్నాడు. సరేనన్నాను: లాగకముందే నొప్పికి తాళలేకపొయ్యాను. "అంగ్రేజీ వాళ్ళను ఏకాలానికైనా మేమే తరిమివెయ్యాలి" అని సగర్వంగా నవ్వి అన్నాడు.

ఇండియా జైళ్ళలో

మమ్మల్ను అయిదుగురిని కలకత్తాలో ఆలీపూర్ సెంట్రల్ జైలులో వేశారు. క్రమంగా ఆరునెలలు మా సంఖ్య పెరుగుతూ వచ్చింది. నన్ను ఆకాలంలో ఇండియాలో అయిదు జైళ్ళకు మార్చారు. కలకత్తా, లాహోరు, ఢిల్లీ, కన్ననూరు, కోయంబత్తూరు. ధైర్యసాహసాలు లేకపోతే, జైళ్ళలో గౌరవంగా జీవించటం సాధ్యంకాదు. ఆలీపూరు జెయిల్లో గదరుపార్టీ పంజాబీ వారితో కలిసివుండి, జైలు అధికారులతో ఎలాగు పోట్లాడాలో నేర్చుకొని, గౌరవంగా జీవించడం తెలుసుకొన్నాను. మనలను చూచి భయపడనిది మర్యాదచెయ్యరని తెలుసుకున్నాను.

సింగపూరు మిలిటరీ జైల్లో చీకటి గదిలో ఏకాంతంగా ఉండటానికీ, ఆలిపూర్‌లో పగలంతా స్వేచ్ఛగా ఆ చిన్న కాంపౌండులో మిత్రులతో గడపటానికీ చాలా భేదం ఉన్నది. అంతేకాదు: మా స్వంతసామ్మాతో బజారు నుండి కొని తెప్పించుకొని అనుభవించవచ్చు.

బెంగాలు జైలో మమ్మందరినీ 'సిక్కులని' బెంగాలీ ఖైదీలు పిలిచేవారు. కామాగాటామారూవారు. గదర్ పార్టీ వారూ ముఖ్యంగా సిక్కులే. వారు కలకత్తా జైలులో అమర్యాదకు లొంగలా ఆఫీసర్లు బొగరుబోతుతనంగా ప్రవర్తిస్తారు. అలాటివారిని "సిక్కులు" తన్నేవారు. మరికొందరు గోడలుదాటి పారిపొయ్యారు. సెంట్రీల లాఠీలు,

పైపిల్ను లాకొ-ని చంపేవారు. వీరులనిపించుకున్నారు. అప్పటినుండి బెంగాలీలుకాని రాజకీయ ఖైదీలందరినీ సిక్కు-లని పిలిచేఅలవాటు అప్పటికే "సిక్కు-ల" సాంప్రదాయాలు మాకు బాగా అనుకూలించాయి. *

అప్పట్లో ఆలీపూర్ జైలు చాలాపెద్దది. 1500 పైగా ఖైదీలు ఉంటారు. సూపరింటెండెంటు ఐ. యమ్.యస్. ఆఫీసరు తెల్లవాడు; తగవులాడేరకంకాదు. జైలరు ఆంగ్లేయుడు: చిత్రాల్ యుద్ధంలో పాల్గొన్నాడు. జెమ్ములు సర్వీసులో చేరి పొట్ట పెంచాడు. అనవసరంగా తగువులాడే పొగరుబోతురకం.

సాయంత్రం మమ్మల్ని గదులలో మూసివెయ్యడానికి ప్రత్యేకంగా ఒక జమేదారు వచ్చేవాడు. ఒడ్డూ-పొడుగూ కలిగి టీకాటాకాగా నడిచేవాడు మహా పొగరుబోతు. ఇతను యు.పి. వాడు. ♦ఇతని ప్రవర్తనతో భాయి

---

*1905 మొదలు 1916 వరకు విదేశాల్లో ఇండియన్ అనిగాని, హిందువనిగాని చెప్పుకుంటే గౌరవము సామాన్యమే. "బెంగాలీ" అని చెప్పితే గౌరవం జాస్తి. ఆకాలంలో బెంగాలీలు బాంబువేసి, ప్రాణత్యాగంచేసి, దేశ స్వాతంత్ర్యంకొరకు శ్రమపడ్డారు.

♦ బెంగాలులో పోలీసులు, లు వారు, ప్యూనులు, వాచ్ మెన్ లు వగైరా వృత్తులకు బెంగాలీలు

బలవంతసింగుకు చాల కష్టం తోచింది. మాలో హరిచరణ దాసు చార్లీచాప్లిన్‌వంటివాడు. డిసిప్లిన్‌కు లొంగడు. గదిలోకి వెళ్ళటానికి ఒకటి రెండు నిముషాలు అలస్యం చేసేవాడు. ఒకనాడు జమేదారు ఆయన్ను లోపలకు నెట్టి తలుపేశాడు. దాసుకు కోపంవచ్చింది. ఇద్దరు తిట్టుకొన్నారు. జమేదారును తన్నేవరకు నిరసనవ్రతం పూనాడు. తనంతటతానే జయించలేడు. వ్రతం మానేస్తే జమేదారును తన్నడానికి సహాయం చేస్తానని హరినామచందు మాటయిచ్చినాక భోంచేశాడు. ఎలా పరిణమిస్తుందో చూడాలని మా అందరికి కుతూహలంగావుంది. మమ్మల్ని దీనిలో ఎంతమాత్రం జోక్యం కలుగజేసుకోవద్దన్నారు. అవసరమయితే తరువాత సహాయం చెయ్యాలని మేము తీర్మానించుకొన్నాం.

జమేదారు వచ్చాడు. దాసు తన గదిగుమ్మంలో నిలబడ్డాడు. లోపలికి పోనని తిట్టాడు. జమేదారు చెయ్యెత్తాడు. ఒక్క సెకండులో హరినామచందు జమేదారు వెనక్కు వెళ్ళి వాడి రెండుచేతుల్ని వెనక్కి విరిచి పట్టుకొన్నాడు. హరిచరణ్ లెంపకాయలువేసి తన్నాడు;

సమ్మతించరు. వారికి ఎక్కువ జీతం కావాలి: యిచ్చినా నీచపుపనులు చెయ్యరు. యు. పి. పంజాబులనుండి వచ్చి యీ వృత్తులలో చేర్తారు.

పూర్తిగా పరాభవంచేశాడు. "జావ్, సాలా!" అని వదిలేశాడు.

జమేదారు పరాభవంతో పోయి రిపోర్టుచేశాడు, డిటైలరు తెల్లవార్లు, నల్లవార్లు చాలామంది వచ్చి దాసును, బలవంతసింగును తీసుకెళ్ళి వేరేచోట లాకప్ చేశారు. బలవంతసింగును తీసుకెళ్ళడంలో పొరపాటు చేశారు. అయినా నాటకం సాగనిచ్చాము. బలవంత్ మాకు అన్ని విధాలా నాయకుడు. జమేదారు తన గుడ్డినమ్మకంతో ఆయనే తనచేతుల్ని విరిచివుంటారని ఊహించి తప్పు రిపోర్టు చేశాడు. హరినామచందు ఒడ్డూ - పొడుగూ (Personality) లేనివాడు. బలవంతసింగును వెంటనే తీసుక రమ్మన్నాము; లేకపోతే లడాయికి రెడీగా వుండమని వార్నింగు యిచ్చాము. ఉదయాన భోజనం మానేశాము. వారిద్దరిని తీసుకొచ్చారు; అంతే, కేసుగాని, శిక్షగాని లేదు. ఇది మొదటి విజయం. మామూలుగా జైలు అధికారులు కాళ్ళు చేతులు చితగగొట్టి, సంకెళ్ళువేసి బట్టలుతీసేసి చిత్రహింసలు పెడతారు.

రెండవ పోరాటం :- విదేశాలనుండి వచ్చిన మరి కొందరు భారతీయులను అరెస్టుచేసి మావద్ద వుంచారు. మొత్తం 12 మందిమి. చపాతీలలో పురుగులుండేవి; అవి అరచేతి లావుండేవి; మాడిపొయ్యేవి. ఎన్నిసార్లు ప్రార్థించినా జైలరు లక్ష్యపెట్టలా. 1500 ఖైదీలు ఆక్షేపణ చెయ్యడంలేదనీ. మేము మాత్రమే కంప్లయింటు చేస్తున్నా

మనీ ఆయన పొగరుబోతు జవాబు. అతన్ని తన్నాలని తీర్మానం పెట్టారు "ఒక పర్యాయం సూపర్నెంటుకు చెప్పి చూడాలి; అంతవరకు తన్నకూడదు" అన్న నా సలహాకు ఒప్పుకొన్నారు.

సాయంత్రం యిచ్చిన చపాతీలను పోగుచేసిపెట్టాము. ఉదయాన గం. 6 లకు 27 జైలరు మామూలుగా వచ్చి నప్పుడు కొన్ని రొట్టెలను చూపించాము. అయితే నిర్లక్ష్యంగా వెళ్ళాడు.

ప్రతి దినము 8 గంటలకు మమ్మల్ని చూచేందుకు సూపర్నెంటు ఒక డజనుమంది సిబ్బందితో వచ్చేవాడు. మేము ఫైలులో నిలుచుంటాము. ఇంగ్లీషులో మాట్లాడటం నాకు బాగా తెలుసు. కాబట్టి నన్ను ముందు నిల్చొని రొట్టెలు చూపించి మాట్లాడమన్నారు. రొట్టెలను మేము పోగుచేసి వుంచినసంగతి వార్డరు వెంటనే జైలరువద్దకు వెళ్ళి చెప్పాడు జయిలరు మావద్దకు వచ్చి "రొట్టెలను మేమే చూపిస్తాము; మా చేతికివ్వండి! లేకపోతే రొట్టెలతో సూపర్నెంటును కొట్టటానికి వుంచారని కంప్లయింటు చేస్తా"మని నచ్చచెప్పి తీసుకెళ్ళి వార్డరుతో జైలుగోడకు వెలుపల పారేయించారు. మాకు కోపం హెచ్చింది. సూపర్నెంటుకు చెప్పాను. జైలరును అడిగాడు. నేను అబద్దం చెప్పాననన్నాడు. "మీ జైలరే అబద్ధం చెప్పాడు నీచుడు" అన్నాను. నా స్నేహితులు విజృంభించి కోపం ప్రదర్శించారు. 'విచారణ చేస్తా'నని చెప్పి సూపర్నెంటు

వెళ్తాండగా జైలరు మా వైపుకు తిరిగి 'మిమ్మేమి చేస్తానో చూడండి!' అని వేలుతో చూపుతూ బెదిరించాడు మాలో కొందరూ "హుఁ"అని ముందుకు దూకబోయారు. జైలరు పరుగెత్తి సూపర్నెంటుతో మేము కొట్లబోయ్యామని మళ్ళీ కంప్లయింటుచేశాడు. సూపర్నెంటు వెనక్కి తిరిగి చూచాడు. మేము ఫయిల్లోనే కోపంతో మాట్లాడు కుంటున్నాము.

మధ్యాహ్నం మంచి చపాతీలు వచ్చాయి. పరిస్థితులు బాగుపడేలాగు తోచింది. కాని, సాయంకానికి మమ్మల్ని మరొక బ్లాకుకు తీసుకెళ్ళారు. క్రింద ఒక హాలు; పైన యింకొకటి క్రింద కాన్విక్టు వార్డర్లు; మేడమీద మేము. పెద్ద ఆవరణ. షుమారు 12 అడుగుల ఎత్తుండే యినుపకమ్మీల కటకటాలు. ఇకమీదట ఆఫీసర్ల కునూకు మధ్య ఈ కటకటాలుంటై; ఇక వారిని తన్నటం సాధ్యపడదు. అందువల్ల నామీద చాలా ఆగ్రహం వచ్చి కొందరు "మద్రాసీ సలహా తీసుకొన్న గతి!" అని పరిహాసం చేశారు. "పరవాలేదు: ఒకరిమీద ఒకరం నిలబడి కటకటాలను దాటుదాం; లేదా గేటుకీపర్లను మాయ చేయవచ్చు"నని సమాధానపర్చ ప్రయత్నించాను; కాని, ఉపయోగించలా.

ఉదయాన మాకు రొట్టె, వెన్న, టీ యిచ్చే వాడుక. మమ్మల్ని క్రొత్తచోటుకు మార్చిన మరునా డుదయాన

జైలరు స్వయంగా "టి"తో వచ్చాడు. చిన్న డాక్టరును వెంట తెచ్చాడు. "మీకు ఇకమీదట కంప్లయింట్లుండ వులే" అన్నాడు. జైలరును పరీక్షించటానికి టీ రుచిగా వున్నా చక్కెర చాలలే దన్నాము; జైలరు తాగిచూచి చక్కెర చాలదన్నాడు. మాలో మరొకరు పాలు చాల వన్నారు. తిరిగి రుచిచూచి అవునన్నాడు జైలరు. "ఎవరు ఈ టీ చేసింది? వాడిని శిక్షిస్తాను" అని. డాక్టరుతో "ఇక మీదట వీరిభోజన సమయంలో నీవు రావాలి. ఏ కంప్లయింట్లూ లేకుండా చెయ్యాలి. నీవే జవాబుదారి" అని వుత్తరువు చేసి వెళ్ళాడు. అంటే, మా యిష్టప్రకారం వంటలు చేయించి పెట్టాలి. అయ్యే ఖర్చును ఆసుపత్రి ఖర్చుల్లో వేసుకోవాలి. అప్పటినుండి మేమే "చేయవలసిన వంటకాల జాబితా" తయారుచేసియివ్వడం, ఆ జాబితా ప్రకారం భోజనాలు, ఫలహారాలు తెచ్చి వడ్డించడం పరిపాటి అయింది. జైళ్ళలో గౌరవంగా జీవించే మార్గం తెలిసింది: రహస్యం బోధపడ్డది.♦

♦కలకత్తాలో రెండు సెంట్రల్ జెయిళ్లు. ప్రెసిడెన్సీ జైలు, ఆలీపూరు సెంట్రల్ జైలు. ప్రెసిడెన్సీ జెయిలు నుండి దాస్ గుప్తాగారిని మావద్దకు మార్చారు. అమెరికాలో విద్యార్థిగావుండి ఇండియాకు తిరిగివచ్చి విప్లవ పార్టీలో చేరాడు. ప్రెసిడెన్సీ జైలులో బెంగాలు పెరరిష్టులు, విప్లవ కారులు చాలామంది చెప్పారు.

ఈ జైలుకు వచ్చి ఆరునెల లయింది. ఇప్పటికి 14 నెలలు గడిచాయి. మా ఉత్తరాలు ఇండ్లకు చేరడం గాని, మాకు ప్రత్యుత్తరాలు రావడంగాని లేదు. మా మా ప్రత్యేక రాష్ట్రాలకు పంపారు. మా మా రికార్డు అట్టలమీద 'చాలా దౌర్జన్యం చేస్తాడు' అని ఎర్ర సిరాతో పెద్ద అక్షరాలతో వ్రాశారు. అనుభవంలో ఈ రిమార్కు బాగా అనుకూలించింది. ఏజెన్సీలకు వెళ్ళినా అధికార్లు భయపడేవాళ్ళు. మేము విడిపోయేప్పుడు ఒక్కొక్కరు ఒక్కొక్క బహుమతి యిచ్చారు నాకు; నాకులేని అమెరికన్ సేఫ్టీరేజరు సెట్టు, బూట్లు, చేతి గడియారం, పెన్ను వగైరా యిచ్చారు. కొంత పయికముకూడాను.

వారి తీర్మానం యిది—సరారు మనమీద కేసులు నిరూపించలేక పోయారు. డెటినూ్యలుగా జైలులో వుంచి మన యవ్వనము, బలము, ఆరోగ్యము, ధైర్యసాహసాలు వగైరా నాశనముచేసి, దేశ స్వాతంత్ర్యోద్యమానికి నిష్ప్రయోజకులమయ్యేలా చెయ్యాలని ఒంటరిగా గదుల్లో పెడుతున్నారు. ఈ దురుద్దేశాన్ని నాశనం చెయ్యాలి. ఎలా? (1) బాగాకసరత్తు చేసి దేహ బలాన్ని ఆరోగ్యాన్ని సంపాదించాలి. (2) ఉత్కృష్టమైన పుస్తకాలను చదివి విద్యావంతులం కావాలి. (3) యోగాభ్యాసం, ధ్యానం వగైరా చేసి ఆధ్యాత్మికంగా వృద్ధికి రావాలి. (4) జైలులో ఒక సంవత్సర మొంటే, రెండు సంవత్సరాల చిన్నవాళ్ళం కావాలి. (5) విడుదల అయ్యే సరికి అన్నివిధాలా బాగు

కలకత్తా పోలీసులు మద్రాసులో మైలాపూరులో సముద్రతీరంలో వుండే డిటెక్టివు హెడ్ ఆఫీసులో నన్ను ఒప్పగించారు. పది గంటలకు విల్కిన్సన్ దొరగారు నాకు దర్శనమిచ్చారు. ఆయన అసిస్టెంటు నామీద ఒక రిపోర్టు చేశాడు. కలకత్తాజైల్లో యిచ్చిన పట్టీలోకంటె ఎక్కువ సామాను లున్నాయనీ, రయిలులో వచ్చేప్పుడు నా స్నేహితులను కలుసుకొని కాంటాక్టు ఏర్పరచుకొనివుంటాననీ, డబ్బుకూడా ఎవరో యిచ్చారనీ ఏమేమో చెప్పారు. నేను జవాబు చెప్పలా. గవర్నమెంటు ఆర్డరును చదివాడు నేను కన్ననూరు సెంట్రలు జెయిల్లో ఉండాలట. "నేను ఆంధ్రుణ్ణి; తెలుగు జెయిళ్ళలోగాని, మద్రాసు జెయిలులోగాని ఉంచాలని అడిగాను నే నేదయినా చెప్పుకోదలచు కొంటే తన అసిస్టెంటు సూపర్నెంటుకు చెప్పమన్నాడు. నేను చెప్పనలసినది మరేమీ లేదన్నా వినిపించుకోలేదు. ఏదో నాటకం వుందని సంశయించాను. అయితే

పడి వుండాలి అవిధంగా సర్కారు దురుద్దేశ్యాన్ని నాశనం చెయ్యాలి. (6) ఈ ఉద్దేశాలను నెరవేర్చటకు ఒక టైమ్ టేబిలు వేసుకొని క్రమశిక్షణతో కాలం గడుపుచుండిరని తెలిసికొంటిమి. మాకుకూడా ఈప్లాను మంచిదని తోచింది. అలాగే మేమూ ప్రారంభించాము. అప్పటి అలవాట్లు ఇప్పుడు—అంటే 33 సంగల తరువాతకూడ నాకు కొంచెమో గొప్పో అంటుకొనే ఉన్నాయి.

ఆ పది పదిహేను నిమిషాల మాటల సందర్భంలో పది హేనుమంది ఇండియన్ ఆఫీసర్లు, కాని టేబుల్సు చుట్టూ కాపలాకాయడం నాకు ఆశ్చర్యం వేసింది. విల్కిన్సన్ దొర ఎందుకు ఇంత బందోబస్తు చేశాడు? ఎందుకు ఇంతగా భయపడిపోయాడు! అనే ప్రశ్న మనసులో కలుగుతూనే వుంది.

మరొక పెద్ద గదిలోకి తీసికెళ్లారు మెత్తటి కుర్చీలో కూర్చోబెట్టారు. చాలమంది తెలుగు, అరవ ఆఫీసర్లు నన్ను కలుసుకొని పొగిడి ఆకాశానికెత్తారు. నాకంటె ధైర్య—సాహసాలు గలవారుండరన్నారు. నాస్నేహితులు తమకూ స్నేహితులే నన్నారు. చివరకు "ఏంచేశారు. చంచయ్య గారూ?" అని పల్లవి పాడేవారు. అటు తరువాత మిఠాయిలతో, పాయసాలతో, అప్పడాలు, వడియాలతో, చక్కని పెసుగుతో, ఆవునెయ్యితో భోజనం పెట్టారు. ఎంత తిన్నా ఇంకా తినమని బ్రతిమిలాడేవారు. చివరకు పల్లవి పాడారు. అయితే నాకు సంగీతం రాదుగా!

ఒక డిటెక్టివ్ సూపరెంటు మొదలియారుగారు అఫిషియల్‌గా విచారణ ప్రారంభించాడు. అయితే నా పూర్వ చరిత్రను, అసంబంధమైన రికార్డును చదవకుండానే వచ్చాడు. ఈ నల్లదొరని చదువనివ్వలే దనుకుంటాను. కాబట్టి విచారణకు తలాతోకా లేకుండాపోయింది.

సాయంత్రం గం. 4 లకు మళ్ళీ తెల్లదొరగారివద్దకు తీసుకెళ్ళారు. ఆయినచుట్టూ అంతమంది కాపలాకాయ

డం చూస్తే తెల్లదొరగారు ఎంత ధైర్యశాలో అని నవ్వు వచ్చేది.

"సింగపూరులో యిచ్చిన స్టేటుమెంటుకూ ఈనా డిచ్చిన స్టేటుమెంటుకు చాలా భేదమున్నది. ఎందువల్ల?" అనడిగాడు.

"నన్నే జైల్లో ఉంచడానికి తీర్మానించా"వని అడిగాను.

"ముందు నే నడిగినదానికి సమాధానం యి"మ్మన్నాడు నేను జవాబివ్వలా.

"నీవు గదర్ సాహిత్యాన్ని బండ్లది పఁపా"వని ఒక గది వైపు చేత్తో చూపించాడు.

"బండ్లనిండా సాక్ష్యముంటే నామీద కేసు పెట్ట రాదా? ఒక ప్యాకెట్టయినా చూపండి!" అన్నాను.

"నిన్ను చూచీ చూడకముందే కాల్చెయ్యాలి" అన్నాడు.

"అయితే నావల్ల మీకు ఏమీ ప్రమోషన్ రాదా?" అన్నాను.

ఇక మాట్లాడి ప్రయోజనం ఉండదనుకొన్నాను. వెనక్కి తిరిగివెళ్ళాను. ఈ గుంపంతా యంత్రాల్లాగా నా చుట్టూ నడిచారు.

ఎంత భయం ఈ దొరగారికి పది—పదిహేను సం వత్సరాల క్రితం నాతండ్రిలాంటివారు తాసిల్దారు ఎదుట

వణికిపోయారు. సర్కారన్నా, జెయిళ్ళన్నా అంత తగని భయం. "దొరకు నన్ను చూస్తే అంతకంటె భయం. ఎంత మార్పు: ఎంతత్వరలో: ప్రజల ఆమోదంలేక కత్తితో రాజ్యం చేసేవారి గతి ఇంతేకదా? ఎంతకాలం వీరింకా మనలను అణగ ద్రొక్కి ఉండగలరు? వీరి నాశనానికి కాలం సమీపిస్తోంది"అనే ఆలోచనలు వచ్చాయి; సంతోషించాను. ఒక ఇన్‌స్పెక్టరు, నలుగురు పోలీసులు నన్ను కన్ననూరు జెయిలుకు తెచ్చారు.

కలకత్తాలో ఆలీపూర్ సెంట్రల్ జైలులో వుండి వచ్చిన నాకు ఈ కన్ననూరు జెయిలు చూడగానే "దిక్కుమొక్కులేనిదిగా తోచింది. ఏ జెయిలుకు వెళ్ళినా నా అమెరికన్ దుస్తులలో దొరలాగు వేషం వేసుకొని టీకా టాకాగా వెళ్ళే అలవాటు పెట్టుకొన్నా. నావెంట పెద్దపెద్ద సూటుకేసు లుండేవి. నన్ను ఎరుగని చోట్ల యివన్నీ నా మర్యాదకూ, అంతస్తుకూ అనుకూలించాయి.

నరకకూపం

కన్ననూరు జెయిలులో చాలా సంస్కరణలు అవసరమని తోచింది. జైలరు ఫోన్సికా గేటులో నన్ను ఏదో అడుగుతూంటే లక్ష్యపెట్టకుండా మరొకవైపు చూస్తూ నటిస్తూ జవాబు చెప్పితిని. అతనితో అడుగులేస్తూ నాగదికి చేరాను. ఉరిశిక్ష వేయబడినవారిని ఉంచే గదుల్లో ఒక

దానిలో నన్ను పెట్టారు, రాత్రింబవళ్ళు—24 ఘంటలూ వార్డర్ల పహారా.

అన్నంలో రాళ్లు; గంజి వాసన; పులుసులో పురుగులు. ఖైదీలు అన్నం నీళ్ళలో వేసి రాళ్ళను కిందికి పోనిచ్చి పైపై అన్నం తినడం చూచి నేనూ అలాగే ప్రారంభించా. పులుసులో వుడికిన పురుగులను వేరేసిన తరువాతకూడా తినడానికి సహించలేదు. కంప్లయింటు చేశాను. కొంచెం జాగ్రత్తగా చేసిపెట్టేవారు; కొద్ది రోజుల్లో మళ్ళీ మామూలయ్యేది. ఖయిదీలందరికి భోజనం సరిగా ఉండనంతవరకూ నాకు మాత్రం బాగుపడేమార్గం తోచలేదు. అందరికొరకు కంప్లయింటు చేశా. ఇతరుల విషయంలో జోక్యం చేసుకోవద్దని సూపర్నెంటు హామియార్ అన్నాడు. కంట్రాక్టర్ల వద్ద లంచం పుచ్చుకోవడం, ఖయిదీల పొట్టకొట్టడం. ఖయిదీల బట్టల విషయంలోకూడ అంతే. జెయిళ్ళలో క్వారంటైనువంటి నరక కూపం మరొకటుండదు. మందులు ఆసుపత్రిలోకంటే బజారులో ఎక్కువగా వినియోగపడుతుంటై. ఏక లంచాలు. ఆ జెయిలులో మరెక్కడా ఉండదని దురభ్యాసాన్ని ఒక పెద్ద వ్యాపారంగా స్థాపించుకొన్నారు వార్డర్లు. దానిని "సోడమీ" అని ఇంగ్లీషులో అంటారు. పిల్లవాళ్ళను స్త్రీలకు బదులుగా ఉపయోగించుకోవడం! ఖయిదీలను కొట్టికొట్టి కష్టమయిన పనులతో హింసించి అణచేస్తారు. ఈ జెయిలు ఒక మాట

మూల వుండడంవల్ల చూడడానికి పెద్దలు సాధారణంగా వెళ్ళరు.

సూపరింటెండెంటు పామియారు ముసలివాడు. యుద్ధమనే నెపంతో రిటైరయిన వయసులోకూడా ప్రతి సంవత్సరం ఉద్యోగం పొడిగించుకునేవుండిరి. జైలరు ఫోన్సికా సోమరిగా యింట్లోనే వుండేవాడు. కంట్రాక్టరు వద్ద లంచాలు పుచ్చుకొని తన క్రిందివారు ఎంత అన్యాయం చేసినా కలుగజేసుకునేవాడు కాదు. డా॥ తమ్మనసింగు పండు వృద్ధుడు. వయసు ముదిరేకొద్దీ డబ్బుమీద ఆశ అధికమవడం సామాన్యమే. కాని, ఈ ద్రోహం డా॥ తమ్మన సింగులో మరీ ఎక్కువగా వుండేది. లంచం యివ్వనిఖైదీలకు మందివ్వడు. "చస్తే చావనీ"అని బాహాటంగా అనేవాడు. చచ్చిన వారి విషయంలో యంత్రంలాగా ఫారాలునింపి పంపేవాడు. అసిస్టెంటు డాక్టరు పాయ్ చిన్నవాడే కాని, ఛీఫ్ వార్డరుకు లంచమిచ్చిన వారందరూ తనకూ యివ్వాల్సిందేనని శాసించాడు. కొద్దో గొప్పో సమర్పించి తీరాలి. ఛీఫ్‌వార్డరు డిసల్వ్ ప్రతాగుపోతు; ప్రతాగి వీధుల్లో పడిపోయేవాడు; పెద్ద మృగము; బంగాలీకూడా కొత్త ఖయిదీలు రాగానే ఆ సిపాసులభోగట్టా తనకు చెప్పటానికి ఒక తొత్తువార్డరును క్వారంటీన్‌లో ఉంచేవాడు. ఆ సిపరుడని తెలిస్తే బాధించి ఉత్తరం వ్రాయించి ఖయిదీ ఇంటికి వార్డరును పంపి డబ్బు తెప్పించుకొనేవాడు. ఈ రహస్యం డాక్టరు పాయికి తెలిసేది. వాడూ అలాగే చేసేవాడు.

డిసల్వా డబ్బు సంపాదనకు ఒక అమానుష కార్యం చేసే వాడు పురుష సంయోగాన్ని ("సోడమీ") ఒక వ్యాపారంలాగా సాగించేవాడు. వాళ్ళు ఆ జెయిలును ఒక జమీలాగా తయారు చేసుకొన్నారు. ఈ జెయిలును ఎంతో సంస్కరించాల్సినపని ఉన్నది. అయితే ఎలా చెయ్యడం? ఎంతమంది ఆఫీసర్లతో పోట్లాడడం? నేనా ఒంటరి వాడిని జోక్యం కలుగజేసుకోకుండా తప్పించుకోటానికి ప్రయత్నించా. కాని హృదయంలో కలచినట్లుండేది. నిద్రపట్టేది కాదు. నా కళ్ళబడ్డ 'సోడమీ' కేసులను రిపోర్టుచేశా; వార్డర్లకు జుల్మానాలు పడ్డాయి. కాని అసలు మూల విరాట్టుని వీక్షించే వార్డరు దొరకటంలా. అయినా కష్టాల్లోవున్న ఖయిదీలు ఆఫీసర్లు ఇండ్లకు వెళ్ళిన సమయంలో అనగా 12-2 గంటల మధ్య వార్డర్లకు లంచాలిచ్చి వారివెంట వచ్చి నాతో కష్టాలు చెప్పుకొనేవారు. అన్నం, బట్టలు, మందుల విషయాల్లో కొన్ని నెలల వరకూ ఏమీ మార్పు తేలేక పోయ్యాను. అయితే జైలంతటా నా ఉద్యమానికి సానుభూతి పరులు ఏర్పడ్డారు. జైలుబయటినుండి ఉత్తరాలు రావడానికీ, పోవడానికీ ఏర్పాట్లు కుదిరాయి. కీ॥ శే॥ కేశవ పిళ్ళేగారు శాసన సభలో జైలువిషయాలను గురించి ప్రయాసపడుచుండిరి. ఆయనకు జైల్లో నుండి రహస్యంగా వివరాలు రాస్తూ వచ్చాను. అన్యాయాలు తొలగించుటకు ప్రారంభించాను. రానున్న కష్టాలు అనంతమని తెలిసికూడా ప్రయత్నం మానలేదు.

కూతుపరంబా (మలబారు) గ్రామవాసి గోవిందన్ శ్రీ॥ శ్రీ॥ హైకోర్టు జడ్జి కృష్ణన్ బావమరిది. కుటుంబ తగాదాల్లో జైలుకు వచ్చాడు. ఆరునెలలశిక్ష. పదిహేను రోజుల్లో చీఫ్‌వార్డరు వగైరాలు అతనివద్ద షుమారు రు 500 లంచాలు లాగేశారు. ఆయన యింటికి వుత్తరాలు పట్టుకెళ్ళి పైకం తెచ్చుకొన్నారు. పాయ్‌కూడా చెయ్యి జాపాడు. గోవిందన్ బంధువులు ఇవ్వడం మానేశారు. అయితే గోవిందన్‌కు జ్వరం వచ్చింది. మందు ఇవ్వకపోగా కొబ్బరిమట్టలను కొట్టమని ఉత్తరువుచేశాడు! డాక్టరు పాయ్ పెట్టే కష్టాలకు ఓర్చుకోలేక వచ్చి నా చేతులు పట్టుకొన్నాడు. జైలర్‌కు రిపోర్టు చేశాను; జస్టిస్ క్రిష్టన్ బావమరిది అని తెలియగానే భయపడ్డాడు. వెంటనే నా ప్రక్క గదిలోకి మార్చాడు. పనిలేకుండా చేశాడు. అయితే ముందు మందు కావాలిగదా! చాలామంది ఖైదీలు రోగాలతో బాధపడుతున్నారు; చచ్చిపోతున్నారు. "ఎలా ఈ దుస్థితిని తొలగించడం" అని గోవిందన్‌ను అడిగాను. 'డాక్టరు పాయిని పిలిపించండి, తంతాను' అన్నాడు. పెంకె తనం చూపితే యిద్దరం తన్నేద్దామనుకున్నాము. వచ్చాడు కాని, నోరు తెరవడానికి భయపడ్డాడు. పిరికివెధవను తన్నడం నా కిష్టంలేకపోయింది. అతనూ అందుకు సమ్మతించాడు. నెట్టేశాము. మా యిద్దరిమీద సూపర్నెంటు

వద్ద కేసు. ఇద్దరం జరిగిందంతా చెప్పాము. "నా జైలు పరిపాలనా విషయంలో నీవు జోక్యం కలిగించుకోకూడ"దని కసిరాడు.

"జస్టిస్ కృష్ణన్ బావమరిదికే లంచంలేకుండా మందు లభించనప్పుడు. రేపు నాగతీ అంతే! నీ వెనక పరిపాలనలో జోక్యం కలిగించుకోక తప్పదు" అన్నాను. సూపరెంటు భయపడిపోయాడు. మా గదులకు పచ్చే శాము 24 గంటలల్లోగా డాక్టరు పాయిని బదిలీ చేయించాడు సూపరెంటు.

మరొక సంఘటన. మంగళూరు నివాసి ఒక నెట్టి నా సహాయంకోసం వచ్చాడు. అతనొక కుర్రాడు. 20 సం॥ వయస్సు. అతన్ని మైనర్ జైల్లో వేయించాడు చీఫ్ వార్డరు. ఆ కుర్రాడు బాగా వున్నవాడు. అతని తండ్రిని ఎవరో చంపారు. చంపినవాడిని కత్తితో పొడిచాడు అందుకు రెండు సంవత్సరాల కఠినశిక్ష. ద్రవ్యవంతుడని తెలియగానే వార్డర్లు, చీఫ్‌వార్డరు వగైరాలు ఉత్తరాలు వ్రాయించుకొని డబ్బు తెచ్చుకొన్నారు. ఇంతడబ్బు, లంచాలు, ఏందుకివ్వాలా అని ఇంటివద్ద ఇవ్వడం మానే శారు. అయితే చీఫ్ వార్డరుకు ఎంతతిన్నా చాలక నెట్టిని మైనర్ జైలుకు పంపాడు.♦

♦ దీర్ఘకాలం జైల్లోవుండే ఖైదీలకు "సోడమీ" దురభ్యాసం అలవడుతుంది. ఈ దురభ్యాసాన్ని వార్డర్లు

మకొకవిషయం :- డాక్టరు తమ్మనసింగు రాక్షసత్వాన్ని ఎలా అరికట్టడం? నా పక్కగదిలో ఉరివేయబడుటకు ఒక మాప్లా వుండెను. యువకుడు. ఖయిదీలు నా వద్దకువచ్చి చెప్పుకునే కష్టాలంతా వింటూ విచారపడుతుండేవాడు. వానికి ఒక చిన్న సహాయంచేశా. తనగదిలో దయ్యాలు బాధపెట్టేతుండేవట: అందువల్ల నిద్రపట్టుట లేదట. నేను గాఢంగా నిద్రపోవడంవల్ల నాగదిలో దయ్యాలు చేవకుకున్నాడు. మేము గదులు మార్చుకొన్నాము. వానికి దెయ్యాలబాధ దగ్గిందట. ఒకరోజున పిచ్చివాడిలా నటించాడు. డాక్టరు తమ్మనసింగు పరీక్ష చెయ్యటానికి వచ్చాను. డాక్టరును బాగా తన్నేశాడు.

అలవాటుచేయించి డబ్బు సంపాదిస్తారు. డబ్బిచ్చే ఖయిదీలను మైనరుపిల్లవాళ్ళనుగాద మేస్త్రీలుగా ఛీఫ్ వార్డరు నియమిస్తాడు. మైనర్లకు ప్రత్యేకంగావున్నా బురాక్రాటిక్, కరప్టుగవర్నమెంటులో మంచిపద్ధతులు చెడవిగా మారిపోతవి.

చెట్టి కుర్రవానిని ఛీఫ్‌వార్డరు బెదిరించాడు. మైనర్ల బ్యారకుకు పంపి ఒక మృగప్రాయునికి వానిని ఉపయోగపెట్టి కొనుటకు అనుమతి యిచ్చాడు. ఈ పిల్లవాడు నావద్దకు వచ్చి రక్షించమని కోరాడు. కాని, ఛీఫ్ వార్డరును జైలరు ఫోన్నికా శిక్షించలేకపోయాడు; పిల్లవానిని స్వాతంత్రం రక్షించాడు. ఈలాంటివి ఎన్నో కేసులు పెట్టాను.

చివరకు కారణంకూడా చెప్పాడు. "లంచం ఇవ్వనివాళ్ళకు మందు యివ్వకుండా చంపేస్తున్నావు; ఇదిగో శిక్ష" అని కొట్టేశాడు. సూపర్నెంటు నోటీసుకు వెళ్ళింది. నేను చెప్పి చేయించివుంటానని సూపర్నెంటు నాతో అన్నాడు. అయితేనేం ఖయిదీలకు మందులు లభించాయి; డాక్టరు తమ్మినసింగు ఉద్యోగం పూర్తి అయిపోయింది.

కొత్తకేసు - లాహోరు జైలుకు

1916-17 లో బర్మాలో ఒక కుట్రకేసు మాండలే నగరంలో జరిగింది. దానిలో నా పేరును, నా స్నేహితుల పేర్లను ఉదహరించుచుండినట్లుగా ఒక డాక్టరు చెప్పారు. ఆ కేసులో ముఖ్యమైన ముద్దాయిలు గదరు పార్టీవారు. నా మిత్రులు అమర్ సింగ్, శివ్ దయాళ్ గుప్తగార్లు. అమరసింగుకు 40॥ సం లకు పైగా శిక్షలు విధించారు. సుబాష్ బోసు ఇతనితోకలిసి మాండలే జైలులో ఉండిరి; బోసుకు విముదలకాగానే అమరసింగు విడుదలకై పాటుబడిరిగాని, అనుకూలం జరగలేదు. జపానీయులు రంగూనులో ప్రవేశించేవరకు (1942) అమరసింగు ఆ జైల్లో వుండెను. శివ దయాళు గుప్తగారిని అండమానులకు పంపిరట కాని, ఉరి వేసి చంపివుంటారని నా నమ్మకం.

లాహోరు జెయిలుకు నన్ను మార్చినట్లు ఉత్తరువు వచ్చింది. కారణం నాకు అప్పుడు తెలియలేదు. ఎదో ఒక

కుట్ర కేసు ఉండివుండునని సంశయించాను. సాధ్యమైనంత వరకు ఆలస్యంగా చేరాలనుకొన్నాను.

జైలు గేటువద్ద యిద్దరు పోలీసులు నన్ను కలుసుకొన్నారు. ఎంతో గౌరవంతో ఆదరించారు. బహుశా జైలు వార్డర్లు నన్నుగురించి పొగిడివుంటారు. అందువల్ల పోలీసులు నేను స్నేహితులమయ్యాము. లాహోరు వెళ్ళే మార్గంలో ఆగ్రా వగైరా పట్టణాలను చూడాలనే ఆశ నాకుండేది. వారికికూడా కోరిక పుట్టించా. సర్కారు రూల్సుప్రకారం రోజుకు 100 మైళ్ళకంటె తక్కువగా ప్రయాణం చెయ్యకూడదు. కన్ననూరునుండి లాహోరు చేరుటకు షుమారు 20 రోజులు గడుపవచ్చును. అందుకు కూడా వారు సమ్మతించారు. అయితే ఖర్చులకు డబ్బు కావాలి. అప్పుడు నా తమ్ముడు మదాసులో చదువు చుండెను. వానిని కలుసుకొన్నాము. డబ్బు తెచ్చి యిచ్చాడు. సత్తాల్లో సామాన్లను, బైఫిల్సును వుంచేసి దారిలోవుండే పట్టణాలను చూస్తూ వెళ్ళాము. తాజ్ మహాలును చూచినప్పుడు ఆ యిద్దరు పోలీసులు "మా జీవితాలు పావనం చేయించా"రని దణ్ణాలుపెట్టి కృతజ్ఞత చూపించారు. మూడు రోజులు వరుసగా తాజ్‌మహాలు చూచి వచ్చాము. రాళ్ళమీద చేసే పనులను వర్ణాపాపులో చూచాము. చివరకు లాహోరు సెంట్రలుజైలులో నన్ను విడిచిపెట్టి పోవలసినప్పుడు కంటతడిపెట్టారు. జైలరు

వగైరాలు ఆశ్చర్యపడ్డారు. అందువల్ల నన్ను జైలులో మర్యాదగా చూస్తూ వచ్చారు.

ప్రయాణంలో పత్రికలు చదివినా లాహోరుగో కుట్రకేసు జరుగుచున్నదని తెలుసుకోలేకపోతిని. రహస్యంగా జరుగుతోందనీ, ఆ కుట్రకేసులో నేనొక ముద్దాయి ననీ జైల్లో ప్రవేశించిన తరువాత తెలిసింది.

నన్ను ప్రత్యేకంగా వుంచారు. మిగిలిన ముద్దాయిలతో కలుపలేదు. వివరాలను తెలుసుకోలేకపోయ్యాను. వారం రోజుల తరవాత తిరిగి నన్ను కన్ననూరు జైలుకు మార్చటకు లాహోరు రైలుస్టేషనుకు తీసుకెళ్ళారు. నాలాగే శిక్షను తప్పించుకొన్న అనేక ముద్దాయిలు స్టేషనులో కనపడ్డారు. వారిలో నా మిత్రుడు ఛత్తర్‌సింగ్ ఒకరు.

నా మిత్రుడు భాయ్ బలవంతసింగుకు ఉరిశిక్ష వేశారు. మిత్రులు ఠాకూర్ సింగుకు, ఛత్తర్ సింగుకు, నాకు శిక్ష లేదట. మేము జెటిన్యాలుగా ఉండాలి. నాకు తెలియనివారెందరికో శిక్షలుపడ్డవి. కొందరిని అండమాన్నుకు పంపారు. హరినామ్‌చంద్, హరిచరణదాస్‌కు జైలు శిక్షలు పడ్డాయి.

బలవంతసింగు మీద చాలా కేసులున్నయి. ఉరిశిక్ష తప్పదని తీర్మానించుకొన్నాను. ఏంతోమంది చేసిన పనులను తానే చేశానని చెప్పి తప్పించివేయుటకు సాధ్య

మైనంతమందికి సహాయం చేశాడు. నేనూ, ఠాకూర్ సింగ్ చేసినదంతా తానే చేశానని చెప్పాడు. "చంచయ్యా కష్టాల్లోను, కష్టాలు లేనప్పుడూ ఒకే మాదిరిగా వున్నాడు. జీవించివుంటే దేశానికి ఉపయోగపడకపోతాడా అని అన్నాడట. ఈ విషయం నా జీవితమంతా కలవరపెడుతూనే వుంది. ఏదైనా త్యాగాలతో కూడినపని చెయ్యవలసినప్పుడు, సంశయాలతో మనసు ఊగిసలాడుతూ బాధపడే సమయంలో బలవంతసింగ్ జ్ఞాపకానికొస్తే వెంటనే ఒక నిర్ణయానికి వచ్చేవాడిని.

ఈ కేసులో జోద్‌సింగు ఆప్రూవరుగా సాక్ష్యమిచ్చాడు. కేసు పూర్తి అయిన తరవాత సర్కారు సహాయంతో దక్షిణ అమెరికా వెళ్ళి దాక్కున్నాడు. అయితే నేమి చివరకు గదరుపార్టీవారి రివాల్వరుకు గురిఅయ్యాడని, కాంగ్రెసు మహాసభలలో కలుసుకున్న గదరుమిత్రులు చెప్పారు.

తిరిగి కన్ననూరు జైలుకు.
పోలీసులలో పోట్లాటలు.

ఒక జైలునుండి మరొక జైలుకు మార్చడం నాకు చాలాయిష్టం. ఇండియా అంతా చూడవచ్చు. జైళ్ళలో సంవత్సరాల తరబడి ఒంటరిగా వుండవలసి వచ్చిన నాలాంటి వానికి ఈప్రయాణాల్లోనే కొంత స్వేచ్ఛ లభించేది.

అందువల్లే కాదోలు నేను పోలీసు యస్కార్టులతో ఎంతో స్నేహంగా వుంటూ, వారి సహాయం పొందుతూండే వాడిని. కాని, లాహోరునుండి కన్ననూరుకు వచ్చే సమయంలో అన్నీ తగాదాలే జరిగాయి.

లాహోరు జైలుకు యిద్దరు రిజర్వ్ పోలీసులు వచ్చారు. సంకెళ్ళు వేయబోయారు! నేను ఒప్పుకోలా. దీనితో తగాదాలు ప్రారంభం: చివరకు రిజర్వ్‌పోలీసులు తమ సూపర్నెంటుకు టెలిఫోనుచేసి,ఆయన ఉత్తర్వ్వుమీద, సంకెళ్ళు లేకుండా టాంగాలో తీసుకెళ్ళారు. వారిద్దరు మాట్లాడుకోవడం విన్నాను ♦ వారు యస్కార్టు చేయుటకు భతాపడుతున్నారు. సంకెళ్ళు లేకుండా తీసుకుపోకూడదని పోలీసులు చర్చించుకోవడం నాకు తెలిసిపోయింది. మద్రాసు చాలాదూరం; పోకూడదనుకొన్నారు. వారి భయాలను యింకా ఎక్కువ చెయ్యాలని చేశాను. నాకు సంకెళ్ళవేస్తే ఆంధ్రులు వారిని తంతారని పిరికిమందు పోశాను. ఇదంతా టాంగాలో పోతూండగా జరిగిన సంభాషణ. తమ సూపర్నెంటుకు నన్ను ఒప్పగించేసి కన్ననూరుకు తీసుకెళ్లేందుకు నిరాకరించారు.

♦ నాకు హిందూస్తానీ, పంజాబీ, ఉరుదూ. అరబ్బీ, అరవం, కన్నడం, మళయాళభాషలు వివిధ జైళ్ళలో అలవాటుపడినై

నాకు సంకెళ్ళు వెయ్యకూడదనీ, చాలా దూర ప్రయాణమైనందున నేను ఒప్పుకోననీ, కావాలిస్తే ఎక్కువ మంది పోలీసులను నా వెంట పంపమనీ, మద్రాసు గవర్నమెంటుకు టెలిగ్రాం యిచ్చి నాకు సంకెళ్ళు వెయ్యవలసిందని ప్రభుత్వం ఆర్డరుయిస్తేతప్ప తమంతటతాము వెయ్యకూడదనీ, టెలిగ్రాం ఖర్చులు నేనే భరించుతానీ ఎన్నెన్నో చెప్పాను. ఇదంతా వింటూన్న ఒక రిజర్వ్ యిన్స్పెక్టరు జోక్యం కలిగించుకొని ఇలా అన్నాడు :— "బారిష్టర్‌లాగా వాదిస్తున్నావే! మాతోనే యిలాచేస్తే ప్రయాణంలో ఈ పోలీసు కానిస్టేబుల్సుగతి ఏమవుతుంది? తువ్వేంచేస్తావో చూస్తా" అని నన్ను బెదిరిస్తూ పోలీసులను పిలిచి నాకు సంకెళ్ళు వెయ్యమన్నాడు "సరే, వెయ్యండి" అని నా చేతులు చాచి ఆ ఇన్స్పెక్టరును యిలా అడిగాను:—"నీ అధికార మెంతవరకు? లాహోరు సరిహద్దుల్లో మాత్రమే! లాహోరు దాటినతరువాత ప్రయాణంచేసేది లేదని నిరాకరిస్తా. అప్పుడు తీర్మానం చెయ్యాల్సిన బాధ్యత మేజిస్ట్రేటుది. చూడాం! నీ యిష్టంవచ్చినట్టే చెయ్యి" అని నేనూ బెదిరించాను.

కొంతవరకు చల్లబడాడు? ఎక్కువమంది పోలీసులను నా వెంట పంపరాదా? వంతులప్రకారంనేను పారిపోకుండా చూచుకోవచ్చు"అని సలహాయిచ్చాను. అప్పుడు సూపర్నెంటుఅందుకొని యిలాగన్నాడు.

"పంజాబులో గదరుపార్టీ ఖైదీలతో చాలా బాధ పడిపోతున్నాము ఎస్కార్టులను కొట్టి, చంపి పారిపోతారు; వైశ నుంచి తప్పించుకపోతారు; జైళ్ళనుంచి తప్పించ పారిపోతారు; కష్టాలకుగాని, చావుగ్గాని భయపడరు అందువల్ల కాళ్ళకు బారు షెట్టుల్లు చేతులకు సంకెళ్లు గొలుసులు, వేస్తేనేకాని పోలీసులు యస్కార్టు చెయ్యటానికి ఒప్పరు. అప్పటికీ మార్గంమధ్యలో ఖైదీల స్నేహితులు యస్కార్టుమీద పడి తప్పిస్తున్నారు. నే నేం చెయ్యాను? చేతులకు మాత్రమే వేయించుకో" అని అడిగాడు. నేను అంగీకరించలా. ఒక పోలీసు స్టేషనులో నన్ను లాకపు చేయించి మూడురోజుల తరువాత నలుగురు, పోలీసులను ఒక గుమాస్తాను వెంటయిచ్చి పంపడమేగాక, ప్రతి రెండువందలమైళ్ళకు యస్కార్టు మార్చడానికి ఏర్పాటు చేశాడు. యు. పి. లో ముగ్గురు పోలీసులు మాత్రమే వచ్చారు. షోలాపూరులో ఇద్దరుమాత్రమే. సంకెళ్ళు లేక పోవడంచూచి భయపడ్డారు. సాయంత్రం వెయ్యటానికి ప్రయత్నించగా నిరాకరించాను. వారిభయాన్ని గ్రహించి, వారికి మంచి సలహాయిచ్చాను నన్ను తమ సూపరెంటు వద్దకు తీసుకెళ్ళమనీ, మర్నాడు ఎక్కువమంది ఎస్కార్టుతో ప్రయాణం చెయ్యొచ్చుననీ చెప్పాను. వారికి నచ్చింది. రైలు దిగాము. రైలు కదలబోతోంది. వారు మనసు మార్చుకొని "ప్రయాణం చేద్దాం బాపూజీ" అని

నవ్వుతూ అన్నారు. సరేనని ఎక్కాను. సాయంత్రం 6 గంటలయింది. రాత్రి రాబోతోంది. పారిపోతానేమోనని, పంకెళ్ళు తప్పక వచ్చేస్టేషనులో వెయ్యాలనీ మాట్లాడుతుంటున్నారు వారి మరాటీ భాష నాకు అర్థమైంది. హోటల్ స్టేషను సమీపించకముందే మళ్ళీ వెనక్కి వెంబడి క్రైయినులో పోదామని సలహా యిచ్చా. అందుకు వారు సమ్మతించలా. క్రైయిను ప్లాటుఫారంమీదికి రాగానే జారవ్యంచేసి సంకెళ్ళు వెయ్యాలని ప్రయత్నించారు ఒక అడుగు ముందుకువస్తే తానన్నాను; బాక్సింగుకు తయారయ్యాను ప్రజలు గుంపులు గుంపులుగా నాపైపైవద్ద చేరారు అది తిలకుగారి దేశం. వారి ప్రఖ్యాతి ఆకాలంలో చాలాబాగా వుంది. ప్రజలు నన్ను సమర్థించారు. గుంపు కూడినవారిలో తెల్లనిగడ్డం వుండే ఒక పోలీసు ఇన్‌స్పెక్టరు జోక్యంకలుగజేసుకొని సంకెళ్ళు వెయ్యమన్నాడు. "ఈ పిరికిపంద లేమి చెయ్యగలరు? గడ్డం గిడ్డం చాలా జోరుగా వుంది. లోపలకి రా, చూద్దాం" అన్నాను. ప్రజలు అల్లరి చేసి నానిచూట్టూ మూగారు. వాడికిసిగ్గేసి వెళ్ళిపోయాడు. క్రైయిను కదిలింది. అలారంగొలుసును లాగమన్నా రెవ్వరో. పోలీసులు లాగారు. బండి నిలబడింది. నేను బయటికి వచ్చాను నావెంట పోలీసులూ దిగారు. గార్డు, డ్రయివరు వచ్చి మామీద కోపగించుకొని నా సామాన్లు దించేసి వెళ్ళారు.

స్టేషనుమాష్టరు వగైరాలు పోలీసులదే తప్పని నిర్ణయించారు. మేజిస్ట్రేటునదకు పోదామన్నాను. టెలిగ్రాం యిచ్చి మరి కొందరు పోలీసులను రప్పించి షోలాపూరుకు తిరిగిపోదామన్నారు. వారు కోరినరీతిగా టెలిగ్రాము వ్రాసియిచ్చాను. రాత్రి బాగా నిద్రపోయాను. వారు నిద్రపోకుండా నన్ను కాపలాకాచారు మరునాడు ట్రయిన్లో ఒక హెడ్డు, మరొక కానిస్టేబులు దిగారు. "నలుగురం కలసి తీసుకెళ్ళతాం సంకెళ్ళ వెయ్యం;అలాంటి ఉత్తరవుతోనే వచ్చా" మని చెప్పారు. సాయంత్రానికి గుంతకల్లు చేరాము.

స్టేషనులో పోలీసులు చాలామంది వచ్చియుండిరి. నేను దిగగానే నన్ను చుట్టేశారు ఒక డిప్టీ సూపర్నెంటు, ఇన్స్పెక్టర్లు ఒకడజనుమంది. పోలీసుల్ని కూచి నాకు నవ్వు వచ్చింది. డిప్టీ సూపర్నెంటు నన్ను రిసీవుచేసి మొదటి తరగతి రెస్టారెంటుకు తీసుకెళ్ళి ఫలహారం, కాఫీ యిప్పించాడు. నామీద భయంకరమైన రిపోర్టు షోలాపూరునుండి వచ్చిందనీ, ఏమిజరిగిందో చెప్పమనీ కోరాడు; చెప్పాను అందరం నవ్వాము. తనకు వచ్చిన టెలిగ్రాం చదివాడు "ఖైదీ దౌర్జన్యం చేస్తున్నాడు. చాలా మంది పోలీసు కాపలా అవసరం" అని ఉంది "చంచయ్యగారూ! మీరు చాలా మెత్తనివారులా గున్నారే; రిపోర్టు ఇలాగుంది!" అన్నాడు! "నేను మెత్తనివాణ్ణే- ఆ టెలిగ్రామూ సరిగానే

వున్నది. నన్ను ఆగావరవంచేసి చూడండి! నే నేమి చేస్తానో !" అన్నాను.

"నాకు అర్థమయింది" అని చెప్పి యస్కార్టును పిలిచి "ముగురు చాలు, మర్యాదగా చూచుకోండి వారికి కావలసినదంతా కొనిపెట్టండి. మీకు వారు ఎలాంటిహానీ చెయ్యరు" అని ధైర్యం చెప్పి క్రైయినులో ఎక్కించి వెళ్ళాడు.

కాని, యస్కార్టుకు భయం పోలేదు. బండి కదల గానే ముగ్గురూ అమాంతంగా నా కాళ్ళు పట్టుకున్నారు. నాకు ఆశ్చర్యం వేసింది. "మాకు భార్యాబిడ్డలున్నారు. మీరు పారిపోతే మా బిడ్డలనోటికూడు పోతుంది" అని ప్రాధేయపడ్డారు. వారి భయం పోగొట్టందుకు నేను చాలా ప్రయాసపడవలసి వచ్చింది. హెడ్డుకానిస్టేబ్లు నాయుడు; దీర్ఘకాయుడు. మిలిటరీలోవున్నాడు. ధైర్యశాలి. పోలీసు డిపార్టుమెంటులో చేరి దొంగలను పట్టాడు. ఆ కాలంలో బండిపోటు లెక్కువ. మిగతా యిద్దరిలో ఒకరు తురకు చివరకు నన్ను బొగా నమ్మారు. మద్రాసుకు తీసుకెళ్ళడానికి సమ్మతించారు. రాజా సర్ రామిస్వామి మొదలి యార్ సత్రంలో బసచేశాము. పట్నంలోవున్న నా బంధు మిత్రులను తీసుకవచ్చారు. నిర్భయంగా మద్రాసులో తిరిగారు. వారి లైఫీల్సును నేను కాపలా కాయవలసి

వచ్చింది. రెండురోజులు మద్రాసులో నా యిష్టంవచ్చినట్లు కాలంగడిపి ప్రయాణం సాగింది.

మార్గం మధ్యలో కోయంబత్తూరు అగ్రికల్చరల్ కాలేజి చూడడానికి పోతనూరు స్టేషనులో దిగాము. నాయుడూ నేనూ కలసి కాలేజీకి వెళ్ళాము; బ్రేడెస్నులో నా నౌకరులాగు నటించాడు. నేనూ రాజకీయఖైదీనని తెలియనివ్వలేదు. నేను అమెరికాలో అగ్రికల్చరల్ కాలేజిలో బి యస్. సి. ప్యాసయ్యానని తెలియగానే ప్రిన్సిపాలుగారు మర్యాదగా నావెంట తానే వచ్చి కాలేజీని, యక్స్పెరిమెంటల్ ఫారమును చూపించాడు విజిటర్స్ పుస్తకంలో వ్రాయమని కోరారు; వ్రాశాను.

♦ ప్రిన్సిపాలుగారు యీ క్రింది విషయాన్ని చెప్పాడు. ఇండియాలో వ్యవసాయ డిపార్టుమెంటును గవర్నమెంటు అభివృద్ధి చెయ్యబోతున్నట్లు, ఇంపీరియల్ సర్వీసులో నెలకు రు 350 - 50 - 1000; 1000 - 100 - 1500 రు. జీతాలు యిస్తారని, 40 మంది విదేశాలలో అగ్రికల్చర్లో పట్టభద్రులయిన వారిని డిప్యూటీ డైరక్టర్లుగా నియమించుతారనీ, అభ్యర్థుల కొరకు "లైఫ్" అనే విదేశీ మాసపత్రికలోని ప్రభుత్వప్రకటన చూపించి, అర్జీ పెట్టుకోమని సూచించాడు

కన్ననూరు జైలువద్ద నన్ను ఒప్పగించేటప్పుడు పోలీసుల దుఃఖాన్ని ఇంత అంత అని చెప్పలేను. నన్ను యస్కార్టు చెయ్యడం ఏదో పాపకార్యంలా తోచింది వారికి.

కుటుంబ కష్టాలు.

మేము అయిదురు అన్నదమ్ములం. నేను జైలులో వుండగా (1916-17) మొదటిఅన్న చనిపోయాడు. మా కుటుంబాన్ని పోషించుచుండిన రెండవఅన్న బసవయ్య కూడా హఠాత్తుగా చనిపోయాడు. భర్త వియోగాన్ని సహించలేక ఆయన భార్య మహాలక్ష్మమ్మ వెంటనే ఆత్మ హత్యచేసుకొన్నది. మూడవనాడిని నేను జైలో ఉన్నాను. మా తల్లి దుఃఖం ఇంతంతకాదు. నాకంటె చిన్నవాళ్ళు ఇద్దరు. కుటుంబాన్ని స్వయంగా పోషించేశక్తి అప్పుడు వారికిలేదు. సోదరుడు బసవయ్య మా అయిదుగురిలో శ్రేష్ఠుడని ఆకాలంలో ప్రసిద్ధి. పురాణాలు బాగా చదివి చెప్పేవాడు. ఆయన పురాణకాలక్షేపానికి ఎందరో వచ్చే వారు. ధైర్యశాలి; భీముడు. అర్జునుడు. అభిమన్యుడు ఆయన అభిమానవీరులు. కీచకవధ ఆయనకు నచ్చినకథ తాను తన భార్య ఒకగ్రామానికి వెళ్ళారు. ఇండ్లు తగుల బడ్డవి. ఒకయింటిలో ముసలమ్మ ఉండిపోయింది. మంటల్లో దూరి తీసుకురావాలి. అందరూ సంశయించుచూంచే బస వన్న బయటికి మోసుకొచ్చాడు. మంటలబాధచే యిద్దరూ

కొద్దిరోజులలో చచ్చిపోయారు. భార్యకు ఆయనంటే అమిత ప్రేమ. బిడ్డలు పుట్టేవారు; చనిపోయారు. భర్త పోగానే నిరాశురాలై చనిపోవాలని తీర్మానించుకొన్నదని సంశయించి మాతల్లి, పినతల్లులు జాగ్రత్తపడిరి; కాని, ఒక నడిరాత్రి ఇంటిప్రక్కభావిలో దూకి ఆత్మహత్య చేసుకొన్నది ఇలాంటికష్టాల్లో నా కుటుంబానికి సహాయం చేయలేకపోతినని దుఃఖించాను. కాని దేశమాత అంతకంటె కష్టాల్లో ఉందని, దేశస్వాతంత్ర్యంకొరకు పని చెయ్యడమే ఉత్తమని నమ్మి. కష్టాలను దిగమింగుచుంటిని.

ఈ కష్టాల్లో నా తల్లి, తమ్ముడు గురుస్వామి నన్ను చూడాలని కన్ననూరు జైలుకు వచ్చారు. అప్పటికి మూడు ఐదు సంవత్సరాలయింది చూచి. నన్నుచూచి తల్లిగారు చాలా ఆనందించింది. నేను ఆరోగ్యంగాను, బలంగాను ఉంటిని. దండాలు, బస్కీలు చేస్తూ వార్డర్లతో కుస్తీపట్టుతూ వుంటిని. అమెరికాకు వెళ్ళేప్పుడు వంద పౌనులు. ఇప్పుడు 136 పౌనులు బరువున్నాను. నన్నుచూచి, మా తల్లి ఆశ్చర్యపడింది. ఆమెదుఃఖం కొంతవరకు శాంతించింది. నా తమ్ముడు కుటుంబాన్ని పోషించుతానని

నేను ఆ విషయంలో దిగులుపడకూడదని ఎంతో ధైర్యం చెప్పాడు ♦

జైలులో వుండగా, అప్పట్లో పరిచయంలేని ఒక విద్యార్థి నాకు పుస్తకాలను తనమిత్రులవద్ద, ఇతర విద్యార్థులవద్ద పోగుచేసి నాకు పంపుచుండిరి. వారే ఇప్పుడు మైలాపూరులో చిల్డ్రెన్ గార్డెన్ స్కూలు ప్రిన్సిపాలుగా రయిన శ్రీ వి. యన్. శర్మగారు, విడుదల తరువాత యిద్దరం ప్రాణస్నేహితుల మయ్యాము.

బిపిన్ బిహారీ గంగూలీ

లాహోరు జైలునుండి వచ్చిన ఒక సంవత్సరానికి నన్ను ఢిల్లీ జైలుకు మార్చారు. మరేదో కుట్రకేసు పెట్టనున్నారని ఊహించితిని. ఢిల్లీ జైలులో ఈ సంశయం రూఢిపడింది. శిక్షపడని నాలాంటివారు వివిధ రాష్ట్రాలలో వుండిరి. వారందరిని పోగుచేసి ఢిల్లీలో ఒక కేసు పెట్టా

♦ నా తమ్మునికి కుటుంబాన్ని పోషించడం అప్పటికి అలవాటయింది. ఇప్పటికీ అలాగే మా అందరి సంసారాల కష్టాల్లోను ఆదుకుంటూనే వున్నాడు. పెద్దవాడిని నేను లేని లోపం పోగొట్టి నా బాధ్యతలను తానే నిర్వహించాడు.

లనుకొన్నారట మూడు నెలలుంచారు. కేసు పెట్టనే లేదు. తిరిగి కన్ననూరుకు మార్చారు.

ఢిల్లీ జైలులో నన్ను ఏకాంతంగా ఉంచారు. అలాగే బెంగాలు నుండి బిపిన్ బిహారీ గంగూలీ అనే విప్లవకారుని మరొకచోట ఏకాంతంగా ఉంచారని తెలిసింది. మేమిద్దరం ఏదో ఉపాయంతో కలుసుకుంటూనే వుంటిమి. ఆయన సన్నగా, పొట్టిగా ఉంటాడు. పర్సనాలిటీ లేదు. అయినప్పటికి మంచి మేధావి. ప్రపంచ యుద్ధ కాలంలో బెంగాలీ విప్లవకారుల ప్రయత్నాలనుగురించి ఎన్నో విషయాలు చెప్పారు. కలకత్తా పట్టుకొని బెంగాలు రాష్ట్రాన్నే పట్టుకొని, వంతెనలన్నిటిని పడగొట్టి, ఇంగ్లీషు వాళ్ళను బెంగాలులో లేకుండా చెయ్యాలని వారి ప్లాను "జయించ గలుగుతారా?" అని అడిగాను. "జయించగలం. కాని నిలుపుకోలేము. మిగత రాష్ట్రాలలో విప్లవోద్యమాలు వృద్ధికిరాలా. అందువల్ల బ్రిటిష్ ప్రభుత్వం ఆ రాష్ట్రాల్లో సైన్యాలను పోగుచేసి, బెంగాలును తిరిగి జయించుకోగలుగుతుంది." అని విచారం వెలిబుచ్చాడు. కలకత్తాకోటలో ఉన్న ఆయుధాలను గురించి వివరాలు చెప్పగలిగాడు. కోటను పట్టుకొనుటకు మార్గాలను చెప్పాడు. బెంగాలు జైల్లో ఎక్కడ వుంచినా తప్పించుకోగలననికూడ చెప్పాడు. అందువల్లనే ఢిల్లీ జైలులో వుంచారనికూడా తెలుసునన్నాడు. కొన్ని సంవత్సరముల తరువాత రౌలట్ రిపోర్టును చదివాను. దానిలో కలకత్తా

నగరాన్ని పట్టుకొనుటకు విప్లవకారులు వేసిన ప్లానులను వివరిస్తూ కలకత్తాకోటను పట్టుకొనేపనిని ఈ బిసిన్ బిహారీ గంగూలీకి ఇచ్చినట్లు చదివాను. తరువాత అతని సాహస కృత్యాలు సాగించుతూనే ఉన్నట్లు పత్రికలలో చదువు తూనే వుంటిని.

ఢిల్లీనుండి మళ్ళీ కన్ననూరుకు తెచ్చారు ఈ జైలు నాకు యిష్టంలేదు.ఖయిదీల కష్టాలు నా కళ్ళకు ప్రత్యక్షమయ్యాయి. అన్యాయాలను చూస్తూ ఊరకుండ లేను. పోరాడకతప్పదు. ఫలితమేమో అతిస్వల్పం. ఫలి తాల ఆశ పెట్టుకోకుండా పోట్లాడాలి.

చిదంబరం పిళ్ళై, నీలకంఠ బ్రహ్మచారి

మన రాజధాని జైళ్ళలో మార్పులు తెచ్చినది రాజకీయ ఖైదీలే. ప్రప్రథమంలో తెచ్చినది వి. ఒ. చిదం బరంపిళ్ళై. ఈయన స్వదేశీ స్టీమ్‌షిప్ నావిగేషన్ కంపెనీని తూత్తుకుడిలోస్థాపించి దేశసేవజేసిన నేరానికి జైలులోఉరి వలసివచ్చినది. వీరిని అన్యాయంగా శిక్షించిన కలెక్టర్ ఆష్‌ను కాల్చేసిన వారిలో ఒకరు నీలకంఠ బ్రహ్మచారి.

1905 సంవత్సరం ప్రాంతంలో జాతీయోద్యమము ప్రారంభమై రాజకీయఖైదీలు జైళ్ళకు వెళ్ళడం ప్రారంభ మైనది. అలాంటివారు జైలుకురాగానే గేటులోనే బట్టలను పూర్తిగా విప్పేసి, వారి గదులకు వారు చేరేవరకు

బెత్తంతో కొట్టుతూ, వెంటపడి తరిమే వాడుక కన్ననూరు జెయిలరు ఫోన్సికాను గురించి అలా చెప్పుకొనుచుండిరి. నీలకంఠ బహ్మచారి ప్రతిజైలులోనుదెబ్బకుదెబ్బకొట్టాడు ఆయనతో నూతనశకం ప్రారంభమయింది. జైళ్ళలో అప్పటినుండి రాజకీయ ఖైదీలను కొట్టడానికి సంశయించే వాళ్ళు. అయితే చిదంబరం పిళ్ళై ఖైదీలందరిని సంఘటిత పరచి పోరాటాలకు దింపాడు. బయటనుంచి సంస్కరణ కొరకు పాటుపడుచుండిన శాసనసభ్యుడు కేశవపిళ్ళైగారు నిర్మాణరూపంగా సంస్కరణలు చేయించాడు. అంతవరకు యిచ్చుచుండిన గోచీలకుణ్ణోడుగా చెడ్డీలు, బనీన్లు, మూడేసి తుండుగుడ్డలు యిప్పించారు. నేమీద పడుకొనుటకు బదులుగా ఒక గోనెపట్టా, ఒక గొంగడి యిప్పించారు. మట్టిచట్టి, ముంతలకుబదులు రేకుపళ్ళెము, తగరంలోటా యిప్పించారు. జైలులో ప్రవేశించగానే, స్త్రీలకు, పురుషులకు గుండు చేయించడం♦ మాన్పించారు. అయితే మెడలో పెద్ద ఇనుపకంఠె పోలా.

కాలికి యినుపకడియం పోలేదు 1920 ఉద్యమములో జెయిలుకి వెళ్ళిన కాంగ్రెసువారికి ఈ కడియాలు వేశారు.

♦ తమ ప్రభుత్వాన్ని శాశ్వతంగా ఇండియాలో స్థాపించగోరిన బ్రిటిష్‌వారు ప్రజాసామాన్యాన్ని పాటించక పోవడం సహజమే. తమ ప్రభుత్వాన్ని వ్యతిరేకించేవారిని

1915_1919 వరకు నేను డెటినూ్యగా ఉంటిని. అందువల్ల నాకు ఈ బాధలు లేవు.

జైలులో పోరాటం

కన్ననూరు జైల్లో డాక్టరు త్రమ్మనసింగు స్థానంలో నారాయణపాయ్, (పేరు సరిగా జ్ఞాపకంలేదు.) అసిస్టెంటు డాక్టరు పాయ్. స్థానంలో గోవిందనాయరు వచ్చారు. ఖయిదీలకు మందు మాకులు లభించాయికాని, ఆహారంలో మార్పు తెచ్చుటకు జడిశారు. ఖైదీల పొట్టలుకొట్టే జైలరును మార్పించాలి; ఎలా? సగవత్సరానికి ఒకతడవ జైళ్ళ యిన్స్పెక్టరు జనరలు తనిఖీచేసి వెళ్ళుతాడు. అది ఒక

హడలగొట్టించుటకు జైళ్ళలో భయంకరమైన పరిస్థితులను సృష్టించారు. "మానమర్యాదలుగలవారు" ఎన్ని కష్టాల కైనా ఓర్చుకొనుచుండిరి గాని, జైళ్ళకుపోవుటకు జడిసి పోయాగు. దిక్కులేని కైతులు, బీదలుమాత్రం జైళ్ళకు పోకతప్పదు. అలాంటి ప్రభుత్వంలో ఈ విషమపరిస్థితు లను మార్పించినవాడు చిదంబరంపిళ్ళై, నీలకంఠ బ్రహ్మ చారిగార్లు. వారు 1907 మొదలు 1912 సం॥సల ప్రాంతంలో జైళ్ళలో వుండిరి. వారుండిన జైళ్ళలో 1916-12 లో శ్రీ హరిసర్వోత్తమరావుగారు వెల్లూరు జైలులో ఉండిరి. ఈ జైలులో నేను ఉండనందున వారు చేయించిన మార్పులు నాకు తెలియవు.

లాంఛనంమాత్రమే. జైలుకు వెళ్లవేయించుతారు. ఆ రెండు రోజులూ మాత్రం మలిచిన బియ్యం, కూరలు, పులుసు ఉంచై ఇచ్చిన కొత్తగుడ్డలనుకూడా తిరిగి లాక్కుంటారు. (ఈ సాంప్రదాయం 1948 వరకూ మారలా)

ఇన్‌స్పెక్టరుజనరలు దొరగారితో "జైలరు ఫోన్ కాసి సోమరి.అందువల్ల అందరం బాధపడుచున్నాము అంత కంటే చురుకైన వ్యక్తి జైలరుపనికి లభించడా?" అని జైలు అధికార్లందరిఎదుట అడిగాను.

"నీకు వ్యక్తిగతంగా ఏవైనా కంప్లైంట్లు ఉంటే చెప్పు" అన్నాడు దొరగారు.

"అలాగైతే ప్రత్యేకంగా మాట్లాడడం న్యాయం కదా?" అన్నాను.

జైలు అధికార్లు మూరంగా వెళ్ళారా, జైలరును గురించి మాత్రమే వివరంగా చెప్పాను. నన్ను ఆ జెయిలు నుంచి మరొక జె యిలుకు— ముఖ్యంగా ఆంధ్రదేశంలోని జైయిలుకు మార్చమని కోరాను. పదిరోజులకు ఫోనిసి కాకు ట్రాన్సఫర్ అయింది; నాకేమో కాలేదు. ఫొన్నికా నావద్ద కొచ్చి "ఇకమీదట చురుగ్గా వుంటాను కన్ననూక్ జైయిలుకు తిరిగి రావడానికి ప్రయత్నిస్తాను. సహాయం చెయ్యవూ?" అని బతిమలాడి వెళ్ళాడు. జెయిళ్ళలో డబ్బు సంపాదించడం జమీందారీపద్ధతి మాదిరిగా చేసు

కొన్ని ఆఫీసర్లు ఎలాగైనా అక్కడే వుండాలని ప్రయత్నిస్తారు.

ఫోన్‌సికా స్థానంలో జైలర్‌గా గురునాధయ్య(ర్) గారు వచ్చారు. వీరు చిత్తూరుజిల్లా తెలుగువారే. ఆక్సిం గుగా వచ్చారు. పై పై ఉద్యోగాలను సంపాదించాలి ఏ విధంగా సంపాదించినా న్యాయమేననుకునే రాక్షసుల్లో ఇతనొకడు. అందుకోసం ఎంతైనా ప్రయాసపడేవాడు. జైలులో ఎక్కడెక్కడే యేలోపాలున్నాయో. నన్నడిగి తెలుసుకొని ఫోన్‌సికాను అణగత్రొక్కేశాడు. సూప రెన్‌టు పామియారుకు భయంవేసింది. రూల్సును తూ. చ. తప్పకుండా అన్నం, బట్టలు, మందులూ యిస్పిస్తూ జైలు ఉద్యోగస్తులను భయపెట్టాడు; ఖైదీలకు బాగా అనుకూలించింది. ఆయనా నేనూ కలసి "రాజ్యం" చేశాం కొంతకాలం.

కాని, మా ఇద్దరి త్రోవలు వేరయ్యాయి. పెద్ద ఉద్యోగాలు సంపాదించాలని తీర్మానించుకొన్న దురాశాపరుడు. గురునాధయ్యర్ నాకు ఒక కథ చెప్పాడు. అప్సన్ ఆక్టింగ్ జైలర్‌గా ఉంటూండగా ఒక కఠినమైన సూప రెన్‌టువున్నాడు. సూపరెన్‌టును కొట్టమనికొందరు ఖయిదీలను ప్రోత్సాహించాడు. వాళ్లు కొడుతూంటే అప్సను ఖయిదీలనుకొట్టి సూపరెన్‌టును రక్షించాడు. తన కృతజ్ఞత చూపుటకు సూపరెన్‌టు అప్సను తన ప్రాణాలను రక్షించిన మహానుభావుడని ఇన్‌స్పెక్టరు జనరలుకుచెలి

గ్రాండ్ చాచ్చడు. పై అధికారులు మెచ్చుకొని, అప్పనును డెప్యూటీ సూప రెన్ంటుగా నియమించారు. గురన ధయ రుకు అప్పన్ మార్గం బాగా నచ్చింది. "జైలు సర్వీసులో మరోమార్గం" లేదని విచారపడ్డాడు. నన్ను సహాయం చెయ్య మనికోరాడు కొందరు ఖైదీలతో చెప్పితే చాలునన్నాడు. "సూపరెన్టు పామియార్ రాక్షసుడు కాడు. ఈ విధంగా నేను సహాయంచెయ్యలే"నని ఖండితంగా చెప్పాను. నిరాశ చెందాడు. తాను నాకు చెప్పిన విషయాన్ని మరచి పొమ్మని కోరాడు. సరేనన్నాను. కాని, ఈ మోసగాడిని జాగ్రత్తగా కనిపెట్టి ఉండాలనుకున్నాను. తన ప్లానును మానేసే రకం కాడని అనుకొన్నాను. కాని, నాకు సూప రెన్టుకు తగవులుపెట్టి, నా చేతనే కొట్టించే ప్లాను వేస్తా డని నేను తలచనేలేదు.

జైయిలులో నేను కొన్ని రూల్సును ఉల్లంఘించే వాడిని. కాగితాలు, ఉత్తరాలు, పుస్తకాలు, న్యూస్ పేపర్లు,మనియార్డర్లు వగైరా కావలసిన వాటినిబయటనుండి తెప్పించికుంటూవచ్చా. ఇది జైలు ఆఫీసర్లందరికీ తెలుసు; పోస్టాఫీసులోకూడా తెలుసు. అయినప్పటికి నన్ను అడ్డు పెట్టలా.

ఇన్స్పెక్టరు జనరలు తనిఖీకి వచ్చేకాలం సమీపించింది. జైయిలు పరిపాలనలో నేను కనిపెడ్తూవచ్చిన లోపాలన్నిటిని షుమారు ఇరవై పేజీల రిపోర్టు వ్రాశాను. ఆయన వచ్చినప్పుడు ఇవ్వాలనుకొన్నా. ఆ ఉదయాన

ముందుగానే గురునాథయ్యకు చెప్పాను. ఆయన ఒక సలహా యిచ్చాడు. "కాగితాలు ఎలా వచ్చాయనే నేర మేర్పడుతుంది. జైలరు చేతకాని వాడని నాకు రిమార్కు రాకూడదుగదా! కంపయింటున్ ప్రవాసి యివ్వటానికి కాగితాలు కావాలని అడుగు; ఇమ్మనటాడు; ఇస్తాను; మరునాడు వచ్చి తీసుకెళ్తాడు"అని సలహా యిచ్చాడు. అలాగే జరిగింది. నింద తప్పించుకోడానికి యిచ్చిన సలహా నాకూడా నచ్చింది. అయినా తనమీద నిందను తప్పించుకోలేకపోయాడు. ఆయన యిచ్చినది రెండు కాగితాలు మాత్రమే; నా రిపోర్టు యిరవై పేజీలకు పైగా వుంది.

ఇన్‌స్పెక్టరుజనరలు, సూపరెన్టెంటు మాత్రమే చదువుకొని మదనపడి నారిపోర్టును చించేశారు. ఇన్‌స్పెక్టరు జనరల్ వెళ్ళిపోగానే సూపరెన్టెంటు జైలరును బెదరించాడు నాశనం చేస్తానన్నాడు. అయితే అయ్యరుగారు చేతకాని వాడు కాదు తనకూ, నాకూ ఏలాంటి స్నేహమూ లేదనీ, నా గది తనిఖీచేసి నిషేధవస్తువులను తెచ్చియిస్తానని, సూపరెన్టెంటు చంచయ్యను ఏమిచేసినా సహాయం చేస్తానని జైలరుగారు ప్రార్థించాడు. మధ్యాహ్నం 2 గంటలకు నా గది తనిఖీచేశాడు. ఏమో వున్నై. "వీటిని ఇక్కడే వదిలేసి వెళ్ళండి. నేనే నాశనం చేస్తాను" అని సలహా యిచ్చాను. నామాట లక్ష్యపెట్టలా. "నిప్పుతో

చెర్లాడుతున్నా" వని వార్నింగు యిచ్చాను. తలవంచు కొని వెళ్ళాడు.

నేనూ ఒకప్లాను వేసుకున్నాను. "ఉదయాన సూప ర్నెంటూ; జైలరూ వస్తారు. నన్ను తిడతారు. సూప ర్నెంటును నామీదికి అయ్యారు ఉసికొల్పుతాడు; అయినా నేనుశాంతంగా వుండాలి. తరువాత పరిస్థితులనుబట్టి నడచు కోవాలనుకున్నాను.

గత రెండుసంవత్సరాలలో సూపర్నెంటు ఎన్నో సార్లు నాకు సౌకర్యాలు కల్గింప ప్రయత్నించాడు; ముఖ్యంగా ఇన్స్పెక్టరు జనరలు వచ్చేముందుగా రూల్సు ప్రకారం యిచ్చినదంతా తీసుకొనుటకు సిద్ధమే. జైల్లో ఖైదీలందరికోసం పోట్లాడాలనే పాలసీ ప్రకారం ప్రవర్తిస్తు న్నాను. మరునాడు ఇద్దరూ వచ్చినపుడు సూపర్నెంటు నన్ను "పాము" అనీ "పాలుపోసినా విషముగా మారి పోయిం"దనీ ఏమేమో అన్నాడు జైలరు ఆయన్ను యింకా రెచ్చగొట్టాడు. సూపర్నెంటుమీద నేను దౌర్జన్యంచేస్తే జైయిలరు ఆయనకు సహాయంచేసి ప్రమోషన్ సంపాదించు కోగలడు. అప్పను కథ నాకు బాగా జ్ఞాపకముంది. కాబట్టి ఎన్నితిట్టినా సహించాను. నన్ను ఒకగదిలో మూసివెయ్యా మని సూపర్నెంటు ఆర్డరువేశాడు. కాని, అయ్యరుగారు కోతిపుండు బ్రహ్మాండం చేస్తాడనుకున్నాను. అంతే అయింది. డాక్టరు గోవిందన్నాయరు నన్నెలాగో కలుసు కొని ఒక్క మాటమాత్రం చెప్పి వెళ్ళాడు; "ఎంత

మాత్రం ఎదిరించొద్దు. కొట్టేందుకు అవకాశ మియ్యవద్దు" అని ఆయన హెచ్చరిక. అలాగే చేద్దామనుకొన్నా. కాని, ఆ సాయంత్రం ఒక గంట ముందే వెయ్యిమంది ఖైదీలను బాకుల్లో మూసేసి రోడ్డుమీద వార్డర్లను బారులుతీర్చి నిల బెట్టారు. ఛీఫ్‌వార్డరు, మరికొందరు బలాఢ్యులు- నావల్ల జుల్మానాలు వేయించుకొన్నవారు- నా వద్దకొచ్చి లేచి నడవమన్నారు నేను లేవలా. మోసుకెళ్ళారు; ఒంటరి గదిలో బంధించారు నా శరీరంమీద వారు చెయ్యి వెయ్యడం అమర్యాదగా తోచింది. కసితీర్చుకోవాలి:ఎవరి మీద? యింతకూ జైలరే కారణం!మూడోనాటి వుదయం గురునాథయ్యర్‌గారు నన్ను వార్డర్లలాగి యెత్తుకెళ్ళారని విని తాను విచారపడ్డానని; మొసలి కన్నీళ్ళు కార్చాడు. జైలరే గేటువద్ద గదిలోవుండి ఇవన్నీ చేయించాడని నాకు ముందే తెలిసింది ఇతనికి. బుద్ధిచెప్పే దెలాగా అని యోచించాను. ఏమీ తోచలా. "గదిలో కాలం గడవడం కష్టంగావుంది. యోగాభ్యాసాన్ని గురించి తాను నాకు రికమెండుచేసి తెప్పించియిచ్చిన పుస్తకాన్ని యిస్తే, యోగాభ్యాసంచేస్తా" నని చెప్పాను. సూపర్నెంటు ఒప్పుకోడన్నాడు. ఆయనకు తెలియకుండా మరునాడు ఆది వారం ఉదయం తెచ్చి పెట్టమనికోరాను 'సరే' నని వెళ్ళాడు. మర్నాడు వీలుచేసుకొని జైలరును శిక్షించాలి! తరతరాలుగా జ్ఞాపకముండేలా చెయ్యాలి! ఎలా? ఈ ఆలో చనతో తలనొప్పి వచ్చింది.

జైలరుకు దేహశుద్ధి

నా బాకు వారరు గోవిందన్‌కు నా మీద చాలా గౌరవం. అతని అభిప్రాయాన్ని కనుక్కోవాలనుకొన్నాను. ప్రమోషను కావాలని ఆశ వున్నదని చెప్పాడు. అప్పను నేను జ్ఞాపకముంచుకోమన్నాను నేను. జైలర్‌ను శిక్షించేందుకు అవకాశమిస్తానన్నాడు. అదేసమయంలో పరుగెత్తుకొచ్చి నన్ను కొట్టి; ప్రమోషను సంపాదించుకొనుటకు అంగీకరించాడు. నేను కోరినకీతిగా మరునాడు ఉదయాన జైలరు నా వద్దకు వచ్చేముందుగా, పళ్ళు తోముకోటానికి తలుపుతెరచి నన్ను వదలిపెట్టి, మరే కర్మడో పనులుచేసుకొంటూ వెళ్ళాడు. నేను వరండాలో ముఖంకడుక్కోవడం చూచి జైలరు నడకను తగ్గించాడని నాకు తోచింది. నేను లోపలికివెళ్ళి, యినుపకమ్మీ తలుపును మూసినట్లు నటించాను. తలుపువద్దకు వచ్చి పుస్తకం యివ్వబోయాడు బయటికొచ్చి తీసుకోవచ్చునా అని అడిగాను. సరేననక తప్పలా. చేతిలో పుస్తకం తీసుకొని కాలితో నడుంమూదతన్నాను. తాను ధైర్యశాలినని, కర్ర తిప్పడం తెలుసునని; కుస్తీ పట్టగలనని నాతో ప్రగల్భాలు కొట్టేవాడు. ఖయిదీలు ఎందరున్నా, గొర్రెల మందమీద తోడేలు దూకినట్లుగా, ఒక్కడే వారిపై నబడి కొట్టేవాడు. ఇప్పుడా ప్రగల్భాలు మాయమైపోయినై. "నిన్నిప్పుడే చంపిస్తాను చూడు" అన్నాడు. ఆయన్ని అవమానించాలనే నా ప్లాను; కాని, అవయవాలకు హానికలగా

లనికాదు. తన బెత్తం ఝళిపించగానే నా చెక్కచెప్పను చేతికి తీసుకొని విసిరాను. ముఖంమీద తగిలి కళ్ళజోడు పగిలింది. ముఖంమీద బొప్పికట్టింది. రెండో చెప్పు తీశా. "చంపేస్తాను" అని మళ్ళీ బెదిరించాడు. చెయ్యెత్తేసరికి కాళ్ళకు బుద్ధిచెప్పాడు. వెంటపడి చెప్పు విసిరాను. వీపు మీద తగిలింది. వెనక్కి తిరిగి వచ్చాను. దగ్గరలో పొరక వుంది. తీసుకోబోతుండగా అలారం, యీలలు వినబడినై. వార్డర్లు పడుగెత్తుకొస్తున్నారు; బయ్యలు ప్రదేశం; అంత మందితో పోట్లాడటమెలా? రక్షించుకోవాలి! నా గది లోకివెళ్ళి తలుపువేసి గడియపెట్టాను. ఖయిదీలు, వార్డర్లు గుంపులు గుంపులుగా నా గదివద్ద మూగారు.

నన్ను ఒంటరి గదిలో పెట్టకముందు ఊరితీయబడ వలసిన వారి గదిలోపెట్టారు. ఆ గదిలోకి పాములు వస్తూండేవి మా గదులకు దాపునే అడవి వుంది. ఒకరాత్రి హెడ్‌వార్డరు గస్తీకి వచ్చినపుడు నా గదిలో ఒక పాము దొరబడడం చూచాడు. నన్ను లేపాడు. గాఢనిద్రలో నుండి ఎలాగో లేచాను. అయితే తాళం తెరవగలవా? అనడిగాను. తాళంచెవి లేదన్నాడు. "అయితే ఎందుకు లేపావు? పాము భయపడి మీదపడదూ?" అనిచెప్పి శాలువ గట్టిగా కప్పుకొని తిరిగి గాఢంగా నిద్రపోయాను. తాను బయట కనిపెట్టుకొని వుండి, పాము రాగానే చంపేసి వెళ్ళాడు. మరునాడు దాన్ని సూపర్నెంటుకు, నాకు చూపించాడు. అప్పటి నుండి పడుకోటానికి ఒక వెదుళ్ళ

మంచం యిచ్చారు. దానికాళ్ళు చాలా దృఢమైనవి. ఎప్పటికేమవుసరమవుతుందోనని ఒక కాలిని తీసిపెట్టి ఉంచాను. ఇప్పుడిది బాగా అనుకూలించింది. దాన్ని పుచ్చుకుని "నా గదిలోకి మొదట ప్రవేశించినవాడు చస్తా"డని బెదిరించాను.

ఖయిదీలను ఎందరినో తెచ్చారు; ముఖ్యంగా ఎర్ర టోపీల వాళ్ళను (హత్యకేసుల్లో జన్మశిక్ష పడ్డవారిని) నన్ను కొట్టమని ప్రోత్సహించి, బెదరించిచూచారు. వారు నాతో కలబడడానికి అంగీకరించలా. వార్డర్లు భయంతో సంశయించుతున్నారు. "లోపల కెళతారా లేదా" అని వారిని జెయిలరు బెదిరించాడు. "ధైర్యశాలివి. వీరుడవు, శూరుడవు, కూ చేయగలవు, కర్ర తిప్పగలవు, నీవే లోపలికి రారాదా" అన్నాను ఖయిదీలు నవ్వారు. తన బెత్తంతో వారిని కొట్టాడు. ఈ లోపల ఒక వార్డరు రావాలనుకుంటూ వుండడం గమనించా. మంచి బలిష్ఠులు. సోడమీ కేసులను ప్రోత్సహించాడని వానిమీద కేసు పెట్టి జులాన్నా వేయించాను. ఈ విషయం గ్రహించి నా మిత్రుడు గోపాలన్‌వైపు చూచాను. "అవకాశం పోగొట్టుకోవద్దు" అని నేను సూచించినట్లు గ్రహించాడు; ముందుకు వచ్చాడు. నేను అడ్డుపడినట్లు నటించాను; లోపలికి రాగలిగాడు; పోట్లాడినట్లు నటించి, క్రింద బోర్లపడ్డాను. నా వీపుమీద కూచుని కొట్టారు; ఇతర వార్డర్లు కూడా కొట్టారు. జైలరు మాత్రం లోపలికి రాలేదు; కాని,

"కొట్టండి" "తన్నండి" అని ప్రోత్సహిస్తూనే వున్నాడు నన్ను ఎంత కొట్టినా ఆయనకు సంతృప్తి కలుగలా. "చంచయ్య పలకడంలేదు! చచ్చిపోయ్యాడేమో?" నని వారిని అన్నారు. కొట్టడం చాలించారు. నా బట్టలను పూర్తిగా తీసేయించాడు. సామానులన్నింటిని తీసుకెళ్ళారు. కక్కుసు చట్టినైనా ఉంచలేదు. నాదగ్గరకు ఎవరూ రాకూడదు; మాట్లాడకూడదు; నీళ్ళుకూడా త్రాగటానికి యివ్వకూడదని ఉత్తర్వుచేశాడు. వరండాలోకి యినుపకమ్మీల ద్వారా నగ్నశరీరంతో ఉచ్చపోయ్యాలి. పోశాను, చాలా దప్పిక అయింది. రాత్రి అయింది. ఒక కాన్వికు వారు-ఖానీకేసులో జన్మశిక్ష పడిన ఒక బళ్ళారి హరిజనుడు తాళం తనిఖ చెయ్యడానికి వచ్చాడు. మంచినీళ్ళ కావాలంటిని ఎవ్వరికీ కనిపించకుండా వుండటానికి నా గది ముందటి లాంతరును దూరంగా తీసుకెళ్ళి చీకటిలో దోసిటితో నీళ్ళు త్రాగించి వెళ్ళాడు.

జైలరుకు ఒకే కూతురు. కొడుకులు లేనేలేరు. నేను తన్నినవాడు కూతురికి శోభనం; దూరప్రదేశాలనుండి బంధువులు చాలామంది వచ్చారు. కంటిదగ్గిర బొప్పి. కళ్ళజోడు పగలడం చూచారు; చాల పరాభవం జరిగింది. నా కోరికకూడా అదే. నా మనసు శాంతించింది.

నాకు రెండురోజులు ఒళ్ళంతా నొప్పులుగావుంది. తరువాత మామూలే. బాగా కసరత్తుచేస్తున్నశరీర మయి నందున ఒక్కుకోగలిగాడు. ♦

నామీద కేసు పెట్టాలి. నేను ఒక డెటినూ్యని. శిక్షపడిన ఖైదీనా కాదు; కాబట్టి ఇంత పెద్దకేసును మాజి స్ట్రేటు విచారించాలి కాని, జైలు సూపర్నెంటు విచారిం పజాలడు. అలాంటి బహిరంగకేసుకు సూపర్నెంటు. జైలరు ఒప్పజాలరు. సూపర్నెంటు. దొంగతనాలనుఎన్నో బయట పెట్టగలను. కాబట్టి కేసు బయటికి పోకుండా తానే ఏదో మసిపూసి మారేడుగాయ చెయ్యాలి. ఎలా చేశాడు?

రెండు రోజుల తరువాత నా బట్టలు. సామానులను యిచ్చి సూపర్నెంటుఆఫీసుకు తీసుకెళ్ళారు. మేడమీదసూప

♦ నాఅనుభవాలనుబట్టి కొన్ని సందర్భాలలో శరీర కష్టాలు- ముఖ్యంగా నొప్పులు శరీరాన్ని అంతగా బాధిం చవనిన్ని, మనసు ఒప్పితే శరీరం భరించగలదనీ నా భావం. శరీరానికి ఎంత నొప్పి తగిలినా నా కెంతో శాంతి, సంతోషము కలిగినవి. దెబ్బలవల్ల నొప్పిలేక పోయినా కొందరు ఖయిదీలు అనసరంగా భయపడేవారు. ఏడ్చేవారు, కొట్టవద్దని వారర కాళ్ళుపట్టుకొని ప్రతిమి లాడేవారు. ఇంతమాత్రానికి ఎందుకు ఇంత నీచంగా ప్రవర్తిస్తారా అనుకొనేవాడిని స్వగారవం అనే గుణం వారి జీవితాల్లో అభివృద్ధికి రాలేదని భావించేవాడిని.

కొన్నింటు, జైలరు మాత్రమే ఉండిరి. రహస్యంగా ఏదో రాజీ పడాలని వారి ఉద్దేశమని తోచింది నాకు. సూప కొన్నింటు 'జైలరును కొట్టావా?' అనడిగాడు.

నేను : "కొట్టాను; తన్నాను; చెప్పుతోకూడా కొట్టాను"

సూ : - "ఎందుకు చేశా వలా ?"

నేను : - కొట్టనక్కరలేని వానిని కొట్టినందుకు విచార పడుతున్నాను" (Sorry, the wrong man got the beating.)

సూ : - "అయితే నువ్వాసలు కొట్టాలనుకున్న దెవరిని ?"

నేను : - "నిన్నే"

సూపరెన్నింటు ఉలిక్కిపడ్డాడు; కుర్చీలో నుంచి లేచి కూర్చున్నాడు. కలం పారేసి తల వంచుకొన్నాడు. "మేము నీకేమి హాని చేశాం చంచయ్యా? నా మర్యాదా పోయింది. జైలరు మంచి వంశీంవాడు; ఆయన తరతరాల మానమార్యాదలు పోగొట్టావు ! నీకు చెడ్డపేరు తెచ్చుకున్నావు. ఎందు కిలా చేశావు ?" అన్నాడు పామిమూర్. జైలరు అందుకొని "బట్టలు తీసేసి పిరలమోద కొట్టాలి (flog) సార్ !" అన్నాడు

నేను : - "నీ భార్య వితంతువు కావడానికి సిద్ధపడిందా?" అన్నాను. వారిద్దరూ కొంతసేపు ఏమీ మాట్లాడ లేక పోయారు.

సూ : - "ఆయన్ను ఎందుకు కొట్టావు?"

నేను : - "ఉన్నది ఉన్నట్టు నిజం తెలుసుకోవడం యిష్టమేనా?"

సూ : - "తప్పకుండా"

నేను : - "సత్యానికి నిలబడగలిగిన ధైర్యమున్నదా నీకు?"

సూ : - "ఉన్నది"

నేను : - "జైలరూ! నిజం చెప్పు" అన్నాను. జైలరు తబ్బిబ్బయ్యాడు. సూపర్నెంటు జైలరువైపు చూచి "ఏమిటయ్యా! చెప్పరాదూ"అన్నాడు. "నాకేమీ తెలియడంలేదు" అన్నాడు జైలరు.

అలాగయితే నేనే చెప్తానని. సూపర్నెంటును కొట్టించి తాను ప్రమోషన్ పొందటానికి నాకు చెప్పిన అప్పనుకథ, తాను కోరిన సహాయం, నేను నిరాకరించుట మొదలయిన గాథ చెప్పాను. జైలరుకు కాళ్ళు ఒణికాయి. సూపర్నెంటుకు కోపం హెచ్చింది. "నీకు నమస్కారం చంచయ్యా! ఈ విషయాన్ని బాగా ఆలోచిస్తాను. దయ చేసి నీవు వెళ్ళొచ్చు" అన్నాడు సూపర్నెంటు.

మర్నాడే జైలరుకు ట్రాన్సఫర్ అయింది. తిరిగి డెప్యూటీ జైలర్ అయ్యాడు. తాత్కాలికంగా నా కష్టాలు తగ్గాయి. అయితే అప్పుడవి కష్టాలుగానే తోచలేదు.

చావుకు సిద్ధపడిన ఆ కాలంలో ఇలాంటి కష్టాలు భోజనం లోకి అప్పుడప్పుడప్పుడ

నిరాకరించిన పఠాను సిఫాయీలు యిద్దరు ఖైదీలుగా వుండిరి. ఒకరు బాగా చదివినవాడు. అరబ్బీ, ఉరుదూ నాకు నేర్పాడు. నాచే ఖోరాన్ చదివించి ఉర్దూలో అర్థం చేప్పే వాడుక. ఇప్పుడు ఏకాంతవాసంతో విసుగెత్తింది. యుద్ధం ముగిసిపోయింది. ఆరుమాసాల్లో విడిచిపెడతామని చేసిన శాసనాన్ని ఆరేసిమాసాలచొప్పున పొడిగిస్తున్నారు. మద్రాసు రాజధానిలో నే నొక్కడి నే రాజకీయ ఖైదీని; అయినా నన్ను విడుదల చెయ్యలేదు. మరొక జైలుకు వెళ్ళటానికి ప్రయత్నించాలనుకొని సూపర్నెంటును అడిగాను.

నేను :- "నన్ను చూస్తే నీకు భయంగా వున్నది. నిన్ను గురించికూడా అలాగేవుంది. నన్ను యింకోజైలుకు మార్పించరాదూ? లేకపోతే, నీవు యింకోజైలుకు మార్పించుకోరాదా?"

సూ :- "నిన్ను ఏకారణంతో మార్పించగలను? నీ ఆరోగ్యం బాగున్నది! నీ తూకం పెరుగుతూనే వుంది. అందువల్ల ప్రభుత్వం సమ్మతించదు."

నేను :- "అలాగైతే డాక్టరుగారిని పంపండి. ఏదో ఉపాయం కనిపెట్టుతారని సూచించాను.

డాక్టరు నారాయణపాయ్‌గారు వచ్చారు. ఆయనకు నేనంటే చాలా యిష్టం. ఎన్నెనో యుద్ధసమాచారాలు చెపుతూంటాడు. ట్రాన్సుఫరు చేయించుతానని చెప్పాడు.

రొన్నాళ్ళలో ఏకాంతవాసం లేకుండా చేస్తానన్నాడు. కోయంబత్తూరు జైలుకు మార్చారు; నాలాగే ఒకడెటినూ ఏకాంతంగాఉన్నారు. అతనుటర్క్ దేశస్థుడు యూరపియన్ ఖైదీలను ఉంచేబ్లాకులో ఉంచాడు. రెండోభాగంలోనన్నుం చారు. విశాలమైన హాలు, వరండాలు, స్నానంగది చిన్న ఆవరణా, కుర్చీలు' బల్లలు. మంచాలతో ట్రావిలర్సు బంగాళా లాగున్నది.

కోయంబత్తూరు జైలులో

సాయంత్రం కోయంబత్తూరు సెంట్రల్ జైలుకు చేరాను. ఉదయాన సూపర్నెంటు వద్దకు తీసుకెళ్లారు. "నా హిస్టరీ టిక్కెట్టు చదివే వుంటాడు; డార్జన్వాదిననే విషయం గమనించి వుంటాడనుకొంటూ వెళ్ళాను. సూప ర్నెంటు ఇంగ్లీషువాడు. పొట్టిమనిషి. వృద్ధుడు. ఐ.ఎం.ఎస్ లో రిజైర్ తిరిగి యుద్ధకాలంలో ఉద్యోగంలో చేరాడు. నన్ను చూడగానే "నీవు యువకుడివే!♦ మంచిది: నీవు సరిగా ప్రవర్తించితే నేను చాలా మంచి సూపర్నెంటునని తెలుసుకుంటావు" అన్నాడు.

♦ నేను వయసుకంటే పదేళ్ళ చిన్నవాడినిగా కన పడుతాను. కారణం నాకు తెలియదు. 1915—16 లో డెన్మాము నన్ను సింగపూరు మిలిటరీ జైలులో విచారించి నప్పుడు నా వయసు ఎంతని అడిగాడు. 25 సంవత్సరాలని

చాలా సంతోషం; నమస్కారాలు. అయితే ఒక షరుతుకు నీవు ముందుగా ఒప్పుకోవాలి" అని నవ్వుతూ అన్నాను. ఆయనకూడా నవ్వుతూ "ఏమిటా షరతు?" అన్నాడు.

"నవలలను సమృద్ధిగా యివ్వాలి" అన్నాను. "సంతోషంగా యిస్తాను. తప్పకుండా యిస్తా" ననాడు.

కుక్కకాటుకు చెప్పుదెబ్బ

జైలరు గురునాథయ్యరును నేను తన్నిన సంగతి కోయంబత్తూరుజైలు జైలరు మెకార్నేకు ఖైదీలద్వారా తెలుస్తుందని, తగాదా పెట్టుకుంటాడేమో నని నా మన

చెప్పాను, "నీకు అంత వయసుండదు. అబద్ధం చెపుతున్నా" వన్నాడు. నేను సవ్వి "నీ వలా మాట్లాడరా" దంటిని. అప్పుడు నన్ను క్రాసు పరీక్షచేశాడు. "చంచయ్యా నీవు చుట్టా, సిగరెట్టు త్రాగుతావా?" అన్నాడు. "లేదన్నాను" "సారా వగైరా త్రాగుతావా?" అంటే, రుచికూడా తెలియదు. కాఫీ-టీలు కూడా త్రాగ నంటిని. స్త్రీలతో సంపర్కం ఉండేదా?" అన్నాడు. లేదంటిని. "మరింకేం? అంత చిన్న వాడుగా కనపడ డంలో చిత్ర మేముంది?" అన్నాడు.

కాని, అనంతరం వివాహం చేసుకున్నాను; కాఫీ, టీలు త్రాగుతున్నాను. అయినా నా వయసుకంటె చిన్న

సులో అలజడిగానే వుంది. ముందుగా ఆలోచించాను. జైలరుతో చాలారోజులు తగాదాలు పడుతూ ఉండకూడదని, పొడిగించుతూ పోతే ఓడుతానని, మెరుపులాగు తీరిపోతే నేనే జయిస్తానని తలిచాను. కష్టాలకు నిమిష నిమిషమూ ఎదురు చూస్తుంటిని. వచ్చిందికూడాను.

యుద్ధానికి వెళ్ళేముందు నిరాకరించిన పంజాబీ సైనికుడొక రొట్టెను తెచ్చి నా కిచ్చాడు. వానితో మాట్లాడకుండా, నా కెందుకు పంపారో తెలుసుకోకుండానే ఆ రొట్టెను తీసుకున్నాను;

వెంటనే వార్డరు వచ్చాడు. "జైలరు నిన్ను ఆఫీసుకు రమ్మంటున్నా" డని చెప్పాడు. రొట్టె నెందుకు పంపారో అర్థమైంది. తగాదా పెట్టుకొనుటకు ఏదో సాకు చూపించటానికి జైలరు వేసిన యెత్తు!

తన ఆఫీసు గదిలో జైలరు ఒక్కడే కూర్చొని ఉన్నాడు. బయట ఒక వార్డరుమాత్రమే ఉన్నాడు. అవసరమైతే జైలరుతో చేతులుచేతులు కలుపుకోవచ్చు నను కొన్నాను. జైలరు ఎత్తైనవాడు; బలశాలి; మధ్యవయసులో ఉన్నాడు: అందగాడు.

వాడినిగా కనపడుతూనే ఉన్నాను. గాఢంగా నిద్రపోయే అలవాటుంది. అందువల్లే ఇలా కనపడుతున్నా ననుకొంటాను.

జైలరు:- "మిలిటరీ ఖైదీలతో సంబంధం పెట్టుకొన్నావా అప్పుడే? రొట్టెను తెప్పించుకొన్నావా లేదా?

నేను:- "అతనే రొట్టెను తెచ్చి యిచ్చాడు. ఏదో పొర పాటు జరిగి వుంటుంది. దియచేసి సిపాయిని అడిగి చూడండి" అని సగౌరవంగా జవాబిచ్చాను.

జైలరు:- "నీవు నాకు ఆర్డర్లు యిస్తావా?"

నేను:- "మీరు అలా తలచినందుకు విచారపడుతున్నాను మీరు నన్ను సరిగా అర్థంచేసుకోలేదు."

జైలరు:- "నేను గురునాథయ్యర్‌లాంటి పిరికి బ్రాహ్మణ్ణి అనుకున్నావా? జాగ్రత్త!" అన్నాడు.

నేను:- బదులు చెప్పలా. నన్నుతిడతాడని, తాను తప్పులు చెయ్యడంతో నాకు దొరుకుతాడని, మోరల్ స్ట్రెంగ్తు పోతే సులభంగా జయించవచ్చనీ అనుకుని మారుచెప్పలా.

జైలరు:- "నేను ఐరిష్‌దొరను. నాలో యూరపియన్ రక్తమున్నది సుమా! ఖబర్దార్! జ్ఞాపక ముంచుకో! నీ ఎముకలను పిండి చెయ్యగలను! కాళ్ళకు, చేతులకు గొలుసులు, కడియాలు వెయ్యగలను. చీకటి గదిలో మూసివెయ్యగలను" అన్నాడు. నేను పలకలేదు. వాగిందే వాగుతున్నాడు. నాలుక ముందుకు సాగడంలేదు. వాడికి మరేమీ తోచడంలేదు. అలసి పొయ్యాడనుకున్నాను.

నీ తల వక్కలు చేయలేదని నాకు సంతోషంగా నేవున్నది" అని నా గదికి నేను వెళ్ళిపోయాను.

ఉదయం 11 గం॥కు ఆ నాటకం జరిగింది. మధ్యాహ్నం వాడు నాగది ముందరి రోడ్డున వెళ్ళాలి. వరండాలో కుర్చీ, బల్ల వేసుకుని, కాళ్ళు బల్లమీద పెట్టుకొని ఏదో పాముతూ కూచున్నా. వెంటనే యీ తగాదా ముగిసిపోవాలని, సరైన రాజీకుదరాలని నా యోచన.ఎలా చెయ్యడం అనుకొంటున్నా. తానూ రాజీకి రాకతప్పదు, తప్పంతా తనది. నా సాహసం వానికి తెలియదు. ఇప్పుడు తెలిసింది. అనుకొన్నట్టే వచ్చాడు.ఇనుపకటకటాలకు అవతల వైపున నిలబడి, ముసిముసినవ్వు నవ్వుతూ నన్ను పిలిచాడు. నేను పొగరుబోత్తుతనం వదిలిస్తూ "ఏంకావాలి? చెప్పు, వినబడుతుందిలే" అన్నాను "కాదు. దయచేసి రావాలి" అని బ్రతిమలాడాడు.

"ఒక్కొక్కప్పుడు నాకు అకారణంగా కోపం వస్తుంది. నన్ను క్షమించవా!" అన్నాడు.

"అయితే నీవు సూపర్నెంటుమీదకూడా అప్పుడప్పుడు కోప్పడుతూంటావుకదూ?" అన్నాను నవ్వుతూ.

"సరే, నాకు అర్థమయింది. ఇప్పుడు నీకు ఏం కావాలి"

"ఎప్పుడైనా నీకో, నాకో ట్రాన్స్ఫరు కావచ్చు; మనం స్నేహితులుగా వుందాం" అన్నాడు.

నేను:- "ఇంతేనా ప్రగల్భాలు, మరేమైనా వున్నాయా?" అని ప్రశ్నించా. జైలరు పలకకుండా నావైపు చూస్తున్నాడు. నేను నవ్వి ఇలా గన్నాను. "నేను చంచయ్యను. జైలరు గురునాథయ్యను కొట్టిందీ, తన్నిందీ నేనే. నీకు ఇప్పటికైనా జ్ఞానోదయం అయిందా?" అన్నాను. బిత్తరపడి పోయాడు కాని, నోరు తెరవలా.

"ఇండియాలో ప్రతివ్యక్తీ ఒక పురుగు అనీ, నీ యిష్టంవచ్చినట్లు తిట్టవచ్చుననీ అనుకొంటివా?" అన్నా మాట్లాడలా.

"నేనేమో చావడానికి కూడా సిద్ధంగా వున్నాను. అయితే నీవో? నేను నీ మెడను విరిచేస్తా ననుకొందాము! నీవేమి చేస్తా విప్పుడు?" అని అడిగాను. జైలరు పలకనే లేదు. భయపడిపోతున్నా డని నాకు తెలుసు. "నాకు కోపం వచ్చేలా ప్రవర్తించావు! అందుకు నీవు శిక్షార్హుడివి! అయితే, అంతమాత్రానికి నిన్ను చంపితే నీభార్య, బిడ్డలు కష్టపడతారు. సరే! నీకు అయిదునిముషాల టైమిస్తాను. నీవీ లోపల నోరు తెరచి మాట్లాడితే నిన్ను కొట్టకపోతే నేను చంచయ్యను కాదు" అని బెదిరించి నా చేతిగడియారం వైపు చూచాను. పిరికి వెధవ! నోరు తెరవనేలేదు. అంతట "సరే! నీ ప్రవర్తన బాగానే వుంది.

"నీవు వాస్తవంగా ఆలా ఉద్దేశిస్తున్నావా ?" అన్నాను.

"అవును" అన్నాడు. "సరే, నేను ధైర్యాలని కావచ్చు; అయినా చిల్లర మల్లర తగూలు నా కిష్టంలేదు" అన్నాను.

"ఇకమీదట నీకు ఏం కావాల్సినా నేను తప్పక యిస్తూంటాను. నీవు సూపరెన్టును అడుగనవసరంలేదు" అని చేయికలిపి వెళ్ళాడు అలాగే తనమాటను నిలుపుకున్నాడు.

జైల్లోఖయిదీలకు కావలసినన్నేహితుడు డెప్యూటీ జైలరు. ఆయన వద్ద సామానులన్నీ వుంటాయి. ఆయన సహాయం అవసరం. డిప్టీజైలరు డిమాండే దొర చిల్లర దొంగతనాలు చాలా చేస్తాడు పిరికిమనిషి. నాకు వంట చేసిపెట్టడానికి మద్రాసులో యమ్.యు.సి. బట్లరుగావుండి దొంగతనంచేసిన ఖయిదీని నియమించారు. వంటలు, ఫలహారాలు రుచిగా చెయ్యగల సమర్థుడు ఈ నా వంట మనిషి. కోరినదంతా యిస్తూవచ్చాడు డిమాండే. అయితే జైల్లో చాలామంది ఆశ్రితులు ఏర్పడ్డారు. పాటలు పాడేవారు, తబలా వాయించేవారు 12- 2 గం. మధ్య జైల్లో ఆఫీసర్లుండరు అప్పుడు ఇలాంటివారు నాగదివద్దచేరి కులాసాగా కాలం గడిపేవారు. వారికి నేను ప్రతిదినమూ ఏదో ఒక బండారము చేయించి పెట్టడం అలవాటైంది.

కొన్ని నెలలతరువాత ఒకవీశ హాలువా చేయుటకు సామానులు తీసుకురమ్మన్నాను. డిప్యూటీజైలరు యివ్వలేదని వంటమనిషి నాకు రిపోర్టు చేశాడు. డిప్టీజైలరును పిలిపించాను. నేను "నువ్వేమీ నా కివ్వనక్కరలేదు. అయితే, ఇక మీదట నీ వేమీ దొంగిలించకూడ" దన్నాను.

"నే నేమి దొంగిలించాను?" అన్నాడు. "రేపు ఉదయం సూపర్నెంటుకు నీవు దొంగిలించి యింట్లో పెట్టుకొన్న సామాన్లు పట్టీ యిస్తాను. ఇక వెళ్ళవచ్చును." (జైళ్ళలో దొంగిలించడం ఆఫీసర్లకు సర్వసామాన్యం)

"నేను ఎంతని హాస్పిటలు అక్కౌంటులో వ్రాసి మీకు యివ్వగలను?" అని గొణిగి, నా బట్లరును పిలుచుకెళ్ళి అన్నీయిచ్చి పంపాడు.

విడుదల

మొత్తం మీద కోయంబత్తూరు జైలులో ఆరునెలలుంటిని. నన్ను అరెస్టుచేసి జెయిల్లో 4 సం॥ల 6 నెలలుంచారు. అనగా ప్రపంచ యుద్ధం ముగిసిన 1 సం॥ నెలలకు నన్ను 1919 డిసెంబరులో వదలిపెట్టారు. జెయిలు మెక్కార్నె తనయింటికి తీసుకెళ్ళి భార్యాబిడ్డలకు పరిచయంచేసి ఫలహారం, టీ యిచ్చారు.

"నీవు నాకు ఎంతో మేలుచేశావు! నేను మీ ఋణం ఎలా తీర్చగలను?" అన్నాను. "మేలుచేసిన

వారికి తిరిగి తీర్చడం కష్టమే! నే నేదైనా చేసివుంటే నీవు ఇతరులకు చెయ్యి" అని సరియైన సలహా యిచ్చాడు.

ఆయన భార్యతో "నీ భర్త చాలా దుడుకుమనిషి! అయితే, మంచివాడు! బాగా చూచుకో" అని నవ్వాను.

అందు కామె "అవును! ఎంతో ప్రయత్నిస్తున్నాను. నీ సలహాకు సమస్కారాలు" అన్నది. అందరం నవ్వాము. సెలవు పుచ్చుకొని మద్రాసుకు వచ్చాము. జైలరు మెకార్నె ప్రకమంగా సూపరెంటు, ఇన్స్పెక్టరుజనరలు అయినాడని తెలిసింది. కాంగ్రెసు ఖైదీలతో జాగ్రత్తగా ప్రవర్తించాడని విన్నాను.

కొత్త ప్రపంచం

కుట్రలు, హింసలు, బీభత్సాలు, చంపుకోడాలు, సాయుధ పోరాటాలు, ఉరిశిక్షలు, అండమాన్లతోకూడిన గదర్ పార్టీ ప్రపంచంలోనుండి అహింసా-సత్యాలతో కూడిన గాంధీజీ ప్రపంచంలోకి 1919 సం॥ డిశంబరులో [redacted]ను. నా విధి నేమనుకోవాలి? సంతోషించనా? [redacted]ంచనా? ఎలా సవరించుకోవడం?

"ఇంత కష్టపడ్డానుగదా! దేశాన్ని నేను ఏమి ఉద్ధరించాను" అనే సంశయం నన్ను బాధించుతూనేవుంది. బ్రిటిష్ గవర్న మెంటు సాగిపోతూనేవున్నది. ఆంగ్లసామ్రాజ్యాన్ని గదరుపార్టీ నాశనం చెయ్యలేకపోయింది; కాని,

మేము జయించలేదా? విత్తనం నాటుతాము, చెట్టు మొలుస్తుంది; పెద్దదవుతుంది. పూలు, కాయలు, పండ్లు ఫలించకపోతుందా? అనుభవించకపోతామా? ఊరికంబాలు, ఏకాంత కారా గృహాలు, చిత్రవిచిత్రహింసలకు ఎంతగురి అైనా, సంపూర్ణ స్వరాజ్యమనే గమ్యస్థానాన్ని మేము మానుకోలేదు. మాత్యాగాలు, సాహసాలు ఎంతోమందిని దేశభక్తులుగా మార్చలేదా? సంపూర్ణస్వరాజ్యమనే గమ్యస్థానానికి సాగిపోవడంలేదా? యుద్ధరంగంలో మొదటి శ్రేణివారు చచ్చిపోతే, వెనుక ఉండే శ్రేణులవారు ముందుకు దూకి విజయభేరి మ్రోగిస్తారు; విజయపతాకం ఎగుర వేస్తారు.

1909 సం॥ లో శ్రీ గోపాలకృష్ణగోఖలేగారి ఉపన్యాసం మద్రాసులో విక్టోరియా పబ్లికుహాలుమైదానంలో విన్నాను. అప్పుడు నేను కాలేజివిద్యార్థిని. ఆయన నిర్బంధోచిక ప్రారంభ విద్యాబిల్లునుగురించి ఉపన్యసిస్తూ ఈలా గన్నారు–"ఈ నా బిల్లును బ్రిటిష్‌గవర్నమెంటు ఒప్పదు. బిల్లు ఓడిపోకతప్పదు. అయితే. ఎందుకీ ప్రయాస? వృథా ప్రయాస కాదా అని కొందరు ప్రశ్నించవచ్చు. ఈ ప్ర[redacted] ఒక పోరపాటున్నది. మాతరం దేశభక్తులం ఓడు[redacted] జయమనే అదృష్టం మాతరం వారికి ఉండదు. అయితే, ఇలాంటి అపజయాలమూలంగానే దేశానికి మేము సేన చేయగల్గుతాం. రాబోయేతరంవారికి జయం కలుగవచ్చు. కాలపరిస్థితులనుబట్టి ఫలితాలు కలుగుతాయి. మావిధిని

మేము చేశామనేతృప్తి మాకు ఉన్నది" అన్నారు. నేను ఎన్నో ప్రయత్నాల్లో ఓడిపోయాను. ఈలాంటి ప్రతి సందర్భంలోను గోఖలేగారి బోధనుస్మరించి తృప్తిపడి ముందుకు సాగుతూంటాను.

1857 సం॥ స్వాతంత్ర్య పోరాటానికి, 1900-1920 బెంగాలీల టెరరిస్టు ఉద్యమానికి, 1913-18 గదరుపార్టీ ఉద్యమానికి, 1920-46 కాంగ్రెసు ఉద్యమానికి—ఈ నాలుగింటికి సంబంధముంది. రాబోయే ఉద్యమాలకూ వీటికీ కూడా సంబంధం ఉంటుంది. ఇది సహజం. స్వరాజ్యానికి, ప్రజారాజ్యానికి ఒక్కొక్క ఉద్యమంతో ఒక్కొక్కమెట్టు ఎక్కుతూ వచ్చాము. ప్రస్తుతం దేశంలో ఉండే రాజకీయ నిరాశానిస్పృహవల్ల ఇంకా తీవ్రమైన రాజకీయ విప్లవ పార్టీలు బయలుదేరుతున్నాయి. కార్మిక-కర్షక వర్గాలు రాజకీయ రంగంలోకి వచ్చాయి. సంపూర్ణ స్వరాజ్యం వచ్చేవరకూ, ప్రజారాజ్యం ఏర్పడి ప్రతి భారతీయునికి కడుపునిండా అన్నం, కట్టుటకు బట్టలు, వుండడానికి ఇల్లు, విద్య, వైద్య, ఉద్యోగాల హామీ ఏర్పడేవరకు స్వరాజ్య రథం సాగిపోతూనేవుంటుంది. పార్టీలు మారవచ్చుగాని, భారతీయులు తమ గమ్యస్థానము చేరేవరకు, ముందు ముందు పెట్టిన కాలును ముందుకు సాగిస్తూనేవుంటారు అనే దృఢవిశ్వాసము ఏర్పడడమే నా అదృష్టం. మా గదరు పార్టీవారి ఆలోచనలలో చాలా లోపాలు ఉన్నాయి. ఏదో ఎనిమిది తొమ్మిదిమందిమి బర్మాను పట్టుకొనడానికి

సాహసించామంటే మా ఆలోచనలలో ఎన్ని పొరపాట్లుం డాలి; 1941 సం॥లో ఈ గాథను వెల్లూరు జెయిలులో ఉండిన కాంగ్రెసు, కమ్యూనిస్టు డెమొక్రాట్లకు చెప్పగా ఆశ్చర్యపడ్డారు; కొందరు నవ్వారు; కొందరు హేళన చేశారుకూడా! చివరకు అందరూ గర్వపడ్డారు. అందరూ మా దేశభక్తిని, త్యాగాన్ని కొనియాడారు.

ఒకరు నాకు మేజరు టైటిల్ యివ్వాలన్నారు; అది చాలదు. జనరల్ అనే టైటిల్ యిస్తామన్నారు; "మార్షల్ ఛక్" అని ఎవరో సూచన యిచ్చారు. అందరూ ఏక గ్రీవంగా ప్యాసుచేశారు. ఎందుకు నన్ను ఈలాగు హేళన చేస్తున్నారనినవ్వుతూ ప్రశ్నించాను. హేళన కాదన్నారు, కాని, వారు నా మీద ఈ ప్రశ్నపరంపరలు కురి పించారు:—

(1) గదరుపార్టీవంటి విప్లవపార్టీలోకి ఎవరువచ్చినా చేర్చుకుంటూ వుంటిరికదా? ఆలాగు ఎంతోమంది గూఢచార్లు చేరిపోయుందురుగదా! జయం ఎలా వస్తుం దనుకొన్నారు?

(2) సైన్యం తిరుగబడగానే స్వరాజ్యం వస్తుందా? ప్రజల సానుభూతి సహాయాలు అవసరంలేదా?

(3) 1857 సం॥లో స్వతంత్ర యుద్ధంలో సైన్యం తిరుగ బడ్డా ప్రజల సానుభూతి సహాయాలు లేనికారణం వల్ల అపజయం ఏర్పడలేదా?

ప్రజల సానుభూతి సహాయాలు కావాలంటే వారి
(4) కష్టాలు, సమస్యలు ఏమిటో తెలుసుకొని, ప్రజ
లను సమీకరణ చేసుకోవాలికదా? స్వరాజ్యం
ప్రజారాజ్యంగా ఉంటుందని, ప్రజల సమస్యలు
పరిష్కారమవుతాయని వారికి నమ్మకం ఏర్పడాలి
కదా? లేకపోతే స్వరాజ్యం ఏర్పడగలదా?

(5) ప్రజలను పీడించే జమీందార్లు, రాజులు, మహా
రాజులు, మిల్లు యజమానులు, పెట్టుబడిదార్లను
విదేశీ ప్రభువులతోపాటు నాశనం చెయ్యకపోతే,
ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తామనే హామీని
నెరవేర్చగలమా?

(6) కార్మిక కర్షకవర్గాలు నిర్మాణయుక్తంగా స్వతంత్ర
యుద్ధంలో చేరనియెడల అంతఃకలహాలు రక్త
సాక్షమూ తప్పవే.

7) రష్యాలో లెనిన్ చేసిన రీతిగా, కార్మిక కర్షక
ప్రజా ప్రభుత్వం ఏర్పడనియెడల, ప్రజానీకానికి
ఏమి మేలు చేయజాలము. స్వరాజ్యం ఏర్పడినంత
మాత్రాన ఏమి ఉపయోగము? ఇల్లు అలుకగానే
పండుగ అగునా!

ఈ లాగు ప్రశ్నలపరంపరలు కురిపించిరి. "ఈ ప్రశ్న
లలో ఎంతో సత్యం వున్నదని ఇప్పుడు నాకు బోధపడు

చున్నది. కాని ఆ కాలంలో మాకు ఈలాంటి సంశయాలు కలుగనేలేదు. ఇంత అజ్ఞానం ఉండినా, విదేశీప్రభుత్వాన్ని నాశనం చెయ్యాలి అనే ఆశయం తీవ్రంగావుంది. మాకు ద్వేషం అంతగా వుండేది. ఎలాగైనా ఆకాలంలో మద్రాసు రాష్ట్రమంతటిలో నేనొక్కడినే గదరుపార్టీలో చేరి స్వరాజ్యంకొరకు ప్రయత్నించాననే సంతోషం, సంతృప్తి నాకు ఉన్నది. ఓడినా, గెలవడానికి మార్గం చూపించాము. స్వరాజ్యసంపాదనకు మాలాగే వేలు లక్షలు కోట్లకొలది దేశభక్తులు ఏర్పడుచున్నారని, స్వరాజ్యం తప్పక లభించునని, నా చిన్నతనంలో కోరినకోర్కె నెర వేరుచున్నదని ప్రస్తుతం సంతోషదాయకంగా ఉండడం నా అదృష్టముకదా?" అని వారికి సమాధానం చెప్పాను. "మార్షల్ ఛెన్‌కు జై" అన్నారు. అదే చాలు నాకు.

—o—

నేను - నా దేశం

జాతీయోద్యమము సంఘసంస్కారము

మరో ప్రపంచం

1919 సం॥ డిశంబరులో ప్రభుత్వం నన్ను విడుదల చేసింది. అప్పటికి యుద్ధంముగిసి దాదాపు ఒకటిన్నర సంవత్సరం అయింది. అప్పుడు మద్రాసు రాష్ట్రంలో రాజకీయ ఖైదీని నే నొక్కడనే. అయినా ప్రభుత్వం నన్ను వెంటనే విడుదల చెయ్యాలా. నా విడుదలకోసం ప్రజలనేక బహిరంగసభలు చేశారు. ఎన్నో తీర్మానాలు మహాజరులు పంపినమీదట ప్రభుత్వం నన్ను విడుదల చేసింది.

నేను $4\frac{1}{2}$ సం॥లు జైళ్ళలో వుంటని. నా కారా గృహవాసం అంతమయ్యేదాక దిన, వారపత్రికలు చదువ లేదు. మత గ్రంథాలను మాత్రమే చదువుకోనిచ్చారు రాజనీతి శాస్త్రము, అర్థశాస్త్రములను, విదేశ చరిత్రలు, విప్లవకారుల జీవితచరిత్రలు, భారతములు మున్నగువానిని అసలే చదవనివ్వలేదు ఈ $4\frac{1}{2}$ సం॥లలోను నా విజ్ఞానతృష్ణను

అసలు అవకాశమే లేదన్నమాట. అలాంటప్పుడు నా బుద్ధి వికాసం అరికట్టబడినదంటే అతిశయోక్తి కాదుగదా! అంటే కాదు. యుద్ధానికి సంబంధించినవిషయాలనుకూడా చదువనం దున నేనేదో అమోఘమయ ప్రపంచంలో అంతకాలం గడిపా ననన్నమాట. అందుచేత నేనా నాటి భారతజాతీయ రాజ కీయాలకు అపరిచితుడనైపోయాను.

అయితే, అంతకాలం అంధకారంలో వున్నప్పటికీ అనేక అనుభవాల ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వపు పైశాచిక స్వరూపాన్ని స్పష్టంగా గ్రహించగలిగాను. ముఖ్యంగా పోలీసు, సి. ఐ. డి, జైలు, మిలిటరీ మున్నగు శాఖల్లోని కుళ్ళును చక్కగా గ్రహించాను. బెంగాలు చెరిసుపారి వారి దేశభక్తి, త్యాగములవలన కలిగిన ఉత్తేజంవల్ల, గదర్ పార్టీలో కలిగిన నా అనుభవంవల్లా నా మాతృ భూమియందు ఉజ్వలదేశభక్తి, బ్రిటిష్ సామ్రాజ్యంమీద ప్రబలద్వేషము ఏర్పడినై. మా జీవితంలో కనీస మొక తెల్ల సామ్రాజ్యవాదినైనా చంపకపోతే మాజన్మ సఫలం కాదని అనుకునేవాళ్ళం. స్వరాజ్య సంపాదనకోసం ప్రాణాన్ని త్యజించటానికి సర్వావస్థలలోనూ సిద్ధంగా ఉండాలని భీష్మప్రతిజ్ఞ పట్టాము. పవిత్ర భారతభూమినుండి ప్రభుత్వ విషవృక్షాన్ని కూకటిమ్రేళ్ళతో పెరికి ఆ స్థానే పవిత్ర ప్రజారాజ్యమును స్థాపించాలనే తీవ్రాభివృద్ధిచెందుతూ నా హృదయంలో రచుకొన్నది. ఈ విప్లవానికి హింస,

అహింసామార్గా లన్నిటితో ఈ మహాకార్యాన్ని సాధించాలనే దృఢనిశ్చయం కలిగింది. కాని, ఈ కార్యసాధనకోసం, బ్రిటిష్ సామ్రాజ్యంతో రాజీపడటమనే విషయం మాత్రం నా నిఘంటువులోనే లేదు.

ఇలాంటి వ్యక్తిని గాంధీ నాయకత్వంలో ఉన్న కాంగ్రెసు రంగంలోకి తటాలున వచ్చాను. అప్పటి కాంగ్రెసు రాజకీయాలు, ఆశయాలు, మార్గాలు నాకెంతమాత్రం నచ్చలేదు. కారణ మేమంటే, కాంగ్రెసు స్వారాజ్య మనే మాటకు ఈ విధంగా నిర్వచనం చేసింది.

"మనదేశానికి రాజకీయ స్వాతంత్ర్యాన్ని ఇవ్వటానికి బ్రిటిష్ ప్రభుత్వం సమ్మతించే యడల మనం బ్రిటిషు సామ్రాజ్యంలోనే చేరివుందాము. అది అలా అంగీకరించనిచో సామ్రాజ్యంతో పూర్తిగా తెగతెంపులు చేసుకొని విడిపోదాము"

ఈలాటి ఆశయం నన్ను కాంగ్రెసునుండి దూరం చేసింది అహింసావిధానంవల్ల పూర్ణ స్వాతంత్ర్యం రాజాలదనీ, సామ్రాజ్యవాదంతో రాజీపడితే అధినివేశ పరిపాలనకన్న అధిక మేమీ లభించదనీ నా అభిప్రాయం. అంచేత, పెరరిస్టు కార్యక్రమాలు, సాయుధపోరాటాలు, విప్లవోద్యమాలు మున్నగువాటిని అణచివేయటానికి గాంధీగారు చేస్తున్న ప్రచారం, ప్రయత్నాలు నాకు నచ్చేవికావు.

అయితే, గాంధీగారి ఉద్యమంతో కలిగిన ప్రజాం దోళన, ప్రజారాజకీయ చైతన్యం భారతీయు లందరినీ రాజ కీయ రంగంలోకి తెచ్చుట మూలకంగా ఏర్పడబోయే మహత్తరమయిన విప్లవావకాశాలు మొదలగువాటిని అవ గాహన చేసుకోలేకపోయాను. అంతేగాదు, పెడర్థం చేసు కున్నాను. అంటే, ఏ కొద్దిమందో సాయుధతిరుగుబాటు. గోరిల్లాయుద్ధం చేస్తేనే త్వరగా స్వరాజ్యం సంపాదించుకో వచ్చుననీ, కోట్లకొద్దీ ప్రజలకు రాజకీయచైతన్యం కలుగ జేసి వారిబలంతో స్వరాజ్యం సంపాదించటం అతి ప్రయాస కరమనీ, చాలాకాలం పడ్తుందనీ భావించేవాడిని. కాబట్టి కాంగ్రెసులో చేరటాని కెన్నోసార్లో ప్రయత్నించుతూ, మానివేస్తూ వుండేవాడిని. 1920 నుండి 1935 వరకు నా జీవితంలో రాజకీయంగా ఒకవిధమైన స్తంభన ఏర్పడింది. కాని, రాజకీయంగా నా కెంత నిరాశ-నిస్పృహలు కలి గినా దేశస్వాతంత్ర్య తృష్ణ అనేది కాంగ్రెస్ ఉద్యమంలో పాల్గొనే దేశభక్తులయందు నా కపారమైన ప్రేమ, గౌర వాలు కలిగించేది. అంచేత, వారికి సర్వావస్థలలోను నా శక్తికొలది అధికసహాయం చేస్తుండేవాడిని. గాంధీతత్వం కోసం, కాంగ్రెసు ఉద్యమంకోసం తమ జీవితాన్ని అర్పించి అహర్నిశలు పాటుపడాలన్న ఆశయంతో శక్తికొలది పాటుపడుతున్న నా ప్రథమభార్య అన్నపూర్ణగారిని, ఆమె తదనంతరం నా రెండవభార్య సుభద్రగారిని నేను ఎంతో ప్రోత్సహించుతూ వారికి సర్వవిధాలా సహాయపడే

వాడిని. నా రెండవభార్య సుభద్రమ్మగారికి గాంధీగారి పట్ల, అహింసాతత్వంమీద అత్యంత భక్తిగౌరవాలున్నవి. అంచేతనే వారి హరిజనసేవక సంఘానికి కార్యదర్శిగా ఉంది. దాదాపు 12 సంవత్సరాలు సేవ చేసింది. అంతే కాదు; మా కుటుంబములో అందరికీ కాంగ్రెసు ఉద్యమంతో సంబంధాలున్నవి. 1920-21 ప్రాంతంలో మద్యపాన నిషేధ సందర్భంలో నేను శ్రీమతి పొణకా కనకమ్మగారితో కలసి గూడూరులో ప్రచారం చేస్తుండగా 144 శెక్షను జారీ చేయబడింది అంచేత నేను గూడూరు నుండి వెళ్ళిపోవలసివచ్చింది. అప్పుడే విద్యార్థుల తిరుగుబాటుకు నాయకత్వం వహించిన నా కడపటి తమ్ముడు రంగయ్యలా స్టడీసు మానివేశాడు. నాలాగే నాతమ్ముడు రంగయ్య కూడా కుటుంబానికి ఉపయోగపడకుండా పోతాడని, కుటుంబభారాన్ని వహిస్తున్న నా పెద్దతమ్ముడు గురు స్వామి రంగయ్య కొక వృత్తిని కల్పించాలని నిశ్చయించుకొన్నాడు. కనిగిరి ప్రాంతం ఖద్దరు ఉత్పత్తికి ప్రసిద్ధి చెందింది. వీరు విదేశీవస్త్రవ్యాపారం మానేసి ఖద్దరు ఉత్పత్తికీ, కాంగ్రెసుకూ అనేకవిధాలుగా తోడ్పడ్డారు. ఇప్పటికీ ఆ వ్యాపారం చేస్తూనే ఉన్నాము. ఇంతేగాదు మా కుటుంబంలో నేను తక్కినవారు 1929 సం॥ నుండి నేటి వరకు ఖద్దరు, స్వదేశీ బట్టలనే ఉపయోగించుతున్నాము. అయితే, ఇంతటితో రాజకీయాలు వదలి ప్రజాభ్యుదయం కోసం పాటుపడకుండా నిరర్థకజీవితంగా కాలంగడపడం

నాకు అసాధ్యమైన విషయం. అంచేత నా శక్తికొలది వేరేమార్గాలతో సంఘశ్రేయస్సుకోసం పాటుపడ కృత నిశ్చయుడ నయ్యాను.

సంఘంలో ఎన్నో లోపాలు కనపడేవి. అమానుష సాంఘికాచారాలు, మూఢవిశ్వాసాలపై నే నెంతో కోపంతో తిరుగుబాటు చేసేవాడిని. వాటి నిర్మూలనకు అనేక ఉద్యమాలను ప్రారంభించ సాగితిని. స్వప్రయత్నంచే నూతనోద్యమాలను ప్రారంభించుటలో నాకు కొంత శక్తి వుందనే విషయాన్ని నే నెరుగుదును. ఆ శక్తిని వినియోగించి ప్రారంభించిన ఉద్యమాలలో కొన్నిటిని ఉదహరిస్తాను.

1. వంశపారంపర్యంగావుండే పడుపువృత్తి నిర్మూలన.
2. పౌరోహిత్యమును, మతాధిపతులను ధిక్కరించుట.
3. రజస్వలానంతరం ప్రౌఢ వివాహములుచేయించుట.
4. వితంతు వివాహములు చేయించుట.
5. అనాథ శిశుసంరక్షణశాల.
6. పతిత యువతీ జనోద్ధరణ.
7. స్త్రీవిద్య.
8. ఉచిత పఠన మందిరములు.
9. సాంస్కృతిక ఉద్యమాలు.
10. హాస్టల్సు.
11. తాలింఖానాలు.
12. హరిజనోద్యమము.

ఈ విధమైన సంఘంస్కరణ లెంత ముఖ్యమయినా రాజకీయ స్వాతంత్ర్యం లేనిది ఏసంస్కరణ కూడా చక్కగా నెరవేరదనే సత్యాన్ని నేను పదేపదే గమనించుతూనే వచ్చాను. కాని 1920_1935 మధ్య రాజకీయంగా పని చేయనందున నాలో నిరాశా నిస్పృహలు తలచూపుతూ వచ్చాయి. తత్ఫలితంగా అప్పుడప్పుడు భోగభాగ్యముల వాలచ, పేరు ప్రతిష్టలు సంపాదించాలన్న అభిలాష మొదలై నవి కలుగుతూవచ్చాయి. అయితే, అకస్మాత్తుగా మొదల 1935 లో నా జీవితంలో గొప్పరాజకీయ పరివర్తనం కలిగింది. పై విషయాలను గురించి రాబోయే ప్రకరణాలలో కొంత విపులంగా వ్రాస్తాను.

సభలూ - సన్మానాలు

తుదకు కోయంబత్తూరు జైలునుండి విముక్తుడనై మద్రాసుకు చేరాను. 7 సంవత్సరాలుగా మిత్రులు మొద లగువారితో సన్నిహిత సంబంధము లేనందున ఇప్పుడు నా స్నేహితులెవరో నిర్ణయించుకోలేకపోయాను. పోలీసులు దేశభక్తులను హింసించుతున్న కాలమది. కాబట్టి నాకు సానుభూతి చూపించిన వారికి కష్టాలు రావచ్చును నా కులంవారు నాతో కలవకపోవచ్చు. అందువల్ల వై. యం. సి. ఎ. అనే భవనంలో బసఏర్పరచుకొని శ్రీ సల్లా గురు స్వామిశెట్టిగారిని చూచుటకు వెళ్ళితిని. ఆయన పేరువడ

సినఅడ్వకేటు. నాయందు చాలా అభిమానం గలవారు. నన్ను చూడగానే కౌగిలించుకొని ఆదరించారు టెలిఫోను ద్వారా స్నేహితులను ఆహ్వానించి ఒక గంటసేపటిలో రెండువందలమందిని ప్రోగుచేశారు. నా గౌరవార్థం గొప్ప సభ చేయుటకు ఆహ్వానసంఘు మొకటి ఏర్పడినట్లు చెప్పుతూ, మేళ తాళములతో నన్ను గౌరవించుటకోసం చేసిన ఏర్పాట్లు వెంటనే జరగనందుకు విచారాన్ని వెలి బుచ్చారు. నేను మదరాసుకు ఏ రైల్లో వచ్చేదీ కోయంబత్తూరునుండి తంతి ఇచ్చాను; కాని, అది సకాలంలో చేర లేదు. నేను మద్రాసు చేరిన తరువాత గాని తంతి చేర లేదు. నన్ను గౌరవించటానికి వచ్చిన బంధుమిత్రులకు వంటలు చేయించారు. ఒక బ్రాహ్మణుని పిలిపించి నాకు ప్రాయశ్చిత్తం చేయించటానికి ప్రయత్నాలు జరుగు తున్నట్టు గ్రహించాను. నాకు నచ్చలేదు. నా విముఖ త్వాన్ని గ్రహించి "బ్రాహ్మణుడు కొద్దిగా నీమీద నీళ్ళు చిలకరించటానికైనా అవకాశమి"మ్మని వారు నన్ను బ్రతిమలాడసాగారు. కాని సమ్మతించనని ఖచ్చితంగా చెప్పివేశాను. పాపం! పెద్దలకెంతో విచారంకలిగింది. గాని చివరకు అందరం కలిసే భోంచేశాము. నన్ను కులంలో చేర్చుకున్నారు. నాకు ఉజ్వలమైన దేశభక్తి, త్యాగము లున్నవనీ, అపూర్వమైన ధైర్యసాహసాలు గలవాడననీ పొగడసాగారు. ముఖ్యంగా ఆంధ్రలోకం నన్ను చూచి గర్వించింది. ఆంధ్రపత్రిక నన్ను ప్రశంసించింది. శ్రీ కాశీ

నాధుని నాగేశ్వరరావుగారు ప్రతిదినము నన్ను గురించి వ్రాయించుతూ ప్రచారంచేశారు. ఆంధ్రదేశంలోని అనేక ప్రాంతాలనుండి ఆహ్వానాలు రాసాగాయి. నా సంతోషానికీ ఉత్సాహానికీ మేరలేక పోయింది నే పడ్డ అష్టకష్టాలను ఇట్టే త్వరలో మరచిపోగలిగాను.

నా గౌరవార్థము బహిరంగసభ లెన్నో జరిగాయి. మొట్ట మొదటి బహిరంగసభ మద్రాసులో సౌందర్య మహాలులో జరిగింది. కీ॥ శే॥ బి ఎన్ శర్మగారు అధ్యక్షత వహించారు. మాంటేగు చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలను నిరాకరించాలనీ, పరిపూర్ణ స్వాతంత్ర్యమే మన గమ్యస్థానమనీ నేను సభలో మాట్లాడాను. నా అభిప్రాయాలను అభ్యుదయ భావాలను కలిగియున్న శ్రీ హరిసర్వోత్తమరావుగారు, శ్రీ పి చంచయ్యగారు మున్నగువారు ప్రశంసించుతూ నన్ను ప్రోత్సహించారు. శ్రీ బి. ఎన్. శర్మగారు మాత్రం హర్షింపలేదు. వారు అప్పుడే అమృతసర్ కాంగ్రెసు మహాసభనుండి వచ్చారు. ఆ కాంగ్రెసుసభలో జలియన్ వాలా బాగ్ హత్యాకాండను జరిపిన వైస్రాయి చెమ్స్‌ఫర్డ్‌ను మాత్రం ఆక్షేపించకపోగా ఆ వైస్రాయిని చాలావరకు సమర్థిస్తూ మాట్లాడిన జాతీయనాయకుడు వీరొక్కరేనని తెలిసింది. అందువల్ల వీరు వైస్రాయి కార్యనిర్వాహక సభ్యుడుగా నియమింపబడుతారని గుసగుసలు బయలుదేరాయి. అలాంటి శర్మగారు నా ఉపన్యాసాన్ని బహిరం

గంగా ఖండించలేదు. పైగా నేను తీవ్రంగా మాట్లాడలేదని వ్యాఖ్యానించారు.

కాని, వీరు సభ ముగిసినతరువాత "నీకు దేశీయ రాజకీయాలు తెలియవు. కనీసం ఆరునెలలపాటు వాటిని గురించి మాట్లాడవద్దని, అప్పటికి రాజకీయాలను చక్కగా అవగాహన చేసుకోగలవు. నీ మేలుకోరి చెప్తున్నాను" అని నాకు సలహాయిచ్చారు. "మీ సలహా అవసరమైనప్పుడు మీ వద్దకు వస్తానులెండి" అని తృణీకారంగా సమాధానం చెప్పాను.

కుల పిశాచం

ఆంధ్రదేశానికి రమ్మని అనేక ఆహ్వానాలు వచ్చాయి. ఆంధ్రదేశ సంచారమునకు వెళ్ళకమునుపు నా జన్మస్థానమునకు వెళ్ళి నా తల్లిని సందర్శించాలని నిశ్చయించుకొన్నాను. మా కుటుంబానికి పెద్దవారైన మా మామగారు (శ్రీ నిలశెట్టి గురవయ్యగారు)మద్రాసుకు వచ్చి నన్ను కలుసుకొన్నారు. "కనిగిరి వైశ్య సంఘములో రెండుపార్టీ లున్నాయి. (దరిశివారి పార్టీ, గొంట్లావారి పార్టీ) ఈ గొంట్లావారిపార్టీ ఎక్కువ బలమైనది. నిన్ను కులంలోకి తీసుకొనుటకు సమ్మతించలేదు. అందుచేత దరిశివారిపార్టీ నిన్ను కులంలో చేర్చుకొనుటకు భయపడుతున్నది. కాబట్టి, నీవు ముందు కొన్నిపట్టణాలకు వెళ్ళి

అక్కడి వైశ్య సంఘాలవారు నిన్ను కులంలో చేర్చుకొన్న తరువాత కనిగిరికి వస్తే ఎలాంటి కష్టాలు వుండవు" అని మా బావగారు సలహా ఇచ్చారు. అతనికేమో నామీద అపరిమిత ప్రేమ ఉండుట నిశ్చయమే. అయితేనేం పూర్వాచారపరాయణుడూ, భయస్తుడు. "మొట్టమొదట నా మాతృస్థానమునకు వెళ్ళి, నా మాతృదేవతను సందర్శించటానికి నిశ్చయించుకున్నాను. అంచేత అక్కడ ప్రత్యేకంగా బస ఏర్పరచుకొంటాను. మీరెవరూ భయపడనవసరంలేదు. నన్ను కులంలోచేర్చుకోనక్కరలే"దని చెప్పాను. మా భావ కోపంతో వెళ్ళిపోయారు.

ఆ కాలంలో సంఘంలో సంఘసంస్కరణ వెల్లువలా వస్తూంది. గొంట్లావారి కక్షిలోని యువకులూ, నేనూ ప్రాణమిత్రులము. వారిలో ముఖ్యులు శ్రీ సి. ఎస్. గుప్తగారు (చీమకుర్తి సుబ్బరాయగుప్తగారు, పోలీసు సబ్ ఇన్స్పెక్టరు) శ్రీ గొంట్లా శ్రీరాములుగారు (కనిగిరిలో అడ్వకేటు)అభ్యుదయభావాలు గలవారు నాకోర కైంతైనా త్యాగంచేస్తారని నాకు గట్టినమ్మకం. ఆ కక్షి వీరిద్దరి నేమీ చేయజాలదన్న విషయం కూడ నేనెరుగుదును.

నాకు కనిగిరిలో రాబోయే కష్టాలను ముందుగానే గ్రహించిన శ్రీ గుప్తాగారు 15 రోజులు సెలవుతీసుకొని, నన్ను నెల్లూరులో కలుసుకొన్నారు. నాతో కలసి కనిగిరికి బయలుదేరారు. కనిగిరికి వెళ్ళేమార్గంలోవున్న నెల్లూరు, కావలి, శింగరాయకొండ మొదలగుచోట్ల సభలు, సన్మా

నాలు, విందులు జరిగాయి. ఇవన్నీ నాకు కనిగిరిలో కలుగ బోయే కష్టాలను జయించుటకు ఉపయోగపడినై. కనిగిరి సరిహద్దుకు జేరి, ఊళ్ళోకి ప్రవేశించగానే పురజనులు కొందరు చూచి మా ఎదుబండిని ఆపివేశారు. నన్ను మేళ తాళాలతో ఊరేగించి సన్మానం చేసేందుకు ఏర్పాట్లు చేయబడినాయనిచెప్పి, నన్ను తిరిగి ఊరి వెలుపలికి తీసు కెళ్ళారు. తరువాత పురజనులు మహోత్సాహంతో ఊరే గింపు జరిపారు. ఊరేగింపు మా ఇంటివైపుకు మళ్ళగానే నా తల్లి ఎదురువచ్చి ఎంత ప్రతిమలాడినా వినక నన్ను ఇంటిలోకి తీసికెళ్ళింది. "కులంపోతే పోనీ, నేను విచార పడను" అన్నది నా తల్లి. నా తమ్ముడు గురుస్వామికూడా అనాగే అన్నాడు. అయితే కులంలో చేర్చుకోకూడదనే పార్టీ పట్టుదల ఎక్కువ అయింది. అలాంటి సమయంలో నా మిత్రులు శ్రీ గుప్తాగారు, శ్రీ శ్రీరాములుగారు మా యింటికి భోజనసమయానికి వచ్చి వడ్డించమని మా తల్లిని ప్రాధేయపడ్డారు మా తల్లి చాల అమాయకు రాలు. ఎదురు కట్నివారు పెట్టే బంధలను తలచుకొని భోజనం పెట్టడానికి ఇష్టపడలా. అయితే, నా మిత్రులిరు వురూ మా తల్లి బయటికి వెళ్ళి చెపితే కార్యభంగం మవు తుందని, గుమ్మంతలుపు మూసివేసి, స్వయంగా వడ్డించు కొని భోంచేశారు. ఈ వార్త వ్యాపించినా తేలుకుట్టిన దొంగలా కిక్కురుమనకుండా ఊరుకున్నారు. వీరిలా చేసి నందువల్ల నాకు మళ్ళీ కులం వచ్చేసిందన్నమాట! ఒక

ప్పుడు శ్రీ టంగుటూరి ప్రకాశంగారు బారిస్టర్ అయి విదేశాల్నుంచి వచ్చినప్పుడు ఒంగోలులో వారి మిత్రులు యిలాగే కులంలో చేర్చారని విద్యార్థిదశలో మేము విని ఉప్పొంగిపోయిన విషయం నాకు జ్ఞాపకం వచ్చింది. ఇలాంటి ఎత్తులతో యువకులు ఆ కాలంలో కులపెద్దలను ఓడించుతూవచ్చారు.

'దేశభక్తే కారణం'

అటుతరువాత గుంటూరుకు వెళ్ళాను. బ్రహ్మాండమైన ఊరేగింపులు, బహిరంగసభలు,సన్మానాలు, విందులు జరిగినవి. సభలలో పద్యాలు పాటలతో కొందరు తమ దేశభక్తి-ప్రేమలను నామీద కురిపించారు. మరికొందరు దేశభక్తులు (శ్రీ మద్ది రాధాకృష్ణయ్య. భాగవతుల సోమయాజిశర్మ మున్నగువారు) ఎంతో అనురాగాదరములతో నా ఆర్థికస్థితిగతులనుగురించి అడిగారు. "నేను బీదవాడిని నాకుంటుంబాన్నుంచి ఆర్థికసహాయం రాజాలదు. నెలకు కనీసం 30 రూ. లకు తక్కువ లేకుండా వచ్చే ఉద్యోగం కావాలి" అని చెప్పుతూ. నేను అమెరికాలో వ్యవసాయ శాస్త్రంలో పట్టభద్రుడనైన విషయాన్ని తెలియజేశాను. "ఇండియా ప్రభుత్వంవారు ఇంపీరియల్ అగ్రికల్చర్ సర్వీసులో డిప్టీడ్ రెక్టర్లుగా 40 మందిని తీసుకుంటున్నారు. ప్రారంభంలోనే వారికి నెలకు 350 రూ.ల చొప్పున వేతన మిస్తూ ప్రతిసంవత్సరం రు. 50 ల చొ॥రు 1000 ల జీతందాక

ఎక్కువచేస్తారు. ఆ తరువాత సంవత్సరానికి 100 రూ. చొప్పున రు 1500 .ల వరకు జీతాన్ని పెంచిస్తారు. కాని, పరప్రభుత్వంక్రింద నౌకరీచేయటానికి నాకెంతమాత్రం ఇష్టంలేదు. "రు. 30 ల జీవితంలో గుమాస్తా ఉద్యోగ మిప్పించితే చాలు"నని విన్నవించుకొన్నాను. కొందరు వ్యక్తులు తమ ఎన్నికలకోసం నన్నుపయోగిపచుకోడానికి ప్రయత్నిస్తున్నారు. అలా అమ్ముడు పోడానికిష్టంలేదని చెప్పాను. నన్ను సన్మానించే నిమిత్తం శ్రీ దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారి అధ్యక్షతన బహిరంగ సభ జరుగుచుండగా నా మిత్రులు రు 1116లు వసూలు చేసి నాకు బహుమతిచేశారు. ఈ డబ్బుతో నేను బెజవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్టణం, బళ్ళారి మొదలగు పట్టణాలకు ఆంధ్రులను ఉత్సాహపరచటానికి వెళ్ళాను. ఆ ప్రాంతాల్లో నాకు ఊరేగింపులు, సభలు, సన్మానాలు, విందులు జరిపారు. ఆంధ్ర నాయకులను సందర్శించాను. రైళ్ళలో ప్రయాణం చేస్తుండగా ప్రజలు ఎంతో అనురాగాదరణలు చూపెడుతూ, వారిలోవారు "మన చంచయ్యగారు" అనుకొంటూండేవారు. నా మీద ప్రజలకున్న ప్రేమకు నా దేశభక్తే కారణమని గ్రహించి ఆశ్చర్యపడేవాణ్ణి. ఆ కాలంలో దేశభక్తికిగాను నాలాగు గౌరవింపబడిన వ్యక్తి ఆంధ్రదేశంలో యింకెవరూ లేరను కుంటాను.

జట్కాపనికి ప్రయత్నం

నేను మద్రాసు చేరుకున్నాను. ఉదరపోషణార్థం ప్రయత్నాలుసాగించాను. కాని, ఫలితంమాత్రం పూజ్యం. ఊరూర ఊరేగింపులు, బహిరంగసభలు, విందులుచేసి నన్ను సన్మానించినా చివరకు నాకు గుమాస్తా ఉద్యోగ మివ్వడానికే ఎవరూ సాహసించలేని కారణం: అప్పట్లో ప్రభుత్వాగ్రహము, పోలీసుల భయము అంత తీవ్రంగా ఉండేవి. ప్రజ లప్పటికింకనూ ధైర్య సాహసాలతో పర ప్రభుత్వాన్ని ఎదిరించజాలనిస్థితిలో వున్నారు. అంచేత, నా ఉదరపోషణ అనేది ఒక గడ్డుసమస్య అయింది. నా చేతిలో మిగిలివున్న కొద్ది ధనాన్ని నే నెంతో పొదు పుగా వాడాల్సినస్థితి ఏర్పడింది. అందువల్ల రోజూ హోరి టన్ కంపెనీలో రొట్టెను కొనుక్కుతిని, కొళాయినీళ్ళు తాగుతూ కొన్నివారాలు గడిపాను. ఆ నాడున్న బ్రిటిషు పాలనావిధానంమీద, ఎన్నికలకోసం తహతహలాడే వ్యక్తులమీద నా కమిత అసహ్యం కలిగింది. ఇలాంటి వ్యక్తులెందరో నాకు ఆర్థికంగా సహాయపడేందుకు సిద్ధంగా వున్నారు. కాని, నాకున్న రాజకీయ భావస్వాతంత్ర్యానికి గాని, నా ఆచరణకుగాని వీరి సహాయం చాలా ప్రమాద కరం. పైగా రాజకీయంగా హేయమైన అపకారవాదానికి దారితీసే సందర్భం ఏర్పడుతుంది. అంచేత వారి సహా

యాన్ని తిరస్కరించాను. అసలు ఇతరుల ఆర్థిక సహాయా
న్నాధించి జీవించటం ఆత్మగౌరవాన్ని చంపుకోటమేనని
నా అభిప్రాయం కాబట్టి, జట్కాబండి తోలుకొని స్వతం
త్రంగా జీవించినా గౌరవప్రదమేనని నిశ్చయించుకొన్నాను.
సామాన్యంగా మద్రాసులో జట్కాబళ్ళవాళ్ళు స్వతం
త్రంగా ఉంటారు. వీరికి గుఱ్ఱపుబండ్లను పాహుకార్లు అద్దె
కిస్తుంటారు. ఆ వృత్తిని వెంటనే ప్రారంభించాలను
కుంటూండగానే ఒక ఉద్యోగం లభించింది.

అడయారు ఉద్యోగం - రాజీనామా

మద్రాసులో అడయారునందు అనీబిసెంటుగారి
భారత జాతీయ సర్వకళాశాల వుంది. వీరి ప్రియశిష్యు
అరండేలు గారిని "న్యూ ఇండియా" దినపత్రిక ఆఫీసులో
నేను కలుసుకొన్నప్పుడు అమెరికా విశ్వవిద్యాలయాల్లో
గరపే విద్యావిధానము, విద్యార్థుల జీవితాలను గురించి
వ్యాసాలను తమ పత్రికకు పంపమని కోరారు. అలాగే
వ్రాసి పంపగా "న్యూ ఇండియా" లో ప్రచురించారు.
విద్యావేత్తలనేకులు వాటిని ప్రశంసిస్తూ, ముఖ్యంగా
కొన్ని విషయాల్లో ఆశ్చర్యాన్ని వెలిబుచ్చారు. గొప్ప
భూస్వాముల కొమాళ్ళు వ్యవసాయమును నవీనపద్ధతులలో
నిర్వహించటాని కవసరమైన శిక్షణ పొందేందుకు అడ
యారు జాతీయ విశ్వవిద్యాలయంలో ఒక భాగంగా వ్యవ
సాయ కళాశాలను స్థాపించి యుండిరి. హైడీ కూపర్ అనే

హాలెండు దేశీయుడు కళాశాలాధ్యక్షుడుగాను, వ్యవసాయ శాస్త్రంలో ప్రవీణుడై వచ్చిన ఒక బెంగాలీ ప్రొఫెసరుగాను పనిచేయుచుండిరి. ఈ ప్రొఫెసరుకు వేతనము రు. 300 లు. అయితే, ఈ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ప్రొఫెసరకు వందరూపాయలకన్న ఎక్కువ వేతనం లేదు. వంగ ప్రొఫెసరు రు. 350 ల జీతంతో సర్కారు ఉద్యోగం లభించగనే రాజీనామా ఇచ్చి వెళ్ళిపోయారు. ఆ ఉద్యోగాన్ని నా కిప్పించటానికి నా మిత్రులు ♦ శ్రీ వి. యన్. శర్మ, పి. హెచ్. డి. గారు ప్రయత్నించారు. హైస్కూలు కూడ పనిచేసుగారు అభ్యుదయ భావాలుగలవారు. కాబట్టి నేను విప్లవవాది నని తెలిసికూడా నాకు ఆచార్య పదవి ఇవ్వటానికి ఆయన అంగీకరించాడు. నన్ను డాక్టర్ అనీబిసెంటుగారి వద్దకు తీసుకెళ్ళారు. నన్ను లెక్చరరుగా తీసుకోదలచినట్టు తెలిపి, ఆమెగారిలా ప్రశ్నపరంపరను కురిపించారు:—

"నీవు విప్లవవాదివి కదూ?"

"మిమ్మల్ని, అరండేల్‌గారిని, బ్రిటిషు ప్రభుత్వం ఏ సెక్షన్ క్రింద డిపోర్ట్ చేసిందో అలాగే ననూ్నా నిర్బంధించింది" అన్నాను.

"నీకు విప్లవభావాలుండుట నిజమేనా?"

"నిజమే" నన్నాను.

♦ ఇప్పుడీయన చిల్డ్రిన్ను సూ్కలు ప్రిన్సిపాలు.

"అలాగైతే నీవు విద్యార్థులతో కలసిమెలసి వుంటే అసలు విశ్వ విద్యాలయానికే హాని సంభవించునేమో" నన్నారు.

"వ్యవసాయ శాస్త్రమును గరపడానికే నాకు వేతన మిస్తారు గాని విప్లవ రాజకీయాలు నేర్పడానికి కాదని నే నెరుగుదును" అన్నాను.

"అలా మాట ఇస్తావా?" అని అడిగారు. ఒప్పుకొన్నాను ఆమె నా మాట నమ్మి లెక్చరర్ ఉద్యోగమిచ్చారు. అయితే కొద్దికాలంలోనే రాజకీయంగా నాకు అభిప్రాయభేదం వచ్చింది. ఆ కాలంలో బిసెంటుగారు, మహాత్మాగాంధీగారిని అతితీవ్రంగా ఆక్షేపిస్తూ, హద్దూ పద్దూ లేకుండా తిడుతూ తన "న్యూ ఇండియా" దినపత్రిక లో వ్రాయసాగింది. బిసెంటుగారు గాంధీగారి నీ విధంగా ఆక్షేపించటం, తిట్టటం చూచి, అడయారులో అనేకులకు ఆమెయం దయిష్టము, కోపము కలిగాయి. అట్టివారిలో నేనే ముఖ్యుడిని నే నెంతమాత్రం ఓర్చుకోలేకపోతిని. ఆమె కిచ్చిన మాట తప్పుతున్నాననే విషయం తలచుకొని వెంటనే నా వుద్యోగానికి రాజీనామా ఇచ్చివేశాను. దేశ భక్తి అభిమానములు లేని వాతావరణాన్నుండి బయిట పడినందుకు సంతోషించాను.

దారి తోచలేదు

ఆ రెండుసంవత్సరాలకాలంలో, ప్రిన్స్ ఆఫ్ వేల్సు, మ్యూక్ ఆఫ్ కన్నాట్ (జార్జి చక్రవర్తి కుమారుడు, పిన తండ్రి) మద్రాసుకు వచ్చినప్పుడు పోలీసులు నావెంట బడ్డారు. ఇల్లువిడిచి పోకూడదని నోటీసు ఇచ్చారు. అందు కంగీకరించనన్నాను. అరెస్టు చేయటానికిష్టంలేక ప్రభుత్వం సి. ఐ. డి. ని ప్రయోగించింది. దేశానికి సాయుధవిప్లవం వల్లనే విముక్తి కలుగుతుందన్న విశ్వాస మున్నందున గాంధీగారి ప్రచారం అనర్థకమని తోచింది నాకు. నా అభిప్రాయాలున్న వారికొరకు ఆంధ్రదేశమందంతటా గాలించి చూచాను. తుదకు శ్రీమతి పొణకా కనకమ్మ గారిని, వారి యువక బృందమును గూర్చి విన్నాను. యుద్ధకాలం (1914-1918)లో వీరు "పుదుచ్చేరి" నుంచి ఆయుధాలను సేకరించుచుండిరని వదంతి వుండెను. శ్రీమతి కనకమ్మగారు నన్ను కలుసుకున్నారు. కలిసి పని చేయుటకు ప్రయత్నించాము. కాని ఆమె శిష్యులు ఒక్కొక్కరే గాంధీ శిష్యకోటిలో చేరిపోయారు. చివరకు ఆమె గారు సైతం అహింసాతత్వమును మనస్ఫూర్తిగా నమ్మి వారిలో చేరిపోయినారు. మా ఇరువురిమధ్య అభిప్రాయ భేదమున్నను ఆమెగారి నిష్కపటస్వభావము, నిజాయితీలు గాంచి నా కత్యంత గౌరవము కలిగింది.

'ఆష్' హత్యకేసుకు సంబంధించిన నీలకంఠ బ్రహ్మచారి నన్నొకసారి కలుసుకున్నారు. ఆయుధాలను సరఫరా చేయగలనని నొక్కిచెప్పాడు. కాని, సాయుధవిప్లవములో నమ్మకంగల దేశభక్తులుకూడా గాంధీజీ అహింసా పోరాటానికి అవకాశమిచ్చి చూడాలని నిశ్చయించుకున్నారు. అంచేత దొరరిజానికి, సాయుధ విప్లవానికి అవసరమైన వాతావరణం నశించిపోసాగింది. నా అభిప్రాయాలకనుగుణమైన వాతావరణం లేకపోవుటచే, గాంధీగారి ఉద్యమం వల్ల సంపూర్ణ స్వరాజ్యం రాదనే దృఢాభిప్రాయం వున్నా నేనేమి చేయలేకపోయాను. క్రమంగా రాజకీయ రంగానికే దూరమవుతూ వచ్చాను.

కాంగ్రెసులో చేరుటకు ప్రయత్నాలు, ఆటంకాలు

అహమ్మదాబాదు కాంగ్రెసు (1920 - 21) కు వెళ్ళాను. లక్షలకొద్దీ ప్రజలు వచ్చారు. అంతమంది కాంగ్రెసుకు రావడం అదే మొదలన్నమాట. స్వరాజ్య సంపాదనకు గాంధీజీ గొప్ప మార్గాన్ని చూపుతారని నా నిరీక్షణ. "స్వరాజ్య" మంటే అర్థమేమిటి? బ్రిటిష్ సామ్రాజ్యంతో సంబంధంలేని పూర్ణ స్వరాజ్యమా? లేక బ్రిటిష్ సామ్రాజ్యంలో అదివరకే ఉన్న అధినివేశరాజ్యాల్లాగా అసంపూర్ణ స్వరాజ్యమా? అనే విషయాన్ని నిర్ణయించుటకు ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు. నిష్కర్షగా నిర్వచనం చేయరాదనీ, అస్పష్టంగానే వుండాలనీ గాంధీజీ

వాదన "నిష్కర్షగా తీర్మానించుట అవసరం. సంపూర్ణ స్వరాజ్యమే కాంగ్రెసు గమ్యస్థానం" అని మౌలానా హజరత్ మోహినీగారు సవరణ తెచ్చారు. తమ సవరణను చక్కగా సమర్థించుకొన్నారు. వీరి సవరణను బలపరచేవారిని వెతకాల్సివచ్చింది. కొంతసేపటికి శ్రీ ఆళ్వార్ అనే యువకుడు (బందరు) హజరత్ మోహినీగారి సవరణను బలపరిచాడు. ఆ సవరణను గాంధీగారు వ్యతిరేకించి ఓడించివేశారు. నాకు చాలా విచారం కలిగింది. 1857 నుండి 1920 సం॥ వరకు సంపూర్ణస్వరాజ్య సంపాదనకొరకు తమ సర్వస్వాన్ని సమర్పించిన దేశభక్తులు. ఔరంగ్జేబు [illegible]లు, గదర్ పార్టీ ప్రజల ఎదుట పెట్టిన లక్ష్యాన్ని ఈ నాడు గాంధీగారు ఇంత హీనస్థితికి తెచ్చారా అన్న దుఃఖం నా హృదయాన్ని పూర్తిగా క్రమ్మకొన్నది. నేను మరల కాకినాడ కాంగ్రెస్ మహాసభకు (1923-24) వెళ్ళాను. నా ప్రథమభార్య అన్నపూర్ణమ్మ వాలంటియర్‌గా పనిచేసింది. విషయనిర్ణయసభలో స్వరాజ్యమనే మాటకు నిర్వచనం చేయడానికి తర్కవితర్కాలు జరిగినవి. శ్రీ సేలం విజయరాఘవాచారిగారు, శ్రీ యస్. శ్రీనివాసయ్యంగారు 'సంపూర్ణస్వరాజ్యం' అని నిర్వచనంచేస్తూ తెచ్చిన తీర్మానమును శ్రీ మోతీలాల్ నెహ్రూగారు తీవ్రంగా ఎదిరించారు. వారి వాదన లోపభూయిష్టంగా కనపడింది. పై తీర్మానమును తెచ్చినవారిని శ్రీ మోతీలాల్ నెహ్రూగారు వ్యక్తిగతంగాకూడ ఆక్షేపించసాగారు.

"కాంగ్రెసు ఆదర్శాలకు, తీర్మానాలకూ వ్యతిరేకంగా కోర్టులలో న్యాయవాదవృత్తి నవలంభించి డబ్బు సంపాదించుతూ స్వాతంత్ర్యపోరాటరంగంలో మూకక తటస్థులుగా వుండి భోగభాగ్యా లనుభవిస్తూ రాళ్ళు రువ్వేవారి మాటలను పాటించాల్సిన అవసరం లేదు" అని హేళన చేశారు.

"చిన్నప్పటినుండి దేశసేవచేస్తూ, దానితోపాటు డబ్బు గడించి దేశసేవ కర్పిస్తూవచ్చినందుననే ఈనాడు వృద్ధాప్యంలో కూడ సంపాదించి పొట్ట పోసుకోవలసినగతి పట్టింది. అయితే శ్రీ మోతీలాల్ నెహ్రూవిషయంలో అలా కాదు. వారు లక్షలు, కోట్లు గడించి నిల్వచే కున్నారు. ప్రపంచ సౌఖ్యాలనుండి విరమించుకోవలసిన ముసలితనంలో దేశభక్తులైనా"రని శ్రీ ఆచార్లుగారు ఎత్తిపొడిచారు.

"మనం కోరేది సంపూర్ణస్వరాజ్యమా? అసంపూర్ణ స్వరాజ్యమా? అనే విషయాన్ని తేల్చుకొని తీర్మానించుకోవాలిగాని, వ్యక్తిదూషణకు దిగటం చాలా అసభ్యమైన పని"యని శ్రీ అయ్యంగారు మందలించారు. మన గమ్యస్థాన మెప్పుడూ పరమోన్నతంగానే వుండాలి కాని, ఆచరణలోమాత్రం సమయానుకూలంగా మార్చుకొంటూ వుండాలని శ్రీ శ్రీనివాసయ్యంగారు వానించారు. వ్యక్తి దూషణలతో శ్రీ మోతీలాల్ నెహ్రూగారు, శ్రీ విజయ రాఘవాచార్యులుగారు ఉద్రేకపూరితులైచివరకు చేతుల

చేతులు కలుపుకొనేస్థితికి వచ్చారు. ప్రెసిడెంట్ మౌలానా మహమ్మదాలీగారు వారిద్దరినివిడదీయాల్సివచ్చింది. వారి వైఖరిని, చిత్తవృత్తిని వీక్షిస్తున్న నాకు ఎంత విచారం కలిగిందో వ్రాయలేను. మరొకసారినిస్పృహలు నా మనస్సు నావరించాయి.

మదరాసు (1927-28)లో జరిగిన కాంగ్రెసు మహా సభకు కూడా హాజరైనాను. కాంగ్రెసు ఆదర్శాలు ఆశయాలతో సంతృప్తిచెందని కొందరు అతివాదులు ఇండియన్ రిపబ్లికన్ కాంగ్రెస్ అనే పేరుతో ఒక మహాసభను ప్రత్యేకంగా జరిపారు. "బ్రిటిషు సామ్రాజ్యంతోపూర్తిగా తెగతెంపులు చేసుకొని, రాజులు, మహారాజులు వుండని ప్రజాప్రభుత్వమే భారత రాజకీయ పరమావధియని" తీర్మానిస్తూ ప్రబోధించారు. నాకీ ఆశయం ఎంతో అనందాన్ని కలుగజేసింది.

కాంగ్రెసు ఆశయాలంటే అసంతృప్తి పర్చడినందున నా జీవితాన్ని కాంగ్రెసుకు అర్పించలేకపోయాను. అయితే కాంగ్రెస్ తీర్మానాలనుమాత్రం తూ.చ. తప్పకుండ ఆచరణలో పెట్టుటకు ప్రయత్నిస్తూనే వుంటిని. ఖద్దరు బట్టలను మాత్రమే ధరించేవాణ్ణి. కుటుంబంలో అందరము లభించినంతవరకు స్వదేశీవస్తువులనే ఉపయోగించేవాళ్ళం. కొన్ని అవసర వస్తుసులు స్వదేశీవి లభించకపోతే బ్రిటిషు సామానులనుముట్టక వేరేదేశపు సామానులను కొనేవాణ్ణి. ఎంత నష్టం వచ్చినా కోర్టుకెక్కలేదు. ప్రతివాదిగా వెళ్ళక

తప్పనపుడు "మధ్యవర్తి తీర్పుకు ఒప్పుకొంటాను. బ్రిటీషు వారి కోర్టులనుమాత్రం బహిష్కరించం" డని ఎదిరి పక్షంవారిని కోరేవాణ్ణి. 1920–21 లో ఇంపీరియల్ అగ్రికల్చరల్ సర్వీసులో నెలకు రూ 150 ల వరకు గడించు కోగల ఉన్నతోద్యోగం లభించే అవకాశం వచ్చింది. ఆ ఉద్యోగం ఇస్తాను, పరిగ్రహించమని శ్రీ సక్. బి. యన్. శర్మగారు (వైస్రాయి కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు) ఎంతో ప్రోత్సహించారు. కాని నేను సమ్మతించలేదు. దినదినం ఆర్థిక బాధలు అధికమవుతూనే వచ్చాయి. జీవన్మరణ సమస్యగావుంది. అలాంటి సమయం (1921–22)లోనా ప్రాదేయోభిలాషి శ్రీ ముత్తా వెంకట సుబ్బారావుగారు మంత్రి శ్రీ కూర్మారెడ్డిగారి వద్దకు తీసుకువెళ్ళారు. ప్రొవిన్షియల్ అగ్రికల్చరల్ సర్వీసులో తక్షణమే ఉద్యోగమివ్వటానికి వారు సిద్ధపడిరి. ప్రభుత్వంక్రింద పనిచేయటానికేమో మనస్కరించుటలేదు. స్వతంత్రంగా సంపాదించుకొని జీవించటానికి దారీ తెన్నూ కనబడటంలేదు. నా హృదయంలో పోరాటమూ, చెలరేగిపోతున్నది. నా నిశ్చయాన్ని మరునాడు తెలుపుతానని మాత్రం చెప్పి వచ్చేశాను. చివరకు బ్రిటిషువారిమీది ద్వేషమే నెగ్గింది. ఉద్యోగంలో చేరుట మానివేశాను.

ఉద్యోగమూ - రాజీనామా

1923-25 సం॥ వరకు ఎలాంటి ఉద్యోగమూ దొరకలేదు. ఒక వైపున కుటుంబ నిర్వహణ బాధ్యత. మరొక

పైపు ఆర్థిక బాధలు, వీటిమధ్య నలిగిపోతున్నాను. అలాంటి సమయంలో విధిలేక ఇంపీరియల్ ఇండస్ట్రీస్ కంపెనీలో ఇన్‌స్పెక్టరుగా చేరాను. అది ప్రభుత్వానిదికాదు. బ్రిటిషు వారిదే. అయితే, నవీనపద్ధతులననుసరించి సమృద్ధిగా పండించే విదేశాలవలె, మన దేశంలో సయితం సమృద్ధిగా పండించుటకు రసాయనిక ఎరువులను ఉపయోగించి ఉత్పత్తికి తోడ్పడతానన్నే తృప్తిమాత్రం మిగిలిందన్నమాట. ఆర్థిక బాధలను భరించలేని నేను ఏదోవిధంగా సరిపుచ్చుకొన్నానన్నమాటే కాని, బాధమాత్రం నన్ను వదల్లేదు.

1930-31 నాటికి ఆ కంపెనీలో నెలకు రూ. 500ల కన్న ఎక్కువగానే సంపాదించుచుంటిని. ఇంకా ఎక్కువగా అభివృద్ధి అయ్యే అవకాశాలున్నై. యూరోపియన్లకిచ్చే గ్రేడ్ ప్రకారమే నాకూ జీతం, బత్తెం, పెన్షన్, శలవులు వగైరా ఇవ్వటానికి పై అధికారులు కంపెనీకి సిఫారసు చేశారు. ఆర్థికంగా అధిరోహించేకాల మది. అట్లాంటప్పుడు, నెల్లూరుజిల్లాలోని ఒక గ్రామానికి కెమికల్ ఎరువులను ఉపయోగించే పద్ధతిని నేర్పుటకు వెళ్ళటం తటస్థించింది. విదేశీవస్తుబహిష్కరణ ప్రచారం తీవ్రంగా సాగిపోతున్నది. వాలంటీర్లు నావద్దకు వచ్చి "బ్రిటిషు వస్తువులను అమ్మించుట న్యాయమా!" అని నన్ను ప్రశ్నించారు. సిగ్గువేసింది. అదివరకే ఉన్న బాధ ఇనుమడించింది. దీనికితోడు ఇన్‌స్పెక్టర్లకూ, పై ఉద్యోగులకూ మధ్య సంఘర్షణ జరుగుతూవచ్చినది. వారు, నేను అందరం

రాజీనామానిచ్చివేసినాము. అధికారులు కొంత లొంగి అనుకూలాలు చేశారు. 7 గురు ఇన్స్పెక్టర్లలో 5 గురు మరల ఉద్యోగాల్లో చేరిపోయారు. కాని, నేను, నా మిత్రుడు శ్రీ బి. రామకృష్ణగారు (బెంగుళూరు) మాత్రం యిక నా వుద్యోగాల్లో చేరలేదు.

కాంగ్రెసు ఉద్యమం

ఆ కాలంలోనే విదేశీవస్త్ర బహిష్కరణ సందర్భంలో చల్లావారి షాపువద్ద పికెటింగు చేసినందుకు శ్రీ ఖాసా సుబ్బారావుగారిపై పోలీసులు దారుణంగా లాఠీ చార్జి చేశారు. ఆయన చావుబ్రతుకులమధ్య వున్నారని దినపత్రికలు ప్రచురించినవి. అప్పటికే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన కుతూహల పడుతున్న నా రెండవభార్య సుభద్రమ్మ బ్రిటిషు ప్రభుత్వపు ఈ అమానుషత్వాన్ని చదివి, ఇంక ఓర్చుకోలేక వెంటనే తన ఉపాధ్యాయిని ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనుటకు నిశ్చయించుకొన్నది. మేమిద్దరం కలసి దేశసేవ చేయుటకు నిశ్చయించుకొనే వివాహం చేసుకున్నాము. మేము మొదట మద్రాసులో దేవాలయ ప్రవేశోద్యమంలో శ్రీ పాండురంగం మొదలగు మిత్రులతో కలసి పనిచేశాము. గాంధీగారు యరవాడ జైలులో హరిజనుల కొరకు సంయుక్త నియోజక వర్గాలకోసం నిరాహారదీక్షను పూనిన సమయంలో నేను, నా భార్య మద్రాసులో హరి

జనులతో సహపంక్తి భోజనము లేర్పాటుచేసి గాంధీగారి ఉద్యమానికి తోడ్పడసాగాము. ఇంతలో హరిజన సేవక సంఘం స్థాపితమయింది. సుభద్రమ్మ హరిజన సేవక సంఘానికి సంయుక్త కార్యదర్శిగా పనిచేయసాగింది. ఇప్పటికీ ఆమె ఆ ఉద్యమానికి శ్రద్ధతో పనిచేయుచున్నది. దిక్కులేని హరిజన బాలికల కష్టాలను తొలగించలేక కంటనీరు పెట్టుకుంటూ ఉంటుంది.

1931-32 ప్రాంతంలో మద్రాసులో డాక్టర్ అచ్చమాంబ, శ్రీమతి రుక్మిణీ లక్ష్మీపతి మున్నగువారు మా ఇంటి సమీపంలోనే వాలంటీర్ల శిబిరము నేర్పరచినపుడు అధికంగాను, యితరవిధాలా తోడ్పడ్డాను. నిషేధవాజ్ఞ లెత్తివేయగానే డాక్టర్ అచ్చమాంబగారు మా ఇంట్లో దాచేవారు.

1933-34 మాంటిసోరీ, మొదలగు నవీన విద్యా విధానాల్లో లేడీ వెల్లింగ్టన్ కాలేజీలో లెక్చరర్‌గా నున్న మిస్ బ్యారీగారూ, నా భార్య సుభద్రమ్మగారూ ప్రసిద్ధికెక్కారు. వీరిద్దరూ బుషివాలీ స్కూలులోను, లేడీ వెల్లింగ్టన్ ట్రెయినింగ్ కాలేజీలోను మాంటిసోరీ పద్ధతిని వృద్ధికి తెచ్చారు. మిస్ బ్యారీగారు ఈ ఉద్యోగాన్ని చాలించుకొని ఇంగ్లాండుకు వెళ్ళేముందు నా భార్యను ఆ డిపార్టుమెంటుకు సూపరెన్‌టెండెంటుగా పనిచేయమని బలవంతపెట్టి వెళ్ళిరి. లేడీవిల్లింగ్టన్ కాలేజీ ప్రిన్సిపాలు మిస్ జిరార్డ్ గారుకూడా కోరారు. 'మా గాంధీజీని నిర్బంధించిన ప్రభుత్వ

నౌకరీ నేను చేయ' నన్నది సుభద్రమ్మ ఆనకీ డిగ్రీలు ఇప్పించుతామని ఎంతో ఆశపెట్టారు కాని, ఆమె సమ్మతించలేదు. చివరకు మిస్ బ్యారీ నావద్దకొచ్చి నా భార్యను ఒప్పించమని ప్రతిమలాడింది. ప్రభుత్వ వేతనం పుచ్చుకోకుండా ఉచితంగా సుభద్రమ్మగారు పనిచేయటానికి అవకాశమిస్తే నేను సమ్మతిస్తాను. ఆమెకూడ అంగీకరించుతుందని నావమ్మకమని చెప్పాను. అందుకామె ప్రయత్నించారు. కాని, ప్రభుత్వంచే ఒప్పించలేకపోయినారు ఇంతే కాదు నేను విరివిగా డబ్బు సంపాదించుతూ కాంగ్రెసు సేవ చేసే మిత్రులకు వారి కుటుంబాలకు ద్రవ్యసహాయం చేసేవాణ్ణి. ప్రకాశంగారి 'స్వరాజ్య' పత్రిక అరికకష్టాలలో మునిగిపోయినపుడు నేను ద్రవ్యరూపంగా సహాయపడ్డాను. శ్రీ ప్రకాశంపంతులుగారు ఎప్పుడు అడిగినా లేదనలేదు. ఈలాగున 1935 సం॥ వరకు కాంగ్రెసుకు ఏదో విధంగా సేవ చేస్తూ వచ్చాను. కాని, మనస్ఫూర్తిగా పనిచేయుటకు ఉత్సాహం కలుగలేదు.

ప్రజాఉద్యమం మాత్రం పెరిగిపోతూవచ్చింది. కాంగ్రెసు నాయకులు వేస్తూవచ్చిన అడ్డుపుడకలు ప్రజా ఉద్యమ ప్రవాహంలో కొట్టుకుపోతూ వచ్చాయి. ప్రజలతో కలసి రాజకీయంగా పనిచేయనందుకు విచారపడుతున్న నేను మళ్ళీ 1935 సం॥లో అత్యుత్సాహంతో రాజకీయ రంగంలో పనిచేయ ప్రారంభించాను. అయితే, ఆరోజులలో (1935 వరకు) కాంగ్రెసుకోసం నా కాలాన్ని

పూర్తిగా వినియోగించి పనిచేయనందుకు నా మనోవైఖరి నెరుగని నా స్నేహితులు కొందరు అనేక విధాలుగా అనుకునే వారు. సంవత్సరాల కొలది జైళ్ళలో అనేక విధాలుగా కష్టాలు పడినందున మెత్తబడ్డానని, వివాహం చేసుకొని కుటుంబ సౌకర్యాలకు అలవడి మరల జైలుకు వెళ్ళుట కిష్టపడలేదనీ, దారిద్ర్యం ద్రవ్యసంపాదనకు పురికొల్పిందనీ అనుకునేవారు. నేను యేండ్లతరబడి జైళ్ళలో వున్న ఫలితంగా, నాకు రక్తవిరేచనాలు ఏర్పడినందున తిరిగి జైలు జీవితం గడపటానికి ఇష్టంలేదని మరికొందరనుకునేవారు. నేను జైలునుండి రాగానే (1919) శ్రీహరి సర్వోత్తమరావుగారు బీదవానికి, ఆర్థికంగా పరాధీనులైనవారికి రాజకీయాలు లేవనే విషయం గుర్తించమని సలహా నిస్తూ యిలా అన్నారు: "ఎన్నికల కోసమని నీ పేరు ప్రతిష్టలను ఉపయోగించి జయించటానికోసం అవకాశవాదులు ప్రయత్నిస్తారు. జాగ్రత! వారి వలలో పడబోకు. నీకా ఆస్తిపాస్తులు లేవు. నీ జీవనాధారానికి కావలసినది సంపాదించుకోంటూ, నీ ఇష్టంవచ్చిన విధంగా, సంఘసేవ మూలకంగా దేశసేవ చేసుకో. ఆర్థికంగా నీ కాళ్ళమీద నీవు నిలబడక ఇతరులమీద ఆధారపడ్డావంటే నీ జీవితం, నీ శక్తులు, వృధా అయిపోతాయన్న విషయం జ్ఞాపకముంచుకో. ఇది స్వానుభవం సుమా! అందుచేత నీకు సలహా నివ్వటానికి సాహసించాను" అని దేశభక్తుడు, సీవాదురంధరుడు, నిరాడంబరజీవి ఇచ్చిన సలహాను నేను మరచి

పోలేదు. దాదాపు ముప్పది సంవత్సరాలనుండి ఈనాటి వరకు వారి సలహా చాలా సమజసంగానే కనిపిస్తున్నది.

కళావంతుల వివాహాలు

నేను ప్రయత్నించిన సంఘసంస్కరణలలో మొట్ట మొదటిది "కళావంతుల స్త్రీలకు వివాహాలు చేయించటం". ఈ ప్రయత్నం తలవని తలంపుగా ఏర్పడ్డ ఒక సంఘట నగా గోచరించినా వీరి సంఘసంస్కరణ విషయంలో విద్యార్థిదశలోనే నాకు ఉన్నతభావాలు ఏర్పడుతూ వచ్చాయి. నావిద్యార్థిదశలోనే శ్రీ వీరేశలింగంపంతులు గారి పుస్తకాలు, సంఘసంస్కరణదీక్ష నన్ను బాగా ఆకర్షించాయి. ఒంగోలు హైస్కూలులో నాసహాధ్యాయి అయిన శ్రీనల్లమల్లి వరదరాజులుగారు బౌద్ధమతంలోని నైతికోన్నతినీ, సమాజానికి, సర్వమానవకళ్యాణానికో సేవ చేయడం విద్యుక్తధర్మమనీ నా హృదయంలో నాటారు. మద్రాసు పచ్చయ్యప్ప కాలేజీలో చదువుతున్నప్పుడు శ్రీ కె వైకుంఠరావుగారి సహవాసంచే బ్రహ్మసమాజం లోని అభ్యుదయ భావములలోను, సంఘసంస్కరణలలోను నా కభిరుచి పెంపొందసాగినది, కాని, విద్యార్థినైన నేను కార్యరూపంలో ఏమీ చేయలేకపోతిని. గదర్ పార్టీలో చేరిన తరువాతనే నా భావములను కార్యరూపమున పెట్టు టకు శక్తిసామర్థ్యాలు కలిగినవి.

నేను వైశ్యుణ్ణి. అందువల్ల కనిగిరిలో అనేకమంది వైశ్యులకూ వేశ్యలకూ గల సంబంధబాంధవ్యాలు నాకు తెలుసు. పాతవూరు అనే పేటలో (కనిగిరి) వేశ్యలు చాలామంది వుండేవారు. వారు సంగీతం, నాట్యం, నాటక పాత్రధారణలలో ప్రవేశమున్నవారు. కనిగిరిచుట్టు ప్రక్కల 50 మైళ్ళ వరకువున్న గ్రామాల్లో జరిగే వివాహాది శుభ కార్యములకు, దేవాలయాల్లో జరిగే ఉత్సవాలప్పుడు సంగీతం, భరతనాట్యాది వినోదగోష్టి జరపటానికి కనిగిరి కళావంతులను రప్పించేవారు. అయితే ఆ వృత్తివల్ల మాత్రమే వారి జీవనం గడవటం కష్టం. అంచేత వారు వంశపారంపర్యంగా శీలాన్ని అమ్ముకొని జీవించడం పరిపాటి అయింది. వివాహాలు వారికులంలో సాధ్యపడవు. వంశపారంపర్యంగా ఈ నీచవృత్తిలో పుట్టి, పెరుగుతూ ఆధోగతిపాలవుతూవచ్చారు. కనిగిరి కళావంతుల పిల్లలు నన్ను అన్న, బావ, మామ, చిన్నాయన, అల్లుడు మొదలైన వరసలతో పిలిచేవారు. వారి కుటుంబాలకూ, మా కుటుంబాలకూ పూర్వంనుంచీ లావాదేవీలుండేవి. కళావంతుల సంస్కరణ యెంతో అవసరమని గుర్తించి విద్యార్థిదశలో ఏమీ చేయలేకపోతినే అని విచారపడే వాణ్ణి. వివాహాలకు, దేవుళ్ళ వుత్సవాలకు వచ్చి వేశ్యలు పాడటం, నాట్యం చేయటం ఎంతమాత్రం కూడదని వాదించేవాణ్ణి. విద్యార్థులు వాళ్ళనుగూర్చి నీచంగా

మాట్లాడినా, ప్రవర్తించినా వారి ధోరణిని ఖండించి "పాపం! వేశ్యలు నేటి సామాజిక వ్యవస్థలోనున్న అవినీతి అక్రమాలకు బలియైనవారు కాబట్టి, వాళ్ళను నీచంగా చూడక జాలిచూపెట్టం"డని వాదించేవాడిని

శ్రీమతి యామినీపూర్ణ తిలకమ్మగారు

నేను కళావంతుల సంస్కరణోద్యమాన్ని తలపని తలంపుగా ప్రారంభించుటకు తటస్థించిదనదని లోగడ వ్రాశాను. నేను అడయారు జాతీయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయశాస్త్ర బోధకుడుగా ఉన్నప్పుడు శ్రీమతి తిలకమ్మగారిని పరిచయంచేస్తూ ఒకమిత్రుడు జాబు వ్రాశాడు. ఆమె ప్రసిద్ధికెక్కిన వ్యక్తి. గొప్ప ఉపన్యాసకురాలు. ఆంధ్రసాహిత్యంలో ఆరితేరిన మహిళామణి. శ్రీమతి తిలకమ్మగారు కళావంతుల కులంలో పుట్టిపెరిగి, ఆ కాలపు కట్టుబాట్లనే సంకెళ్ళను త్రెంచుకొని బయటపడ్డారు. వేల సంవత్సరాలుగా ఆ కులంలో కరుడుగట్టిన అవినీతిని కూకటి వేళ్ళతో పెరికిపారవేయుటకు దీక్ష వహించారు.

శ్రీమతి తిలకమ్మగారి పెద్దకొమార్తెకు క్షయవ్యాధి సంభవించింది. చికిత్సచేయించేందుకు కూతురినిమద్రాసుకు తీసుకువచ్చారు. నా ఇంట్లో బస, భోజనాదులను ఏర్పరచి సహాయం చేయమని నా మిత్రుడు శ్రీ పి. హెచ్. గుప్తా గారు లేఖ వ్రాశారు. శ్రీమతి తిలకమ్మగారు వ్యాధిగ్రస్థురాలైన రామతిలకంతో నా ఇంట్లో వుండేవారు. ఆమెతో

ఏ విషయం చర్చించినా చివరకు కళావంతుల స్త్రీలకు వివాహాలు చేయించాలనే అభిప్రాయాన్ని ఆవేశంతో చెప్పేవారు. సరే నన్నంతమాత్రాన ఆమెగారికి తృప్తి కలుగదు. 'వివాహాలు చేయించుదా'మని అనగానే నేనొక పిచ్చివాడనని సంశయించేది. అలాచేయటం ఎంతకష్టమో, అసాధ్యమో ఆమెకు తెలుసు అనుభవం లేకపోయినా గాంధీజీ ప్రజాఉద్యమంవల్ల యిలాంటి సంఘసంస్కరణలను నెరవేర్చగలమనే నమ్మకం ఏర్పడింది నాకు. నేనీ విధంగా చెప్పినప్పుడు ఆమె తాను చేసిన ప్రయత్నాలు, పడిన కష్టాలు చెప్పి దుఃఖించేది. కాలం మారిపోయిందనీ, ఆమె ఉద్దేశాలు నెరవేరేకాలం వచ్చిందనీ, గాంధీగారి ప్రజోద్యమ వెల్లువలో సంఘంలోని రొచ్చు అంతా కొట్టుకు పోతుందనీ ఆమెకు నచ్చజెప్పవలసి వచ్చినది

కేవలం ఆవేశంవల్ల ఏమీ చేయజాలం. కార్యరంగంలో ప్రవేశించాలి. కాబట్టి ఈ సంస్కరణోద్యమాన్ని యెలా ప్రారంభించాలో ఆలోచించాలన్నారు. ఒక పత్రికను నడపాలని ఆమెగారన్నారు. అంతమాత్రం చాలదు; మహాసభ నొకదానిని ఏర్పాటుచేసి, కళావంతుల వివాహాలకు పూనుకొనెలా చేయుట అవసరమని సలహాయిచ్చాను. అయితే ఆర్థిక సహాయం లేనిదే ఈ కార్యకలాపం సులభసాధ్యం కావనే సంశయం కలిగింది. ఆ న్యూనతను నేను వహిస్తాననే నమ్మకం ఆమెకు కలిగించాను. చివరకు తిల

కమ్మగారు తన యావచ్ఛక్తినీ, జీవితాన్నీ, ఈ ఉద్యమానికి అర్పించి పాటుపడ దీక్షువహించారు.

ఈ సంఘ సంస్కరణోద్యమానికి సంబంధించిన మహాసభలు, పత్రిక, యువతీశరణాలయం, వివాహాలు, ఉపన్యాసాలు, ప్రయాణాలు మొదలైనవి ఆమె, తన పెద్ద కూతురు రామతిలకంగార్లు నిర్వహించవల్సిందిగాను, అవసరమైన ఆర్థిక బాధ్యతలు నావసీ, కార్యభారమును విభజించుకొన్నాము. ప్రజలకు శ్రేయస్కరమని తోచిన కార్యాలకు ద్రవ్యసహాయమేగాక, అన్ని సహాయాలు చేస్తారనే నమ్మకం నాకు గదరు వుద్యమములో ఏర్పడింది. అనేక ఉద్యమాల్లో సరియైన వర్కర్లు లేనందున ఉద్యమాలు నశించిపోతాయేగాని, ద్రవ్యంలేక అవి నశించవు.

గదరుపార్టీ కార్యరంగంలో కార్యకలాపాన్ని ఎవరి సలహా, సహాయంలేకనే స్వప్రయత్నం, స్వశక్తి, ధైర్య సాహసాలపై ఆధారపడి సాగించవలసియుండెను. ఆ అనుభవంతోనే ప్రజలు సంఘసంస్కరణలకు సిద్ధంగా వున్నారనీ, అభ్యుదయోద్యమాలు ప్రజావుద్యమాలను స్థాపించితే జయప్రదంగా సాగిపోతాయనీ గ్రహించగలిగాను.

సంఘస్థాపన - ఉద్యమవ్యాప్తి

ఇక కార్యారంభానికి నిశ్చయించుకొన్నాను. శ్రీమతి తిలకమ్మగారిచే గాంధీతత్వం, ఖద్దరు ఉద్యమం, ఆంధ్రసాహిత్యం మున్నగు విషయాలను గురించి మొట్ట

మొదట జాతీయ విశ్వవిద్యాలయంలో ఉపన్యాసాలిప్పించాను. యూనివర్సిటీలోను, అడయారు థియసాఫికల్ సొసైటీలోను శ్రీ తిలకమ్మగారియందు గౌరవాభిమానాలు కలిగినవి. థియసాఫిస్టులు సంఘసంస్కరణాభిమానులు, కార్యశూరులు. వారి సహాయంతో ఎంతో ముందుకు పోగలమని నమ్మి, అడయారులో వారందరి సానుభూతితో కళావంతుల సంస్కరణసంఘాన్ని స్థాపించాము. ఈ సంఘ స్థాపనకుముందు ఆ కులానికి పేరు నిర్ణయించటం చాల కష్టమైంది. చివరకు కో॥ శే॥ శ్రీ యం. వెంకట్రావుగారి సలహా ప్రకారం "కళావంతు"లని నిర్ణయించుకొన్నాం. శ్రీ వెంకట్రావుగారు గొప్ప తత్త్వవేత్త. సంస్కృతాంధ్ర భాషలలోనేగాక కర్ణాటక, ఇంగ్లీషు భాషలలో గొప్ప పండితుడు. వీరిని ఈ సంఘానికి అధ్యక్షులుగాను, నేను కోశాధ్యక్షుడుగాను నియమించుకొన్నాము

శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు సహాయం చేస్తామన్నారు. పై విషయాన్ని ఆంధ్రపత్రికలో ప్రచురించాము. అభ్యుదయవాదులు కొందరు, కళావంతుల కులంలోని ప్రముఖులు కొందరు తమతమ భావాలను ఆంధ్రపత్రికలో ప్రకటింపసాగారు. నరసాపురంనుండి శ్రీ భాస్కర్ల ఈశ్వరుడుగారు. సికిందరాబాదు నుండి శ్రీ యస్. శ్యామరావుగారు; గుంటూరు నుంచి శ్రీ మద్దెల ...? మొదలగువారు సంఘానికి తోడ్పడుదామని కూడా వ్రాశారు. కళావంతుల కులస్థుడైన నా మిత్రుడు శ్రీ వి. జె.

వెంకయ్యగారు (అగ్రికల్చరల్ ఇంజనీరు) కొంత ద్రవ్య సహాయం చేశారు. వీరి ద్రవ్యసహాయంతో ఈ ఉద్యమాన్ని ప్రారంభింగలిగాము. శ్రీమతి తిలకమ్మగారిని ఆంధ్రలో ప్రచారానికి పంపితిమి. సర్కాపురంలో ఒక కళావంతుల యువతి తన పడుపువృత్తిని మానివేస్తున్నానని బహిరంగసభలో ఆమె తన చెల్లెలితోవచ్చి ప్రతిజ్ఞపట్టి మేము స్థాపించిన "హిందూ యువతీశరణాలయం"లో చేరిరి. వారిపోషణకు శ్రీ యర్రమిల్లి నారాయణమూర్తి పంతులు గారు ద్రవ్యసహాయం చేశారు. కొందరుతల్లులు తమ చిన్న పిల్లలను నూతనసంఘ వాతావరణంలో పెంచండని మాకు ఒప్పచెప్పారు. శ్రీమతి తిలకమ్మగారు ప్రబోధించిన ప్రదేశాలలో అనేకమందిలో హృదయపరివర్తన కలిగింది. శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు ఆంధ్రపత్రికలో ఎడతెగని ప్రచారంచేసి ఈ ఉద్యమాన్ని అభివృద్ధికి తెచ్చారు. మొదటి మహాసభలో ఉద్యమానికి సంబంధించిన పత్రికను పెట్టాలని తీర్మానించి, సంపాదకురాలుగా శ్రీమతి తిలకమ్మగారిని నియమించాము. ఆమె ఉపన్యాసాల్వివటంలో ఆరితేరిన స్త్రీ. సంపాదకురాలుగా పత్రికను నిర్వహించడం ఆమె ఆశయాల్లో ఒకటి. అనాధశరణాలయాన్ని స్థాపించి, పిల్లలకు సుశిక్షణనిచ్చి మంచి వాతావరణంలో పెంచాలన్న అభిలాష, యింకేమేమో చేయాలన్న ఆమె కోరికలు నానాటికి ఎక్కువవుతూవచ్చాయి. అయితే ఆర్థిక సహాయం కావాలి. కావలసిన ద్రవ్యాన్ని

సంపాదించటాన్ని గూర్చిన భయం బాధించుతూ వచ్చింది కాని, క్రమంగా అవసరమైన ద్రవ్యసహాయం లభించుతూ కార్యక్రమం సాగుతూనేవచ్చింది. ఆమె ఉన్నతభావాలు, కోరికలు నెరవేరుతూవచ్చాయి. కళావంతులలో వివాహాలు పరిపాటి అయినాయి. 2-3 సం॥లలో ఈ ఉద్యమ నిర్వహణకు పోటీలు, కట్టులు ఏర్పడ్డాయి. సికిందరాబాదు, నర్సాపురం, గుంటూరు పట్టణాల్లో స్వతంత్ర సంస్థలు ఏర్పరచి, పోటీలుపడి వివాహాలు చేయించారు. ఆ కులనాయకులే స్వయంగా సంస్థలను నిర్వహించుకొనగలశక్తి ఏర్పడి, నా సహాయం అవసరంలేదని తోచగానే నేను తప్పుకున్నాను. అవసరంలేని సంస్థలో అంటిపెట్టుకొని ఉండడమనేది నా స్వభావమేకాదు.

ఇప్పుడు అలాంటి వివాహాలు పరిపాటే. కాని, ఆ వృత్తి నశించిందా? లేదు. సంఘంలో జరిగే సంస్కరణ ప్రయత్నాదంలో ఒక బిందువు మాదిరిగా కనుపడుతుంది. అందుకు ఎన్నో కారణాలున్నాయని ఇప్పుడు గ్రహించాను ముఖ్యకారణం ఆర్థికం. రెండవది: ఆ సంఘంయొక్క ప్రత్యేక లక్షణాలు. ♦

♦ ఈ ప్రత్యేక లక్షణాలనుగుంచి నాకు తెలిసినది: కళావంతుల స్త్రీలు సంగీత సాహిత్యాలను, లలిత కళలను ర్చుకుని ఇతర కులాల స్త్రీలకంటె నాజూకుగా ఉంటారు. రి కులంలో పురుషులకు సాధారణంగా విద్యావివేకాలు

ముఖ్యమైన అరిక కారణాన్ని గురించి ఒక ఉదాహరణ యిస్తాను. కీ॥ శే॥ బెజవాడ రామతిలకం సుప్రసిద్ధ సినిమానటి. ఆమెకు తల్లి, తండ్రి, ఒక "అక్క" వుండిరి. ఈ సంస్కరణోద్యమారంభంలో రామతిలకానికి యుక్త వయస్సు వచ్చింది. పడుపు వృత్తికి దింపాలని తల్లిదండ్రులు ప్రయత్నాలు చేస్తున్నారు. రామతిలకం అందుకు సమ్మతించడంలేదు. శ్రీమంతులు మొదటి రాత్రికి యిస్తామన్న మొత్తాలు బాగా ఆకర్షించాయి తల్లిని. నా కీ విషయాలు బెజవాడలో మిత్రులద్వారా తెలిసి రామతిలకం తల్లిని కలుసుకొని కూతురుకి వివాహంచేయమని ఎంతో చెప్పి చూచాను. తల్లి "మా కులంలో కూతురే కొడుకులాగ సంపాదించి తల్లిదండ్రులను పోషించాలి. తల్లిదండ్రులము ముసలివాళ్ళమైనాము. ఇక రామతిలకమే మమ్మల్ను పోషించాలి. లేదా, ఆమెను పెళ్ళిచేసుకున్న వాడైనా మాకు నెలకు రు30--0 లు మనోవర్తియివ్వా" లని చెప్పింది. వరకట్నాలకు అలవాడుపడిన మనసంఘంలో

గాని, నా జూకు గాని ఉండవు. వారి కులంలో తగిన భర్తలు లభించడమే దుస్తరం. అంతేకాదు, కళావంతుల దృక్పథంలో జాతిభేదాలులేవు. ఏకులంలోవారినైనా సంస్కృతి కలిగి, విశాలభావాలున్నవారిని వివాహం చేసుకొనుటకు ఆక్షేపణ వుండదు కాని, ఇతల కులాలలో విశాలభావాలు గలవారున్నా, సాంఘిక దూషణలకు వెరవని గుండె ధైర్యంగలవారు అరుదు.

అత్తమామలను అల్లుడు పోషించాలని అడగడం న్యాయం కాదని చెప్పాను. ఇంతకూ పర్యవసానమేమనగా. నెల కింతయని తన కూతురుని ఉంపుడుకత్తెగా వుంచుకోవచ్చు. అదే పెండ్లిగా భావించుకోవచ్చునని ఆమె వాదన. తన "అక్క" సంపాదించి పెడుతోంది. కాబట్టి తనకు వివాహం చేయమని రామతిలకం ఎంతో బలిమలాడినది. ఆ పిల్ల తనకూతురు కాదనీ, చిన్నప్పటి నుండీ పెంచి, ఆడదిక్కు మూలంగా జీవించుతున్నామనీ, మరెంతో కాలం పోషించవలదనీ, రామతిలకాన్ని వేశ్యవృత్తిలో దించక తప్పదనీ చెప్పింది. అలాగే దించింది.

రామతిలకం మంచి పాటకత్తె. సినిమాలలో నటిల చింది చాలా డబ్బుగడించింది. ఆమెకు పడుపువృత్తితో పనిలేదు కాని, ఆమె చిన్నప్పటి కోరిక ప్రకారం వివాహ సౌఖ్యం కుదరలేదు.

ఈ ఆర్థిక విషయం ఎంతప్రబలమైనదో వితంతూద్వాహాల సందర్భంలో వివరంగా వ్రాస్తాను. ఇలాంటి సంస్కరణ వివాహాలు చేయించుతున్న కాలంలో నాకు తెలియనట్టిన్నీ, ఇప్పుడు నేను తెలుసుకొన్న విషయం ఏమనగా, భూస్వామ్యయుగంలో అన్ని దేశాల్లోను వంశ పారంపర్యంగా భోగంవృత్తిగల జాతులు, కులాలు ఏదో ఒక రూపంలో వుంటూవచ్చాయి. ఈ రూపాలను పోగొట్టుటకు ఫ్యూడల్‌మతాలు ఎంతో ప్రయత్నించాయి గాని,

పోగొట్టుజాలవు. ముఖ్యంగాఇండియా, చైనా, జపానులాంటి దేశాల్లో ఫ్యూడల్ నాగరికత వేలసంవత్సరాలుగా ఉన్నం దున ఈ నీచవృత్తి ఒక కులంగా స్థిరపడిపోయింది. యంత్ర పారిశ్రామిక నాగరికత ఏర్పడినతరువాతనే వేశ్యావృత్తిలో వంశపరంపర్యంగావుండే పద్ధతి తొలగిపోతుంది. అయితే, ఈ నూతన సంఘంలో పడుపువృత్తి ఎన్నో రెట్లు పెరిగి పోవచ్చు. దీనిలో నిరుద్యోగమనే పెనుభూతం ఎంతోమంది స్త్రీలను పడుపువృత్తికి ఆహ్వానిస్తుంది. సోషలిజం ఏర్పడిన సంఘంలో మాత్రమే స్త్రీ తనదేహాన్ని, మానాన్ని అమ్ముకోని జీవించాల్సిన దౌర్భాగ్యం వుండదని, సోవియట్ రష్యాలో ఉండే పరిస్థితులనుగురించి వెబ్ దంపతులు, డీన్ ఆఫ్ కాంటర్ బరీ మొదలైన పెద్దల గ్రంథాల వల్ల తెలుస్తోంది.

మేము ప్రారంభించిన ఈ ఉద్యమాన్ని గురించి ఎన్నో వివరాలు, ఎందరో సహాయం చేసినవారిపేర్లు ఇప్పుడు మరచిపోయాము కాని కొందరు నన్ను మరచి పోలేదు. ఇప్పుడు విప్లవవీరుడని ప్రసిద్ధిగాంచిన శ్రీ సి. వి. కె. రావుగారు (కాకినాడ) మంతెనవారిపాలెంలో వేసని రాజకీయ పాఠశాలలో ఉపన్యాసకుడుగ, ఆచార్యుడుగ ఉండిరి. నేనూ ఒకటిరెండు ఉపన్యాసా లివ్వడానికివెళ్లాను. ఈయన నన్ను పలుకరించలేదు. "ఆయన తెల్లదొర!" నేనూ పలుకరించలేదు. "నేను అమెరికన్ దొరను." దొరలకు మూడోవాడు పరిచయం చేయాలి. అయితే

1940-42 లో మేమిద్దరం వెల్లూరు సెంట్రల్ జైలులో ఒకే గదియం దున్నాము. ఒకానొక సమయంలో నా విషయాన్ని జ్ఞాపకానికి తేగా "చంచయ్యగారు! మిమ్మల్ని గురించి నాకు చిన్నప్పటినుండి తెలుసు"నన్నారు. "ఎలా తెలుసు"నన్నాను. చిన్నప్పుడు గోచీ పెట్టుకొని కాకినాడ వీధుల్లో తిరిగే వయసులో వూరేగింపుగో "కళావంతుల సంఘానికి జై! తిలకమ్మగారికి జై! చంచయ్యగారికి జై! అని కేకలేస్తూ తిరిగామండి" అన్నారు.

వైశ్యులలో సంస్కరణ

నేను పుట్టినది కోమటికులం. కొంతకాలానికి నా కులం వైశ్యకులమనీ, నేను ఆర్యవైశ్యుడననీ తెలిసికొంటిని ముఖ్యంగా నారాజకీయ చర్యలు గదసుపార్టీలోను, సంఘసంస్కరణ కార్యాలు వైశ్యకులంలోను జరిగాయి. గదరుపార్టీలో నాకేర్పడిన స్వశక్తి, స్వప్రయత్నం సంఘ సంస్కరణరంగంలో ఉపయోగించాయి అలాగేమరికొన్ని గుణాలు కూడ నా జీవితంలో ప్రతిరంగమందు కొంచెంగా వైనా నన్ను అనుసరిస్తూనేవున్నై.

వైశ్యులందు పురాతన సాంప్రదాయాలు, మూఢాచారాలు, అభివృద్ధినిరోధకశక్తులు అధికంగా ఉన్నాయి. ఈ కులంలో అభివృద్ధిశక్తులను ప్రవేశపెట్టి, తద్వారా భారతభూమిపై జరుగుచుండే విప్లవకరమైన మార్పులను ఇష్టంతో తమసంఘములో ప్రవేశపెట్టుకొనేలా ప్రయత్నం

చడమే నా అశయం. ఈ సంఘానికి ఆంధ్రలో ఒక ముఖ్య స్థానం ఉన్నది. ద్రవ్యము,వ్యాపారాలు వీరిచేతుల్లోఉన్నై. బ్యాంకింగు, విదేశవ్యాపారం, పరిశ్రమలను అభివృద్ధి చెయ్యడం, చారిత్రకంగా వీరి విధి. వాస్తవంగా జాతీయ వాదాన్ని, స్వాతంత్రోద్యమాన్ని పెంపొందించడంవల్ల దేశ సౌభాగ్యంలో ఎక్కువలాభం పొందేవారు వీరే. ఎంతమతోన్మాదం, మూఢాచారాలు అభివృద్ధినిరోధకంగా ఉండినా, భావిలో పరిస్థితులనుబట్టి అభివృద్ధికరమగు మార్పులను సంతోషంగా ఆహ్వానించవలసివుంటారు.అవీ, యిలాంటి మరెన్నో ఆలోచనలు నా బుర్రలో ఉండేవి.

అయితే, మన దేశంలో ఏర్పడిన ఒక దౌర్భాగ్య స్థితిని మరువకూడదు. కులతత్వం చివరకు "ఎవరికి వారే" అనేలా తేల్చివేసింది. కలసి భోంచెయ్యకూడదనే ఆచారంలో చాలా అమానుషవర్తన ఏర్పడినందున ఏ కులానికి ఆ కులమే. ఏ కులసమస్యలు ఆ కులానివే. అనుకునేలా మారిపోయాయి. నా ప్రయత్నాలు గాంధీ యుగంతో ప్రారంభం (1920) అయినాయి. వైశ్యులు ద్విజులులే అయినా, సంఘంలో గౌరవం చాలా తక్కువే. "కోమట్లై పుట్టితేనేమీ మా గాంధి... ..." అని బహిరంగ సభల్లోను. ఊరేగింపుల్లోను వైశ్యులుకూడా కలిసి పాడేవారు

1920 వరకు ఈ కులం చరిత్ర క్లుప్తంగా వ్రాస్తాను. నేను ఎలాంటి పరిస్థితుల్లో రంగంలోకి వచ్చిందీ, ఎలాంటి సమస్యలు పరిష్కారం కావలసివున్నదీ, నా జయాపజయాలను గురించీ వ్రాస్తాను.

ఇండియాలో అన్నికులాల్లాగే వైశ్యకులంకూడ వైదిక బ్రాహ్మణుల ఆధిపత్యం క్రింద అణగిమణగివుంది. ఇది ఫ్యూడల్ నాగరిక లక్షణం. ఈ లక్షణం మన దేశంలో కొన్నివేల సంవత్సరాలుగా ఉన్నందున ఈ సాంఘికం మన లోపాలూ, బాధలూ కరుడుకట్టిపోయాయి. ప్రజలీ సంకెళ్ళను త్రెంచుకొని బయటపడలేక పోతూ వచ్చారు.

మనదేశంలో బ్రిటీషు ప్రభుత్వం స్థిరపడి, యంత్ర పరిశ్రమలు, శాస్త్రవిజ్ఞానము, హేతువాదము ఆరంభమై, రాజా రామమోహనరాయిగారి కృషి ఫలించి జాతీయంగా ఇతరదేశాలవలె ఇండియాకు గౌరవస్థానం కావాలనే కోరికలు, ప్రయత్నాలు ప్రారంభమైనాయి. వైశ్యసంఘం యీ భావాలను నేరుగా వినియోగించుటకు బదులుగా, మరొక విపరీతమార్గం తొక్కింది. ద్విజులమని, బ్రాహ్మణులతో సమానహక్కులు, సాంప్రదాయాలు, గౌరవ మర్యాదలు ఉండాలని, క్రమ 'తక్కువతనం' నుండి బ్రాహ్మణులతో సమానంకావాలని, వైదికులు, పూజార్లు, శంకరపీఠాలతో హోరాహోరిగా పోట్లాడి స్వపరిపాలన (అటానమీ) నెలకొల్పుకున్నారు. స్వసంఘ పౌరోహితు

లను ఏర్పరచుకొన్నారు. వైదిక బ్రాహ్మణులతో పోటీ పడి కట్టు, జుట్టు, బొట్టు విషయాల్లోనేగాక అన్యసాంప్ర దాయాల్లోకూడ వైదికులకంటె ఎక్కువ అభివృద్ధి నిరోధకు లయ్యారు. క్రొత్తదనపు ప్రొద్దిపుగడన్న సామెత ప్రకారం జరిగింది. వితంతువులకు బోడి చేయించారు. మడి, ఆచా రాలు, చూడరానితనం, అంటరానితనం అమానుషంగా పెరిగిపోతూ వచ్చాయి. విభూతి, నామం, తిరుచూర్ణం, గంధంచెక్కలు, జంధ్యాల వ్యాపారం అభివృద్ధి చెందినవి. వ్యక్తిఅభివృద్ధి, సంఘాభివృద్ధి, మానవాభివృద్ధికి సంబం ధించిన మూలసిద్ధాంతాలు తెలియనందున, గుడ్డిద్వేషాల మూలంగా గోతిలో పడ్డారు. బ్రహ్మసమాజం నచ్చక పోయినా, కనీసము రామకృష్ణపరమహంస, వివేకానందుల వేదాంతం, దయానందుని ఆర్యసమాజంవైపైనా తలెత్తి చూడలేదు మా పెద్దలు. అయితేనేం, దేశంలో అభివృద్ధి శక్తులు సంఘాన్ని ముందుకు నెట్టుతూ వచ్చాయి. ఇష్ట మున్నా లేకపోయినా ఆ ప్రవాహంలో ముందుకుపోవలసి వచ్చింది వైశ్యసంఘం.

1900 వరకు కులనాయకులకు వేదాలు, శాస్త్రాలే గాక ఆంగ్లవిద్యాధికులకుకూడా కళ్ళ తలకు వెనుక వేపున ఉండేవి. నడకేమో ముందుకే! "వేదకాలము" "రామ రాజ్యమూ" కావాలి; తెల్లవాళ్ళదాస్యమూ చెయ్యాల్సిందే పరస్పర వైరుధ్యాలు 1900 వరకూ కులనాయకుల్లో ఉంటూవచ్చాయి. తరువాత, ముందునడకకు ముందుచూపు

తోడైంది సంస్కృతం, వేదశాస్త్రాలకంటె ఇంగ్లీషు మాతమే వైశ్యసంఘాన్ని అభివృద్ధికి తేగలదనే నిశ్చ యానికి వచ్చారు. అంతకంటె శరణ్యం లేదని కో॥ నో॥ శ్రీ వంకు నారాయణస్వామిశెట్టిగారు ఆచరణలో పెట్టు టకు ప్రయత్నించారు.

వీరు అప్పటి కనుగుణ్యంగా ప్రబోధించుటకు 'వైశ్య' పత్రికను సాపించి, ఇంగ్లీషు విద్యాధికులను సంఘటిత పరుస్తూ సంఘాన్ని ముందుకునెట్టుకుపోయారు. వైశ్యవిద్యా ర్థి గృహాలు, విద్యార్థి వేతనాలమూలంగా వకీళ్ళు, డాక్టర్లు, ప్రభుతోద్యోగులు. ఇతర విద్యాధికుల సంఖ్యను పెంపొం దించారు. వైదికుల, శంకరపీఠాలవైపు చూడనైనా చూడ లేదు. కాని, కొందరు "అదిగో తోడేలు" అంటూ మహా సభల్లో తీర్మానాలద్వారా చచ్చిన పామును కొడుతూనే వుండిరి. 1921 వరకు యీ రెండు పోకడలు వైశ్యసంఘంలో వుంటూవచ్చాయి.

1920 లో క్రొత్తపోకడలు ప్రారంభమైనాయి. గాంధీ యుగం ప్రారంభమై ప్రజలందరిని సంఘటితపరచి అతివేగంగా సంఘాన్ని పరుగెత్తించసాగారు. యువకుల ఉద్రేకాలు వృద్ధుల భయాలు శీఘ్రంగానే వి. కూలాల పెద్దలు గిద్దలవుచుండిరి.

వైశ్యసంఘంలో నూతనపోకడ - అంటే మూడవ పోకడ ఎర్పడింది. గవర్నమెంటు ఉద్యోగాలు మానెయ్యా

లని, స్వాతంత్ర్య పోరాటంలో జైళ్ళకు వెళ్ళాలనే తీవ్ర భావం వైశ్యసంఘంలో కూడా ఆరంభమైంది.

విశాఖపట్టణంలో 1920_21 లో ఆర్యవైశ్య మహా సభ జరిగింది. నేనూ వెళ్ళాను. అధ్యక్షులు: బారిష్టరు ఆది నారాయణ శెట్టిగారు. (సేలం) సెక్రటరీ. ♦ శ్రీ సుంకు సుబ్రహ్మణ్యం శెట్టిగారు బి. ఎ., శ్రీ సొలసా బాపనయ్య గారు బి. ఏ. బి. యల్., గార్లతో కలిసి ప్రయాణం చేశాను. రాజమండ్రి స్టేషనులో లింగధారి వైశ్యకుల నాయకులు మమ్మల్ని కలుసుకున్నారు. తమకు మిగతా వైశ్యులతో తిరిగి (షుమారు 500 సం॥ తరువాత) సహపంక్తి భోజనాలు అవసరమని కోరారు. లింగధారులకు సాంప్రదాయం ప్రకారం సహపంక్తి భోజనం పెట్టకూడదనే పార్టీ నాయకులు సామర్లకోట స్టేషనులో కలుసుకొని మార్పు చేయకూడదని గట్టిగా వాదించారు. సహపంక్తి భోజనానికి కార్యాచరణలో ఎలాంటి అభ్యంతరంలేని ముగురు నాయకులు గోడమీది పిల్లివాటంగా "సహపంక్తి భోజనాలకు సమ్మతిస్తూ తీర్మానం ప్యాసుచేయిస్తాం. కాని, కాన్ఫరెన్సులో ఆచరణలో పెట్టడం సాధ్యం" కాదని

♦ వీరు మద్రాసులో వైశ్యహాస్టలుకు వార్డెనుగా ఉండిరి. (1908–20) వైశ్యులలో ఆంగ్లేయవిద్యను వ్యాపింప చెయ్యాలని చాలా ప్రయాస పడినారు. నాలాంటి బీద విద్యార్థులను ఎంతో అభివృద్ధికి తెచ్చిరి.

హనుమంతునిలాంటివాడు; చూచిరమ్మంటే తగలబెట్టి వస్తాడు. "ప్రతిపక్ష నాయకులు న్యాయంగా నడుచుకోక పోతే వారి ప్రాణాలు దక్కవన్నాడు. రాత్రి ఎనిమిది గంటలకు తీర్మానం గెలవగానే ముగించి, ఎనిమిదిమంది లింగధారులను భోజనశాలకు తీసుకెళ్ళి భోంచేశాము. ప్రతిపక్ష నాయకులు వేరేగదిలో భోంచేసి, మూటా ముల్లె కట్టుకుని వెళ్ళిపోయారు. ఈ విజయం మరికొన్ని సంఘసంస్కార తీర్మానాలకు పురికొల్పింది. రజస్వలానంతర వివాహాలు, వితంతూద్వాహాలు చేయవచ్చునని తీర్మానించాము.

ఈ కాన్ఫరెన్సులో వైశ్యసంఘానికి నూతననాయకులం ఏర్పడ్డాము. కె యస్. గుప్త, అత్యం నరసింహమూర్తి, మాజేటి రామచంద్రరావు, నేనూ ఈ మార్పులకు కారణం. కాన్ఫరెన్సు పూర్తికాగానే మేము నలుగురము కలుసుకొని ఏకీభావానికి వచ్చాము. ప్రతి కాన్ఫరెన్సుకు ముందుగా మేము కలుసుకోవాలనీ, మేమందరం కలసి తీర్మానించుకొన్న ప్రకారం పనిచెయ్యాలనీ, మాలాంటి అభిప్రాయాలుగల యువకులనుమాత్రమే మేము కలుపుకోవాలనీ, మా అభిప్రాయాలకు వ్యతిరేకంగా జరుగుతుందని తోచితే కాన్ఫరెన్సులు జరగకుండా భగ్నంచేయాలనీ తీర్మానించుకొంటిమి. అలాగే నాటకం జయప్రదంగా నడిపాము. దీన్నిగురించి ముందు వివరంగా వ్రాస్తాను.

కొన్ని తప్పులు నన్ను వెన్నంటుతూనేవచ్చాయి. చెరరిష్టుపంథా, గొఱిల్లాపద్ధతులు చాలాకాలం నన్ను వదలిపెట్టలేదు. ఈ సభలో ఒక తప్పుచేశాను. సభకు వచ్చిన వృద్ధనాయకులలో శ్రీ శనగపల్లి రామస్వామి గుప్తాగారు ఒకరు. వీరు గొప్ప వక్త ఆకాలంలో ప్రజలను ఆకర్షించగల సమర్థుడు. వితంతూద్వాహాలనుగురించిన తీర్మానాన్ని ఆయన ప్రతిఘటిస్తారని నిశ్చయంగా తెలిసింది. ముందుగానే ఆయన్ను "కొనెయ్యా"లని కొందరు యువకులు ఆయనకు "వైశ్యరత్న" బిరుదు నిస్తామనీ యువకులకు అడ్డుతగలవద్దనీ ఆశపెట్టిచూచారు. కాని, ఆయన సమ్మతించలేదు; తటస్థంగా ఉండటానికికూడ అంగీకరించలేదు. అప్పుడు నన్ను ఒప్పించమన్నారు. మహాసభ ఒకపెద్ద నాటకశాలలో జరుగుతోంది. తెర చాటుకు గుప్తగారిని పిలిపించి ఎంతో చెప్పిచూచాను. ఉపయోగం లేకపోయింది, ఆ తీర్మానం పూర్తిఅయ్యే వరకూ ఆయన సభలోకి పోకుండా కుర్చీకి కట్టివెయ్యమని వాలంటీర్లతో చెప్పాను; కట్టేస్తే గట్టిగా అరుస్తాననన్నాడు; నోటిలో గుడ్డ కుక్కుతానన్నాను; ముందే అరుస్తాననన్నాడు గుప్తాగారు. విధిలేక విడిచిపెట్టాము. కాని, సభలో గట్టిగా అడ్డుపడలేదు. వెంటనే "వైశ్యరత్న" అనే బిరుదును యిచ్చేశాము.

ఆంధ్రదేశంలో దేశభక్తులు "ఆంధ్రరత్న" బిరుదును శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారికి యిచ్చే ముందే వైశ్యకులంలో "రత్న" అనే బిరుదును మా కుల గౌరవానికి లోటులేకుండా వుండాలనే ఉద్దేశ్యంతో ఒక "రత్నాన్ని" సృష్టించాము. వైశ్యకులాన్ని యిన్నిరి యాంటీకాంగ్లెక్కు బాధపెట్టుతున్నది. శ్రీ ముత్తా వెంకట సుబ్బారావుగారు హైకోర్టుజడ్జీ కావడంతో వైశ్యకుం చాలా బాగుపడ్డది; వారికి తోడుగా శ్రీ సుందరంచెట్టి గారుకూడ హైకోర్టుజడ్జి కావడంతో అలాంటి కాంగ్లెక్కు చాలవరకు తగ్గింది. అందువల్ల వెనుకపడ్డ కులాలవారికి చెప్పి ఉద్యోగాలు, మంత్రిత్వాలు యిచ్చి, సంఘసేవకు అవకాశం యివ్వటంవల్ల త్వరలో ఆ కులాలను పైకి తీసుకురాగలమనీ, అందువల్ల దేశం అభివృద్ధికి రాగలదనీ నా అభిపాయం. ఈ నా వాదనను విన్న బ్రాహ్మణ కులాభిమానులు యోగ్యత ముఖ్యమని వాదించేవారు. ఇలా వాదులాడుతున్నంతవరకు కులతత్వవాదం పోదనీ, జాతీయతత్వం వృద్ధికి రాజాలదనీ నా అభిప్రాయం.

అందువల్ల కొందరు నన్ను "కులతత్వవాది" అని నిందించారు. వాస్తవానికి జాతీయోద్యమానికి తోడ్పడమే నా పని. దూరదృష్టిలేనివారు నా వుద్యమములోని అభ్యుదయాన్ని చూడలేకపోయారు.

విశాఖపట్టణం మహాసభ తరువాత 2, 3 సం॥ల వరకు కాన్పరెన్సుమాటే ఎవరూ ఎత్తలేదు. రజస్వలానం

తర వివాహాలు, వితంతూద్వాహాలను గురించిన తీర్మానాలు పాతనాయకులను భయపెట్టేశాయి. ఎలాగైనా మహాసభను జరిపించాలనుకొని, గుంటూరు వెళ్ళి వైశ్య నాయకులలో ముఖ్యుడు- కులాన్ని ఒకప్పుడు వృద్ధికి తెచ్చిన శ్రీ మద్ది వెంకటసుబ్బయ్యగారి మూలంగా కొన్ని రెన్నుకు ఏర్పాటు చేయించాను. అప్పట్లో గుంటూరు తీవ్రజాతీయ వాదానికి, వైశ్యుల వైదికచాదస్తానికి ఆంధ్రలో ఆటపట్టు. ఈ చాదస్తానికి శ్రీ చీమకుర్తి బసవయ్యగారు ముఖ్యులు. మద్ది వెంకటసుబ్బయ్య, బసవయ్యగార్ల మనసులు, ఆశయాలు, ఆత్మలు ఒకటే. అయితే, బసవయ్యగారు ఉపాయశాలి. ఎత్తులమీద ఎత్తులు వేసి క్రిందపడినా తనదే జయమనే సాహసి. పట్టుదల గలవాడు. విశాఖపట్టణంలో చేసిన సంఘసంస్కార తీర్మానాలను రద్దు చేయించుటకే గుంటూరులో మహాసభను ఏర్పాటు చేశామని చాటించి, పూర్వాచారపరాయణులును, బ్రాహ్మణ ద్వేషులు, మూఢాభిప్రాయాలుగల వారిని రెచ్చగొట్టి సంఘసంస్కారప్రయత్నాలను భగ్నం చేయటానికి శ్రీ బసవయ్యగారు కృషిచేశారు. వేలమందిని కొన్నరెన్నుకు వచ్చేలా ప్రచారంచేసి జయించాడు. అంతేకాదు; అధ్యక్షులుగా తమతో ఏకీభవించే వేదాంతి శ్రీ గ్రంథి...? గారిని కోయంబత్తూరునుంచి రప్పించారు. ఈ అధ్యక్షుడు లౌకికుడు కాడు; శక్తిసామర్థ్యాలులేవు; రెండు పార్టీలవారు పోట్లాడుకొనే సభను సవరించుకోగల

అధ్యక్షుడు అప్పటికే ముఠా తగాదాలవల్ల తలనొప్పితో బాధపడుతున్నాడు. తలనొప్పివల్ల తా మిక మహాసభను నిర్వహించలేమనీ, తమపైనే శ్రీచల్లా గురుస్వామిశెట్టిగారిని నియమించినట్టున్నా వ్రాయించి శ్రీ గురుస్వామిశెట్టిగారిని అధ్యక్షుణ్ణి చేశాము. వ్యతిరేకులు అందుకు సమ్మతించలేదు. సభలో రెండుపార్టీలూ కొట్టుకోబోయారు. పోలీసులను పిలిపిస్తానని బెదిరించి చూచి, చివరకు మహాసభను ముగించారు శ్రీ గురుస్వామిశెట్టిగారు.

మేమే గెలిచాము; కాని, ఒక యువకనాయకుడు శ్రీ గోనుగుంట్ల సుబ్రహ్మణ్యంగారు (గుడివాడ) మా తీర్మానానికి వ్యతిరేకంగా వెంటనే మరొక సభ పెట్టాడు; కాని, నిర్వహించుకోలేక మానేశాడు.

మా అతివాద కార్యవర్గం కలుసుకొన్నది. ఆ సమయానికి శ్రీ మద్ది వెంకట రంగయ్యగారు వచ్చారు. వారిని సాక్షిగా కూర్చోబెట్టి 1. వితంతూద్వాహాలు చేయించాల్సిందేనని, 2.వివాహితులకు కుల బహిష్కారం వచ్చేయెడల మేమూ ఆ బహిష్కారములను అనుభవించి తీరాలనీ, 3. మా మా కుటుంబాలనుండి మమ్మ్ తరిమివేసినా వెళ్ళిపోవలసిందేగాని జంకరాదనీ, (4) కార్య చరణలో పెట్టగల దరిశి చంచయ్య కార్యదర్శిగా ఉండాలనీ తీర్మానించుకొని ప్రమాణాలు చేసుకొని వెళ్ళి

పోయాము. నేను కార్యచరణలో ఎలా పెట్టిందీ మరొక చోట వ్రాస్తాను.

ఈ గుంటూరు మహాసభలో నా పొరపాటు అలవాటు వల్ల ఒక దౌర్జన్యం జరిగింది. శ్రీ శంకరాచార్యులై న కాల్యాణానందభారతిగారి ముఖ్యశిష్యుడు శ్రీ పాకయాజి మీద మేము పగ తీర్చుకొన్న సంఘటనే అది.

శ్రీ కల్యాణానందభారతి బి. ఎ. గుంటూరువారి సభలో బసచేసి గీతా పన్యాసాలు యిచ్చుచుండిరి. (1923 లో కావచ్చు) గొప్ప విద్వాంసుడని, తార్కికుడనీ, వక్త అనీ, గొప్ప అందగాడనీ చెప్పి మిత్రులు నన్ను గీతాకాలక్షేపానికి తీసుకెళ్ళారు. అప్పుడు గీతలోని ఒక శ్లోకం చదివి నాలుగుకులాలు మాత్రమే ఉన్నట్లు చెప్పి ఛండాలులను హిందూసంఘములో చేర్చుటకు ప్రయత్నిస్తున్న నాయకులందరిని తిట్టారు. చివరకు గాంధీగారిని కూడా తూలనాడారు. "వాడికి రిజిష్టరునోటీసు యిచ్చాను; కాని, వాడు నాకు జవాబివ్వలేదు" అన్నాడు. నేను తోక తొక్కిన తాచులాగా లేచాను. "ప్రజల గౌరవంపొందిన నాయకులను తూలనాడిన మాటలను ఉపసంహరించుకో" మన్నాను. అందుకాయన లక్ష్యపెట్టలేదు. "మాకు గీతో పన్యాసాలమీద ఎంత ఇష్టమున్నా, జాతీయ నాయకులను తూలనాడడం దేశభక్తులమైన సభికులము సహించలేము, వెంటనే ఉపసంహరించుకోవాల్సిందే"నని మళ్ళీ చెప్పాను. తన ఉపన్యాసం నాకు నచ్చకపోతే వెళ్ళిపోవచ్చుననన్నాడు.

"గుంటూరు పురజనుల దేశభక్తి ఎలాంటిదో అతనికి తెలియదనీ, నేను వెళ్ళిపోతే అందరూ వెళ్ళిపోతారనీ, వెంటనే తనతప్పును సవరించుకోమనీ" మరల సలహా యిచ్చాను. కాని, ఆయన వినిపించుకోలేదు. నేను బయటికి వచ్చాను. నాతో సభికులందరూ వచ్చారు. నాకు ఆశ్చర్యంవేసింది ఇంతటితో చాలదని, ఆయనకు ఒకపాఠం నేర్పాలనుకొని వెంటనే ఒక కరపత్రం అచ్చువేయించాను. రెండువాక్యాలు మాత్రమే వ్రాశాను: "మహాత్మా గాంధీ మొదలైన జాతీయ నాయకులను తూలనాడి మాట్లాడే శంకరాచారి- కల్యాణానందభారతిగారి విషయంలో దేశభక్తులైన గుంటూరు ప్రజలు తమ ధర్మమేమో నిర్ణయించుకోవాలి" అని వ్రాశాను. నా స్నేహితులు అచ్చువేయించి పంచిపెట్టారు. ఆనాడే నే నప్పుడు కాపురముంటున్న భీమవరానికి వెళ్ళిపోయాను.

ఇది పెద్ద తగాదాగా మారిపోయింది. కొందరు దేశభక్తులు చీరాలవెళ్ళి "ఆంధ్రరత్న" దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారికి రిపోర్టు చేశారు. వారు ఒక ఉపన్యాసానికి రహస్యంగావెళ్ళి ఒకమూల కూర్చుని పంచములనుగూర్చి తన శిష్యులచే ప్రశ్నలు వేయించి, సవాలు చేసి, ఇద్దరూ ఒక బహిరంగసభలో ఉపన్యసించేటట్లు నిర్ణయించుకొన్నారు. ఆ సభ స్వామి బసచేసియున్న గుంటూరువారి సత్రంలోనే జరిగేలా ఉభయులు సమ్మతించారు.

ఈ సభకు ప్రజలు తిరుణాలకువలె వచ్చారు. ఇంత మందిని చూడగానే స్వాములవారు జడిసి సత్రం లోపలి గడియలు బిగించుకొని బయటికి రావటానికి నిరాకరించాడు. ఆంధ్రరత్నం ఎంత హామీ యిచ్చినా స్వామికి ధైర్యం రాలేదు. ప్రజలు సత్రంమీద రాళ్ళవర్షం కురిపించారు. సత్రంలోనుండి వెళ్ళిపొమ్మని స్వామిని ఆజ్ఞాపించారు.

స్వామి అర్ధరాత్రివేళ తెనాలికి పారిపోయారు. దేశభక్తులు, పీఠాధిపతులను ద్వేషించేవారూ ఏకమై, తెనాలి వెళ్ళి తరిమివేయించారు. అలాగే ఆయనవెంటపడి బాపట్ల, నెల్లూరుల నుండి కూడా తరిమివేయించారు. వైశ్య యువకులు చాలా పట్టుదలతో పనిచేశారని నా మిత్రులు తెలిపారు.

ఈ కారణంవల్ల శంకరాచారి శిష్యుడు శ్రీ పాక యాజి తమ పత్రికలో నాలాంటివారి నందరిని అన్యాయంగా దూషించుతూ నీచంగా వ్రాస్తూ ముఖ్యంగా నన్ను "చిత్తకార్తికుక్క" అని వ్రాయుచుండెను. ఈ వ్రాతలను నేను లక్ష్యపెట్టలేదు

గుంటూరు ఆర్యవైశ్య మహాసభకు పత్రికా ప్రతినిధిగా వచ్చాడు ఆ పాకయాజి మహాశయుడు ఈయన సాహసానికి వైశ్యయువకబృందానికి కోపంవచ్చింది. వారికి

ఏమిచెయ్యాలో తోచలేదు. వారిలో ముగ్గురు నాయకులు- వుప్పుటూరి పున్నారావుగారు, గుంటూరు నరసింహారావు గారు, జమిలి నమ్మళ్వారుగారు ఆయన్ను తన్నించితే చూడాలని కుతూహలమున్నట్టు చెప్పారు నాతో. మహా సభలో తన్నించకూడదు, బయట తన్నించితే మంచిదని సలహాయిచ్చాను. ధైర్యంగల ముగ్గురు వాలంటీర్లను యిమ్మని వాలంటీర్ల కెప్టెను శ్రీ గుంటూరు నరసింహారావు గారిని అడిగాను. వాలంటీర్లతో చెయ్యవలసిన పని చెప్పాను. ఒప్పుకున్నారు. ఎవరోబయట పిలుస్తున్నారని శ్రీ పాకయాజికి ఒక చీటీయిచ్చారు; బయటికి రాగానే కొంతదూరం తీసికెళ్ళి కారణంచెప్పి కొట్టారు. ఒకటి రెండు కోమటిదెబ్బలకే బ్రాహ్మడు క్రిందపడ్డాడు. అంతలో ఒక కాపలావాడు కేకవేసేటప్పటికి వాలంటీర్లు పారిపోయి శిబిరంలో దాక్కున్నారు శ్రీ పాకయాజి బెల్లంకొట్టిన రాయిలా ఏమీ జరుగనట్టే గౌరవం నిలబెట్టుకోవాలని నటించాడు. సభలోకి రాగానే 'ఎవరు కొట్టారు? ఎందుకు కొట్టా'రని అడిగాను. నోరు తెరవడే! చుట్టూ గుంపు గూడారు. "పాజయాజిని కొట్టాల్సిందే" నన్నారు. ఆయనను మళ్ళీ కొట్టకుండా నేను "రక్షించి" బయటికి తీసుకెళ్ళి, జట్కాలో ఎక్కించి, వాలంటీరును తోడిచ్చి "నేను దరిశి చంచయ్యను; కొట్టించింది నేనే: నీ యిష్టం వచ్చినట్టు తిట్టి క్రాసుకో" అనగానే వణికిపోయాడు

మహాసభనుగురించి వ్రాయడంలో నన్ను భాగా ప్రశంసించాడు. "ఎంత సుళువుగా కొట్టించావు!" అని నరసింహారావు వగైరా అన్నారు. ఇలాంటి పెరడిష్టు కార్యాలు అభివృద్ధినిరోధకులనీద చాలాకాలం ప్రయో గిస్తూనే వచ్చాను.

వితంతు వివాహాలు

ఆంధ్రదేశంలో అదివరకే వితంతువివాహాలు చేయించారు. శ్రీ వీరేశలింగం పంతులుగారు, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు సంస్థలను ఏర్పరచి, అనేక కష్టాలకు గురియై తమ ఉద్యమాలను సాగించారు. వారు ఎట్టి పరిస్థితులలో చేయించారో వివరాలు గ్రహించాను. వ్యక్తిగతంగా మాత్రమే చేయించారు. సంఘాన్నంతటిని తమ ఉద్యమానికి సమ్మతించేలా చెయ్యలేకపోయారు. మొండిధైర్యముగలిగి, గొప్ప సంస్కృతిగలవారుమాత్రమే అలాంటి వివాహాలు చేసుకున్నారు. నా కాలంలో గాంధీ గారి ప్రజావుద్యమం జోరుగా సాగిపోతోంది. రాజకీయ చైతన్యం వృద్ధిచెందుతోంది. వితంతు వివాహసమస్యను సంఘమంతటి సమస్యగా మార్చగలమనే నమ్మకం నాకు 1924-1925 కే ఏర్పడింది. అది ఒక సంధియుగం. యువకు లను ప్రత్యేకంగా సంఘటితపరచి వృద్ధులను ఓడించాల్సిన కాలం. అలాగే చేశాను.

లోగడ సనాతనులకు ఒకే ఆయుధం - కులబహిష్కారం వుండేది. అయితే గాంధీయుగంలో ఈ ఆయుధానికి పదునుపోయి తుప్పుపట్టింది. ఇక యువకులను సంఘటిత పరచడంతో ఆధారపడివున్నాయి జయాపజయాలు.

లోగడ శాస్త్రువాదనకు బలముండేది. కాని, గాంధీయుగంలో జాతీయవాదానికి, చారిత్రకవాదాలకు బలమెక్కువైంది.

ఈ విషయాలను మిత్రుడు శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారితో చెప్పాను. ఆయన ఒక విషయాన్ని నొక్కిచెప్పారు. హిందూసంఘంలో కులాలమధ్య భోజన విషయంలో ఉన్నంత పట్టింపు కామానికికూడా లేదనీ, ఒక కులంవారు మరొక కులంవారితో కలసి బిడ్డలను కన్నప్పుడుకూడా రహస్యంగానైనా భోజనాలు కలసి చెయ్యలేదనీ, సహపంక్తిభోజనాలు ప్రజామోదమైనప్పుడు వర్ణాంతరవివాహాలుకూడా జరుగుతాయనీ, ఆ తర్వాత కులాలు నశించిపోతాయనీ చెప్పారు. గాంధీయుగంలో అప్పటికే సహపంక్తిభోజనాలు జైళ్ళలోను, సభలలోను ప్రజామోదమవుతున్నాయి.

ప్రభుత్వంకూడ అందుకనుకూలమైన శాసనం చేసింది. వితంతువివాహం చేసుకొన్నవారిని సంఘంనిషేధించినచో అట్టి చర్యలలో పాల్గొన్న ప్రతివ్యక్తికి ఆరునెలలు కారాగారవాసము, రు.1000ల జరిమానా విధించబడునని ఆ

చట్టంలోవుంది. బిడ్డలకుఆ స్తిహక్కులు ఉంటాయి.మిత్రుడు శ్రీ చింతగుంట సుబ్బయ్యశాస్త్రిగారు (బళ్ళారి) వితంతు వివాహాలకుగల శాస్త్రాధారాలను వ్రాసియిచ్చిరి వితం తూద్వాహాల చరిత్రనుగురించి శ్రీ కామరాజు హనుమంత రావుగారు (రాజమండ్రి) వ్రాసియిచ్చారు. అవి బాగా వుపయోగపడినై.

అంతవరకూ వైశ్యసంఘంలో వితంతువివాహాలు చేసుకొన్నవారు ముగ్గురుమాత్రమే. ఆ ముగ్గురిని సంఘం బహిరంగంగా బహిష్కరించకపోయినా, ఆచరణలో స్వకులసంఘం బహిష్కరించినది. వారు ముగ్గురు :

1. శ్రీ నరసేపల్లి చన్నప్పశెట్టిగారు. (బళ్ళారి)

2, శ్రీ గరుడా హనుమంతరావుగారు. (మద్రాసు)

3. శ్రీ ముత్తా వెంకటసుబ్బారావుగారు. (మద్రాసు)

ఈ ముగ్గురిని కులంలో చేర్పించి సహపంక్తిభోజనాలు జరి పితే నా ఉద్యమం బలపడుతుందని, అంతవరకు క్రొత్తగా వితంతూద్వాహాలు చేయించకూడదనీ నిశ్చయించుకు న్నాను. బళ్ళారి వెళ్ళి శ్రీ గుడుదూరు తిమ్మప్పశెట్టిగారి సహాయంతో కొందరు వైశ్య ప్రముఖులు శ్రీ చన్నప్ప శెట్టిగారితో కలసి భోంచేసేలా చేసితిని. వైశ్యసంఘం మట్టితిన్న పాములా మిన్నకున్నది. కాని, సంఘాన్ని కదల్చ లేకపోయాను. కలిసి భోంచేసేవారికి సంఘబహిష్కారం

కాని, మరే కష్టాలుకాని వుండవని తెలియగానే చన్నప్ప గారికి బంధుమిత్రులు బాహాటంగా తమయిండ్లలో భోజనం పెట్టసాగారు. ఇది బళ్ళారిలో మాత్రమే జరిగింది.

మద్రాసులో అలా కాదు. ఇక్కడ సంఘంలో చాందస్తం చాలా ఎక్కువ సాంఘికంగాను, జాతీయంగాను చైతన్యం తక్కువ. ఇంగ్లీషుచదివిన వారిలోను, ద్రవ్యవంతులలోను మన కెందుకులే అన్న భావం జీర్ణించివుంది. ఇలాంటివా రందరిని కలపడనూ, కార్యం నెరవేర్చడమూ సాధ్యంకావిపని కాబట్టి ముందు ఇతరపట్టణాల్లోమారువ్వాస్తే తర్వాత మద్రాసు వైశ్యసంఘంలో అదే వస్తుంది.

తలవని తలంపుగా ఒక ఘటన జరిగింది. 1925 డిశెం బరులో థియసాఫికల్ సొసైటీ జూబిలీ అడయారులో జరుగుతుంటే నేను వెళ్ళాను. ఘనూరు 200 మంది వైశ్యులు వివిధ ప్రాంతాలనుండి వచ్చారు. వారందరూ ఆ సొసైటీలో సభ్యులు. వారిలో సంఘసంస్కరణాభిలాష బాగావుంది. వారందరిని కలపడం మరొకవిధంగాకూడా సులభమే. థియసాఫికల్ సొసైటీ సభ్యులకు పెదపెద ప్రభుత్వోద్యోగులపట్ల చాలా గౌరవము, హైకోర్టుజడ్జి శ్రీ ముత్తా వెంకటసుబ్బారావుగారు, నేను ఒక విందు చేశాము. జయప్రదంగా జరిగింది. కాని మద్రాసు వైశ్య సంఘంలో శ్రీ సామి వెంకటాచలంశెట్టిగారు. ఒకరే వచ్చారు. వారికి కష్టాలు ప్రారంభించాయి అయితే.

వారికి బంధువు వైశ్యసంఘనాయకులు అయిన శ్రీపొత్తూరు అయ్యన్న శెట్టిగారు రాబోవు కష్టాలను గుర్తించి ఏదో పెద్ద విందు చేసి, సామిని కలిసేశాడు. ఆ కాలంలో కుల బహిష్కారం అంతగా బాధించేది.

వైశ్యయువకుల ముందంజ

అప్పుడే మరొక అనుకూలం జరిగింది. మద్రాసులో శ్రీ తుంపూడి భగవంతగుప్తగారు వుండేవారు. ఆయన వైశ్యకులానికి ఎప్పుడూ ఏదోఒక మేలు చేస్తూనేవున్నారు. వైశ్యయువజన మహాసభ జరుపనెంచి నా సలహా, సహాయం కోరారు. నా ఉద్యమానికిది మంచి ప్రయోజనకారియని గ్రహించి సహకరించాను. దీనిసహాయంతో ఆర్యవైశ్య మహాసభను లొంగదీయవచ్చు. 30 సం॥ లోపు గలవారిని మాత్రమే యువజనులుగా నిర్ణయించమని చెప్పి, ప్రథమ మహాసభకు అధ్యక్షుని పేరుకూడా నేను సూచించాను. కాని, నన్నే అధ్యక్షుడుగా ఉండమని కోరారు. నా వయస్సు 35 సం॥ లని తెలిపాను. వారి నిబంధనలలో యువకుల వయసు 35 సం॥ లుగా మార్చి నన్నే అధ్యక్షునిగా నిర్ణయించారు.

వితంతూద్వాహాల ఉద్యమానికి, ఇతర సంఘ సంస్కరణలకు ఈ సంస్థ బాగా ఉపయోగపడింది. ఈ యువకసంఘం నా కష్టపరంపరలను దాటించి చివరకు వృద్ధులను నెట్టేసి వారి ఆటకట్టించింది.

ముఖాల్లో నిరుత్సాహం, నిస్సహాయత తాండవమాడు తున్నై.

సభను ఒక హాస్యనాటకంగా మార్చదలిచి, మీ తీర్మానాన్ని నే నేమీ లక్ష్యపెట్టను; మీ సంఘం నన్నేమి చెయ్యగల''దని ప్రశ్నించాను. కులంలో వెలివేస్తా మన్నారు. నాకు కులం పోయిందన్నాను. ఏడేళ్ళ వైశ్యులయింట భోంచెయ్యలేదు. విదేశాల్లోను, బ్రిటిష్ లోను, అన్ని జాతులవారితో, మతాలవారితో, కులాల వారితో నా జీవితం గడిచింది. ఆ విధంగా పోని కులం వితంతూద్వాహం చేసుకొన్న వైశ్యులతో భోంచేసినంత మాత్రాన పో''దని హేళనచేశాను. వారి తీర్మానం గుంటూరు వైశ్యులకుమాత్రమే అన్వయిస్తుందనీ, ఇతరులకు అన్వయించదనీ, ఇతరచోట్ల అందరమూ పంక్తి భోజనం చెయ్యవచ్చుననీ వాదించాను.

శ్రీ మద్ది వెంకటసుబ్బయ్యగారేమో తబ్బిబ్బయ్యారు. కాని ''చెంచయ్యమాట వినవ''ద్దని సలహా యిచ్చాడు. రేపటి వివాహానికి రాబోయేది ఆయన బంధువులేననీ, యిచ్చిపుచ్చుకొనే ఇరువైపులవారు పాల్గొంటా రనీ, జాగ్రత్తపడమనీ వెంకటసుబ్బయ్యగారిని బెదిరించాను. ఉపయోగపడలేదు. గుంటూరు వైశ్యయువకులు నా పక్షమేననీ, గుంటూరు వైశ్యసంఘాన్ని పార్టీలుగా చీల్చడం నా కిష్టంలేదనీ, వారెవరూ వివాహానికి రావల

సిన అవసరం లేదనీ సలహాయిచ్చాను. వారి తీర్మానాన్ని నే నొక్కడనే ఆక్షేపించాననీ, తీర్మానం ప్యాసయిందనీ అంగీకరించాను. "పదిహేను రోజుల్లో ఆ తీర్మానానికి అంత్యక్రియలు చేస్తా"నని చివరకు వార్నింగిచ్చాను. ఆ విధంగా సభ ముగిసింది.

సభకు శ్రీ చీమకుర్తి కుమారస్వామిగారు అధ్యక్షులు. నాకు చిరకాలమిత్రుడు. సభ పూర్తిఅయిందిగదా, యిక వెళ్దాంరమ్మని పిలిచాడు. నా మాటలను అపార్థంచేసుకుని, భయపడవద్దనీ, నన్ను జాగ్రత్తగా బయటకు తీసుకెళ్తా"ననీ అన్నాడు. "ధైర్యవంతులను నువ్వు చూచివుండవు; ఇప్పుడైనా చూడు"మని గుంపులో కలిశాను. "చంచయ్య," అని అందరూ నిలబడి నాకు దారి యిచ్చారు. అప్పుడు నాకు వారు చూపిన గౌరవాన్ని చూచి, పునర్వివాహోద్యమము గుంటూరులో ముందుముందు జయిస్తుందనే నిశ్చయించుకున్నాను.

కార్యచరణసంఘ సభ్యులంతా వివాహానికి వచ్చారు. వారు తమలాంటి తీవ్రవాదులను, ధైర్యశాలురను వెంటే తెచ్చారు. మద్దివారి బంధువులు - చీరాల పట్టాభిరాములు గుప్తగారు, ఏలూరు మాజేటి రామచంద్రరావుగారు వచ్చారు. వీరందరూ వెంకటసుబ్బయ్యగారి యింటికి వెళ్ళారు. వారిని చూడగానే ఆయన మేడమీది గదిలోకి పోయి తలుపువేసుకున్నారు. తలుపు తెరవ

నందున విసుగెత్తి తిరిగివచ్చారు. వారితో మాట్లాడ టానికే వెంకటసుబ్బయ్యగారికి మనోధైర్యం లేక పోయింది.

వివాహానికి అనేకమంది వచ్చారు. అభివృద్ధినికోరే అన్యకులాలవారుకూడ వచ్చి అభినందించారు. గుంటూరు వైశ్యుల్లో నేరెళ్ళ సుబ్బారావుగారు, గ్రంథి సుబ్బరాయ గుప్తగారు మాత్రం వచ్చారు. వారిని మాతో కలిపి భోంచెయ్యనియ్యలేదు. బ్రతిమలాడి వారిని యిండ్లకు పంపి వేశాను. లేనిచో వారికి కులంలో వెలితప్పదు. కష్టాలకు ఓర్చుకోలేరు.

సాయంత్రానికి వూరేగింపు ప్రారంభించారు. ఇది నాకేమాత్రం యిష్టంలేదు. తగాదాలు వస్తాయి. సహపంక్తి భోజనాలు మాత్రమే ముఖ్యం. మేళంలేకుండా ఊరేగింపు బయలుదేరింది. ఒక అద్దెకారులో వధూవరులను ఎక్కించాము. వధువు వయసు పాతికసంవత్సరాలనీ, ముగ్గురు బిడ్డలు పుట్టి పోయారని, ఏవేవో పుకార్లు వేశారు వ్యతిరేకులు, ఈ పుకార్లను, మాఢాభిప్రాయాలను పోగొట్టాలనే ఆ ఊరేగింపు ఉద్దేశ్యం. వేనవేల ప్రజలు గుంపులు గుంపులుగా (అన్ని కులాలవారు) భూమిలోనుంచి వుట్టుకొస్తున్నారా అనేట్టు వచ్చారు. అరండలుపేటలో లాయరు మేడనుండి వూరేగింపు బయలుదేరింది. జనం క్రిక్కిరిసి నందున కారు అగ్రహారం వీధుల్లో పోవడానికి వీలుపడ

లేదు. చివరకు చౌరాకు వెళ్ళాము. ఆ నాలుగు వీధులు వైశ్యాలుండేవి. కారును మధ్యలోనిలిపి, వధువును నా భుజాలమీద కూర్చోబెట్టుకొని "ఎంత చిన్నపిల్లో చూడండి" అని చూచేవారికి జాలికలిగింప ప్రయత్నించాను. రోడ్డుపక్కలనున్న రాళ్ళు, మట్టి విసరసాగారు కొందరు. అల్లరి పెద్దదయింది. రెండుపార్టీలుగా ఏర్పడి కొట్టుకొన్నారు. చాలామంది వస్తాదులు. అన్నికులాల వారు మాకు అండగా నిలబడ్డారు. గుంపులలో జొరబడి కొట్టారు. ప్రజలు భయపడి ఇండ్లలోకి పారిపోయి తలుపులు బిగించుకొన్నారు. మా పార్టీవారికి దెబ్బలు తగల్లా. వస్తాదులు మొదలయినవారు మాకు అభయమిచ్చి వారియిష్టప్రకారం ఊరేగింపు జరిపి, చివరకు లాయరుమేడవద్ద వదిలారు.

మరునాడు టవున్‌లో విచారించగా సుమారు 32 మందికి దెబ్బలు తగిలినట్లు తెలిసింది. ఈ వివాహాన్ని గురించి వైశ్యుల్లో కొందరికి ముఖ్యంగా ప్లాటుఫారాల మీద వాగేవారికి భయంవేసింది. కొందరు బెజవాడకు పారిపోయారు. మరికొందరు ఊరిలో లేమని చెప్పుకున్నారు.

శ్రీ మద్ది వెంకటసుబ్బయ్యగారి బంధువులకు (వివాహానికి వచ్చినవారికి) వారి తమ్ముడు శ్రీ రాధాకృష్ణయ్యగారు విందుచేశారు. వెంకటసుబ్బయ్యగారి యింటికి కూడా ఆ బంధువులు వెళ్ళారు. అక్కడ ఆయ

నతో ఏకీభవించిన వారెవరూ లేరు. తన యింట్లోనే ఏకాకియై ఆయన ఎంత బాధపడివుంటారో మీరే ఆలోచించండి.

గుంటూరులో వివిధజాతులవాళ్ళం, కులాలవాళ్ళము అభ్యుదయ భావాలు కలవాళ్ళము, విందులో కలుసుకునే వాళ్ళం, ఒకసారి కొందరు తమాషాకు శ్రీ మద్ది రాధాకృష్ణయ్యకు ఇరు ప్రక్కల హరిజనులను కూర్చోబెట్టారు. "వితంతు వివాహంలో భోంచేశావా?" అని ఎవరో అడిగారు. "లే"దన్నాడు. శ్రీ రాధాకృష్ణయ్య. "ఎందువల్ల" అని మళ్ళీ అడిగాడు. "కులంలో వెలివేస్తారని భయపడి వెళ్ళలే"దని రాధాకృష్ణయ్యగారు జవాబిచ్చారు. "ఇప్పుడు ఇరుప్రక్కల హరిజనులతో కూర్చున్నావే?" అన్నారు మరొకరు. "ఈలాంటిదానిని గురించి వైశ్యసంఘంలో తీర్మానమేమీలే"దన్నారు రాధాకృష్ణయ్యగారు. అందరం నవ్వాము. ఇలా వున్నై సంఘంలోని నగ్న వైరుధ్యాలు.

పెళ్ళిలో తాంబూలాలు పుచ్చుకున్న గుంటూరు వైశ్యులిద్దరిని శిక్షించటానికి వైశ్యసంఘంవారు సభ నేర్పాటుచేశారు. శ్రీ మద్ది వెంకటసుబ్బయ్యగారిని ముందుగానే కలుసుకొని "మీ తమ్ముణ్ణి కులబహిష్కారం చేస్తారా?" అని అడిగాను. తన భార్యాబిడ్డలవైపు చూచి సమాధానం చెప్పలేకపోయారు. "మీరు మీటింగుకు రాకుంటే బసవయ్యగారూ రా"రని సలహా యిచ్చాను.

అలాగే వారిద్దరూ రాలేదు. అందువల్ల కొద్దిమందే మీటింగుకు వచ్చారు. నేనే అధ్యక్షుణ్ణి అయ్యాను. వివాహం చేయించినవారిని ప్రశంసిస్తూ తీర్మానించాము.

15 రోజులకు కొందరు యువకులు మా యింటికి వచ్చి, భోజనం పెట్టండని అడిగారు. నా ప్రథమభార్య అన్నపూర్ణమ్మ తాను వంటచేసి పెట్టజాలనన్నది. వచ్చిన వారే వండుకొని భోంచేసి వెళ్ళారు. పెండ్లికి ప్రతినాడు వైశ్యసంఘం చేసిన తీర్మానానికి అంత్యక్రియలు చేశామని భోంచేసివెళ్ళిన యువకులు ప్రకటించారు. "భొంగతిండి" అని కొంద రాక్షేపించారు. అప్పుడు యువకులు వైశ్య సంఘానికి యీ విషయాన్ని తెలుపుతూ "ఏం చేస్తారో చెయ్యండి' అని రిజిష్టరు నోటీసు యిచ్చారు. వెంకట సుబ్బయ్యగారు దానిని నాకు చూపించి "చంచయ్యగారూ! ఏదో విధంగా మరచిపోకుండా మీరీ నోటీసు నిప్పించ వచ్చునా?" అని ప్రశ్నించారు. నా కేమీ తెలియదని చెప్పి, అయినా వారిని శిక్షించ మన్నాను అలా చెయ్యడం తమకిష్టం లేదన్నారు. ఇలాంటి మార్పుకు మరొక కారణం వుంది.

శ్రీ శిఖాకొల్లు పట్టాభిరాములు గుప్తగారిని శిక్షించుటకు మద్ది వెంకటసుబ్బయ్య, చీమకుర్తి బసవయ్యగార్లు చీరాల వెళ్ళి సభ పెట్టించి ఏమేమో చెయ్యదలచారు. మీటింగు ప్రారంభమయింది. సంఘనాయకులు గుప్త

గారికి ఆప్తబంధువులు వారేమో మూటింగుకు రాలేదు. ఉప్పులేని పప్పులాగా మీటింగులో పసలేకపోయింది. సభారంభంలోనే తనపేరు ఎత్తిన వారు తన బూటుదెబ్బకు కాచుకొమ్మని బూటును చేత్తో పట్టుకొన్నారు పట్టాభి. మీటింగు ముగిసింది.

కాని, మద్ది వెంకటసుబ్బయ్యగారి కష్టపరంపర పూర్తికాలేదు. ఇచ్చుకున్నవారి యిళ్ళకూ, పుచ్చుకొన్న వారి యిండ్లకుకూడా పోలేకపోయారు; బంధుత్వాలూ తెగ్రతెంపులు చేసుకోలేకపొయ్యారు. భార్యాబిడ్డలే తనతో కలసిరారు. ఏం చేస్తారు? చివరకు లొంగిపోయారు. అయినా మాకు జయం లభించలా. ఇంత రామాయణం జరిగినా, వితంతు వివాహోద్యమంలో మాతో కలసివచ్చే వైశ్యులు గుంటూరులో లేకపోయారు. సంఘం వెనుకపడి వున్నదనీ, గాంధీగారి ఉద్యమము గుంటూరు వైశ్యులలో పాకలేదనీ, యితర పట్టణాలలో ప్రయత్నించి, కడపటికి గుంటూరులో జయించాలని నిశ్చయానికి వచ్చాము. ముందుగా గుంటూరులోచేసిన కృషిఅంతా వృధా అయింది. ఏలూరు, బందరు, బెజవాడ, విశాఖపట్టణాలలో వితంతూద్వాహాలు చేయించి కృతకృత్యులం కావడానికి మూడు నాలుగు సంవత్సరాలు పట్టింది. ఈలోగా గుంటూరులో ఎంతోమంది ఆప్తబంధువులున్నా శుభాశుభ కార్యాలకు నన్ను, నా భార్యను పిలవనేలేదు. చాటుగా మాత్రమే నా భార్య అన్నపూర్ణమ్మను పిలుచు

కెళ్ళి శ్రీ గుంటూరు నరసింహారావుగారి తల్లి, భార్య, అక్కచెల్లెండ్రు ఎవరికీ తెలియకుండా తలుపులువేసి, కాపలాలుండి, భోజనంపెట్టి పంపుతూండేవారు.

ఇలా 5 సంవత్సరాలు గడిచాయి. వైశ్యకులంలో వితంతూద్వాహాలు సర్వసామాన్యమైనాయి. అప్పుడు గుంటూరు వైశ్యులే ఒక వితంతువివాహాన్ని ఏర్పాటుచేసి నన్ను ఆహ్వానించారు అప్పుడు నేను మద్రాసులో వుంటున్నాను. వివాహంలో నాకు పూలదండవేసి గౌరవించారు మొదటి వివాహ సందర్భంలో రాళ్ళు, మట్టి విసరికొట్టిన సంగతి జ్ఞాపకంచేశాను. అప్పుడొకరు పూలు తెచ్చి నామీద చల్లి "ఆ చేతులతోనే యిప్పుడు పూలు చల్లుతున్నా" మన్నారు. అందరం ఆనందించాము. గుంటూరు వైశ్యులతోకూడ పంక్తిభోజనం జరిగింది.

అయినప్పటికి శ్రీ మద్ది వెంకటసుబ్బయ్యగారు కాలవాహిని కెదురు యీదాలనే ప్రయత్నం మానలేదు. చీరాలలో నా మిత్రులు శిఖాకొల్లు పట్టాభిగారి యింటికి వెళ్ళాను. మద్దివారి మనుమరాలు ఆ యింటికోడలు. శ్రీ వెంకటసుబ్బయ్యగారుకూడా వున్నారు. నాతో కలసి భోంచెయ్యరు ఏం చెయ్యాలనే సమస్య ఇంటి వారికి. వెంకటసుబ్బయ్యగారు భోంచేసిన తరువాత నేను భోంచేస్తానని చెప్పాను. అందుకు వా రంగీకరించలేదు. వెంకటసుబ్బయ్యగారికే ఆఖరున భోజనంపెట్టారు.

ఏలూరులో వైశ్య వితంతువివాహం

తలవని తలంపుగా మిత్రులు శ్రీ మోతే నారాయణరావుగారు, నేనూ రైల్లో ఏలూరుకు కలిసి ప్రయాణం చేశాము. గుంటూరులో జరిగిన వితంతూద్వాహాన్ని గురించి ప్రస్తావించారు. ఎందుకు రాలేదన్నాను ఏదో పనివుండి రాలేదన్నారు; ఏలూరు స్టేషనులో దిగినప్పుడు తమయింటికి రమ్మని ఆహ్వానించారు. నేను రానన్నాను: "ఆరణాలిస్తే హోటల్లో భోజనం పెడతారులెం" డన్నాను.

"గుంటూరులో జరిగిన వివాహానికి రానందుకు నీకు కోపంగావుంది. నిజానికి ఉండవలసిందే; అన్ని కష్టాలు వచ్చినప్పుడు, నేను మీతో సహకరించకపోవడం మంచి పనికాదు. ముందు జరగబోయే వితంతు వివాహాన్ని ఏలూరులో చేయిస్తా" నని సమాధానపరచి నన్ను తన యింటికి తీసుకెళ్ళారు. నా ఆనందానికి మేరలేకపోయింది. ఆనాడే శ్రీ మాజేటి రామచంద్రరావు, శ్రీ జవ్వాజి అప్పారావు గుప్త, శ్రీ చింతా సోమరాజు వగైరా మా పార్టీ యువక నాయకులను రప్పించి ఆలోచించి కార్యాచరణకు ప్లాను వేశాము. జరుగబోయే వితంతు వివాహాన్ని ఏలూరులోని వైశ్యయువకులనందరిని సంఘటితపరచి, కట్టుదిట్టాలతో నారాయణరావుగారి నాయకత్వాన జరపాలని తీర్మానించుకున్నాము.

శ్రీ మద్ది వెంకటసుబ్బయ్యగార్కి కలిగిన చిక్కులు కష్టాలు తెలిసిపోయినందున ఏ పట్టణంలో వివాహం చేయించినా అక్కడి వైశ్యసంఘనాయకుల ఆటకట్టించుటకు వారి కొడుకులనో అల్లుళ్ళనో, మనుమలనో మా ఉద్యమంలోకి దింపడం అవసరమని తోచింది. శ్రీ మోతే నారాయణరావుగారు చేరడంతో శ్రీ గంగరాజుగారు మొదలైన వైశ్యనాయకుల ఆటకట్టించగలమని ఆశించాము.

బళ్ళారినుండి ఒక మిత్రుడొక యువతిని నావద్దకు పంపారు. ఆ వితంతువుకు వివాహం చేయించాలి. బళ్ళారిలో గుమాస్తాగా వున్న ఒక గుంటూరు యువకునికి ఆమెకు వివాహం చేయించుటకు నిశ్చయించాము. నారాయణరావుగారు వ్యాపారనిమిత్తం కల్కికోటకు వెళ్ళాగు. పెండ్లిరోజుకు వస్తానని హామీ యిచ్చారు. శ్రీ మాజేటి రామచంద్రరావు వగైరాలు వివాహం గొప్పగా చేయించాలని పెద్దపెద్ద ఏర్పాట్లు సాగించారు. శ్రీ గంగరాజు వగైరాలు ప్రతిఘటింప పూనుకున్నారు వారు శ్రీమంతులు. అనేకమంది వైశ్యులకు అప్పుసప్పు లిచ్చి తమ పలుకుబడిలో వుంచుకున్నవారు. పగ సాధించాలంటే ఎవరినైనా చిక్కుల్లో పెట్టగలరు; అప్పుపత్రాలను కొని దివాలా తీయించగల సమర్థులు. అయినప్పటికి, ఈయనను లక్ష్యపెట్టని ధనికులు, వ్యాపారస్థులుకూడా ఏలూరులో వున్నారు.

గుంటూరులో నేర్చుకొన్న గుణపాఠంతో మేము బహిరంగ సభలు మానేశాము. వివాహానికి రెండురోజులు ముందుగా శ్రీ గంగరాజుగారి పార్టీ వైశ్యులసభ నొక దాన్ని పెట్టారు. ఆ సభకు వచ్చినవారిలో ఎక్కువమంది మాపార్టీవారే. వృద్ధుల ఆట సాగలేదు: సభ మధ్యలో లేచిపోయి శ్రీ గంగరాజుగారి మేడలో రహస్యంగా చేరి కుల బహిష్కారం చెయ్యడానికి తీర్మానించారు. తలవని తలంపుగా శ్రీరంగంగారి (బలభద్రపు రామకృష్ణయ్య) పార్టీవారు పూర్తిగా మాతోకలసి పనిచేయసాగారు. శ్రీ నారాయణరావుగారు లేనిసమయంలో శ్రీరంగంగారు నాయకత్వం వహించి ధైర్యసాహసాలతో నేగాక, అతి చాకచక్యంగా పనులు నిర్వహించారు. స్థానిక వైశ్యయువకులు మాతో కలిసి పనిచేశారు వృద్ధులతోకూడ కొందరు మాపక్షమే; స్త్రీలనేకమంది ముందుకు వచ్చి తోడ్పడ్డారు.

పరాపహరణం

పెండ్లికి ముందురోజున గంగరాజుగారు వరునికి రు 500/- లు లంచ మిచ్చి, నేరే వివాహం ఏర్పాటు చేయడమే గాక, వరుణి దాచిపెట్టేశారనే వదంతి తెలిసి ఇంటికి వెళ్ళి పేరంటానికి పిలుస్తున్న మా పార్టీ స్త్రీలు నిరుత్సాహపడి పిలుపులు మానేశారు. పెళ్ళి ప్రయత్నాలు పూర్తిగా మానేస్తారని భయపడ్డాము. శ్రీరంగంగారే అధైర్యపడ్డారు. "మా గంగరాజుగారి నడత మీకు తెలి

యదు. ఏమన్నా తీసుకురం" డని నాకు వార్నింగు - ఆజ్ఞ యిచ్చారు. నా కేమీ తోచలేదు.

నూటికి నూరుపాళ్ళు నేను చేసేది న్యాయమనీ, ఏంచెయ్యాలో తోచనప్పుడు, కార్యసాఫల్యానికి సాత్విక మార్గం కనబడనప్పుడు అప్రయత్నంగా నేను డొర్జన్యానికి దిగుతాను. ఈ పద్ధతి నా రెండో స్వభావంగా ఏర్పడి పోయింది. గంగరాజుగారిని లొంగదీయటానికి డొర్జన్య మార్గం మాత్రమే కనపడింది.

శ్రీ గంగరాజుగారికి నా యందెంతో వాత్సల్యం, గౌరవంవుండేవి. నన్ను భోజనానికి ఆహ్వానించి తాను నాతో కూర్చుని అది, ఇది వడ్డించండని చెపుతూ, బాగా తినమని నన్ను నిర్బంధించేవారు. అల్లుళ్ళకైనా అలాంటి మర్యాద చేసేవాడు కాదు. అలాంటి మేమిద్దరం రెండు పార్టీలకు నాయకులుగా పోట్లాడవలసిన సందర్భం ఏర్పడింది.

గంగరాజుగారు ఎంత ఐశ్వర్యవంతులైనా అతిభయస్తుడు. కానిస్టేబులు వచ్చి ఇన్స్పెక్టరుగారు పిలుస్తున్నారంటే వెళ్తారు. ఇన్స్పెక్టరు తన యింటికివస్తే కుర్చీలో కూర్చునేవరకు తాను నిలబడేవారు. అలాంటివారిని బెదరించడం సులభమేగదా!

వెంటనే గంగరాజుగారి యింటికి వెళ్ళాను. ప్రతి కక్షులెందరో వున్నారక్కడ. ఎటూ చూడకుండా తిన్నగా గంగరాజుగారివద్దకువెళ్ళగానే "కూర్చోండి" "కూర్చోండి"

అని మర్యాద ప్రారంభించారు. "మీతో ప్రత్యేకంగా మాట్లాడాలి! వరండాలోకి రం"డని దారితీశాను. "మీయందు నా కెంతో గౌరవమున్నదని మీకూ తెలుసు వివాహ విషయంలో రెండుపార్టీలుగా చీలిపోయాము; మన మిద్దరమే రెండు పక్షాలకు నాయకులం. న్యాయంగా పొట్లాడుదాం! మా వరుణ్ణి దాచిపెట్టావు. అది న్యాయం కాదు" అన్నాను. "లేదు; లేదు. దాచిపెట్టలే"దన్నారు గంగరాజుగారు. "నా సంగతి తెలుసుగదా! నాలుగున్నర సంవత్సరాలు ఏడు జైళ్ళలో గడిపాను జైలరుసుతన్నాను. నాకు కోపంవచ్చి ఏమైనా చేస్తే ఏ ఆరుమాసాలో జైల్లో ఉండక తప్పదు. కాని, నీకో! తరతరాలుగా గౌరవం పోతుంది. మరి నీయిష్టం, ఆలోచించుకో" అని బెదిరించాను. భయపడిపోయాడు. "దాయలేదు. ఇప్పుడే నీతో పంపుతా, తీసుకెళ్ళ" మన్నాడు. అలాకాదు, మాజేటి వారి ఇంటికి పంపమన్నాను. సరేనన్నారు. నేను మాజేటి వారింటికి వెళ్ళి నా పార్టీవారిని కలుసుకొని, జరిగింది. చెప్పాను. "అయ్యో! ఆ మోసగాని మాటలు నమ్మి వచ్చావా! వరుణ్ణి పంప"డని నిరుత్సాహపడ్డారు. అంతలో వరుడు బండిలోనుండి దిగాడు. నా స్నేహితులు ఆశ్చర్యపడ్డారు. మరల ఉత్సాహంతో పని సాగించారు.

నారాయణరావుగారు మెయిలులో వస్తున్నామని మాకు టెలిగ్రాము యిచ్చారు. ఆయన్ను రానివ్వకుండా బెజవాడలోనే ఆపివెయ్యడానికి. ఆ రాత్రే కొందరిని

గంగరాజుగారు పంపుతున్నట్టు మాకు తెలిసింది. అంత కంటే పెద్ద ప్లానును మా నాయకుడు శ్రీరంగంగారు వేశారు. నారాయణరావుగారిని తెనాలిలో నేకలుసుకోమని మేము కొందరిని పంపాము. "గంగరాజు బాబాయి"గారిత్రో ఎదుటపడి పోట్లాడడం నారాయణరావుగారికి ఎంతమాత్రం యిష్టంలేదు. ఒక ఉపాయం చెప్పారు!- "గంగరాజుగారి ఏజంట్లు చెప్పినట్లే బెజవాడలోనే ఉంటానని దిగేస్తాను. వారిని నమ్మించి ఏలూరు పంపేస్తాను. నేను ఉదయం ప్యాసెంజరులో బయలుదేరి వస్తాను. వట్లూరు స్టేషనుకు కారు పంపం"డని కబురంపారు. అలాగే చేశాం; కాని, కారులో తిన్నగా వివాహం జరిగే తావుకు రాకుండా, తన యింటికి వెళ్లారు రావుగారు.

వారెంత ముందడుగు వేస్తారో: ఆయన తల్లి, భార్య అంత వెనుకకు లాగుతారు. పెళ్ళికి వెళ్లొద్దని నిర్బంధించారు. కూతుళ్ళకు వివాహాలు జరగవనీ, జరిగినా సరియైన సంబంధాలు కుదరవనీ, ఇతరుల గొడవలు తమకెందుకనీ చెప్పడమేగాక, పోనిచ్చేదిలేదని గుమ్మానికడ్డంగా భార్య కూర్చున్నారు. "గంగరాజుగారు వస్తున్నారు ఇంటిదగ్గరే వుండమన్నా"రనే కబురువెళ్ళింది. వెంటనే ఒక్కదూకుతో గుమ్మందాటి కారులో వివాహస్థలానికి వచ్చారు

మా పార్టివారికి ధైర్యం చిక్కింది. వివాహం జరుగుతూండగా గంగరాజుగారు వీధిలో కారులోనేవుండి

నారాయణరావును రమ్మని కబురంపారు. "వివాహం పూర్తిచేయించి భోంచేసివస్తా"నని చెప్పి పంపారు నారాయణరావుగారు.

వివాహం వైభవంగా జరిగింది. వేలమంది భోంచేశారు. వరునికి బహుమతులు చదివించారు. శ్రీనారాయణరావుగారే రు. 116/- లతో ప్రారంభించారు; మొత్తం రు 116-0-0 కు పైనే చదివించారు. సాయంత్రం ఊరేగింపులో వేలాదిజనం పాల్గొన్నారు. ఉత్సాహం వెల్లివిరిసింది. రాత్రికి వధూవరులకు నిషేకం ఏర్పాటుచేసే విషయంలో "మా ఇంట్లో" మాయింట్లో"నని పోటీలు పడ్డారు! అప్పుడూ ఇప్పుడూ కూడా వితంతు వివాహాల విషయంలో కుటుంబమంతా కలిసి ఉత్సాహంతో సహాయపడుతున్న శ్రీ జవ్వాజి అప్పారావుగుప్తగారి యింట్లో ఏర్పాటును ఏకగ్రీవంగా అంగీకరించాము. వధూవరులను పాన్పుమీద కూర్చోబెట్టినప్పుడు నారాయణరావుగారు 'బ్రహ్మవాత అంతారే! అడెక్కడికి పోయింది ఇప్పుడు? మనవాత మన చేతుల్లోనే ఉన్న"దని సమయస్ఫూర్తిగా మాట్లాడారు. అనేకమంది వధూవరులను ఆహ్వానించి విందులుచేసి బహుమతులిచ్చారు. ఈ విధంగా వివాహము దిగ్విజయంగా జరిగిపోయింది.

ఎత్తు పై ఎత్తు

అయితే, మరునాడే వివాహంలో పాల్గొన్నవారిని బహిష్కరించేందుకు గంగరాజుగారు సభ నేర్పాటుచేశారు.

వైశ్యులందరు రావలసిందని నోటీసులు పంపారు. అదే వారి పొరపాటు. మేమందరం ప్లానువేసుకొని వెళ్ళాం. ఎవరెవరెలా మాట్లాడాలో, ఏమి తీర్మానం చెయ్యాలో నిశ్చయించుకున్నాం. శ్రీ నారాయణరావుగారే అధ్యక్షుడుగా వుంటానికి సమ్మతించారు.

నారాయణరావుగారు సభకు రాగానే గంగరాజు గారు ప్రత్యేకంగా మాట్లాడటానికి వరండాలోకి పిలిచారు నారాయణరావుగారిని. సభ పూర్తికాగానే కలుసుకుంటా నని నారాయణరావుగారు జవాబు పంపారు. సభకు అధ్యక్షుడుగా ఉండుటకు ఎదురకక్షి గంగరాజుగారిని, మెము నారాయణరావుగారిని ప్రతిపాదించాము. మేము పదతి ప్రకారం సెకెండు చేశాము; వారలా చెయ్యాలా. రూల్సు ప్రకారం నారాయణరావుగారొక్కరే అభ్యర్థియని చెప్పి కుర్చీలో కూర్చోబెట్టాము. గంగరాజుగారి ముఖా లేచి పోయ్యారు. మేము గెలిచాం.

గెలిస్తే ఏం ప్రయోజనం? ఏలూరు వైశ్యసంఘంలో రెండు పార్టీలు ఏర్పడినై. అయినవా ళ్ళినావాళ్ళు విడిపోయి ఉండగలరు? శుభాశుభ కార్యాలలో పిలుపులు మానేసుకున్నారు. వంటకోమట్లు, నీళ్ళకోమట్లు భయపడ్డారు. సంస్కారప్రియుల యిండ్లలో పనిచేయటం మానేశారు. క్రొత్తవారిని తెచ్చుకోవాల్సివచ్చింది. మాజేటి రామచంద్రరావులాంటివారు కూడ మంచినీళ్ళబిందెలు మోసుకోకతప్పలేదు. రెండుపార్టీలకు విసుగెత్తింది; 6 నెల

లకు కలసిపోయారు. కాని, అందరూ వితంతూద్వాహాలకు సమ్మతించనేలేదు. అయితే, గుంటూరుకంటే ముందుకు వెళ్ళాము.

ఈ ఏలూరు వివాహంలోకూడ మామూలు బ్రాహ్మణ్యం చేయుటకు ప్రయత్నించాము. వివాహం జరిగేటప్పుడు ఊరేగింపులోను శ్రీ వుస్తాద్ పాపోలు వీరవెంకయ్యగారు నావెంట వుండేవారు. శ్రీ జవ్వాజి అప్పారావుగారి యింటిలో పాన్పు జరిగినతర్వాత విందులో ఆ నాయుడు గారూ వున్నాడు. ఉస్తాద్‌గారి చర్య నచ్చక "నా వెంట పడడానికి కారణమేమని" కోపంతో అడిగాను. అప్పు డందరిఎదుట ఏలూరులో మా పార్టీయువకులు వ్రన శిష్యులనీ, గంగరాజుగారి ప్రోద్బలంతో మరో తాలింఖానాలోని కౌడీలు నన్ను కొట్టడానికి చూస్తున్నట్టు తెలిసి నాకు బాడీగార్డుగా వుంటున్నామనీ చెప్పారు. ఇదివిని అందరూ ఆయన్ను అభినందించారు. నాకు ఆశ్చర్యం కలిగింది.

ఉద్యమ వ్యాప్తి

ఆరుమాసాలలో బందరు, విశాఖపట్టణాలలో ఏ ఆటంకాలు లేకుండా ప్రజావుద్యమంగా మారిపోయినది. ఏలూరులో మరొక వివాహంకూడ చేయించాము. కొందరు వైశ్యులు పంక్తిభోజనానికి వచ్చారు. సంఘం ఎవరినీ ఆక్షేపించలేదు. ఈవిధంగా జయించాము. విప్

హాలు చురుకుగానే జరిగిపోయాయి. రెండునూడు సంవత్స రాలలో ఎవరింటిలోవారే మామూలు వివాహాల్లాగ జరు పుకోసాగారు కష్టాలు తొలగిపోగానే శ్రీమంతులుకూడ వితంతువివాహాలు ప్రారంభించారు. వారు రంగంలోకి రాగానే కట్నాలు, బేరాలు ప్రారంభమైనాయి. ప్రస్తుతం ఏలూరులో ప్రతి వైశ్యకుటుంబంలోను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పునర్వివాహాలతో సంబంధం లేనివారే అరుదు

ఇప్పుడు ఇతరులు మానేసినా, శ్రీ జవ్వాజి అప్పా రావుగుప్తగారు, వారి కుటుంబము తమ విద్యుక్తధర్మాన్ని నెరవేర్చుకుంటూనే వున్నారు. ఎందరో అనాథలు (అన్ని కులాలవారు) వీరి సహాయం పొందుతున్నారు వారిని నే నెంతో అభినందించుతున్నాను. ఇలాంటివారివల్ల ప్రతి చోట ఆ ఉద్యమము ముందుకు పోతూనేవున్నది.

కె యస్. గుప్తాగారి ఎదురుదెబ్బ

గుంటూరు, ఏలూరు పట్టణాలలో మేము జయించ జాలనందుకు శ్రీ కె. యస్. గుప్తగారు మమ్మల్ను ఖండిం చాడు. తాను చేసి చూపుతానని, మూడవ వితంతూద్వా హాన్ని విశాఖపట్టణంలో చేయించాడు. ఇంటింటికిపోయి తాను, తనభార్య వివాహానికి రాని వైశ్యుల్ని కులబహి ష్కారం చేయించుతానని వీధుల్లో బహిరంగంగా హెచ్చ రించాడు. వివాహానికి అయిదారు కుటుంబాలవారు

రాలేదు. మరునాడు వారు గుప్తగారింటికి వెళ్ళి, రానందుకు క్షమాపణ కోరి, ముందు జరగబోయే వివాహాన్ని తమ ఖర్చుతో చేయించుతామని మాట యిచ్చి వెళ్ళారు. సంఘంలో ప్రజామోదంతో ప్రథమ వితంతూద్వాహం విశాఖ పట్టణంలో జరిగింది. శ్రీ కందుకూరి వీరేశలింగం గారు ప్రారంభించిన యీ భై సంవత్సరాలకు ఆయన ఉద్దేశ్యం ఫలించింది. తదాది ఆ జిల్లాలో నిరాటంకంగా ఎన్నో జరిగిపోతున్నాయి.

బందరులో

బందరులో వితంతు వివాహాన్ని జయప్రదంగా ప్రజామోదంతో చేయించగలనని శ్రీ యస్. ఎల్. ఎన్. గుప్తగారు మా కమిటీతో చెప్పి అవకాశం సంపాదించుకొన్నారు. గుంటూరులో వలెనే బందరు వైశ్యులు వైదిక బ్రాహ్మణులతో ఎన్నో తరాలుగా పోటీపడి వైదిక సాంప్రదాయాలలో ఊరిపోయారు; వైశ్య వితంతువులకు వెంట్రుకలు తీయించడం బందరులో ప్రారంభమై గుంటూకు పాకింది. బందరులో జయించడం కష్టమని తలచి ఆ పట్టణానికి అవకాశం ఇవ్వకుండానే ఇతర పట్టణాలకు యిస్తూ వచ్చాను. అయితే, బందరులో యువకులతో పోట్లాడుటకు సనాతనులకు గుండెధైర్యం లేదని వివాహకాలమందు నాకు తెలిసింది. చుట్టుపట్ల గ్రామాలనుండి సుమారు పదివేల మంది వచ్చి వివాహంచూచి ఆనందించారు. అయిదువేల

మంది దాకా సహపంక్తి భోజనం చేశారు. డబ్బు వసూలు చెయ్యకనే ఇన్ని వేలమందికి భోజనాలు పెట్టారు. ఏవ స్తువు లేకపోయినా వాలంటీర్లు ఎడ్లబండిని బజారుకు తీసు కెళ్ళి అడిగి అడుగకముందే వైశ్య వర్తకులు, ఇతర వర్త కులు బండినింపేశేవారు. ఈ సంస్కరణ ప్రజామోదం పొందినదనుటకు ఏలాంటి సందేహం లేదని రూఢి అయింది.

ఇప్పుడు బందరులోనే వైశ్యులలో షుమారు అరవై కాపురాలవారు వితంతు వివాహం చేసుకొన్నవారున్నారు. ఎలాంటి అరమర లేకుండా కలిసిపోయారు. శ్రీ యమ్. లక్ష్మీనారాయణ గుప్తగారు ఇప్పటికీ ఉత్సాహంతో వివా హాలు చేయిస్తూ, ఆ కుటుంబాలవారి కష్టసుఖాలను తండ్రి లాగా విచారించుతూనే వున్నారు. ఇలాంటివారు ఉండడం వల్లనే, సంఘసంస్కరణోద్యమాలు జయప్రదంగా జరుగుతు న్నాయి. అలాంటివారే అన్నికులాలలోను అందరి ఆమోదం పొందుచున్నారు.

ఇంకా అనేకం

ఆంధ్రదేశమంతటా ఇంత జరిగిన తరువాత మరల గుంటూరులో వివాహం చేయించాము. కాని గుంటూరు వైశ్యులు ఒక్కరూ రాలేదు. చీరాలనుంచి ఒక్కరు మాత్రం వచ్చి, తాంబూలం మాత్రమే తీసుకొని వెళ్లారు చేయుటకు సమ్మతించనే లేదు. కాబట్టి గుంటూరులో

మరొకసారి ఓడిపోయాము. వైశ్యకులం మీద వైదిక బ్రాహ్మణుల ఆధిపత్యం పోయినా, వారి స్థానమాక్రమించిన వైదిక వైశ్యులు కాలప్రవాహానికి ఎదురీదుచునే వుండిరి. ఎందరో వైశ్యవక్తలు గుంటూరులో ఉన్నారు. ఆచరణలో ఒక్కరైనా సహాయపడలేదు వివాహమనగానే పరారయ్యేవారు.

అయినప్పటికీ, అప్పటికే ఉద్యమసందర్భంలో మా యింటికి వచ్చివెళ్ళేవారి సంఖ్య హెచ్చిపోయింది. నేను గుంటూరు బ్రాడీపేటలో కాపురముంటున్నాను. మా యిల్లు తెలియనివారు ఆ వీధులలో ఎందరి నెంత శ్రమ పెట్టారోగాని, ఒకనాటి రాత్రి మా గోడమీద ఎవరో "వెధవముండల పెళ్ళిళ్ళు చేయించే దరశి చంచయ్యగారి యిల్లు యిదే"నని వ్రాశారు.

దానినిబట్టి నే నెంత చెడ్డపేరు పొందానో తెలుసుకున్నాను. ఆ యింట్లో కాపురమున్నంతవరకు గోడమీద అలాగే ఉండనిచ్చాను. చెడ్డపేరు నాకెప్పుడూ ఉంటూనే వుంది.

ఉద్యమము ప్రారంభించిన మూడుసంవత్సరాలకు (1928సం॥ లో) బెజవాడ వితంతువు (శ్రీ దోమా వెంకట స్వామిగుప్తగారి మరదలు)కు ఏలూరులో వివాహం చేయించాము. ఎవరైనా వితంతువువివాహం చేసుకోదలచిరాగానే, ఉత్సాహంగలవారు తమ యింటికి తీసుకెళ్ళి,

తమ పెంపుడుబిడ్డగా భావించి, వివాహం చేయించడం బాగుంటుందని నిశ్చయించుకున్నాం. కూతుళ్ళులేని శ్రీ తుంపూడి భగవంతంగుప్తగారు ఆమెను తన పెంపుడు బిడ్డగా చూచుకొనుచుండిరి. ఎంతో ప్రేమతో ఆ బిడ్డకు సహాయంచేశారు. అయితే, ఆయనభార్య సమ్మతించలేదు; నల్లమందుతిని చావుకు సిద్ధమైనది. డాక్టర్ల సహాయంతో బాగుచేయించి, తన ఉద్దేశాన్ని ఎంతమాత్రం మానుకొనుటలేదని భార్యతో గట్టిగా చెప్పారు. మగ్గురు కొడుకులు, కోడళ్ళు గుప్తగారిపక్షం వహించారు. తన భార్య సహాయం లేనందున, శ్రీ మోతే నారాయణరావుగారి తోడ్పాటుతో ఏలూరులో వివాహం చేయించారు. వివాహానికి గుప్తగారు తన భార్యను పిలువకుండా వధువు వగైరాలతో కలిసి ఏలూరువచ్చారు. గుప్తగారి భార్య మనసు మార్చుకొని, తానూ పెండ్లికివచ్చారు. పెండ్లిలో పీటల మీదకూడ కూర్చుని చేయించింది.

వధువు తలిదండ్రులు బెజవాడ రైలుస్టేషనులో కూతురును చూడటానికి వచ్చి, బండి కదిలినందున వివాహానికి రావలసివచ్చింది బెజవాడలో వారికి కులబహిష్కారం జరుగుననీ, మాకు సహాయంచేసే వైశ్య లుండరనీ మేము గ్రహించి స్వంత తల్లిదండ్రులను వివాహానికి రావదని ముందే సలహాయిచ్చాము. వచ్చినాక సహపంక్తి భోజనం చెయ్యకుండా జాగ్రత్తపడమనికూడా వారిని హెచ్చరించాము; కాని ఆ ఉత్సాహంలో వారుకూడా

భోంచేశారు. బెజవాడకు తిరిగి వెళ్ళగానే వానిని శిక్షించుటకు ఛాందసులు ప్రయత్నించారు. నే నప్పుడు బెజవాడలోనే కాపునమంటున్నాను. నేను అనుకోనివిధంగా బెజవాడ వైశ్యయువకులు తమ పెద్దల నెదిరించి వారి ఆట కట్టించారు. ఈ సందర్భంలో శ్రీ అన్నవరపు సుబ్బారావు గుప్తగారు చాలా ప్రయాసపడ్డారు. శ్రీ చుండూరి వెంకట రెడ్డి, వారి సోదరులు, శ్రీ చిట్టూరి రామకృష్ణయ్యగారు పాటుపడినారు, దానితో బెజవాడలో ఉద్యమం కొంత బలపడింది.

ఈవిధంగా మూడు సంవత్సరాలపాటు వైశ్యసంఘ నాయకులతో పోరాడుతూవచ్చాం. ప్రారంభించిన ఐదేండ్లకు (1930) గుంటూరు వైశ్యులే ఒక వివాహాన్నేర్పాటుచేసి, నన్నాహ్వానించి "రాళ్ళువేసిన చేతులతో పూలువేశారు" అప్పటికే అన్నిచోట్ల వందలాదిగా వితంతువివాహాలు అన్ని కులాలలో జరిగాయి. ఎవరింటిలోవారు వైశ్యులు, కమ్మవారు మాత్రమే చేయించుచూవచ్చారు. అయినా ఒక వితంతు శరణాలయం అవసరమని తోచింది.

వితంతు శరణాలయ స్థాపన

నేను 1930 లో మద్రాసులో కాపురం పెట్టాను. శ్రీ ఉయ్యూరు వెంకటసుబ్బారావుగారు, శ్రీ తుంపూడి భగవంతం గుప్తగారు, నేను కలసి మద్రాసులో ఒక వితంతు

శరణాలయాన్ని స్థాపించాము. అన్నికులాల వితంతువులకు ఆశ్రయం యిచ్చాము. 4-5 సం॥లు బాగా జరిగిపోయింది. అంతట కొన్ని కారణాలవల్ల, ముఖ్యంగా నిర్వహించలేక మానేశాము. తరువాత నర్సాపురంలో నా మిత్రుడు శ్రీ అద్దేపల్లి సర్వాశెట్టిగారు జయప్రదంగా ఒక శరణాలయాన్ని నిర్వహించడమేగాక, ఆంధ్రదేశంలో నర్సాపురమే ఆ ఉద్యమానికి ముఖ్య కేంద్రంగా వృద్ధికి తెచ్చారు.

ఇతర కులాలలో వితంతు వివాహోద్యమము బలపడిన వివరాలకు ముందు ఈ ఉద్యమానికి తోడ్పడిన వైశ్య ప్రముఖులను గురించి వ్రాస్తాను.

వైశ్య సంస్కర్తలు

శ్రీ యేటూరి వెంకటసుబ్బయ్యగారిది కడపజిల్లా వేంపల్లి గ్రామం. వారు నాతో కాలేజిలోచదువుకున్నారు. ఈయన వధువులను రాయలసీమనుండి తెచ్చేవారు. ఆ వితంతువులకు సర్కారు జిల్లాలలో వివాహాలు చేయించుచుంటిమి. శ్రీ వెంకటసుబ్బయ్యగా రెందరినో తెచ్చి ఉద్యమాన్ని జయప్రదం చేయించారు క్రమంగా రాయలసీమలోనే వివాహాలు జరిపించుతూవచ్చారు. వితంతువులే కులానికి చెందినా తలిదండ్రులను ఒప్పించి, సహాయం చేసేవారు.

శ్రీ సి. యస్. గుప్తగారు (నెల్లూరు) నా బాల్య స్నేహితుడు. తన పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ హోదాను వితంతూద్వాహాలకు ఉపయోగించేవారు. ఇప్పటికీ వివాహాలు చేయించుతూనే వున్నారు. వీరినిగురించి ఒక మంచి కథ ఉన్నది. మే మొక వితంతువును మేనమామలవద్ద నుండి రహస్యంగా తప్పించి మద్రాసుకు తీసుకురావలసి వచ్చింది. ఆ గ్రామం ఈ పోలీసు యిన్స్పెక్టర్‌గారి రేంజి లోది, పిల్లను తప్పించుకొని తీసుకొచ్చేపని నాయనకు వప్పగించాము. ఆ ప్రయత్నం సందర్భంలో ఆమెను ప్రేమించి తానే వివాహం చేసికొన్నారు. ఈ దంపతులిప్పుడు ఇంటి నిండా బిడ్డలతో, పెన్షన్ అనుభవిస్తూ సుఖంగా ఉన్నారు.

బందరులో శ్రీ లింగమల్లు జగన్నాథంగారు మా ఉద్యమారంభంలో కార్యదర్శిగా వుండి ఉత్సాహంతో నాకు కుడిభుజంగా పనిచేయుచుండిరి. ఒక వితంతువు వివాహం చేసుకోదలచి, తన మామతల్లివద్దనుండి తప్పించమని ప్రార్థించినది. ఆ పనిని నిర్వహించుటకు శ్రీ జగన్నాథంగారిని పంపాను. ఆ ప్రయత్నాల సందర్భంలోఆమె ఆయన్నే తన్ను వివాహం చేసుకోడానికి ఒప్పించింది. అయితే వివాహం జరగలేదు. వధువు మనసు మార్చుకొన్నది ఆ దుఃఖంతో ఆయన చనిపోయారు వారి మరణంతో నాకు వుద్యమనిర్వహణ చాల కష్టమయింది.

శ్రీ కె. కృష్ణారావుగారు ఆంధ్ర యూనివర్సిటీ ఆఫీసులో మేనేజరు. ఆయన కష్టమైన పనులు చేయుటకు సిద్ధపడేవారు. తల్లిదండ్రులవద్దనుండి రహస్యంగా వితంతువులను తప్పించడమంటే కృష్ణారావుగారికి చాలా యిష్టం. అపాయాన్ని లెక్కచేసే వారుకాదు.

పొద్దుటూరు వాస్తవ్యులు శ్రీ కొప్పరపు సుబ్బయ్య గారు ఆ జిల్లా వైశ్య నాయకులు. ఈ ఉద్యమానికి తమ పలుకుబడి నుపయోగించారు. ప్రత్యక్షంగావచ్చి సహాయం చెయ్యలేదు; కాని, ఆ జిల్లాలో వితంతువివాహం చేసుకొన్న వారికి ఎలాగో కులబహిష్కారం లేకుండా సహపంక్తి భోజనాలు పెట్టించి, కష్టాలను తొలగించుతూ వచ్చారు.

వైశ్యులలో ఇప్పుడు వయస్సుకు సంబంధించిన ఆటంకాలు కాని, బిడ్డలున్నారనే అటంకాలు గాని, పునర్వివాహవిషయంలో సంఘసంబంధమైన బాధలుగాని ఎంత మాత్రం లేవు. శ్రీ కందుకూరి వీరేశలింగంగారి ఉద్దేశ్యం వైశ్య సంఘములో పూర్తిగా నెరవేరింది.

అమెరికాలో నే నొక విచిత్ర వివాహం చూచాను. వధూవరులు 70 సం॥ల కంటె అధిక వయస్కులు ఇద్దరికి పూర్వ వివాహాలవల్ల ముది మనుమలు, మనుమరాండ్రు ఉన్నారు. ఆ అవ్వ, తాతలు నాకు పొరుగున వుండే పరి

చితులే. వివాహం చేసుకొన్నందుకు వారిని చాలమంది అభినందించారు. వారిలో నే నొకడిని. వా రెందుకు వివాహం చేసుకున్నారో చెప్పమన్నాను. వారు "చిన్న ప్పుడు బ్రతుకు తెరువుకోసం ఇంగ్లాండు వదలి ఆస్ట్రేలియాకు వెళ్ళాం. అక్కడే పరిచయమై ప్రేమించుకొన్నాం; కాని, ఆర్థిక బాధలవల్ల వివాహం చేసుకోజాలకపోతిమి. తర్వాత దేశదేశాలు తిరగడంలో విడిపోయాము. 4ఏ సం॥ల తరు వాత అమెరికాలో కలుసుకున్నాము. అప్పటికే మాకు పెళ్ళిళ్ళయి మనుమలు, మనుమరాండ్రు కలిగారు. ఇద్దరము ఐభవలమే బిడ్డల యిండ్లలో వుంటున్నాం. కాలక్షేపానికి యిద్దరం తఱుచుగాకలుసుకుంటూండే వాళ్ళము అయితే, ఈ దేశంలో బిడ్డలవద్ద ఉండటం, స్వగృహంలో మేము ిద్దలుగా ఉండలేకపోవడం మా సాంప్రదాయానికి విరుద్ధం. కాబట్టి, మేమిద్దరం కలసి ప్రత్యేకంగా కాపురంపెట్టనిశ్చ యించుకొని "చర్చికి వెళ్ళవచ్చా"మని చెప్పి నవ్వారు. నాకూ నవ్వు వచ్చింది. కాని, దీర్ఘాలోచనలో పడ్డాను. యసుకు తగిన సౌఖ్యాలు ఉంటాయని, వయసుకుతగిన న్నిహితులు ఎంతో అవసరమని, బిడ్డలను కనడానికేగాక తకొరకుకూడా పెళ్ళి అవసరమేనని, వివాహానికి వధూ రులే వయసును నిర్ణయించుకోవాలనీ నాకు తోచింది. ప్పటికీ నా అభిప్రాయం అదే.

కమ్మవారిలో వితంతువివాహాలు

1927_29 సంవత్సరాలలో నేను బెజవాడలో వుంటూ వుండగా శ్రీ కోవెలమూడి గోపాలకృష్ణయ్య చౌదరి గారికి (అడ్వకేటు) నాకు స్నేహమేర్పడినది. వైశ్య కులంలో వితంతూద్వాహాలు జోరుగా సాగిపోతున్నాయి నా కమ్మ మిత్రులకు అది చాలా ఆశ్చర్యంగా వుంది. వా రిష్టపడినా తమకులంలో చేయించలేదు. నేనుచేయించ గలిగినందున వారికి నా యందు గౌరవం ఏర్పడింది. శ్రీ కోవెలమూడి గోపాలకృష్ణయ్య చౌదరిగారు కమ్మ వారిలో ఒక వితంతువుకు వివాహం చేయించడంలో సహా యం చెయ్యమన్నారు.

కైకలూరు తాలూకా వరహాపట్నం గ్రామ శ్రీ కామినేని పట్టాభిరామయ్యగారు కమ్మవారు. గొప్ప భూస్వామి. వారి కుమార్తె బాలవితంతువు. ఆమెకు పునరి వాహం చేయించమని శ్రీ కో॥ గో॥ కృష్ణయ్యగారు నన్ను ప్రోత్సహించారు.

కమ్మవారిలో నాకు పలుకుబడి లేదనీ, పట్టా రామయ్యగారితో నాకు పరిచయం లేదనీ, ఆపని సాధ్య కాదనీ నే నెంతచెప్పినా వినక "ఆ గ్రామం వెళ్ళండి పట్టాభిరామయ్యను కలుసుకోండి; ఆ బిడ్డ అందమైనది చూస్తే తప్పకుండా వివాహం చేయించుతా"వని ఎంతో ప్రోత్సహించారు. ఈ ప్రోత్సాహంకంటె అన్ని కుల

స్తాను యీ సంస్కరణను ప్రవేశపెట్టాలి ముఖ్యంగా కమ్మ
వారిలో ప్రవేశపెట్టితే ఆంధ్రదేశమంతా చేయించామనే
తృప్తివుంటుంది, లేనిచో స్వకులాభిమాని అనే నిందకూడ
వస్తుందన్న ఆలోచన నన్ను పురికొల్పుతుండేది. కమ్మ
వారిలో "వైశ్యులకున్న ధైర్యసాహసాలు మనకు లేక
పోయెనే" అన్న చింత వున్నట్లు గ్రహించాను. శ్రీ కావి
నేని పట్టాభిరామయ్యగారిని కలుసుకొనుటకు వెళ్ళాను.
వారితో నేను వచ్చిన పనినిగురించి చెప్పాను.

ఆయన దుఃఖించి కండ్లనీరు పెట్టారేగాని, నోరు
తెరచి ఒక్కమాట మాట్లాడలేదు. కుమార్తెను చూపించనే
లేదు. ఆయన దుఃఖాన్ని చూచి తగిన వరుడు లభించితే
మన్నతించుననీ, భయపడితే మిత్రుడు గోపాలకృష్ణయ్య
వాకే ఆ బిడ్డను పెంచుకొని వివాహం చేయించగలడనే
నిశ్చయించుకున్నాను.

అయితే వర్ణణ సంపాదించడం ఎలా? గోపాల
కృష్ణయ్యగారికికూడా అది పెద్దచిక్కుగానే తోచింది.
పెద్దలు కుదరకముందే ఆ వివాహాన్ని యెలా జయ
ప్రదం చెయ్యాలా అనే యోచన నన్ను బాధించసాగింది.
సాధ్యమైన పనులను సాధ్యం చెయ్యాలనే కోరిక మనం
అందరిలోను వుంటుంది. నాలోనూ ఉంది. కాలం అలాంటిది.
కాలాన్ని ఉపయోగించుకోవాలని నా యోచన.

అప్పుడు "ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీసు" అ
కంపెనీ తరఫున రసాయినిక ఎరువులను వేయించి, ఉ
యోగపడునని చూపుటకు ఇన్స్పెక్టరుగా పనిచేస్తున్నాను
ఆంధ్రలో నా యిష్టంవచ్చిన చోటుకు ప్రయాణంచేయ
టకు కంపెనీవారు అవకాశమిచ్చారు. అనకాపల్లి లో
వ్యవసాయ పరిశోధన కేం దాన్ని చూడడానికి వెళ్ళాను
నాకు పరిచయంలేని ఆంధ్ర యువకుడు అక్కడ అసిస్టెంట
మేనేజరుగా వున్నాడు. నన్ను తన యింటికి భోజనాని
ఆహ్వానించాడు. తానుఉన్నవవారి శిష్యుడననీ, నన్ను ఎ
గుదుననీ చెప్పాడు. అతనిపేరు దాసరి బాపయ్య.బి.యస్.
కమ్మవారు; జన్మస్థానం గుంటూరుజిల్లా బ్రాహ్మ
కోడూరు.

భోజనానంతరం కొన్ని గంటలు గడిపిన తరువా
శ్రీ పట్టాభిరామయ్యగారి పుత్రికకు తగిన వరుడని తోచి
ఆయనతో ప్రస్తావించాను. తన కాక్షేపణ లేదనీ, తను
చిన్నతనంనుండి పెంచుకొన్న అక్కగారు (బాలవింతవ
తనకు మాతృసుల్యులనీ, ఆమెను ఒప్పించమనీ, బాధ
తను నామీద వేశారు. అమె నా ఎదుటికి రాదు; ఘోష
ఆమెతో ఎలా మాట్లాడాలో నాకు తోచలేదని బా
య్యతో అన్నాను. "ఫరవాలేదు, మాట్లాడవచ్చు"న
నాకు ధైర్యంచెప్పి, తాను ఆఫీసుకు వెళ్ళాడు. బాలవి
తువుల కష్టాలు ఆమెకు స్వయంగా తెలిసినందున నే

ఎక్కువగా బోధించవలసిన అవసరం లేకపోయింది. అయితే, ఈ ఉద్యమానికి తన తమ్ముడినే త్యాగంచెయ్యమని ఆమెను ఒప్పించడం మొదట్లో కష్టమైనా, చివరకు ఒప్పుకొన్నది. నేను బాపయ్యను కలుసుకొన్న 24 గంటలలో సరియైనవరుడు లభించాడు! ఆ పిల్లను బాపయ్యగారు చూచి సమ్మతించేవరకు వివాహవిషయమై పిల్లకెంత మాత్రం తెలుపకూడదని నా వుద్దేశ్యం. ఈ స్థితిలో వుండగానే శ్రీ కోవెలమూడి గోపాలకృష్ణయ్యగారు మరణించాగు. నే నిక రెక్కలుపోయిన పక్షిలాగా అవస్థ పడ్డాను.

భోగట్టా చెయ్యగా శ్రీ మాగంటి బాపినీడుగారి పెద్దక్క శ్రీ మాణిక్యాంబగారి కూతురు పట్టాభిరామయ్యగారి మరదలేనని, ఆమె ఈ బిడ్డను పెంచుకొన్నదనీ తెలిసింది. మాణిక్యాంబగారిని కలుసుకొని ఈ విషయమంతా చెప్పాను. ఆమె పిడుగులాంటి మనిషి; ధైర్యసాహసాలున్నమనిషి. ఆమెకూ యిలాంటి అభిప్రాయాలేవున్నై. కాబట్టి నా కృషి సులభంగా ఫలిస్తుందని ఎంతో సంతోషించాను. మాణిక్యాంబగారు ఆ గ్రామంవెళ్ళి పిల్లను,పిల్లతల్లిని, పినతల్లిని ఒప్పించి, తేదీ నిర్ణయించి, బాపయ్యను పంపమని వ్రాసినారు. ఈ విషయాన్ని వారు మగవారికి తెలుపనేలేదు. బాపయ్యను పంపాను. పిల్ల, పిల్లవాడు ఒప్పుకున్నారు ప్రమాణాలుచేసి, దండలు మార్చు

కొన్నారు. పెద్దలు ముగ్గురు అనగా స్త్రీలు మాత్రమే ఆశీర్వదించి, బాపయ్యను పెండ్లికి తయారు కమ్మని ఆజ్ఞ పెట్టారు. అంతవరకు పట్టాభిరామయ్య గారికీ, ఆయన తమ్ముడికీ తెలుపనేలేదు. చివరకు పట్టాభిరామయ్యగారిని కూడ ఒప్పించారు. తేదీ నిర్ణయమే కొరవ.

కమ్మనాయకుని అడుగు

పట్టాభిరామయ్యగారు రాజకీయాలలో అంటే పవర్ పాలిటిక్సులో గుడివాడ కమ్మనాయకుని అనుచరుడు తన బిడ్డ పునర్వివాహవిషయంలో తమ నాయకుని సలహా కోరాడు. నాయకుని జవాబు నాకు తెలియదు. బాపయ్య వివాహం తప్పక జరుగుతుందని నమ్మి పట్టాభిరామయ్య గారిని "మామ" అనీ, ఆయన కుమార్తెను "ప్రేయసి" "భార్య" అనీ ఉత్తరాలలో రాసేవాడు. వారిద్దరికీ ప్రేమ వృద్ధిఅవుతూ వచ్చింది. త్వరగా వివాహం జరగాలని ఇద్దరూ తీర్మానించుకొన్నారు. కాని, కొంతకాలానికి "మామగారు" ప్రత్యుత్తరాలు మానేశారు. బాపయ్య గారికి దుఃఖం, క్రోధము పెరిగిపోతూవున్నాయి.

ఈలోగా మరొక వత్తిడి వచ్చింది. బాపయ్య అన్నగారు జైపూరు ఎస్టేటులో అసిస్టెంటు దివాను. ఈ వివాహాన్ని మాన్పించమని దివానుగారు అసిస్టెంటు దివా రుగారితో గట్టిగా చెప్పడం ప్రారంభించారట. గుడివాడ

కమ్మనాయకుడుగారు యీ యెత్తు వేశారని బాపయ్య తలిచాడు. ఆయనను చంపి కసితీర్చుకోవాలనుకొన్నాడు! బెజవాడలో నా యింటికి వచ్చాడు. ఒక కత్తిని చూపించాడు. చంపుతానని చెప్పాడు అంతపనీ చేస్తాడనే నాకు తోచింది.

నాకు కావలసింది హత్యలుకాదు. బాపయ్యకు, ఆ అమ్మాయికి వివాహం చేయించడం, తద్వారా కమ్మవారిలో ఆంధ్రదేశంలో ఈ సంస్కరణ జయప్రదమయ్యేలా చేయుటే నా కర్తవ్యం. అదీగాక మరణశిక్షకు తగినంత నేరం కమ్మనాయకుడు చెయ్యలేదని నా తలంపు. ఆయన తన మనసు మార్చుకోకపోతే పరాభవం చెయ్యడం మాత్రమే న్యాయమని నా భావం. తుదకు బాపయ్య నాతో ఏకీభవించాడు. నేను చెప్పినట్లే చేస్తానని ప్రమాణం చేశాడు. కత్తిని మా యింట్లోపెట్టి బందరు వెళ్ళాము.

కమ్మనాయకుని ఎత్తులు ముందుగా తెలియనిదే లాభంలేదు. కాబట్టి, బాగా భోగట్టా తెలుసుకోవాలనుకున్నాను. అప్పుడు కమ్మ సంఘాధ్యక్షులు శ్రీ కొమ్మారెడ్డి పట్టాభిరామయ్యగారు పవర్ పాలిటిక్సు ఎరుగనివారని, ఆయనద్వారా నిజం తెలునుకోవచ్చునీ ఎవరో సలహా యిచ్చారు.

శ్రీ కొమ్మారెడ్డి పట్టాభిరామయ్యగారు మమ్మలను మర్యాదచేసి నిర్మొగమాటంగా ఉన్నది ఉన్నట్లు

చెప్పారు. గుడివాడ కమ్మనాయకుని పార్టీలో వధువు తండ్రి చాలా ముఖ్యమైనవారని, ఆయన్ను పార్టీ లోనుండి పోగొట్టుకోరనీ, బాపయ్య అన్నగారిమీద తెచ్చిన ఒత్తిడి ద్వారా వివాహాన్ని ఆపలేఁపోయారనీ. అందువల్ల మరో ఎత్తుఎత్తారని చెప్పారు. వివాహం చేయించుతానని పట్టాభి రామయ్యగారికి మాట యిచ్చి, చేయించకుండా కాల యాపన చేసేందుకు ప్లాను వేశారట. "వివాహం చేయదల చితే ఏ అనామకుడికోగాక, ఒక అడ్వొకేటుకు యిచ్చి పెళ్ళిచేసి గుడివాడలోనో, బందరులోనో ప్రాక్టీసుపెట్టించి డిస్ట్రిక్టు మునసబు ఉద్యోగం యిప్పించడం మంచి"దని నాయకుడు తన అనుచరునకు సలహా ఇచ్చారు. బాపయ్య కివ్వడం మానెయ్యమన్నారు. ఇకనేం బాపయ్యను మానే శారు, అయితే అడ్వొకేటు లభించాలిగా! చిత్తూరు జిల్లాలో లభిస్తాడని పుకారు పుట్టించారు. వరాన్వేషణకని ఎవరినో పంపారట. ఇదంతా వివాహం జరగకుండా గడపడానికేనని రూఢిగా శ్రీ కొమ్మారెడ్డిగారు చెప్పేశారు. తానిలా చెప్పి నట్టు తనపేరును వెల్లడించవద్దని కోరారు. అలాగే చేశాము.

అంతట మేము దీర్ఘంగా ఆలోచించి ఒకప్లాను వేసుకొన్నాము. "నాయకుడిని" ప్రత్యేకంగా కలుసుకొని ఆయన నేరాన్ని ఒప్పించాలి. బాపయ్య వివాహం వెంటనే చేయించడానికి సమ్మతింపజేయాలి; అలా అంగీ

కరించకపోతే మేము బాగా పరాభవించాలి. అందుక
కనీసం ఆరుమాసాల జైలుశిక్షకు మేమిద్దరం సిద్ధపడాలి
ఇదీ మా ప్లాను.

నాయకుడిగారి యింటికి వెళ్ళాము. మేడమీ
వరండాలో జనం గుంపులు గుంపులుగా వున్నారు
ఇదంతా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి
మాతో ప్రత్యేకంగా మాట్లాడేందుకు నాయకుడిని ఒప్పి
చాము. అందరిని బయటికి పంపారు. గదిలో ముగ్గుర
మాత్రమే వున్నాం. అప్పుడు బాపయ్య మాట్లాడకూడదు
నే నొక్కడినే మాట్లాడాను.

నాయకుడుగారు తమ నేరాన్ని ఒప్పుకోలా. మాక
తెలిసిన విషయాలన్నీ పూసగుచ్చినట్లు చెప్పగానే ఆయ
నిర్ఘాంతపోయాడు. కొంచెంసేపు ఆలోచనలో పడ్డారు. త
యెత్తిపూచి వచ్చారు. "ఆ పిల్లనిస్తే బాపయ్యకు వివాహ
చేయించుతా" నన్నారు. అయితే "రెండుమాసాల త
వాత ఎప్పుడైనాసరే చేయిస్తా" నన్నారు. "కాద
వెంటనే చెయ్యా"లన్నాను. "పరిస్థితులు అనుకూలంగ
లే"వన్నారు. "ఎన్నికలేనా కారణ?"మన్నాను. "అవు
నని నవ్వారు. చేతిలో చెయ్యి వేయించుకొని వచ్చేవ
ఆయన తు-చ-తప్పకుండా చేశారు; గాని కష్టాలే
తప్పలేదు. నీరూరినట్లు కష్టాలు వస్తూనే వున్నాయి. బె
వాడలో కమ్మ విద్యార్థి హాస్టలులో వివాహానికి ఏర్పాట

వేశాము. బెజవాడ వర్తకులైన శ్రీ ఎర్నేని లక్ష్మీనారా
యణ చౌదరిగారు అన్ని ఏర్పాట్లు చేయించారు. ఆంధ్ర
దేశమంతటా కమ్మవారిలో ప్రచారం జరిదింది; వధువు
తరపువారు శ్రీ లక్ష్మీనారాయణగారి యింటిలో దిగారు;
వరుని వైపువారు మా యింటిలో రెండిండ్లలోని స్త్రీలు
పురుషులం కలసి బంధుమిత్రులను వివాహానికి అహ్వానిం
చాము. సంస్కరణాభిలాషు లెందరో ఆంధ్రదేశమంతటి
నుండి వచ్చి మా యింట్లో దిగారు. పాలపర్తివారు,
పాలికచర్లవారు, మంత్రవాదివారు, జవ్వాజివారు, మల
లికవారు, యామినీవారు షుమారు 50 మంది వచ్చారు.
బాపయ్య తల్లి, అక్క, అన్నగారు కూడా మా యింట్లోనే
దిగారు.

వీరందరూ రావడం నాకెంతో ఆనందంగావుంది.
యితే అది కొన్ని నిముషాలుమాత్రమే. బాపయ్యతల్లి
గారు నావద్దకువచ్చి "నే నెందుకు వచ్చానో తెలుసా?
పెళ్ళి చేయించడానికి కాదు: చెడగొట్టడానికే వచ్చాను.
నీ కొడుకుని నాశనం చెయ్యడానికి పూనుకున్నావా
ంచయ్యగారూ?" అని ఉగ్రురాలై కేకలు వేసింది.
నీ కేమీ తోచలా. తమాషాచేసి చూద్దామని "అమ్మా!
నలా చేస్తానా? ఈ పెళ్ళికి కారకుడు యీ బ్రాహ్మడే"
నా మిత్రుడు శ్రీ మంత్రవాది వెంకటరత్నంగారివైపు
న్ను కొట్టాను. "బ్రాహ్మణ మంత్రాంగమా!" అన్నది.

ఆయన మీదికి దూకింది; జుట్టు లంకించుకొని చెయ్యి త్తింది. కొట్టింది కూడాను. భారీ మనిషి; బలశాలి. మేమందరం ఆమెను లాగేసి, ఒక గదిలోవేసి తాళం వేశాము.

బాపయ్యగారిని సలహా అడిమము. తనతల్లి పెండ్లికి రావలంసిదేనని ఖండితంగా చెప్పాడు. అప్పుడు అంటే పెండ్లికి ముందురోజున వచ్చిన కమ్మ నాయకులను కలుసుకొని, ఆమె మనస్సు మార్చమని చెప్పాము. ముఖ్యంగా బ్రహ్మణ కోడూరువారిని పంపాము. కొంతవరకు శాంతించింది. మరునాడు పెండ్లివేళకు ఆమెను విడిచిపెట్టాము.

పెండ్లికి అయిదారువేలమంది కమ్మవారు వచ్చారు. స్థానిక పెద్ద లెందరో వచ్చారు. దూరపట్టణాలనుండికూడా వచ్చారు. సహపంక్తి భోజనాలు చేశారు. వితంతు వివాహాలు చేసుకోవచ్చుననీ, సంఘ ఆక్షేపణ లేదనీ కమ్మవారొక్క వివాహంతోనే తీర్మానించారు. శ్రీ అడుసుమల్లి వారు ఒక ప్రకటనచేశారు. ఇక జరుగ బోయే ప్రతివివాహానికి రు 250 ల చొప్పున మొదటి డజను పెండిండ్లకు బహుకరిస్తామని ఆ సభలో అందరికి ఉత్సాహం కలిగేలా మాట్లాడారు.

శ్రీ అడుసుమల్లి వారితో కలసి, శ్రీ జాగర్లమూడి వారు కూడ నడుం బిగించి వడ్డించడం ప్రారంభించారు.

ఏమి ఎత్తు వేస్తున్నారోనని మేము సంశయించి, యిద్దరిని అందరిలో కలిసి భోంచెయ్యమని ప్రతిమలాడాము. రెండవ పంక్తిలో కూర్చుంటా మన్నారు. ఈలోగా శ్రీ జాగర్లమూడివారు మాయమైపోయారు.

బాపయ్యతల్లిగారు చాలా సంతోషించారు. వెళ్లేటప్పుడు నాకు నమస్కారం చేసి నవ్వింది. కృతజ్ఞతపూర్వకంగా చూస్తూ వెళ్ళింది. ఆ చూపు ఇప్పటికీ నాకు జ్ఞాపకమే.

తరువాత కమ్మ సంఘంలో వివాహాలు వెంటనే జరిగాయి. వీరేశలింగంగారు నాటిన విత్తనం యాభై ఎండ్లకు పెద్ద వృక్షమై ఆంధ్రదేశంలో అనాథ స్త్రీలకు ఆశ్రయమిచ్చింది. ఇదంతా చూడకుండానే మిత్రుడు శ్రీ కోవెలమూడి గోపాలకృష్ణయ్యగారు చనిపోయినందుకు విచారపడ్డాను.

ఇక్కడ మరోవిషయం చెప్పాలి. కమ్మనారిలో మొదటి వితంతూద్వాహం అంతకుముందే జరిగింది. ఆ వివాహం చేసుకున్నది నామిత్రులు డాక్టరు మూల్పూరి రంగయ్యగారు, వారి సహధర్మిణి చుక్కమ్మగారు. ఇది రహస్యంగానే జరిగింది. ప్రజామోదంతో, కమ్మసంఘం సమ్మతితో జరగిన ప్రథమ వివాహం బాపయ్యగారిదే.

బాపయ్యగారు నన్ను కలుసుకున్నప్పుడు "మామ గారూ" అనీ, ఆయన బిడ్డలు "తాతగారూ" అనీ పిలు స్తుంటే నా కెంతో ఆనందంగా ఉండేది.

విశ్వబ్రాహ్మణులలో వితంతు వివాహం

వైశ్యులలో, కమ్మవారిలో, బ్రాహ్మణులలోను వితంతు వివాహాలు సర్వసామాన్యమైనాయి. కాబట్టి తతిమ్మా కులాలలో తమంతట తామే చేయించుకుంటారని నమ్మాను. కాని అలా జరుగుటలేదు. ఏ కులానికి ఆ కుం కిట్టుబొట్లూ, నాయకులూ వేరు. హిందూసంఘం ఎంత హీనస్థితికి వచ్చిందోచూడాలంటే విశ్వబ్రాహ్మణుల్లో సంస్కరణలు చేయించి చూడాలి. ఈ సంఘంలోని అభ్యు గతి ముందుగా తెలిసివుంటే వారిలో వితంతు వివాహము చేయించటానికిసాహసించియుండను. తెలియకబ్రారంభించి విపరీతమైన కష్ట పరంపరలను ఎదుర్కొవలసి వచ్చింది. పూర్తిఅయ్యేలోగా తలప్రాణం తోక కొచ్చింది.

ఈ ఉద్యమం అప్రయత్నంగానే ప్రారంభమైనది. గుంటూరులో రెండవ వితంతూద్వాహ సమయంలో శ్రీమతి ఉన్నవలక్ష్మీబాయమ్మగారు ఉపన్యసించారు. ఆమె వెంట అందమైన బట్టలతో, ఒంటిసిండా నగలతో, అలంకరించుకొన్న 10 సంవత్సరముల బలిక ఉన్నది. ఆ బిడ్డను చూపించి "వితంతు"వని చెప్పారు. సభికులందరు విచారపడినారు.

ఆ బిడ్డ విశ్వబ్రాహ్మణులు-పెడన వాస్తవ్యులు శ్రీ కొండిపర్తి చంద్రకాంతముగారి తనయ. ఆయన బట్టల వర్తకుడు; ధనికుడు. ఆ బిడ్డ ఒక్కతే ఆయనకు సంతానం కొంతకాలానికి పిల్ల తండ్రిని రప్పించి మాట్లాడాను పునర్వివాహానికి సమ్మతించారు. తనదగ్గరి బంధువర్గంలోనే వరుడు లభిస్తాడనీ, తానే నిర్ణయించగలననీ చెప్పారు. ఎంత ధనాన్నైనా ఖర్చుచేయుటకు సిద్ధమైనారు. కాని, ఈ వివాహాలకు డబ్బెందుకు? కులంలో కలసివచ్చే సంస్కార ప్రియులు కావాలి. రజస్వల కాకముందే పునర్వివాహం చేయించమని కోరారు. నా కిష్టంలేకపోయినా, ఆ సంఘు పరిస్థితిల్లో అది కూడ గొప్ప కార్యంగానే తోచింది. ఇతర సంఘాల్లోకూడ "రెడ్డొచ్చె మొదలెట్ట"మన్నట్లుగా వుంది. మొట్టమొదట రజస్వలకాని వితంతువుకే పెళ్ళి చెయ్యాలనేవారు. తరువాత రజస్వల అయినా భర్తతో కాపురం చెయ్యకూడదు; మూడోమెట్టు భర్తతో కాపురం చేసినా, బిడ్డను కని వుండకూడదు; ఆఖరున బిడ్డలుగల వితంతువైనా సరేనన్నారు. విశ్వబ్రాహ్మణులలోను అలాగే మొదటిమెట్టుతో ప్రారంభమైంది.

అయితే, విశ్వబ్రహ్మణ సంఘంతో నాకు పరిచయం లేదు వారిలో నాకు స్నేహితులా లేరు, కాబట్టి, ఆ సంఘంలో పనిచేయుటకు నాకు శక్తిచాలదని కొంత

కాలం పూరుకున్నాను కాని, పిల్లతండ్రి త్వరపడు తున్నందున కార్యభారం వహించాల్సి వచ్చింది.

ఈ పరిస్థితుల్లో విశ్వబ్రాహ్మణ సంఘంలో ప్రసిద్ధి కెక్కిన శ్రీ గొనాల రామమూర్తిగారినీ, శ్రీ పెదబ్రోలు సూర్యనారాయణరావుగారిని (1928-30 సం॥మధ్య) కలుసు కొన్నాను. వారు సహాయం చేస్తామన్నారు. ఒక స్థాను వేసుకున్నాము.

మా ఉద్యమానికి అనుకూలురను, ప్రతికూలురను వేరుచెయ్యాలి కరపత్రాలద్వారా ఆ సంఘాన్ని రెండు ముక్కలు చేశాము. "ఆంధ్రరాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘ సంస్కరణ మహాసభను" మా యింట్లో పెట్టి అనుకూలు రను సమావేశపరిచాము అయితే, అధ్యక్షులుగా ఉండటా నికి వారిలో ఒక్కరూ అంగీకరించలేరి. ధైర్యసాహసాలు గల శ్రీ సూర్యనారాయణరావుగారు దూరంగావుండి మాత్రమే సహాయం చెయ్యదలచారు. కాబట్టి శ్రీ మోతే నారాయణరావుగారు అధ్యక్షులుగాను, నేను కార్యదర్శి గాను నాటకం నడిపాము.

మహాసభకు షుమారు 50 మంది వచ్చారు. వారిలో గొప్ప పండితులు, శాస్త్రజ్ఞులు, వేదాలు శాస్త్రాలు బాగా వల్లించగలవారూ వచ్చారు. వైదిక బ్రాహ్మణ సభలా ఉంది; ఏది చర్చించబోయినా సంగతి సందర్భం లేకుండా

శాస్త్రచర్చగా మార్చేవారు. వితంతూద్వాహాలు శాస్త్ర సమ్మోదమేనని తమ పాండిత్యాన్ని వెల్లడించుటకు ప్రయత్నించారు. చివరకు నిర్వాహక సంఘాన్ని ఏర్పాటు చెయ్యాల్సివచ్చింది. ఎవరూ ఉండనంటారే! కొందరిని ఒప్పించగానే హాజరైన యాభైమందీకూడ దాంట్లో ఉండా లన్నారు. వైదికులను వైశ్యులను సంస్కరించటమే సులభమనిపించింది.

కొంతకాలానికి పెడనలో పిల్లతండ్రిగారి యింటి లోనే వివాహానికి ఏర్పాట్లుచేశాము. బెజవాడనుంచి నేను, నా భార్య అన్నపూర్ణమ్మ, శ్రీ అయ్యదేవర కాళేశ్వర రావు పంతులుగారు, శ్రీ డాక్టరు గోవిందరాజులుగారు వివాహానికి బయల్దేరి వెళ్ళాము. సాయంత్రం 7 గంటలకు పెడన స్టేషనులో దిగాము. మమ్మ ఆహ్వానించడానికి ఎవరూ రాలేదు. స్టేషను మాష్టరును అడిగితే వివాహం సంగతే తనకు తెలియదన్నాడు. సామాను మోయుటకు కూలీలైనా లేరు. శ్రీ కాళేశ్వరరావు పంతులుగారు సామాను మొయ్యలేరు. అన్నపూర్ణమ్మగారి చంకలో చంటిబిడ్డవుంది. మా అందరి సామాను డాక్టరుగారు నెత్తిని, బుజాలమీద వేసుకొన్నారు. వారి ఉత్సాహం చూచి నాకు సిగ్గేసి, నేనూ కొంత సామా నెత్తుకున్నాను. ఊళ్ళోకి వెళ్ళుతుండగా దారిలో ఒక ఒంటెద్దుబండి, లాంతరులతో వధువుతండ్రి ఎదురయ్యారు.

తన ముగ్గురు అన్నగార్లలో ఒకరు పెళ్ళికి సమ్మతించలేదట; సమిష్టికుటుంబం కావడంవల్ల ఎదిరించలేక— ఎన్నిలక్షల ఆస్తి వుంటేనేం?— వివాహం మానేశాడు. ఆయన, ఆయన భార్య వివాహం చేయించడానికి సిద్ధమేనట. అయితే, బంధువులు కలిసిరానందున నిరుత్సాహపడ్డారట. మేము భోంచేసి పడుకొనేముందు "కాళేశ్వరరావు పంతులుగారూ! ఏదైనా ఎత్తువేసిచూడండి!" అని చెప్పారు రాత్రి రెండుగంటలప్పుడు బాజాలు వినబడ్డాయి. నిద్రనుండి లేచాను. పంతులుగారు సమర్థులని నాకు తెలుసు అన్నదమ్ములందరిని పంతులుగారు ఒప్పించారు. పెళ్ళి జరుగుతుంది. బంధుమిత్రులను పిలుచుకొని రావటానికి కార్లు, లారీలు వగైరా చోట్లకు వెళ్ళాయన్నారు. 2—3 వందలమంది విశ్వబ్రాహ్మణులు వచ్చారు. ముందుగానే ఏర్పాట్లు సవ్యంగా జరిగివుంటే 5-6 వందలమంది వచ్చివుండే వారట, తెల్లవారుఝామున 4 గంటలకు వివాహం జరుగుతూండగానే మరో వివాహానికి వధూవరుల ఏర్పాటు జరిగిందనే శుభవార్త ప్రకటించారు. సంతోషంగా తెల్లవారింది.

పెండ్లికి వచ్చిన బంధువుల్లో ఒకొక్కక్క స్త్రీ ఒకొక్కక్క పొయ్యి ముట్టించారు. ఆ కులంలో సహపంక్తి భోజనాల సాంప్రదాయం లేదట. మాకు మాత్రం బ్రాహ్మలచేత వడ్డించారు. వారితో కలసి భోంచెయ్యాలని మేము పట్టు పట్టాము. కాని వధూవరులతోనైనా కలసి భోంచేయ

డానికి వల్లకాదన్నారు. శ్రీ పెదబ్రోలు సూర్యనారాయణ గారి అవస్థ చేమని చెప్పను! ఆయనకు భార్యలేదు! విశ్వ బ్రాహ్మణులు భోజనం పెట్టరు; పెట్టినా ఆయనతినకూడదట! మాతోనూ కలసి భోంచెయ్యడు. మిఠాయి కొని తెచ్చు కొని కాలం గడిపారు కంసాలి పెళ్ళికి ఇంటినిండా పొయ్యిలే సన్న సామెత తెలిసిపోయింది. ఇండియాలో అలాంటి సంఘమున్నదని నా కంతవరకూ తెలియదు. ఆ కులానికి విమోచనం చాలా కష్టమని తోచింది. ఆ తరువాత విశ్వ బ్రాహ్మణులలో చాలా వివాహాలు జరిగాయి. కొన్ని సంద ర్భాల్లో దెబ్బలాటలు, కేసులు జరిగినా సంస్కరణోద్య మము బలపడుతూ వచ్చింది.

ఓటమి

ఒకటి రెండు వివాహాల విషయంలో చాలా ఓడి పోయాను. ముఖ్యంగా ఒక కేసును గురించి వ్రాస్తాను. బెజవాడలో శ్రీ ఆర్. యల్. యన్. శాస్త్రిగారుండేవారు. వారు నా స్నేహితులు. వారికీ, వారి భార్యకూ వితంతు వివాహాల పట్ల అభిమాన మేర్పడింది.

వారి ప్రక్కయింట్లో ఒక బాల వితంతువు ఉన్నది. 16 సం॥ల వయస్సు. వివాహం చేయించమని శాస్త్రిగారినీ, వారి భార్యనూ అడిగింది. ఆవిడికు ఒక అన్నగారు, తల్లి దండ్రులు వున్నారు. అన్న తన వివాహానికి తప్పక ఒప్పు కుంటాడని ఆ పిల్ల కెంతో నమ్మకం. ఆ వయసులో గా

యను సమ్మతి లేకుండా పెళ్ళి చేసుకోడానికి చట్టం ఒప్పదు కాబట్టి తన అన్నగారితో మాట్లాడిచూడమని సలహా యిచ్చాము. మరునాడు శాస్త్రి దంపతులు ఏడుస్తూ మా యింటికి వచ్చారు. వారి దుఃఖానికి కారణం యిది: ఆ బాలవితంతువు అన్నగారితో చెప్పగా చెల్లెలిని కోప్పడి తిట్టాడట; తల్లిదండ్రులకు రిపోర్టు చేశాడట; అందరూ కలసి పిల్లను బాగా కొట్టారట; వంటయింట్లో వేసి మూసే శారట; పాపం! ఏడుస్తున్నదట; ఎలా రక్షించడం? ఆమెను కలుసుకోడానికి సాధ్యపడలేదు. సంగతి సంద ర్భాలు తెలుసుకోటానికైనా పిల్లేకుండా తల్లి తండ్రులు కాపలాకాస్తున్నారు.

ఆ పిల్లను రక్షించేందుకు మార్గం తోచక, నాశక్తి హీనతకు విచారపడ్డాను. గుంటూరు వెళ్ళి మిత్రుడు తెలికచర్ల రామమూర్తిగారితో చెప్పాను. ఆయన కాలేజీలో టీచరు. ఇద్దరం కలిసి మా మిత్రుడు శ్రీ కె. కల్యాణ స్వామి (సబ్ జడ్జి) గారి వద్దకు వెళ్ళి చట్టంలో ఏమున్నదో చెప్పండని కోరాము. ఆ పిల్లను తల్లిదండ్రుల యింటి నుండి లేవదీసుకొచ్చి వివాహం చేయించాలి. వయసు చాలనందున, ఆ పిల్ల స్వతంత్రించి చేసుకోకూడదు. కాబట్టి ఆమెకు సహాయం చేసేవారికి కనీసం ఆరునెలల శిక్ష తప్పదు. అయితే కోర్టులో యీ విషయాలను బయటపెట్టి బాగా ప్రచారం చేసుకోవచ్చు. సాహసించండని జడ్జిగారు

ప్రోత్సహించారు. నా మిత్రుడు శ్రీ తెలికచర్ల రామమూర్తిగారు జైలుకు సిద్ధపడ్డారు; గతో బెజవాడకు వచ్చారు. శాస్త్రి దంపతుల సహాయంతో ప్రయత్నించాము. రాత్రింబవళ్లు ఆ యింటిచుట్టూ వీధుల్లో తిరిగాము. మూడురోజులు ప్రయాసపడినా ఫలితం లేనందున విసుగెత్తి మానేశాము.

ఆపిల్లకు తల బోడిచేయించారు. పునర్వివాహంకంటె వ్యభిచారమే మేలన్నారు. పాపం! చెడిపోయింది! మూడేళ్లు గడిచాయి. ఒకనాడుశాస్త్రిగారు నన్ను తమయింటికి తీసుకెళ్లి ఆమెను పరిచయంచేశారు. వివాహానికి సహాయం చేస్తానని చెప్పాను. 'పెళ్లి చేసుకోవాలను కున్నందుకు అన్ని కష్టాలు వచ్చే, మరి వివాహం చేసుకొన్న తరువాత ఇంకెన్ని కష్టా లుంటాయో! నాకు పెళ్లొద్దని, ఖండితంగా చెప్పేసింది. రామమూర్తిగారి త్యాగం, దంపతుల దుఃఖం నాకు జ్ఞప్తికొస్తూండేవి

ఇదే బ్రాహ్మణసంఘంలో నేను వితంతూద్వాహం చేయించడానికి చేసిన మొదటి ప్రయత్నం. ఇప్పటి వారిలో ఎనెనోన్నో జరిగిపోతూ వున్నాయి. కాని, సంఘాన్ని ఒకటిగా చేయడం ఎవరికీ సాధ్యంకాని పని యని తలిచాను. ఆ కులంలో ఉద్యమ రూపంగా నే నేమీ చేయలేదు. నావద్దకు వచ్చిన వితంతువులకు మాత్రం పెళ్లిళ్లు చేయించుచుంటిని, 1930 తరువాత మద్రాసులో

మేము స్థాపించిన వితంతు శరణాలయానికి వచ్చి సహాయం పొందిన స్త్రీలలో ఎక్కువమంది బ్రాహ్మలే.

నేను చేయించిన వివాహాల్లో కొన్ని జయప్రదం కాలేదు; అయితే అవి చాలా తక్కువే ననుకొండి. వాటిని గురించి, ఈ ఉద్యమంలో కలిగిన కొన్ని అనుభవాలను గురించి 1932 లో 'భారతి' లో రెండు వ్యాసాలు వ్రాసి, ప్రకటించాను.

ఇంటగెలవాలి

నేను చేస్తున్న సంఘసంస్కరణలు నా జన్మస్థానము కనిగిరిలో మా కులపెద్దల కెంతమాత్రం యిష్టం లేదు. ముఖ్యంగా నా బావగారు (శ్రీ నీలిశెట్టి గురవయ్య గారు) ఇతర బంధుమిత్రులకు యిష్టంలేదు.

కనిగిరి తాలూకా వైశ్యులు కడుబీదలు. వారు కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాలలో నీళ్ళు మోసి, వంటలు చేసి, బిల్లర వ్యాపారాలు చేసి, బట్టల మూటల వ్యాపారాలవల్ల కొద్దో గొప్పో సంపాదించుకొచ్చి స్వగ్రామాల్లో కుటుంబ పోషణ చేసుకుంటారు. ఏటేటా ఇలాగే కష్టపడుతుంటారు. అట్టివారు తిరిగి కనిగిరి వెళ్లినప్పుడు హోటళ్లలోకూడ భోజనంపెట్టటం మానేశారు. వారు వితంతూద్వాహములలో పాల్గొనకపోయినా, వ్యతిరేకంగా పనిచేసినాకూడా ఆ డెల్టా జిల్లాలనుండి వచ్చినంత మాత్రాన కుటుంబహిష్కారం చేశేవారు. ఇది ఘోరమైన

శిష్ట! కొందరు నాతో మొరపెట్టుకున్నారు. నేను కనిగిరికి వెళ్లి "మీ రెంత" అని ధిక్కరించి, సవరించి రావాలి. అందుకోసం పని పెట్టుకొని వెళ్లాను

ఆ వూళ్ళో నా చెల్లెండ్లు ఇద్దరున్నారు. పెద్దబావ గారు ఛాందసులు. చిన్నబావగారు 1920 మొదలు 1930 వరకు నాతో సహపంక్తి భోజనం మానేశారు. చిన్న బావ గారి యింటికే వెళ్ళాను. పెద్దవారు చిన్నవారితో "చంచన్నకు భోజనం పెట్టావా, వెలేస్తారు. ముందుగా పెద్దశెట్టి గారి ఉత్తరువు తీసుకో ! జాగ్రత్త!" అని పిరికిమందు పోశారు. పెద్దశెట్టిని అడిగితే తానేమీ చెప్పలేనన్నాడు. నేను ఈ కష్టాలు వస్తాయని గ్రహించే. అపక్వాహారాలు దండిగా తీసుకెళ్ళాను. నా చెల్లెలు ధైర్యశాలి; భోంచెయ్యాలి సిందేనని నిర్బంధంచేసింది. "కులంలో వెలివేస్తే జులాన్నా చెల్లించుకొని మళ్ళీ కులంలో చేరవచ్చు" నని వాదించింది. మా చిన్నబావ అంగీకరించక తప్పలా; నే నెంత చెప్పినా నా చెల్లెలు ఒప్పుకోలేదు. మరి భోంచేశాను.

కుల పెద్దను పిలిపించాను; కాని, ఆయన రాలేదు. భయపడిపోయాడు. కులపెద్దల యిండ్లలో జరిగే గుసగుసలు యువకులు నాతో చెప్పుతూవచ్చారు. యువకులందరూ నా కనుకూలురే సాయంత్రం ఒక బహిరంగసభ నేర్పాటు చేశారు వైశ్య సంఘనాయకులు.

అప్పుడొక చిన్న అల్లరి చేశాను. ఒకప్పుడొక చోట వితంతు వివాహం చేసుకొన్నవారిని బహిరంగంగా

బహిష్కరించి నందుకు కోర్టులో కేసు నడిచింది. బహిష్కరించినవారికి కారావాసము. జులాన్నా విధింపబడ్డాయి. ఆ తీర్పును కరపత్రాలుగా అచ్చువేయించి వుంచాను. వాటి నా మీటింగుకు వచ్చేవారికి పంచిపెట్టారు నా శిష్యబృందం. పెద్దలు చదువుకొని భయపడి సభకే రాలేదు. యువకులుమాత్రమే వచ్చారు. వితంతువివాహాలు చేయించి నందుకు నన్ను అభినందించుతూ తీర్మానించారు. మరునాటి ఉదయం పెద్దశెట్టిగారు నన్ను కలుసుకొని, ఇక మీదట ఎవరినిగాని బహిష్కరించమని హామీ యిచ్చారు. 24 గంటలలో పని పూర్తయిపోయింది. ఇది 1930 లో జరిగింది. ఇప్పుడా తాలూకాలో ఎవరింటిలో వారే వితంతు వివాహాలు చేస్తున్నారు.

పర్యవలోకనం

మా ఇంట్లో వధువు లెందరో వుంటూండేవారు. నాభార్య అన్నపూర్ణమ్మ వారి నెంతో ప్రేమగా చూచుకొనేది. ఇలాంటి సంఘసేవ చేయ్యాలన్న ఆశతోనే ఆమె నన్ను వివాహం చేసుకొన్నది. సంఘసంస్కరణోద్యమాలంటే ఆమె కెంతో సంతోషం. వధువులతో ఆమె చాలా చనువుగా వుండేది; వారు వదుసలతో పిలుచుకొనేవారు. ఆ అమ్మాయిలు నాతోకూడ తమ కష్టసుఖాలను చెప్పుకొనేవారు. ఆ పిల్లలను తమాషాగా "ఎందుకమ్మా! మళ్ళీ వివాహం చేసుకోవాలనే పట్టుదల నీకు?" అని అడిగే

వాడిని. వారు ఉన్నది ఉన్నట్టుగానే జవాబిచ్చేవారు. వారి వారి కోరికలు విచిత్రంగా వుండేవి. ఒకామె వయస్సు 16 సం॥ లు. అమాయికురాలు. ఆమె "అందరికీ ఎందుకో నాకూ అందుకే"నన్నది ఇంకా "నా తోటివాళ్లు పూలు, నగలు, బొట్టు పెట్టుకొంటూంటే, నాకు లేకపోయెనే అని విచారంగా ఉన్న" దన్నది. "ఇవన్నీ నువ్వు పెట్టుకోడానికి సంఘం సమ్మతించితే, వివాహం మానేస్తావా?" అన్నాను. నవ్వింది. మరొకావిడ "ఒకబిడ్డను కనాలని, ముద్దాడుతూ పెంచుకోవాలని కోరిక ఉందండీ" అన్నది. ఇలాంటి కోరికలను మన ఛాందసులు గ్రహించలేరు గదా!

వితంతువులు చాలామంది వివాహాలు చేసుకోవడం లేదు, అందుకు ముఖ్యంగా ఒక కారణం తెలిసింది. వివాహాలకు ఆర్థిక పరిస్థితులకు దగ్గర సంబంధం వుంది. వివాహం నిమిత్తం నా దగ్గరకు వచ్చిన వారిలో బాగా భాగ్యవంతులుగాని, నిరుపేదలుగాని లేరనే చెప్పవచ్చు. మధ్యతరగతిలో పుట్టి పెరిగి, పేదవారైన తలిదండ్రులు తమ వితంతుబిడ్డలను పోషించలేక, బిడ్డలచే నౌకరీ చేయించుటకు యిష్టపడనివారే పెండ్లికి సమ్మతించుతూ వచ్చారు, భర్త ఆస్తి సంక్రమించిన వితంతువుకు పునర్వివాహం జరగడం అసంభవంగా వుండేది. పెండ్లి చేసుకుంటే ఆస్తిపోతుందని పెద్దవారి భయం. అలాంటి ఆస్తి ననుభవించేవారు విధవ కుమార్తెల చేతుల్లో ఏ పురాణాలో, శాస్త్రాలో పెట్టి, పాతివ్రత్యాన్ని గురించి హరికథలు

చెప్పించి, కాశీ రామేశ్వరయాత్రలకు పంపి, పునర్వివాహంమీద యిష్టం కలుగకుండా చేస్తారు. చాల బీద వారై కాయకష్టంవల్ల జీవించే తల్లిదండ్రులు తమ వితంతు కుమార్తెలచే పనులు చేయించి వారి సంపాదనతో జీవయాత్రసాగిస్తూ తమ బ్రతుకుదెరువు పోతుందేమోనని పునర్వివాహాలకు అడ్డుపడుతుంటారు.

సంఘంలో ఆక్షేపణేమీ లేకపోయినా, ఆర్థికంగా ఆటంకాలుండడంవల్లను, ఆ విషయంలో చట్టం అనుకూలంగా లేనందునా చాలమంది వితంతువులు వివాహం చేసుకోవడంలేదు. విద్యావంతులైన వరులు వివాహాల ద్వారా ఆస్తి సంపాదించాలని రెండిటికి ముడిపెట్టటం కూడా నాకు బాగా తెలుసు. కాబట్టి, నా ప్రయత్నం ఎంత ఫలించినా, ఈ ఉద్యమంవల్ల మేలు పొందినవారు కొందిమందే ననక తప్పదు. పారిశ్రామిక నాగరికతతోను, సోషలిజంతోను మనసంఘంలో ఆ మార్పులు రాగలవేగాని, ఇప్పుడుండే జమీందారీ సాంప్రదాయాలు, ఫ్యూడల్ సంఘం ఉన్నంతవరకు ఆటంకాలు వుంటూనే వుంటాయి.

1924 లో ప్రారంభించి 1930 వరకు ఈ వితంతూద్వాహోద్యమాన్ని ఎంతో ఉత్సాహంతో నిర్వహించాను. ఆటంకాలు, కష్టాలు పోయి, నా మిత్రులనేకమంది స్వయంగా చేయించగలిగారు. అందువల్ల నా బాధ్యత తగ్గింది. ఇక నా దృష్టి ఇతర సంస్కరణలమీదికి మళ్ళి

నది. భ్రూణహత్యలను నివారించి శిశువులను కాపాడాలనే ఉద్యమం ప్రారంభించాను. వితంతు వివాహోద్యమంలో పాల్గొనడం తగ్గించాను.

భార్యల సహాయంలేనిదే స్త్రీల ఉద్యమాలను పురుషుల మెంత ప్రశమపడినా జయప్రదం చెయ్యలేము. నా ప్రథమ భార్య అన్నపూర్ణమ్మకు స్త్రీ ఉద్యమాలయందు ఎంతో ఉత్సాహముండేది. ఎందరో స్త్రీలు మా యింట్లో ఉండేవారు. వారందరిని ప్రేమతో ఆదరించేది అన్నపూర్ణ. వారు అన్నపూర్ణమ్మను ఎంతో ప్రేమించేవారు. జయాపజయాలు, ఫలితాలు మా యిద్దరివని. 1931సం॥లో అన్నపూర్ణమ్మ హఠాత్తుగా చనిపోయినది. అప్పుడు మా అనుభవాలను గురించి 'భారతి'లో రెండు వ్యాసాలు వ్రాసి ప్రకటించాను.

వితంతు శరణాలయ స్థాపన

భూతదయగలవారికి ప్రతి సంఘంలోను ఎంతో కుళ్ళు కనపడుతుంది; ముఖ్యంగా మన దేశంలో- మన సంఘంలో మరీ ఎక్కువ. అమానుషకార్యాలు కూడా సాంప్రదాయబలిమివల్ల సరైనవిగానే కనబడుతాయి ప్రజా సామాన్యానికి. బాల వితంతువుల కష్టాలైతేనేమి, వంశ పారంపర్యా వచ్చే వ్యభిచారవృత్తి అయితేనేమి, అంటరానితనమైతేనేమి చిన్నప్పటినుండి అలవాటు కావడంవల్ల

వాటిలోని అవినీతి స్ఫురించక మనము వాటి నిర్మూలనకు పూనుకోము.

1927 - 28 ప్రాంతాలలో నేను బెజవాడలో వుంటూండగా శ్రీ తుర్లపాటి వెంకటేశ్వరరావుగారు, వారి భార్య శ్రీ రాజేశ్వరమ్మగారు, నేను, నా భార్య అన్నపూర్ణమ్మగారలకు గాఢమైత్రి ఏర్పడింది. సాంఘిక విషయాల్లో మా అందరి అభిప్రాయాలు కలిసేవి. ముఖ్యంగా స్త్రీల కష్టాలను తొలగించుటలోను, స్త్రీల అంతస్థును వృద్ధిపరచుటలోను మే మందరం కలసి పనిచేస్తూండే వాళ్ళం. శ్రీ వెంకటేశ్వరరావుగారు, నేను విదేశాల్లో ఉన్నతమైన నాగరికతకు అలవాటుపడ్డవాళ్ళము. మా భార్యలను అభివృద్ధికితెచ్చి దేశసేవ, సంఘసేవ చేయగల సామర్థ్యం వచ్చేలా ప్రయత్నించాము. అఖిలభారత మహిళా సంఘాలలో పాల్గొనుట, స్త్రీలకు క్లబ్బునస్థాపించి మధ్యతరగతి విద్యావతుల సమస్యలను పరిష్కరించుట బెజవాడలో రాజేశ్వరమ్మ, అన్నపూర్ణమ్మగారలకు దినచర్య అయింది. వారిద్దరికి మేము వెనకనుండి సహాయం చేస్తూ, సంఘంలో ముందుకు నెట్టుకుపోతూ వచ్చాము. వారు తరచుగా కలుసుకొని పనిచేయవలసిన సందర్భం ఏర్పడింది.

ఒకరోజున వారిద్దరు రైవస్ కాలువ గట్టున షికారు వెళ్ళారు. కొంతసేపటికి ఏడుస్తూ నావద్దకు వచ్చారు. వారి

దుఃఖానికి అంతం కనపడలేదు. "ఎవరో శిశువును కన గానే గొంతునులిమిచంపి, కాలువగట్టున పారవేశారు. ఆ మృతశిశువును కాకులు, గద్దలు తింటూండగా చూచి దుఃఖం భరించలేక ఏడుస్తూ వచ్చారు. ఎవరో వితంతువు ఆపని చేసివుంటుందని వారి నమ్మకం. "ఎలా ఈ పాపాన్ని అరికట్టడం?" అని వారి ఆవేదన. సాధ్యమేనని నేను సలహా యిచ్చాను. వారి దుఃఖం కొంతవరకు శమించింది. గర్భవతులైన వితంతువులు రహస్యంగా ప్రసవించుటకు, బిడ్డలను యిచ్చివెళ్ళుటకు ఒక సంస్థను స్థాపించవచ్చు. తద్వారా వారి కష్టాలను తొలగించగలమని వివరంగా చెప్పాను. ఆ సంస్థను తాను నిర్వహించుతానని శ్రీ రాజేశ్వరమ్మగారు ప్రమాణం చేశారు. ఆర్థికంగా నేను సహాయపడతానన్నాను. ఆ రాత్రికే మేము నలుగురము, అడ్వొకేటు శ్రీ రాజేశ్వరరావుగారుకూడ కలుసుకున్నాము. సంస్థను నిర్వహించుటకు అవసరమైన నియమావళిని తయారుచేశాము. వెంటనే తాత్కాలికంగా శ్రీ శుర్ల పాటివారి అవరణలోవుండే చిన్న యింట్లో వితంతు శరణాలయాన్ని స్థాపించాము. రాజేశ్వరమ్మగారు సూపరెంటు, నేను ప్రెసిడెంటు, మిగిలిన ముగ్గురు నిర్వాహకసంఘ సభ్యులు. మేము వెంటనే యితరుల సహాయాన్ని తీసుకోలేదు. 'ఆంధ్రపత్రిక'లో ప్రచురించాము. శ్రీ నాగేశ్వర రావు పంతులుగారు సనాతనులైనా దయాదాక్షిణ్యరాసి, బాగా ప్రచారం జరిగింది. వెంటనే ఒకరిద్దరు గర్భిణీస్త్రీలు

వచ్చారు. వారి పేర్లుగాని, చిరునామాలుకాని, తెలుసు కోకూడదనిన్నీ, తెలిస్తే రహస్యంగా వుంచాలనీ తీర్మానించుకున్నాం. ఖర్చుఅంతా రాజేశ్వరమ్మగారే భరించారు; ఆ విధంగా షుమారు అరవైమందికి వుపయోగపడింది. బెజవాడలోని స్త్రీ డాక్టర్లు-ముఖ్యంగా చలంగారి వదినెగారు డాక్టరు రంగనాయకమ్మగారు సహాయం చేశారు. మా సంస్థలో బిడ్డలను పెంచుటకు తగినవసతులు చెయ్యలేకపోయాము. అయితే, బిడ్డలులేని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడే పిల్లల నిమ్మని వచ్చేవారు.

పిల్లలు కావాలి:

మనదేశంలో వేశ్యావృత్తిలో వుండేవారు సాధారణంగా ఆడపిల్లలను కొని, వారిని తమ వృత్తిలో దించి, ఆవిధంగా ధనమార్జించి జీవించుతారు. మా శరణాలయంలోని శిశువులను అలాంటివారి హస్తగతం కాకుండా జాగ్రత్త పడవలసి వచ్చింది. రాజేశ్వరమ్మగారికో, వెంకటేశ్వరరావుగారికో బాగా పరిచయమున్న వారికి మాత్రమే శిశువులను యిచ్చారు. భుక్తికి లోటులేని వారికి, అనాథ శిశువులను పెంచుకొని; ఆవిధంగా తమకు బిడ్డలులేని లోటును పూర్తి చేసుకొన గోరిన వారికే యిచ్చారు. శిశువులకు గిరాకీ ఎక్కువగానే వున్నది. ముందుగానే రాజేశ్వరమ్మ గారితో చెప్పుకొని, ప్రతిమలాడి ఒప్పించుకొని వెళ్ళేవారు. శరణాలయాన్ని స్థాపించేటప్పుడు అలాంటి

డివుాండు మన సంఘంలో ఉందన్న విషయం మాకు తెలి యనే తెలియదు. ఈ అనుభవం మా కెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. అలాంటి శిశువు లిప్పుడు 10 సం॥ల నుండి 20 సం॥ ల వయసు గలవారు 60 మంది బెజవాడలో పెరు గుతున్నారు.

ఒక బిడ్డను శ్రీ రాజేశ్వరమ్మగారే పెంచుకున్నారు. ఆ బిడ్డ పేరే ఆ సంస్థకు పెట్టాము. కానీ, ఆ బిడ్డ పసితనం లోనే చనిపోయింది. నేను మద్రాసుకు వచ్చిన తరువాత నా రెండవ భార్య సుభద్రమ్మగారు ఈ ఉద్యనూన్ని అతి సమర్థతతో ఉత్సాహంగా నిర్వహించింది. బెజవాడ ప్రాంతంలోని స్త్రీలు తమ రహస్యం దాగదనే భయంతో అక్కడి సంస్థలో చేరుటకు యిష్టపడేవారు కాదు. అట్టి వారికి మద్రాసులో సుభద్రమ్మగారు వసతి కల్పించారు. ఈ విషయంలో, ఉపాధ్యాయిని మిసెస్ పీటర్సుగారు ఎంతో తోడ్పడ్డారు. అనాథ స్త్రీలకు సహాయం చేయుటకు ఆమెగా రెన్నడూ నిరాకరించలేదు. అలాంటి పిల్లలను అమిత ప్రేమతో పెంచుకొన్న మహాతల్లి ఆమె.

ఏనుగ వెళుతూంటే...

మా కీ ఉద్యమ సందర్భంలో సంఘం అక్కరకొచ్చిన కొందరు వ్యక్తులు హేళన చేశేవారు. వారి అంతస్థు మాకు తెలుసు. వారివి సంకుచిత హృదయాలు; సాంప్ర దాయాలకు లొంగిపోయిన వ్యక్తుల శుష్కవాదనలను

మేము లక్ష్యపెట్టలేదు. ఏనుగులు వెళ్ళుతూంటే కుక్కలు మొరగవూ! ఈ విషయంలో మా అందరికంటే హేళనకు విమర్శకు గురియైనవారు రాజేశ్వరమ్మగారు. శిశువులను ముద్దాడి, పెంచి, పెద్దచేసిన దయార్ద్ర హృదయంగల ఆ తల్లిపై కష్టాలను లక్ష్యపెట్టనేలేదు.

సన్మార్గానికి

ఈ సమస్య అంతటితో అంతం కాలేదు. పతిత స్త్రీల జీవితాలను బాగుచెయ్యడం ఎలాగు? మళ్ళీ అలాంటి తప్పులు చెయ్యనివ్వకూడదు. చదువుకొని, జీవనాధారమును సంపాదించుకోగలిగి, తమ కాళ్ళమీద తాము నిలబడి, వివాహం చేసుకొని సంఘంలో గౌరవంగా జీవించేలా చెయ్యాలి. ఇది చాలా కష్టమైనపనే. అయినా నేను, మరికొందరు కలసి అందుకు పూనుకున్నాము

అభ్యుదయ వాదులు, సంస్థలవల్ల ఎంతో సహాయం లభించింది. సర్ ముత్తా వెంకటసుబ్బారావుగారు, వారి సతీమణి ఆండాళమ్మ గారు తమ సేవాసదనంలో మేము పంపిన వారందరికి ఖర్చులన్నిటిని తామే భరించి వృద్ధికి తెచ్చారు. మిసెస్ పీటర్సు తన మాంటిసోరి స్కూలులో ఆశ్రయ మిచ్చినది. డాక్టరు ముత్తులక్ష్మి రెడ్డిగారు తన అవ్వాయిహోంలో కొందరికి సహాయం చేశారు. రాజమండ్రి నాళం రామలింగయ్యగారి సంస్కృత కళా

శాల ప్రిన్సిపాలు బత్తుల కామాక్షమ్మగారి సానుభూతితో కొందరు వృద్ధికివచ్చారు. కొందరు టీచర్లుగను, మరి కొందరు నర్సులుగను, కొందరు విద్వాంసులు, ఉభయ భాషా ప్రవీణులు, సంగీత శాస్త్రజ్ఞులుగాను తయారైనారు. ఉద్యోగాలలో చేరి, గౌరవంగా జీవిస్తూ, వివాహాలు చేసు కొని భర్తలతోను, బిడ్డలతోను సుఖంగా వుంటున్నారు.

ఆ కాలంలోనే మద్రాసులో అఖిలభారత మహిళా సంఘం వారి సహాయంతో ఒక రక్షణ గృహము స్థాపించ బడినది. దానిని ముఖ్యంగా శ్రీ ముత్తు లక్ష్మిరెడ్డిగారు, శ్రీ అమ్ము స్వామినాథన్‌గారు, నా భార్య సుభద్రమ్మ గారు చాలా ఉత్సాహంతో కొన్ని సంవత్సరాలపాటు నిర్వహించారు.

అయితే మావద్ద సహాయం పొందినవారందరు బాగు పడ్డారా? లేదు. కొద్దిమంది బాగుపడనేలేదు♦

♦ మా అందరిశక్తికి లొంగని ఒకామెను గురించి వ్రాయటం సమంజసమనుకుంటాను. ఒక హిందూ స్త్రీ ఒక ముసల్మానుయింట్లో బంధపడుతున్నదనీ, ఆమెను రక్షించ మనీ నా మిత్రులు కోరారు. సరేనని ఆ యింటికి వెళ్ళాను "లోపలికి పోవద్దు, చంపేస్తాడేమో"నని మిత్రులు నివారిం చారు. నేను లోపలికెళ్ళి యిద్దరితోను మాట్లాడాను. ఇద్దరూ వివాహం చేసుకొని సుఖంగా ఉండమని భోధిం చాను, ఆవిడ ఒప్పుకోలా. నాతోవచ్చి చదువుకొని బాగు

పునర్వివాహం కొరకు నా వద్దకు వచ్చిన పెట్టబడిన
బాలికలను చదివించుతూ వచ్చాము భర్తచేవిడి
వారిని కూడ చదివించాము. ఒక బాలిక ప్రారాభ్యాసం
నుంచి యల్ యమ్. పి. చదివి వరు అయ్యేవరకు
సహాయం పొందుతూనేవుంది. తమను బోడిచేయించుటకు
ప్రయత్నాలు జరుగుచుండగ తప్పించుకొచ్చిన స్త్రీ
విద్వాన్ అయి, హైస్కూల్లులో పండితురాలైనది, నైజా
ములో ఒక బీదతల్లి తన బాలవితంతు బిడ్డలనిద్దర్ని పర
మత సంఘానికి ఇచ్చివేస్తుండగా చూచి సహించలేక
నా మిత్రులు శ్రీ పోడూరి కనకరాజుగారు వారిద్దరిని
నా వద్దకు పంపారు. ఒకామె గుంటూరులో ఉన్నవ లక్ష్మీ
నారాయణగారి సహాయంతో వృద్ధికివచ్చి, టీచరుగా పని
చేయుచున్నది. రెండోబిడ్డ తన తల్లిని చూచుటకు నిజామా
బాదుకు వెళ్ళి రోడీలకు చిక్కింది. ఆమెను తప్పించేందుకు
చేసిన ప్రయత్నాలన్నీ వృథాఅయ్యాయి. మరెందరిని
గురించైనా వ్రాయవచ్చు. ఇలాంటి సంఘసేవ చేయ
దలచిన వారికి ఎన్నో అవకాశాలున్నాయి. ఎందరో

పడతానని ప్రతిమలాడింది. అతను వదలిపెట్టటానికి సమ్మ
తించలేదు పోలీసు డెప్యూటీ సూపరెంటు సహాయంతో
ఆమెను తీసుకెళ్ళి బెజవాడలో నా ప్రథమభార్య అన్న
పూర్ణమ్మకు ఒప్పగించి తమాషాకు "నీ గట్టితనంచూస్తాను
ఈవిడను బాగుచెయ్యి" అన్నాను. "తప్పకుండా

అసాధ్యస్త్రీలు సహాయం పొంది. తమ జీవితాలను సంస్కరించుకోవటకు తయారుగా వుంటారు.

సక్కుమక్కా వెంకటసుబ్బారావుగారి సతీమణి ఆండాళమ్మగారు తన సేవాశ్రమంలో యిలాంటి స్త్రీలను పోషించుటేగాక, మాతృప్రేమతో వారిని వృద్ధికి తెచ్చుచుండెను. కొందరిని సరియైన శిక్షణలో పెట్టుట చాల కష్టమయ్యేది అలాంటివారి తప్పులను పదేపదే క్షమిస్తూ ఎంతో ఓపిక, ప్రేమ చూపి అభివృద్ధికి తెచ్చారు. ముఖ్యంగా ఒక పిల్ల విషయంలో ఆమె దయార్ద్రహృదయాన్ని కనిపెట్టి "ఏమమ్మా! యింత ఓపికతో పనిచేస్తున్నావు? నీ అభిప్రాయమేమి?"టని ప్రశ్నించాను. "స్త్రీలను ఒక వయసులో క్రమశిక్షణలో పెట్టగలిగితే వారి జీవిత మంతా ఒక రాజబాటలాగా పోతుంది. తల్లిదండ్రుల అజ్ఞానంవల్లగాని, అజాగ్రత్తవల్లగాని ఒక స్త్రీ జీవితం పాడైతే, ఆమెను నిందించి ప్రయోజన మేమిటి? మనం

బాగవు తుంది" అని ధీమాగా జవాబు చెప్పినది. కొన్ని వారాలకు అన్నపూర్ణ "ఆ స్త్రీ నా బోధవల్ల బాగుపడుతుందనే నమ్మకం ఎంతమాత్రం లేదు. పైగా ఆపిడబోధవల్ల నేనే చెడిపోతానేమోనని భయంగావుంది. ఆమె విషయం ఎలా ఉన్నా మీ భార్య విషయంలో జాగ్రత్తపడం"డని చమత్కారంగా రిపోర్టుపంపింది.

కొంత ఓపిక చూపితే, బాగుపడుతుం"దని చెప్పినది. అలాగే జరుగుతూవచ్చింది.

మాతో అన్యోన్య బాంధవ్యం

1930-31లో ఆరుగురికి పైగా అలాంటివారు మదాసు సేవాసదనంలో చదువుతున్నారు. వారు ఆదివారాలలో మా యింటికి వస్తుండేవారు. నా ప్రథమభార్యకు వారికి మధ్య చాలా అనురాగ మేర్పడింది మా చిన్న యిల్లు నిండుగా వుండేది. నా భార్య హఠాత్తుగా చనిపోవుటతో ఆపిల్లలు ఎంతో దుఃఖించారు. ఆ తరువాత కూడ మామూలుగా ఆదివారాల్లో వస్తూవుండేవారు. ఒక ఆదివారంనాడు అన్నపూర్ణమ్మ బట్టలు, పెట్టెలు వగైరా సామానులను నా అనుమతి లేకుండానే తమలో తాము పంపకం ప్రారంభించారు. నాకు నవ్వొచ్చింది. పంపకాలు

ఆ స్త్రీ కథ వివులంగా ఒక ఉత్తరంలో శ్రీ ముత్తా వెంకట సుబ్బారావుగారి భార్యకు వ్రాసి, "మీ సామర్థ్యాన్ని పరీక్షించటానికి మీవద్దకు పంపుతా"నని స్నేహపూర్వకంగా వ్రాశాను. ఆమె అంగీకరించి. తన సేవాసదనంలో చేర్చుకొని ఎంతో ప్రయత్నించిరి. కాని, ఆమెకూ సాధ్యంకాలేదు. తీసుకెళ్ళమని నాకు వ్రాయకముందే తన ముసలామ్మను ప్రియునివద్దకు చేరిపోయింది ఆ పడుచు. మే మందరం ఎంతో వ్యసనపడ్డాము! కాని ఏం ప్రయోజనము?

కుదరక నన్ను తీర్మానించమన్నారు. రెండు ట్రంకుపెట్టెలలో ఒకటి పెద్దది; ఒకటి చిన్నది. ఎవరు దేనిని తీసుకోవాలి? ఇద్దరూ పెద్దదే కావాలని వాదించుకొన్నారు. సమాధానం కుదరక నన్ను తీర్మానించమన్నారు. ఎవరికి ఎలాంటి హక్కులున్నాయో చెప్పమన్నాను. ఇద్దరిలో ఒకరు ముందుగా అన్నపూర్ణమ్మవద్దకు చేరుకున్నందున ఆవిడే పెద్దచెల్లెలు. పెద్ద భాగస్తురాలు; కాబట్టి, తనకు పెద్దపెట్టె నిమ్మన్నది. ఈ వాదన నాకుకూడా న్యాయంగానే తోచి, అలాగే తీర్పుయిచ్చాను. ఈ దిక్కులేని స్త్రీలు-సంఘం వేలుపెట్టి చూపిస్తూ హింసించుతున్న స్త్రీలు ఎంత అన్యోన్యంగా మా కుటుంబంలో కలిసి మెలిసివుండేవారో పై విషయాన్నిబట్టి తెలుసుకోవచ్చు.

శ్రీమతి రాజేశ్వరమ్మగారు జబ్బుపడి బెజవాడలో ఉద్యమాన్ని సాగించజాలకపోయింది. సంస్థ క్షీణించి పోయింది. అయితేనేం? ఈ విషయంలో ఆమెగారే మార్గదర్శిని.

శ్రీమతి దరిశి సుభద్రమ్మ

ఈ ఉద్యమము మద్రాసులో సాగుటకు నా భార్య సుభద్రమ్మే కారణం. ఈమె యిలాంటి సంస్కరణలను మాకంటె ముందుగా ప్రారంభించి వ్యక్తిగతంగా నిర్వహిస్తూవచ్చారు. 1918సం॥ నుండి మధ్యతరగతి స్త్రీల

కష్టాలు తన కష్టాలుగా ఎంచి తానే భోజనముపెట్టి, బస యిచ్చి వృద్ధికి తెస్తూవుండేవారు. కొందరు టీచర్లుగాను, నర్సులుగాను వృద్ధికి వచ్చారు. ఏ అనాథ స్త్రీ గాని తన కష్టాలను ఆమెతో చెప్పుకొని, సహాయం పొందకుండా వెళ్ళలేదు ♦

పరుల సహాయం కావలసివచ్చినప్పుడు తాను స్వయంగా పిల్లలను వెంటేసుకొని, తన పలుకుబడిని పూర్తిగా వినియోగించి సాధించుకొస్తుంది. ఆమె స్వయంగా ఇలాంటి పనులన్నిటిని నెరవేర్చగల సమర్థురాలు అందువల్ల నేను ఆ పనులు చూచుకోవాల్సిన అవసరం లేకపోయింది. ఇప్పటికీ అలాంటిస్త్రీలు వస్తూనే వుంటారు; వారి కథాలు గాథలతో సుభద్రమ్మగారి కండ్లు సాధారణంగా నీరు కార్చుతూంటాయి. వీధుల్లో, మీటింగులలో, సినిమాలలో "అమ్మా" అని హఠాత్తుగా వచ్చి చుట్టేస్తుంటారు. అధోగతి పాలవుతుందని ఆయన అభిప్రాయం. నా భార్య వద్దకు వచ్చి, తన భార్యకు సుభద్రమ్మగారిచే ఉత్తరం వ్రాయించుచున్నారు.

♦ నే నీ ఘట్టాలు వ్రాస్తూవుండగా సుభద్రమ్మ ఒకస్త్రీకి ఉత్తరం వ్రాస్తున్నది. ఆ స్త్రీ తన భర్తను ఇద్దరు బిడ్డలను విడిచిపెట్టి, ఒకరితో వెళ్ళిపోయింది. భర్తకు ఆమెయం దమిత ప్రేమ. తా నామెను తిరిగి స్వీకరించా లనే ఉద్దేశ్యం. లేనిచో తాను, తన బిడ్డలేగాక, ఆమె మరీ

అలాంటి ఘట్టాలు మామూలవడంవల్ల నా కిప్పుడు ఆశ్చర్యం కలిగించవు. స్త్రీలేకాదు; కుర్రవాళ్ళు కూడా వచ్చి "అమ్మా! ఎంతకాలమయింది మిమ్మల్ని చూచి!" అంటూంటారు. వారు తమ పసితనంలో ఆమెవద్ద చదువుకుంటూ, ఆమె ప్రేమకు పాత్రులైనవారే. ఇలాంటి ప్రేమ ఘట్టాలు, గాథలు ఈ ముసలితనంలో మా కెంతో ఆనందంగా వుంటున్నాయి. సంస్కరణల విషయంలో ఆమెయే ఒక పూర్తి సంస్థ అనవచ్చు; మద్రాసులో అనేక సంస్థలను, సంస్కరణాభిలాషులను ఆమె వినియోగ పెట్టుకోగలుగుచున్నది. ఆమెను గురించి నే నెక్కువగా వ్రాయడం బాగుండదు. నా భార్య కావడంచేత నేను అతిశయోక్తులు వ్రాశానని ఆమె నెరుగనివారు అనుకోవచ్చును.

రష్యా సాధన

సంఘంలో ఉండే కుళ్ళును శక్తికొలది తగ్గించటానికి మా శక్తికొలది ప్రయత్నించాము. ఇలాంటి వ్యక్తిగత ప్రయత్నాలు వేనవేలమంది చేసినా తరుగగనన్ని లోట్లు మన సమాజంలో వున్నాయి. ప్రభుత్వం మాత్రమే సంస్కరణలమూలంగా సంఘంలోని లోటుపాటులను పూర్తిగా

తొలగించగలదు. ప్రభుత్వవిధానం సంఘసంస్కరణలకు అనుకూలంగా ఉండనంత కాలము వ్యక్తులు సవరించగలిగినది సముద్రంలో ఒక నీటిబొట్టు లాగానే ఉంటుంది. ఈ సత్యాన్ని స్వానుభవంద్వారానేగాక, సోవియట్ రష్యాను గురించి వెబ్ దంపతులు, డీన్ ఆఫ్ కాంటర్బరీ వంటి గొప్ప గ్రంథకర్తల రచనలవల్ల ఈ మధ్య తెలుసుకోగలిగాను. నేటి రష్యాలో స్త్రీలకు ఘోషాలేదు. పడుపువృత్తి లేదు. బహుభార్యాత్వం లేదు; భర్త లేకుండా కలిగిన బిడ్డలకు న్యాయ చట్టాలవల్ల యిబ్బందులు లేవు. అందరికీ చదువు, ఉద్యోగాలు ఉన్నై. పడుపువృత్తిలో వున్నవారిని ప్రభుత్వమే సంస్కరించి, యితర వృత్తివిద్యలు నేర్పించి, ఉద్యోగాలిచ్చి వృద్ధికి తెచ్చారు. స్త్రీలు పురుషులతో సమానహక్కులు కలిగి సుఖించే అవకాశం సోవియట్ రష్యాలో మాత్రమే వున్నట్లు చదివి, తెలుసుకోవడమే నేను కమ్యూనిష్టుగా మారిపోవుటకు ముఖ్యకారణ మనుకుంటాను.

"స్త్రీల అభిమానివి" అని కొందరు నన్ను నిందించారు. అవును. నే నందుకు గర్వపడతానుకూడాను.

తాలింఖానాలు

అమెరికావెళ్ళే స్టీమర్లమీదను, జపానులోను జపానీయుల ధైర్యసాహసాలను, దేశభక్తిని చూచాను. బెంగాలులో కెరటిష్టుల తాలింఖానాలనుగురించి లాహిరీ

మొదలైనవారిద్వారా తెలుసుకొన్నాను. అటు తరువాత దేశమంతటా శాలింఖానాలు స్థాపించాలని గొంతెమ్మ కోర్కెలు 1914-15లో కలిగాయి నాకు. అమెరికాలో వున్నప్పుడు (1913-15) వివిధ దేశాలలోవుండే శాలింఖానాలు, జిమ్నాజియములకు సంబంధించిన సంస్థలను గురించిన వివరాలను బాగా తెలుసుకున్నాను.

జపానులోని ఉద్యమం ఉత్తమమైనదిగా తోచింది. నేను రెండవసారి (1915లో) జపానుకు వెళ్ళినప్పుడు ఒక వారంరోజులు వారి శాలింఖానాలను పరిశీలించి, వారు దేశమంతటా ఎలా స్థాపించి, నిర్వహించుతున్నదీ-ముఖ్య వివరాలను తెలుసుకున్నాను. 35 సం॥ల అనంతరం యిప్పుడుకూడా ఆ పద్ధతి మన దేశానికి ఉపయోగపడునని నా నమ్మకము. జపానులోని ఆ వుద్యమ స్వరూపం ఎలా గుంటుందో కొంత ఉదహరిసాను.

జపానులో వ్యాయామము

అఖిల జపాను వ్యాయామ ఉద్యమములో ప్రతి జపానీయుడు సభ్యుడుగా చేరవచ్చు. ప్రవేశరుసుము ఒక యెన్ (1--80 అప్పుడు) చెల్లించాలి. దేశభక్తివల్ల కోట్ల రూపాయలు ప్రోగైనవి. సభ్యులు తమ జీవితంలో ఎప్పుడైనాసరే, ఆ సంస్థకు సంబంధించిన శాలింఖానాలలో రెండేళ్ళపాటు నేర్చుకోవచ్చును. నేర్చుకొనేటప్పుడు

స్థానిక తాలింఖానాకు ప్రతినెల చందా యివ్వాలి. పెద్ద నగరాలలో ఉదయం గం. 5 మొదలు రాత్రి 10వరకు తాలింఖానాలు తెరచివుంటాయి. మెంబర్లు తమ అనుకూల సమయంలోవెళ్ళి నేర్చుకుంటారు. రోజుకు ఒక గంట మాత్రమే నేర్పుతారు.

ఆత్మరక్షణ విద్యలు—అనగా జిజిట్సు, బాక్సింగు, కుస్తీ, కత్తిసాములలో ఏ రెండింటినైనా నేర్చుకోవచ్చు. తాలింఖానాలో ఆవిరి స్నానపుగదులు, వేడినీళ్ళగదులు, యీతకొట్టుటకు తటాకాలు వగైరా ఉండడమేగాక, తువ్వాళ్ళు సబ్బులు వగైరా సౌకర్యాలుకూడ ఉంటాయి. ఆవరణ పూలమొక్కలతో అందంగా ఉంటుంది.

స్థానికంగా మొదలుకొని కేంద్రంవరకూ జపాను దేశమంతటా పందాలు, పోటీలు ప్రతిసంవత్సరం నిర్ణీత సమయాల్లో జరుగుతూంటాయి. ఆఖరు పోటీలుమాత్రం పండుగరోజుల్లో జరుగుతుంటాయి. వీటివల్ల సంస్థకు చాలా ధనం చేకూరుతుంది.

ఆ పోటీలలో గెలిచినవారిని బోధకులుగా నియమించి, కేంద్రమే బాగా తరిఫీదుయిచ్చి, వివిధ ప్రదేశాలకు పంపుతుంది. ఈ విధంగా దేశీయులందరికీ ఆటలయందు ఉత్సాహం కలిగేలాగు (Sports - minded) చేస్తారు.

వ్యాయామవిద్యలను నేర్చుకొన్నవారికి ఆ విద్య తెలియని నలుగురైదుగురిని ఓడించగలమనే ధైర్యము, నమ్మకము కల్గుతాయి. జపాను తూర్పుదేశాల్లో ఒకటి. పశ్చిమదేశాలవారు తూర్పుదేశాలవారిని చాల చులకనగా చూస్తారు. సాధారణంగా నావికులు, సైనికులు చాల పొగరుబోతుతనంగా ప్రవర్తించుతారు. అలాంటివాళ్ళను పోలీసులు స్త్రీలుకూడ తమ జిజిట్సు తరిఫీదువల్ల ఒక్కొక్కరు యిద్దరుముగ్గురిని గెంటివేస్తుంటారు. మనదేశానికి ముఖ్యంగా రేవుపట్టణాల్లో యిలాంటి తరిఫీదు చాలా అవసరం.

"పోకిరీ పాశ్చా"కు దేహశుద్ధి

నే నీ ఉద్యమాన్ని మనదేశంలో ప్రారంభించలేక పోయాను. అయినప్పటికి పెద్ద ప్రయత్నం, ప్రయాస లేకుండానే నా సలహాలు విని కార్య రూపంలో పెట్టే వైశ్య సంఘంలో కొన్ని తాలింఖానాలను ఏర్పరచాను. ఈ విషయంలో ప్రొద్దుటూరు శ్రీ కొప్పరపు వెంకట సుబ్బయ్య గారితో కలసి పని చేశాను. రాయలసీమలో ఎక్కువగా పని జరిగింది. ప్రొఫెసర్ బి. వి. నాథ్ అను నిపుణుని నియమించి, తాలింఖానాలను వృద్ధికి తెచ్చాము.

ఈ సందర్భంలో కావలిలో 1923 సం॥లో స్థాపించిన తాలింఖానా కథను ప్రారంభిస్తాను. అప్పుడు నా చిన్నతమ్ముడికి కావలిలో వివాహం జరిగింది. ఆ సందర్భంలో కావలి

వచ్చిన నా పెద్ద తమ్ముడు గురుస్వామి చెంబు తీసుకొని బహిర్భూమికి వెళ్ళాడు. అతను కసరత్తుచేసి, హిందూ ముసల్మాను తగాదాలలో లాఠీతో తీర్మానం చేసుకో వలెననే సిద్ధాంతంగల యువకులలో ఒకడు. చిన్నతనంలో లాఠీని తలక్రింద పెట్టుకొని నిద్రించేవాడు. అలాంటివానిని బసకు తిరిగి వచ్చుచుండగా ఒక రౌడీ నిష్కారణంగా కొట్టాడు. గురుస్వామి తన చెంబుతో బదులు చెప్పాడు. కాని, రౌడీ కొట్టిన దెబ్బలతో చాల బాధపడుతున్నాడు. మా బంధువులందరూ ఈ విషయాన్ని నాకు మాత్రం తెలియకుండా, ఒక దినమంతా రహస్యంగా వుంచారు. మరునాడు నాకు కారణం తెలియగానే, ఆ రౌడీని శిక్షిం చాలని బయలుదేరాను. బంధువులందరూ ఆ రౌడీ జోలికి పోవద్దని నాకు అడ్డం వచ్చారు. కారణంకూడా చెప్పారు. ఆ రౌడీ పేరు "పోకిరి పాశ్చా" అట! వానిని చూస్తే కావలిలో అందరూ భయపడిపోతారట పోలీసులు కూడ వాని జోలికి పోరట. స్త్రీలమీద రాళ్ళు వేస్తాడేమోనని "పెద్దమనుషులు" వానిజోలికి పోరు. ప్రతి అంగడికి నెలకు కొంత లంచం చందాగా తప్పకుండా సమర్పించుకొంటూం టారు. అలాంటి రాక్షసుడితో తగాదా పెట్టుకోకూడదని, నా శ్రేయస్సు కోరిన బంధువులు, స్నేహితులు సలహా యిచ్చారు. అలాంటి వాడినే శిక్షించి ఆ పట్టణ ప్రజల కష్టం తొలగించాలని నాకు ఉత్సాహం ఎక్కువైంది.

కుండానే హఠాత్తుగా నా బెత్తంతో పాఠ్చాను కొట్టసాగాను. రాడీ బిత్తరపడిపోయాడు, "రాస్కల్! పోలీస్ స్టేషన్‌కు నడువు" మన్నాను. చెయ్యెత్తలేకపోయ్యాను. కండ్లలో భయము, కోపమూ తాండవమాడుతున్నాయి. నా బెత్తం ఫెళ్ ఫెళ్ మని వాగుతూనేవుంది. వాడి శిష్యులు మాయమై పోయారు. గుంపుకూడింది. గుంపులోనుండి ఎవరో "ఆయన దరిశి చంచయ్యగారురా? చంపుతాడు. కాళ్ళ పట్టుకోరా!" అని ఉర్దూలో అన్నారు. నా కాళ్ళ పట్టుకొన్నాడు. మరి వదలడే! బాగా భయపడిపోయాడు. చుట్టూచేరి చూస్తున్న జనం ఆశ్చర్యచకితులయ్యారు. వారిలో చాలామంది నెలనెలకూ లంచమిచ్చి తన్నులు తప్పించుకొనుచున్న పెద్దమనుష్యులు!

వారికొక ఉపన్యాసం యిచ్చాను. "ఒక తాలిం ఖానా పెట్టుకోండి. ఇలాంటి రాడీలకు కావలిలో స్థానం లేకుండా చెయ్యండి" అని చెప్పాను. ప్రజలకు నా సలహా నచ్చింది ముఖ్యంగా బాధపడుతున్నది వైశ్యులు. "కోమటి పిరికి" అనే సామెత నిజంకాదని నిరూపించమని పౌరుషం వచ్చేట్లు మాట్లాడాను. అందరూ బాగున్నదని సమ్మతించారు. విరాళాలు యివ్వమన్నాను; వెంటనే యిచ్చారు. ఒకరు(పెండాల నారాయణ అని నాకు జ్ఞాపకం) ఖాళీస్థలం యిచ్చారు. నేర్పుటకు ఎవరినైనా నన్నే ఏర్పాటు చెయ్యమని కోరారు. తానే ఆరునెలలకు అయ్యే

ఖర్చు అంతాకూడ భరించుతానని ముందుకువచ్చారు. నా మిత్రుడు శ్రీ రాజా నరసింగరావుగారిని గురువుగా ఉండమని కోరాను; ఆయన తక్షణం ఒప్పుకొన్నాను.

మరునాడే తాలింఖానా ప్రారంభమయింది. పోకిరి పాశ్చాత్రకితంనాడే మాయమైపోయాడు. వాడు మళ్ళీ కావలిలో కన్పించలేదు. యువకులు బాగా ఆరితేరారు. వైశ్యులచే స్థాపించబడిన తాలింఖానాలలో అన్ని కులాల వారు, మతాలవారు, ముఖ్యంగా నాయుళ్ళు, ముసల్మానులు చేరుటకు అవకాశమివ్వని ఎన్నాళ్ళో సలహాయిస్తూ వచ్చాను. వైశ్యుల్లో వైశ్యులు పోటీలు పెట్టుకొన్నంత మాత్రాన ప్రయోజన ముండదనీ, ఇతరులతో పోటీ పెట్టుకోవలసిందని నే నిచ్చిన సలహా వారి బుర్రలోకి ఎక్కనే లేదు. రాజకీయాలతో సంబంధం లేకుండా కులాలు, మతాలవారీగా ఏర్పడిన యిలాంటి సంస్థలు చివరకు హిందూ ముసల్మాను తగాదాలకే ఉపయోగపడుతూ రావడం చూచి తలవంచు కొంటూండేవాడిని.

వైశ్యులలో స్త్రీ విద్య

వైశ్యులు జీవనోపాధికి సులభంగా సంపాదించు కొంటారు. కాని వారిలో-పుష్కలంగా ధనమున్నవారిలో సయితము విజ్ఞాన వికాసాలు, సంస్కృతి చాల తక్కువ. ఒక గొప్ప ఆంధ్రకవి "కోమట్లపుట్టితేనేమీ మా గాంధి" అని వ్రాశారు. అంతచులకనై పోవుటకు కారణాలున్నాయి.

స్త్రీలలో చదువుసంధ్యలు చాల తక్కువ. స్త్రీ బాపినీడుగారు అమెరికానుండి వచ్చిన కొత్తలో మాన్యజికి లాంతర్లు లెక్చర్లిచ్చేవారు. ఆ ఉపన్యాసాలలో స్త్రీవిద్య ముఖ్యమైనది. ఆంధ్ర స్త్రీలలో బి. ఎ, ప్యాసయినవారు ప్రతి చిన్నకులంలోను ఉన్నారని ఫొటోలద్వారా నిరూపించుతూ, వైశ్యసంఘాన్ని గురించి ఒక్కరూ లేరని బ్లాంకే స్లయిడు చూపించేవారట ! ఆయన ఆవిధంగా ఆ కులాన్ని, సంఘాన్ని గురించి పరిహాసంచేసి నాకే పౌరుషం వచ్చేలా చేసేవారట. చివరకు ఈ పరిహాసంవల్ల నాకే పౌరుషం వచ్చి ఆలోటు తీర్చాను

వైశ్యులు అతి భయస్తులు; కులాచారాలకు దాసులు. స్త్రీ విద్య వారికి పనికిరాను. రజస్వలానంతర వివాహం చేయించే సాంప్రదాయం లేకపోవడం, కులబహిష్కారం చేయిస్తారనే భయం, కులకట్టుబాట్లు నూటికి నూరుపాళ్ళు జీర్ణించివుంది. ఆ స్థితిలో మరెవరినో సాహసించమని బోధించుటలో అర్థమే లేదు. కాబట్టి, నా యింటిలోనే 1925 సం॥లో ప్రారంభం చేశాను. నా ప్రథమ భార్య అన్నపూర్ణమ్మ చెల్లెలు సుబ్బమ్మను చదివించాను.

వితంతువివాహాలు పరిపాటి అవడంతో కులకట్టు బాట్లు నశించాయి. అందుచే రజస్వలానంతర వివాహాలు కూడా పరిపాటి అవుతూవచ్చాయి. అంతటితో మా అత్తగారికి భయాలు పోయినై. చదువు సాంతంగ సాగి

పొయింది. వైశ్యసంఘంలో సుబ్బమ్మే మొదటి యింటర్, బి. ఎ. ఎల్. టి., ఎమ్. ఎ. యల్. టి., లలో వరుసగా ప్రథమస్థానాన్ని సంపాదించినది. తరువాతనే వివాహం చేసుకొన్నది.

సుబ్బమ్మను చదివించుటకు ముందు మరొక రిద్ది రిని చదివించడం ప్రారంభించాను. నన్ను వివాహమాడిన తరువాత చదువుమీద అన్నపూర్ణమ్మకు శ్రద్ధలేక పోయింది. అంటే స్కూళ్ళచదువు మానేసింది రెండవ వారు బళ్ళారి రుక్మిణి. ఈవిడకు 8 సం॥ల వయస్సుకో వివాహమైనది. ఆ తరువాత భర్త ఏమయ్యాడో తెలి యదు. 12-13 సం॥ల వయస్సులో నేనే అక్షరాభ్యాసం చేయించి, చదివించాను. చాలామంది కోరిన సహాయం చేస్తూవచ్చాను. చివరకు యల్. యం. పి. ప్యాసయినది. సుబ్బమ్మ, రుక్మిణిగార్ల విద్యావిషయంలో ద్రవ్యసహాయం చాల వరకు లభించినది. కాని, నా కుటుంబపోషణకే సరిగా ఆర్థిక స్తోమతులేనికాలంలో, నగలు, సామానులు అమ్ముకొని జీవించే కష్టకాలంలో కూడ సుబ్బమ్మ, రుక్మిణీల చదువులకు సహాయం చేస్తూనేవున్నాను. ఎలాగైతేనేమి, బాపినీడుగారి ప్రబోధం ఫలించి నా పంతం గెలిచింది. నేను ప్రారంభించిన 25 సం॥ల తరువాతకూడ ధనవంతమైన వైశ్యసంఘంలో సంవత్సరానికి ఒక్క బి. ఎ., గాని, ఒక్క డాక్టరుగాని తయారుకావడంలేదు. ఆ సంఘం

యిప్పటికీ విద్యలోను, విజ్ఞాన వికాసాల్లోను ఇతర కులాలు వెనుకపడి ఉన్నదనుటలో సందేహంలేదు.

వైశ్యులలో విద్యావ్యాప్తి

ఇక పురుషుల విషయం. 1912 వరకు దిక్కులేని బీదవాళ్లు ఇంగ్లీషు చదువుకొని ఉద్యోగం చేసుకోవాలనిన్నీ, ద్రవ్యవంతులకు చదువు అవసరం లేదనే భావం ముఖ్యంగా వైశ్యులలో వుండేది. ఆరోజుల్లో వైశ్య హాస్టలులో వున్నవారు చాలామంది నాలాంటి బీద విద్యార్థులే. కన్యకా పరమేశ్వరీ దేవాలయంవారు విద్యార్థి వేతనాలు యిచ్చేవారు. ఆవిధంగా సహాయం పొంది చదువుకొను చున్న నాలాంటి బీదవారిని కొంత న్యూనతగానే చూచే వారు.

1925 సం॥ నాటికి ద్రవ్యవంతులుకూడా చదవ డము ప్రారంభించారు. వైశ్య యువజన మహాసభ కార్యనాలను ఆచరణలో పెట్టుటకు కాలం అనుకూలం గానే వుంది. హైస్కూళ్లువుండే ప్రతి పట్టణంలోను బీద విద్యార్థులకు ఉచితంగా అన్ని ఖర్చులు సంఘమే భరించి వివించాలని అనేక పట్టణాలలో ప్రబోధం చేశాను; సహాయం లభించినికూడాను. అయితే, ఈ విషయంలో కూడా వృద్ధ సనాతనులు అడ్డువచ్చారు. వృద్ధులు ఒక పార్టీగాను, యింగ్లీషు చదివి, పురోగాములైన తమ బిడ్డలు మరొక పార్టీగాను ఏర్పడి, తగాదాలు జగిగాలు; చివరకు

"సరే; ఎవరు గెలుస్తారో చూద్దాం" అని నవ్వి వెళ్ళాను:

యువకుల పత్రిక "వాసవి"లో ప్రచురించాను. శ్రీ చిట్టూరు రామకృష్ణయ్యగారి అడ్డసుకు దరఖాస్తులు పెట్టుకోమని ప్రచురించాను.

అప్పుడు (1924–26) నేను గుంటూరులో వుంటున్నాను ఒకనాటిరాత్రి శ్రీ రామకృష్ణయ్యగారు నన్ను నిద్రలేపి "ఇప్పటికే ముప్పై అప్లికేషన్లు వచ్చాయి. వీరికి మాత్రమే సహాయంచేసినా సం॥కి రు 6000/లు కావాలి గదా? ఇవి చాలు. ఇక అర్జీలు పంపవద్దని ప్రాయండని ప్రతిమలాడారు. అలాగే చేశాను.

వారు భయపడటం నాకు వింతగా వుంది. సంఘములో రు 6000/లు తీర్మానించే సమయానికి నన్ను రమ్మని నా మిత్రులు ఆహ్వానించారు. వెళ్ళాను.

ఆ మీటింగులో రెండు పార్టీలున్నై. యువకులందరూ ఒక పార్టీ; ఛాందసులైన వృద్ధులు ఒక పార్టీ. "సత్రం మెదలైన ధర్మసంస్థలను స్థాపించే సమయంలో 'బ్రాహ్మణులకు, గోవులకు' మాత్రమే ఖర్చుపెట్టాలని ప్రమాణం చేసుకొన్నాము; ఇప్పుడు బీద వైశ్య విద్యార్థులకోసం ఎలా ఖర్చుపెట్టగలము? సాధ్యం కాదని ప్రసిడెంటుగారైన శ్రీ..... వెంకటరత్నంగారు అడ్డుపడినారు. శ్రీ చుండూరు. వెంకటరెడ్డిగారి మురావారు (యువకులు)

"మేము చీలిపోయి ప్రత్యేకంగా సంఘం పెట్టుకొంటాము. మా పార్టీలో షుమారు 12 రైసుమిల్లులు చేర్తాయి. సంవత్సరానికి నలభై వేలరూపాయలు ధర్మాల క్రింద వసూలవుతా" యని బెదిరించారు. సనాతనులు జంకి సంవత్సరానికి రు 6000/- లచొప్పున వైశ్య హోటలుకు శాంక్షన్ చేశారు.

అయితే, ఆ పెద్దల మనసులో ఒక దురుద్దేశము న్నట్టు ఆప్పుడు గ్రహించలేకపోయాము. హాస్టలు మేనేజరుగా ఒక చెడ్డవానిని నియమించి, విద్యార్థులలో తగవులు పెంచి, పేనాకత్తులతో పొడుచుకొనేలాగుచేసి, విద్యార్థులను తుంటలరుని ఆరోపించి, హాస్టలును మూసివేయుటకు ప్రయత్నించారు. కాని, సనాతనులు తమ దురాలోచనలు ఫలించేకాలం గతించిపోయిందని గ్రహించలేదు. శ్రీ రెడ్డిగారు. రామకృష్ణయ్యగారు. అన్నవరపు సుబ్బారావుగారు. అద్దేపల్లివారు సమర్థులైనందున, యువకులలో రాజకీయ చైతన్యం ప్రబలుచున్నందున తమ కర్తవ్యాన్ని నెరవేర్చుకుంటూ వచ్చారు.

ఏ సత్కార్యం చెయ్యదలచినా సంఘపెద్దలు నైంధవుడిలా అడ్డుపడుతూనే ఉన్నారు. యువకుల చైతన్యాన్ని బట్టి, ఏ మార్పు తనంతటదే రాలేదు. మానవప్రయత్నం అవసరమని గ్రహించనంతవరకు దైవంమీద, ఖర్మమీద భారమన్నకాలు ఉన్నంతవరకు త్యాగానికి కష్టాన్ని

అనుభవించేందుకు సిద్ధపడనంతవరకు మన సనాతన "సాంప్ర దాయాలు" వాటంతటవే నశించవు; సంఘము ముందుకు పోజాలదు.

గుంటూరు యువకులలో గొప్ప వ్యక్తులున్నారు. వారికి భాషా జ్ఞానము, వాగ్ధాటి బాగా వుండేవి. అయితే, వారిలో ఒక లోపం ఉండేది. మెజారిటీ పక్షం తరపున మాట్లాడి, చప్పట్లు కొట్టించుకొని, గొప్పవాళ్ళమని బజార్లలో రొమ్ము విరుచుకొని తిరిగేవారు. నూతనసంఘ నిర్మాణంకొరకు కష్టాలు పడవలసి వచ్చినప్పుడు యిండ్లలో దాక్కొనేవారు; లేదా వూళ్ళో లేకుండా పారిపోయి ముఖం తప్పించేవారు; అందువల్ల 1920 మొదలు 1930 వరకు గుంటూరు యువజన నాయకులు ఒక్క అడుగైనా ముందుకు వేయలేకపోయారు.

ధనభిలాషేగాని విద్యాభిలాష లేదు.

వైశ్య విద్యార్థి వసతి గృహాలెన్నో ఏర్పడినాయి. వందల మంది చదువుతున్నారు. ఎందరో బి. ఏ., ప్యాసవు తున్నారు. యింజనీర్లుగా, డాక్టర్లుగా, టీచర్లుగా, సర్కారు ఉద్యోగస్తులుగా ఉంటున్నారు. కాని, ఇంకనూ విజ్ఞాన వికాసాలలో, సంస్కృతిలో వెనుకపడే వున్నారు. ఆంధ్ర దేశంలో వుండే సాహిత్య పరిషత్తులలోగాని, నాటక పరి షత్తులలోగాని, సంగీత పరిషత్తులలోగాని, రచయితల

సంఘాలలోగాని, ఆటపాటల సంఘాల్లో గాని గాలించి వెతికినా వైశ్యులు కనపడరు. వీరికి విజ్ఞాన వికాసాలలో, సంస్కృతిలో ఏమాత్రం అభిలాష లేకపోవడం శోచనీయం. ఆంధ్రదేశంలోనే వీరి స్థానం యిలావుంటే భారతదేశంలోను, అంతర్జాతీయంగాను వీరి స్థానాన్ని తలచనక్కరలేదు.

1946 మే నెలలో పెదపూడి గ్రామంలో అభ్యుదయ రచయితల సంఘం నడిపిన స్కూలుకు ఒక్క వైశ్య విద్యార్థిరాలేదు. ఆ సందర్భంలో తయారైన 'అభ్యుదయ' సంచికలను మద్రాసులో నాకు తెలిసినవారివద్దకు తీసుకెళ్ళి అమ్మతున్నాను. ఒక్క వైశ్యునికైనా అమ్మాలని నా మిత్రులవద్దకు వెళ్ళాను. రవీంద్రనాథ టాగూరుగారి శాంతినికేతనంలో చదివిన గుప్తాగారికి యివ్వగా "రూపాయి దండుగే; నే నేమో చదువను; మా యింటిలోకూడ మరెవరూ చదువరు; క్షమించండి చంచయ్యగారూ" అని కొననేలేదు. వైశ్యులు ఎంతో ధనం సంపాదించుచున్నారు! ప్రజలసొమ్ము వారి హస్తగత మవుతోంది. వారేమో అధిక భాగ్యవంతులవుతూంటే, ప్రజలు మరీ బీదలవుచున్నారు. ధనార్జనయందు తాపత్రయమే కానీ, సంస్కారమందు కోరికకనపడదు వైశ్యుల్లో.

వైశ్య విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ను వుండడం మొదట బాగానే వుండివుండవచ్చును; కాని ప్రత్యేక

కులసంబంధమైన హాస్టల్సు చాలా అభివృద్ధి నిరోధకంగా మారిపోతూ వచ్చాయి. అన్ని కులాలవారు కలిసి చదవడం. కులద్వేషాలు రూపుమాపడం, జాతీయతను పెంపొందించటం. అంతర్జాతీయంగా అభివృద్ధి చెందుతున్న మానవాభ్యుదయ విషయాలను గ్రహించడం అవసరం కాదా? వైశ్యహాస్టల్సులో అన్ని కులాలవారిని, అన్ని మతాలవారిని చేర్చుకోవడం వైశ్యులకే శ్రేయస్కరము.

హరిజనసేవ

నేను పూనుకొని చేసిన సంఘ సంస్కరణలలో హరిజన సేవకూడా ఒకటి. గాంధిజీ పూనా జైలులో నిరశన వ్రతం ప్రారంభించి, హరిజనులకు మేలు చెయ్యాలని ప్రయత్నించుతున్న సమయంలో నా ద్వితీయభార్య సుభద్రమ్మగారు ఆ వుద్యమములో చేరిపోయిరి. ఆమెతో నేను కూడా కలసి పనిచేశాను. ఆమె చాల ఉత్సాహంతో తీవ్రంగా పనిచేయుచుండెను. ఆకాలంలో హరిజనులకు దేవాలయ ప్రవేశహక్కు ఉండాలని శ్రీ యమ్. కె. పాండురంగంగారు మద్రాసులో ఒక చిన్న బ్రాహ్మణేతర దేవాలయంవద్ద నిరశనవ్రతంప్రారంభించారు. ఆయన కాంగ్రెసువాది; ఎన్నోతడవలు జైళ్ళలోఉండి. దెబ్బలకు గురిఅయినారు. ఆయన భార్య కూడ అలాంటిదే. ఆయన చంగల్పట్టు జిల్లా కాంగ్రెసు సంఘానికి కొంతకాలం కార్యదర్శి. గొప్ప హఠయోగి; బలశాలి; 14 రోజులు నీళ్ళు మాత్రమే

తాగుతూ దేవాలయం ఎదుట ఎండలో ఉదయం మొదలు సాయంత్రం 5 ఘంటలవరకు మౌనవ్రతంతో సత్యాగ్రహం సాగించారు. ఆ రోజుల్లో నా లాంటి సానుభూతిపరులం ధర్మకర్తలను కలుసుకొని, సభలు జరిపి కార్యం సాధించ దామనుకొన్నాము. కాని "ధర్మకర్తలు" సమ్మతించలేదు. చివరకు దేవాలయం తలుపులుమాత్రం తెరిచారు. దేవుణ్ణి దర్శించటానికి సమ్మతించారు. ఆ విధంగా పాండురంగం గారిని శాంతపరచి, సత్యాగ్రహం మానేలాగుచేసి, ఆయన ప్రాణాలు కాపాడగలిగామే కాని, హరిజనులకు మేలు చెయ్యలేకపోయాము.

హరిజనులతో సహపంక్తి భోజనాలు ముఖ్యమని నా వుద్దేశ్యం. అందుకు ఏర్పాటు చేశాను. హరిజనులు వంటలుచేసి వడ్డించడం, కలసి భోంచేయుటకు యిష్టపడిన వారు పూటకు రూపాయిచ్చి ముందే టిక్కెట్లుకొనేలా ఏర్పాటు చేశాము. వారంలో ఒకపూట మాత్రమే వంద మందికి ఏర్పాటు చేశాము. సమిష్టి భోజనం రోజున చాలా ముందుగానే టిక్కెట్లు ఖర్చయిపోతూ వచ్చాయి.

అటుతరువాత గాంధీగారు హరిజన సేవక సంఘాన్ని స్థాపించారు. మద్రాసులో ఆ సంఘానికి నా భార్య సుభద్రమ్మగారు కార్యదర్శినిగా ప్రప్రథమంనుంచి పనిచేశారు. అది వృద్ధికి రాసాగింది. సర్వెంట్సు ఆఫ్ ఇండియాసొసైటీ కార్యదర్శిగారైన వి. వెంకటసుబ్బయ్యగారు, నా భార్య సంయుక్త కార్యదర్శులుగాను, దివాన్ బహదూర్

వి భాష్యం అయ్యంగారు అధ్యక్షులుగానుండి స్త్రీలకు ఒకటి, పురుషులకు మరొకటి హాస్టల్సు పెట్టారు. మందులువగైరా ఏర్పాటుచేశారు. విద్యార్థులకు భోజనవసతి వగైరా ఉచితమే. పురుషుల హాస్టలుకు కొంతకాలం శ్రీ బి. యస్. మూర్తి (P M.) గారు వార్డెనుగాను, టీచరుగాను ఉన్నారు. అందరూ కలసి హృదయపూర్వకంగా చెయ్యగలిగినంతా చేశారు.

ఫలితంమాత్రం శూన్యం

అయితే, చేసిన దేమిటి? ఫలిత మేమిటి? ఏమీ లేదు! ఆ కొద్దిమంది పిల్లలకు ఉన్నతవిద్య చెప్పించగలిగారా? లేదు. వారి ఆర్థిక పరిస్థితులు మారి ముఖ్యంగా ఒక్కరికైనా దరిద్రం పోయిందా? లేదు. మరి జరిగిందేమిటి?

హిందువుల పండుగలలో హరిజనులుకూడా హాస్టలులో పండుగ చేసుకొనేలా ప్రచారం జరపడం, వారు ఎలాగైనా హిందూసంఘంలో కలిసి వుండుటకు ప్రోత్సాహించడం కాంగ్రెసువల్ల వారి కష్టాలన్నీ అంతరించి సుఖపడగలరని ఆశపెట్టడం, వారి ఆర్థిక సమస్యలుగాని, రాజకీయ సమస్యలనుగాని, విద్యాసమస్యలనుగాని ఎంతమాత్రం పరిష్కారం చెయ్యజాలకపోవడం, దేవాలయ ప్రవేశంతో వారి కష్టాలన్నీ నశించిపోతాయని ప్రచారం చేయడంయిదీ జరిగినది. హరిజనులలో ఆశాభంగంకలిగి రెండు

పార్టీలుగా విడిపోయి, శ్రీ బి. యస్. మూర్తిగారిని తరిమి వేయుటకు ప్రయత్నించింది ఒక పార్టీ. ఎంతో పనిచెయ్యాలని గంపెడంత ఆశ పెట్టుకొన్న సుభద్రమ్మగారికి 1935 వ్యవహారం నాటికే విసుగుపుట్టింది. ఈహరిజన సేవక సంఘంవల్ల హరిజనుల కష్టాలు నశించజాలవనే తీర్మానానికి వచ్చారు సుభద్రమ్మగారు. అయితే, ఎలా తొలగగలవా అనే నిర్మాణయుక్తమైన పరిష్కారాన్ని మే మప్పటికి గ్రహించలేకపోయాము అధికకారణం ముఖ్యమని మాకు తోచనేలేదు. ఏమీ చేయజాలకపోయినా, ఆ సంఘం తోకపట్టుకొనేవుంది సుభద్రమ్మ. ప్రభుత్వం, లేబరు డిపార్టుమెంటు సహాయంతో వారు జోక్యం కలుగజేసుకుంటూ వచ్చారు. రూథర్‌ఫర్డ్ హాస్టల్సులో రంగుకాగితాల తోరణాలను చూచి, అవి కాంగ్రెసు జండాలోని రంగులని రూథర్‌ఫరు ఆక్షేపించగా సుభద్రమ్మకు చాలా కోపం వచ్చింది ప్రభుత్వసహాయం లేకపోతే హాస్టలును మూసివెయ్యాల్సి వస్తుందని భయపడిన పెద్దలు జోక్యం కలిగించుకొని, రూథర్‌ఫర్డ్‌కు సంజాయిషీ చెప్పుకొని వారి ఆగ్రహానికి గురికాకుండా తప్పించుకొన్నారు.

1940లో నన్ను జైలులో నిర్బంధించడంలో సుభద్రమ్మగారి రాజకీయాలు ఎలాగున్నా, హరిజన సేవా సంఘంలో ఆమె సంయుక్తకార్యదర్శిగా ఉండడం ప్రభుత్వానికి అపాయకరంగా తోచింది. వారి భయాలను కని పెట్టి సుభద్రమ్మ రాజీనామా యిచ్చింది. శ్రీ వి. వెంకట

సుబ్బయ్యగారి మరణంతో వారి ఆత్మతోపాటు ఆ సంఘం ఆత్మకూడా పరలోకానికి వెళ్ళింది. తర్వాత సంఘం శవ సదృశమయినది.

అప్పట్లో సుభద్రమ్మగారి ఆకాశభంగం చూస్తే నాకు చాలా విచారం కలిగేది. ఆమె బుసివాలి స్కూలులో టీచరుగా వుంది. ఆకాలంలో నవీనవిద్యా పద్ధతు లవలంబించడంలో ఆమె నిపుణురాలని ప్రసిద్ధి పొందినది. ఇండియాలో అన్ని ప్రదేశాలనుండి బాలబాలికల మానసికశాస్త్రమును. (Child psychology), విద్యా విధానంలో నూతనపద్ధతులను నేర్చుకొనుటకు పట్టుభద్రులు ఆమె వద్దకు వచ్చుచుండిరి. 1931 లో శ్రీ ఖాసా సుబ్బా రావుగారిని చెల్లారావ్ విదేశీబట్టలషాపువద్ద పికెటింగు చేయుచుండగా పోలీసులు కొట్టి, బట్టలూడదీసి, వీధిలోకి లాగి, చిత్రహింసలు పెట్టిన విషయాన్ని వార్తాపత్రికలలో చదివి ఆమె తన ఉద్యోగానికి రాజీనామా నిచ్చి, దేశసేవ చెయ్యాలని నిశ్చయించుకొన్నారు. ఈహరిజన సేవవల్ల దిక్కులేని అధమాధములకు ఎంతో సేవ చెయ్యగలుగు దునని గంపెడంత ఆశతో ప్రారంభించి, నాలుగేండ్లలోనే (1935) ఏమిచెయ్యాలో తోచక బాధపడుతూండేది.

దోపిడీ వ్యవస్థ పోతేనే మోక్షం

ఆ స్థితిలో (1935) డాక్టర్ మెర్‌పుడ్ యడ్డీగారు సోవియట్ రష్యానుగురించి వ్రాసిన గ్రంథము తలవని

లంపుగా లభించినది; యిద్దరమూ చదివాము. సోవియట్
షియాలో కలిగిన మార్పులు మమ్మల్ని ఆకర్షించాయి.
కా హృదయాలలో ఆశారేఖ పుదయించింది. కులాలు
ర్తిగా నశించినప్పుడే పంచమకులం సైతం నశించు
ది; హిందూసంఘంలో కులాలు ఉన్నంతకాలం హరి
నులకు మోక్షం కలుగదు. వ్యక్తిపరమైన ఆస్తి ఉన్నంత
కు ధనికులుండితీరుతారు. అప్పుడు బీదలు కూడా ఉండక
ప్పదు; అట్టిసంఘంలో అస్పృశ్యులు, అనాథులు, చండా
రుగా అణగదొక్కబడ్డ పంచములకు దారిద్ర్యం తప్పదు.
రికంగా ముందు బాగుపడాలి; వారు దున్ని పండించే
ామలు వారి స్వంతం కావాలి; దానితో సాంఘికంగా
గు పడగల్లుతారు. ఆర్థికంగా న్యాయంజరిగే సంఘ
రప్పుడు వరకు, సంఘంలో దరిద్రు లుండకతప్పదు.

ఆమెను 1943 సం॥ లో హరిజన సేనక సంఘంలోకి
సుకున్నారు. కాని చెయ్యగలిగిన దేమిటి? ఏమీలేదు.
యినప్పటికి, నన్ను తిరిగి 1947, 1948 లో జైలులో
ట్టడంతో ఆమెకు యీ సంఘం మళ్ళీ దూరమైపోయింది.
యితే అందుకు చింతించవలసిన పనేమీ లేదులెండి.

1941 సం॥ లో ఆర్థికంగా హార్బరు కార్మికులకు
హాయం చెయ్యగలమనే ఆశతో హార్బరు వర్కర్లు
యూనియనులో ఉపాధ్యక్షురాలుగా చేరింది; వారిలో
కాలమంది హరిజనులు.

నే నేమో కార్పొరేషన్ వర్కర్ల యూనియనులో కోశాధి కారిగా చేరాను. దానిలో షుమారు 4000 హరి జనులు నీచాతి నీచమైన అశుభ్రమైన పని చేస్తున్నారు.

మా యిల్లు కులాల కలగూరగంప !

తరతరాలుగా మన తాతలు తండ్రులు హరిజనులకు చేస్తున్న అన్యాయాన్ని, పాపాన్ని పోగొట్టుకొనుటకు, ఆత్మ సంతృప్తి కొరకు ఉడుతాభక్తిని హరిజనుల బిడ్డను పెంచు కొందామని ఆశించాము. కాని, ఆర్థిక కష్టాలు అడ్డుతగు లుతూ వచ్చాయి. చివరకు నా మిత్రుడు శ్రీ నంబూరి శ్రీనివాసరావుగారు జైల్లోవుండగా ఆయన ప్రియసోదరి పరిపూర్ణను మా యింట్లో కొంతకాలం ఉంచుకొని చది వించాము. ఆ బిడ్డ చాలచురుకైనది. సంగీతం, సాహిత్యం, అభినయాల్లో గట్టిది. బాగా ఉపన్యసించేది. తన క్లాసులో మొదటిది. బాగా చొరవచేసుకొని, కష్టాలను జయించి ముందుకు పోగల అసాధారణ శక్తిగల వ్యక్తి. ♦

సేవాసదనంలో వర్గవిభజన

♦ మద్రాసు సేవాసదనంలోపరిపూర్ణను చేర్చాము. అది బాలికల హైస్కూలు శ్రీ ముత్తా వెంకటసుబ్బారావు గారు, ఆయన భార్య స్థాపించారు. స్వంత ధనంతో పోషిం చుతున్నారు బీద బాలికలకు ఉచితంగానే భోజనము, వసతి మొదలయిన సౌకర్యాలు కల్పించి చదివించారు. నష్టాన్ని లెక్కచేసేవారు కాదు. 1942—3 లో నేను పరి

పూర్ణను చేర్చుకొనగోరగా ఉచితంగానే చేర్చుకొన్నారు. 5-6 సంపత్సరాల వరకు ఆర్థిక చిక్కులు లేకుండా పరిపూర్ణ చదువు సాగుతుందనుకున్నాను.

చేరిన 48 ఘంటలలో పరిపూర్ణ తిరిగి వచ్చేసి, ఆ సదనంలో చదవడానికి యిష్టంలేదని ఖండితంగా చెప్పేసింది. కారణ మడిగాను. విద్యార్థుల్లో రెండుమూడు తరగతులున్నాయనీ, తమ ఖర్చులను భరించేవారు మొదటి తరగతివారనీ, ఉచితంగా చదువుకొనేవారు అధమ తరగతివారనీమూడోతరగతివారు పై తరగతులవారికి వంటలు చేయడం. గదులు తుడవడం వగైరా సేవలు చేస్తుండాలనీ; ఆ వాతావరణంలో తాను చదువుకోదలచలేదని చెప్పింది.

మరొక విషయాన్ని గురించికూడ చెప్పింది. తాను సదనంలో చేరేటప్పుడు పళ్ళెం తీసుకెళ్ళ లేదు. ఆమె స్వంతడబ్బుతో కొనిపెట్టమని కొంతడబ్బు జమకట్టాము. కొనేవరకు విస్తళ్ళలో పెట్టుండని చెప్పాము. అయితే, అలా చెయ్యక, కలిపిన ముద్దలు దోసిట్లో వేశారట. రెండు రోజులూ. కాబట్టి పరిపూర్ణ తిరిగి రావటానికి సరియైన కారణాలే వున్నాయి.

పరిపూర్ణను పంపండని శ్రీ ఆండాళమ్మగారు నాకు వ్రాశారు. కారణాలను తెలుపక, సదనంలో చదువుకొనుటకు పరిపూర్ణకు యిష్టంలేదని వ్రాశాను. ఆండాళమ్మ

గారు మా యింటికివచ్చి కారణాలను తెలుసుకొని, ఇక అలాంటి కష్టాలు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తానని, పరిపూర్ణను రమ్మని కోరింది. కాని సదనంలో అలాంటి తరగతు లున్నంత కాలము తాను రాజాలనని పరిపూర్ణ ఖండితంగా చెప్పింది.

అప్పుడు ఆండాళమ్మగారు "చంచయ్యగారూ! మీరూ, మీ భార్య మా సదనంతో సంబంధం వదలు కున్నారు. ఏడేళ్ళుగా చదువుకొనుటకు ఒక్కరినీ పంప లైతిరి ఇప్పుడు పరిపూర్ణను పంపారని సంతోషించితే యిలాగయిం"దని విచారం వెలిబుచ్చారు.

1935 సం॥లో ఇలాంటి తరగతులను ప్రవేశపెట్టారని తెలియగానే నేనూ, నా భార్య ఆ పద్ధతిని ఖండించుతూ శ్రీ వెంకటసుబ్బారావుగారికి, వారి భార్య ఆండాళమ్మ గారికి వ్రాశాము. కాని వారు మానలేదు. మానసికం గాను, నైతిక దృష్టిలోను విద్యాలయాల్లో ఇలాంటివి ఎంతమాత్రం ఉండకూడదనీ, ఆడయార్‌లోను, ఋషి వాలి స్కూలులోను ప్రిన్సిపాలు జి. వి. సుబ్బారావుగారు ఏ ఆదర్శాలతో తన స్కూలును నిర్వహించుచుండిరో తెల్పుతూ వ్రాశాను. కాని, మా సలహా వారికి నచ్చ లేదు, అప్పటినుండి విద్యార్థినులను ఆ సదనానికి మేము పంపలేదు; వారి సహాయం తీసుకోడం మానివేశాము.

మా యింట్లో వివిధ కులాలవాళ్ళం ఉన్నాం. నా దొక కులం; నా భార్యది మరొకటి. నా బిడ్డలు కులమతా లతో సంబంధం లేకుండా పెరిగారు. వంటకత్తెది మరొక కులం. నా తాలూకు బంధువుల్లో నా బావగారు మొన్నటి వరకు నాతో సహపంక్తి భోజనానికి యిష్టపడేవారుకాదు.

నా భార్య పినతల్లిగారిది వైదిక బ్రాహ్మణ కులం. వృత్తి పౌరోహిత్యం. గొప్ప భూస్వామి. ఆమెకు సంతానం లేదు. అప్పుడప్పుడు మా యింటికి రాకతప్పదు. తాను పెంచి పెద్దచేసిన సుభద్రమ్మమీద పంచప్రాణాలు. మా యింటికి వచ్చినప్పుడు "పంచమ" బాలిక పరిపూర్ణ ప్రత్యక్షమయింది. అప్పుడు సుభద్రమ్మ తన పినతల్లితో "ఈ పరిపూర్ణ నా బిడ్డ; మిగతా బిడ్డలెలాగో ఈ బిడ్డ కూడా నాకు అలాగే. ఈ బిడ్డతో కలసి భోంచేయటానికి ఒప్పుకోవాలి; లేదా హోటలునుంచి తెప్పించుతాను. వేరే భోంచెయ్యా"లని ఖచ్చితంగా చెప్పింది.

ఆమె ఒకటి రెండురోజులు హోటలు భోజనం భోంచేసింది. ఈలోపల పరిపూర్ణ శుభ్రత, సంగీతం, సాహిత్యాలు,

---

ఏడు సంవత్సరాలు ఆసదనంలో ఎలాంటి ఏర్పాట్లున్నది తెలియక పరిపూర్ణను ప్రవేశపెట్టాము. తరువాత పరిపూర్ణను మా యింట్లోనే ఉంచుకొని స్వామి రామకృష్ణ శారదా విద్యాలయం (త్యాగరాయనగరం)లో చదివించాము.

చురుకుతనం, సంస్కారము ఆమెనాకర్షించాయి. పరిపూర్ణకు తల దువ్వి, పూలు పెట్టడంతో ప్రారంభించి పుండ్లకు మందు వెయ్యడమేగాక, చివరకు కలసి భోంచెయ్యడం వరకూ వచ్చింది. "మన బిడ్డలకంటే ఆ బిడ్డలో ఏమీ లోపంలేదే!" అని ఆశ్చర్యపడింది. స్వగ్రామానికి తిరిగి వెళ్ళే ముందు మా స్వంతబిడ్డలతో సమానంగా పరిపూర్ణకు బహుమతులిచ్చింది. పరిపూర్ణకు నా ముద్దులు చెప్పం" డని ఉత్తరాల్లో వ్రాస్తుండేవారు.

కాలం మారిపోతోంది. ఈ పరిస్థితులను ఉపయోగించుకోవాలి. లేకపోతే సంఘం మారటానికి చాలా కాలం పడుతుంది. తెలిసివుండి అలా జరగనివ్వకూడదు.

భుక్తికొరకు ఉద్యోగాలు

1919 డిశంబరులో జైలునుండి విడుదల అయ్యాను. నేను ఆస్తిపరుణ్ణికాదు. సంపాదించుకొని జీవించాలి అని ఇదివరకే చెప్పాను. నేను చదువుకొన్నది వ్యవసాయ విద్య. అమెరికాలో చదువుకొన్నాను. స్వయంగా వ్యవసాయం చేయడానికి భూములు గాని, ధనంగాని లేవు. నౌకరీచేసి బ్రతకాలి. బ్రిటిష్ ప్రభుత్వోద్యోగాలు సిద్ధంగానే వున్నై. ఇంపీరియల్ వ్యవసాయ శాఖలో మంచి జీతాలే యిస్తారు. నెలకు రు. 350-50-1000, ఆ తరువాత రు. 1000-100-500ల జీతం. (నాతో చదువుకొన్నవారు

వుద్యోగాలలో చేరారు. రు. 1500ల కంటె ఎక్కువ జీతాలే సంపాదించారు.) ఆ నాలుగున్నర సంవత్సరాలలో బ్రిటిష్ సామ్రాజ్య నిజ స్వరూపం నా అనుభవంలోకి వచ్చింది. ఆ అన్యాయాలను, అక్రమాలను, అమానుషత్వాన్ని నాశనం చేయడమే నా విధి. అలాంటి ప్రభుత్వసేవ చేసి నిలబెట్టడం నాకు తగనిపని. అప్పట్లో ప్రయివేటు ఉద్యోగాలు ఆప్పుడప్పుడే ఆరంభమౌతున్నాయి. నే నా సందిగ్ధ కాలంలో ఉన్నాను. ఏడు ఉద్యోగాలు చేశాను, ఏడుసార్లు రాజీనామా పెట్టాను. నెలకు 150 మొదలు రు. 1000-0-0 వరకు సంపాదించాను. 1920 మొదలు 1940లో మరల రెండో ప్రపంచ యుద్ధకాలంలో జైల్లో పెట్టేవరకు 20సంవత్సరాలలో 17 సంవత్సరాలు ఉద్యోగాలు చేశాను. లక్ష రూపాయలు ఆర్జించాను. రు. 80000లలో 50000 రు. లు మా కుటుంబానికి ఖర్చుయివుంటుంది. భుక్తికి లేక ఉద్యోగంలో చేరడం; బాగా సంపాదించడం. రెండునూడేళ్ళలో విసుగెత్తడం. యజమానులతో దెబ్బలాడడం. రాజీనామా పెట్టడం జరిగింది. ఒక్కొక్కప్పుడు. నాకు యజమానులతో- అనగా లిమిటెడ్ కంపినీలతో 20 సం॥ల అగ్రిమెంటు వుండేది. అయినా మానివేశేవాణ్ణి. ఒక్కొక్కప్పుడు అలా మానెయ్యడంతో నాకెంతో నష్టపరిహారం రావలసివుండేది. కోర్టుకు వెళ్ళకపోతే రాదు. నేను 1920 సం॥ లోనే కోర్టుకు పోకూడదని దీక్షపూనాను. అంచేత, వాదిగా నే నెన్నడూ కోర్టుకు వెళ్ళలేదు. ప్రతివాదిగ

మాత్రం వెళ్ళక తప్పలా. క్లుప్తంగా నా అక్షికచరిత్ర వివరాలు కొన్ని వ్రాస్తాను.

(1) 1920 లో అడయారులో నేషనల్ యూనివర్సిటీవుంది. అనీబిసెంటమ్మగారు దాని స్థాపకులు. అందులో అగ్రికల్చరల్ కాలేజికూడ వుంది. జమీందార్లు, భూస్వాముల బిడ్డలకు తమ విశాలమైన భూములను, ఎస్టేటులను నవీన పద్ధతుల్లో వ్యవసాయం చేయుటకు తర్ఫీదు నివ్వడం అ కాలేజీ ఉద్దేశం. అందులో నేను లెక్చరర్‌గా చేరాను. కాలేజీలో రోజుకు ఒకటి రెండుగంటలుమాత్రమే నాకు పని. అక్కడి ప్రొఫెసర్లు దేశసేవకులు. జీతం నెలకు వందరూపాయలు మాత్రమే; ఇంటి వసతి వుచితం; నేను అప్పుచేసి అమెరికాలో చదివాను. కాబట్టి ఆ అప్పును తీర్చడానికి నెలకు పాతికరూపాయలు అదనంగా నాకు మాత్రమే యిచ్చేవారు. నేను క్లాసులలోయిచ్చే వుపన్యాసాలను తెలుగులోకి అనువదించి ప్రతివారం ఆంధ్రపత్రికకు పంపేవాణ్ణి. అందుకు ప్రతిఫలంగా ఆంధ్రపత్రికవారు నాకు నెలకు షుమారు రు 30 లు యిచ్చేవారు. తెలుగులో వ్యవసాయ శాస్త్రమును వ్రాయుటకు సాహసించిన వారిలో నేనే మొదటివాణ్ణి. వ్యవసాయ శాఖోద్యోగులు ఆ వ్యాసములను కత్తిరించి, పుస్తకరూపంగా తయారు చేసుకొనేవారు ప్రతి వ్యాసం చివర "వ్యవసాయ సంబంధ విషయాలను గూర్చి సలహాలు కోరేవారికి ఉచితంగా

సమాధానాలు వ్రాస్తా"నని ముగించేవాడిని. ఆవిధంగా ఆంధ్రదేశంలో వ్యవశాయ విషయాల్లో నేనే నిపుణుణ్ణి అయ్యాను. 'చెట్లు లేని చోట ఆముదంచెట్టే మహావృక్షం' అనే సామెత నాకు బాగా అన్వయించింది విప్లకారుడను కొంటూవచ్చిన చంచయ్యను అప్పటినుండి 'వ్యవసాయ శాస్త్రజ్ఞుడు' అనసాగారు. అడయారులో దివ్యజ్ఞాన సమాజానికి సంబంధించినవారు మంచి సంస్కృతి గలవారు. సంఘసేవయందు-ముఖ్యంగా విద్యావ్యాప్తి చేయుటలోను, సంఘ సంస్కరణలలో ముందంజవేసినవారు అందువల్ల అడయారులో మానవసేవ, జీవకారుణ్య వాతావరణం బాగా ఉండేది. అట్టివారితో రెండు సంవత్సరాలు ఏంతో ఆనందంగా కాలం గడిచిపోయింది నేనా కాలేజి విడిచి పెట్టడానికి ముఖ్యకారణం అనీబిసెంటమ్మగారి రాజకీయాలతో ఏకీభవించలేకపోవడమే. గాంధీగారి ప్రజా ఉద్యమము, సత్యాగ్రహోద్యమము. దేశాన్ని నిద్రనుంచి మేల్కొల్పాయి ప్రజలను రాజకీయంగా ఎంతో ముందుకు తీసుకువెళ్ళాయి. రాజకీయాలను ప్రజలలోకి తీసుకెళ్ళడం, ప్రజల్లో రాజకీయ చైతన్యం కలుగచేయడ మనేవి అనీ బిసెంటుమ్మకునచ్చలేదు. గాంధీగారిని ఆమె తన "న్యూ ఇండియా" పత్రికలో నిశితంగా విమర్శించడమేగాక దూషించ నారంభించింది. నేను గాంధీగారితో రెండు విషయాలలో మాత్రం- అనగా అధినివేశ; అహింసా వాదముల విషయంలో ఏకీభవించలేక

దూరంగా వుండిపోయాను. కాని ఆయన్ను దూషించడం, వారికి అడ్డుపడడం, వారికి హానిచేయమని బ్రిటీషు ప్రభుత్వాన్ని రెచ్చగొట్టడం నా కెంతమాత్రం నచ్చలేదు. సహించలేకపోయాను. అసలు అడయారు రాజకీయ వాతావరణమే నచ్చలేదు. అంచేత వెంటనే నా ఉద్యోగానికి నీళ్లు వదిలాను. అయితే ఉద్యోగం లేకపోతే ఉదరపోషణకు మార్గమేమిటి? వేరే ఉద్యోగం కోసం వెతకాల్సి వచ్చింది. అదీగాక 1921 సం॥లో అన్నపూర్ణమ్మను వివాహంచేసుకొన్నాను. మరి భార్యను పోషించాల్సిన బాధ్యతకూడా ఏర్పడింది.

నర్సాపురం కంపెనీ నాటకం

నేను అడయారు జాతీయకళాశాలలో లెక్చరర్‌గా వున్నప్పుడు నర్సాపురంలోని "సర్కార్స్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంటు కార్పోరేషన్ లిమిటెడ్" వారికి వ్యవసాయ సంబంధమైన సలహాలిచ్చి రు. 100 ల ఫీజు, ప్రయాణఖర్చులు పుచ్చుకొన్నాను. ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో అధికోత్పత్తికోసం బంజరు భూములను దరఖాస్తుమీద యిస్తూవచ్చారు. పెన్షను పుచ్చుకొన్న ప్రభుత్వోద్యోగులు కొందరు, గొప్ప అధికార్లు కొందరు, విద్యాధికులుకలసి 1500 ఎకరాలభూమిని భీమవరంవద్ద గొల్లవానిదిబ్బ గ్రామంలో దరఖాస్తుతో సంపాదించి నర్సాపురంలో "సర్కార్స అగ్రికల్చరల్ డెవలప్‌మెంటు

కార్పొరేషన్ లిమిటెడ్" అనే పేరుతో కంపెనీని స్థాపించుకొన్నారు. వారిలో రిటైరైన ఒక జిల్లా ఫారెస్టు ఆఫీసరు, ఒక సబ్ డివిజనల్ ఆఫీసరు, ఆ ప్రాంతాలలో వ్యవసాయంలో ఆరితేరిన భూస్వాములుకూడా ఆ లిమిటెడ్ కంపెనీలో వున్నారు. కాని, ఆ భూమిలో వున్న లోపాలను యెలా సరిదిద్దాలో వారికి తెలియలేదు. భూములు సారవంతమైనవే. వరి బాగా పండగలదన్న విషయం మాత్రం వారికి తెలుసు. నవంబరు, డిశంబరుమాసాలలో పంటలు తయారైనకాలంలో కొల్లేటి ములకలను తప్పించడ మెలాగని అడిగారు. భూములచుట్టూ నాలుగడుగుల ఎత్తున కట్టవేసుకోమన్నాను. ఆ భూముల ప్రక్కగా పారే యనమదుర్రులో ఒక్కొక్కప్పుడు భూమట్టంకంటె నాలుగడుగులు క్రిందికి దిగిపోతుంది. 1500 ఎకరాలకు నీరు తోడటం ఎలాగన్నది రెండోసమస్య. అంతఎత్తుకే అనుకూలించే ఇంజన్లు, పంపులను మలబారులో ఉపయోగించడం నేనెరుగుదును. ఆ ఇంజన్ల నుపయోగించమని సలహా, యిచ్చాను. అప్పట్లో ధాన్యంధరలు పెరిగివున్నందున, నీటిని పంపింగ్ చేసి, లాభసాటిగానే వరివ్యవసాయం చేయవచ్చునని నిరూపించాను. అప్పటికే నేను నిరుద్యోగిగా వున్నాను. ఆ విషయం తెలిసి వారు నన్ను తమ కంపెనీకో చేరి ప్లానులు ఎస్టిమేట్లు తయారుచేసి పెట్టమన్నారు. అలాగే ఇచ్చాను. వారికి నా శక్తిసామర్థ్యాల్లోను, ప్రవర్తనలయందు నమ్మకమేర్పడి నన్నే మేనేజింగ్ డైరక్టరును చేశారు. అవసర

మైన రు. 60000 ల మూలధనాన్ని వాటాలు అమ్మి పోగు చెయ్యమన్నారు. ఒప్పుకున్నాను. నేను కోరిన ప్రకారం 25 సం॥ ల వరకు నన్ను మేనేజింగు డైరెక్టరుగా ఉంచుటకు అగ్రిమెంటు వ్రాసియిచ్చారు. జీతాలు, కమీషన్లు మొదలైన షరతులను నాకు అనుకూలంగా వ్రాయించుకున్నాను. అవసరమైన మూలధనం అతిసులభంగా వచ్చి పడింది. ఆ పంపింగ్‌సీ్కము మీద అంతనమ్మకం కలిగిందన్నమాట. మాగాణి ఎకరం రూ 40 లకే లభిస్తుందని నమ్మక మేర్పడగానే దురాశాపరులు కొందరు వాటాదార్లుగాను, డైరెక్టర్లుగాను చేరారు. ప్లాన్లు, ఎస్టిమేట్లు, మూలధనం వగైరా లభించినతరువాత నాకు వ్రాసియిచ్చిన అగ్రిమెంటుకో టెక్నికల్‌గా లోప మున్నదనీ, కాబట్టి చెల్లదనీ చెప్పి నన్ను వెళ్లిపొమ్మన్నారు.

ఆకాలంలో ముఖ్యంగా 1900 మొదలుకొని ఆంధ్ర దేశంలో ఏర్పడ్డ లిమిటెడ్ కంపెనీలు – జ్యూట్‌మిల్లు, బట్టలమిల్లు, పేపరుమిల్లు, పొగాకు కంపెనీలు, మొదలైన వాటిలో తగాదాలు ఏర్పడి, చివరకు ఆ పరిశ్రమలే కుంటు పడేవి. ఫలితంగా మన పారిశ్రామికాభివృద్ధికి ప్రతికూల పదిసితు లేర్పడేవి. ఆంధ్రలో ధనంకూడ చాల తక్కువగా ఉండేది. అప్పు కావలసినవారు ఆస్తులను తాకట్టుపెట్టి నెల 1కి నూటికి రు 1-0-6 వడ్డీ యిచ్చేవారు. అంతకంటె పెద్దలాభం పరిశ్రమలలో లభించడం కష్టం. అందువల్ల మూలధనం లభించడం కష్టంగా వుండేది. ఇలాంటివాడు

నూటికి నూరు లాభం చూపించగలిగితేనే మూలధనం లభించేది. కొందరు దురాశాపరులు, కోర్టు వ్యవహారాలకు అలవాటు పడినవారు కంపెనీల సొమ్మును దిగమింగి లక్షాధికార్లు కావాలని ఆశపడేవారు. అవిధంగా దిగమింగటానికి ఉపాయంచెప్పమని వకీళ్ళను అడిగేవారు. కొన్ని సంవత్సరాలు నష్టము వచ్చేలా చేసినా, లేక లీగల్‌గా పేచీలు పెట్టి, కోర్టులకు లాగి, పరిశ్రమలు నడవకుండా చేసినా అనేకమంది వాటాదార్లు భయపడి తమ వాటాలను చౌకగా అమ్మివేస్తారనీ, చౌకగా అనేక వాటాలను కొన్న తరువాత కంపెనీని జయప్రదంగా నడుపవచ్చుననీ కొందరు వకీళ్ళు తమ పార్టీలకు సలహాయిచ్చేవారు. ఇలాంటి అంటు రోగం గుంటూరుకో పుట్టి, ఆంధ్రలో అన్ని పట్టణాలకు ప్రాకిపోయింది. అలాంటి అంటు జాడ్యమే మా నర్సాపురం కంపెనీకి కూడ సోకింది. అయితే ముందు నన్ను తరిమివెయ్యాలిగదా! పుస్తకాలు, అకౌంట్లు, బ్యాంకు అకౌంట్లు, సర్వమూ నా చేతిలోనుంచి లాక్కోవడమెలాగా అనేదే సమస్య! నేనేమో సులభంగా ఊరికే ఇవ్వను. ఆరునెలలకాలం పనిచేసి పెట్టాను. నా ఖర్చులకు రూ 600 లకు మించి పుచ్చుకోలేదు. కాబట్టి వాళ్ళు పోలీస్ సర్కిలు ఇన్‌స్పెక్టరు శ్రీ మాధవరావుగారి వద్దకు వెళ్ళి, నన్ను మోసపుచ్చేందుకు ప్రయత్నించారు. కాని ఆయన సమ్మతించలేదు. ఒంటరిగా కనబడితే కొడతానేమోనని వాళ్ళు సందుగొందుల్లోకి తప్పుకొనేవారు. ఏడెనిమిది

మంది కలిసి నా ఆఫీసుకు వచ్చి రికార్డు వగైరా తీసు కొనుటకు ప్రయత్నించారు. లోపలికివ్వ్తే కొన్ని తప్పదని హెచ్చరించాను. కాళ్ళకు బుద్ధిచెప్పారు. తుదకు నా ఆరుమాసాల సేవకు రూ 3500 లు యిస్తామని రాజీబేరానికి వచ్చారు. ఆ రూ 3500 లకు వాటాలు ఇమ్మన్నాను. ఇవ్వక తప్పలేదు. (ఇప్పుడు వాటి విలువ రు 40000 లు) అంతేగాదు, మరి రెండు సం॥ల పాటు కంపెనీలో వుండి పనులన్నీ పూర్తిచేయించి వెళ్ళమనీ, ఎక్కువజీత మిస్తామనీ, ప్రతిమలాడారు ఒక సంవత్సరం మాత్రమే వుంటానని మాట ఇచ్చి పనులు పూర్తిచేసి వెళ్ళిపోయాను. కూలీలకు, గుమాస్తాలకు జీతాలు ధారాళంగా ఇస్తూవచ్చిన కంపెనీవారు నన్ను ఆక్షేపించేవారు.

ప్రభుత్వంవారి చెరువులమీద అలుక

ఆ ఉద్యోగం వదలి వెళ్ళిన తరువాత మూడేళ్ళ దాకా నాకు మరో ఉద్యోగం దొరకలా. ఎన్నో బంజరు భూములకు పంపింగ్‌తో వరి పండిచుటకు మంజూరు చెయ్యమని దరఖాస్తులు పెట్టాను. గవర్నమెంటుకు ఎన్నో వేల రూపాయలలాభం యేటేటా వస్తుందని నిరూపించాను. నా పూర్వ రాజకీయచరిత్ర కారణంగా నా దరఖాస్తులను రెవిన్యూబోర్డులో త్రోసివేస్తూ వచ్చారు. రూధర్‌ఫర్డ్ లాంటి కలెక్టర్లు రాజకీయ కారణాలవల్లనే ఇవ్వడంలేదని

స్వయంగా చెప్పేవారు. ఆ నా డున్న బంజరుభూములల్లో చాలభాగం ఈనాటికీ బంజర్లుగానే ఉన్నాయి.

దొరలకొలువు వద్దు

1925 కో ఇంపీరియల్ కెమికల్స్ కంపెనీవారు లండనులోని తమఫ్యాక్టరీలకో తయారయ్యే సల్ఫేట్ అమోనియా మొదలైన ఎరువులను ఇండియాలో అమ్మ నారంభించారు. మద్రాసుకో షావాలీసు కంపెనీకి ఏజన్సీ ఇచ్చారు. ఆంధ్రదేశానికి నన్ను ఇన్స్పెక్టరుగా నియమించారు. షావాలీసు కంపెనీ తరపున పైర్లు, పండ్లచెట్లు మొదలగు అన్ని పంటలకు, భూములకు ఆ యెరువులను వేసి, పరీక్షించి మంచి లాభకారియని నిరూపించిన తరువాత ఆ ఎరువులను అమ్మటకు ప్రతిపట్టణముకోను ఏజంట్లను నియమించాము. ఆదిలో పెద్దషాహుకార్లు ఏజన్సీలను నిరాకరించారు. విద్యావంతులైన పేదవర్తకులు ఏజన్సీలు తీసుకుకున్నారు. ఒకటి రెండు సంవత్సరాల తరువాత మంచి లాభాలు వస్తాయనే ఆశతో, మొదట నష్టపడినా వారు చాల శ్రమపడి ఆ ఎరువులకు మంచి పేరు సంపాదించారు. లాభాలు రాబోయే సమయంలో ఈ కంపెనీ ఒక మోసంచేసింది. అసలుకంపెనీయే (ఇంపీరియల్ కెమికల్స్) స్వంతంగా ఇండియాలో వ్యాపారం ప్రారంభించి మమ్మల్ని తమ కంపెనీకోసమే నేరుగా మార్చి తమ అధీనంలో పెట్టుకోవడమేగాక, షావాలీసుకంపెనీని మామూలు

వ్యాపారం చేసుకోనిచ్చారు. అంచేత, మేము తిరిగి ప్రతి పట్టణంలోను క్రొత్తఏజంట్లను నియమించాల్సి వచ్చింది. మేము పూర్వం నియమించినవారికి పోటీగా వ్యాపారం జరిపించాల్సిక దా! అప్పటికి ఎరువులకు మంచి పేరువచ్చింది. కాబట్టి విరివిగా ఖర్చవుతుందనీ, మంచిలాభాలు వస్తా యనీ నమ్మకం ఏర్పడినందువల్ల గొప్ప ధనవంతులగు వ్యాపారస్తులు ఏజన్సీలు పుచ్చుకొన్నారు. అరువుగాకూడ అమ్మగలిగారు. మొదటిఏజెంట్ల వ్యాపారం తగ్గిపోయింది. ఏలూరులో శ్రీ కలగర రామస్వామిగారు ఈ సందర్భంలో నష్టపడితే, మాజేటివారు లాభం పొందారు. అనేక పట్ట ణాలలో ఈవిధంగానే జరిగింది. భుక్తికొరకు ఉద్యోగం చెయ్యడం, ఉద్యోగంలో మోసాలు, అన్యాయంచేసి యజమానులకు, పెట్టుబడిదారులకు దోచిపెట్టడం నా దిన చర్యగా మారిపోతూవచ్చింది. ఇంతగా దోచిపెట్టినందు వల్ల నేనేమైనా బాగుపడ్డానా? నన్నూ కంపెనీవాళ్లు మోసంచేశారు. ఆరంభంలో రు 150 లు జీతం, అమ్మిన బస్తా 1కి రెండణాలకమీషను ఇచ్చేట్లు షరతులున్నవి. మొదటిసంవత్సరంలో రు 300 లు వచ్చినవి. మూడో సంవత్సరంలో కమీషన్ క్రిందనే ముప్పైవేల రూపాయలు రావాలి. అయితే వాళ్లు కమీషనును బోనసుగా మార్చి సున్నచుట్టారు. జీతం నెలకు రు. 350లకు పెంచారు. అయినా నేను సమ్మతించలేదు యూరోపియనుల పట్టీలో చేర్చుకొని వారికిచ్చిన జీతాలు, బేటాలు, పెన్షన్లు, సెల

వులు వగైరా ఇస్తామని ఆశపెట్టారు. ప్రయాణఖర్చులు, నౌకరు వగైరా ధారాళంగానే ఇచ్చారు. నెలకు 25 రోజులు ప్రయాణాల్లో వుండేట్లుచేశారు. నా ఆరోగ్యం చెడిపో నారంభించింది. మద్రాసురాష్ట్రంలో మొత్తం ముగురు ఇన్సెపక్టర్లు, 40 మంది ప్రచారకులు వున్నారు. కాని, నాకుమాత్రమే ఎక్కువ సౌకర్యాలుకలిగించి, మంచి జీతం, నౌకర్లువగైరా ఇచ్చారు నన్ను చాలా గౌరవించేవారు. అలా గౌరవింపచేసుకోవడం నాకు తెలుసు, కాని మిగతవారికి చాలాకష్టాలు వుంటూవచ్చాయి. అంచేత, వారు సమ్మెచేశారు. ఆ సమ్మెకు నన్ను నాయకత్వం వహించమని కోరగా ఒప్పుకొన్నాను. మా కోర్కెలను సాధించాము. తిరిగి ఉద్యోగాలలో చేరాలి; కాని, నేనూ, నా మిత్రుడు శ్రీ రామకృష్ణగారూ మాత్రం నిరాకరించాము. 1930-31 సం.లో ఈ సంఘటన జరిగింది. విదేశవస్తుబహిష్కారం మరల ప్రారంభమైంది. విదేశ వస్తువుల నమ్మకానికు మా కిద్దరకీ మనస్కరించలేదు. అంచేత వుద్యోగాల్లో చేరలేము. మరల నిరుద్యోగసమస్య యెదురొక్కన్నది. భుక్తికొరకు మళ్లీ ప్రయత్నం చెయ్యాల్సి వచ్చింది.

ఇన్సూరెన్సు కంపెనీలు

యూరపియన్ కంపెనీలో నౌకరీ చేసిన తరువాత ఇండియన్ కంపెనీలో ఉద్యోగం చేయడం పెనంలోనుంచి

పొయ్యాలో పడ్డట్టు తోచింది. గుంటూరులో నేను, నా మిత్రులు కలసి జయభారతి ఇన్సూరెన్సు కంపెనీని స్థాపించాము. ఆ వ్యాపారంలో నా కెంతమాత్రం అనుభవం లేదు కాని అలాంటి కంపెనీని నాలాంటివాడు సులభంగా నిర్వహించవచ్చునని మిత్రులు నన్ను ప్రోత్సహించారు. నా భుక్తికి ఏదో ఒక ఉద్యోగం చేయకతప్పదు. కాబట్టి మేనేజింగ్ డైరెక్టరుగా ఉండటానికి సమ్మతించాను. నెలకు రు 150 ల జీతంతోనే ప్రారంభమైనా నెలకు వెయ్యి రూపాయలు కమీషన్లతో సహా లభిస్తూవచ్చింది. డైరెక్టర్లు బాగా సంపాదించగలిగారు. మరి ఇన్సూరెన్సు చేసుకొన్నవారో? అనేకులు మోసపోయారు; నష్టపడ్డారు; ఈ విషయంనాకు రెండేళ్ళలో తెలిసిపోయింది. ఇక అందులో వుండకూడదనుకున్నాను. కంపెనీతో 25 సం॥ల అగ్రిమెంటువుంది. చివరకు డైరెక్టర్లను ఒప్పించి దానిలో నుండి బయటపడ్డాను.

మోసపు ఇన్సూరెన్సు మానివేసి, శాస్త్రీయమైన ఇన్సూరెన్సు చేయుటకు విజయలక్ష్మి ఇన్సూరెన్సు కంపెనీని పెట్టాను. 'జయభారతి' లో లాభాలు పొంది నామీద నమ్మకం కలిగినవారందరూ ఈ క్రొత్తకంపెనీలో చేరారు. దీనిలోకూడ నాకు 25 సం॥ల అగ్రిమెంటు రిజిష్టరు చేసి ఇచ్చారు. నెలకు జీతం రు 500—750లు, తరువాత వెయ్యి రూపాయల వరకు గ్రేడు పర్వాటు చేశారు. ఇదిగాక కమీషను కూడా ఇవ్వాలి. వ్యాపారం బాగా సాగింది. కంపెనీ

మంచి వృద్ధికి వస్తుందనే నమ్మకం కలిగింది. లక్షలు, కోట్ల రూపాయలు కంపెనీలో నిలువ అయ్యే సూచనలు కనబడ్డాయి. ఆ ద్రవ్యంతో ఆంధ్రదేశంలో బ్యాంకులు, పరిశ్రమలు వగైరా స్థాపించాలన్న అభిలాష, స్థాపించ గలమనే ధైర్యం కలిగాయి. దానితో దురాశాపరులకు నిద్ర పట్టలేదు. నేను కంపెనీలో ఉన్నంతవరకు వారి ఆటలు సాగవు. అందువల్ల నన్ను సాగనంపారు.

గుంటూరు వర్తకులకు కంపెనీ ఆక్ట్ బాగా తెలుసు. కొన్ని కంపెనీలు గుంటూరులో అదివరకే నాశనమైనవి. నా అగ్రిమెంటు అగ్నిపాలుచేశారు. నా ఈ "మిత్రుల" వలలో చిక్కిజైల్లోను, ఏ క్రిమినల్ కేసులోను పడ కుండా తప్పించుకొన్నందుకు సంతోషించిన నా శ్రేయోభి లాషులు నన్నభినందించారు. ఎంతో అభివృద్ధికి వస్తూ వున్న కంపెనీ రసం పీల్చి పిప్పిచేసి, అధోగతికి తెచ్చారు.

పెట్టుబడిదారీ వ్యూహంనుండి విము

ఆకాలంలో అనగా 1935 సంవత్సరం నాటికి నేను పెటుబడిదారును, ధనవంతుడను కావడానికి అనుభవము, అనుకూలపరిస్థితులు ఉన్నాయి. ఒక బ్యాంకును పెట్ట డానికి ప్లాను వేశాను. 12 లక్షల మూలధనం అవసరమని శ్రీ సామి వెంకటాచలం శెట్టిగారు సలహా యిచ్చారు. అరవ జిల్లాలోని 12 వైశ్య బ్యాంకులవారు ఆ 12 లక్షల మూలధనాన్ని ఇచ్చి మద్రాసులో వైశ్య సెంట్రల్

బ్యాంకును స్థాపించుటకు అంగీకరించారు. కరూరులో నైశ్య బ్యాంకును జయప్రదంగా వృద్ధికి తెచ్చిన శ్రీ వేంకటామ నెట్టిగారు, శ్రీ సామి వెంకటాచలం నెట్టి గారు కలసి ఒకరు చైర్మన్‌గానూ, మరొకరు మేనేజింగు డైరెక్టరుగానూ నిర్వహించేటట్లు ఏర్పాటు చేశాను. అందుకు అవసరమైన సంఘ నిబంధనలు, మెమోరాండము వగైరా పత్రములు-వీటన్నిటినీ పూర్తిచేసి ప్రారంభించ నున్న సమయంలోనే విజయలక్ష్మి ఇన్సూరెన్సు కంపెనీ నుండి నేను తప్పుకోవలసి వచ్చింది. దానితో పెట్టుబడి దార్లు నాకు చేసిన అన్యాయాలవల్ల, అసలు పెట్టుబడిదారీ విధానం మీదనే నాకు ద్వేషము, ఆగ్రహం కలిగాయి. నే నంతవరకూ కలుగంటూవున్న గొంతెమ్మకోర్కెల మీద అసహ్యం కలుగ నారంభించినది. ఇంక వాటిసోలికి పోకూడదనే నిశ్చయం ఏర్పడసాగింది.

అప్పట్లో నిత్యమూ వకీళ్ళతో ఆలోచించుతూ వుండాల్సివచ్చింది. మోసానికి ప్రతి మోసంచేయడానికి ఆలోచించాలంటే నా కమిత ఆనేదన కలిగేది. గాఢ నిద్ర అరుదైపోతూవచ్చింది. తలబరువెక్కేది. దేహబలం క్షీణించేది. ఇలాంటి దురాశలూ, దురాలోచనలూ మాను కోవడంతో నాకు మనశ్శాంతి కలిగింది; మరల గాఢనిద్ర పట్టడంసాగి, ఆరోగ్యమూ, బలమూ కలుగసాగాయి. కాపిటలిష్టును కావాలనీ, ఆస్తిపాస్తులు సంపాదించాలనే వాంఛ 1935 తో అంతమయింది.

నేనూ - నా దేశము

సామ్యవాద దశ

1935—1949

వెనుదిరిగి చూస్తే

1935 సంవత్సరంలోగా అనేక ఉద్యమాలలో పా
చేశాను. అలాగే సుభద్రమ్మగారుకూడా పనిచేశారు
అన్నిటిలోను అసంతృప్తే కలిగింది. జయం లేకపోవడ
కాదు! ఇకమీదట ఏమి చెయ్యాలో తోచలేదు.

స్వరాజ్యసంపాదనకు గదరుపార్టీల్లో 1913లో చే
పనిచేశాను. బ్రిటిష్ గవర్నమెంటు సాగిపోతూనే వచ్చిం
కాంగ్రెసుతో నాకు విసుగుపుట్టింది. అహింసతో సంపూ
స్వరాజ్యం ఎప్పటికీ రాజాలదు. పాలకులు నైతికం
ఓడిపోయినతరువాత, పాలితులు వారిని గెంటివెయ్యా
హింసతోనైనా అలా చేయకపోతే సంపూర్ణస్వరాజ్య
ఎలా ఏర్పడుతుంది?

ఊరకే ఉండలేక శక్తి సామర్థ్యాలను సంఘ సంస్కరణల వైపుకు మరల్చి, ఎన్నో ఉద్యమాలు నడిపాను. ఒక్కటీ పూర్తిగా జయప్రదం కాలేదు. భోగం వృత్తిలో ఉండేవారు ఏ కొద్దిమంది మాత్రమో వివాహాలు చేసుకొంటున్నారు. మిగిలినవారికి సంఘంలోని ఆర్థికపరిస్థితులు అడ్డువస్తున్నాయి. వితంతూద్వాహాలు ధారాళంగా జరుగక పోవుటకు కూడ ఆర్థికవిధానమే ఆటంకం. ఈ కాలంలో సనాతనసంప్రదాయాలు కాని, సంఘసంస్కరణలకు అడ్డురావడంలేదు. కులకట్టుబాట్లూ లేవు, వితంతువులు గర్భవతులై, శిశువులను చంపుటకు తాము స్వతంత్రంగా జీవించుటకు శక్తిలేకపోవుటే ముఖ్య కారణం. మాత్సర్యమే లేకకాదు. హరిజనుల విషయంలో ముఖ్యంగా ఆర్థికకష్టాలే వారి అభివృద్ధికి నిరోధకమవుతున్నాయి. తరువాత రెండో ఆటంకము రాజకీయమైనది, కాబట్టి ప్రభుత్వంలోను, పరిపాలనలోను వారికి స్థానం లేకపోవడం. సంఘనిర్మాణం ఇలాగే ఉన్నంతవరకూ పరిస్థితుల్లో గొప్పమార్పులు రాజాలవు.

పరిశ్రమలు, బ్యాంకింగు, ఇన్సూరెన్సు వగైరాలను అభివృద్ధికితేవడం దేశానికి మంచిదని ప్రయత్నించే కాలంలో నేనొక స్వార్థపరుణ్ణిగా మారిపోతూవచ్చాను. నేను ఎటు వెళ్లినా దరిదోవ కనుపడ లేదు.

నిర్మాణయుక్తంగా సంఘంలో ఏంచెయ్యాలో నాకు తోచడంలేదు. ఆశాభంగము, అజ్ఞానము, అంధ

కారంమాత్రమే నాలోనిండినున్నై. జీవితమునిూద విసుగు పుట్టింది సంఘంనిూద, రాజకీయపార్టీలనిూద, నాయకులనిూద—అందరిపైన విసుగుపుట్టింది. ఏనిూ తోచక యంత్రంలాగా కాలం గడుపుతూవచ్చాను.

రష్యానుగురించి షేర్‌వుడ్ ఎడ్డీ

1935లో మద్రాసు కాస్మోపాలిటన్ క్లబ్బులో మెంబరుగావున్నాను. అక్కడి వాతావరణం నాకు సరిపోలేదు. అధికారవాంఛ, దురాశ పదవీవ్యామోహం మొదలైన దుష్టపిశాచాలతో కూడిన వాతావరణం అది. నా వ్యాపారాలను వృద్ధిలోకితెచ్చుకొనుటకు, ఇంకనూ గొప్పవ్యాపారాలు చేయుటకు ఆ క్లబ్బు మెంబర్లతో పరిచయము; స్నేహము అవసరమైనాయి. అందుకే నేనందుకో చేరాను.

దానిలో ఒక లైబ్రరీ ఉన్నది. కాని ఉత్తమ గ్రంథాలు సాధారణంగా వుండవు. ఒకప్పుడు అదృష్టవశాత్తుగా ఒక పుస్తకం లభించింది. దాని రచయిత డాక్టర్ షెర్‌వుడ్ ఎడ్డీగారు; అంతర్జాతీయ వై. యం. సి. ఎ లకు కార్యదర్శి; గొప్ప ఉపన్యాసకుడు. ఆయన తన రచనలు (The Challenge of Russia & Russia To-day) లో సోవియట్ రష్యాలో జరుగుచున్న మార్పులనుగురించి వ్రాశారు. కిరస్తానీ ఫాదిరీ రష్యాలోని నవీన సోషలిస్టు ప్రభుత్వాన్ని సహించలేడుగదా! ఏమేమి తిట్టి

వుంటాడో తెలుసుకోవాలనే కుతూహలంతో ఆ పుస్తకాన్ని చదివాను. నే ననుకొన్నది ఒకటి, జరిగింది మరొకటి. ఆ దేశంలో జరిగిన అనేక విప్లవాత్మక పరిణామాలను ఆయన ప్రశంసించారు. తన మతస్థాపకుడు క్రీస్తు కోరిన కోరిక లనేకము అక్కడ నెరవేరాయి. దారిద్ర్యం పోయింది; అందరికి పనులున్నాయి; అందరికీ విద్య వుంది. స్త్రీలకు పురుషులతో సమాన హక్కులు ఉన్నాయి. ఘోషాపద్ధతి నిర్మూలింపబడినది. వేశ్యావృత్తిని నాశనం చేశారు; వితంతువులు వివాహమాడవచ్చు; ప్రతి స్త్రీకి తల్లి అవడానికి హక్కు వుంది; వ్యక్తిపరమైన ఆస్తులు పోయి ఉమ్మడి ఆస్తి పద్ధతి ఏర్పడింది; అందువల్ల కార్మికులు, కర్షకులు రాజ్యపాలకులయ్యారు. సేద్యం చేసేవానిదే భూమి; కష్టం చెయ్యని తిండిదొంగలకు స్థానంలేదు; అట్టివారికి వోటుహక్కు లేదు. ప్రమాదకరమైన మతద్వేషాలు, సనాతన సాంప్రదాయాలు, కులాలు, వర్గాలు, వారి కలహాలు నశించిపోయాయి. ప్రజారాజ్యం ఏర్పడింది; పద్దెనిమిదేండ్ల వయసు వచ్చిన స్త్రీ పురుషు లందరికి ఓటు హక్కు వచ్చింది; ప్రజలే తమ రాజ్యాంగనిర్మాణం చేసుకుంటారు; రాజులు, ప్రభువులు, జమీందారులు, భూస్వాములు, షావుకార్లు, పెట్టుబడిదారులు, వడ్డివ్యాపారస్తులు నశించారు.

మాలో మార్పు

ఇలాంటి ఆశ్చర్యకరమైన విషయాలను ఆ పుస్తకంలో చదివాను; నా భార్యకూడా చదివింది. ఇద్దరం ఆలోచించాము. ప్రపంచమంతటా- మన దేశంలోకూడా అందరూ సుఖంగా వుండేందుకు మార్గం వున్నదనే ఆశ కలిగింది మాకు రష్యాలో మాదిరి సోషలిస్టు ప్రభుత్వం మనదేశంలో కూడా ఏర్పడినప్పుడే మన ప్రజానీకం సుఖంగాను, సంస్కారంతోను జీవించగలుగుతారు. అలాంటి ప్రభుత్వాలు ప్రపంచంలోని ప్రతిదేశంలో ఏర్పడి మానవజాతికి శాంతి, సౌఖ్య , సౌభాగ్యము, సంస్కృతి కలుగుతాయనే విశ్వాసము, ఆశ మా యిద్దరికీ కలిగాయి. ఇకమీదట నిర్మాణయుక్తంగా జీవితయాత్ర గడుపగలమనే యోచనలు వికసించాయి. 1936 నుండి మాజీవితాలు మారిపోగలిగాయి. మొదట కాంగ్రెసు సోషలిస్టులుగాను, 1940 నుండి కమ్యూనిస్టులుగాను మారిపోతూ వచ్చాము. నాలో కలుగుతూ వచ్చిన ఆ మార్పులను గురించి వ్రాస్తాను.

ఏజయలక్ష్మి ఇన్సూరెన్సు కంపెనీతో సంబంధాలు 1935 లో వదలుకోవడంతో నా ఆర్థిక పరిస్థితి హఠాత్తుగా మరల అతినికృష్టంగా తయారైనది. అయితే కుటుంబపోషణ కోసం ఏదో ఒక ఉద్యోగం చెయ్యాలి. ఇన్సూరెన్సు కంపెనీలలో సులభంగా ఉద్యోగాలు లభిం

చేవి. గొప్ప ఉద్యోగిని కావాలనీ శ్రీమంతుడను కావాలనే ఆశలను మానేశాను. ఒక చిన్న ఉద్యోగం సంపాదించుకొని విశాఖపట్టణంలో వుంటున్నాను. విజయలక్ష్మి కంపెనీలో నుంచి నన్ను తొలగించిన ముఖ్యవ్యక్తి ధన స్వామి నన్ను మళ్ళీ కంపెనీలో చేరమని మూడు నాలుగు సార్లు వచ్చి బ్రతిమలాడారు. అయినా నేను సమ్మతించ లేదు.

1936 నుంచి 1940 వరకు ఆర్థికంగా యిబ్బంది పడుతున్నా ఏదోవిధంగా జీవయాత్ర సాగిపోతోంది. నా భార్యకూ నా అభిప్రాయాలే ఉండడం నా గొప్ప ఆదృష్టం. ఆమె నాకంటే కూడా ముందడ వేయడానికి ప్రయత్నించేది. నాకు మార్గదర్శినిగా ఉండేది. కాబట్టి జీవితయాత్ర సుఖంగానే జరిగిపోతూ వచ్చింది. మాకు అభిప్రాయ భేదాలు లేవనికాదు నా భావం; ఎన్నో పర్యాయాలు తూలవచ్చేవి. అయితే, తర్కించి జీవితానుభవంలో సత్యాన్ని తెలుసుకుంటూ, మా అభిప్రాయభేదాలను సవరించుకుంటూ, నైతిక దృష్టితో కాలం గడుపుతూ వచ్చాము. అలాగే ఇకమీదట కూడా జీవితయాత్ర గడిచిపోతుందని మా నమ్మకం.

చంద్ర రాజేశ్వర రావు

1936 సం॥లో విశాఖపట్టణంలో వుండగా, చంద్ర రాజేశ్వరరావుగారు మాతో పరిచయం చేసుకొని ఆయన

ఒక సహాయం కోరారు. అప్పుడే ఆయన కాశీవిశ్వవిద్యాలయం వదలిపెట్టి విశాఖపట్టణంలో మెడికల్ కాలేజీలో విద్యార్థిగా చేరారు. ఇంటివద్దనుండి డబ్బు తెప్పించుకొని విద్యార్థుల్లోను, కార్మికులలోను సంఘాలుపెట్టి పని చేస్తున్నారు. ఆయన వయసులో చాల చిన్నవారు. వారితో మరికొందరుకూడా కలిసిపనిచేసేవారు. అందరూ యువకులే. సంఘంలో కొద్దోగొప్పో పేరు ప్రఖ్యాతులుగల పెద్దవారు వారి సంఘాలకు ప్రెసిడెంటుగాను, వైసుప్రెసిడెంటుగాను అవసరమయ్యారు. ఆ స్థానాల్లో నన్ను, నా భార్యనూ ఉండమని కోరారు. మేము అభ్యుదయ భావాలు కలవారమని తెలుసుకొని అడిగారట. మేము సంతోషంగా అంగీకరించాము. ఆ సంఘాల్లో మేము చేసిన సేవ చాలా స్వల్పము. అయినప్పటికి ఆయన మాకు చేసిన సహాయం చాలా గొప్పది.

ఫ్రెడరిక్ ఎంగెల్సుగారి "యాంటి డహరింగ్"* అనే గ్రంథాన్ని చదవి మాకు విపులంగా బోధించసాగారు. సోషలిజంలో నమ్మకం కలిగించడానికి ప్రయాసపడ్డారు.

♦ సుభద్రమ్మగారు ప్రపథమంగా తర్జుమాచేసినది ఈ "యాంటిడహరింగు"లోని "సోషలిజము: చారిత్రకము-శాస్త్రీయము" అనేదే. ఆ కాలంలో ఆ గ్రంథాన్ని గవర్నమెంటు నిషేధించింది. ఆంధ్రరాష్ట్రంలో రాజకీయ పురోగాములకు అది పెక్కునబుక్కగా ఉపయోగపడింది.

మాకు ఎన్ని సంశయాలు తీర్చినా, యింకా ఎన్నో కొత్తవి కలుగుతుండేవి. నూతిలో నీళ్ళను తోడివేస్తే. మరల ఊరి నట్టుగా కలిగేవి మాకు సందేహాలు. అయితే, ఆయన ఎంతో ఓపికగల మనిషి. జవహర్‌లాల్ నెహ్రూగారి గ్రంథాలు, గాంధీగారి వేదాంతాలూ, కాంగ్రెసు చరిత్ర వగైరా ఇండియాకు సంబంధించిన రాజకీయ గ్రంథాలను సోషలిస్టుదృక్పథంతో విమర్శించేవారు. అప్పుడు రాజేశ్వర రావుగారి అభిప్రాయాలు యిలాగుండేవి :

(1) ప్రస్తుతం (1935-6)కాంగ్రెసు ఒక విప్లవసంస్థ. స్వరాజ్య సంపాదన, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడిదారీవర్గ సంస్థాపన కాంగ్రెసు ఆశయాలు. కాంగ్రెసులో అనేక వర్గాలున్నాయి. ముఖ్యమైన వర్గం : మిల్లు యజమానులు, పెట్టుబడిదారులు, ఖామందులు. ఆ వర్గానికి నాయకులేమో మధ్యతరగతి విద్యాధికులు. ఈ మధ్యతరగతి విద్యాధికుల వర్గమే ఇండియాలో ప్రధాన విప్లవ వర్గం.

(2) అయితే, పెట్టుబడిదారీవర్గం తమ కున్నదానిని పోగొట్టుకొనుటకు యిష్టపడదు. బ్రిటిష్ సామ్రాజ్యం చాలా బలంగా వుంది. ఈ పెట్టుబడిదార్లతో ఇండియన్ పెట్టుబడిదార్లు కలసి వ్యాపారం చేస్తున్నారు; పెద్దభాగస్థులు బ్రిటిష్ వర్తకులే. అందువల్ల బ్రిటీషు పెట్టుబడిదారీ వర్గంతో పూర్తిగా తెంచివేసుకోటానికి అవసరమైన

సాయుధ పోరాటానికి ఇండియన్ పెట్టుబడిదారులు సమ్మతించడంలేదు.

కాంగ్రెసులో బహుమందారు లున్నారు. వారిలో కొందరు పెట్టుబడిదార్లయ్యారు. పెట్టుబడిదార్లలో కొందరు బహుమందార్లయ్యారు. వారికూడా స్వరాజ్యం కావాలి; కాని సాయుధ విప్లవానికి యిష్టపడరు.

సాయుధ విప్లవానికి రైతుల, కార్మికుల నిర్మాణయుక్తమైన పోరాటం అవసరం; దానివల్లనే జయం కలుగగలదు. అయితే, ఇలాంటి వర్గాలు తమ బలాన్ని తెలుసుకున్నప్పుడు హనుమంతుడిలా చూచి రమ్మంటే కాల్చివచ్చినట్లు, రష్యాలో మాదిరిగా సోసలిస్టు ప్రభుత్వాన్ని స్థాపించుతారేమో? కాబట్టి సాయుధ పోరాటాన్ని హింస అనీ, పాపమనీ బోధిస్తారు. అయినప్పటికీ ప్రజానీకం తమ వెనుక నున్నారని చూపించి, బ్రిటీషు సామ్రాజ్యవాదులను బెదరించి సాధ్యమైనంత రాజ్యాధికారాన్ని గుంజుకోవాలనేది వారి ఆశయం. సంపూర్ణ స్వరాజ్యం రాకపోతే ఆ వర్గంవారు విచారపడతారేగాని, దానికోసం తెగించి పోరాడరు.

ఈ వర్గ పోరాటాలను, అవకతవకలను, యీ పరస్పర విరుద్ధ శక్తులను, భావాలను, పార్టీలను బాగా గ్రహించి, వీరందరిని కలుపుకొని ఒకే సంస్థలో పని చేయడం అసాధ్యమైన పని; ఈ అసాధ్యమైనపనినే సాధ్యం

చేశారు గాంధీజీ. అందువల్లనే ఆయన ఏకైక భారత నాయకుడు కాగలిగారు. ఆయన చనిపోతే ఎక్కువగా నష్టపడేది బ్రిటీషు ప్రభుత్వమేనని సామ్రాజ్యవాదులకు తెలుసు. ఈ వేదాంతాన్నే గాంధీయిజం అంటారు.

అలాగే జవహర్‌లాల్‌లో కూడా ఈ పరస్పర వైరుధ్యాలు ఏన్నెనో సందర్భాలలో విశదం కాగలవు. ఈయన పురోగామి; గాంధీగారిని విమర్శించి చెండాడిన మేధావి; అయితే, చివరకు గాంధీగారి వాదానికి తాళం వేస్తారు.

ఈ రాజకీయ ప్రవాహ సుడిగుండాల్లోనుంచి గాంధీ గారు మాత్రమే తప్పించుకొని గట్టుకు చేరగలడని నెహ్రూగారు నమ్మినందున ఆయన తీర్మానానికి బద్ధుడై పోతున్నాడు.

(3) సంపూర్ణ స్వరాజ్యం కావాలనేవారు కూడ కాంగ్రెసులో ఉన్నారు. వారు కార్మికులను, కర్షకులను నిర్మాణయుక్తంగా సంఘటిత పరుస్తున్నారు ఒకవేళ సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడితే, తతిమ్మావారిలాగా వీరు విచారపడరు. కార్మిక కర్షక రాజ్యస్థాపన వారికి యిష్టమే.

(4) పై రెండు పరస్పర విరుద్ధమైన వర్గాలు కాంగ్రెసులో ఉన్నాయి. మధ్యకక్షి మరొకటున్నది. ఇది అన్నిటి కంటె మిక్కిలి బలమైనది అది కాంగ్రెసు సోషలిస్టు

గ్రూపు. కాంగ్రెసులో తమ ప్రచారం మూలంగా ఈ పెద్ద దైన మధ్యకక్షి మిగతావారిని తమ అతివాద పక్షంలోకి లాకోవాలి; ఆవిధంగా కాంగ్రెసులో అతివాద కక్షికి నాయకత్వం సంపాదించి సంపూర్ణ స్వరాజ్యం సాధించాలి.

(ఏ) కార్మికులను, కర్షకులను వర్గపద్ధతిలో సంఘటితపరిస్తే ఇండియా మొత్తంలో జనరల్ స్ట్రైయికు తీసుకురాగలం. దానితో బ్రిటిష్ గవర్నమెంటు ఆట కట్టివేయగలం. గాంధీగారి అహింసావాదానికి అనుగుణ్యంగానే యీపని చేయవచ్చు.

(ఠ) అప్పుడు స్వరాజ్యంవల్ల తప్పకుండా నష్టపడే వర్గాలు అనగా బ్రిటిషువారు, సంస్థానాధిపతులు, జమీందార్లు, గొప్ప ఉద్యోగస్తులవర్గాలు హింస ప్రారంభించుతారు. తిరిగి ప్రతిహింస చెయ్యవలెనా, కూడదా? దెబ్బకు దెబ్బ కొట్టకపోతే సంపూర్ణ స్వరాజ్యం రాజాలదు. పూర్ణ స్వరాజ్యమే పరమావధిగా యెంచేవారు ప్రతిహింసకు సంశయించకూడదు.

(7) కాంగ్రెసు ఉద్యమము ప్రజాఉద్యమము. ఒక్కొక్క వ్యక్తికి బలం లేకపోవచ్చు అనేక చినుకులు కలసినప్పుడు గంగాప్రవాహంలాగా బలవంతులవుతారు. అట్టి బలవంతులముందు శత్రుకక్షి నాశనంకాక తప్పదు. కాబట్టి మనమందరం కాంగ్రెసు సోషలిస్టుపార్టీతో కలసి పనిచెయ్యాలి. కార్మిక - కర్షకులను సంఘటితపరచాలి.

విద్యావంతులు, మధ్యతరగతులు దేశభక్తులతో కలసి పనిచెయ్యాలి. వీరందరిని కాంగ్రెసు సోషలిస్టులుగా మార్చాలి.

ఇలాంటి రాజకీయవిమర్శన, బోధలమూలంగా రాజేశ్వరరావుగారు నన్ను, నా భార్యను కాంగ్రెసు సోషలిస్టు పార్టీలో చేర్పించారు. ఇద్దరము ప్రథమ ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టుపార్టీ మహాసభకు (1936) రాజమండ్రివెళ్ళి పాల్గొన్నాము సుభద్రమ్మగారిని రాష్ట్ర నిర్వాహకసంఘంలో సభ్యురాలుగా ఎన్నుకొన్నారు.

సోషలిస్టు పార్టీ

ఈ మహాసభలో రెండు తెగలున్నాయి. సంఖ్యా బలంలో రెండూ సమానమే. ఒక కక్షీక నాయకుడు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యగారు; చిన్నవాడు; మీసాలు రాని నవయువకుడు. తెలివితేటలలోను, తన నాయక త్వాన్ని నిర్వహించడంలోను చాల సామర్థ్యం ప్రదర్శించాడు. రెండో కక్షికి నాయకుడు శ్రీ రంగశాయి, లింగ రాజుగార్లు. ఏ పార్టీకి చేరకుండా రెండుగ్రూపులమీద ఒకే తడవ సవారిచేయాలని వేచియున్నవ్యక్తి శ్రీ మద్దూరు అన్నపూర్ణయ్యగారు.

ఈ రెండుపార్టీలలో భేదాలేమిటో నాకుఅప్పట్లో బోధ పడనేలేదు. సుందరయ్యకక్షి అతివాదకక్షిగాను, లింగ

రాజుగారిది మితవాదముతాగాను తోచింది నాకు. నేను ఎవరితో చేరడానికి స్పష్టంగా భేదాలు తెలుకోలేక పోయాను. అధ్యక్షుడుగా వున్న యూసఫ్ మెహరాలీగారు లింగరాజుగారిపక్షానికి అనుకూలంగా వున్నారు. కాని, సుందరయ్యపక్షం కర్మయోగుల పార్టీగా ఉంది. వీరిని త్రోసి రాజుఅని అన్నట్టయితే ఆంధ్రరాష్ట్రంలో కాంగ్రెసు సోషలిస్టు పార్టీ నిర్జీవమైపోతుందని మెహరాలీకి తోచింది. ఇరుపక్షాలవారిని సమానంగా నిర్వాహకసంఘంలో వేసి అన్నపూర్ణయ్యగారిని కార్యదర్శిగా చేసి, ఏ పక్షానికో చెందని సుభద్రమ్మగారిని అదనపుసభ్యురాలుగా చేర్చి ఎలాగో మసిపూసిమారేడుకాయ చేసి మెహరాలీగారు వెళ్ళారు.*

మేము విశాఖపట్టణం జిల్లాలో కాంగ్రెసు సోషలిస్టు కమిటీని ఏర్పరిచాము. హార్బరు కార్మికుల సంఘాన్ని

---

* ఆ రెండు ముఠాలంయందు నా కేమాత్రం సదభిప్రాయం కలుగలేదు. కుర్రవాళ్ళ పోట్లాటలుగా కనిపించింది నాకు. రెండు పక్షాల వారికి పరిణామం కలుగుతూ వచ్చింది. పది పన్నెండు సంవత్సరాలకు సుందరయ్యపక్షంవారు కమ్యూనిస్టులుగా బలపడిపోయారు. లింగరాజుగారి కక్షి నసించిపోయినట్టే. అప్పట్లో సూత్రధారిగా నాటకమాడిన అన్నపూర్ణయ్యగారేమో త్రిశంకు స్వర్గంలో ఉండిపోయారు.

బలపరిచాము. మునిసిపల్, శాసనసభల యెన్నికలలో కాంగ్రెసు తరపున తీవ్రంగా పనిచేశాము. సుభద్రమ్మ గారు స్త్రీల క్లబ్బులో చైతన్యం కలిగించుటకు కృషి చేశారు. రాజకీయ సభలు జరిపారు. క్లబ్బుకు రు 15000ల విలువ ల భవనాన్ని సంపాదించారు.

1937 సంవత్సరంలో రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ తరపున కొత్తపట్టణంలో పేసంగి రాజకీయ పాఠశాలలో విద్యార్థులకు క్లిల్లు నేర్పుటకు ఒకరు కావలసి వచ్చారు. రాజేశ్వరరావు తగినవాడని, సమర్థుడని, నాయకత్వంవహించాగలవాడని నా నమ్మకము. కనుక ఆయన్ను క్లిల్లు మాష్టరుగా తీసుకోవలసిందని సిఫార్సుచేసి పంపాను. ఆవిధంగా ఆంధ్రలో పనిచేస్తున్న ఆతివాదులతోను, కార్మిక-కర్షకవర్గాలలో పనిచేయుచున్న ఆర్గనైజర్లతోను ఆయనకు పరిచయం కలిగింది. పోలీసులు ఆ స్కూలును నాశనంచేయడానికి ప్రయత్నించినప్పుడు రాజేశ్వరరావు నాయకత్వం వహించి ధైర్యసాహసాలు ప్రదర్శించటంతో రాష్ట్ర నాయకులలో ఒకరయ్యారు; తరువాత కృష్ణా జిల్లాకు వెళ్ళిపోయారు.

రాజేశ్వరరావుగారు విశాఖపట్టణంలో ఉన్న సమయంలో ఆంధ్ర యూనివర్సిటీ లైబ్రరీలో నవీన రాజకీయ గ్రంథాలు చాలా ఉండేవి. బారిష్టరు ముఖర్జీ అనే బ్రాహ్మసమాజీగారు వాటిని సేకరించి పెట్టారట. అవి మాకు చదువుకోటానికి లభించేవి. ముఖర్జీగారు వెళ్ళిపోయిన తరువాత

వేసంగి శెలవులలో అలాంటి పుస్తకాలన్నింటిని ఏరి తన బంగళాలోని బీరువాలలో పెట్టి తాళం వేసి. సీలువేశారట వైసుచాన్సలర్ శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు. అందువల్ల మా చదువులకు ఆటంకం కలిగింది; విద్యార్థులకు యనపట్ల అసంతృప్తి పెరిగిపోయింది.* తరువాత మరల 1938లో మేము మద్రాసులో స్థిరావాసం ఏర్పరుచుకున్నాము.

---

* శ్రీ రామలింగారెడ్డి గారితో నాకు పరిచయం లేదు. కాని, ఒకటి రెండు పనులు చేయించుకోవాల్సి వచ్చింది. 1928-30 లో స్కూలుఫైనల్ తప్పిన ఆంధ్ర విద్యార్థినులు ఇంటరులో చేరుటకు ఆంధ్రయూనివర్సిటీలో అవకాశం ఉంది. ఆంధ్ర యూనివర్సిటీ యేరియాకు వెలుపల చదువుతున్న ఆంధ్ర విద్యార్థినులకుకూడ అదే సౌకర్యాన్ని యివ్వమని కోరాము. శ్రీ తుర్లపాటి వెంకటేశ్వర రావుగారు, శ్రీ కాళేశ్వరరావుగారు, నేనూ కమిటీగా ఏర్పడి ప్రయత్నించాము. కాని. సిండికేటు మీటింగులో శ్రీ రెడ్డిగారు అంగీకరించలేదు. శ్రీ రెడ్డిగారి అభిప్రాయాన్ని ఆక్షేపించుతూ ఓటు చేసినవారు విదేశీ ప్రిన్సిపాలులు (గుంటూరు, బందరు కాలేజీలు) కాకినాడ కాలేజీ ప్రిన్సిపాలు రామకృష్ణారావుగారు మాత్రమే.

కాంగ్రెసు - ప్రజాసంఘాలు

కాంగ్రెసు సోషలిస్టుల మయ్యాక ఆ పార్టీని బల పరచాలనే ఉద్దేశంతో ఫైజ్‌పూరు (1936) హరిపుర (1938) కాంగ్రెసు మహాసభలకు నేనూ, నా భార్య వెళ్ళాము. సంపూర్ణ స్వరాజ్యాన్ని గూర్చిన చర్చలు మాత్రమే నాకు యిప్పటివరకు జ్ఞాపక మున్నాయి.

విషయ నిర్ణయ సభలో డాంగేగారు ఒక ప్రతి పాదన తెచ్చారు. ఇండియాలో ఉండే ప్రజాసంఘాలను కాంగ్రెసుకు అనుబంధంగా చేర్చుకోవాలని, వాటిలో వుండే సభ్యుల దామాషా ప్రకారం ప్రతినిధులను కాంగ్రెసుకు పంపవచ్చునని తీర్మానం తెచ్చారు. దీనిని ఆచార్య రంగాగారు బలపరిచారు. అనగా అఖిల భారత కార్మిక సంఘం, కర్షక సంఘములవారు ఈ తీర్మానాన్ని తెచ్చారు కృపలానీగారు అధ్యక్షులు. చాలా బాగున్నదని సమ్మతిం చారు. తరువాత కాంగ్రెసు వర్కింగు కమిటీ తరపున

మరొక విషయంకూడ జ్ఞాపకం వున్నది. పశ్చిమ బెంగాల్లో డిగ్రీ పొంది వచ్చిన ఆంధ్రులను ఆంధ్ర యూని వర్సిటీ గ్రాడ్యుయేట్సు లిస్టులో చేర్చుతారనీ, శ్రీ బాపినీడు గారు చేరాకనీ తెలిసి నేను అర్జీ పెట్టుకొన్నాను. శ్రీ రెడ్డి గారు ఆక్షేపించినందున నా అర్జీ అంగీకరింపబడలేదని తెలిసింది. ఆయన నేమి కారణాలు బాధించాయో!

సర్దార్ శ్రీ వల్లభాయి పటేలుగారు తీర్మానాన్ని ఎదిరించారు. ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెసులో పనిచేసి, దానిని వృద్ధికి తెచ్చి, చివరకు కాంగ్రెసును డాంగే, రంగాల హస్తగతం చేసి, రాజకీయంగా తాము ఆత్మహత్య చేసుకొనుటకు సమ్మతించజాల మని వారి వాదన.

పటేలుగారు ఇంత గొప్ప ప్రజాసమూహాలతో కూడిన ఉద్యమాల సమస్యను వ్యక్తిగతంగా మార్చారని అందరికి అర్థమైంది. అఖిలభారత కిసాన్, కార్మిక సభలలో చాలమంది సభ్యులున్నారు. ప్రతినిధు లెక్కువ మంది రాగలరు; కాంగ్రెసు పెత్తనం కార్మిక, కర్షకుల చేతుల్లోకి పోతుంది. తాము కోరుతున్న పెట్టుబడిదారీ స్వరాజ్యానికి బదులు కార్మిక-కర్షకుల సోషలిస్టుస్వరాజ్యం ఏర్పడుతుందనీ, అందుకు కాంగ్రెసు వర్కింగుకమిటీ సమ్మతించజాలదనీ సర్దారుగారు వాదించివుంటే బాగుండేది; కాని డాంగే, రంగాలను వ్యక్తిగతంగా ఎదుర్కొన్నారు చివరకు జయించారుకూడాను. చంద్ర రాజేశ్వరరావు చెప్పినట్లు కాంగ్రెసులో నానావర్గాలు ఉన్నప్పటికి అది బూర్జువాసంస్థ యనీ, వారి పలుకుబడిలో వున్న భాగా తెలిసిపోయింది. సంశయ నివారణ అయింది. కార్మిక కర్షక సంఘాలను కాంగ్రెసు నాయకులు బలపరచకపోగా, అవి వృద్ధి చెందుతూంటే తమ కాంగ్రెసు సంస్థకు పోటీసంఘాలని నిందించి నాశనం చేయుటకు ప్రయత్నించుతారనే భావాలు నాలాంటివారిలో నాటు

కున్నాయి. కాంగ్రెసు సోషలిస్టులు జాగ్రత్త పడాలనీ, కార్మిక-కర్షకులను సంఘటిత పరచాలనీ అనుకున్నాము.

పోరాటానికి కాంగ్రెసు వ్యతిరేకత

సుందరయ్యగారు మరో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రెండవ ప్రపంచయుద్ధం రాబోతున్నది. ప్రపంచాన్ని మళ్ళీ పంచుకొనుటకు సామ్రాజ్యదేశాలు యుద్ధంలోకి పురకబోతున్నాయి. ఇండియాకు స్వరాజ్యం సంపాదించుకోడానికి ఇదే సరియైన అదును; కాబట్టి, ఇప్పటినుండే స్వరాజ్య స్థాపనకు అవసరమైన అంతిమ పోరాటానికి తయారు చేసుకుందామని సుందరయ్యగారు చెప్పారు. అంతేకాదు; కార్మికులను, కర్షకులను, విద్యార్థుల[illegible] వారి వర్గసంఘాల్లో సంఘటిత పరచి యుద్ధంరాగా[illegible]ట్రయిక్ చేసి, రైళ్లు, బస్సులు మొదలైన ర[illegible]లను నిలిపివేసి, రేవులలో దిగుమతి ఎగు[illegible]వేస్తే బ్రిటిష్ ప్రభుత్వం ఆట కట్టివేయి[illegible]వారిని తరిమివేయవచ్చుననీ సుందరయ్యగారి[illegible]ఇందువల్ల హింస వుండదనీ, గాంధీగారి [illegible]రమే చేయగలుగుదుమనికూడా ఆయన అయితే కాంగ్రెసు వర్కింగు కమిటీ వర్కింగ్ కమిటీ తరపున శ్రీ సర్దార్ ఘటించి మాట్లాడారు.

పటేలుగారి వాదనలోని సారాంశం ఏమంటే "రెండవ ప్రపంచయుద్ధం రాబోతున్నది వాస్తవమే. ఆ సమయంలో స్వరాజ్యం సంపాదించుకొనవలసినదే కాని ఎలా సంపాదించుకోవాలి? మేమెన్నిసార్లు యిలాంటి ఉద్యమాలను నడపలేదు; ఏమి చెయ్యాలో మాకు తెలియదా?" అని వాదించారు. సుందరయ్యగారి (కాంగ్రెసు సోషలిస్టుల) ప్రతిపాదన ఓడిపోయింది.

సుందరయ్య ప్రతిపాదనను వా రెందుకు ఒప్పుకోలేదు? కార్మికులను, కర్షకులను సంఘటిత పరచాలిగదా? సంఘటిత పరిస్తే సంపూర్ణ స్వరాజ్యం వస్తుందనికూడా కాంగ్రెసు నాయకులకు తెలుసు. కాని దానితోపాటు సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడవచ్చునన్న భయం వారిలో తిష వేసింది.

[illegible]రిపుర కాంగ్రెసునుండి నేను, నా భార్య తిరిగి [illegible] వచ్చాక కార్మికసంఘాల్లో పనిచేయుటకు [illegible]ము. 1939 లో ప్రపంచయుద్ధం ప్రారంభ [illegible]గెసు కమిటీలు వార్ధాలో సమావేశమైనాయి. [illegible] నాగపూరులో మహాసభ పెట్టారు. ఈ [illegible]ం. కాంగ్రెసు చేసిన తీర్మానం బాగా [illegible]కు స్వరాజ్యం యిస్తారా?" అని బ్రిటిష్ [illegible]త్వాన్ని అడిగారు. ఇవ్వదని తెలియదా? [illegible]చరణకు సంశయించుతూ తాత్కారం [illegible]ద పార్టీలు చాలా చిన్నవి. పలుకు

బడి లేదు; కార్యాచరణకు ప్రారంభించాయి, కాని ఏమి చేయగలవు? జాతీయ నాయకత్వం తన బలాన్ని ఉపయోగించుటకు పూనుకోదయ్యే!

కమ్యూనిస్టులతో పరిచయం

మద్రాసులో కార్మిక సంఘాలకో కాంగ్రెసు సోషలిస్టుగా పనిచేయుచున్న సందర్భంలో ఈ పార్టీ నాయకులు కమ్యూనిస్టులని తెలిసింది. వారు కార్మికుల కొరకు ఉత్సాహంగాను, వాస్తవంగాను శ్రమపడటం చూచి వారిమీద నాకున్న అపోహలు, సందేహాలు పోయి, వారియందు నాకు గౌరవ ప్రేమ లేర్పడుటూ వచ్చాయి. రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభం కాగానే వీరు చాల తీవ్రంగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదుర్కొంటూవచ్చారు. అది కూడా నాకు నచ్చింది. అందువల్ల నాకూ కమ్యూనిస్టులకు స్నేహం వృద్ధి చెందసాగినది మద్రాసులో కమ్యూనిస్టుపార్టీ నాయకుడు కామ్రేడ్ ఘాటే, ఆయన నిష్కళంక జీవితము, దేశభక్తి, మానవసేవ, రాజకీయ విజ్ఞానము మమ్మల్ని బాగాఆకర్షించాయి. యుద్ధం ప్రారంభం కాగానే ఆయన నన్నీవిధంగా అడిగారు.

"సంపూర్ణ స్వరాజ్యం సంపాదించుటకు మంచి తరుణం వచ్చింది. మనం గెలిచినా, ఓడినా, మన విధిని మనం నెరవేర్చుకోవాలి. బ్రిటిష్ ప్రభుత్వంతో కమ్యూనిస్టులకు పోరాటం తప్పదు. కొందరు వుండి పోరాటం

జరపాల్సి వుంటుంది. మరికొందరు కార్మిక, కర్షక, విద్యార్థి సంఘాలలో పనిచేస్తూ గవర్నమెంటును ఎదిరించాలి. అట్టివారికి అరెస్టులు, జైళ్ళు తప్పవు. నువ్వేమి చెయ్యదలచావు?" "నేను, సుభద్రమ్మ కార్మిక సంఘాల్లోనూ, ప్రజాహిత కార్యాల్లోను పనిచేస్తున్నాము. మాలో ఒకరు పిల్లల్ని, సంసారాన్ని చూచుకోవాలి. నాభార్య బాగా చూచుకోగలదు. నేనుమాత్రం కమ్యూనిస్టుపార్టి యిచ్చేపనులు చేయటానికి సిద్ధంగా వున్నాను. బహిరంగంగా చెయ్యవలసిన పనులు చేస్తేనేగాని, రహస్యంగా ప్రచ్ఛన్నంగా మాత్రం నేను చెయ్యలేను. ఉద్యోగం చాలించుకోటానికి సిద్ధమే. ఎన్నికష్టాలు వచ్చినా అనుభవించడానికి తయారుగావున్నా" నని చెప్పాను.

అందుకు ఘాటేగారు యిలా అన్నారు: "కమ్యూనిస్టులను, కార్మిక, కర్షక నాయకులను, విద్యార్థి నాయకులను అరెస్టుచేసి, జైలులో పెట్టడం ప్రారంభమవుతుంది. కాంగ్రెసు మంత్రివర్గాలే మనలను శిక్షించుతాయి. మద్రాసులో కార్మికనాయకులు అరెస్టు అయినప్పుడు నీవు వారిస్థానంలో ఉండి, చెయ్యగల పనులను చెయ్యాలి" అని సలహా యిచ్చారు.

స్వరాజ్యంగురించి కాంగ్రెసువారి అంచనాలు

అప్పుడు మద్రాసురాష్ట్ర జైళ్ళ శాఖామంత్రి (కాంగ్రెసు) డాక్టరు సుబ్బరాయనుగారు. కామేడ్సు

అజయఘోష్, ఎ. యస్. కె. అయ్యంగారు, నేను కలసి జైళ్ళ మంత్రి వద్దకు డెప్యుటేషను వెళ్ళాము. జైళ్ళలో రాజకీయ ఖైదీలకు కొన్ని సౌకర్యాలు చెయ్యమని కోరాము. గవర్నమెంటువద్ద డబ్బులేనందున ఎలాంటి సౌకర్యాలు చేయడానికీ సాధ్యంలేదన్నారు. ప్రభుత్వం ఖర్చుపెట్టనవసరం లేదనీ, రాజకీయ ఖైదీలు తమ స్వంత డబ్బుతో తమ కిష్టమైన బట్టలు, పుస్తకాలు, వార్తా పత్రికలు, మందులు, ఆహారపదార్థాలు, సిగరెట్లు వగైరా కొనుక్కొనుటకు ఉత్తరువు యిస్తే చాలునని అడిగాము. అలాంటి మార్పులను చెయ్యవలసిందని తాను అంతకు ముందే మంత్రివర్గాన్ని అడిగినట్లునూ, అందుకు వారు సమ్మతించలేదనీ చెప్పారు. కారణమేమని అడిగాము. రహస్యం బయటపెట్టడానికి యిష్టం లేకపోయినా చివరకు "ఇప్పుడు కాంగ్రెసు పార్టీ అధికారంలో ఉన్నది. ఈ పార్టీకి విరోధులు మాత్రమే జైళ్ళకు వెళ్ళారు. వారికి కాంగ్రెసు మంత్రులు సౌకర్యాలు ఎందుకు చెయ్యాలి" అని కాంగ్రెసు మంత్రుల అభిప్రాయంగా చెప్ "హిందీ వ్యతిరేకవాదులు" మీ మనస్సుల్లో పుం నని మే మన్నాము. అందు కాయన నవ్వారు విషయం గ్రహించాము.

డాక్టరుగారు అంతటితో ఊరుకో జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలను గు

లెనో చదుపుతారు. కాబట్టి తనకు చాలా తెలుసునని అనుకుంటాడు. అంతటితో వూరుకోక మాతో రాజకీయ చర్చ ప్రారంభించారు : ఈ యుద్ధ కాలంలో మనకు స్వరాజ్యం యివ్వక తప్పదు. మనం జైళ్ళకు వెళ్ళవలసిన అవసరం లేనేలేదు. కాంగ్రెసుపార్టీ సహాయం లేకపోతే గవర్నమెంటు స్తంభించిపోతుంది. మనకాళ్ళమీద పడి, రాజ్యం చెయ్యండని కాంగ్రెసును ప్రతిమలాడక తప్పదు" అన్నారు మంత్రిగారు.

బ్రిటిష్ గవర్నమెంటు అంత అసహాయ స్థితిలో లేదు. పోలీసు, మిలిటరీ బలాలతో రాజ్యంచేస్తారు. ఈ యుద్ధంలో ఇండియాను పోగొట్టుకొని, తమ సామ్రాజ్యం దివాలా యగుట కెంతమాత్రమూ సమ్మతించరు. అడ్డమొచ్చిన వారిని నాశనంచేస్తారు. కాంగ్రెసు కష్టాలు పడుటకు సిద్ధంగా ఉండాలి: రక్తప్రవాహం జరుగుతుంది" అని మేము గట్టిగా చెప్పాము. కమ్యూనిస్టులు, అతివాదులు, ఎంతో అజ్ఞానులని వారు జాలి వెల్లడించారు. కాంగ్రెసు నాయకులు రాజకీయ విజ్ఞానంలో ఇంకా బాల్యదశ ఉన్నారని మేము మా విచారాన్ని వెలిబుచ్చాము. అయితే, డాక్టరుగారు మాతో కార్మిక కర్షక నాయకుల జైళ్ళకు వెళ్ళితే, తనతో చెప్పవలసిందని, ప్రతి విషయంలోను ప్రత్యేకంగా సహకార్యాలు కరిగిస్తూ చెప్పి అశపెట్టారు. "మీ రెంతకాలం వుండగలరు? కొద్దిమాసాల్లో మీరుకూడా

జైలుకు వెళ్ళక తప్పదే! మీరు ఎంత అజ్ఞానులు!" అని మేము జవాబిచ్చాము. డాక్టరుగారు మా అజ్ఞానానికి కాబోలు నవ్వారు.

ఒక సంవత్సరం గడవకముందే మే మందరం జైళ్ళలో కలుసుకొన్నాము. "డాక్టరుగారూ! బ్రిటిష్ గవర్నమెంటు కాంగ్రెసు నాయకుల కాళ్ళమీద యింకెప్పుడు పడుతుంది?" అని పరిహాసం చేశాము.

సుభ్రాయన్‌గారితో సంభాషణ

అంతేకాదు; ప్రపంచ యుద్ధ సంబంధమైన మిలిటరీ విషయాలను గురించి, జయాపజయాలను గురించి కూడా మా డెప్యూటేషనుకు ఉపన్యాస మిచ్చారు. "ఫ్రాంసులో ఉండే మాజినాటు దుర్గశ్రేణిని దాటి జర్మనులు పోజాలరు. ఫ్రెంచి, ఇంగ్లీషు సైన్యాల సంఖ్య కంటి మూడంతలు ఎక్కువగా వుంటేనే దానిని దాటగల్గుతారు. జర్మనీకి అంత సైనికబలం లేదు. కాబట్టి, మాజినాటే దుర్గశ్రేణి కిరుప్రక్కల యుద్ధం దీర్ఘకాలం సాగి, అందరూ అలసి పోతారు. ఈలోపల బ్రిటిష్ సామ్రాజ్య రాజకీయవేత్తల ఎత్తులతో హిట్లరు ఒకటి రెండు సంవత్సరాలలో నాశనం కాకతప్పదు" అన్నారు. తన కుమారుడు సైన్యంలో మేజరు; ఆయన వద్దనున్న పుస్తకాలను తాను చదివి తెలుసుకొంటూనే ఉన్నారట!

"అయితే, మాక్సువెర్నరుగారి పుస్తకాలను చదివారా?" అని అడిగాము. "లే"దన్నారు. మద్రాసు శాసనసభ లైబ్రరీకి ఉన్నాయనీ, చదవండనీ సలహా యిచ్చాము. ఫాసిస్టు రాజకీయాలను గురించికూడా చదువమని చెప్పాము.

అంతర్జాతీయ రాజకీయాలలో ఇంత అయోమయంలోవున్న డాక్టరు సుబ్బరాయనుగారిని గురించి శ్రీ సి. రాజగోపాలాచారిగారు తమ కాంగ్రెసు మంత్రివర్గం రాజీనామా యిచ్చేటప్పుడు చట్టసభలో యిలా గన్నారు. "అంతర్జాతీయ రాజకీయాలలో డాక్టరుగారు గొప్ప విద్వాంసులు. ఆలాంటి విషయాల్లో నేను ఆయనపైనే ఆధారపడతాను. కాబట్టి, ఆ విషయాలను గురించి సుబ్బరాయనుగారు మాట్లాడుతారు" అది విని కాంగ్రెసు శాసనసభాసభ్యులు ఎంతగానో చప్పట్లు కొట్టారు.

కాళేశ్వరరావుగారి కలలు

కాంగ్రెసు మంత్రివర్గం రాజీనామా యిచ్చుటకు కొందిరోజులు ముందుగా అప్పుడు చీఫ్ పార్లమెంటరీ సెక్రటరీగావున్న మిత్రులు శ్రీ కాళేశ్వరరావుపంతులుగారిని కలుసుకున్నాను. అసెంబ్లీ గ్రంథాలయంలో ఒక పుస్తకం కావలసి వెళ్లాను. ఒక గంట ముందుగా వెళ్ళినందున పంతులుగారి గదిలోకి వెళ్ళి కబుర్లు చెప్పుకున్నాము:—

నేను:— పంతులుగారూ ! పుస్తకాలను కట్టలు కట్టిస్తున్నారే! కాంగ్రెసు మంత్రులు రాజీనామా ఇవ్వాల్సివస్తుందా ?

ఆయన:- "ఎందుకైనా మంచిది! గవర్నమెంటు రిపోర్టులు వగైరా ఇక్కడ వుంటే, అరెస్టు కావడం సంభవించితే తిరిగి తీసుకువెళ్ళడం కష్టం. అందువల్ల రోజూ కొద్దికొద్దిగా తీసుకువెళ్ళుతున్నాను.

నేను:— అయితే జైలుకు వెళ్ళాల్సివస్తుందా ?

ఆయన:- కావచ్చు మనకు స్వరాజ్యం యివ్వక తప్పదు. కాంగ్రెసు మంత్రుల సహాయంలేనిదే ప్రభుత్వం నడవదు. ఆ విషయాన్ని బ్రిటీషు ప్రభుత్వం గ్రహించలేక మమ్మల్ని అరెస్టుచేస్తే, జైళ్ళలో మాత్రం పెట్టజాలరు. పోలీసులు ఎలా అరుస్టు చేయగలరు చెప్పండి? మాజిస్ట్రేటులు మమ్మలను శిక్షించుటకు సాహసించగలరా? మమ్మలనే అరెస్టు చేస్తే, అడయారు దగ్గర పెద్ద బంగళాలలో వుంచి, ఎంతో మర్యాదగా చూడకతప్పదు. అలా అరెస్టు చెయ్యడంకూడా ఒకవిధంగా మంచిదే! ఒక్క వారంరోజుల్లో గవర్నమెంటు రాజీకి రాకతప్పదు. నాయకులను అరెస్టు చేసినందున మనకింకా ఎక్కువ అధికారాలు యివ్వక తప్పదు.

జేయాలనే ఉద్దేశ్యం యుద్ధారంభంలోనే మాకు కలిగింది. అందువల్ల ఆ ఫ్యాక్టరీలో సమ్మె చేయించాము. ఆ సందర్భంలో నన్ను అరెస్టుచేసి నెల్లూరు జైయిలులో డిటెయిను చేశారు.

లోగడ 20 సంవత్సరాల క్రితం ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో 4 సంవత్సరముల ఆరుమాసాలు ఏడు జైళ్ళలో జీవితం గడిచింది. మద్రాసు రాష్ట్రం అంతటిలోను అప్పట్లో రాజకీయ ఖైదీని నే నొక్కడినే. 20 సంవత్సరాలలో ఎంత మార్పువచ్చింది: నాలాంటివారు వందలు, వేలు జైళ్ళకు అలవాటు పడ్డారు.

ఈ సారి ఎన్ని సంవత్సరాలు జైల్లో వుండాలో కాలనిర్ణయం లేదు. బయటవుండి స్వరాజ్యంకోసం ఏమీ చెయ్యజాలక పోయినందుకు అసంతృప్తి, అశాంతీ కలిగాయి.

అయితే, కాంగ్రెసు నాయకులతోను, కమ్యూనిస్టు నాయకులతోను కలిసి వుండవచ్చు; వారి రాజకీయాల్లోని భేదాలు, గాంధీ వాదానికి, కమ్యూనిజానికీ గల వ్యత్యాసము విపులంగా తెలుసుకోవచ్చు. వారి వారి సిద్ధాంతాలకు, చేతలకూ ఎంత సంబంధమున్నదో తెలుసుకోవచ్చు; నా జీవితంలో మిగిలిన కొద్ది సంవత్సరాలు దేశసేవకు అర్పించి, చిన్నప్పటినుండి నాకు ఆశయంగా వున్న

సంపూర్ణ స్వరాజ్య సంపాదనకొరకు కృషి చేయవచ్చునని భావించారు.

ఇప్పటికే షుమారు 15 మంది డెటినూ్యలు వెల్లూరు జైలులో ప్రత్యేకంగా ఒక వార్డులో వున్నారు కమూ్యనిస్టులూ పదిమంది ఫార్వర్డుబ్లాకువారు ముగ్గురు, అఖిల భారత ఖూక్సార్ నాయకుడు అల్లామామష్రిఖీ ఒకరు, ఏ పార్టికి చెందని భయం కారాచారగారు ఒకరు వున్నారు.

మొట్టమొదట జైలులో ప్రవేశించిన ఘూటేగారు చేయించవలసిన సౌకర్యాలన్నీ చేయించారు. మేము నిరోషులము; మా మీద కేసులు పెట్టడానికి ఆధారం లేదు; ఇకమీదట హాని చెయ్యకుండా మాత్రమే జైలులో బంధించి వుంచారు; బయట మా జీవితాలు ఎలావుండేవో అలాగే జైలులో వుండవచ్చునని బ్రిటిష్ ఘుత్వం తరఫున రూథర్ ఫర్డుదొర అంగీకరించారు. ఎందువల్ల ప్రభుత్వంవారు భోజనానికి సుఖమైన వసతు లేర్పరిచారు; ఒకొ్కక్కరికి ఒక మంచం, రెండు కుర్చీలు, ఒక బీరువా మొదలైనవి యిచ్చారు. వార్తాపత్రికలు. పుస్తకాలు, బట్టలు, మందులు వగైరా ఏమి కావలసివచ్చినా మా స్వంత డబ్బుతో కొనుకోవచ్చు. కొన్నిసుకు ఏర్పాటు చేశారు. మా యిష్టం వచ్చినన్ని వుత్తరాలు తెప్పించుకోవచ్చు: వ్రాసుకోవచ్చు, వంట పంట పనులకు, బట్టలు వుతుకుటకు నౌకర్లను ఇచ్చారు. అంతేకాదు; మా కుటుం

బ్యాంకు ధారాళంగా అలవెన్సులుకూడా యిచ్చారు. ఆరంభదశలో ప్రభుత్వం సవ్యంగానే ప్రవర్తించింది. డెటినూ్యలందరికి ఒక కమూ్యను అనే సంఘం పెట్టుకున్నాము. దానికి ఒక మేయర్‌ను, నిర్వాహక కమిటీని ఎన్నుకుంటూ వచ్చాము మా అందరి తరఫున మేయరు గారు ఒక్కొక్కరే సూపరెన్‌టుతో మాట్లాడి, మా సమస్యలన్నిటినీ పరిష్కరించాలి. ఒక హాస్టలుమాదిరిగా వుండేది. ఘాటేగారు ఇవన్నీ చేయించినా బోనులో వున్నట్టు మాకు విసుగు పుట్టేది.

చదువులు, రాజకీయగ్రంథపఠనము, క్రొత్త భాషలను నేర్చుకోవడం, డిల్లు మొదలైన కార్యక్రమం ప్రారంభించాము.

క్రమంగా ఎక్కువమంది డెటినూ్యలు రాసాగారు. కార్మిక, కర్షక సంఘాల నాయకులు, అటుతరువాత విద్యార్థి సంఘాలవారు, కాంగ్రెసు సత్యాగ్రహనాయకులు, చివరకు రంగాముతావారు వచ్చారు. ఆరునెలలలో మా సంఖ్య 200 కు పెరిగింది.

సంఖ్య పెరగడంతో ప్రారంభంలో ఒప్పుకొన్న సౌకర్యాలను అందరికీ అన్వయించకూడదని రెండు క్లాసులుగా విభజించుటకు ప్రభుత్వం ప్రయత్నించింది. మా సంఖ్య పెరగడంతో మా బలంకూడ పెరిగింది. సర్కారుతో పోరాడి, వారి ఆటలు, అన్యాయాలు కట్టిపెట్టించడం ఒక

విధిగా ఏర్పడింది. దీనితో మరొక భావంకూడా ఏర్పడింది. దీనితో మరొక భావంకూడ ఏర్పడింది. భావికాలంలో సర్కారుతో పోట్లాడి, స్వరాజ్యం సంపాదించటానికి సిద్ధం కావలెననే ఆలోచన ప్రతి పార్టీకి కలిగినది. అయితే యీ రెండు విషయాల్లోను ఒక్కొక్క పార్టీ ఒక్కొక్క దృక్పథంలో పనిచేస్తూ, తమ తమ పార్టీలను బలపరచుకోటానికి ప్రయత్నించుతూ, వారిలో వారు పోటీలు సడుతూండేవారు.

రెండు వందలమంది డెటినూ్యలలో పదిమంది మాత్రమే కమూ్యనిస్టులు; 185 మంది కాంగ్రెసు సభ్యులు, ఇతరులుఐదుగురు. రెండు సంవత్సరాలకు కమూ్యనిస్టుల సంఖ్య సుమారు 165 మందికి పెరిగిపోయింది.

జైలులో కమూ్యనిస్టుల కార్యక్రమం

కాంగ్రెసు నాయకులు రాజకీయ గ్రంథాలను చదువరు; తర్కించాల్సిన విషయాలుకూడ వారికి లేవు. స్వరాజ్యం వస్తుండనీ, తప్పక వస్తుందనీ, మోచనలు, ప్లానులు గాంధీగారికే వదిలిపెట్టుట మంచిదనీ వారి అభిప్రాయం. కమూ్యనిస్టులు క్లాసులు పెట్టుకొని, రాజకీయాలను చక్కగా చదువుతూ చర్చించుకుంటూండేవారు. దినమంతా ఏదో ఒక ప్లాను ప్రకారం జైలును రాజకీయ విశ్వవిద్యాలయంగా మార్చారు.

బ్యాంకు ధారాళంగా అలవెన్సులుకూడా యిచ్చారు. ఆరంభదశలో ప్రభుత్వం సవ్యంగానే ప్రవర్తించింది. డెటినూ్యలందరికి ఒక కమూ్యను అనే సంఘం పెట్టుకున్నాము. దానికి ఒక మేయర్‌ను, నిర్వాహక కమిటీని ఎన్నుకుంటూ వచ్చాము మా అందరి తరపున మేయరు గారు ఒక్కొక్కరే సూపరెన్‌టెంటుతో మాట్లాడి, మా సమస్యలన్నిటినీ పరిష్కరించాలి. ఒక హాస్టలుమాదిరిగా వుండేది. ఘాటేగారు ఇవన్నీ చేయించినా బోనులో వున్నట్లు మాకు విసుగు పుట్టేది.

చదువులు, రాజకీయగ్రంథపఠనము, క్రొత్త భాషలను నేర్చుకోవడం, డ్రిల్లు మొదలైన కార్యక్రమం ప్రారంభించాము.

క్రమంగా ఎక్కువమంది డెటినూ్యలు రాసాగారు. కార్మిక, కర్షక సంఘాల నాయకులు, అటుతరువాత విద్యార్థి సంఘాలవారు, కాంగ్రెసు సత్యాగ్రహనాయకులు, చివరకు రంగామహావారు వచ్చారు. ఆరునెలలలో మా సంఖ్య 200 కు పెరిగింది.

సంఖ్య పెరగడంతో ప్రారంభంలో ఒప్పుకొన్న సౌకర్యాలను అందరికీ అన్వయించకూడదని రెండు క్లాసులుగా విభజించుటకు ప్రభుత్వం ప్రయత్నించింది. మా సంఖ్య పెరగడంతో మా బలంకూడ పెరిగింది. సర్కారుతో పోరాడి, వారి ఆటలు, అన్యాయాలు కట్టిపెట్టించడం ఒక

కమ్యూనిస్టులలో ఒక పెద్ద ఆవేదన ఉండేది. యుద్ధ కాలం గడిచిపోతోందనీ, స్వరాజ్య సంపాదనకు మంచి అనుకూల సమయం చెయిజారిపోతున్నదనీ వారి విచారము. ఇతర దేశములకు స్వరాజ్య మెలా లభించింది? ఇండియాకు రాకపోవడానికి కారణమేమిటి? ఎలాంటి పంథా, ఎలాంటి కార్యక్రమం ఉండాలనేవి చర్చించే వారు.

జమీందారీ తత్వము, సామ్రాజ్య తత్వము, ఫాసిజము, నెరిజం, సోషలిజము, కమ్యూనిజము మొదలైన వాటి స్వరూపాలు యెలాంటివి? వాటిలోని వ్యత్యాసాలు ఏమిటి? అనే విషయాలను చదువుతుండేవారు.

కార్మిక, కర్షకుల సహాయం లేకుండా స్వరాజ్యం వస్తుండా? వారిని వర్గాలుగా సంఘటితపరిస్తే వచ్చే మంచి చెడ్డలు ఏమిటి? వర్గ పోరాటం జరుపవచ్చునా? సామ్రాజ్య వాదులతో తప్పకుండా కలిసిపోయి, స్వరాజ్యం రాకుండా అడ్డుపడే వర్గాలేవి? విప్లవాన్ని కోరే వర్గాలేవి?

ఫాసిజం గెలిస్తే మనకు స్వరాజ్యం వస్తుండా? లేక సోషలిజం గెలిస్తే వస్తుండా? దౌర్జన్యం ఉపయోగించ కూడదా? ఏ పరిస్థితుల్లో ఉపయోగించవచ్చు? మన పరమావధి స్వరాజ్యమా, అహింసా వాదమా? అహింసవల్ల స్వరాజ్యం తప్పకుండా వస్తుండా?

అలాంటి విషయాలమీద శాస్త్రచర్చ, గ్రంథ పఠనము జరుగుతూండేవి. డెటినూ్యలలో చాలమందికీ, అన్ని పార్టీలవారికీ వచ్చుచుండిన యీ చర్చలు నాయకులలో కొందరికి మాత్రమే నచ్చలేదు.

ఇలాంటి ప్రయత్నాల మూలంగా కమ్యూనిష్టులు ఇతరులను మార్చుతూ, తమ సంఖ్యను పెంచుకుంటూ వచ్చారు. కమ్యూనిష్టులతో చేరవద్దని, వారి క్లాసులకు వెళ్ళవద్దని, వారితో చర్చించవద్దని, వారితో కలసి ఏ పనీ చెయ్యవద్దని కాంగ్రెసు నాయకులు శ్రీ పట్టాభి, కాళేశ్వరరావు, కళా వెంకట్రావుగార్లు చెప్పుచుండిరేగాని, తాము వేరే క్లాసులుగాని, చర్చలుగాని ఏర్పాటు చెయ్యలేదు. వారి సంఖ్య దినదినమూ క్షీణింపసాగింది.

ఆచార్యత్వానికి రంగా నిరాకరణ

ప్రొఫెసరు రంగాగారు జైలుకు రాగానే చాలమంది యువకులకు ఉత్సాహం కలిగింది. ఆచార్య రంగా వద్ద ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చునని అనుకొన్నారు. కారల్ మార్క్సు వ్రాసిన "కాపిటల్" (పెట్టుబడి) అనే ఆర్థిక రాజకీయగ్రంథాన్ని బోధించమని కొందరు రంగాగారిని ప్రార్థించారు. రంగాగారు సమ్మతించలేదు. కారల్ మార్క్సుగారి కొన్ని అభిప్రాయాలతో తాను ఏకీభవించడంలేదని వారి ఆక్షేపణ. "మరీ మంచిది. మీ ఇద్దరి అభిప్రాయాలు మాకు తెలుస్తవి. తప్పక మీరే క్లాసు

తీసుకోవా"లని ఎంతో బ్రతిమలాడిరి. కాని, రంగాగారు అంగీకరించలేదు; రంగాగారు ఇంతగా ఎందుకు సంకోచించాలి? అని అందరికీ ఆశ్చర్యం. ఆయనను అడిగినవారు కమ్యూనిష్టులా? కాదు. కార్మికసంఘాలలో పనిచేయుచుండిన కాంగ్రెసువాదులు, యువకులు, జైళ్ళకు వెళ్ళినవారు. డాక్టరు పట్టాభిగారు. జెయిలుకు రాగానే రాజకీయ విషయాలలో జెయిలులో ఉన్నంతకాలం జోక్యం కలుగ జేసుకోనని ఖచ్చితంగా చెప్పేశారు. మరి క్లాసులు తీసుకోగలవారు కాంగ్రెసు నాయకులలో లేరు.

డాక్టరు కె. బి. కృష్ణ

అటు తరువాత డాక్టరు కె. బి. కృష్ణ Ph D.గారు జైలుకు వచ్చారు వారు. మాకు క్రొత్త వారిని గురించి వివరాలు తెలియవు. రాజకీయశాస్త్రంలో గొప్ప పండితుడని మాత్రం విని వున్నాం. యువకులు "ది కాపిటల్" గ్రంథాన్ని బోధించమన్నారు. "మీ అయంతట మీరే నేర్చుకొనవచ్చునే; కష్టంలేదే;" అనివారు అంటే అందరికీ ఆశ్చర్యం కలిగింది. బోధించడానికి ఒప్పుకొని మరునాడే క్లాసు ప్రారంభించారు. ఎంతో సులభంగా బోధించారు. ఆయన శక్తి మాకు ఆశ్చర్యంగావుంది. ఆచార్య రంగాగారుకూడ విద్యార్థిగా చేరాడు. అంతేకాదు; కాంగ్రెసు నాయకులు చాలామంది చేరారు. అయితే పట్టాభి మొదలైన నాయకులు వారిని వెళ్ళకూడదని నివారించారు.

కృష్ణగారు "ఇండియాలో మైనార్టీల చరిత్ర" (The History of the mimorities in India) అనే గ్రంథాన్ని వ్రాసిన వారు. ఆయన రాజకీయ, ఆర్థిక శాస్త్రాలలో పారంగతుడు; వేదాంతశాస్త్రంలో అసమానపాండిత్యం కలవాడు. చరిత్ర పఠనలో ఆరితేరినవాడు. ఆయనది చాల నిశితమైన బుద్ధి. ఏ విషయాన్నైనా శాస్త్రీయంగా యోచించి పరిష్కరించ గల మేధావి. వారి సహాయంతో డెటినూల్స్ క్యాంపు ఒక సర్వకళాశాలగాను, విప్లవ కళాశాలగాను మారింది.

సంఘం ఒక వ్యవస్థనుండి మరొక వ్యవస్థకు మారుతూ అభివృద్ధిచెందుతున్నట్లు మార్క్సు సిద్ధాంతాల ప్రకారమే కలుగుచున్నట్లు బోధించారు. అలాగైతే వేదాంతంలో కూడ యిలాగే మార్పులు కలుగుతున్నాయని మార్క్సు సిద్ధాంతాల ప్రకారం వృద్ధికి వచ్చుచున్నట్లు నిరూపించమని నేను కోరాను. జైలులో ముఖ్య గ్రంథాలు లభించకపోయినా క్లాసులుపెట్టి చర్చలు ఏర్పాటుచేసి, అనేకవిషయాలు బోధించుతూండేవారు. ఎన్నో నెలలు ఈ క్లాసులు జరిగాయి. ఆచార్య రంగా గారుకూడా ఆ క్లాసులకు వచ్చుచునేవుండిరి.

రంగాగారి రాజకీయాలు

కాంగ్రెసు రాజకీయాలమీద ఎంత తీవ్రంగా వివర్శనలు జరిగినవో అదే రీతిగా ఆచార్య రంగాగారి రాజకీయాలమీద చర్చలు జరిగాయి. విద్యార్థులు సామా

న్యాయవాది; షుమారు 20 సంవత్సరాల మొదలు 40ల వయస్సున్న వారు, రెండుమూడుసార్లు కాంగ్రెసు ఉద్యమాలలో జైళ్ళకు వెళ్ళినవారు, రాజకీయ విషయాలలో చక్కని అనుభవం గలవారు. కాబట్టి అభ్యుదయవాదియని పేరు గాంచిన రంగాగారి రాజకీయాలకు, యితర పార్టీల రాజకీయాలకు వుండే వ్యత్యాసాలను బాగా తెలుసుకోవాలని అభిలాషతో డాక్టరు కృష్ణగారి సహాయం కోరారు.

అంతట రంగాగారు వ్రాసిన గ్రంథములపై చర్చ జరిగింది. రంగాగారు చర్చలో పాల్గొనలేదు; కాని వింటూ కూచున్నారు. వారి గ్రంథాల్లో పరస్పర వైరుధ్యాలు ఉన్నట్టున్నా, ఒకే అధ్యాయంలో ఒక ప్యారాగ్రాఫుకు మరొక ప్యారాగ్రాఫుకు పరస్పర వైరుధ్యం ఉన్నట్టు, చివరకు ఒకే ప్యారాలో మొదటి వాక్యానికి చివరవాక్యాలు విరుద్ధంగా ఉన్నట్టు నిరూపించగా అందరూ ఆశ్చర్యపడ్డారు. ఆఖరున కృష్ణగారు "రంగాగారు చాలా చదివారు. వారి పుస్తకాలలో చాల భోగట్టావున్నది. కాని, ఆయన ఆ విషయాలను జీర్ణం చేసుకోలే"దన్నారు. అయినా రంగాగారు మాట్లాడలేదు.

మరికొన్ని రోజులకు ఆచార్య రంగాగారి రాజకీయాలనుగురించి చర్చ జరిగింది. ఒకే సమస్యమీద దేశంలోని మూడు పార్టీలవారి తీర్మానాలను పరిశీలించాము. అవి కాంగ్రెసు, కమ్యూనిస్టు, కిసానుసభల తీర్మానాలు. కమ్యూనిస్టుపార్టీ తీర్మానంలోని ఉపోద్ఘాతాన్ని

(ప్రియాంబుల్), కాంగ్రెసు తీర్మానంలోని కార్యాచరణకు సంబంధించిన భాగాన్ని (ఆపరేటివ్ పోర్షన్) కలిపితే రంగాగారి కిసానుసభాతీర్మానాలు ప్రత్యక్షమైనాయి. అందువల్ల డాక్టరు కృష్ణగారు యీవిధంగా నిర్ధారణ చేశారు:- "కమ్యూనిస్టుల అతివాదభాష, కాంగ్రెసువారి మితవాద కార్యక్రమముల కలగలుపే రంగాగారి రాజకీయ పంథాగా వున్నది."

రంగాగారికి కోపం వచ్చింది. మౌనంగా వుండలేక పోయారు. "ఇక్కడ మీ యిష్టంవచ్చినట్లు వాగండి; బయటకు పోయినతరువాత ప్రజలవద్ద మాట్లాడి సమర్థించుకోండి. చూతాం" అని బెదిరించి, మీటింగులోనుంచి లేచి వెళ్ళారు.

చర్చలు, కోపాలు

మరొకప్పుడు ఒక ముఖ్యసమస్యను గురించి చర్చ జరిగింది. "అహింసా విధానంవల్ల స్వరాజ్యం రాగలదా?" అన్న విషయాన్ని గురించిన చర్చ. అందరూ తమతమ అభిప్రాయాలను తెలుపవచ్చునని కోరారు. కాంగ్రెసు వాదులు దానిలో పాల్గొనకూడదని డాక్టరు పట్టాభిగారు సలహాయిచ్చారు. కాని స్పీకరు సాంబమూర్తిగారు ఏకీభవించలేదు; కాంగ్రెసువాదులైనవారు తప్పక చర్చలో పాల్గొనాలని వారి అభిప్రాయం. అయితే వారి అభిప్రాయం ప్రకారం పాల్గొన్న కాంగ్రెసు నాయకులు వారొక్కరే.

మామూలు ప్రకారం డాక్టరు కృష్ణగారు అధ్యక్షులు. ఒక్కొక్కరి ఉపన్యాసానంతరం దానిని గురించి తన అభిప్రాయాన్ని యిస్తూండేవారు. స్పీకరు సాంబమూర్తిగారు చాలాసేపు ఉపన్యసించారు. అంతట కృష్ణగారు తన అంతర్నిర్ణయాన్ని యిలా చెప్పారు:- స్పీకరు సాంబమూర్తిగారి ఉపన్యాసధోరణి అజ్ఞానులైన పల్లెపజల ఎదుట మాట్లాడిన రీతిగా ఉన్నదేకాని, విజ్ఞానులైన దేశభక్తులముందు శాస్త్రీకంగాను, తార్కికంగాను మాట్లాడలేదు." అన్నారు.

కాంగ్రెసు నాయకులకు మాత్రం కోపాలువచ్చాయి. "కమ్యూనిస్టులతో చేరవద్దు; మన మర్యాద కాపాడుకోవాలంటే వారితో చర్చించకూడదు" అని పట్టాభిగారు అన్నారట.

"నే నెందుకు కమూనిస్టు నయ్యాను"

ఆ రెండు సంవత్సరాలలో రాజకీయ చర్చలకు అంతమే లేదు. "నేను ఎందుకు కమ్యూనిస్టు నయ్యాను?" అని ఒక్కొక్కరు మాట్లాడాలి. జైలుకు వచ్చినవారిలో ఎక్కువమంది కాంగ్రెసువారే. వారిలో నాయకులు కొందిమంది, అనుచరులు చాలామంది. అనుచరులు కమ్యూనిస్టులుగా మారిపోసాగారు. ఈవిధంగా కమ్యూనిస్టులయిన వారే తా మెందుకు కమ్యూనిస్టులయ్యారో ఉపన్యసించాలి. ప్రతి ఉపన్యాసానంతరం చర్చ జరుగుతుంది.

వారందరూ కాంగ్రెసులో పనిచేసేవారే. కాంగ్రెసు నాయకులకు జమీందారీవర్గంమీదా, పెట్టుబడిదారీవర్గంపైనవున్న సానుభూతినీ, కష్టజీవులయిన కార్మిక కర్షకుల యందుగల అలక్ష్యభావాన్ని నిరూపించారు అంతేకాక ఎలక్షన్లలో అనేకులు చేయుచుండిన మోసాలను బయటపెట్టారు. నాయకులలో వ్యక్తి సంబంధమైన కక్షలు, అధికారాపేక్షలు, అంతఃకలహాలు, కట్టుగా కలిసి పని చేయలేకపోవడం, ఒకరు మరొక దేశభక్తునికి చేయుచున్న ద్రోహము మొదలైన కుళ్లును బయటపెట్టారు. నీనిత్తో జైలులోని కాంగ్రెసు నాయకులకు కమ్యూనిస్టులతో కలసి వుండడమే కష్టమనిపించింది.

తర్క వితర్కాలు

ఈవిధంగా రెండు ముఠాలుగా తయారైన సమయంలో శ్రీ రవీంద్రనాథ ఠాగూరుగారు మరణించారు. వారి గౌరవార్థం మీటింగు జరిగింది. డాక్టరు పట్టాభిగారు అధ్యక్షత వహించాలని అందరం కోరాము. కాని పట్టాభిగారు ఒక షరతు ఒప్పుకోమని అడిగారు. తాను మాట్లాడి ముగించిన తరువాత యింకెవరూ మాట్లాడకూడదని వారి షరతు. కొందరు ఒప్పుకోలేదు. అందువల్ల స్పీకరు సాంబమూర్తిగారు అధ్యక్షత వహించారు. డాక్టరు కృష్ణగారు తన ఉపన్యాసాన్ని చదివారు. ఠాగూరుగారిని మహాత్మా గాంధీగారితో పోల్చి మాట్లాడారు. గాంధీగారు మహా దేశ

భక్తిగల వ్యక్తి "(a great dynamic Personality)" అనిన్నీ, రాగూమగారికో ఆశక్తి లేదనీ చెప్పారు. అయితే రాగూమగారి అభిప్రాయాలు ఎక్కువ అభ్యుదయకరంగా ఉన్నట్టు ఉదాహరణలను గ్రంథాలలోనుండి చదివి వినిపించారు. గాంధీగారి రామరాజ్యం అభివృద్ధి నిరోధకమని నిరూపించారు. రాగూమగారిది ముందుచూపు అనీ, గాంధీగారిది వెనుకచూపు అనీ చెప్పారు.

కాంగ్రెసు నాయకులకు ఆగ్రహం వచ్చింది. "ప్రపంచంలో మహాత్మా గాంధీగారితో వుజ్జీఅయిన గొప్ప వ్యక్తి జన్మించనేలేదన్న ఘోరణిలో స్నీకరుగారు వుపన్యసించారు. కాంగ్రెసువాదులను, వారి నాయకులను డాక్టరు కృష్ణగారు అవమాన పరిచారని విమర్శించారు. వాదాలు ముదిరాయి. "నా అభిప్రాయాలను గ్రంథసహాయంతో నిరూపించుతాను: ఒక కమిటీని యేర్పరచు"మని కృష్ణగారు సవాలుచేశారు; స్నీకరుగారు ఆ సవాలును అంగీకరించలేదు.

వివాదం

కాంగ్రెసు నాయకులకు, కమ్యూనిస్టు యువకులకు జరుగుచుండిన తర్కవితర్కాలను (Intellectual Competition Descussions) గురించి, నాయకుల ఓటమిని గురించిన ఈ అధ్యాయాన్ని పూర్తిచేసేముందు మరొక ఉదహరణను వ్రాస్తాను.

ఈ వాగ్వాదాలలో సాధారణంగా శ్రీ కాళేశ్వర రావు పంతులుగారు జోక్యం కల్పించుకోవడంలేదు. కాని నాయకుల పక్షానికి ఓటమి కలిగినప్పుడు అందరికంటె ఎక్కువగా కోపపడుతూండేవారు. యువకుల శక్తి సామర్థ్యాలను డాక్టరు పట్టాభిగారు గ్రహించారు. కాని, శ్రీ కాళేశ్వరరావు పంతులుగారు మాత్రం గ్రహించలేదు.

వారు అంతర్జాతీయ సమస్యలను బాగా చదివి, గ్రంథాలుకూడా వ్రాసియున్నారు. ముఖ్యంగా టర్కీలోను, చైనాలోను, జరిగిన విప్లవాలనుగురించి వ్రాశారు. కాబట్టి చైనా విప్లవాన్నిగురించి వుపన్యసించుతానని శ్రీ పంతులుగారు కమ్యూనిస్టులకు తెలియపరిచారు.

తన ఉపన్యాసాన్ని ఆనాడు 1925 సంవత్సరంతో పూర్తిచేశారు. యువకులు తమ సంశయాలను తీర్చుకొనుటకు ప్రశ్నలువేశారు. అది మామూలే, కాని పంతులుగారు సమాధానం చెప్పేందుకు నిరాకరించారు. ఒక విద్యార్థి లేచి ప్రశ్నలన్నిటికి సమాధానం చెప్పారు. పంతులుగారికి ఆశ్చర్యం కలిగినది.

కాని, యువకులు పంతులుగారిని అంతటితో విడిచిపెట్టలేదు. 1925 సంవత్సరం మొదలు 1940 సంవత్సరం వరకూ చైనాలో జరుగుతూన్న పరివర్తననుగురించి ఉపన్యసించవలసిందిగా కోరారు. తనకు తెలియదని పంతులుగారు ఒప్పుకొన్నారు. ఒక యువకుడు మరునాడు ఆ విష

యాన్ని పూర్తిచేశాడు. ప్రశ్నలకు సమాధానం చెప్పాడు. ఆ మీటింగుకు పంతులుగారే అధ్యక్షత వహించారు.

కమ్యూనిస్టు యువకులు జాతీయ అంతర్జాతీయ రాజకీయ సమస్యలనుగురించి ఎంత తీవ్రంగా, ఎంత సమగ్రంగా చదివి గ్రహించుకొంటున్నారో తుదకు శ్రీ కాళేశ్వర రావు పంతులుగారుకూడ ఒప్పుకోవలసి వచ్చింది.

కాంగ్రెసు నాయకులు బుద్ధికౌశల్యములోను, విజ్ఞానంలోను కమ్యూనిస్టు యువకులతో ఓడిపోతూ వచ్చారు. దాని ఫలితంగా కాంగ్రెస్ వాదులు కమ్యూనిస్టులుగా మారిపోతూ వచ్చారు.

ఈ విషయాలను యింతటితో ముగించి, ఈ రెండు పార్టీలవారి ప్రవర్తనను గురించి కొంత వ్రాస్తాను.

నిరశన వ్రతము - కాంగ్రెసు నాయకులు

పై కారణంవల్ల మాత్రమే 160 మంది కమ్యూనిస్టులుగామారిపోయారనితలచకూడదు. జైలు జీవితంలో ఎన్నో కష్టనష్టసమస్యల నెదుర్కొవలసివస్తుంది. ఆ ఎదుర్కొవడంలో పార్టీలవారీగా ఎవరి పంథా ప్రకారం వారు తమ తమ సమస్యలను పరిష్కరించుకుంటూ వచ్చారు. పరిష్కారాలలో అభిప్రాయభేదాలు, తగాదాలు కలుగుతూ వచ్చాయి. ఇంతవరకు తర్కవితర్కాలలోని కొన్ని వ్యత్యాసాలను వివరించాను. మరి కొన్ని ముఖ్య సమస్యలను ఏ పార్టీ ఎలా ఎదుర్కొన్నదీ వ్రాస్తాను.

డిటెన్యూలసంఖ్య పెరగగానే ప్రభుత్వం రెండు తరగతులుగా విభజించింది. ప్రథమంలో ఎంతో న్యాయంగా చెయ్యవలసిన సౌకర్యాలను చేసింది: కాని, ఆ పాలసీని మార్చుకొన్నది. షుమారు 25 మందిని మాత్రమే మొదటి తరగతిలోను, మిగిలిన 85 మందిని రెండవతరగతినిగాను మార్చారు. మొదటితరగతి వారికి మామూలు వసతులన్నీ యివ్వబడినై; అధికసంఖ్యాకుల రెండోతరగతి వారిని నేరంచేసి శిక్ష ననుభవించే మామూలు ఖైదీల స్థితికి మార్చారు. భోజనానికి రోజుకు ఆరు అణాలకు మారుగా రెండు అణాలు మాత్రమే; దుస్తులుకూడా అలాగే; ఉత్తరాలూ అంతే. స్వంత డబ్బుకూడా ఉపయోగించుకోకూడదు.

అప్పట్లో కమ్యూనిస్టులు ఏ పదిమందో వుండేవారు. మిగిలినవారు కాంగ్రెసు నాయకులు, వారి అనుచరులు. ఎవరూ ఈ మార్పులను ఒప్పుకోలేదు. అయితే, గవర్నమెంటు లక్ష్యపెట్టలేదు. డిటెన్యూలు నిరసనవ్రతం ప్రారంభించారు. కాంగ్రెసు నాయకులు, ముగ్గురు నలుగురు రంగాపారీవారు మొత్తం పాతికమంది నిరశనవ్రతంలో చేరుటకు నిరాకరించారు. చేరుతామన్నవారిలో యిద్దరు వ్యాధిగ్రస్తులను చేరకూడదని తతిమ్మా 85 మంది ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆ ఇద్దరిని మాత్రం నిరశన వ్రతానికి సంబంధించిన వ్యవహారాలను చూచుకోమని కోరారు. ఆ ఇద్దరితో ఒకరు బాలచంద్రమీనన్, రెండో

వ్యక్తిని నేను. ఈ నిరశనవ్రతం జయప్రదం కాకూడదని కాంగ్రెసు నాయకులలో ఇద్దరు ముగ్గురు పట్టుదలతో పని చేశారు. వారిలో ముఖ్యులు శ్రీ కాళేశ్వరరావుపంతులు గారు మూడునాలుగు రోజులలో ఈ నిరశనవ్రతం భగ్నమవుతుంది; మానేస్తారని ప్రచారం ప్రారంభించారు. ఆ నాలుగురోజులు అయిన తరువాత "వీరేమో దొంగతనంగా తింటూండాలి" అని ప్రచారం సాగించారు. మధ్యలో నిలిపినవారిని అభినందించారు. రాజీమాటలలో జోక్యం కలుగజేసుకొని విచ్ఛేదానికి ప్రయత్నించారు. జైలు బయట చాలమంది దేశభక్తులు బహిరంగసభలు జరిపి, డెప్యూటేషన్లు తీసుకువెళ్ళి విజయవంతంగా అంతమయ్యేవరకూ సహాయం చేస్తూనే వున్నారు. వారిలో ముఖ్యులు; శ్రీ జగన్నాథదాసు, యస్. కృష్ణమూర్తి, దరిశి సుభద్రమ్మ, వి. భాష్యంఅయ్యంగార్లు, ఆర్. సూర్యనారాయణరావు, న్యాయపతి నారాయణమూర్తిగార్లు. పంధొమ్మిది రోజులు వ్రతం జరిగింది. చివరకు పూర్తిగా జయం లభించింది. దేశమంతా సంతోషించింది. కాని, మాతో నేవున్న కాంగ్రెసు నాయకులు చాలమంది హర్షించలేకపోయారు.

జైలుకోడ్‌లో కాంగ్రెసువారి మార్పు

ఈ సందర్భంలో ఒక ముఖ్య విషయాన్ని వ్రాయాలి. కాంగ్రెసు మంత్రివర్గం అధికారంలోవుండగా (1936-39) బ్రిటీషు రాక్షసుల అమానుష జైలు కోడులో

మరి ఒకటి రెండు అమానుషమైన మార్పులు చేశారు. జైల్లో వుండగా నిరశనవ్రతం చేసి, చస్తామనేవారిని చావనివ్వాలి; కాని, జీవించేలా ఎంత మాత్రమూ సహాయం చేయకూడదనే మార్పు ముఖ్యమైనది. హిందీ భాషకు వ్యతిరేకంగా పనిచేస్తూన్న అభివృద్ధి నిరోధకులను భయపెట్టి లొంగదీయటకు ఈ మార్పును చేసివుంటారు. అయితే కాంగ్రెసువారు అప్పుడు 1940-41లో అధికారంలోలేరు. శ్రీ భయంకరాచారిగారు నిరశనవ్రతం చేశారు. ముందుగా మేము ఒక అంచనా వేసుకొని 21 రోజులవరకూ యీ వ్రతాన్ని సాగించాలనీ, ఈలోగా ప్రజలు అలజడిపుట్టి, ఒత్తిడితెచ్చి, ప్రభుత్వాన్ని లొంగదీయగలరని అందరం కలసి తీర్మానించుకున్నాము. ఆచారిగారు ఒకప్పుడు అండమానులో చాలారోజులు నిరశనవ్రతం చేసి అనుభవం సంపాదించినందున, యిరవై ఒక్క రోజులవరకూ ప్రాణాపాయంలేకుండా ఎలా జరపాలో చక్కగా వుపాయాలు బోధించారు. ముఖ్యంగా నీళ్ళను సమృద్ధిగా తాగుచుండాలని సలహాయిచ్చారు. వ్రతం ప్రారంభంకాగానే తానుమాత్రం యీ సూత్రాన్ని ఉల్లంఘించి నీళ్ళు త్రాగక మూడు రోజుల్లోనే చావుబ్రతుకుల స్థితికి లోనయ్యారు. అప్పుడు జైలు సూపర్నెంటు డాక్టర్ మేజరు గిల్లు. తగవులమారికాదు. అందరికి అనుకూలంగా ఎలాగో సవరించుకొంటూండేవారు భయంకరాచారిగారి మీద ప్రత్యేకాభిమానం ఆయనకు.

కాంగ్రెసు చేసిన మార్పు అమలులో వుంది. ఆ ప్రకారంచేస్తే భయంకరాచారికి ప్రాణాపాయం తప్పదు. రూల్సులు ఉల్లంఘించి బ్రతికేలాగు సహాయం చేస్తే, తన ఉద్యోగానికి భంగం కలుగవచ్చు! ముఖ్యంగా తాను త్వరలోనే ఇన్స్పెక్టరు జనరలు అవుతాననే నమ్మకంతో ఎదురుచూస్తున్నారు. డాక్టరు పట్టాభి, సాంబమూర్తి, కాళేశ్వరరావు, మాధవమీనన్, నాడార్, కళావెంకట్రావు, సంజీవరెడ్డి. ఆచార్యరంగా, వగైరా కాంగ్రెసు నాయకులతో తన కష్టాన్ని మేజరు గిల్లుగారు చెప్పుకున్నారు. ఎలాంటి సలహాగాని యివ్వలేకపోయారు. మన నాయకులు. చివరకు తానే ఒక నిర్ణయానికివచ్చి "ఏమయినాసరే, భయంకరాచారిని జీవించేలా చేస్తానన్నారు. బలవంతంగా ఆసనం ద్వారా నీళ్ళు ఎక్కించారు. 20 రోజులు నిరశనవ్రతం సాగించారు. కాంగ్రెసు మంత్రివర్గం చేసిన మార్పుకు అందరికి చాల అసహ్యంకలిగింది.

భయంకరాచారి

భయంకరాచారి అలా ఎందుకు చేశాడో తెలుసుకోవాలని కుతూహలం కలుగవచ్చు. వారి మనసులో ఏముందో మాకు తెలియదు. తన మీదనే ప్రజలదృష్టి నిలవాలని, తనవల్లనే జయం వచ్చిందని గర్వపడడానికి యెత్తువేసివుంటారనీ అనుకున్నాము మేము.

ఆ రెండు సంవత్సరాలకాలంలో మరొకరితో కలసి ఆయన ఏపనికాని చెయ్యలేకపొయ్యాడు. భయంకరాచారి

గారికి తనగదిలోకి రెండవవారు లభించలేదు. అలాగే కష్టపడుచున్న కాళేశ్వరరావు పంతులుగారే చివరకు భయంకరాచారిగారి గదిలో వుండవలసివచ్చింది.

విభజించి పాలించడం

నిరశనవ్రతం పరిష్కారమైంది; కాని, ప్రభుత్వం మరొక తగాదా తెచ్చి పెట్టింది. పరిష్కారంలో సామ్రాజ్య వాదుల విషం నిండివుంది. రెండు తరగతులనే విభజనను అలాగే వుంచారు. "విభజించి పాలించడం" అనేది ఎక్కడికి పోతుంది? అయితే, విభజనను ఏపార్టీ కూడా ఒప్పుకోలేదు. మామూలుగా అంతవరకూ కలిసివుంటున్నట్లే వుమ్మడిగా కనూన్యాను జీవితపద్ధతిని నడుపుదామని మెజారిటీ తీర్మానించింది. ఒకటవ తరగతిలోని ప్రతి డెటినూన్యాకు రోజుకు ఫుమూరు నాలుగు అణాల వెలగల వెన్న, పండ్లు, చక్కెర యిచ్చారు. మొదటితరగతిలో 25 మందినీ, రెండవతరగతిలో 85 మందినీ వేశారు. కాంగ్రెసువారిలో మొదటితరగతివారు పదిమందిమాత్రమే; రెండవ తరగతి వారు చాలా ఎక్కువ.

కాంగ్రెసు నాయకుల "ప్రత్యేకత"

తరగతివారీగా రెండు వంటశాలలు ఉండాలని శ్రీ కాళేశ్వరరావుగారి వాదన; అయితే ఈ వాదన వోడిపోయింది. పోతేనేం? అందరకు కలసి ఒకటే వంటశాల

ఉండవచ్చు; కాని, ఒకటవతరగతివారికి అధికంగా వచ్చేవి ఎవరివి వారికే యివ్వాలని శ్రీ వారు పట్టుపట్టి వాదించారు. కాని మిగతావారు అందుకు ఒప్పుకోలేదు. ప్రత్యేకంగా ఒక వంటశాల పెట్టుకొనుటకు వుత్తరు విమ్మని శ్రీ రావుగారు సూపర్నెటుగారైన మేజరు క్లెమెన్స్‌గారిని అడిగారు. రెండవతరగతిలో వుండే కాంగ్రెసు వారందరిని తమతో కలిసి వుండమని కమ్యూనిష్టులు ఆహ్వానించారు. అందుకు కాంగ్రెసు నాయకులు నైతికంగా తిన్న దెబ్బ ఇంతా అంతా కాదు. కాంగ్రెసువారి అనుచరులు చాల మంది కమ్యూనిష్టుపార్టీలో మరి ఏ వాదన అవసరంలేకుండానే చేరిపోసాగారు. చివరకు మేజరు క్లెమెన్స్ రెండో వంటశాల పెట్టుకొనుటకు అనుమతి యివ్వనేలేదు. అందుకాయన శ్రీ పంతులుగారితో చెప్పిన కారణం ఎంతో సమంజసంగా వుంది;

"మీరు మంత్రివర్గంలో వుండి రాష్ట్రాన్ని పాలించారు; మళ్ళీ పాలించవలసివుంటుంది. మీ గౌరవాన్ని మీరు కాపాడుకోవాలి. రెండో నంటశాల పెట్టుకున్నారా, మీకు కళంకం తప్పదు. భావిలో మీకు హాని జరుగుతుంది. కాబట్టి, నేను అంగీకరించను" అన్నాను. సూపర్నెంటు; శ్రీ కాళేశ్వరరావుగారు వట్టి చేతులతో వచ్చేశారు. కాంగ్రెసునాయకులలో శ్రీ సాంబమూర్తిగారు శ్రీ కాళేశ్వరరావు పంతులుగారిని ఈ విషయాలలో బాగా మందలిచుతూవచ్చారు.

పరీ

జైలుజీవితం చాల దుర్భరమైనది. అందరూ ఓర్చుకోలేరు. ఐదుగురు కనూ్యనిష్టులు జైల్లోనుండి తప్పించుకుపోయారు. ప్రహరీగోడ నేలమట్టానికి సమీపంలో రెండు మూడడుగుల వెడల్పుంటుంది. కొందరు గోడకు ఒక కన్నంచేసి ఒక నెలరోజులు కన్పడకుండా మూసిపెట్టివుంచారు. ఎ. కె. గోపాలన్ నలుగురిని వెంటబెట్టుకొని తప్పించుకొని వెళ్ళిపోయాడు.

గోపాలన్‌కు బ్రిటిష్ ప్రభుత్వంమీద అమితద్వేషం. బయటి కెళ్ళి పనిచెయ్యాలని గంపెడంత ఆశ. జైలులో ఎల్లప్పుడు ఆధికారులతో తగవులు పెట్టుకొనేవాడు. అధికారులకు గానీ, డెటినూ్యలకుగానీ విరామ ముండదు. అప్పుడు జైల్లో రెండు వందలమంది డెటినూ్యలలో ఎ. . కెగోపాలన్, డాక్టరు♦ కృష్ణగార్లు గొప్పవ్యక్తులు.

♦ డాక్టరు కృష్ణ 1949 జనవరిలో స్వగ్రామం నిడుబ్రోలులో చనిపోయిరి. 15 సంవత్సరాలు యింగ్లాడు, అమెరికాలలో చదువుకొంటూ పనిచేస్తుండేవారు. హార్వర్డ్ యూనివర్సిటీలో ఈ మేధావితో బాధలు పడలేని ప్రొఫెసర్లు ఆయనకు Ph D డిగ్రీ యివ్వకుండా అడ్డుపడ్డారు. చివరకు ఆయననుండి తప్పించుకోవడం మించిదని డిగ్రీ లుచ్చి పంపివేశారు. కృష్ణగారు మహా మేధావి.

వీరివల్ల కాంగ్రెసు వాదులు కమ్యూనిస్టులుగా మారిపోతున్నారని కొందరు నాయకులకు కడుపుమంట. వీరదరి మీద గవర్నమెంటుకు రహస్యంగా రిపోర్టును ఒక కాంగ్రెసు నాయకుడు పంపించాడనీ, చీఫ్ సెక్రటరీగారైన శ్రీ కొంతి రామమూర్తిగారు రిపోర్టు పంపిన నాయకుని ప్రవర్తనను అసహించుకున్నారనీ తెలిసింది. స్వరాజ్యం కోసం ప్రయత్నించే రెండు పార్టీలలో, ఒకపార్టీ మరొక పార్టీమీద చాటు అర్జీలు పెడుతున్నందుకు రామమూర్తి గారు ఏవగించుకున్నట్టు నేను విడుదలైన తరువాత శ్రీ సూర్యనారాయణరావుగారు (సర్వెంట్సు ఆఫ్ ఇండియా) నాతో చెప్పారు.

పై రిపోర్టుల వల్ల డాక్టరు కృష్ణగారితో, ఎ. కె. గోపాలన్ గారితోను మద్రాసు జైలుకు ఉదయాన వెళ్ళాలని, ముందురోజు సాయంత్రమే జైలు అధికారులు చెప్పివేశారు. ఆ రాత్రే ఎ. కె. గోపాలన్, కొరపాటి పట్టాభి రామయ్య, సి. వి. కె రావు, దాట్ల సూర్యనారాయణ రాజు (తణుకు), కన్నన్ గార్లు తప్పించుకొని వెళ్ళిపోయారు. పట్టాభిరామయ్యగారు జైలుకు వచ్చినందుకు చాల విచారపడేవారు. వచ్చినప్పటినుంచి తప్పించుకొని పోవుటకు ప్రయత్నాలు ప్రారంభించారు. అలాగే రాజు గారూను. ప్రతిరోజు బాటలు, రోడ్లు వగైరా గీతలు గీస్తూండేవారు. వెళ్ళేటప్పుడు రహస్యాన్ని సి.వి.కె. రావు

గారితో చెప్పి, తమ తరపున మిగతావారందరికి ముందుగ చెప్పనందుకు క్షమాపణ తెలుపుమని కోరారు. "నేను కూడా వస్తా" నని ఆయనకూడా దూరిపోయారు.

మరునాడు జైలులో గందరగోళమయింది. అంత వరకు రాత్రిళ్ళు మేము ఆరుబయట పడుకొంటూండే వాళ్ళం. ఆ సౌకర్యం పోతుందని తప్పించుకొని పోయిన వారిని పెద్దలు కొందరు నిందించసాగారు. అయితే కనుచూపు నిస్టులను మాత్రమే కూసివెయ్యాలని ఉత్తరువు వచ్చినా, కోనసీమ కాంగ్రెసు నాయకుడు మాత్రం నిందించడం మానలేదు. వారితో ఒకేగదిలో వున్న శ్రీ సాంబమూర్తి గారికి విసుగెత్తి "సత్యాగ్రహమట! ఏమిటీ వాగుడు? అలా వెళ్ళటానికి ధైర్యం, సాహసం, త్యాగమూకావాలి; నిన్నూ. ననూ ఆ కన్నంలో పెట్టి నెట్టినా వెళ్తావ టోయ్?" అని కసిరారు. అంతటితో ఆ కాంగ్రెసు నాయకుని కోపం చల్లారింది.

వెళ్ళిపోయిన వారిద్దరు నా గదిలో ఉండేవారు. అందువల్ల మా బంధువుల యిండ్లవద్ద పోలీసులు కాపలా కాచారట. పరాయివారు నా చేతిగడియారం, మరి కొందరి గడియారాలు మాకు తెలియకుండానే తీసుకెళ్లారు. ఎక్కడైనా అమ్ముకొని ప్రయాణం సాగించాలని అనుకున్నారట. కాని మా గడియాలను తిరిగి పంపివేశారు.

గౌరవనీయులయిన సాంబమూర్తి

ఈ విధంగా ప్రభుత్వం ఓడిపోతున్నా తన దుష్టత్వాన్ని మానలేదు. డెటినూ్యలము 174 మంది మయ్యూ్యం. ఎక్కువ అపాయకరమైనవారు, తక్కువ ప్రమాదకరులు అని రెండు తరగతులుగా సూపరెన్టుగారు విభజించారు. 25 మందిని స్త్రీల పాతయార్డులోను, మిగతవారిని వెలుపల క్వారంటీనులో ఉంచారు. శ్రీ కాళేశ్వరరావుగారు తన కిష్టమైన యిరవై అయిదు పేర్ల పట్టీ తయారుచేసి సూపరెన్టుకు యిచ్చారని వదంతి. దానితో ఒక నిరసనసభ పెట్టి ఆయన్ను ఖండించారు. కాంగ్రెసు నాయకులుకూడా నిరసించారు. * శ్రీ సాంబమూర్తిగారి గాంభీర్యము, త్యాగమువల్ల కాంగ్రెసు సంస్థకు, కాంగ్రెసు నాయకులకు గౌరవ మెంత అధికమగుచుండెనో శ్రీ కాళేశ్వరరావుగారివల్ల అంత అధోగతిపాలవుతున్నదని అనుకునేవారు.

♦మద్రాసు గవర్నరుగారు మరునాడు జైలును చూచేందుకు వస్తారనగా ముందురోజున డిస్ట్రిక్టుమాజిస్ట్రేటు శ్రీ సాంబమూర్తిగారిని కలుసుకొని "గవర్నరుగారికి మీతో మాట్లాడాలనివుంది. రేపు ఆఫీసులో ఫలానా టైముకు కలుసుకుంటారా?" అని అడిగారు. "ఎప్పుడూ 24 గంటలూ నా గదిలోనే వుంటాను. గవర్నరుగారు ఎప్పుడు కలుసుకోవాలంటే అప్పుడు నా గదిలో కలుసుకో

రష్యాపై హిట్లరుదాడి : కాంగ్రెసునాయకుల కలలు

ప్రపంచవిధంగా విడదీసి రెండు ప్రదేశాలలో వుంచే ముందుగా హిట్లరు సోవియట్ రష్యామీద దండెత్తాడు. కమ్యూనిస్టులలో చాల కలవరం పుట్టింది. వారు విచారగ్రస్తులయ్యారు. కొందరు కాంగ్రెసునాయకులు సంతోషాన్ని ప్రదర్శించారు. 'రష్యా ఓడిపోతుంది; తప్ప'దని ప్రచారం సాగించారు. ఇన్ని రోజులలో, యిన్ని గంటలలో మాస్కో నగరాన్ని హిట్లరు పట్టుకుంటాడని కమ్యూనిస్టుల చెవుల్లో పడేలాగా శ్రీ కాళేశ్వరరావుగారు గట్టిగా మాట్లాడేవారు.

"లండను బెర్లిను, మాస్కోలు-ఏవి నాశనమైతే నాకేం? ప్రపంచానికి ఢిల్లీ ముఖ్య పట్టణం కావాలి" అని ఒక నాయకాగ్రణి తన దివ్యమైన దేశభక్తిని వెల్లడించారు.

"కాకసస్ కొండలు దాటాడా, సరాసరి మనదేశానికి వస్తాడు; పెషావరు చేరగానే ముఖ్య రాజకీయపార్టీ

వచ్చు" అన్నారు సాంబమూర్తి గారు. "కాదు, ఆఫీసులో కలుసుకోండి" "నాకు వారితో పనేమీ లేదే! వారికి నాతో పనివుంటే నాగదిలో కలుసుకోవచ్చు"నని చెప్పాను. అందరం సంతోషించాము. మరునాడు గవర్నరు మే మున్న చోటికి వచ్చినప్పుడు ఎవరిగదిలో వారు వుండాలని తీర్మానించుకున్నాము.

అయిన కాంగ్రెసు నాయకులను పిలిపించి హిట్లరు "ఆంగ్లేయులకు మాకూ విరోధాలున్నాయి. మీకు మాకు ఎల్లప్పుడు సఖ్యం వుంటూవచ్చింది; ఇకమీదటకూడా వుంటుంది. ఇంగ్లీషువారిని మీ దేశాన్నుండి పారదోలాము. ఇక మీ దేశాన్ని మీరు సుఖంగా పరిపాలించుకోండి అని కాంగ్రెసుపార్టీతో సం చేసుకొని వెళ్ళిపోతాడని" బహిరంగంగా కాంగ్రెసువారు చర్చించేవారు. కాంగ్రెసులో ఎవరైనా సంశయంగా మాట్లాడితే "ఎందుకండీ మీ కీ సంశయం? మరోవిధంగా జరగటానికి ఎలా సాధ్యపడుతుందో చెప్పండి?" అని దబాయించేవారు.

కాంగ్రెసువాదుల కమ్యూనిస్టులమధ్య చర్చ జరిగినప్పుడు శ్రీ కాళేశ్వరరావుగారు "ఇది ప్రపంచయుద్ధం కావచ్చు; ఇందులో రెండుపార్టీలుమాత్రమే వుండవచ్చు. కాని ఇండియాకు సంబంధించినంతవరకూ మన శత్రువు బ్రిటన్. బ్రిటను శత్రువులైన జర్మనీ, జపాను, ఇటలీలు మన మిత్రులు. బ్రిటనుతో కలసిపోయిన అమెరికా, రషియాలు ఇండియాకు శత్రువులే"నని ఖండితంగా, తేటతెల్లంగా చెప్పారు. కాంగ్రెసువా రందరికీ యీ విశదీకరణ నచ్చింది; అయితే కమ్యూనిస్టులకు నచ్చలేదు. "మరి చైనా గతి ఏమి"టని గాంధీ నెహ్రూలతో ఏకీభవించరా?" అని మరికొందరు ఆక్షేపిస్తూ మాట్లాడారు. కాని, కాళేశ్వరరావుగారికి అవి ఎంతమాత్రం

అడ్డురాలేదు. "ఈ పుక్కిరిటి పురాణాలన్నీ కట్టిపెట్టండి" డన్నారు.

ఫాసిస్టుల జయం కోరడంతోను, సోషలిస్టురష్యా ఎంత త్వరగా, ఎంత సులభంగా ఓడితే అంత త్వరగా ఇండియాకు స్వరాజ్యం వస్తుం దనుకోవడంతోను కాంగ్రెసు కమ్యూనిస్టుపార్టీలకు ద్వేషాలు ఏర్పడ్డాయి. షుమారు 150 సంవత్సరాలకాలం మనదేశాన్ని నాశనం చేసిన బ్రిటీషు గవర్నమెంటును భారతీయులు నాశనం చేయుటకు బదులు శత్రువైన బ్రిటన్‌తో కలసిన రష్యా జయాన్ని కాంక్షించుతున్న భారతకమ్యూనిస్టులను కాంగ్రెసు దేశభక్తులు అసహ్యించుకొన్నారు; అంతే కాదు. దేశద్రోహులని తిట్టి నారంభించారు. అప్పటినుండి ఈ రెండు పార్టీలకు పొత్తు కుదరలేదు.

సమిష్టిజీవితము - కాంగ్రెసు నాయకులు

ప్రథమంలో జైలుకువచ్చిన కమ్యూనిస్టు ఫార్వర్డు బ్లాకు డెటినూ్యలు కలసి ఒక "కమ్యూను" స్థాపించారు. ఎవరి కే ఆహారపదార్థాలు తమ యిండ్లనుండి వచ్చినా (పండ్లు, మిఠాయిలు, పచ్చళ్ళు, అప్పడాలు వగైరా) కమ్యూనుకు యిచ్చేవారు. అందరూ కలసి సమిష్టిగా అనుభవించడమనే పద్ధతి ఏర్పాటు చేశారు. అలాగే చాల కాలం చాలా బాగా జరిగిపోతూవచ్చింది. అయితే, కాంగ్రెసు నాయకులకు ఈ పద్ధతి నచ్చలేదు. వారేమో

వ్యక్తిగతంగాను, వారిలోవారు చిన్నచిన్న ముఠాలుగాను వుంటూ వచ్చారు. కమ్యూనిస్టులు తమ పద్ధతిని మానలేదు. ఈ పరస్పర భేదాలు పెరిగిపోయాయి. అందరం కలసి భోజనంచేసే సమయంలో ముఠాలవారీగా జరగడం ముఖ్యంగా విద్యార్థులైన యువకులకు నచ్చలేదు; వారు అల్లరి ప్రారంభించారు.

యువకుల అల్లరి పడలేక కాంగ్రెసు వృద్ధ నాయకులు తమతమ గదులలో ముఠాలవారీగా భోజనం చేయనారంభించారు.

యువక దేశభక్తుల మనోభావాలను, దృక్పథాలను వారి త్యాగాలను వృద్ధనాయకులు గ్రహించలేకపోయారు. ఉమ్మడిగా కమ్యూనిస్టులు జీవించడమనేది నన్ను బాగా ఆకర్షించింది. కమ్యునిస్టు యువకులు నన్ను కమ్యూనిస్టుగా మార్చగల్గుటకు ముఖ్యకారణం యిదే.

అనేకవేల సంవత్సరాలుగా మనలో పాదుకుపోయిన సహపంక్తి భోజన నిషేధాన్ని రూపుమాపి, అందరం మానవులమే నన్న ఉన్నతభావాన్ని కలిగించుటకు జైలు జీవితం బాగా ఉపయోగపడింది.

అయితే మాంసాహారానికి అలవాటుపడని వారికి సహపంక్తి భోజనం చాల కష్టమైన పని. అందువల్ల మాంసంవున్న సమయాల్లో ముందుగా శాఖాహారులు భోంచేసిన తరువాత "మాంసాహారులకు భోజనం పెడు

తుండేవారం. ఇందుకు జనాబ్ అబ్దుల్ రహీమాస్ యం. యల్. ఏ. గారొక్కరుమాత్రం ఆక్షేపించుతూ వుండే వారు. వారికి సమాధానం చెప్పడం ఎవరికీ సాధ్యం కాలేదు. వంటపాత్రలు నైతం శాఖాహారులకు, మాంసాహారులకు వేరుచేశాము. కమ్యూనిస్టులలో చాలమంది శాఖాహారులున్నారు.

కాళేశ్వరరావుగారి లేఖ

జైలునుండి విడుదలై వచ్చిన తరువాత మహాత్మా గాంధీగారికి శ్రీ కాళేశ్వరరావుగారు ఒక ఉత్తరం వ్రాశారు. దానిలో కమ్యూనిస్టులు కాగానే శాకాహారులు మాంసాహారులుగా మారిపోతున్నారనీ, వేల ఏండ్లుగా వుండిన సాంప్రదాయాన్ని మానేశారనీ ఒక బ్రాహ్మణ యం. ఏ. గారినీ, ఒక వైశ్య బి. ఎస్సి. గారిని ఉదహరించారు. కమ్యూనిస్టు డెటన్యూలలో ఇద్దరు ముగ్గురు బ్రాహ్మణ ఎం. ఏ. లు వున్నారుగాని, అందరూ శాకాహారులే. వైశ్య బి. యస్ సి నే నొక్కడినే. నేను మాంసం తిననేలేదు; అందరికీ బాగా తెలుసు. శ్రీ కాళేశ్వరరావుగారు పచ్చి అబద్ధం ఎందుకు వ్రాశారో ఇంత వరకూ నాకు అర్థం కావడంలేదు. కమ్యూనిస్టు కాగానే రాక్షసుడుగా మారిపోతాడనే అభిప్రాయాన్ని గాంధీగారికి కలుగజేయడానికి అలా వ్రాసి యుండవచ్చును. బహుశా ఆ వుత్తరం రహస్యంగానే వుంటుందని అనుకొన్నారేమో!

కాంగ్రెసు యువకులు కమ్యూనిస్టులయ్యారు

జైల్లో గడచిన రెండు సంవత్సరాలలో బయట లాగే లోపలకూడా ఒక ప్రాత కొత్తలయుగసంధిగా వున్నది. యువకులు, వృద్ధులు ఒకరి కొకరు దూరమయి పోతూ వచ్చారు. సుమారు 150 మంది కాంగ్రెసు యువకులు తమ నాయకుల యెదుటనే కమ్యూనిస్టులుగా మారి పోయారు. విడుదలకాగానే రాష్ట్రమంతటా ప్రతి జిల్లాలోను తాలూకాలోను కమిటీలను స్థాపించారు. కమ్యూనిస్టుల, కాంగ్రెసువాదుల విభజన అప్పటినుండి స్థిరపడి పోతూవచ్చింది.

జీవితము చాల కష్టమైనది. భోజనాలు, బట్టలు, పుస్తకాలు, వార్తాపత్రికలు కావలసినన్ని వున్నా, మానసికంగా చాల బాధ కలుగుతుంది. జీవితంలో మార్పు వుండదు. రోజూ ఒకే మాదిరిగా వుంటుంది. విసుగు పుడుతుంది. దానితో మానసిక వ్యాధులు కలుగుతాయి. ఘాటే రక్తపుపోటు (Biood Pressure) వ్యాధితో ఎన్నో సార్లు చావుకు సిద్ధమయ్యాను. అల్లూరి సత్యనారాయణరాజు గారికి మూర్ఛవ్యాధి వచ్చింది. అతని బాధ భయంకరంగా వుండేది; అలాగే గారపాటి సత్యనారాయణగారికిన్ని ఆ వ్యాధి సోకింది. విడుదలకాగానే వారందరికీ స్వస్థత చిక్కింది.

అల్లామా మష్రూఖీ (అఖిల భారత ఖాకార్, నాయకుడు) అబ్దుల్ రహిమాన్ (ఎం ఎల్. ఏ.) కూకు నాకూ అనవసరంగా కోపాలు వచ్చేవి. నిష్కారణంగా తగవులాడేవాళ్ళం. మేము ముగ్గురము పిచ్చివాళ్ళ మవు తామని అనుకునేవారు. చివరకు అల్లామాగారు సగం పిచ్చి వాడైనాడు. "ఆ చెట్టుమీద నా భార్య కూర్చుని రమ్మని పిలుస్తున్నది. మీకు కనపడుతున్నాదా?" అని అడిగే వాడు. రెండు సంవత్సరాలక్రితం జైలుకు వచ్చినప్పుడు జైలు ఆఫీసర్లు ఆయన దగ్గరకు రావడానికే భయపడేవారు. విడుదల కాగానే మేము ముగ్గురము బాగుపడ్డాము.

విడుదల అయిన కొన్ని మాసాలకు అబ్దుల్ రహిమాను హఠాత్తుగా ఒక ప్రదర్శనంలో కనపడి కొగలించుకొని నవ్వసాగాడు. "మనమిద్దరం జైల్లో కోడివుంజులాగా పోట్లాడుకొనే వాళ్ళం కదా? ఆ విషయం జ్ఞాపకం వచ్చినప్పుడు సిగ్గువేస్తూ ఉంటుంది" అన్నాడు. నాకుకూడా అలాగే సిగ్గువేస్తూవున్నది. మన యిండ్లలో స్త్రీలు అనవసరంగా పోట్లాడుకొనుటకు కారణం అర్థమయింది. విసుగు జీవితమే అందుకు కారణము.

అలాంటి బాధలు లేనివాళ్ళుకూడా వున్నారు. మద్దూరి అన్నపూర్ణయ్యగారు, సాంబమూర్తిగారు, యం. ఆర్. వెంకట్రామన్‌గారు ఆహారం అధికంగా తీసుకొనే వారు. ఎంతైనా జీర్ణించుకొనేవారు; ఎన్ని రోజులైనా నిరశనవ్రతం చేసేవారు. అలాంటి శరీరదార్ఢ్యం కలవారు

అరుదు. జైలులో విసుగూ విరామం లేకుండా జీవించగల వారు అదృష్టవంతులు. సంగీత సాహిత్యాలు, చిత్రలేఖనము, ఆట పాటలు, నాటకాలయందు అభిరుచిగలవారికి అంతగా విసుగుండదు. ఏ. యస్. కె. అయ్యంగారు, యం. ఆర్. వెంకట్రామన్, డాక్టరు కుప్పా వెంకట్రామశాస్త్రి గారు ఎప్పుడూ సంతోషంగా వుండేవారు; ఇతరులుసై తము సంతోషంగా వుండేందుకు సహాయపడేవారు. కొందరు గ్రంథాలు వ్రాసేవారు. డాక్టరు పట్టాభి, ఆచార్య రంగా, డాక్టర్ కె బి. కృష్ణగార్లకు రోజుకు 24 గంటలూ చాలేవి కావు.

తారుమారైన ప్రపంచం

మాకు 1942 జూన్‌లో విడుదల అయింది; ప్రపంచ మంతటా యుద్ధం వ్యాపించింది. రెండు పార్టీల బలా బలాలు సరిసమానంగా వున్నాయి. ఎవరు గెలుస్తారో ఎవరు ఓడిపోతారో చెప్పడానికి సాధ్యంకాని సమయము.

విడుదల కాగానే మద్రాసుకువచ్చాము; ముందుగా పెలిగ్రాము యిచ్చివచ్చాము; కాని ఒక్కరూ సెంట్రల్ స్టేషనుకువచ్చి మమ్మలను కలుసుకోలేదు; కుశలప్రశ్న లైనా అడిగేవారు లేరు. దేశంకోసం రెండు సంవత్సరాలు జైలుకు వెళ్ళివస్తే ఆదరించేవారు ఒక్కరైనా లేక పోయారు. ప్రాడ్వేలో కమ్యూనిస్టుపార్టీ ఆఫీసు తాళంచెవి ఎక్కడున్నదో విచారించి. వీధులు తిరిగి తెచ్చుకోవలసిస

గతి పట్టింది. రెండు సంవత్సరాలలో ప్రపంచమంతా తారుమారైనది. బాహ్య ప్రపంచంలో వచ్చిన మార్పులు జైలులోవుండగా మాకు అర్థంకాలేదు.

పరిస్థితులను అర్థంచేసుకోవాలి. అందుకుగాను రాజకీయ మిత్రులను, మిత్రులయిన నాయకులను కలసికొంటిని. వాతావరణం సందిగ్ధంగా వుంది మిత్రుడు ఖాసా సుబ్బారావుగారిని కలుసుకున్నాను. కుశలప్రశ్న లడుగుటకు బదులు "మిమ్మల్ని ఎందులకు విడుదలచేశారు? కమ్యూనిస్టులు బ్రిటిష్ గవర్నమెంటుకు ఏమని మాటయిచ్చారు? లేకపోతే, ఈ సమయంలో మిమ్మలను ఎందుకు విడుదల చెయ్యాలి?" అని పతిమాటలో, ప్రతి చూపులో సందేహాన్ని, తిరస్కారభావాన్ని చూపారు. మేము దేశద్రోహులమనే భావాన్ని కనపరిచారు. ఈవిధంగా ఎవరైనా ప్రశ్నించుతారని తలచనేలేదు; నిశ్ఖాంతపోతిని.

"మేము గవర్నమెంటు కేమీ మాట యివ్వలేదే!" అన్నాను.

"మీరు వ్యక్తిగతంగా యివ్వకపోతేనేం? మీ పార్టి ఇచ్చి వుంటుంది?" అన్నారు సుబ్బారావుగారు.

"ఆ సంగతి నాకు తెలియదులే, ఏమని ఇచ్చివుంటారని మీ ఊహ?" అని అడిగాను.

"కాంగ్రెసుతో పోట్లాడుతామని, యుద్ధంలో బ్రిటిష్ గవర్నమెంటుకు సహాయం చేస్తామని. జపానును ఎదిరించుతామని మాట ఇచ్చి వుంటారు." అని వారి వాదన.

నేనిలా చెప్పాను:— "కమ్యూనిస్టుపాలసీ నాకు తెలుసు. అందుకు నాయకుడిని కావలసిన అవసరం లేదు. కాంగ్రెసుతో పోట్లాడము. కాంగ్రెసు లీగుల ఐక్యతకొరకు ప్రయత్నించుతాము. బ్రిటిష్ సామ్రాజ్యానికి సహాయం చెయ్యము; ఇండియాకు స్వాతంత్ర్యం యిస్తామని సరిగా దోవకువస్తే, వారితో చేతులు కలుపుతాము; జపానును మాత్రం ఎదిరిస్తాము. వారిని ఇండియాలో కాలుపెట్ట నివ్వము; పెట్టినచో ఆక్రమించిన ప్రదేశాలలో వారిని నాశనం చేయడానికి ప్రయత్నిస్తాము."

బ్రిటిష్ గవర్నమెంటుకు సహాయం చెయ్యకుండా. జపాను నెలా యెదిరించగల"రని అడిగారు.

కమ్యూనిస్టుల యెడల దేశంలో ప్రబలిన అపోహ సుబ్బారావుగారి సంభాషణవలన స్పష్టమవుతోంది.

బ్రిటిష్ వ్యతిరేకత - ఫాసిస్టు అనుకూలత

ఒక విషయం బాగా బోధపడింది; బ్రిటిష్ప్రభుత్వం మీద సహజంగా వుండే ద్వేషభావం జపాను ఫాసిజానికి అనుకూల వాతావరణాన్ని కలుగజేస్తూవచ్చింది. జపాను సైనికులు మద్రాసు హార్బరుతో దిగివుంటే మన విద్యాధికులైన దేశభక్తులు పూలదండలువేసిస్వాగతమిచ్చియుందురు. తరువాత ఒక రిటైర్డు హైకోర్టు జడ్జిగారిని కలుసుకొన్నాను. ఆయన హిందూమత సాంప్రదాయంతో గాఢాభిమానం

గలవారు; అయితే గాంధీ భక్తుడు; నాకు స్నేహితుడు. "మన దేశంలో రాజకీయసమస్యలు చాల కిష్టమైపోయినయి. బ్రిటిష్‌వాళ్ళే ఇందుకు కారకులు. వారున్నంతకాలము ఈ సమస్యలు పరిష్కారం కాజాలవు, హిందూ ముస్లిం సమస్యను పరిష్కరించడమనేది ఇక వారికి సాధ్యంకాదు; ఏ జపానో యింగ్లీషువాళ్ళను తరిమివేస్తే, ఈ సమస్యలకు పరిష్కారం ఏర్పడవచ్చు. మరొక మార్గం నాకు తోచుటలే"దన్నారు. ఆ హిందూమహాసభ భక్తుడు. ముస్లిము లతో రాజీపడి, స్వతంత్రంగా రాజ్యం చేసుకుందామనే భావమే వీరికి లేదు. కాబట్టి జపాను నాహ్వానించుటకు సిద్ధంగావున్నారు వారూ, వాళ్ళిలాంటి గొప్ప గొప్ప ఉద్యోగస్తులూను.

ప్రముఖ కాంగ్రెసు నాయకుడూ-నాకు మిత్రుడూ అయిన వారినొకరిని కలుసుకొంటిని. వారు యిలాగన్నారు; "జపాను ఇండియాను తప్పకుండా ఆక్రమించుకుంటుంది; అడ్డుపెట్టగల వారులేరు." ఆయన చాలా ఉత్సాహంగా మాట్లాడడం చూచి వారు చెప్పేదంతా చెప్పనిచ్చాను. బ్రిటిషువాళ్ళమీద అమిత ద్వేషము; కాబట్టి బ్రిటిషు వాళ్ళ పాలసీకి ప్రతివిషయంలోను వ్యతిరేకించుతారు. బ్రిటిష్‌సామ్రాజ్యంముస్లింలీగుకు ప్రోత్సాహమిస్తూవచ్చింది; జపానువారు తప్పకుండా కాంగ్రెసుకు సహాయంచేసి, లీగును అణచివేస్తా"రన్నారు. ఈ రాజకీయవేత్త ఒక నిముషం ఆగి, మెల్లగా పరమరహస్యాలను చెప్పనారం

భించారు. "జపాను యుద్ధనావలు మన తూర్పుతీరానికి వస్తూన్నాయట. చాలా దగ్గరకు వచ్చాయట; మన రాష్ట్రంలో దిగుతారు; మన రాష్ట్రం సులభంగా వానికి స్వాధీనమవుతుంది, తాత్కాలిక ప్రభుత్వాన్ని కూడా అప్పుడే జపానువారు తీర్మానించుకొన్నారు;గవర్నరుఎవరో తెలుసా? మనపంతులుగారే" అన్నారు. నాకు ఆశ్చర్యం వేసింది. ఎలాంటి ఆశలు! ఎలాంటి ఆలోచనలు! జపాను వారే మద్రాసులోదిగివుంటే ఎన్నెన్ని బండ్ల పూలదండలు వేసేవారో! జయభేరీలతో ఎంత వైభవంగా ఊరేగించే వారో! మన కవులు ఎన్ని పద్యాలు పాటలూ వ్రాసే వారో! దేవాలయాల్లో ఎన్నిపూజలు జరిగివుండేవో!

జపానువారు మద్రాసుపైని బాంబులు వేస్తారనే భయంతో ప్రజలు మద్రాసు విడిచి పారిపోయారు! సహాం చరాని బాధలు పడ్డారు; మద్రాసునగరంలో ట్రామ్‌లు, బస్సులు ఖాళీగా తిరిగేవి. కాఫీహోటళ్ళను మూసివేశారు. వీధుల్లో ప్రజలే కనిపించేవారుగాదు. అయినప్పటికీ జపాను వారు రావాలి; ఆంగ్లేయులను పారద్రోలాలి; ఎక్కడ విన్నా ఇదే భావం. జపానువారు స్వరాజ్యమిస్తారని అని గ్రుడ్డినమ్మకం. ఇవ్వకపోయినా సరే! ఆ విషయం ఆ తరువాత చూచుకోవచ్చు. ఆంగ్లేయులను మనంతట మనం తరిమివెయ్యలేము. తరిమి వేయుటకు సిద్ధంగావున్న జపాను వాళ్ళకు మనం సహాయం చెయ్యాలి; చెయ్యలేకపోతే శనీసం అడ్డుపడకూడదు. అలా అడ్డంవచ్చే కమ్యూనిష్టులు

దేశద్రోహులు అని మధ్య తరగతి దేశభక్తుల మనోభావం. ఈ మనోభావమే బీదప్రజానీకానికికూడా ప్రాకిపోయింది.

ఇలాంటి వాతావరణంలో జపాను ఫాసిజాన్ని గురించి ఆలోచించేవారే లేరు. చైనాకు పట్టిన గతిని జ్ఞాపకం చేసుకొనేవారే లేరు. గాంధీ, నెహ్రూల అభిప్రాయాలను ఆలకించేవారేలేరు. కమ్యూనిష్టులని స్పష్టంగా తెలిస్తే తన్నడానికి కూడా సిద్ధంగా ఉన్నారు.

కాంగ్రెసు నాయకుని కలలు:

విడుదలకు ముందు జపానువారు సింగపూరును సమీపించే కాలంలో ఒక ఆంధ్ర కాంగ్రెసు నాయకుడు ఇలాగన్నాడు;"జపానువారు ఆంధ్రదేశంలో ప్రవేశించితే, మన కిసానులు ఎలా ప్రవర్తించాలో, రక్షించాలో మనం బోధించాలా? వారు రామాయణాలు, మహాభారతాలు చదివి ఆరితేరారు. సమయస్ఫూర్తిగా ప్రవర్తించగలరు. మన నాయకులున్నారే, మంచి లోక పరిజ్ఞానం కలవారు. జపానువారు, ఇంగ్లీషువారిలాంటివారు కాదు. మనఅన్నం తింటారు! అన్నంలో పెరుగూ, ఆవకాయ వేసి పెడితే జపానువాళ్ళు మన భాయి భాయీ అవుతారు! కావాలంటే చేపలుకూడా లభించుతాయి! జపానువారికి చేపలంటే మహా యిష్టం, ఆంధ్ర నాయకులు గట్టివాళ్ళు; మన మేమీ భయపడనక్కరలేదు. వారు నాయకులకు కూడా నేర్పగలరు! వారి లోకజ్ఞానానికి వదలి పెట్టడం మంచి" దని

గుక్క తిప్పుకుండా ఉత్సాహంతో మాట్లాడి ఎంతో అనందంతోనవ్వారు. దేశభక్తిలోఎన్నిరకాలున్నాయి!స్వరాజ్య సమస్యను గూర్చి మాట్లాడేవారే లేరు. జపాను మన దేశాన్ని ఆక్రమించుకొన్న తరువాత, మనగతి ఏమవుతుందాఅని ఆలోచనే లేదు,

"ఆగస్టు 9 తేదీ విప్లవం"తో కమ్యూనిస్టులు "రష్యాభక్తు"లనీ "మాస్కో డబ్బు తింటున్నా"రనీ అనడమే కాదు. "దేశద్రోహులు" అనే ముద్ర పడిపోయింది. అయితే కమ్యూనిస్టులు ఊరికే వుండలేదు. కరపత్రాలను పంచిపెట్టాము: చిన్న చిన్న పుస్తకాలను వార్తాపత్రికలను అమ్మాము. అక్కడక్కడ తిట్లు తిన్నాము. కొందరికి దెబ్బలుకూడా పడ్డాయి నోరు తెరచి గట్టిగా వాదించటం సాధ్యంకాలేదు.

కమ్యూనిస్టు వ్యతిరేకత

జపానుతో యుద్ధం చేయడానికి సిద్ధపడినా కమ్యూనిస్టులను బ్రిటిషు గవర్నమెంటు నమ్మలేదు. కమ్యూనిస్టులను సైన్యంలోగాని వైమానిక దళంలోగాని, నేవిలోగాని చేర్చుకోలేదు. "కమ్యూనిస్టు లెవరో మాకు మాకు తెలుసు! ఫాసిజాన్ని, ఇంపీరియలిజాన్ని, రెంటినీ నాశనం చేస్తారు. సైన్యంలోచేర్తారు, బోధచేసి, సైన్యాన్ని తమవైపుకు మార్చుకుంటారు. ఇవాళ జపానును ఓడిస్తారు; రేపు ఆ తుపాకులతోటే బ్రిటిషువాళ్ళను కాల్చేస్తారు.

వారిని నమ్మకూడదు: జపానువాళ్ళకు చేతనయితే మమ్మల్ని తరిమివెయ్యవచ్చును. చేతనయితే ఇండియాను పాలించుకోవచ్చును, మేము మాత్రం కమ్యూనిస్టులను, కాంగ్రెసువారిని నమ్మము: తుపాకులను వారి చేతుల్లో పెట్టమని ఆంగ్లేయులు వాదించేవారు.

వాస్తవమే, కమ్యూనిస్టు కత్తికి రెండువైపులా పదునే! ఆంగ్ల సామ్రాజ్యవాదులు దేశంలోని వివిధ రాజకీయ శక్తులను, రాజకీయ వాతావరణాన్ని అర్థం చేసుకొన్నారు. మా విషయంలో జాగ్రత్త పడుతూ వచ్చారు. కాని, మమ్మల్ని కాంగ్రెసు నాయకులు మాత్రం అర్థం చేసుకోలేదు. కమ్యూనిస్టులను దేశద్రోహులనే భావించారు.

యుద్ధకాలంలో ప్రతి దేశంలోను కమ్యూనిస్టులు దేశభక్తులుగా ప్రవర్తించారని అన్ని పార్టీలవారు అన్ని దేశాల్లోను ఒప్పుకున్నారు. జపానుతో పోట్లాడుటకు ఆయుధాల నివ్వమని కమ్యూనిస్టులు కోరినప్పుడు ఇంగ్లీషువారు యివ్వలేదు. జపానువారు ఆక్రమించుకొన్న ప్రదేశాలలో వారితో పోట్లాడుటకు మాత్రమే ఆయుధాల నిస్తామన్నారు; ఆయుధాలను దాచిపెట్టిన రహస్యస్థలాలను అప్పుడుమాత్రమే చెప్పుతామన్నారు ఇంగ్లీషు ప్రభుత్వంవారు.

ఏమి వాతావరణం! రెండు పార్టీలవారికి కమ్యూనిస్టుల సహాయం కావాలి. కాని, ఒకరూ కమ్యూనిస్టుల

షరతులను ఒప్పుకోరు స్వరాజ్య స్థాపనకు వుపయోగపడని ఆలోచనలతో ఏం ప్రయోజనం?

కాంగ్రెసు, సోషలిస్టు, ఫార్వర్డ్‌బ్లాకు, కమ్యూనిస్టుల పంథాలు వేరువేరుగా వుంటూవచ్చాయి; అయితే, అందరి ఉద్దేశ్యము ఒకటే- సంపూర్ణ స్వరాజ్యం. ఏ పార్టీకాని మరొకపార్టీకి నచ్చచెప్పలేకపోయింది, కమ్యూనిస్టుల పంథా మిగిలిన పార్టీలవారికి అయోమయంగా వుంది. అందరూ దేశభక్తులే! అందరికీ శత్రువులు బ్రిటిషు సామ్రాజ్యవాదులే. అందరూ కలసి శత్రువు నెదరించ కూడదా? అంత దూరదృష్టి, అంత విశాల దృష్టి లేవు. దేశభక్తులు తమ మనోరథాన్ని యీడేర్చుకొనుటకు వున్న చక్కని అవకాశాన్ని కాల్దన్నుతూ పచ్చారు.

1942 ఆగస్టుఎనిమిదవ తేదీన చేయబడిన కాంగ్రెసు తీర్మానంతో ప్రజలలో గందరగోళం, అయోమయం ఏర్పడింది. శ్రీ ఖాసా సుబ్బారావుగారు సంశయించినట్లు కమ్యూనిస్టులు తెల్లదొరలకు యేమాట యివ్వలేదు. ఆ క్లిష్టయులు తలచినరీతిగా కమ్యూనిస్టుల సహాయం లభించలేదు. మన దేశభక్తి భావాలు సంకుచితంగా ఉన్నందువల్ల మనసోదరులే మనకు శత్రువులయ్యారు. లక్షలకొలది భారతీయులు ఆహుతి అయ్యారు. మన రాజకీయోద్యమాల అపరిపక్వత తెల్లదొరలకు అదృష్టంగా పరిణమించింది.

అతి క్లిష్ట సమస్యలు

1942లో విడుదలయి బయటవున్న మూడునాలుగు సంవత్సరాలలో జాతీయ సమస్యా పరంపరకు అంతంలేదు. వాటిలో కొన్ని చాల కిష్టమైనవి. వాటిని అర్థంచేసుకోవడం కష్టంగా వుండేది. సామాన్య పరిజ్ఞానంతోను, సామాన్యదృష్టితోను పరిష్కరించడానికి అసాధ్యంగా వుండేవి. కాని, కొన్ని ముఖ్య సమస్యలను సూటిగా అర్థం చేసుకోవడం సులభమే; అయినా, అన్య విషయాలతో కలిపినందువల్ల సూటిగా అరం జేసుకోలేకపోయాము. నా వుద్దేశ్యంలో ప్రజలు అర్థంచేసుకోజాలని సమస్యలు ఇవి:—

1. జపాను, జర్మనీల ఫాసిజమే జయించితే ఇండియాకు స్వాతంత్ర్యం వస్తుందా?

2 రష్యా, అమెరికాలు జయిస్తే బ్రిటను జయించినట్లే కదా! ఆజయంతో బ్రిటను ఇంకా బలపడుతుంది కదా! అప్పుడు మన స్వాతంత్రోద్యమానికి భంగంకలుగదా?

3. కాంగ్రెసు లీగుల ఐక్యత లేకుండా సంపూర్ణ స్వరాజ్యం సంపాదించగలమా?

4 సంపూర్ణ స్వరాజ్య సంపాదనకు అహింసావ్రతము అడ్డు వస్తుందా? రాదా?

5. పాకిస్తాను ప్రదేశాలలో నివసించే ప్రజలకు వయోజన ఓటింగుహక్కు యిచ్చి, స్వయంనిర్ణయ ప్రకారం పాకిస్తానును నిర్మించుకోనియ్యవచ్చునా? కూడదా?

6. రాజ్యాంగ నిర్మాణసభ ప్రతినిధులను ఎన్నుకొనుటకు వయోజన ఓటింగు అవసరమా లేదా?

7. మతసంస్థ అయిన లీగు కూలినాలి జనానికి చేస్తానే ఆర్థిక సౌకర్యాలకన్న, కాంగ్రెసు ఎక్కువగా చేస్తానన్న ఆర్థిక సౌకర్యాలేవి?

ఇలాంటి సమస్యలను పరిష్కరించుకోజాలక ప్రజలు చాల తికమకలుపడుతూ వచ్చారు. నాకుకూడా తలనొప్పి కలుగుతూండేది. కమ్యూనిస్టుల పరిష్కార పథకం అర్థమవుతున్నది; కాని, నేను ప్రజలను, స్నేహితులనూ ఒప్పించలేకపోయాను.

అయితే మరోరకం ప్రశ్నలను సూటిగా అర్థం చేసుకోవచ్చు; అప్పట్లో ఆ వాతావరణంలో సూటి అనే మాటేలేదు ఎచ్చటచూసినా పక్షపాతమే; కొన్ని సమస్యలను ఉదహరిస్తాను.

(1) బెంగాలులో క్షామంవల్ల చచ్చిపోతున్న లక్షల జనానికి సహాయంచేస్తే స్వరాజ్యంరాదనే విద్యాధికులు చాలామంది వున్నారు: వస్తుందనేవారే చాల తక్కువమంది.

(2) బియ్యం, కట్టెలు, కిరసనాయిల్ జనసామాన్యానికి లభించేందుకు రేషనింగు పెట్టవలసిందని ప్రయత్నించడంవల్ల స్వరాజ్యంరాదనీ, ఆ ప్రయత్నం దేశద్రోహకర

మనీ వాదించిన దేశభక్తుల సంఖ్య ఎక్కువ; అలా కాదనే బీదప్రజల సంఖ్య అధికం.

(3) కంట్రోళ్ళు అధికం చెయ్యడం ప్రజాసామాన్యానికి అనుకూలమా? ప్రతికూలమా! అనే విషయాన్ని దేశభక్తులు తమతమ వర్గ దృక్పథాల్లో అర్థం చేసుకోగలిగారే గాని అందరం మానవులమనే భావం లేకపోయింది.

(4) బియ్యం, బట్టలు, నూలుదొంగ మార్కెట్టులో అమ్మే దోపిడిగాండ్రను దేశభక్తులనీ, వారిని శిక్షించకూడదనీ వాదించిన దేశభక్తులు, నాయకులుఎందరో ఉన్నారు.

(5) జీవితావసర వస్తువుల వెలలు ఎంత పెరుగుతున్నవో ఆ దామాషా ప్రకారం కూలి అధికం చెయ్యాలని వాదించడమే దేశద్రోహమని ఎందరో భావించారు.

(6) చౌకగా మిల్లుగుడ్డనైనా కొనలేని బీదప్రజలు ఖద్దరు కొనజాలరనీ, మిల్లుల నెక్కువగా స్థాపించి బట్టల ఉత్పత్తి నెక్కువ చెయ్యవలసిందనే వాదన దేశద్రోహమా?

పైన ప్రాసిన సమస్య లన్నిటి విషయంలోను కమ్యూనిస్టుల పరిష్కార పథకమే నాకు నచ్చినందున యథాశక్తిని బీదప్రజల సేవచేశాను.

ఆకాలంలో స్వయం నిర్ణయ సూత్రాన్ని గాంధీగారు ఒప్పుకున్నా కాంగ్రెసు ప్రజానీకం ఒప్పుకునేట్టు లేదు. వారు హింసామహాసభ సభ్యులవలె వాదించారు.

"ముసల్మానులు దేశభక్తులుకారు. వారు పదికోట్లుఅయితే మనం ముప్పయికోట్లు. వారికి బుద్ధివచ్చి దాసోహంఅనేలా చెయ్యాలి" అనేవారు.

ఎలా వారితో యుద్ధం చెయ్యడం? బ్రిటిష్‌వారి 'విభజించి పాలించా'లనే విధానం బలపడదా? చివరకు బ్రిటిష్‌వారు మాత్రమే బాగుపడుతారుకదా! అనే యోచనే మనసుకు తోచడంలేదు. కొందరు అమాయకులు యిద్దరితోను పోట్లాడుదామనేవారు.

గాంధీగారి నిరశనవ్రత కాలంలో మహమ్మదీయులలో ప్రచారం చేశాను. గాంధీగారు జీవించాలని ముసల్మానులలో ఎంతో ప్రేమ, గౌరవాలు వున్నాయి "పాకిస్తాను కోరికలను గాంధీగారు సమ్మతించితే ఎంత బాగుండును? హిందువులతోకలసి అంగ్రేజీలను నాశనం చెయ్యమా!" అన్నారు కొందరు, "హిందువులమీద రాజ్యం చెయ్యాలని మేము కోరడంలేదే! మామీద రాజ్యం చెయ్యాలని హిందువులు కోరడం అన్యాయం కాదా?" అని ప్రశ్నించారు మరికొందరు ముసల్మానులు.

స్వయంనిర్ణయసూత్రం మంచిదని నేను వాదించే వాణ్ణి. నాస్నేహితురాలు సోదరి శివభోగం "చెంచయ్యా! ముస్లింలీగుకు ఎప్పుడు చేరావు?" అని నన్ను హేళన చేసింది. శాస్త్రి అండ్ పా కంపెనీలోని శాస్త్రిగారు

ఇంకా తీవ్రంగాఖండించారు. ఇలాంటి ప్రచారం దేశాన్ని నాశనం చేస్తుంది; మాస్కోనుండి డబ్బు వస్తుందంటారే, నిజంకాదంటారా?" అని హేళనకు దిగారు.

క్షమంతో స్వరాజ్యం

కొందరు ధనాఢ్యులూ, దొంగమార్కెట్ దారులూ బెంగాలులో ఒక క్షామాన్ని కల్పించి, 35 లక్షలమంది ప్రజలను చంపారు. అలా నిత్యమూ ప్రజలు చచ్చిపోయే రోజుల్లో కొందరు దేశభక్తులు సూటిగా ఆలోచించుటకు బదులు యిలాగన్నారు- "40 కోట్ల ప్రజలున్నారు. అందులో కొందరు చస్తేనేమి? ఆవిధంగానైనా ప్రజలు కోపంతో రెచ్చిపోతారు; లూటీలు చేస్తారు; పోలీసు స్టేషన్లను తగులబెడతారు. ఈ విధంగా స్వరాజ్యం వస్తుంది! త్యాగం చేయకుండా, ప్రజలు చావకుండా స్వరాజ్యం వస్తుందా?" అని దేశభక్తిని పెడత్రోవ పట్టించారు.

మరికొందరు మహానుభావుల మనుకోనేవారు, "విత్తనం నాటితే నేలలో కుళ్ళిపోయిన తరువాతనే మొక్కగా పెరుగుతుంది. అలాగే సంఘంలో వచ్చే కల్లోలాలతో, క్షామాలతో దేశానికి స్వరాజ్యం ప్రాప్తిస్తుం" దని విశదీకరించారు. ఇదీ వారి దేశభక్తి!

ప్రజలు చస్తేనా స్వరాజ్యం వచ్చేది? లేక సామ్రాజ్యవాదులు నశించితేనా? ప్రజలు క్షామాలతో చస్తే స్వరాజ్యం రాదు! స్వతంత్రోద్యమాన్ని నిర్మాణ

యుక్తంగా త్యాగంతో సాగిస్తే స్వరాజ్యం వస్తుంది. ఆ రోజులలో గుడ్డిద్వేషం ఎంత పెరిగిపోయింది! యుద్ధ కాలంలో ఎందరో రాక్షసులవుతారు! తత్ఫలితమే మనం (1947_48-49సం లలో) అనుభవించాము. రాక్షసత్వమనే విత్తనం నాటాము! ఇక రామరాజ్యం యెలా వస్తుంది?

కట్టలు, కిరసనాయిలు, బియ్యం లభించక బీద ప్రజలు నానాబాధలు పడుతున్నారు. రేషనింగు వుంటేనే లభించడం, లేకపోతే లభించవని, మధ్యతరగతివారు కూడ అనుభవంమీద తెలుసుకున్నారు. అయితే రేషనింగు కోసం ప్రయత్నించినది కమ్యూనిస్టులు మాత్రమే. ఊరేగింపులతో, సభలద్వారా ప్రచారం చేసి, ప్రభుత్వంపైని ఒత్తిడి తెచ్చారు. కార్మిక సంఘాలు బాగా పనిచేశాయి. చివరకు మద్రాసు కార్పొరేషన్ హాలులో గొప్ప సభ జరిగింది. కాంగ్రెసు నాయకుల తరఫున మాట్లాడుతూ శ్రీ చంగల్వరాయన్ రేషనింగు అవసరంలేదని వాదించారు. మేయరు శ్రీ తాండవలింగం పిళ్ళైగారు భాగ్యవంతులు అలవాటుపడిన మంచిరకం బియ్యం రేషనింగు మూలంగా లభించవు; కాబట్టి రేషనింగు పనికిరాదన్నారు. చివరకు పరప్రభుత్వమే రేషనింగు పెట్టి బీదల, మధ్యతరగతి వారల కష్టాలు తొలగించుటకు కొంతైనా ప్రయత్నించారు.

ఫార్వర్డుబ్లాకువారూ, సోషలిస్టులూ మరో విధంగా వాదించారు. "కట్టల రేషనింగు కావాలట! ప్రజలు

రూపాల్లో ఉంటుంది. వాస్తవమైన మతభక్తులు కూడా సూళ్ళు, ఆసుపత్రులు, అనాధ శరణాలయాలు స్థాపించి సేవ చేస్తూవుంటారు. ఇలాంటి భూతదయ కొంచెమో గొప్పో నాలో ఉండటంవల్లనే మానవ కళ్యాణం కొరకు స్వరాజ్యం కావాలనే రోజుల్లో ఈ కమ్యూనిస్టు దేశ ద్రోహులు చిల్లర విషయాలతో దృష్టిని మరల్చుతున్నారు. మాస్కో డబ్బు మన దేశాన్ని నాశనంచేస్తున్న" దంటూ సభలలో తిడుతూండేవారు.

అయితే, ఒక విషయం నాకు బోధపడలేదు. ప్రజలకు కడుపునిండా తిండి, ఒంటినిండా బట్ట వుంటే స్వరాజ్యము కొరకు ప్రయత్నించరనీ, అది లేక ఈసురోమని ప్రజలు మలమల మాడిపోతూంటేనే స్వరాజ్యంకోసం పోరాడుతారనీ అనడం అవివేకం గాక మరేమిటి? ప్రపంచ విప్లవానికి ముందు రైతులకు కొద్దిగా భూములు లభించాయి. ఈ అనుభవమే పూర్తిగా భూములను భూస్వాముల నుండి సంపాదించుకోవాలనే కోరికను పుట్టించింది. ప్రపంచ రైతులు తిరుగబడి భూములను పూర్తిగా లాక్కొనే వరకు విప్లవం ఆగలేదు.

ఎందుకు మారాను

దయాదాక్షిణ్యాలు గలవారు పరోపకారం చేస్తారు. ఈ ఉపకారం నంఘసేవగాను, దేశసేవగాను, మానవసేవ పేర్పడిన ఉద్యమాలలో పనిచేస్తూ వచ్చాను.

"కమ్యూనిస్టువు ఎలాగయ్యా" వని ఎందరో స్నేహితులు అడుగుతుంటారు. వారందరికి నన్నుగురించి కొన్ని విషయాలు బాగా తెలుసు. హింసాసిద్ధాంతం నాకు యిష్టం లేదనీ, దేశభక్తి కలవాడ ననీ, త్యాగం చెయ్యగలననీ కమ్యూనిస్టులుకాని, నాస్నేహితులకు తెలుసు.

నేను కమ్యూనిస్టు కావడానికి ముఖ్యకారణం స్త్రీల కష్టాలను తొలగించడానికి ప్రయత్నాలు చేసి, చేసి పూర్తిగా సాధించలేక పోవడం వల్ల కలిగిన అసంతృప్తి; స్త్రీల కష్టాలు ఒక్క సోషలిస్టు రష్యాలో మాత్రమే నశించాయన్న సత్యమే నన్ను కమ్యూనిజంవైపుకు తిప్పింది. 1940-42 సంవత్సరాలలో జైలులో ఉన్న రెండు సంవత్సరాల్లో కమ్యూనిస్టు సిద్ధాంతాలను చదివాను. ఆ సిద్ధాంతాలను చదువుటద్వారా సంఘ నిర్మాణము ఆర్థిక నిర్మాణముకై మారాలంటే వర్గపోరాటం అవసరమనీ గ్రహించాను కాని ఈ సిద్ధాంతమే జీర్ణంకాలేదు.

సిద్ధాంత గ్రంథాలద్వారా మరికొన్ని వివరాలను తెలుసుకున్నాను. అవి ఏవనగా:- సంఘంలో ఆర్థిక పరిస్థితులు మార్పులవలన రాజకీయంగాను సాంఘికంగాను మార్పులు కలుగుతూంటాయనీ, వర్గపోరాటాలు ప్రతి సంఘంలో సర్వదా ఉన్నవనీ చదివాను. రెండు వర్గాలకు స్వప్రయోజనాలు వేర్వేరుగా వుంటాయి. ఈ రెండు వర్గాల మధ్య పోరాటం జరిగినప్పుడు రెండింటి పక్షమూ వహించి రెండింటికీ సహాయం చెయ్యజాలము; ఏ వర్గానికి

చెందియుంటామో ఆ వర్గానికి మాత్రమే సహాయం చేస్తాము; జమీందార్లకూ రైతులకూ పోరాటం వచ్చి వచ్చినప్పుడు, మిల్లు యజమానులకు కూలీలకు పోరాటం జరిగినప్పుడూ ఎవరో ఒకరి పక్షమే వహించగలమని చదివి యుంటిని.

1942-46 సంవత్సరాలలో కార్మిక సంఘాల్లో పని చేయుటకు అవకాశం లభించింది. ఆ విధంగా నా సిద్ధాంతాలను పరీక్షించుటకు కూడా అవకాశం ఏర్పడింది. నేను పనిచేసిన సంఘాలలో కార్మికులు, వారి యజమానులు కాంగ్రెసు భక్తులే; బీడీ పరిశ్రమలో మాత్రం ఇద్దరూ లీగు భక్తులే; 1936-39 సం॥లలో ప్రభుత్వంకూడా కాంగ్రెసు భక్తులదే. ఇందువల్ల కమ్యూనిస్టుల వర్గపోరాట సిద్ధాంతంకో లోపముండివుంటుందని సంశయించుతుండే వాడిని.

1942లో విడుదలయిన తరువాత మద్రాసులో క్రింది కార్మిక సంఘాలలో పనిచేశాను.

1. బీడీ పరిశ్రమ; 10 వేల కార్మికులు
2. చుట్టల పరిశ్రమ; 250 మంది కార్మికులు.
3. కార్పోరేషను (మునిసిపల్) 10 వేల కార్మికులు

ఈ పరిశ్రమల యజమానులు, కార్మికులుకూడ కాంగ్రెసు వారు; లేదా లీగు భక్తులు; 10,000 కార్మికులలో కమ్యూనిస్టు ఒక్కరూ లేరు. పై సంఘాల సమ్మెల సందర్భంలో కాంగ్రెసు కౌన్సిలర్లను కలుసుకొని వారి సహాయంతీసు

వచ్చాను. నాకు కలిగిన అనుభవాలను క్లుప్తంగా
ను.

పేద బీడీకార్మికులు

మద్రాసులో వీరి కుటుంబాలు పదివేలుంటాయి. అనగా సుమారు 50,000 జనసంఖ్య. ఈ పరిశ్రమ ఫ్యాక్టరీలలో నడవదు. ముఖ్యంగా గుడిశెలలోనే చేస్తారు. అందువల్ల కుటుంబములోని వారందరు - భార్య బిడ్డలుసహా దామాషాను ఇంటికి యే ఐదుగురో పనిచేస్తారు; 12 గంటలుకూడా జనిచేస్తూనే వుంటారు. అయినప్పటికీ, రైళ్ళలో, ట్రామ్లలో, మిల్లులలో ఒక కార్మికుడు ఎనిమిది గంటలు పనిచేసి సంపాదించినంత కూలి డబ్బులు పై ఐదుగురికి కలసి లభించదు. ఇందువల్ల మద్రాసులో కూలీలకు కుటీర పరిశ్రమలంటే యిష్టంలేదు. ఫ్యాక్టరీ ఆక్టు బీడీ పరిశ్రమలకు అన్వయింప చేయాలని నేనుచేసిన ప్రయత్నాలు విఫలమైనాయి; అందుకు యజమానులు కాని, ప్రభుత్వంకాని సమ్మతించిలేదు. మద్రాసులో కార్మికులకంటే దరిద్రులు మరొకరుండరు. వారు సాధారణంగా గుడిశెలలో కాపురం చేస్తారు. పల్లపు ప్రదేశాల్లో ఇళ్ళు కట్టుకుంటారు. అద్దెకూడా నామమాత్రమే. వర్షాకాలంలో గుడిశెచుట్టు నీరు నిలుస్తుంది. గుడిశెలకు రోడ్లుండవు. మరుగుదొడ్లుకూడా అసలే ఎక్కడ చూచినా సెంటలే. పందులు మాత్రమే పాకీపని చేస్తుంటాయి; గుడిశెల చుట్టూ రొచ్చు, మురుగూను.

ఈ కూలీలు సాధారణంగా తురకలు ఘూోషా వుంటుంది. 1943 సంవత్సరం ఆఖరులో వచ్చినయి. వారుండే గుడిశెలు కూలిపోయాయి. స్త్రీ పిల్లలు, పురుషులు వీధుల్లోకి వచ్చారు. కుటుంబంలో ఇద్దరు స్త్రీలుంటే, వున్నది సరియైనచీర ఒక్కటే. వీధుల పాలైనప్పుడు స్త్రీలందరికి మానం కాపాడుకోటానికి చీరలు లేవు. అప్పుడు పురుషులు సిగ్గుపడి తమ స్త్రీలమానం కాపాడాలనే ఉద్దేశ్యంతో చాలమంది సైన్యంలో చేరి పోయారు. బీడీ కార్మికులగతి అలాగున్నది.

అయితే వారి యజమానుల స్థితి యెలావుంది? ఈ 10 వేల కుటుంబాలచేత బీడీలు చేయించే కంపెనీ యజమానులు ఘుమారు ఎనిమిదిమంది వుంటారు. ఒక్కొక్కరికి సంవత్సరానికి యాభై వేలనుంచి మూడులక్షలదాకా ఆదాయం వస్తుంది. వారూ ముసలాళ్లనులే. కార్మికులూ, యజమానులూ కూడా లీగుభక్తులే. తమకు లభించే లక్షల ఆదాయాన్ని ఏ ఫకీర్లకో, ఏ బిచ్చగాళ్ళకో, ఏ రాజకీయ నాయకులకో యిస్తారు; కాని, తమ పనివాండ్ర స్త్రీల మానాన్ని కాపాడుటకైనా వస్త్రదానం చెయ్యరు.

బీడీ కార్మికుల సంఘాన్ని కమ్యూనిస్టులము పెట్టాము. వేలమంది చేరారు. కూలి నెక్కువ చేయించాము. కాని, ఆహార వస్తువుల వెలలు పెరిగినంతగా కూలి నెక్కువ చేయించలేకపోయాము.

వీరిలో ఐకమత్యంవుంటే కూలి నెక్కువ చేయించవచ్చు; కాని, ఐకమత్యం లేదు. అందువల్ల వారిలో కొందరిని ఏరి తరిఫీదు చెయ్యాలి. పదివేలమంది కార్మిక సంఘంలో బయటివాళ్ళం ఏ యిద్దరు కమ్యూనిష్టులమో సహాయమేం చెయ్యగలము? కార్మికులలో బాగా చైతన్యం గలవారికి క్లాసులుపెట్టి, తరిఫీదునిచ్చి తమ యూనియనును తామే నిర్వహించుకొనేలాగు చెయ్యాలి. కాని, ఎప్పుడు నేర్పాలి చదువు? 12 గంటలూ పనిచేస్తారు. పగలు వారికి తీరికే వుండదు. రాత్రి 9 గంటలకైతే క్లాసుకు రాగలరు; కాని, అప్పటికి అలసిపోయి ఉంటారు. క్లాసులోనే నిద్ర పోతారు. కాబట్టి ప్రయత్నాలు చేసినా వృద్ధిలోకి తేజాలక పోయాము.

అయితే యిలాంటి చిక్కులేని బీదకార్మికులు సమ్మెలకు తయారుగా ఉంటారు. కాని, కొన్ని రోజులైనా సమ్మె జరగనిది కూలి పెంచేందుకు యజమానులు సమ్మతించరు.

సమ్మెలు జరిగినప్పుడు లీగు నాయకులు సహాయం చేస్తామని కూలీలను ఒప్పించి, చివరకు యజమానులకే సహాయం చేస్తూండేవారు. యజమానులు న్యాయానికి ప్రయత్నించకుండా పోలీసుల లాఠీల మీద ఆధారపడుచుండిరి. అందుచే కార్మికులు ఓడిపోతూండేవారు.

కార్పొరేషన్ ఎలెక్షన్లలో ఎంతో [illegible] నీళ్ళ కొళాయిలు పెట్టిస్తామని, లైట్లు [illegible]

వేయిస్తామని, మరుగుదొడ్లు కట్టిస్తామని, మెరక భూములల్లో గుడిసెలు కట్టుకోటానికి వసతు లేర్పరుస్తామని బీడీ కార్మికులకు ఎన్నెన్నో ఆశలు చూపుతుంటారు. నే నా బీడీ కార్మికుల సంఘంలో పనిచేసిన రెండు మూడు సంవత్సరాల కాలంలో లీగు కౌన్సిలర్లు యిండ్లకు, కాంగ్రెసు కౌన్సిలర్లు యిండ్లకు తిరిగి తిరిగి వేసారి, కార్మికుల కేమీ అనుకూలాలు చేయించలేక పోతిని. ఇక నా ధర్మాన్ని నెరవేర్చుకోవాలి? ఎలాగు?

ఈ అనుభవంవల్ల వర్గ పోరాటమున్నదని నాకు తెలిసిపోయింది. ఇక బీడీ కార్మికులకు సహాయం చేయాలంటే ఒకేమార్గ మున్నది. వర్గ పోరాటాన్ని గురించి బోధించడం, ప్రస్తుత దోపిడీ సంఘాన్ని నాశనంచేయించి, నూతన సంఘం అనగా వర్గ రహితమైన సోషలిస్టు సమాజాన్ని నిర్మించేలాగు తర్ఫీదు చెయ్యాలి. అనగా ఒక విప్లవం తేవాలి; దీనికి నేను తయారుగా లేను. అందువల్ల బీడీ కార్మికుల సంఘంలో పనిచేయుట మానివేసితిని.

నాకంటే బాగా రాజకీయ చైతన్యాన్ని అభివృద్ధికి తెగల శక్తివంతులు నా స్థానంలోకి వచ్చారు. సమ్మెలు జరిగిన కాలంలో లీగునాయకులు, కాంగ్రెసు నాయకులు మానుండి విడదీయుటకు చాలా చమత్కారం చూపించి "కమ్యూనిష్టులు రష్యా భక్తులు; మాస్కో డబ్బు [illegible]బోధించి మమ్మల్ని ఓడించుటకు ప్రయత్నిస్తున్నాడు అయిదారు సంవత్సరాల తరు

వాత అలాంటి ప్రచారం ఉపయోగపడడంలేదు. కార్మికులలో చైతన్యం ప్రబలిపోయింది. చివరకు బీడి కార్మికులు సభలు జరుపుకొనుటకు అనుమతి లభించడమే కష్టమై పోయింది.

బీడీ పరిశ్రమ గుడిసెలలో జరిగేటంతవరకు బీడీ కార్మికులు బాగుపడజాలరు. దేశభక్తులు ఎంత త్వరగా యంత్రాలతో ఫ్యాక్టరీలలో ఈ పరిశ్రమను చేయిస్తారో అంత త్వరగా బీదకూలీలు బాగుపడుటే గాక, వస్తూత్పత్తి కూడ అధికమవుతుంది. ఎక్కువగా కూలి యిచ్చినా ఎక్కువ లాభాలుకూడా వుంటాయి.

చుట్టల కార్మికులు

ఈ కార్మికులు మద్రాసులో షుమారు 250 మంది వుంటారు. వీరందరు అయిదారు ఫ్యాక్టరీలలో పనిచేస్తారు. వారి సంఘానికి నేను అధ్యక్షుడుగావున్న మూడు నాలుగు సంవత్సరాలలో ముఖ్యంగా నేను కూలీలకు ఫ్యాక్టరీలలో మరుగుదొడ్లు పెట్టించడానికి, తరువాత పాకీదొడ్లలో నీరు సప్లయి అయ్యేలా చెయ్యడానికి మాత్రమే ప్రయత్నించినా నేను ఆ పనులుకూడా చేయించలేకపోతిని.

ఈ పరిశ్రమను ఫ్యాక్టరీలలో చేస్తున్నారు; కాని, ఫ్యాక్టరీ ఆక్టు అన్వయించదు. ఈ ఫ్యాక్టరీలు కొత్వాలు చావిడికి సమీపంలో వున్నాయి. కార్మికులు పబ్లిక్ పాకీ దొడ్లకు పోయిరావాలి. బ్రాడ్వేలోను, స్క్వయిరుపార్క-

లోను అన్నంతిని చావిడిలో చేతులు కడుక్కోవాలి. యజమానులు చగువురాని వారైనందున ఒకప్పుడు గుమాస్తాలుగా పనిచేసినందునను 1942-44 సంవత్సరాలలో లేబరు కమీషనరును చూడగానే భయపడి లేచి చేతులుకట్టుకొని కొంతవరకు సౌకర్యాలు కలించుచండిరి. ధరల పెరుగుదలతో యీ వ్యాపారస్తులు వేలూ, లక్షలూ లాభాలు గడించారు. అప్పటినుండి వారి దృక్పథం మారిపోయింది. లేబరు కమీషనరు రమ్మంటే వకీలును వెంటపెట్టుకు వెళ్ళేవారు: ఆ వకీళ్ళు తమ ఫీజు సంపాదించుకొనుటలో సమర్థులు. లేబరుకమీషనరును దబాయించేవారు. "ఏ ఆక్టు ప్రకారం యీ యజమానిని రమ్మని ఆజ్ఞాపించావు? ఏ చట్టంలో పాకీదొడ్లు కట్టించాలని ఉన్నది. ఫ్యాక్టరీఆక్టు యీ పరిశ్రమకు అన్వయించనప్పుడు, యీ కుటీరపరిశ్రమలమీద మీకు ఏ అధికారమూ లేదని తెలుసుకోండి! కూలి పెంచనవసరంలేదు. ఫ్యాక్టరీ మూసివేస్తాము!" అని వాదించేవారు.

ఒక లేబరుకమీషనరు ఏమి చేయటానికి తోచక హెల్తు ఆఫీసరుకు రహస్యంగా చెప్పుకొన్నాడు మరొకరు యజమాని అన్యాయం చేస్తున్నాడని పోలీసుఆఫీసరుకు టెలిఫోనుచేసి, సహాయమర్థించారు. ఈవిధంగా ఫ్యాక్టరీ పరిశ్రమేఅయినా చుట్టల కార్మికులకు ఫ్యాక్టరీఆక్టును అన్వయింపజేయడానికి నేను చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయినాయి.

తిరునునాపల్లి, వెల్లూరుపట్టణాలలో యిస్తున్నంత కూలీ యిప్పించండని ఎందరో నాయకులను, మంత్రులను, లేబరుకమీషనర్లను అడిగాను. తమకు అధికారం లేదని, సెంట్రల్ గవర్నమెంటు చెయ్యాల్సినపని అని చెప్పుతూ వచ్చారు మద్రాసులో సమ్మె జరిగినప్పుడు ఏ తిరుచునాపల్లినుండో వేలూరునుంచో చుట్టలు తెప్పించి వ్యాపారం సాగించి యజమానులు సమ్మెలను ఓడించారు. అందువల్ల మానేశాము. చుట్టల కార్మికులు దేశభక్తులు, గాంధీ భక్తులు, కాంగ్రెసు భక్తులు; యజమానులుకూడా అలాంటివారే. తియ్యటి మాటలతో ఏ స్వల్పంగానో కూలి నెక్కువ చేయించగలిగాను. కాని, కార్మికులకు నామీద నమ్మకం పోయింది; నన్ను తొలగించి ఎక్కువ సమర్థులైనవారిని నియమించుకొన్నారు. ఇప్పటికీ ఆర్థికంగా చుట్టలకూలీలు బాగుపడలేదు; గాని; వారిలో రాజకీయ చైతన్యం అభివృద్ధిచెందింది. సోషలిజము స్థాపించాలంటారు; కాంగ్రెసు ప్రభుత్వం కూలీలకు సహాయం చెయ్యదంటారు. పోలీసుబాధలు చాలా హెచ్చినవంటారు. చివరకు అక్షరాస్యులు కానివారుకూడ డెటినూ్యలుగాను, శిక్షితులుగాను జైళ్ళలో వుంటున్నారు! కాంగ్రెసు ప్రభుత్వం సులభంగా సహాయం చెయ్యవచ్చు. కూలీలకు పాకీదొడ్లు, నీటి కొళాయిలు, కూలి పెంచడం మొదలైన సదుపాయాలను చేయించి వారిని తృప్తిపరచలేకపోతే ఎవరూ బోధించకుండానే వర్గపోరాటం నేర్చుకోగలరు;

కొత్వాలు చావిడిచుట్టూవుండే వేనవేల కార్మికులకు ఈ చుట్టలకార్మికులే నాయకులు కాగలరు.

ఇప్పుడు అధికారంలో వున్నారుగదా! ఈ దిక్కుమాలిన కూలీలకు దేశభక్తులు సహాయం చెయ్యకూడదూ, లాఠీదెబ్బలు, జైళ్ళైనా మనకు శరణ్యం!

స్పెన్సర్ కంపెని కార్మికుల సమ్మె

మద్రాసు స్పెన్సరుకంపెనీ కార్మికుల సమ్మె 1946 సంవత్సరంలో జరిగింది. అయిదువందలమందితో ప్రారంభమై, పన్నెండువందలమందికి ప్రాకిపోయింది. పికెటింగు చేసే కార్మికులను పోలీసులు లాఠీలతో కొడుతున్నారు. కాళ్ళపైన, చేతులపైన, తలలమీద బాదుతున్నారు. దూరంగా నిలబడి చూచేవారిని సైతము పోలీసులు కొట్టి తరిమివేస్తున్నారు; లేదా పోలీసు స్టేషనులోకి లాక్కొని వెళ్ళి, పశువులను బాదినట్టు బాది వేస్తున్నారు. స్పెన్సర్ కంపెనీ లారీలలో పోలీసులు వెళ్ళి బజారు లెగ్గునను♦ తీసుకొస్తున్నారు; ఈ అన్యాయాలను అరికట్టాలని మద్రాసులోని కార్మిక సంఘాలు ఐక్యంగా తీర్మానించినవి. కార్మిక సంఘాల ప్రతినిధులను పదిమందితో ఒక డెప్యుటేషనును కార్మిక మంత్రి శ్రీ గిరి గారి వద్దకు పంపారు. ఆ పదిమందితో నేనొకడిని.

శ్రీ గిరిగారి యింటివద్ద వందలకొలది కార్మికులు గుంపులు గుంపులుగా కూర్చుండి యున్నారు. గిరిగారు

డెప్యుటేషనును మర్యాదచేసి "వెంటనే పరిష్కార మవు తుంది. ఇక మీరు విచారపడవద్దు. కూలీలకు న్యాయం జరగకపోతే నే నెందుకు ఉద్యోగంలో ఉండడం?" అని చెప్పారు.

"గిరిగారూ! మీరు ఎంతో సమర్థులు; ఇన్నిరోజులు కావాలా, న్యాయం చెయ్యాలంటే! మీరు పూనికతో చెయ్యడంలేదు. వృథాగా కాలయాపన జరుగుతోంది" అని నే ననాన్ను.

"అవును, లేదు; మీరు చూడండి-యజమానులు తెల్లదొరలు. వారికి కొంత అవకాశం యిస్తున్నాను. వెంటనే పరిష్కారమవుతుంది" అని చిరునవ్వు నవ్వుతూ "రెండు మూడు రోజులుండి సంఘ కార్యదర్శిని కోటలో నన్ను కలుసుకోమనండి" అన్నారు గిరిగారు.

మాలో మేము ఒకరి మొఖాలు ఒకరు చూచు కొని, బయటకువచ్చి ఆలోచించాము. "యజమానులు తెల్లరంగుచూచి గిరిగారు జడిసిపోయారు. వీరివల్ల న్యాయం జరుగదు. కాలయాపన చేస్తారు. వీరిని నమ్మకుంటే ఉప యోగమండదు. ప్రకాశం పంతులుగారిని కలుసుకొం దాము. అయన తెల్లదొరను చూచి జడిసేరకం కాదు.

♦ సమ్మె జరుగుతూండగా, దానిని విచ్ఛిన్నం చెయ్యడానికి యజమానులు తీసుకొచ్చే కొత్తకొత్త కూలీ లను "బ్లాక్ లెగ్స్" అంటారు.

అయన వల్లనే న్యాయం జరగాలి" అని నిశ్చయించుకొని ప్రధానమంతి ప్రకాశం పంతులుగారి యింటికి వెళ్ళాము. మా డెప్యుటేషన్ చెప్పినదంతా విని "కమ్యూనిస్టులు రాష్ట్రమంతటా అనవసరంగా సమ్మెలు చేయిస్తున్నారు" అని నిందించారు.

"ఇక్కడికి వచ్చిన కార్మిక సంఘ ప్రతినిధులలో చాలా మందిమి కాంగ్రెసువారమే" అన్నారు మాలో ఒకరు.

"రాష్ట్రంలో జరిగే సమ్మెలలో ఎక్కువ భాగం కాంగ్రెసు వారివే; కమ్యూనిస్టులవి కావు" అని మరి యొకరన్నారు.

ముందుగా మంత్రులతో సంప్రదించకుండా నోటీసు యివ్వకుండా కమ్యూనిస్టులు సమ్మె చెయ్యడంలేదు" అన్నారు ఒక కమ్యూనిస్టు. పంతులుగారికి నోరు కట్టివేసినట్టయింది. అయినా, ఒకప్పుడు గొప్ప క్రిమినల్ లాయరు కదా!

"ఈ స్పెన్సర్ సమ్మె అనవసరం కాదా? ఎందుకు చెయ్యాలి?" అని అడిగారు.

"కార్మికులు సమ్మె చెయ్యలేదు, యజమానులే సంసను మూసివేసి, కార్మికులను పనిలోనికి రాకుండా "లాక్-ఔట్" చేశారండి. దీన్ని సమ్మె అనడానికి వీల్లేదు" అని ఒకరు సమాధానమిచ్చారు.

"ప్రతి శనివారం మధ్యాహ్నం ఒకపూట శెలవు మామూలు ఒక శనివారంనాడు తమిళ ఉగాది పండుగ వచ్చింది. ఆ శనివారం పూర్తిగా సెలవిమ్మని నెల రోజులు ముందునుంచే కార్మికులు యజమానుల నడుగుతూ వచ్చారు. అయితే పండుగకు ముందురోజు శుక్రవారంనాడు అయిదుగంటలకు చెప్పితామని, కార్మికులందరిని నిలబెట్టి, 500 మంది తమిళ కార్మికులను డిస్మిస్ చేశారు. ఇదిసమ్మె ఎలాగవుతుంది చెప్పండి?" అని మరొకరు ప్రశ్నించారు.

"సమ్మె చేసేవారు ఫ్యాక్టరీకో పనిచేసే కూలీలను కొడుతున్నారట! దెబ్బలు తిన్నవారిని చాలామందిని యజమానులు తీసుకొచ్చి చూపించా"రని పంతులుగారన్నారు.

"ఒక విచారణ కమిటీని నియమించండి. అదంతా అబద్ధమని నిరూపించుతాము. అంతేకాదు; పోలీసులు, యజమానులు కలసి సమ్మె చేసేవారిని కొట్టి, హింసించుతున్నారని నిరూపించుతా" మన్నాను. అందుకు ప్రకాశం పంతులుగారు జవాబు చెప్పలేదు.

"గిరిగారిని కలుసుకొని చెప్పం"డని వారు సలహా యిచ్చారు.

"మాట్లాడి వచ్చామండి!" అని నేనన్నాను.

"అలాగా! అయితే ఆయనమీద అప్పుడే అసంతృప్తి పడ్డదా?" అన్నారు పంతులుగారు.

"యజమానులు తెల్లదొరలని గిరిగారు జడుస్తున్నట్టు మాకు తోచింది" అన్నాను నేను.

"మీకు ఏదితట్టితే అదే అనేస్తున్నారు" అని ఆక్షేపించారు ప్రధానిగారు.

"1200 మంది కార్మికులు కాంగ్రెసువారు. వారి కుటుంబాలు అన్నంలేక మాడిపోతూంటే ఇండియానుండి పారిపోవలసిన తెల్లదొరలు కాంగ్రెసు భక్తులను హింసించుతూంటే–ఇప్పుడు స్వేచ్ఛగా చెప్పకపోతే మరెప్పుడు చెప్పమంటారు?" అని అడిగాను.

కొంచెంసేపు ఊరకుండి పంతులుగారు ఏం చెయ్యమంటారు!" అని ప్రశ్నించారు.

"వెంటనే అందరిని పనిలోకి తీసుకోమనండి. అరవ ఉగాదిని పండుగ దినంగా పరిగణించడమా లేదా అనే విషయాన్ని నెమ్మదిగా తీర్మానించండి. మధురలో ఒక్కప్పుడు శ్రీ సి. రాజగోపాలాచారిగారు మిల్లు మూయించి వేసి తెల్లదొరలకు బుద్ధివచ్చేలా చెయ్యలేదా?" అన్నాను. నావైపు తీక్షణంగా చూచారు పంతులుగారు. సి. ఆర్. పేరు తేవడం చాలా పొరపాటనుకున్నాను. మరొక గదిలోకి వెళ్ళి, తలుపులు బిగించి, గిరిగారితో టెలిఫోనులో ఏదో మాట్లాడివచ్చి, "ఎల్లుండి గిరిగారిని కోటలో కలుసు

కోండి" అని చెప్పారు. స్పెన్సరు కంపెనీ కార్మికులకు ఇక వెంటనే న్యాయం జరిగిపోతుందని మేమనుకొని గంపెడంత ఆశతో కూలీలను యిండ్లకు పంపివేశాము.

రోజులు, వారాలు గతించాయి. వారాలు నెలలయిపోతూ వచ్చాయి. పోలీసుల హింస ఎక్కువై పోయింది. స్ట్రైకు లెగ్స్‌తో ఫ్యాక్టరీలో పూర్తిగా పని సాగిపోతోంది. రాజీ (కన్సీలియేషన్) అనీ మధ్యవర్తిత్వమనీ (ఆర్బిట్రేషన్) వట్టిమాటలతో కాలయాపన జరిగిపోతోంది.

ఈ విషయానికి సంబంధంలేని "కాంట్రాక్టు ఆక్టు" ప్రకారం అరవకూలీలకు ఉగాదిపండుగలకు సెలవు యిమ్మని కోరే హక్కు లేదనిన్నీ, అయినా సమ్మెరోజులకు యజమాని కూలి యివ్వవలసిందనిన్నీ, యజమానికి యిష్టంలేని కార్మికులను పనిలోనుండి తొలగించవచ్చుననీ కోర్టులో తీర్పయిచ్చారు.

మంత్రిగారి వద్దకు కార్మిక నాయకులు వెళ్ళి "ఆ తీర్పును ఒప్పుకోవద్దండీ! యజమాని చాలామందిని డిస్మిస్ చేస్తారు" అని చెప్పారు.

లేదు, లేదు; డిస్మిస్ ఎందుకు చేస్తారు? అందరిని యజమాని పనిలోకి తీసుకుంటారు. అలా చెయ్యమని తప్పకుండా చెప్తా" నని గిరిగారు సమాధానం చెప్పి పంపారు.

సుమారు మూడు నెలలు సమ్మె (లాక్-ఔట్) జరిగింది. 600 కార్మికులకు ఉద్యోగం పోయింది. ఉగాదికి అరవ కూలీలకు ఒకపూట సెలవు యివ్వండని కోరినందుకు కాంగ్రెసు మంత్రులు తెల యజమానులకు పోలీసు మద్దతు నిచ్చారు; సమ్మె విఫలమయింది. కాంగ్రెసు భక్తులైన 1200 కార్మికులు నిర్ఘాంతపోయారు. మద్రాసులోని కార్మికులు ఒకరోజు హర్తాల్ చేసి తమ సానుభూతిని చూపాలని ఏదో ఒక కార్మిక సంఘం తీర్మానించగానే ఒక లక్షమంది కార్మికులు మద్రాసులో హర్తాల్ చేశారు. కాంగ్రెసు మంత్రులమీద, కాంగ్రెసుమీద భక్తి నమ్మిన కాలు కార్మికుల్లో ఎంతలోకి నశించిపోయినవి! కమ్యూనిస్టు దేశద్రోహులు చేసిన మోసం" అని కాంగ్రెసు పెద్దలు మమ్మల్ని నిందించారు. అయితే స్పెన్సరు కంపెనీ 1200 కార్మికుల సంఘంలో వున్న కమ్యూనిస్టు ఒక్కరు మాత్రమే. మిగిలిన వారందరు కాంగ్రెసుభక్తులే. కమ్యూనిస్టుపార్టీ సానుభూతి చూపించుతూ వచ్చినది; కాంగ్రెసు పార్టీ సానుభూతి చూపించనేలేదు.

ఈ సమ్మెతో మార్క్సిస్టు సిద్ధాంతాల సత్యాసత్యాలు తెలిసిపోయినయి. నా సంశయాలు మాయమైనవి. సంఘంలో వర్గాలు వున్నాయి; వాటికి పోరాటాలున్నాయి. మనం ఏదో ఒక వర్గానికి మాత్రమే సహాయం చెయ్యగలము. యజమానిపక్షం వారు యజమానులకు సహాయం చేశారు; కార్మికులకు అన్యాయం చేశారు.

అలాగే కార్మికవర్గంవారు కార్మికులకు మాత్రమే సానుభూతి చూపించారు. అంతేకాదు; దేశానికి శత్రువులైన తెల్ల యజమానులకు కూడ సహాయం చేశారు. మన దేశభక్తులైన మంత్రులు. కార్మికులు దేశభక్తులనే విషయాన్ని గమనించలేకపోయారు. కమ్యూనిష్టు సిద్ధాంతాలలో పొరపాటు లేదని నాకు నమ్మకం కలిగింది.

అటుతరువాత కొన్ని పట్టణాలలో సమ్మెల సందర్భంలో మలపారు పోలీసులు ఘోరంగా ప్రవర్తించారనీ, స్త్రీ కార్మికులనుకూడ కాల్చివేశారనీ ఏమేమో చదివాను. ఈ విషయాలు ఎంతవరకు సత్యమో, అసత్యమో తేల్చుటకు ఒక కమిటీని నియమించవలసిందని కోరగా, కాంగ్రెసు మంత్రులు నిరాకరించారని వార్తాపత్రికల ద్వారా తెలిసింది. ఎందుకు అలా చెయ్యకూడదా అన్న సంశయం నన్ను ఆవేశించింది. *

---

* దేశంలో మూడేండ్లుగా హత్యలూ, దోపిళ్ళు జరుగుతూ వచ్చాయి. వీటన్నిటికీ కారకులు కమ్యూనిస్టులేనని కాంగ్రెసు ప్రభుత్వము, పత్రికలూ ఆరోపిస్తూ వచ్చాయి. కాని ఇందలి సత్యాసత్యాలను నిర్ధారణ చేయవలెనంటే నిష్పాక్షికమైన ఒక విచారణ సంఘాన్ని ఏర్పరచి నిజమేదో తెలుసుకోవాలి అంతవరకూ కాంగ్రెసు ప్రభుత్వము, పత్రికలూ కమ్యూనిస్టులపై ఆరోపించిన చార్జీలను యథాతథంగా నమ్మడానికి అవకాశం ఉండదు.

ప్రకాశం పంతులుగారిమీద నాకు భక్తి గౌరవాలు ఉంటూండేవి. ఆయన ధైర్యసాహసాలు, త్యాగము నా కెంతో నచ్చినవి. ఆయనమీద నాకుండినంత గౌరవం మరే ఆంధ్ర కాంగ్రెసు నాయకునియందును లేవు. అయితే యిప్పుడో?

కార్పొరేషన్ కార్మికుల సమ్మె

మద్రాసు నగరంలో వీధులూడ్చి, పాకీపనిచేసి, రోడ్లు బాగుచేసే కార్మికుల సంఖ్య పదివేలు. వారిలో పాకీవారు 450 మంది. వీరందరూ తెలుగువారే. కాంగ్రెసు కౌన్సిలర్లే ఎన్నో ఏండ్లుగా వారి సంఘాలకు

సూళ్ళూరుపేటలో జరిగిన రైలు ప్రమాదానికి కమ్యూనిస్టుల చర్యలే కారణమన్నారు మొదట. విచారణ చేసినమీదట అది అబద్ధమని రుజువుఅయింది. అదే విధంగా కమ్యూనిస్టులపై ఆరోపించబడిన నేరాలను విచారణ సంఘం సమగ్రంగా పరిశీలి స్తేతప్ప అందలి సత్యాన్ని ప్రజలు తెలుసుకోడానికి వీలుండదు.

కాంగ్రెసువారికీ, కమ్యూనిస్టులకూ వచ్చిన పేచీలలో పొరపాటు కేవలం కమ్యూనిస్టులది కాదని, లేక కాంగ్రెసువాదులదని చెప్పటకు వీలులేదు. ఉభయ పక్షాలలోను పొరబాట్లు లేకపోలేదు. ఈ సందర్భంలో "పద్మవ్యూహ" ఘట్టం నాకు జ్ఞాపకం వస్తుంది.

నాయకులుగా ఉంటూండేవారు. ఇందరు నాయకు లుండికూడా, పాకీవారిలో చాలామందికి జీతం నెలకు ఆరు రూపాయలనుంచి యిరవై రూపాయలుమాత్రమే రోజ్దుపని చేసే స్త్రీలకు నెలకు పదిరూపాయలుమాత్రమే. పురుషులకు పన్నెండు మొదలు పదహారు రూపాయలు. ఈ పరిస్థితులు దుర్భరంగా వున్నా: ఆహార పదార్థాల వెలలు పెరిగిపోతూ వచ్చాయి. కార్మికులు కమ్యూనిస్టుల సహాయం కోరారు. కూలీలు చాలామంది తెలుగువారు; అయినా ఒక తమిళ కమ్యూనిస్టు తెలుగు తెలియకపోయినా పదివేలమందిని ఒకేఒక సంఘంలోకి ఒక సంవత్సరకాలంలో తేగలిగారు. అదివరకున్న కాంగ్రెసు నాయకుల సంఘాలు క్షీణించిపోయాయి. అయితే కార్మికులు గాంధీభక్తులు, కాంగ్రెసు భక్తులుగానే వున్నారు. కొందరు కాంగ్రెసు సభ్యులుకూడాను.

కార్మికుల కష్టాలను తొలగించండని కాంగ్రెసు కొన్నిలర్లు యిండ్లచుట్టూ కమ్యూనిస్టులం తిరిగాము. కొన్ని లర్లలో మెజారిటీ కాంగ్రెసువారే. కొంతమంది సహాయం చెయ్యాలని యిష్టం కన్పరిచేవారు. కాని, మరికొందరు ఆక్షేపించేవారు!- "కమ్యూనిస్టులు కోరినట్టు జీతాలు పెంచితే వారి పలుకుబడి సిరపడిపోతుంది. కాంగ్రెసు పలుకుబడి నశించిపోతుం"దని కొందరు కాంగ్రెస్‌భక్తులు పదించారు. అన్ని సంఘాలు కలిసి ఏకగ్రీవంగా కొన్ని కోరికలను అడుగుదాము, అని కమ్యూనిస్టులం సలహా

యిచ్చాము. కాని, కాంగ్రెస్ నాయకులు ఒప్పుకోలేదు. కమీషనరు షినాయి కొంతవరకైనా చెయ్యాలని ప్రయత్నించారు. కాని, పోటీసంఘాల కాంగ్రెసు నాయకులు ముఖ్యంగా కొన్నిలర్ల ఒత్తిడికి జడిసిపోయారు.

చివరకు కాంగ్రెసు మంత్రులను కలుసుకున్నాం. ఆరోగ్యశాఖా మంత్రిగారైన శ్రీమతి రుక్మిణమ్మగారు మాతో "అయ్యో! నెలకు ఆఠురూపాయల జీతమా! నెలకు ముప్పది రూపాయలన్నా లేకపోతే ఎలా జీవించుతారు? ఈ అన్యాయాన్ని తొలగించాలి. శ్రీ. డేనియల్ థామస్‌గారితో మాట్లాడుతానని చెప్పారు; మాకు ఆశ్చర్యం కలిగించింది. వెంటనే బయటకువచ్చి నవ్వుకొన్నాము; "ఈమె ఎంత బాధ్యతారహితంగా మాట్లాడింది. ఇంతడబ్బు ఎక్కడినుంచి తెచ్చియిస్తుంది? కొన్ని రేషనుకు అందుకు తగినంత ఆదాయం లేదే" అనుకొన్నాము.

కార్మికమంత్రి గిరిగారు "నాకు సంబంధంలేదు; స్థానిక శాఖామంత్రి డెవియల్‌గారిని కలుసు"కోమన్నారు. అలాగే వారిని కలుసుకొంటిమి "జీతాలవిషయం చాలా కాలంగా తర్జనభర్జన జరుగుతున్నది. మీరేమో మొన్ననే మంత్రిపదవికివచ్చారు. కొంతకాలం బాగా ఆలోచించి చేస్తారా? లేక వెంటనే చేస్తారా?" అని థామస్‌గారిని అడిగాము,

"ఇదెంత! వెంటనే చేస్తాను. కమీషనరును పిలిపించి తీర్మానించుతా" నన్నారు. మూడు పార్టీల సమావేశాలు జరిగాయి. కార్పొరేషను కమీషనరు, మంత్రిగారు, కార్మికసంఘ నాయకులము-నేనుకూడా ఆ సంఘ నాయకులలో ఒకడిని- సమావేశమైనాము. ఒక్కొక్క కార్మికునికి నెలకు జీతము రెండురూపాయలు; ఇంటిబాడుగ రెండు రూపాయలు మొత్తం నాలుగురూపాయలు పెంచవలసిందని మంత్రిగారు తీర్మానించారు. మేము సమ్మతించలేక పోయాము. "ఏ సమ్మె లేకుండా నాలుగు రూపాయలు అధికంగా వచ్చింది! ఒప్పుకోండి! ఆరునెలల తరువాత తిరిగి ప్రయత్నించుదాము" అని మమ్మల్ని సమాధాన పరిచారు.

అయితే, మరొక విషయంలో మాకు సంశయం కలిగింది. కార్పొరేషను కమీషనరుగారితో మంత్రి థామస్‌గారు యిలా అన్నారు: "కార్పొరేషను కార్మికులందరికీ ఇండ్లు కట్టించుడాము. ఒక్కొక్క యింటికి పదిహేనువందలు సొంక్షను చేయిస్తాను. ముందుగా పాకీ వాళ్ళకు నాలుగువేల యిళ్ళు ఐదుసంవత్సరాలలో పూర్తి చేయించుదాము. సంవత్సరానికి ఎనిమిదివందల యిళ్ళు; పన్నెండులక్షల రూపాయలు; మొత్తం అయిదు సంవత్సరాలకు అరవై లక్షలు" అన్నారు.

దీనికి కమీషనర్ షినాయ్‌గారు "ఒక్కొక్క ఇంటికి వెయ్యిరూపాయలు చాలు" అన్నారు. "చాల"

దన్నారు మంత్రి థామస్‌గారు. "ఇండ్లు అవసరంలేదు. కాళీ సలంలో రోడ్లు, దీపాలు, కొళాయిలు, పాకీదొడ్లు, గుడిసెలు వేసుకొనుటకు ప్లాటులు చేయించి యివ్వండి. ఒక్కొక్క గుడిసెకు మీరు రెండువందల ఏభై రూపాయలు ఖర్చు పెట్టండి, చాలును: కార్మికుల స్వంతడబ్బుతో గుడిసెలు మునిగిపోకుండా వుంటే చాలు" అని మేము వాదించాము. అయితే, మంత్రిగారు మాత్రం ఒప్పుకోలేదు. మాకు అబ్బురంగానేవుంది. బయటకువచ్చిన కార్మికనాయకులము "ఏదో కుంభకోణం ఉన్నదనుకొని ఒక ఉత్తరం మంత్రి గారికి, ఒకటి కమీషనరుగారికి వ్రాశాము. దానిలో ముందురోజు తీర్మానించుకొన్న విషయాలనుగురించి వ్రాతమూలకంగా ఒప్పుకోవలసిందని వ్రాశాము. ప్రత్యుత్తరం రాలేదు. కమీషనరుగారిని కలుసుకొని అడిగితే నవ్వుతాడేగాని, మాట్లాడడు; కొంతకాలానికి అసెంబ్లీలో యిండ్లనుగురించి, జీతాలు, యిండ్లబాడుగను గురించీ, ప్రశ్నలు వేయించాము. తనకేమీ తెలియదని మంత్రి డేనియల్ థామస్‌గారు జవాబుచెప్పారు. తరువాత వారిని ఆఫీసులో కలుసుకొని "అబద్ధం చెప్పవచ్చునా?" అని అడిగారు. వారి కెంతో ఆగ్రహంవచ్చింది. కాబట్టి, సమ్మె తప్పనిసరి అయింది.

సమ్మె నోటీసు యిచ్చాము. వేరే పాకీవారిని ప్లేయి చేయించెదమనీ, సమ్మెను ఓడించగలమనీ కాం. గ్రెసు మొదలైన పార్టీల కౌన్సిల్ సభ్యులందరూ కమీష

నరుగారికి హామీయిచ్చారు. ఏదో ఇచ్చి రాజీ చేసుకోవాలని కమీషనరుగారు చేసిన ప్రయత్నాలన్నీ నిష్ఫలమైనవి. సమ్మెకాలంలో కొన్నిలక్ష పాకీవాళ్లను సప్లయి చెయ్యలేకపోయారు. కమీషనరుగారు భయపడిపోయారు. పోలీసుల లారీల సహాయంతో సమ్మెను అణచుటకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. మంత్రులు-ముఖ్యంగా కూర్మయ్య గారు "ఎర్రజండా విడిచిపెట్టి కాంగ్రెసుజండా పట్టుకొండి మీ కోరికలు నెరవేరేటట్లు చేస్తా"నని కూలీలకు సలహా యిచ్చారు. "ప్రతి పాకీపనివానికి భూములను యిప్పిస్తాను. మీ గ్రామాలకు వెళ్ళి వ్యవసాయం చేసుకొని సుఖంగా జీవించండ"ని కూడ సలహా యిచ్చారు. "భూములను మా కిచ్చేబదులు మా జీతాలు హెచ్చించండి. మా కడుపులు ఆకలితో మాడిపోతున్నా"యని వారు సమాధానం చెప్పారు. అంతటితో కూర్మయ్యగారు తమ ప్రచారాన్ని మానుకున్నారు. "కమ్యూనిస్టులు దేశద్రోహులు. మాస్కో డబ్బు తింటున్నారు" అనే ప్రచారం ఎంత మాత్రమూ 1946-47లో ఉపయోగించలేదు. చివరకు చాలమంది పాకీవారిని జైలులో వేయించారు. నేరాలు చేసే జాతుల చట్టం (క్రిమినల్ ట్రయిబ్స్ ఆక్టు)ను అన్వయించేలాచేసి కొందరిని పోలీసు స్టేషన్లలో లాకప్‌చేశారు. ఒక పోలీసువాని దెబ్బలకు, తన్నులకు ఒక స్త్రీ చచ్చిపోయింది. గుడిసెలోకి వెళ్ళి ఆమెను కొట్టి చంపారు.

భాష్యంగారు అనే కాంగ్రెసు డాక్టరు ప్రధాన మంత్రి ప్రకాశంగారిని కలుసుకొని యిలా కొట్టించడం అమానుషమని చెప్పగా "కమ్యూనిస్టుపార్టీలో ఎప్పుడు చేరావు?" అని ఆయన్ను దబాయించారు పంతులుగారు. కొందరు కాంగ్రెసు పెద్దలు మంత్రులను, ప్రధానిని న్యాయమైన జీతంయిచ్చి, సమ్మెను ఆపుచేయించండని ఎంతో ప్రతిమలాడారు. ఉపయోగం లేకపోయింది. పుర ప్రముఖులు బహిరంగసభ పెట్టుకొని కాంగ్రెసు మంత్రులను ప్రార్థించారు. ఒక డెప్యుటేషను ప్రధానిని కలుసుకొని అడుగగా ప్రకాశంగారు అడ్డదిడ్డమైన ప్రశ్నలు వేశారు. చివరకు శ్రీ సంజీవకామత్, డాక్టర్ మహాదేవన్ గార్లు "కార్మికులు కాంగ్రెసు భక్తులు, కాంగ్రెసు సభ్యులు అని మాకు తెలుసును. న్యాయంగా యివ్వవలసినది యివ్వం"డని వత్తిడి చెయ్యగా తుదకు ప్రకాశం పంతులుగారు కటాక్షించారు. ఒక్కొక్క కార్మికునికి నెలకు ఎనిమిదిన్నర రూపాయల వంతున సంవత్సరానికి కార్పొరేషను మూడు తొమ్మిదిన్నర లక్షల రూపాయల ఎక్కువగా ఖర్చుచేస్తూ సమ్మె పరిష్కారమయింది. ఏ కూలీకిగాని నెలజీతము పదహారు రూపాయలకు తక్కువ వుండకూడదని తీర్మానించారు. 21 రోజులు సమ్మెచేసి ఎన్ని కష్టాలుపడినా, కార్మికులు చివరకు సంతోషించారు.

అయితే, కొన్ని రోజులలోనే పన్నెండువందల కూలీలను పనిలోనుండి తొలగింపబడ్డారు. అలా తగ్గించ కూడదని కొన్నిలర్లు తమసభలో తీర్మానించారు. ఈ సదర్భంలో కమీషనర్గారిని కలుసుకున్నాను. కౌన్సిల్లో ఉండే పార్టీనాయకులు రహస్యంగా తనను తగ్గించమని సలహాయిచ్చి, కౌన్సిల్ మీటింగులో పబ్లికుగా మరొక రీతిని తీర్మానించారు తా నేమీ చేయజాలనని ఆయన చెప్పారు. నేను నమ్మలేదు. ఆ సంగతి గ్రహించి "చంచయ్యగారూ! సమ్మెజేసిన బకింగ్హామ్ కర్నాటిక్ మిల్లులు కార్మికులకు ఒకలక్ష రూపాయలు యివ్వవలసిందని పబ్లిక్గా తీర్మానం చెయ్యలేదా? యివ్వవద్దని నాకు రహస్యంగా సలహా యివ్వలేదా? అందువల్ల, నేను యివ్వజాలకపోయాను: అలాగే మీ పన్నెండువందలమంది కూలీలను పనిలో చేర్చుకోజాలను" అని.ఏమేమో సమాధానం చెప్పారు.

ఎంత నైతికపతనం! కాంగ్రెసు నాయకులే యిలా చేస్తే దేశంగతి ఏమవుతుంది? దేశం నాశనానికి దారి తీస్తున్నారని ఎప్పుడు తెలుసుకుంటారు? అని సిగ్గుపడ్డాను; దుఃఖించాను.

అభ్యుదయ రచయితలమహాసభ -

కామ్రేడ్ చదలవాడ పిచ్చయ్యగారు

1946—47 సంపత్సరంలో ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల మహాసభ మద్రాసులో అత్యంతోత్సా

హంగా జరిగినది. ఆఫీసు మా యింటిలోనే పెట్టాము: కార్యదర్శి శ్రీ పిచ్చయ్యగారు, వారి అనుచరులు మా ఇంటిలోనే బస. కమ్యూనిస్టుపార్టీ తీర్మానం ప్రకారం స్థానికంగా నేను సహాయం చేస్తున్నాను. నాకు ఆంధ్ర రచయిత్రలతో దగర పరిచయానికిదే ప్రారంభం. వీరి విషయంలో నాకున్న "ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు ఇంతవరకూ నన్ను దూరం చేస్తుండేది. ఇక దూరంగా ఉండటానికిసాధ్యపడలేదు కాన్ఫరెన్సువల్ల పై 'కాంప్లెక్సు' కుదిరిపోయింది. ఆంధ్ర కమ్యూనిస్టుపార్టీ రచయితల తరపున శ్రీ పిచ్చయ్యగారు కార్యదర్శిగా నియమించ బడినారు. కొద్దిరోజుల్లోనే శ్రీ పిచ్చయ్యగారికి ఇతరులకు తగాదాలు వచ్చాయి. మెజారిటీతో అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడు రాజీనామాయిచ్చివేయాలి. కాని, పిచ్చయ్య గారు అలా చెయ్యక, తన యిచ్చవచ్చినట్లు ప్రవర్తించారు. "మహాసభను నానశనమైనా చేస్తానుగాని, నేను వదిలిపెట్టి పెళ్ళ"నని పిచ్చయ్యగారి పట్టుదల. మధ్యలో పిచ్చయ్యగారిని తొలగించి అల్లరిపడటం కమ్యూనిస్టు రచయితలకు యిష్టంలేదు.

తన ధోరణి సరియైనదేనని పిచ్చయ్యగారు నాకు బోధించేవారు. ఎన్నిగంటలైనా తన వాదన మానరు. నాకు తలనొప్పిగా వుండేది. తుదకు యిలా చెప్పి తప్పించు కొనుటకు ప్రయత్నించాను-: "నేను పార్టీలో సభ్యుడను. పార్టీలో ఉన్నంతకాలమూ పార్టీ తీర్మానం ప్రకారం

ప్రవర్తిస్తాను; లేకపోతే పార్టీని వదలివేస్తాను; కాని, నీతో నేను చేర"నని ఖండితంగా చెప్పివేశాను. నాకూ ముతా తగాదాలకు చాలా దూరం.

"నీకు బెయిస్సు లేవా? ఎందు కాలోచించవు?" అని ఆయన ప్రశ్న.

"బెయిస్సు ఉన్నవారు నీలాగా తగవులాడుతూ ఉండ"రని జవాబిచ్చాను.

ప్రజానాట్యమండలి

పై తగాదాల సందర్భంలో ఈ నాట్యమండలి" ఒక ప్రత్యేక సంస్థ అది ఆలిండియాసంస్థ దానికి ఆంధ్ర రాష్ట్రంలో ఒక శాఖకూడా ఉన్నది. దానినికూడా కమ్యూనిస్టులే నడుపుచుండిరి. వారు ప్రదర్శించు నాటకాలు, బుర్రకథలు, చిత్రవిచిత్రవేషాలు నన్ను బాగా ఆకర్షించాయి. వాటిని చూచేందుకు ప్రత్యేకంగా బెజవాడ వెళ్ళేవాడిని.

ఆంధ్రకమ్యూనిస్టుపార్టీ కాల్యకలాపాలలో ___ ముఖ్యంగా వారి సంస్కృతీకలాపాలు నన్ను ఆకర్షించినంతగా మరే కార్యక్రమాలూ ఆకర్షించలేదు. నన్నే కాదు! వేలు లక్షల ప్రజలను ఆకర్షించాయి. ఆ కార్యక్రమాలే కోస్తాజిల్లాలలో అనేకవేలమందికమ్యూనిస్టుపార్టీలో చేరుటకు, ఆ పార్టీ అంత త్వరలో వృద్ధికి రావడానికి కారణమని నా దృఢనమ్మకము;

ఎక్కడ ఆంధ్ర అభ్యుదయరచయితల మహాసభ జరిగినా, పైనాటకమండలి ప్రదర్శనాలను మామూలుగా ఏర్పాటుచేయుచుండిరి. అలాగే మద్రాసులో కూడా ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని ఆ నాట్యమండలి కాన్ఫరెన్సునుకూడ మద్రాసులో జరుపుటకు నేను ఏర్పాట్లు చేయుచుంటిని. ఆ విధంగానైనా మద్రాసులో ప్రజానాట్యమండలి శాఖను స్థాపించి, సంస్కృతీ కార్యకలాపాలు ప్రారంభించాలని నా అభిలాష. మద్రాసు ఆంధ్రులచే ప్రదర్శనాలు జరిపించాలని నా ఉద్దేశ్యం

అయితే, ప్రజానాట్యమండలి కాన్ఫరెన్సును మద్రాసులో ఏర్పాటుచేయుటకు శ్రీ పిచ్చయ్యగారు ఒప్పుకోలేదు. ముఠా తగాదాలు ఉన్నసంగతి నాకు తెలియదు. నాట్యమండలిని ముందుకు రానియ్యకూడదనీ, ఏమేమో కారణాలు పిచ్చయ్యగారు చెప్పారు. నాట్యమండలికి నేను పని చేసేయెడల, రచయితల మహాసభ తాను మానేస్తానని పిచ్చయ్యగారు బెదిరించటమేగాక మూటాముల్లె సర్దుకొన్నారు. అందువల్ల నేను నాట్యమండలికి సంబంధించిన ప్రయత్నాలు మానుకోవలసివచ్చింది.

అప్పటికీ, వారి ఆగ్రహం చల్లారలేదు. రచయితల కాన్ఫరెన్సులో నాట్యమండలి ప్రదర్శనాలివ్వాలని ఆహ్వానించారే కాని, వచ్చినవారికి బసలు ఏర్పాటు చెయ్యలేదు; నన్ను చెయ్యనిలేదు. మద్రాసులో దిగిన తరువాత, నాటకబృందంవారు పడ్డకష్టాలు అన్నీఇన్నీ

కావు. ప్రదర్శనాలు సరిగా జరుగుగకుండా ఉండాలనికూడా ప్రయత్నించారు; కాని, చాలా బాగా ఉన్నాయని ప్రేక్షకుల మన్ననలను నాట్యమ్యడలివారు సంపాదించుకొన్నారు.

డాక్టర్ రాజారావుగారు రాష్ట్రినాట్యమండలి కార్యదర్శి; శ్రీ పిచ్చయ్యగారు రాష్ట్ర రచయితల సంఘానికి కార్యదర్శి; ఇద్దరూ కమ్యూనిస్టుపార్టివారే, కాని, వారిద్దరిమధ్య చాలా తగాదాలున్నాయి. నాట్యమండలివారి కివ్వవలసిన ఖర్చులను పిచ్చయ్యగారు పైకం యివ్వలేదు; ననూ్న యివ్వఁయ్యలేదు. వాణీమహాలులో కాన్ఫరెన్సు జరుగుతూండగా వారిద్దరూ ఆవరణ వెలుపల తగవులాడ నారంభించారు. మధ్యవర్తులం కొట్టుకోకుండా చెయ్యగలిగాము, ఇదంతా చూచాక నా "ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు" త్వరత్వరగా అంతరించిపోయింది.

కొండను ప్రవ్వాము!

అభ్యుదయ రచయితలసంఘాన్ని గొప్ప ఉద్దేశ్యాలతో ప్రారంభించారు. అది అఖిలభారత సంస్థ. ఆంధ్రలో కమ్యూనిస్టు రచయితలు శాఖను స్థాపించి ఉత్సాహంతో పనిచేయుండిరి. వారు యువకులు; అభ్యుదయవాదులు. రచయితలందరిని అభ్యుదయమార్గంలోకి మార్చాలని వారి అభిలాష. అనగా, ప్రస్తుతం ప్రజలను పీడించే సమస్యా

పరిష్కారాలకు ఆంధ్రరచయితలు తోడ్పడి మార్గదర్శకులై సంఘాన్ని ముందుకు నడిపించాలని వారి సంకల్పం.

అందువల్ల మద్రాసులో జరిగిన మహాసభకు చాలా ద్రవ్యం వసూలుచేసి, ఆంధ్రదేశంలో ప్రసిద్ధికెక్కిన రచయితలకు రానుపోను ప్రయాణఖర్చులను ముందుగానే పంపి రప్పించారు. ఈ రచయితలు "అభ్యుదయం" అనే మాటకు నిర్వచనం ప్రారంభించారు. ఒకొక్కరు ఒకొక్క విధంగా మాట్లాడి తమ చాకచక్యాన్ని ప్రదర్శించారు. చాలామంది వేదకాలంలోని సంఘం అభ్యుదయంగా వున్నదనీ, ప్రస్తుతం కలియుగమనీ ఏమేమో బోధించారు. వీరికున్న వెనుకచూపును ముందుకు మరలించి వీరేశలింగం, భారతి, త్యాగరాజు మున్నగు పురోగాముల వలె ఆభ్యుదయానికి తోడ్పడేలాగున మహాసభను జరుపలేకపోయారు.

వాడుకభాష - శ్రీ రామలింగా రెడ్డిగారు

కాని, ఒక గొప్ప మార్పును తెచ్చేందుకు ప్రయత్నము జరిగినది. ఆంధ్ర యూనివర్సిటీ వాడుకభాషలో వ్రాయబడిన ఉద్గ్రంథాలను వినియోగించుటకు ఆక్షేపించారు అందువల్ల ప్రజలు ముందుకు పోతున్నా, ఆంధ్ర యూనివర్సిటీ మాత్రం వారిని వెనుకకు లాగుచుండెను.

ఇది ఆంధ్రులకు ప్రధాన సమస్య. ఈ ఆభ్యుదయ నిరోధక విధానానికి కీర్తిశేషులైన శ్రీ కట్టమంచి రామ

లింగా రెడ్డిగారే కారకులని రచయితల అభిప్రాయం. పిల్లికి గంట కట్టాలని ఎలుకలు పడిన పాట్లే ఈ రచయితలు కూడా పడుచుండిరి చివరకొక మంచి తీర్మానం చేశారు ఆంధ్రదేశంలోని కొంతమంది సుప్రసిద్ధ రచయితలను ఒక డెప్యుటేషన్ పంపుటకు తీర్మానించారు. వారిలో కొందరు అత్యున్నత ప్రభుత్వోద్యోగులుకూడా వున్నారు. ఇక శ్రీ రామలింగారెడ్డిగారు మొగమాటపడవలసి వస్తుందనీ, వారి ఆట కట్టిపోగలదనీ రచయితలు సంతృప్తి చెందారు.

కాని, డెప్యుటేషను బయలుదేరనేలేదు. కార్యోత్సాహం గల కమ్యూనిస్టు యువకరచయితలను డిటెన్షనులో పెట్టుటవల్ల డెప్యుటేషన్‌లోని మెంబర్లకు ఉత్సాహము క్షీణించిపోయింది. కాని వారిలో కొందరు చెప్పిన సమాధానం ఎంతవరకు వాస్తవమో నేను చెప్పజాలను "రామలింగారెడ్డిగారికి అహంభావం ఎక్కువ. ఎంతటి వారిని కూడా లక్ష్యపెట్టరు. డెప్యుటేషనును రిసీవు చెయ్యనని నిరాకరించవచ్చు. రిసీవు చేసినా మా సలహాను లక్ష్యపెట్టకపోవచ్చును. మర్యాదస్తులం? రిస్కు చెయ్యజాల" మని కొంతమంది మెంబర్లు చెప్పారు. చివరకు, మహాసభ ప్రయత్నాలు ఎలుకను పట్టిన సామెతలా జరిగిపోయాయి.

నాలుగు సంవత్సరాల తరువాత 1951 సం॥ జులైలో ఒక విధంగా ఈ సమస్యా పరిష్కారానికి తిరిగీ ప్రయత్నం జరిగి విఫలమైపోయింది. మద్రాసులో ఒక సారస్వత సభకు

మంత్రి (శ్రీ) గోపాలరెడ్డిగారు అధ్యక్షత వహించారు. వారు ఆంధ్ర యూనివర్సిటీకి ప్రో-ఛాన్సలరు. పై మార్పును చేయించండని ఒక అభ్యుదయవాది ప్రార్థించాడు.

"మార్పు లేకపోతేనేం? అరసున్నాలతో వ్రాయడం నేర్చుకుంటే తప్పేమిటి? ఇంటరు పరీక్ష పూర్తికాగానే మన యిష్టప్రకారం వ్రాసుకొనుటకు ఏ యూనివర్సిటీ అడ్డుపడగలదు?" అని తేలికగా మాట్లాడేశారు.

ఆంధ్రజాతి దురదృష్టం!

అరెస్టులు - డిటెన్షను

ఆంధ్ర అభ్యుదయ రచయితల మహాసభకు చాల మందివచ్చి, మా యింటిలో బస చేశారు అ సమయంలో నన్ను అరెస్టుచేసి, వెల్లూరు జైలుకు తీసుకెళ్ళి డిటెయిను చేశారు.

నన్ను హఠాత్తుగా డిటెయిన్ చేశారు; అయిదు నెలలక్రిందట మద్రాసుతో జరిగిన మునిసిపల్ వర్కర్ల (పాకీవారి) సమ్మె జయప్రదంగా ముగియుటకు నేను ముఖ్య కారకుడను. ఇది జయప్రదంగా అంతమైనట్లు ఆ సంవత్సరం ఇండియాలో మరొక సమ్మె జరుగలేదు.

ప్రధాని ప్రకాశం పంతులుగారు ప్రజానాయకుడే. కాని, నన్ను నిర్బంధించుతారని, వారి చర్యలవల్ల నాకు ముందుగానే తెలిసిపోయింది; ఏదో కేసు పెడతారని,

విచారణ జరిపి శిక్షవేస్తారని అనుకొన్నాను. కాని, కాంగ్రెసు నాయకుడు నన్ను డిటెన్షనులో పెట్టిస్తారని అనుకోలేదు. దిక్కులేనివారికి మేలుచేయడంకూడ ఒక అపరాధమేననీ, చట్టప్రకారం ప్రవర్తించినా తప్పేననీ అప్పటికి నాకు అనుభవంలోకి వచ్చేసింది.

నిలువుదోపిడి

మేము ఊహించలేనట్టి విషయమొకటి జరిగింది. అరెస్టుచేసి, పోలీసు స్టేషనుకు తీసుకెళ్ళి, మా ఒంటి మీది వస్తువులను (కలం, గడియారం, డబ్బు, సిగరెట్లు) వగైరా తీసుకొని జైలువద్ద మళ్ళీ యిచ్చేస్తామని చెప్పి యివ్వనేలేదు. మొత్తం రాజధాని అంతటా సుమారు 170 మందిని అరెస్టుచేసి వెల్లూరు జైలుకు తీసుకొచ్చారు. సాధారణంగా అందరికీ అన్నిచోట్ల అలాగే నిలువుదోపిడి జరిగింది. కొందరి కళ్ళజోళ్ళనుకూడ తీసుకొని యివ్వలేదు. ముందుగా యివ్వబడిన ఆర్డర్ ప్రకారమే పోలీసులు చేశారని తెలిసిపోయింది. శ్రీ పంతులుగారు ప్రధానిగా వుండేటప్పుడు యింత అమానుషంగా జరగడం నాకు వింతగానేవున్నది ఎన్నో వారాలు, నెలలు జరిగిపోయిన తరువాత శ్రీ పంతులుగారే కారకులని ఊహించుకోవలసి వచ్చినందున విచారపడ్డాను.

పెట్టుకోవలసిన అధికారులందరికీ, అన్ని డిపార్టుమెంటులకూ ఎన్నో అర్జీలు పెట్టుకొంటిమి; వారాలు,

నెలలు జరిగిపోతున్నాయి. కోర్టులో కేసులు దాఖలుచేసి మా సామాన్లను యిప్పించమని మా ఆడ్వొకేట్లకు వ్రాశాము. నూతనంగా పంతులుగారు ప్యాసుచేయించిన శాంతిరక్షణ చట్టం ప్రకారం అలాంటి కేసులకు తావు లేదని వారు మాకు తెలిపారు. పంతులుగారి ప్రతిభా విశేషానికి విస్తుపోవడమేగాక విచారపడ్డాను.

చివరకు, ఒకనాడు డాక్టరు సుబ్బరాయను సతిగారు అల్లుని (యన్ కె. కృష్ణన్) చూచుటకు జైలుకు రాగా వారితో మా కష్టాలనుగూర్చి కృష్ణన్‌గారు చెప్పారు. రాధాభాయిగారు మితులకు, చీఫ్ సెక్రటరీగారికి, జైళ్ళ ఇన్‌స్పెక్టరు జనరల్‌కు టెలిఫోను చేశారట; ఉపయోగం లేకపోయిందట. తరువాత మద్రాసు పోలీసు కమీషనరు గారిని మొగమాటపెట్టి ఒప్పించి, మద్రాసు డెటినూ్యలకు మాత్రం సామానులు వచ్చేలా చేశారు. అయితే యితర డెటినూ్యలకు అటుతరువాత పంతులుగారి మంత్రిత్వం అంతమయ్యేకాలంలోగాని రాలేదు. సులోచనాలు లేక ఎందరో పడినబాధలు నాకు పంతులుగారిని జ్ఞాపకం చేస్తూనే వున్నాయి.

ఇంకా ఎన్నో బాధలు

ప్రకాశంపంతులుగారు మరికొన్ని కష్టాలుకూడా పెట్టారు. 1939 సంవత్సరంనుండి ఈ డిటెన్షన్ పద్ధతి అమల్లో ఉంటూవున్నది. కొన్ని వందలమంది కాంగ్రెసు

వాదులు, కాంగ్రెసేతరులు కలసి డిటెన్షన్‌లోవున్నాము. మా కందరికి కొన్ని సౌకర్యాలు ఉంటూవచ్చాయి. ఇందుకు ముఖ్యకారణం మా మీద ఎలాంటి కేసులు, నేరాలు లేనందుననే నని విదేశ్ప్రభువులు చెప్పారు. 1947లో కాంగ్రెసేతరులు మాత్రమే డిటెయిను చెయ్య బడ్డారు. వీరిలో ముఖ్యంగా కమ్యూనిస్టులు, కార్మిక, కర్షకసంఘాల నాయకులు మాత్రమే డిటెయిను చెయ్య బడ్డారు.

ఏడు సంవత్సరాలుగా బ్రిటిష్ప్రభుత్వం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పంతులుగారు ఒక్కదెబ్బతో తుడిచి పెట్టారు. భోజనం విషయంలో సుమారు మూడోవంతుకు తగ్గించారు. శిక్షపడిన రాజకీయ ఖైదీలకు యిచ్చే భోజనాన్నే శిక్షలేని డెటినూ్యలకు కూడా యివ్వవలసిందిగా మార్పుచేశారు. అన్నం, పప్పు, గుమ్మడికాయలు, అకు కూరలు ప్రతిపూట తిని కడుపుబ్బరంతో బాధపడు తూండేవాళ్ళం.

అంతేకాదు; రాత్రి ఎనిమిదిగంటలకే మమ్మల్ను గదుల్లో నూసివేసి, తెలవారేదాకా తాళంవేసేవారు. మలమూత్రాలు సైతం గదిలోనే.

ఉత్తరప్రత్యుత్తరాలు, ఇంటర్వ్యూలు మొదలైన అత్యవసరాలకుకూడ అనుమతి యివ్వలేదు. జైలు సూప రెన్‌టుగారేమో తనకు రూల్సునుగురించి ఉత్తరువులు రాలేదన్నారు. అలాగే అన్నారు ఇన్స్పెక్టర్ జనరలు.

ఛీఫ్ సెక్రటరీగారుకూడ అదే జవాబు. చివరకు జైలు మంత్రిగారైన కె. భాష్యంగారిని అడగ్గా "ప్రధాని టంగుటూరు ప్రకాశం పంతులుగారికి నేరుగా ప్రాసుకోమన్నారు. ఇలాగే మూడునెలలకాలం బాధపడినాము.

పంతులుగారి ప్రభుత్వం పోయి, రెడ్డియార్ మంత్రిత్వం రాగానే 1945 సంవత్సరానికి పూర్వం విదేశీ ప్రభుత్వంలో డెటినూ్యలకున్న సౌకర్యాలు తిరిగి అమల్లోకి వచ్చాయి. పైన ప్రాసిన కష్టాలన్నీ తొలగిపోయినయి. గొప్పవారైన పంతులుగారి హృదయంలో చివరకు కరుణ అనేది పూర్తిగా నశించిపోయినదా అన్న సంశయంతో నా విచారాన్ని కొందరు మిత్రులకు తెలుపగా "ఎప్పటికో వారిది జాలిగుండే; కాని ఎందుకలా చేశారో కారణం చెప్పలే"మన్నారు వారు. పంతులుగారిలో కలిగిన యీ పరిణామానికి కారణాన్ని కనుగొనుటకు మనస్తత్వ శాస్త్రజ్ఞుడను కానుకదా!

♦ ఇటీవల తెలుగు మాసపత్రికలలో మూడు కథలు చదివాను.

"మనుష్యులా, మరలా?"

"భస్మాసురుడు"

"ప్రబ్రహ్మరాక్షసులు"

అప్పటి రాజకీయపరిస్థితులగురించి ఎంతో బాగా ప్రాశారు.

పునర్విమర్శ

జైళ్ళలోడెటినూ్యలకు కావలసినంతతీరికఉంటుంది. కాబట్టి పునర్విమర్శలు జరుగుచుండేవి. లోగడ యుద్ధ కాలంలోని కమూ్యనిస్టు పాలసీని ఇప్పుడు (1947 లో) జైలులో పునర్విమర్శచేశాము. అప్పటి పాలసీ సరికాదనీ, (అనగా ఇంటర్‌నేషనల్ దృక్పథంమీద ఆధారపడిన దని, జాతీయవాదంమీద ఆధారపడలేదని) చాలమంది అభిప్రాయపడ్డారు. పొరపాట్లు చేస్తూ వచ్చామనీ, అనుభవ జ్ఞానంలేని లోపంవల్ల పార్టీ, పార్టీనాయకులూ, తప్పుత్రోవల్లో పోయినారనీ కొందరు ప్రత్యక్షంగా నిర్మొగమాటంగా చెప్పారు.

1947 ఆగస్టు 15 తేదీకి మమ్మల్ని నందరిని స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో విడుదల చేస్తారని తెలిసింది. రానున్న రాజకీయాలను గురించి చాలా చర్చలు జరిగాయి.

1 రానున్న స్వాతంత్ర్యంసంపూర్ణస్వరాజ్యం కాదనీ డొమినియన్ ప్రభుత్వానికి దిగజారుతుందనీ,

2. బ్రిటిష్‌వారు తమ దోపిడిని సాగించుకొంటూనే ఉంటారనీ,

3 భారతీయ పెట్టుబడిదారులు విదేశ పెట్టుబడిదార్లతో కలిసి, ప్రజలను మరీ ఎక్కువగా దోచుకొంటారనీ,

4. రాజులు, మహారాజులు, జమీందారులు తమ దోపిడిని ఏదోవిధంగా అనుభవించుతూనే వుంటారనీ,

5. ప్రభుత్వాధికారంలో అధికభాగం ఇండియా పెట్టుబడిదారులకూ వారితరఫున కాంగ్రెసు నాయకులకు సంక్రమిస్తుందనీ,

6. కాంగ్రెసు నాయకులు, రాజులు, జమీందారులు, పెట్టుబడిదారులు కలసి రాజ్యమేలుతారనీ.

7. పరిశ్రమలు వగైరా జాతీయం చెయ్యరనిన్నీ,

8. పెద్ద ఉద్యోగస్తులు తమ అధికారాలను, అధికభోగాలను అనుభవిస్తూనే వుంటారనీ,

9. "ఇన్ఫ్లేషను" వల్ల వెలలు పెరిగిపోతూనేవుంటాయనీ, మధ్యతరగతి, కార్మిక-కర్షక జనానికి అధికబాధలు పెరిగిపోతూవుంటాయనీ అప్పుడు మేము అనుకున్నాము.

అంతేకాదు; కమ్యూనిస్టుపార్టికి, కార్మిక కర్షక సంఘాలకు కష్టాలు అధికమవుతాయనీ, విడుదలైనవాడు మరల జైళ్ళకు పంపబడుతారని అనుకున్నాము.

అయితేనేం? ఒక్క విషయంలోమాత్రం ఆశాజనకంగా కనుపించినది. వయోజనులందరికీ ఓటుహక్కు ఉండడంవల్ల పార్లమెంటరీ పద్ధతులతో ప్రభుత్వం నడుస్తుందని నమ్మాము. అందువల్ల, అధికసంఖ్యాకులైన పేదసాదలకు కమ్యూనిస్టుదృక్పథం అంగీకార మయ్యేలాగున బోధించవచ్చుననీ, భారతదేశంలో దారిద్ర్యము, రక్త

పాతములు లేకుండా, అంతర్యుద్ధాలు, విప్లవము లేకుండా తీవ్రమైన మార్పులు రాగలవని ఆశించాము.

రెండు దృక్పథాలు

కాంగ్రెసులో రెండుపార్టీలవారున్నట్లునూ, నెహ్రూపార్టీ అభ్యుదయకరమనీ, పటేలుపార్టీ అలాకాదనీ, అందువల్ల నెహ్రూను బలపరచాలనీ మాలో మెజారిటీ అభిప్రాయపడినారు. "ఇద్దరూ ఒకటే; పటేలుగారు చక్రం తిప్పుతారనీ, అభ్యుదయవాదులుగా కనపడే నెహ్రూ మొదలైనవారందరూ పటేలుగారి పరిపాలనావిధానంలో లీనమైపోతా"రని మైనారిటీ అభిప్రాయపడ్డారు.

ఘుమూను ఏడునెలలకాలం జైలులో యీ విధంగా చర్చలు జరిగాయి. కాలం ఉపయోగకరంగా గడిచింది. చదువులు బాగా సాగాయి. రాజకీయపరిజ్ఞానం అభివృద్ధి చెందింది.

ఎన్. కె. కృష్ణన్

కామ్రేడ్ ఎన్. కె. కృష్ణన్ జైలులో మాకు నాయకుడుగా వున్నారు. వారిబుద్ధికుశలత ప్రశంసించదగినది. అనేక విషయాలను చక్కగా చదివి జీర్ణించుకొన్న పతిభాశాలి. ఎంత గొప్పవిషయాన్నీ, ఎంత చక్కని సమస్యనైనా పండు ఒలిచి చేతిలో పెట్టినరీతిగా బోధించేవారు. రెండుమూడుగంటలు ఉపన్యసించినతరువాత ప్రశ్నలు వేసి సంశయాలను తీర్చుకోమని కోరేవారు

ఎన్. కె. కృష్ణన్‌గారికి ఇంటరు, బి. ఎ. పరీక్షలలో వచ్చిన మార్కులు మద్రాసు యూనివర్సిటీలోనే అత్యధిక మనీ, కొన్ని సబ్జక్టులలో ఇప్పటికీ వారి రికార్డును మించిన వారు లేరనీ కొందరు చెప్పారు.

ఐ. సి. యస్. పరీక్షకోసం ఇంగ్లాండుకు వెళ్ళి, కమ్యూనిస్టుగా మారివచ్చిన వ్యక్తి ఆయన.

గొప్ప మేధావి మాత్రమే కాదు. నిరాడంబరజీవి కూడాను. బట్టలు చాలక చాలమంది డెప్టినూ్యలు బాధ పడుతూండేవారు. కొందరు వ్యవసాయకూలీలను పొలాల్లో అరెస్టుచేసి జైలుకు తీసుకొచ్చారు. మరికొందరు ఫ్యాక్టరీ కార్మికులు. వీరు పై బట్టలతో వచ్చారు. మాలో మేము ఎంత సహాయం చేసుకుంటున్నా, బట్టల సమస్యను పరిష్కరించడం సాధ్యపడలేదు. కృష్ణన్ ఒక్క తువాలుమాత్రమే చుట్టుకొని కాలంగడపడం ప్రారంభించాడు.

"ఏం! మహాత్ముడివి కావాలని ప్రయత్నిస్తున్నావ?" అని పరిహసించాను.

"లేదు. బయటకి వెళ్తే బట్టలెక్కువ అవసరం. అందువల్ల దాచిపెట్టుకుంటున్నాను" అన్నాడు. అలాగే ఆయన జైల్లో తువ్వాళ్ళతో కాలంగడిపారు. బట్టలు చాలవని కష్టాలు చెప్పుకోవడం మానేశారు. అంతేకాదు; బయటినుండి బంధువులు తిను బండారాలేమి తెచ్చియిచ్చినా చూడనైనా చూడకుండా అందరికీ సమానంగా

పంచిపెట్టవలసిందని యిచ్చేసేవారు. తనకు వచ్చే డబ్బును కూడా లేనివారికి యిచ్చేవారు. ఆయనకు కొన్ని లోపాలు కూడా లేకపోలేదు. భోజనంకంటె కాఫీ, టీ, సిగరెట్లే ముఖ్యం.

కాంగ్రెసు మిత్రులు

1947 ఆగష్టు 14 తేదీన మేము విడుదల కాగానే మద్రాసు సెంట్రలు స్టేషనులో చాలమంది పూలదండలతోను, జండాలతోను వచ్చి మమ్మల్ని సన్మానించారు. వీరందరూ మద్రాసులోని కార్మికులు, విద్యార్థులు, కాంగ్రెసువాదులు, మధ్యతరగతి విద్యాధికులు మాతం రాలేదు; దేశభక్తులు రెండువర్గాలుగా చీలిపోతున్నారని గ్రహించాము.

కాంగ్రెసు మిత్రులు నన్ను కలుసుకొన్నప్పుడు నా రాజకీయాలను ఖండించేవారు. కాంగ్రెసును అధికారాన్నుండి కొలగించి, కమ్యూనిస్టుపార్టీ అధికారంలోకి రావాలని ఉద్దేశించుతున్నట్టుగా నిందించేవారేగాని, స్వరాజ్యం ప్రజారాజ్యంగా మారుతున్నదా లేదా అనే విషయాన్ని ఆలోచించడంలేదు. ఎన్నికల ప్రణాళికల ప్రకారంకాని, పూర్వపు కాంగ్రెసు తీర్మానాల ప్రకారం కాని కాంగ్రెసు పరిపాలించుచున్నదా లేదా అని కాంగ్రెసు మిత్రులు విమర్శించడం మానేశారు. ఆ కాలంలో (1947-48 లో) కమ్యూనిస్టులు ప్రభుత్వాధికారం

కొరకు తమతో పోటీ చేస్తున్నారని సంశయించి, వారిని ద్వేషించడం, వారిని చూచి భయపడడం ఎక్కువవుతూ వచ్చింది.

జైలునుండి బయటికొచ్చిన తరువాత కార్మిక సంఘాలలో పనిచెయ్యడ మానేశాను. దేహదార్ఢ్యం సన్నగిల్లుతోంది. అందువల్ల కష్టమైన పనులను, బాధ్యతతో కూడిన పనులను మానివేశితిని. పార్టీ కార్యకలాపాలను కూడ మానుకొంటూ వచ్చాను. నా వయసు అరవై సంవత్సరాలకు సమీపించుతున్నది. శక్తికి తగినట్లు ప్రవర్తించడం మంచిదని రాజకీయాలనుకూడ పూర్తిగా వదలిపెట్టాలని నిశ్చయించుకున్నాను.

"మా భూమి" నాటక ప్రదర్శనాలు

ఆ కాలంలో నైజాం నవాబు ప్రభుత్వంమీద, రజాకార్లమీద ఇండియా అంతటా ద్వేషం పెరిగిపోతున్నది. ఆగస్టు 15 తేదీ తరువాత నైజాం ప్రభువు ఇండియా ప్రభుత్వంతో కలిసిపోవుటకు నిరాకరించడంతో ప్రజలు కోపోద్రిక్తులయ్యారు. అప్పటికే తెలంగాణా ప్రజలు ప్రభుత్వంమీద తిరుగబడి పోట్లాడుతున్నారు. నైజాం సంస్థానంలో కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీలవారు ప్రజలకు నాయకత్వం వహించి ఆయుధాలతో పోరాటాలు సాగించియున్నారు. మరొకవిధంగా రజాకారు రాక్షసులను అణచలేకపోయారు.

ఆంధ్రదేశంలో కమ్యూనిస్టుపార్టీ వారు "మాభూమి" నాటక ప్రదర్శనాలతో ప్రజల అభిప్రాయాలను మార్చి వేయుచుండిరి. నైజాం రాక్షసత్వాన్ని ద్వేషించుటకు ప్రజాప్రభుత్వమే శరణ్యమని నిరూపించుటకుగాను, ఆ నాటకం బాగా వుపయోగపడుతున్నది. రచయితలు, నాయకులు దానిని చాలా మెచ్చుకున్నారు. ఆ నాటకం చూడాలని, నాకు కోరిక కలిగింది.

నైజాం ప్రభుత్వంతో పోట్లాడే తెలంగాణా ప్రజలకు ఆయుధాలకని కాంగ్రెసుపార్టీవారు, కమ్యూనిస్టుపార్టీవారు ప్రత్యేకంగా ధనం వసూలుచేసి యిస్తూండేవారు. మద్రాసులోకూడ కాంగ్రెసువాదులు వసూలుచేసిన తరువాత కమ్యూనిస్టులుకూడ వసూలుచేసి పంపండని ఆంధ్ర రాష్ట్ర పార్టీవారు నన్ను కోరారు. "మాభూమి" ప్రదర్శనాలద్వారా వసూలు చెయ్యగలనని, నాటకబృందాన్ని పంపండని కోరాను.

అలాగే నాటకబృందం వచ్చింది. డబ్బువసూలు అంత ముఖ్యంకాదనీ, మద్రాసు నగరంలోని ఆంధ్రనాయకులు, మంత్రులు, పత్రికా రచయితలు మొదలగు ప్రముఖులు చూచేలాగు, దానిని ప్రశంసించేటట్లు పత్రికలలో వచ్చేలాగా చేయమని కోరారు. అలాగే చేశాము. డబ్బు కూడా వసూలుచేశాము.

అప్పుడు కాంగ్రెసు మంత్రులు యిలాంటి ప్రచారానికి చాల సుముఖంగా వున్నారు. నాటకం ప్రజారంజ

కంగా ఉన్నది. అందరూ మెచ్చుకొన్నారు. కొందరు మంత్రులు, హైకోర్టు జడ్జీలు మెచ్చుకోవడమేగాక రు. 116/లు బహుమతు లిచ్చారు.

శ్రీ సీతారామరాజు బుర్రకథ

మద్రాసులో "మా భూమి" నాటక ప్రదర్శనాలు చూచి మంత్రులు ఆనందించే ప్రోత్సహించుటవల్ల బిటిష్ ప్రభుత్వంచే నిషేధింపబడిన "సీతరామరాజు బుర్రకథ" రాజాజీ హాలులో శాసనసభా సభ్యులకు ప్రదర్శించబడినది. దానిమీాదవున్న నిషేధం తొలగించుతామని మంత్రులు ఆశపెట్టారు.

మూడు నాలుగు నెలలు గడిచాయి. ఆ నిషేధం తొలగలేదు. సరిగదా "మాభూమి" నాటక ప్రదర్శనాల మీాద మద్రాసు కాంగ్రెసు ప్రభుత్వం నిషేధం ప్రకటించింది.

ముందు ఆలోచన లేకపోవుటవల్ల కాంగ్రెసు నాయకులు "మాభూమి"ని ప్రశంసించి విరాళాలిచ్చారు. వారే తరువాత నిషేధించి అణగద్రొక్కారు. ఈ విధంగా కాంగ్రెసు ప్రభుత్వం తన అభిప్రాయాన్ని మార్చుకోవలసిన పరిస్థితి కలుగుతుందని మేము ముందుగా భావించినట్లే జరిగింది.

మహాత్మ నిహత్య

గాంధీజీ హత్యకు ముందురోజు సాయంత్రం ఆర్. యస్. యస్. ర్యాలీని మైలాపూరులో చూచాను. నేను వారి ర్యాలీని చూడడం అదే మొదటిసారి. తిరుణాలకు వచ్చేట్లు స్త్రీలు, పురుషులు పిల్లలు గుంపులు గుంపులుగా వచ్చారు; ముఖ్యంగా విద్వాంసుల కుటుంబాలవారు- తెలుగు, తమిళ, మళయాళ, కన్నడ, హిందూస్థానీ యులు అందరూ వచ్చారు. హైందవేతరులు మాత్రం రాలేదు. బహుశా ఆహ్వానింపబడలేదేమో! ఏర్పాట్లు చాలా బాగా చేశారు. వేలమంది వాలంటీర్లు పాల్గొన్నారు. క్రమశిక్షణ, వ్యాయామాలు చాల నైపుణ్యంగా ప్రదర్శించారు.

ప్రజలేగాక, చాలమంది విద్వాధికులు, ధనాఢ్యులు, అధికారులు కూడ వచ్చారు. కాంగ్రెసు అగ్రనాయకులు రాలేదు. కాని, చిల్లరనాయకులుకూడ కొందిమంది వచ్చారు. కాంగ్రెసు ఉద్యమంతో గాని, ఏ జాతియోద్యమముతోగాని సంబంధంలేనిపెద్దలు చాలామంది వచ్చారు. అలాంటివారి నందరిని మరొక మీటింగులో నేను చూచియుండలేదు. ఇంతమంది ఆర్. ఎస్. ఎస్. ఉద్యమాన్ని ఆదరించడం చూడగా నాకు ఆశ్చర్యం వేసింది. నా ఆశ్చర్యాన్ని చూచికాబోలు, యుద్ధకాలంలో ఐ యమ్. ఎస్. ఆఫీసరుగా ఉన్న ఒక యువకుడు సగర్వంగా నాతో "ఆర్.

ఎస్. ఎస్. ఉద్యమంలో చేరండి" అన్నాడు. నాకు నవ్వు వచ్చింది. తర్వాత చాలక్ గోల్వాల్కరుగారి ఉపన్యాసం కొంత విన్నాను. జాతీయోద్యమాన్ని జాతీయ యోధులను తీవ్రంగా ఖండించారు. నాకు అసహ్యం వేసింది. మధ్యలో లేచి వెళ్ళిపోయాను. కాని, హిందూ విద్యార్థికులలో ఆ కమ్యూనల్ ఉద్యమముయొక్క బలం మున్నగువాటి వ్యాప్తిని కళ్ళారా చూచి నాకు భయం కలిగింది. వీరి కోరిక ప్రభుత్వయంత్రాంగాన్ని పట్టుకోవాలని, తద్వారా జాతిమతద్వేషాలతోకూడిన నియంత్రృత్వాన్ని స్థాపించుతారు. మన జాతీయోద్యమానికి, ప్రజాస్వామ్యమునకూ అన్నివిధములైన అభ్యుదయోద్యమాలకు ఈ జాతి మత దురభిమానపూరితమైన ఉద్యమంవల్ల తీరనిహాని సంభవిస్తుందేమోనని చాల విచారపడినాను.

మరునాడు ఉదయం ఒక మిత్రుని వెంటతీసుకొని శ్రీ వీరేశలింగంగారి శతవార్షికోత్సవ సందర్భంలో పని చేయుటకు బయలుదేరాను. ఆ మిత్రుడు ఆంధ్రదేశంలో ప్రఖ్యాతిచెందిన ఒక హైస్కూలు హెడ్‌మాస్టరుగా వుండిరి. వారు అభ్యుదయ భావములు కలవారనీ, గొప్ప సంస్కార ప్రియులనీ ప్రఖ్యాతిగలవారు. నేను చూచిన ర్యాలీనిగురించి ప్రస్తావించాను. "అది దేశభక్తులసంస్థ. ఢిల్లీలో వారుచేసినసేవ అమోఘం. ముస్లింలీగు కుట్రలను బయటపెట్టి, కాంగ్రెసునాయకుల ప్రాణాలను రక్షించారు" అని చెప్పి, తమ పట్టణంలో జరిగిన ర్యాలీకి తానే అధ్య

కృత వహించినట్లుకూడ సగర్వముగా చెప్పారు; రెండు రోజులకు జరుగబోయే ఆంధ్రరాష్ట్ర శ్యాలీలో చాలక్ గోల్వాల్కరుగారు ప్రసంగించుతారనీ, ఆ ప్రదర్శనంలో తానే ప్రారంభోపన్యాసకుడననీ చెప్పారు. నాకు ఈ విషయాలు చాల ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఇలాంటి గొప్పవ్యక్తి ఆర్. యస్. యస్. ఉద్యమాన్ని అభిమానించి గర్వపడ్డారంటే, జాతీయోద్యమం గతి ఏమవుతుందోనని విచారపడినాను.

ఆ సాయంత్రం కలకత్తా మెయిలులో గోల్వాల్కరు గారు బెజవాడకు బయలేరుతారు. ఆర్. యస్. యస్. వాలంటీర్ల వీడ్కోలు ప్రదర్శనా లుంటాయి, చూద్దామని నేను సెంట్రల్ స్టేషనుకు వెళ్ళాను. వేలమంది వాలంటీర్లు వచ్చారు. రైలుబయలు దేరుటతోనే స్లోగన్సు ప్రారంభమై దారి వరుసలుగా బారులుతీరి కూర్చున్నారు. ఎంత క్రమశిక్షణ!

ఇంతలో గాంధీగారిని హత్యచేశారనే వార్త పిడుగులాగున వచ్చిపడింది. ఒక్కక్షణం అలాగే స్తంభించిపోయాను. హృదయంలో భరించరాని బాధ కలిగింది. నాకు తెలియకుండానే కళ్ళనుండి నీరు కారిపోతోంది. జాతీయపితనే చంపేశారు. అందరం తండ్రిలేని పిల్లలమై పోయాము. మనకేమేమో దుఃఖకరమైన భావాలు రాసాగాయి. మరి నిలువలేకపోయాను.

ఇంతలో అర్. యస్. యస్. వారివైపుకు నా దృష్టి మళ్ళింది. వాలంటీర్లలో ఎంతమాత్రం అలజడి కనుపించలేదు. పైగా కొందరి ముఖాల్లో చిరునవ్వు కనుపించింది. ఈ దృశ్యం నన్ను మరింత బాధపెట్టింది. ఇక నక్కడ ఉండలేక బయటికి వచ్చివేశాను.

ప్రజలలో మాత్రం యీ వార్త ప్రళయంలా బయలుదేరింది. హాహాకారాలు మిన్నుముట్టాయి. "మహాత్మునిని చంపడమే?" "ఎవరు చంపారు?" "ఇండియాగతి ఏమవుతుంది?" "అంతర్యుద్ధానికీ, రక్తపాతానికీ దారి తీస్తుందా?" అని ప్రజలనుకోవడం విన్నాను. నీరసంగా వుంది; ఇంటికి చేరుకున్నాను.

ఇక యింటివద్ద నా భార్య, బిడ్డలు దుఃఖంలో మునిగివున్నారు. రేడియోవద్ద కూర్చొని విషాద గీతాలు, ఏడ్పులువింటూ, తామూఏడుస్తూ కూర్చున్నారు. ఎవరూ భోంచెయ్యలేదు; పడుకోలేదు; నిద్రలేదు. ఇంటిలో నౌకర్లు నిశ్చాంతపడిపోయారు. అందులో ఒకరు నా భార్యను ఇలా ఖిన్నురాలు అడిగారు: "ఏమండీ అమ్మగారూ! మీ తండ్రి చనిపోయినపుడుకూడ మీరిలా దుఃఖించలేదుకదా? మరి యిప్పుడింత దుఃఖిస్తారేమిటి?"

"అప్పుడు నాకు మాత్రమే తండ్రి పోయాడు? ఇప్పుడు నాకేకాదు; అందరి తండ్రి పోయాడు; మన మందరం దిక్కులేని పిల్లలమైపోయాము" అన్నారు సుభద్రమ్మగారు.

ముస్లిమే హత్యచేసి వుంటాడని మొదట్లో నేనను కున్నాను. కొంతసేపటికి ముస్లిం చేసివుండడని తోచింది. చేస్తే ముస్లిములకు చాల హానికలుగుతుందని వారికి తెలుసును. మతపిచ్చగల హిందువే చంపి ముస్లిముమీదికి నిందవేసివుంటాడు: బహుశా ఆర్. యస్. యస్. లోనే యిలాంటి రాక్షసుడు, జాతీయవాదద్వేషి వుండాలను కొంటూ మరునాడు బజారులో నడుస్తున్నాను. ఐ. ఎమ్. ఎస్. లో వున్న ఆర్. యస్. యస్. యువకుడు ఎదురు పడ్డాడు. ఆర్. యస్. యస్. వారే హత్యచేసి వుంటారని నా సంశయాన్ని ఆయనతో చెప్పాను. "అలాగా?" అని సగర్వంగా చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయాడు. నాకు ఆశ్చర్యం కలిగి నిలబడిపోయాను. ఆయన వెళ్తూంటే ఆయనవేపే చూస్తూ వుండిపోయాను. రొమ్మువిరిచి నడిచిపోతున్నాడు.

హత్యనుగురించి వివరాలు తెలిసిపోయాయి. కొందరు ఆర్. యస్. యస్. భక్తులు మిఠాయిలను పంచి పెట్టారనీ విన్నాను. వారికి వ్యతిరేకంగా చాల ప్రదేశాలలో ప్రజలు ప్రదర్శనాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఆ ప్రదర్శనాలను అణచి వేస్తూ ఆర్. యస్. యస్. వారికి హానికలుగకుండా కపాడుతున్నారు.

రెండు మూడు రోజులు గడిచాయి. ఒక మాజీ ప్రిన్సిపాలుగారిని వారి యింటిలో కలుసుకున్నాను.

"హత్యలతో మన దేశసమస్యలు ఎలా పరిష్కారం కాగలవు? డెమోక్రటిక్ పద్ధతులు మాత్రమే మనకు శరణ్యమండి!" అన్నారు వారు.

ఆయన కుమారుడు అందుకొన్నాడు — "గాంధీ గారిని చంపడం మంచిదేనండి; లక్షలకొలది ప్రజలు చచ్చిపోయ్యేదానికంటే ఒకరుమాత్రమే చావడం మంచిదికదా? ఇంకా ఒకరిద్దరు నాయకులను చంపేస్తే మనదేశం బాగుపడుతుంది" అన్నాడు ఆ యువకుడు.

తండ్రికీ, నాకూ ఆశ్చర్యంవేసింది. "ఒక మహాత్ముడు చాలడట్టా! ఇంకా ఇద్దరిని చంపాలనా?" అని తండ్రి మందలించాగు.

"అవును! అప్పటికిగాని దేశం బాగుపడదు!" అన్నాడు కొడుకు. తండ్రిగారికి భయం కలిగింది.

"మా మాటల్లో నీ కెందుకు జోక్యం? నోరుమూసుకొని ఇక్కడినుండి వెళ్ళిపో" అన్నారు తండ్రిగారు.

కొడుకు కాశీ హిందూవిశ్వవిద్యాలయ గ్రాడ్యుయేటు. అక్కడ ఆర్. యస్. యస్. పిచ్చి పట్టిందనిచెప్పి తండ్రి విచారం వెల్లడించారు. విద్యార్థులు ఈ లాగున రాక్షసులవడం నా కంతవరకూ తెలియదు.

వెనుక చెప్పిన మాజీ హెడ్‌మాస్టరుగారు కనుపించారు. "ఆర్.యస్.యస్.వారు దేశభక్తులనుకున్నాను.మా హైస్కూలు కాంపౌండ్‌లో వారి మీటింగులను జరుపుకో

నిచ్చారు. వారు హత్య ఎందుకు చెయ్యాలి?" అన్నారు.

"అయితే, వారిమీద అభిమానం ఇంకా ఉన్నట్టుందే!" అని నా సంశయాన్ని తెలియపరిచాను.

"అవునండి, ఎలాంటి వుత్తమ సంస్కారులైన వ్యక్తులు కొందరుంటారండి" అన్నారు హెడ్‌మాష్టరుగారు. ఆయన అజ్ఞానానికి జాలివేసింది.

బొంబాయికి సంబంధించిన గొప్ప బ్యాంకుకు మద్రాసులో బ్రాంచి వున్నది. దాని మేనేజరుగారిని కలుసుకోవాల్సి వచ్చింది. అదే సమయంలో ఒక దినపత్రిక యజమాని వచ్చాడు. ఆ రోజుల్లో ఎవరింటికి వెళ్ళినా మహాత్ముని హత్యనుగురించిన బాతాఖానీ సహ్యసామాన్యమైనది.

"మహాత్ముని అవతారం అంతరించడం దేశానికి ప్రస్తుతము మంచిదేనండి! ఆయన చేయగలిగిన దేదో చేశారు. స్వరాజ్యం సంపాదించిపెట్టారు. ఇక కావలసింది ఆర్థికాభివృద్ధి. మిల్లులూ, బ్యాంకులూ వగైరా వృద్ధికి తోడ్పడాలి. ఇక ఆయన చేయగలిగిన దేమీ లేదండి! అన్ని విషయాల్లోను, ఆయన జోక్యం కలుగజేసుకొంటూ వచ్చారు; ఆయన చెయ్యలేదు. ఇతరులను చెయ్యనివ్వడు. ఇకమీదట దేశ సౌభాగ్యరథము సాఫీగా సాగిపోగల"దని బ్యాంకు ఏజంటుగారు చిన్న వుపన్యాసమిచ్చి ఎంతో సంతోషంగా కన్పించారు. చెప్పుతో కొట్టాలన్నంత కోపం వచ్చింది నాకు. ఎలాగో కంట్రోలు చేసుకొన్నాను.

వార్తాపత్రిక యజమాని సినికల్‌గా నవ్వుతూ "హా! హీహీ!" అంటూ బ్యాంకు మానేజరు మాటలకు తాళం వేస్తున్నారు.

"అవతారపురుషు లెందరో అలాగే హత్య చెయ్య బడ్డారండి. కృష్ణావతారంకూడ అలాగే అంతమయింది" అని చెప్పి తృప్తిపడ్డారు.

గాంధీగారి హత్యకు దేశంలో ఎంత సానుభూతి ఉన్నదో తెలిసిపోయింది. కాల్చివేసింది ఒక్కడే అయినా వానికి వెనుక నైతిక మదతుగా ధనాఢ్యులు,విద్వాంసులు, మతోన్మాదులు, "దేశభక్తులు" వేలు లక్షలుగా వున్నా రని గ్రహించాను. నలభై సంవత్సరాలుగా రాజకీయోద్య మాలలో పాల్గొంటూవచ్చిన నేను మన మధ్యతరగతి వారినికూడ అర్థం చేసుకోలేకపోతినని సిగ్గుపడ్డాను. గాంధీ జీని భారతీయుడే హత్యచేసినప్పటినుండి రొమ్మువిరుచు కొని, తలెత్తి నడవడం నాకెంతో కష్టంగావున్నది.

గాంధీజీ జీవించియుండగా జీవించేభాగ్యం నాకు లభించినందుకు గర్వపడిన సమయాలు ఎన్నోవున్నాయి. ఆయనను హత్యచేసిన యీ హంతకులకు నైతికంగా సహాయంచేసినవారు "దేశాభ్యుదయంకోసం" చేశామని విగ్రహీగడం నా హృదయాన్ని కత్తితో పొడిచినట్లు బాధ పడుతూనే వున్నాను.

గాంధీగారి హత్యతో కొంతవరకు సంతోషపడుతున్నారనే విషయం నాకెంత విషాదాన్ని కలిగించిందో వ్రాయలేను.

శ్రీ వీరేశలింగం శతవార్షికోత్సవం

1948 వ సంవత్సరంలో శ్రీ వీరేశలింగం పంతులుగారి శతవార్షికోత్సవం రానున్నదని తెలిసి మద్రాసులో వైభవంగా జరిపించాలని పూనుకొన్నాను. నగరంలోనున్న సంఘ సంస్కర్తలను, బ్రహ్మసమాజికులను సంఘటితపరచి ప్రారంభించాలని ప్రయత్నించాను. కాని; వారిలో ఉత్సాహం కనుపించనందున వారిని వదలివేశాను.

తరువాత అభ్యుదయ రచయితలు వుపయోగపడతారని ఆశించాను. కాని, వారు మాటలలో ఎంత వుత్సాహం చూపెట్టినా నిర్ణీత సమయానికి మీటింగులకే రాకపోయిరి.

కట్టకడపటికి శ్రీహరి సర్వోత్తమరావుగారుమాత్రం ఉత్సాహం చూపించుటేగాక, నిర్దిష్ట సమయంలో కలుసుకొనేవాడు. మరొక గొప్ప సుగుణంకూడ వారిలోవున్నది. త్వరగా నిర్ణయానికి రాగలడు; కార్య నిర్వహణకు పూనుకోగలడు. అందువల్ల వారితో కలిసి పనిచేయడం చాల సులభంగా వుండేది.

ఉన్నతోద్యోగులలో కీ॥ శే॥ శ్రీ వింజమూరి గోవిందరాజాచారిగారు చాల ఉత్సాహంతో సహాయం

చేస్తారని తెలుసుకున్నాను. అలాగే ఆడిటరు శ్రీ పి. బ్రహ్మయ్యగారు, కీ॥ శే॥ శ్రీ కే. కల్యాణస్వామిగారు, శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు, శ్రీ కొటవటిగంటి కుటుంబరావుగారు, వీరందరితో ఒక కార్యనిర్వాహక కమిటీని ఏర్పరచి పనులు ప్రారంభించాము. ఈ మాత్రం చేయడానికే మూడునెలలకాలం పట్టింది. బస్సులకు, ట్రామ్ములకు ఒక వందరూపాయలదాకా ఖర్చయినది.

కీ॥ శే॥ గోవిందరాజాచారిగారు

శ్రీ గోవిందరాజాచారిగారికి ఈ విషయంలో చాల ఉత్సాహముండేది. కమిటీలో చేరారు. వారు హైకోర్టు జడ్జీగారు. నేను కమ్యూనిస్టునని తెలుసు. నాతో కలసి పనిచెయ్యడం వారి కిష్టంలేదు. చెయ్యకపోతే తలపెట్టిన పని నెరవేరదు; ఎలాగో కలసి పనిచేస్తూనేవచ్చారు. కొంతకాలానికి తన పేరును కమిటీలోనుండి తొలగించ వలసిందని కోరారు. కాని, సహాయం చేస్తూనే ఉండే వారు. లెటర్ పేపర్లమీద లోగడ ఆయన పేరునుకూడ కలిసి అచ్చు వేయించాము. ఆయనపేరు కనపడేటట్టు కొట్టివేసి ఉపయోగించుతుండేవాడిని. ఆయనపేరు ఉండడం ఎంతో అవసరంగా తోచింది నాకు. అంతమాత్రం కొట్టివేస్తే చాలదనీ, తన పేరు లేకుండా మళ్ళీ అచ్చు వేయించవలసిందనీ నిర్బంధించారు. అలాగే చేశాను.

ఆయన సలహా, సహాయం ఈ సందర్భంలో చాల అవసరమని క్రమంగా తెలుసుకొంటిని అందువల్ల నా కమ్యూనిజాన్ని ప్రదర్శించుకోలేదు. రాజకీయవాదాలు వారితో పూర్తిగా మానివేశాను. అంతటితో నాయందు వారికి నమ్మకం కలిగింది. కాని, చివరవరకు నావుత్తరాలకు ప్రాతమూలంకంగా ప్రత్యుత్తరాలు వ్రాయనేలేదు. అవసరముంటే టెలిఫోనులో మాట్లాడుతూండేవారు. అయితేనేం? మొదటినుండి కడపటివరకు వారు సహాయం చేసియుండకపోతే మద్రాసులో అంత వైభవంగా, అంత జయప్రదంగా వీరేశలింగంగారి శతవార్షికోత్సవం జరిగి వుండేది కాదు.

ఎలక్షన్లు—రాజకీయపు పెత్తు

చివరకు శ్రీ గోవిందరాజాచారిగారు ఒకరోజున టీకి తన యింటికి రమ్మన్నారు. శతవార్షికోత్సవాన్ని గురించి తీర్మానించుకోవలసిన విషయాలు చాలా వున్నాయి.

అప్పుడు ఆయనే రాజకీయాలు తెచ్చారు. మరె వరూలేరు. ఉన్నదున్నట్లు మాట్లాడుకోగలిగాము. కొంత సంభాషణ జరిగిన తరువాత ఎలక్షన్లు విషయం వచ్చింది.

"ఎలక్షన్లు జరుగవు" అన్నారు ఆయన.

"మీరు పోరసాటుపడుతున్నారు. 1950 సంవత్సరంలోగా జరుగుతాయని పేపర్లలో నాయకుల ఉపన్యాసాలు చదువడంలేదా?" అని అడిగాను.

"వయోజన ఓటింగుహక్కు ఉన్నంతకాలం ఎలెక్షన్లు ఉండవు; కాలయాపన చేయబడుతూనే వుంటుంది" అన్నారు.

"నాకు నమ్మకం కలగడంలే"దన్నాను.

"నీకంటే ఎక్కువ రహస్యాలు తెలియుటకు నాకు అవకాశాలున్నాయి" అన్నారు మళ్ళీ ఆయన.

"తుదకు మనకూ రష్యాగతీ, చైనాగతే పడుతుందా?" అన్నాను. వారు సమాధానం చెప్పలేదు. కాని, వారి ముఖంలో సంతోషం పోయి దిగులు మాత్రమే కన్పించింది. నాకు ఫలహారాలు, కాఫీ చాలా చేదు వేశాయి. ♦

వీరేశలింగంగారి సంస్థల పాట్లు

శ్రీ గోవిందరాజుచారిగారికి శ్రీ వీరేశలింగంగారి మీద అత్యంత అభిమానం. అంతేకాదు; పంతులుగారు స్థాపించిన సంస్థలు, ఆస్థులు సరిగా నిర్వహింపబడుటలేదని, వాటిని సరియైన స్థితిలో పెట్టుటకు ప్రయత్నించవలసిందని మద్రాసు ఆంధ్ర ప్రముఖులు చాలామంది మాతో అన్నారు. ఇలాంటి విషయాలను గురించిన వివరాలు

♦ వయోజన ఓటింగు విధానం వున్నంతకాలం ఎన్నికలు జరుగవనే విషయం మనదేశ రాజకీయ రంగంలో ఎలా పరిణమిస్తుందోనని ఆలోచనలు కలిగాయి

తెలియని నాలాంటివాడు ఎన్నో విచారకరమైన విషయాలను వినవలసివచ్చింది. పంతులుగారి శిష్యులలో నియోగి వైదిక తగాదాలతోను, బ్రాహ్మణ అబ్రాహ్మణ తగాదాలతోను వారు స్థాపించిన సంస్థలు పాడైపోతున్నాయని గోవిందరాజాచారిగారూ, నేను విచారపడితిమి.

"ఇంతమంది ఆంధ్రులము, హైకోర్టు జడ్జీలము ఉన్నాంగదా! సలహా యివ్వలేమా? తగాదాలు తీర్చుకోకూడదా? సరియైన స్కీము నేర్పరచుకోకూడదా? నేనే ప్రాక్టీసు చేస్తూవుంటే స్కీముసూటు వేసివుండును. అప్పుడు మరెవరిచేతనైనా స్కీముసూటు వేయించవచ్చు. ఖర్చులకుగాను పదివేలరూపాయలు వసూలుచేదాము. కోర్టు కెక్కకుండా పరిష్కారం చెయ్యగలిగితిమా ఆ సొమ్మును పంతులుగారి సంస్థలకు యిచ్చేద్దాము"అని వారు తీవ్రంగా ఆలోచించారు.

ఈ శతవార్షిక సందర్భంలో నే తగాదాలు పరిష్కరించవలసిందని కొందరు ఆంధ్రనాయకులు ఒత్తిడిచేశారు.

కాంగ్రెసు కాక, ముస్లిలీగు, హిందూమహాసభ, కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే ప్రజా సామాన్యంలో బలపడి ఉన్నాయి. ముస్లింలీగు హిందూమహాసభ రెండేండ్లలోపల అంతరించి పోయాయి. ఇక మిగిలినది కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే, ఇప్పుడు దాని ఆటంకం కూడా తొలగిందనే నమ్మకం కలిగిన తర్వాతనే ఎన్నికలు జరుగుతున్నాయని తలుస్తున్నాను.

ఖర్చులకుగాను విరాళాలు వసూలుచేయుటకు వెళ్ళిన కీ. శే. శ్రీ కె. కల్యాణస్వామిగారిని, నన్ను తీవ్రంగా అడిగేవారు. అంతట ఒక స్టేటుమెంటును తయారుచేసి ప్రముఖులచేత సవరణలు చేయించి, రాజమండి సంస్థల కార్యనిర్వాహకులకు పంపాము.

అప్పుడు ఏమిచేయుటకూ టయిము చాలలేదు వార్షి కోత్సవము ముగిసిన తర్వాతనే చెయ్యాలి కాని, వార్షి కోత్సవం పూర్తికాకముందే నన్ను డిస్మైన్ చేశారు. నేను జైలులో ఉండగా శ్రీ గోవిందరాజాచారిగారు కీర్తిశేషు లయ్యారు. జైలునుండి విడుదలై రాగానే నా మిత్రుడు శ్రీ కె. కల్యాణస్వామిగారుకూడ మరణించారు. ఆ సంస్థ ఇప్పుడెలాగున్నదో నాకు తెలియదు. తెలిసినవారికి, నా సహాయం తప్పకలభిస్తుంది. కాని, నేనే ఆ బాధ్యతను నిర్వహించగలస్థితిలో లేను.

మధ్యలో అరెస్టు

1948 మార్చిలో శ్రీ విశేశలింగంగారి శతవార్షికోత్సవానికి పనిచేయుచున్న కాలంలో మరికొందరు జడ్జీలనుకూడా కలుసుకోవాల్సివచ్చింది. తమిళనాడు కన్యూమ్యనిస్టుపార్టీ కార్యదర్శి- నా మిత్రుడు ఎన్. కె. కృష్ణన్ నాతో.

"ఏం చంచయ్యతాతా! హైకోర్టు జడ్జీలతో కలసిపోయావు! మళ్ళీ అరెస్టు కాకూడదని నీ ఉద్దేశ్యమా?" అని నవ్వాడు.

"నే నలా అనుకోలేదు; శ్రీ వీరేశలింగంగారిని కొనియాడటం కమ్యూనిస్టులు చెయ్యవలసిన ముఖ్య కార్యంగా భావించాను" అని సమాధానం చెప్పాను.

అటుతరువాత కొద్దిరోజులలో అనగా 1945 మార్చి ఆఖరులో (29 తేది) శతవార్షిక కార్యనిర్వాహక కమిటీ మీటింగులో నన్ను యిలా ప్రశ్నించారు.

"చంచయ్యగారూ! పనులు ముమ్మరంగా జరిగి పోతున్నాయి; మీరే యీ పనులను ముఖ్యంగా చూచు కొంటున్నారు. ఉత్సవానికి యింకా సుమారు యిరవై రోజులున్నాయి. ఒక వదంతి విన్నాము. కమ్యూనిస్టు పార్టీవారి నందరిని అరెస్టు చెయ్యబోతారట! మిమ్మల్ని అరెస్టుచేస్తే యీ పనులన్నీ ఏం కావాలి?" ఇదీ వారి ప్రశ్నల సారాంశం.

"నన్ను అరెస్టు చేస్తారనుకోవడంలేదు. నేను గవర్నమెంటుకు వ్యతిరేకమైన పనులేవీ చేయడంలేదు. అయినా, నన్నేం చెయ్యమంటారో చెప్పండి! నా కార్యదర్శి బాధ్యతలను మరెవరైనా యిప్పుడే పుచ్చుకోండి" అని ప్రార్థించాను.

"అలా చెయ్యొద్దు. ఈ కార్యం పూర్తి అయ్యే వరకూ మిమ్మల్ని అరెస్టు చెయ్యొద్దని మంత్రులతో చెప్తాము; ఒప్పుకోండి" అన్నారు.

"నే నందుకు సమ్మతించను. ఇప్పుడు నేను పార్టీకి రాజీనామా పెట్టడం సరికాదు. నేను పార్టీని వదులుకో నంతవరకూ మీకు మాటయిచ్చి, యిద్దరివల్లా నేను చెడ్డ వాడ ననిపించుకోవాల్సి వస్తుంది. కాబట్టి, మంత్రులను నా తరపున అడుగవద్దు. నన్ను అరెస్టుచేస్తారని నేను నమ్మలేకుండా వున్నాను. ఎలాగైనా నా రాజీనామాను అంగీకరించండి, అని వేడుకున్నాను. మరునాడే డబ్బు, ఫైలు వగైరా యిచ్చివేశాను. రెండురోజుల తరువాత నన్ను అరెస్టుచేశారు. ఏలూరు జైలులో నన్ను డిటెయిను చేశారు.

జైలులో నిరశనవ్రతాలు

డెటినూల విషయంలో కాంగ్రెసు ప్రభుత్వం యేదోవిధంగా మమ్మలను రెచ్చగొడుతూనేవుంది. అతి కఠినంగా ప్రవర్తించినది. వెల్లూరు జైలులో వుంచబడిన సుమారు మూడువందలమంది కమ్యూనిస్టు డెటినూలలో ఎక్కువమంది కార్మికులు, కర్షకులు; చాలమంది విద్యాధికులు కారు. ఇంగ్లీషు చదివినవారి సంఖ్య చాల స్వల్పం. ప్రభుత్వం వారిని అనవసరంగా రెచ్చగొట్టుతున్నదని వారు భావించారు. ప్రభుత్వం ఎంత తీవ్రంగావున్నదో డెటి నూలుకూడ అంత పట్టుదలగానే వున్నారు. ఉద్రేకంతో ఎదురొక్కొన్నారేకాని, ఎదుటిపార్టీ ఉద్దేశాలు, యెత్తు గడలు యేమిటో దీర్ఘంగా ఆలోచించడానికి పూనుకో

లేదు. వీ రిద్దరి మధ్య నాలాంటి దోగులు, ముసలివారు బాధపడ్డారు.

మొదటి ఎనిమిదినెలల్లో పదమూడు తడవలు నిరశన వ్రతం చేశాము. అందులో పదితడవలు ఒక్కొక్క రోజు మాత్రమే. తతిమ్మా మూడుసార్లు కాలపరిమితి లేదు. "మరణించేవరకు" అని నిర్ణయించబడినది.

"బహిరంగ విచారణ లేక విడుదల" అనే నినాదం నాకు నైతికంగా నచ్చినది. నన్ను నిరశనవ్రతంలో చేరవద్దని ఎవరు ఎంత బ్రతిమలాడినా నేను సమ్మతించక నేను చివరి జట్టులోచేరి ఎనిమిదిరోజులు చేశాను. మిగిలిన వారు పదిహేనురోజులు చేశారు. దానితో నేను చాలా నీరసించిపోయాను. కాని, గవర్నమెంటు చేసిన అన్యాయానికి గట్టిగా అసమ్మతి చూపించాననే తృప్తి కలిగింది.

రెండవ పర్యాయం మూడురోజులు మాత్రమే చేశాము. అందరూ చెయ్యవలసిందేనని మేము తీర్మానించుకొన్నందున నేనూ చేశాను.

మూడోసారి నాలుగు రోజులు చేశాను. గవర్నమెంటు మమ్మల్ని నేదో ఒక విధంగా రెచ్చగొట్టుతూనే ఉన్నది. ఇంతకంటె మా ఆగ్రహాన్ని చూపించజాలక పోయాము. అయితే నాల్గవ రోజున నేను చాలా బలహీనమైతిని. అందువల్ల స్ట్రెచరులో ఆసుపత్రికి మోసుకెళ్ళి చికిత్స చేశారు. అంతట నా బలహీనత నాకు తెలిసి

పోయింది. కమ్యూనిస్టుపార్టీలో ఉండడంవల్ల వచ్చే కష్టాలను భరించలేక, త్యాగాలు చెయ్యలేక పార్టీకి రాజీనామా పెట్టాను. ముప్పైఆరు సంవత్సరాల తరువాత రాజకీయ రంగంనుండి విరమించాల్సి వచ్చినందుకు ఎంతో విచార పడితిని.

పార్టీలో మార్పులు - పదవీ వ్యామోహం

1940-42 లోను, 1947 లోను, 1948లోను జైళ్ళలో వందలమంది ముఖ్యనాయకులతో కలసి వున్నందున పార్టీలో కలుగుతున్న అభివృద్ధిని చూస్తూవచ్చాను. చాల త్వరితంగా సంఖ్యాబలంలోను, ఆర్గనైజేషనులోను పార్టీ పెరిగిపోయింది. అంతేకాదు; ఇంగ్లీషు చదివినవారూ, విద్యాధికులూ, మధ్యతరగతివారికంటే చదువురాని నిరక్షరాస్యులైన పక్కా కార్మిక, కర్షక నాయకుల సంఖ్య పెరిగిపోతూవున్నది.

కాని, పార్టీలో వయసు పరిపక్వం కాలేదు. కోపతాపాలు, మొండితనం, అసహనత మొదలైన యువక గుణాలు ఉంటున్నవి. తమ శత్రుపక్షం రెచ్చగొట్టితే సులభంగా రెచ్చిపోవడం, అభిమన్యునిలాగా ప్రవర్తించటం పార్టీ యువకత్వాన్ని తెలుపుకుంది. అయితే వారి ధైర్యమూ, సహనమూ, త్యాగమూ మొదలగు గొప్ప గుణాలకు నేను గర్వపడతాను.

విద్యాధికులైన సభ్యులలో పెద్దమార్పు రాసాగింది. అదేవుంటే పదవీ వ్యామోహం (కెరియరిజము). ఈదుర్గుణం ఇండియాలో ప్రతి రాజకీయపార్టీలోను ప్రవేశించి ఆ పార్టీలను నాశనం చేస్తున్నది. కమ్యూనిస్టుపార్టీలో పొడ చూపిన ఈ దురుణాన్ని వెంటనే అణచివేయకపోతే పార్టీ నైతికదృష్టి క్షీణించిపోతుంది;

అంతర్జాతీయంగా, జాతీయంగా ఎన్నో అనుకూల మార్పులు వచ్చుచుండగా, పార్టీ వాటిని ఉపయోగించు కోలేక పోవడం పార్టీకి అనుభవము, ఆలోచనలు పరిపక్వం కాలేదని నిరూపిస్తుంది.

డెటిన్యూలతో పోలీసులు, జైలు ఆఫీసర్లు

"మమ్మలను నిందించవద్దండి; మేము యంత్రాలము. మీరు అధికారంలోకి రాబోతారుగా! అప్పుడు మీరు చెప్పినట్లే తూ. చ. తప్పకుండా నడుచుకొంటాము" అని అన్నప్పుడు కొందరు బుద్ధిహీను లా మాటలకే వుబ్బి, పదవీ వ్యామోహంలో పడిపోతున్నారు.

తప్పులు చేసినా, కొంతకాలానికి తప్పులను గ్రహించడం వ్యక్తులలో నైతేనేమి పార్టీలోనైతేనేమి గొప్ప విషయమే అభివృద్ధిని సూచిస్తుంది. హిట్లరు రష్యాముద పడ్డప్పుడు బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు సహాయంగా ఉండాలనే ఉద్దేశ్యంతో స్ట్రయికులు రాకుండా చేశాము. అది తప్పని జైల్లో జరిగిన పునర్విమర్శలో ఒప్పుకొన్నం

దుకు చాల సంతోషం. అప్పట్లో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని నాశనం చేయటానికి ప్రయత్నించిన పార్టీల వారిని "దేశ ద్రోహులు" అని తిట్టడం కూడ తప్పేనని గ్రహించి నందుకు పార్టీకి నా అభినందనాలు.

ఈ పునర్విమర్శ సందర్భంలో కామ్రెడ్ ఎమ్. ఆర్. వెంకట్రామన్ చెప్పిన సమాధానం పార్టీ సభ్యులందరూ ఆలోచించడం, గమనించడం బాగున్నది.

"మనం ప్రపంచ యుద్ధకాలంలో తప్పులు చేసినది వాస్తమే కాని, దేశద్రోహుల మెంతమాత్రమూ కాదు మనం సరిగా అరంచేసుకోలేకపోయాము. మన పార్టీ పసి తనంలో ఉన్నది. అనుభవ శాలులైన నాయకులు కూడా లేరు. తప్పులు చేసి నేర్చుకొంటున్నాము" అని ఆయన అభి ప్రాయం. మహాత్ముడు "హిమాలయ పర్వతమంత తప్పు" చేశానని ఒప్పుకొన్నారు. అది ఆయన గొప్పతనాన్నే ప్రదర్శించింది.

గత మూడు నాలుగు సంవత్సరాలుగా జరిగిన విష యాలను కూడ సరిగా ఆలోచించుకొని, పార్టీ వయసు ఏ మిస్తైనల్ల [illegible]ండో అనేలా యిక ప్రవర్తించడం మంచి దని నా సలహా. అభిమన్యునిలా పోట్లాడటం మానుకో వాలి. కుశలతనంగా ప్రవర్తించడం ఇకనైనా మానడం మంచిదని విన్నవించుకుంటున్నాను.

36 సంఘ రాజకీయ జీవిత సమాప్తి

నేను కమ్యూనిస్టుపార్టీలో సుమారు పది సంవత్సరాలున్నా, వాస్తవంగా కమ్యూనిస్టును కాలేకపోతిని. కమ్యూనిస్టు అనదగిన వాడు వర్గ పోరాటాన్ని నమ్మటమేగాక, నిత్యజీవితంలో కార్యరూపేణా ఆ తత్వం కన్పరచాలి. నాలో జాలి, దయ, దాక్షిణ్యాలు మొదలైన వున్నవేకాని, పెట్టుబడిదారీ వర్గాన్ని నాశనం చేయుటకు అవసరమైనంత ద్వేషం మాత్రం కలుగలేదు. గదరు పార్టీలో వుండగా సామ్రాజ్యవాదులైన బ్రిటిష్ ప్రభువులను చించి చెండాడాలన్నంత ద్వేషం చెలరేగుతుండేది; కాని, ఇప్పుడలా లేదు. సమ్మెలలో జయం కొరకు మాత్రమే ప్రయత్నించు చుంటిని. పెట్టుబడిదారులచే కొద్దో గొప్పో ఇప్పించి, కార్మికులు సమ్మతించేలా, రెండు పార్టీలూ రాజీపడేలా ప్రయత్నించు చుంటిని. కాని, పెట్టుబడిదారీ పద్ధతిని, పెట్టుబడిదారులను, యజమానులను ద్వేషించి విప్లవానికి పునాది వేయుటకు ఇష్టపడలేక పోయాను.

అంతేకాదు; కార్మికుల జీవితం ఎంతో అధ్వాన్నంగా ఉన్నా, వారిపట్ల ఎంత జాలి ఉన్నా, నా ఆస్తిపాస్తులు వారికి వినియోగించాలనే త్యాగం నాలో కలుగలేదు. ప్రతిఫలం కోరకుండా సేవచెయ్యాలనే మామూలు ఆధ్యాత్మిక దృక్పథం మాత్రమే వుండేది. నా కున్న ఆస్తిని వారికి వినియోగించివేసి పేదజీవితానికి అలవాటు చేసుకోలేకపోయాను. ఎన్నో సంవత్సరాలు ప్రజాసేవ

చేస్తున్నా స్వాభిమాని (Individualist) గా ఉండటమే ఒక గొప్పగుణమని తలచే నాలాంటివాడు కుర్రవాళ్ళతో చేరి, వారి శిక్షణకు లోబడి, వారిలాగా కష్టాలుపడి, త్యాగం చెయ్యడం చాల కష్ట మనిపించింది. నేను పార్టీలో నుంచి తప్పుకోవడం నాకూ వారికీ కూడా మంచిదే.

అయితే, నేను కమ్యూనిస్టుపార్టీలోనుంచి, రాజకీయాలనుంచే విరమించుకోవడానికి వ్యక్తిగతమైన అతి ముఖ్యకారణాలు ఉన్నాయి. వయస్సు ముదిరినకొద్ది శరీరం కంగా బలం క్షీణించిపోతున్నది. 1917లో గదరుపార్టీలో వున్నప్పుడు వెయ్యి బస్కీలు, నూటయాభై దండాలు తీసేవాడిని; ఇప్పుడు దండాలు చెయ్యనేలేను. బస్కీలు పదిమాత్రమే చెయ్యగలను నిత్యము పదినిమిషాలు కాళ్లు చేతులు ఆడించడంకూడ విసుగేస్తుంది.

దీనికితోడుగా వ్యాధులు తీవ్రం (క్రానిక్) అయినాయి. భోజనం ఎంత ముఖ్యమో, మూడు మందులు కూడా అంత అవసరం. మా యింటిలో [illegible] మూడు మందులూ పరిపాటి అయింది.

ఆర్థికంగాకూడా తీరని కష్టాలు వచ్చాయి. పది సంవత్సరాలుగా పార్టీలో పనిచెయ్యడంతో సంపాదించటం మానివేశాను. సంపాదించడమనేది కష్టజీవులను దోచుకోవడమేననే భావం నాలో కలిగినందుననే సంపాదన మానేశాను. 1942 వ సంవత్సరం తరువాత స్వారాజ్యం వచ్చిన దర్మాలా జీవితావర వస్తువుల వెలలు తీవ్రంగా

పెరుగుతూవచ్చాయి. భోజనం ఖర్చు తగ్గించుకొంటూ వచ్చాము పాలు, నెయ్యి, నూనె, కూరగాయలు, పండ్లు వగైరా తగ్గించాము. ఇంతచేసినా ఆర్థికంగా సవరించుకోలేకపోయాము.

వెలలు పెరగడంవల్ల గత పదిసంవత్సరాలలో ఆదాయంకంటె అదనంగా యిరవై ఐదువేల రూపాయలు ఖర్చు అయినది. నగలు, వెండిపాత్రలు, చిల్లర ఆస్తులు పదివేలరూపాయల విలువగలవాటిని అమ్మివేశాము. అంత కన్న ఎక్కువగా అప్పులు లభించలేదు. ఆదాయం వచ్చే ఆస్తులను వెంటనే అమ్మి అప్పులు తీర్చాలి. ఆర్థికంగా తీరని కష్టాలుకూడ రాజకీయ జీవితాన్ని మానుకొనుటకు ఒక కారణం.

నేను జైలులో నిరశన వ్రతాలు చేస్తూవుంటిని. ఆ బెంగవలన నా భార్య ఆరోగ్యం మరీ ఎక్కువగా క్షీణించుతూ వచ్చింది. ఆమెను చూచి నాకు, నన్నుచూచి ఆమెకు దుఃఖం పెరిగిపోయింది. ఈ కారణాలతో మా ఇద్దరి కూతుళ్ళ చదువులు క్షీణించడం చూస్తూవచ్చాము. అన్నివిధాల నేను ఇక రాజకీయ రంగానికి శక్తిహీనుడన్నట్లు గుర్తించాను.

పోలీసులను గురించి ఒకమాట చెప్పాలి నేను జైలులో ఉండగా మా ఇంటిని పోలీసులు తరచుగా రాత్రిళ్ళు గంటలకొలది అనవసరంగా సోదాలు చేస్తూండే

వారు. ఇంటిదగ్గర పోలీసు నిఘా రాత్రింబగళ్ళు ఉండేది. వీటివల్ల నా భార్యా, బిడ్డలకు సహింపజాలని ఇబ్బందులు కలుగుతూవచ్చాయి. అవన్నీ కూడ నా రాజకీయ జీవిత పరిసమాప్తికి కారణభూతమైనవి.

కాబట్టి 1948 సంవత్సరం అక్టోబరు 19 తేదీని కమ్యూనిస్టుపార్టినుండియు, రాజకీయాలనుండియు విరమించుకోవలసి వచ్చింది. పార్టీ సభ్యులు ఎంతో విచారము వెలిబుచ్చారు.

"తాతయ్యగారూ! విడిచిపెట్టవద్దు; కావలిస్తే, పార్టీలో అన్ని బాధ్యతలనుండి విరమించుకోండి" అని ఎంతో ప్రేమతో ప్రతిమలాడారు. కాని, రాజకీయరంగం నుంచి విరమించుకోవడమే మంచిదని. 36 సంవత్సరాల తరువాత రాజకీయ జీవితం మానివేశాను.

ఈ విషయాన్ని నా భార్యతో చెప్పాను. అసలు రాచకీయ జీవితమునే మానుకోవలసి వచ్చినందుకు దుఃఖించినది. రాచకీయాలద్వారా భారత ప్రజల అభ్యున్నతికి పాటుపడలేకపోతిమే అని ఆమెకు అసంతృప్తేకాని, ఒక పార్టీలో, ఒక ముఠాలో ఉండలేకపోతిమే అని కాని, పదవులు లేకపోయెనే అని కాని విచారం ఆమెకూ లేదు; నాకూలేదు మా ఇరువురికి అవసరమైనది మానవసేవ, భారత ప్రజాసేవ,

"విచారపం ఏం ప్రయోజనం? మానివేయక తప్పదు! ఉడుతాభక్తిని ప్రతిఫలాపేక్ష లేకుండా దేశానికి సేవ చేశాము" అని ఎలాగో ఊరడిల్లినాము.

కమ్యూనిస్టుపార్టీలో వ్యక్తి స్థానం

ఈలాగు మానివెయ్యడం కష్టంకాదు. అంతకాలం పార్టీలో ఉన్నా, సామాన్య సభ్యుడిగా ఉన్నానే గాని, ఎలాంటి బాధ్యతగల స్థానంలోను ఉండలేదు; మొదటి నుండీ ఉండదలచుకోలేదు. మరొక విశేష మేమంటే వ్యక్తి ఎంత గొప్పవాడైనా, కమ్యూనిస్టుపార్టీలో జయాపజయాలు, కార్యసాధన ఒక వ్యక్తిమీద ఆధారపడవు.

పార్టీ కార్యవిధానం తెలియని శ్రీ గాడిచర్ల హరి సర్వోత్తమరావుగారు ఒకసారి (1949 లో)

"చంచయ్యా! రావి నారాయణరెడ్డిగారు దొరికిపోయ్యారు. ఇక తెలంగాణాలో కమ్యూనిస్టుపార్టీ పోయిందన్నమాటే" అన్నారు,

"రెడ్డిగారు దొరికి వుండరు ఎందరు నారాయణరెడ్లు, ఎందరు నాయకులు దొరికినా ప్రజలలో లీనమైన పార్టీ నాశనం కాదు" అని చెప్పగా, నా వైపుచూచి పిచ్చివాడనని అనుకొని నవ్వారు. నేనుకూడా నవ్వాను.

కమ్యూనిస్టుపార్టీ తతిమ్మా రాజకీయ పార్టీలవలె నాయకులమీదగాని, వ్యక్తులమీదగాని ఆధారపడదని తక్కిన పార్టీలవారికి తెలియదు.

ఒక మహత్తర సంస్కృతీ ఉద్యమము

సుమారు పదిహేను సంవత్సరాలపాటు కమ్యూనిస్టులతో కలసి పనిచేశాను. తమిళనాడు, ఆంధ్ర పార్టీలతో నాకు దగ్గర సంబంధాలు ఉండేవి. రెండూకూడా చివరకు రాజకీయోద్దేశంతో ప్రారంభించినా, తమిళనాడులో కార్మిక సంఘాలు అభివృద్ధికి వచ్చాయి; ఆంధ్రదేశంలో సంస్కృతీ ఉద్యమం వృద్ధికి వచ్చింది.

నాకు ఈ సంస్కృతీ ఉద్యమమంటే చాల ఇష్టం. సంఘ సంస్కరణలతో కాలం గడుపుతున్న నాకు ఆంధ్ర కమ్యూనిస్టులు ప్రవేశపెట్టిన సంఘ సంస్కరణలు చాల ఉత్సాహకరంగా ఉన్నాయి. ఒక ఉదాహరణ యిస్తాను:

1946-47 (?) లో అనుకొంటాను; చల్లపల్లి వద్ద నాడెళ్ళవారిపాలెంలో మహిళాసభ కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగింది. వేనవేలు స్త్రీలు వచ్చారు.

ఆ ఆంధ్ర స్త్రీల మహాసభలో ఎవరో ఒక తమాషా ప్రశ్న వేశారు.

"కూతుళ్ళను కమ్యూనిస్టు యువకులకిచ్చి వివాహం చేయించాలని తల్లులు ప్రయత్నించుతున్నారట, వాస్తవమేనా?"

"అవునండి" అని ఒక ముసలమ్మ లేచి సమాధానం చెప్పింది. అందరూ నవ్వారు. చప్పట్లు కొట్టారు.

"ఎందుకనండీ" అని మరొక ప్రశ్న.

"అనుభవంలో కమ్యూనిస్టు యువకులే మంచి అల్లుళ్ళగా ప్రవర్తించుతున్నారండి."

"ఆ అనుభవా లేమిటి?" అని మళ్ళీ ప్రశ్న.

"కమ్మవారిలో స్త్రీలకు ఒకరకమైన ఘోషాపద్ధతి ఉంది. కొత్తవారితోను, బంధువులతోను మాట్లాడునపుడు తలుపువెనుక నిలుచుంటారు. కమ్యూనిస్టులు ఈ ఘోషా పద్ధతిని ఒప్పుకోరు. అంతేకాదు; భార్యలను తమవెంట పెట్టుకొని సభలకు వెళ్తారు. భార్యలు చదువుకొని తమతో సమానంగా వృద్ధికి వచ్చేలా ప్రయత్నిస్తారు. శీలం విషయంలో భార్యలను శంకించరు. ఇరుగు పొరుగు యువతుల మీద మనసు పోనివ్వరు. వితంతువులను, అన్యకుల కన్యల నుకూడా వివాహం చేసుకొంటారు. సాధారణంగా దుర భ్యాసాలు తక్కువ. దిక్కులేనివారికి హృదయపూర్వకంగా సహాయం చేయుటకు ప్రయత్నిస్తారు" అని ఒకముసలమ్మ చెప్పిన మాటలతో అందరికి ఆశ్చర్యం కలిగింది

"కట్నాల విషయమో" అని మరొకరు ప్రశ్నించారు.

"కట్నాల విషయంలో వారు జోక్యం కలిగించుకోరు. వారికి ఇష్టంలేదు. కాని, వరుల తల్లిదండ్రులు వసూలుచేసి కొంటూన్నారు. కట్నాల విషయంలో తేడాలు లేనప్పుడు కమ్యూనిస్టు యువకుడే మంచివరుడుగా

భావిస్తున్నాము. వివాహము అయిన తరువాత ఆ స్త్రిపాస్తుల కొరకు, ఇచ్చిపుచ్చుకోవడాల్లో కమ్యూనిస్టులైన అల్లుళ్ళు పీడించరు; పీడించి పుచ్చుకొనే తల్లిదండ్రులను మందలించుతారు" అని సమాధానం చెప్పినది.

ఈ విధంగా ఒకతరం జరిగితే ఆంధ్రదేశంలో వేలయేండ్లుగా వున్న దురలవాట్లు పోగలవు. గొప్ప సాంఘిక విప్లవం తప్పదు. సంఘసంస్కరణలయందు అభిమానం కలిగియున్నందున ఈ యువకులను హృదయపూర్వకముగా గౌరవించుతున్నాను. వారి సాంస్కృతిక ఉద్యమాలను, కార్యకలాపాలను, ప్రోత్సహించుచుంటిని.

విడుదల — డొంకతిరుగుళ్ళు

1948 ఏప్రిలులో నన్ను అరెట్టు చేసి డిటెయిను చేయగానే "విడుదల చెయ్యాలి; లేదా నేరం మోపి కోర్టులో బహిరంగ విచారణ చేసి శిక్షించండి" అని లాంఛనంగా ప్రభుత్వాన్ని డిమాండు చేశాను. అడ్వయిజరీ కమిటీకి అర్జీ పెట్టుకొన్నాను. నామీది ఛార్జిషీటు చదివినవారు నన్ను విడుదల చేస్తారని నమ్మలేదు. అంత ఘోరమైన నేరాలు! అంతా అబద్ధమే! నేను జైలులో వున్న పదిమాసాల్లో నాకు జవాబే రాలేదు.

హైకోర్టులో పెట్టిన హెబియస్ కార్పసు పిటీషను డిస్మిస్ అయినది. ఏ జడ్డి గాని నన్ను ఎలా విడుదల చెయ్యగలడు? పోలీసు కమీషనరువంటి వారే కోర్టుకు

హాజరయి "విడుదల చేస్తే చాల అపాయం" అని సాక్ష్యమిచ్చాడు. నాకు నవ్వు వచ్చింది

విడుదల ఉండదని నిరాశ చెందాను. దేశమంతటా ఎలెక్షన్లు జరిగిన తర్వాత ఏ 1951 లోనో విడుదల జరిగితే జరుగ వచ్చుననీ, ఎలెక్షన్లు జరుగక పోతే విడుదల వుండదనీ నిర్ధారణ చేసుకొని, విడుదల విషయం ఆలోచించుటే మానేశాను.

అయితే, 1948 అక్టోబరులో రాజకీయ రంగం నుండి విరమించుకొన్న తరువాత జైలులో ఉండడంలో యెలాంటి ప్రయోజనం కాని, ఎలాంటి పుణ్యం-పురుషార్థం కాని వున్నట్టు తోచలేదు; అందుచే విడుదల కొరకు ప్రయత్నించడం మంచిదనే నిర్ణయానికివచ్చాను.

కాని, ప్రయత్నించి ఏం ప్రయోజనం! నిరోషులు సుమారు యిరవై మంది ప్రయత్నించి అప్పటికే ఆశాభంగం చెందియున్నారు. ఎన్నెన్నివిధాల ప్రయత్నం చాలో అన్నివిధాల ప్రయత్నాలు చేశారు.

అడ్వయిజరీ కమిటీకి పిటీషన్ పెట్టుకోవాలని శాసన సభలో మంత్రిగారు చెప్పగా, నమ్మి పెట్టుకొన్నారు. లోగడ కొన్ని మాసాలుగా; సంవత్సరాలుగా రాజకీయాలతోను కార్మిక కర్షక సంఘాలతోను యెలాంటి సంబంధం లేదని వ్రాసుకొన్నారు. ప్రయోజనం లేకపోయింది.

తరువాత కొంతకాలానికి మరొక మంత్రిగారు "తప్పును క్షమించమని ప్రార్థిస్తే విడుదల చేస్తా"మని

సలహా యిచ్చారు; ఆ యిరవై మంది మాజీ కమ్యూనిస్టులు సీట్లు అలాగే చేశారు. జవాబే రాలేదు.

మరికొంత కాలానికి మరొక మంత్రి శాసనసభలో "ఇకమీదట కమ్యూనిస్టుపార్టీ రాజకీయాలలో చేరవనీ, విధ్వంసక చర్యలలో పాల్గొనమనీ వ్రాసియిస్తే విడుదల చేస్తా" మన్నారు. అందుకుకూడ సమ్మతించి వ్రాసి యిచ్చారు.

మరికొంత కాలానికి మరొక మంత్రిగారు "ఎవరెన్ని హామీలిచ్చినా, ఎవరెంత రికమెండు చేసినా విడుదల చెయ్యజాలము కాని, డిస్ట్రిక్టు మాజిస్ట్రేటు విడుదల చెయ్యమని రికమెండు చేస్తేనే విడుదల చెయ్యగలం; లేకపోతే లే"దని చివరకు కండబ్రద్దలుకొట్టినట్టుగా చెప్పారు. విడుదలకోరే యిరవై మంది మాజీ కమ్యూనిస్టులు వగైరా కలుసుకొని "దీనిభావమేమి?" అని తర్కించుకొని యీ విధంగా అర్థంచేసుకొన్నారు:—జిల్లా మాజిస్ట్రేటు సమ్మతించాలంటే ముందు పోలీసు సూపరెంటు ఒప్పుకోవాలి. అనగా స్పెషల్ బ్రాంచి పోలీసులు విడుదల చేయుటకు అంగీకరించి వ్రాయాలి. అప్పుడు ప్రధానిగారి కటాక్షం వుంటే విడుదల అవుతుంది. లేకపోతే లే"దని దిగులు పడ్డారు.

ఇవన్నీ చూస్తూవున్న నేను విడుదలకొరకు ప్రయత్నించడంలో ఎంతమాత్రం ప్రయోజనం వుండదని నిశ్చయించుకొన్నాను. నా భార్య అక్టోబరుమాసంలో నన్ను

జైలులో కలుసుకొన్నప్పుడు విడుదలకోసం ప్రయత్నించడం వృథా ప్రయాసయని సలహాయిచ్చాను.

ఆ తరువాత వారంరోజుల్లో నా అక్కగారు మరణావస్థలో వున్నదని కావలినుండి కార్డువచ్చింది. ఆ కార్డును ప్రభుత్వానికి పంపుతూ, పెరోలు యివ్వండని కోరాను. కాని, ఆమె చనిపోయిన యిరవై ఆరు రోజుల తరువాత పదిహేనురోజులు పెరోలుయిచ్చారు; అయితే మద్రాసు మీదుగా ప్రయాణం చెయ్యకూడదని వుత్తరువు జారీ చేశారు. నా విషయంలో పోలీసులు ప్రభుత్వాన్ని ఎంత భయపెట్టుతున్నారు! అని ఆశ్చర్యపడినాను.

పెరోలులో వుండగా రెండు అర్జీలు పెట్టాను. రాజకీయ రంగంనుండి విరమించుకొన్న నన్ను యింకా జైలులో డెటెయిను చెయ్యడంలో ఎంతమాత్రమూ న్యాయం లేదనిన్నీ, బేషరతుగా నిన్ను విడుదల చెయ్యవలసిందనీ ప్రధాని రెడ్డిగారికి వ్రాసితిని. ఈ సందర్భంలో జైళ్ళయిలాకా మంత్రిగారితో మాట్లాడుటకు మద్రాసుకు రానివ్వవలసిందని మరొక అర్జీపెట్టగా అంగీకరించారు.

నేను చేసిన నేరాలు

మద్రాసుకు రాగానే స్పెషల్ బ్రాంచి పోలీసు ఆఫీసుకువెళ్ళి గడచిన పద్దెనిమిది మాసాల్లో నామీద ఏమేమీ కంప్లయింట్లు ఉన్నాయో చెప్పవలసిందని అడి

గాను. నే నేమి చేస్తూవుంటినో వారికి తెలియదనీ, పార్టీ పనులు ఏమీ చెయ్యకుండా పార్టలో ఎలా వుండగలననీ, ఏమేమి చేస్తూ ఉంటినో నన్నే చెప్పుమనీ అడిగారు.

మా ఇంటిలో రాజకీయ తరగతులు నడుపుచుంటి ననీ- బహిరంగసభలు పెట్టుచుంటిననీ చెప్పాను.

"కాబట్టి, మిమ్ము ఎలా విడుదల చెయ్యడం?" అని తిరిగి నన్నే ప్రశ్నించారు

"ఈ మీటింగులకు, క్లాసులకు ముందుగా మీ ఉత్తరువు పొందుతున్నానని, తప్పుచేసివుంటే అది వుభయులదీని: ఇద్దరం జైలులో ఉండాలిగదా!" అని సమాధానం చెప్పాను.

"ఉత్తరువు యిచ్చేటప్పుడు మేము తప్పుచేస్తున్నటు మాకు తెలియదే" అని నవ్వారు. ఏ షరతు లేకుండా విడుదల చేయవచ్చునని కాంగ్రెసు ప్రభుత్వానికి రిక మెండు చేశారు.

విడుదల ఆర్డరు రాలేదు. జైలు మంత్రిగారిని కలుసుకొన్నాను.

"విడుదల చెయ్యండని ప్రధానికి వ్రాసిన అర్జీని చదివాను. మీరు కమ్యూనిస్టుపార్టీని వదలిపెట్టారు. కాని, మీ నమ్మకాలను (కన్విక్షన్సును)వదల్లేదని ఊహించాను. నా ఊహ నిజమేనా?" అని ప్రశ్నించారు మాధవన్ గారు;

"అవు" నన్నాను "నేను పనిచేసిన గదర్‌పార్టీ, కాంగ్రెసు, కమ్యూనిస్టుపార్టీల గొప్ప ఆశయాలలో నాకు నమ్మకంపోలేదు. కాని, ఆయా పార్టీల పంథాలలోను; కార్యక్రమాలలోను నాకు ఆక్షేపణలున్నాయి" అని అంటిని.

"మీరు ముసలితనమువల్ల, వ్యాధులవల్ల రాజకీయాలు మానేశారు. మీ నిజాయితీ నాకు తెలుసు. మిమ్మల్ని నమ్మితాను. మన మిద్దరం చాలకాలం జైలులో కలిసివున్నాము. మీ విడుదలకు తప్పకుండా రికమెండు చేస్తాను" అని స్నేహపూర్వకంగా మాధవమీనన్‌గారు చెప్పారు.

"ఇప్పుడు పెరోలులో ఉన్నాను. ఇక జైలుకు పోదలచుకోలేదు" అని నవ్వాను.

"వెళ్ళనవసరంలేదులే! విడుదల అయ్యేవరకు పెరోలు యిస్తా"నని అలాగే చేశారు.

ప్రధాని రెడ్డిగారు

కాని, ప్రధాని రెడ్డిగారి కటాక్షం వెంటనే లభించలేదు. ఆ షరతును, ఈ షరతును ఒప్పుకోవలసిందని నాకు కబురు పంపారు. ఎలాంటి కండిషనుకుగాని నేను సమ్మతించననీ, తిరిగి జైలుకు పంపవచ్చుననీ ఖండితంగా చెప్పేశాను.

"ఇకమీదట నేరంచేస్తే ఎలా" అని స్పెషల్ బ్రాంచి ఆఫీసరు అడిగారు.

"చట్టం ప్రకారం కేసు పెట్టుకోండి" అన్నాను.

జైలులో అనవసరంగా పది నెలలుంచి చివరకు 1949 జనవరి 21 తేదీన ప్రధాని రెడ్డిగారు దయతో విడుదల చేశారు. పోలీసు ఆఫీసర్లు న్యాయంగానే ప్రవర్తించారనుకుంటాను.

ఎనిమిది జైళ్ళలో

ఇది సంధియుగం. గడచిన ముప్పయ్యారు సంవత్సరాల రాజకీయ జీవితంలో నాలుగుసార్లు జైళ్ళలో నిర్బంధించారు. రెండుసార్లు విదేశీ ప్రభువులు, రెండుసార్లు ప్రజా ప్రభుత్వము మొత్తం ఎదిమిది జైళ్ళలో పెట్టగా ఎనిమిది సంవత్సరాల జీవితం గడిచిపోయింది.

1915—1919 నాలుగున్నర సంవత్సరాలు.

(గదర్ పార్టీ సభ్యుడుగా)

1940—2 రెండు సం॥ కొన్ని నెలలు.

1947 లో ఏడు నెలలు.

1948—9 లో పది నెలలు.

బాంకాకు, సింగపూరు, కలకత్తా, లాహోరు, ఢిల్లీ, కన్ననూరు, కోయంబత్తూరు, వెల్లూరు జైళ్ళలో ఉన్నాను.

సింగపూరు మిలిటరీ జైలులో ఆరు నెలలు ఏకాంత వాసం (సాలిటరీ ఇమ్ప్రిజన్ మెంటు) వల్ల కలిగిన నరముల

వ్యాధి (మ్యూకస్ కొలైటీస్) చే ఇప్పటికి బాధపడుటే గాక, నా జీవితకాలమంతా కషపడక తప్పదు. కొన్ని పర్యాయములు చేతులతో, కాళ్ళతో, బూట్సుతో, లాఠీలతో దెబ్బలు తిన్నాను. కొన్నిరోజులు నా బట్టలన్నీ తీసేశారు. ఎన్నో బాధలకు గురి అయింది యీ నాశరీరం.

నేను కోరిన సంపూర్ణ స్వరాజ్యం కాని, ప్రజా ప్రభుత్వం కాని ఇంకా ఏర్పడనేలేదు. కాని, నా జీవిత కాలంలో ఏర్పడుతుందనే నమ్మకం నాకు ఇప్పటికీ దృఢంగానే ఉన్నది.

ముగించే సమయంలో నా నమ్మకాలు

ఈ గ్రంథాన్ని ముగించే సమయం (1951 - సెప్టెంబరు) లో నా ఆలోచనలు నమ్మకాలు (కన్విక్షన్స్) యెలాగున్నాయని ప్రశ్నించుకున్నాను. చాలమంది మిత్రులు నన్ను ముఖ్యంగా కొన్ని ప్రశ్నలు అడుగుతూవున్నారు.

"ఏ పార్టీ గెలుస్తుంది? కాంగ్రెసా, సోషలిస్టా, కమ్యూనిస్టా? అని వారి ముఖ్యప్రశ్న.

"ప్రజల సమస్యలను ఏ పార్టీ నిజాయితీగా పరిష్కరిస్తుందో ఆ పార్టీ గెలుస్తుం"దని నేను చెప్పినసమాధాన

"ఆ సమస్య లేవి?" అని రెండవ ప్రశ్న. ప్రజలకు అవసరమున్నంత ఆహారపదార్థాలను పండించాలి. పండించే కూలివానిని ఆ భూములకు స్వంతదారుడుగా చేసేవరకూ

ఈ సమస్య పరిష్కారం కాజాలదని నా అభిప్రాయం. ఇది మన దేశానికి ప్రధాన సమస్య.

నిరుద్యోగ సమస్య పరిష్కారం కావాలి. మధ్యతర గతి విద్యాధికులు తినుటకు తిండిలేక మాడిపోతున్నారు. వారు కార్మిక కర్షకులతో చేరి విప్లవం లేవదీస్తారు. ఆర్థికంగా ప్లానింగు లేకపోతే ఈ సమస్య సమస్యగానే ఉంటుంది.

కమ్యూనిస్టులకు విప్లవ మార్గమూ, రక్తపాత మార్గమూ తప్ప శాంతిమార్గం లేదా? అనేది మరొక ముఖ్య ప్రశ్న.

పిచ్చివాళ్ళు తప్ప మరెవరూ దౌర్జన్యం చెయ్యరు. అయితే మంచివారుకూడ కొన్ని సందర్భాలలో హింసా మార్గం అవలంభిస్తారు. మహాబుషులు, దైవావతారులు కూడా హింసామార్గాలను ఒక్కొక్కప్పుడు బోధించారు; అవలంభించారు కూడాను. కాని, వయోజనులందరికీ ఓటు అధికారంతో శాసన సభలద్వారా మెజారిటీ తీర్మానంతో పరిపాలన నిజాయితీగా జరుగనిస్తే ప్రజల కష్టాలన్నీ వెంటనే తీరకపోయినా, తీరగలవనే నమ్మకం ఏర్పడుతుంది; దానితో విప్లవాలు రాజాలవు. అందుచేతనే ఇంగ్లాండు, ఫ్రాంసు, అమెరికా దేశాల్లో విప్లవాలు రావడం లేదు. ప్రజాప్రభుత్వాల్లేని రష్యా, చైనా, మలయా, బర్మా ఇండోచైనా మొదలైన దోశాల్లో విప్లవాలు తప్పలేదు; తప్పవు.

ఏ దేశంలో నైతే కాన్‌స్టిట్యూషను (రాజ్యాంగ నిర్మాణాన్ని) సామాన్య మెజారిటీ ఓట్లు ననుసరించి మార్చుకొనుటకు అవకాశం ఉంటుందో అలాంటి దేశాల్లో విప్లవాలకు అవకాశం చాల తక్కువ. ఇంగ్లాండు, ఫ్రాన్సు దేశాల కాన్‌స్టిట్యూషన్లు అలాంటివి; అమెరికా అలాంటిది కాదు. అయితే మనదో?.....

గాంధీగారి ఉద్యమం వల్లను, కాంగ్రెసు పోరాటాల వల్లను ప్రజలలో రాజకీయచైతన్యం చాల ఉచ్ఛస్థితిలో నున్నది. అదొక అగ్నిపర్వతంలాంటిది. వాస్తవమైన ప్రజా ప్రభుత్వం ఒక్కటే దానిని శాంతింప చెయ్యగలదు.

పోలీసులు, సైనికులు మా తమే ఈ కాలంలో ప్రజలను అణచివెయ్యజాలరు. ప్రజలు ఎలాగో ఐక్యమవు తారు; నియంతల ఆటలను కట్టివేస్తారు. అలాగే కాదనే మూర్ఖ నాయకులూ వున్నారు. చియాంగ్ కై షేకులు జయించేకాలం పోయింది.

ఇకమీదట సాహిత్యసేవ

రాజకీయ రంగాల్లోనుండి విరమించుకొంటిని గదా! ఏ పనీపాటా లేకుండా కాలం గడపటం కష్టంగానే ఉన్నది. ఏదైనా సులభమైన పని చేస్తుండాలి.

ఇంకా నా చిరకాలవాంఛిత మొకటి నెరవేర లేదు. ప్రపంచ వాఙ్మయంలోనుండి వంద ఉత్కృష్ట గ్రంథాలను తెలుగులోకి తర్జుమా చేయించాలని యెన్నాళ్ళ

గానో అనుకొంటున్నాను. ఆవిధంగా మన వాఙ్మయాన్ని సుసంపన్నం చెయ్యాలని నా అభిలాష. "హోం యూనివర్సిటీ లైబ్రరీ" "ధింకర్స్ లైబ్రరీ" ల లాగా మన వాఙ్మయాన్ని సుసంపన్నం చేసి ప్రజలను సంస్కృతీ సంపన్నులుగను, అభ్యుదయ దేశాల ప్రజలతో సమానంగా ముందుకు నడవగలిగేటట్లునూ చేయవలె ననుకొన్నాను. మన భాషమాత్రమే తెలిసినవారికి ఇంగ్లీషు భాష తెలియదనే విచారం పోగొట్టుటకు ఇదే సులభ మార్గమని నా దృఢనమ్మకము.

1925 - 26 సంవత్సరంతో ఈ ప్రయత్నానే్న గుంటూరులో శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ, శ్రీ జి. వి. కృష్ణారావుగార్లతో కలసి ప్రయత్నించి విఫలుడనైతిని. ఆ కాలంలో తెలుగులో ఆలోచించి, తర్జుమా చెయ్యగల వాగ్ని సంఖ్య చాల అరుదు; చదువరుల సంఖ్యకూడా చాల తక్కువే. ఇప్పుడు అలా కాదు. తెలుగు భాష చాల అభివృద్ధి చెందినది. ఎన్నో భాషలలో ఆరితేరి తర్జుమా చెయ్యగలవారున్నారు. చదివేవారి సంఖ్య-ముఖ్యంగా గ్రామాల్లో చాల పెరిగింది.

ఈ సంకల్పాన్ని నెరవేర్చుకోవాలనుకొన్న ఒక్క సంవత్సరానికి సరియైన వ్యక్తి-ఈపనికి పూనుకొని జయప్రదం చెయ్యగలరనే వారు-విద్వాన్ విశ్వంగారు లభించారు. అటు తరువాత కొన్ని వారాల్లోనే ప్రజాసేవ తప్పక చెయ్యాలని కోరే నలుగురు పాతస్నేహితులు

ముందు కొచ్చారు. ప్రజలకు వాస్తవంగా సహాయం చెయ్యగలిగితే, డబ్బు సేకరించగలమనే దృఢనమ్మకం గల ఈ స్నేహితులు ఈ పనిని తక్షణమే ప్రారంభించినట్లు ప్రోత్సహించారు; ఇంతేకాదు, ఆర్థిక విషయంలో భయపడనవసరంలేదని అభయహస్తమిచ్చారు. ఏతత్ఫలితంగా మద్రాసులో "ఇటువంటి విజ్ఞానమాల" అను సంస్థను 21 మే 1951 సంవత్సరంలో రిజిష్టరు చేయించితిమి. దీనిని ఆంధ్రులు ఆదరిస్తారని, జయప్రదంగా నెరవేరగలదని నమ్మకం ఇప్పటికి కలిగింది. నాకు ఇప్పుడు మరొక కోరిక కలుగుతున్నది. ఈ "ఇంటింటి విజ్ఞానమాల" ద్వారా ప్రకటింపబడిన పుస్తకాలతో "ఆంధ్ర విజ్ఞాని" పరీక్షలు పెట్టించి, అవసరమైతే కరెస్పాండెన్సు ద్వారా విద్యార్థులకు సహాయంచేస్తూ వేలూ, లక్షలూ రూపాయలు అవసరం లేకుండానే ఆంధ్రదేశంలో విజ్ఞానాభివృద్ధిని కల్గించగలమని ఆశించుతున్నాను.

సుభద్రమ్మగారు - బిడ్డలు

ఇది నా జీవిత చరిత్ర; స్వీయచరిత్ర. కాబట్టి నా కుటుంబాన్ని గురించి వ్రాయకపోతే ఈ పుస్తకం పూర్తి కాజాలదు ముఖ్యంగా నా సుభద్రను గురించి వ్రాయక తప్పదు.

అయితే, నా భార్యను గురించి వ్రాసుకోడానికి సిగ్గు వేస్తుంది. వాస్తవమే! అయినా ఇలాంటి అనవసరపు మొగమాటాలతో మానివెయ్యడం మంచిది కాదు.

నా సుభద్ర మామూలు భార్యలవంటిది కాదు. ఆమె విద్యావతులైన భారత స్త్రీలలో ఎన్నదగిన ఆదర్శ గృహిణి. ఇక మీదట ఇలాంటి స్త్రీల సంఖ్య పెరుగుతూ వుంటుంది. ఇప్పుడు మాత్రం మన సంఘంలో యిలాంటి వారు అరుదు.

నాకు భార్య అవుటకు ముందే తన శక్తి-సామర్థ్యాలను బాగా అభివృద్ధి చేసుకొన్నది. నైతిక, ఆధ్యాత్మిక విషయాలను, మానసిక శాస్త్రాన్ని, నవీన విద్యావిధానాలను చదివి, అనుభవంలోకి తెచ్చుకొని ప్రవీణురాలైనది. సంగీత సాహిత్యాలలోను, లలిత కళల యందును - ఒక్క మాటలో చెప్పాలంటే సంస్కారముగల సరస్వతి. పై విషయాల్లో ఆమెకు నికరమైన సిద్ధాంతాలూ, దృక్పథమూ ఉన్నాయి; కాని ఇవి నాలో అంతగా అభివృద్ధి కాలేదు. అందువల్ల ఆమె సాంగత్యమువల్ల నా జీవితంలో వెలుతురు వచ్చి జీవితాన్ని అర్థంచేసుకొనేలా చేసినది. ఏదో తోచినప్పుడు ఉద్రేకంతో చెయ్యడం పోయి, మంచి చెడ్డలు, ముందు వెనుకలు ఆలోచించి చేసేలాగున మార్గదర్శిని అయింది.

"పరులకు అపకారం చేసేవ్యక్తి తన భార్యకు, బిడ్డలకు, దేశానికి కూడా అపకారం చెయ్యగలడు" అని మానసికశాస్త్రాన్ని గ్రహించి, నా జీవితాన్ని సంస్కరించుకోమని సలహా యివ్వడమేగాక, తన జీవితంలో ఆదర్శంగా పెట్టుకొన్న సుశీల.

ఒకరికి లోబడకుండా జీవించడం, నిరాడంబర జీవితం, ప్రతిఫలం కోరని సంఘసేవ ఆమె ఆదర్శాలు. అవి నాకూ, బిడ్డలకూకూడా అలవాటుపడుతూవచ్చాయి. నేనూ, బిడ్డలూ, బంధువులూ, మిత్రులూ కూడా ఆమెవల్ల సంస్కారం పొందితిమి.

ఆమెలో అభివృద్ధికి రాని కొన్ని శక్తులు నాలో వచ్చి యుండవచ్చును. అందువల్ల మాలో పరస్పరం గౌరవం ఏర్పడింది. మేము మొదట యావజ్జీవిత మిత్రుల మైనాము. 1929 లో ప్రారంభమైన పరిచయం క్రమంగా పరస్పర గౌరవంగా మారినది; తరువాత స్నేహము, ప్రేమ కలిగాయి. ఆమెకు నేను ఎంతో ఋణపడి ఉన్నాను. భోజనాల్లో రుచులు గ్రహించడం మొదలుకొని సంగీత సాహిత్యాల్లో అభిరుచి కల్గించడం, చివరకు నైతికం గానూ, ఆధ్యాత్మికంగానూ లోతుగా అర్థం చేసుకొనే వరకూ నా జీవితంలో ఆమెకు భాగమున్నది. ఆమె సమ్మతి ప్రోత్సాహాలు ఉన్నందుననే పది సంవత్సరాల కాలము నిశ్చింతగా రాజకీయ రంగంలో గడిపాము. మొహమాటం మానేసి మామూలు సాంప్రదాయాలను లక్ష్యపెట్టక నా భార్యను గురించి నేను యిలా వ్రాసినప్పుడు నాతోను, నా భార్యతోను పరిచయం లేనివారికి ఆశ్చర్యం కలుగ వచ్చు.

మన స్త్రీలలో అభివృద్ధికి రాని శక్తులెన్నో అంతర్గతంగా వున్నాయి. వాటిని వృద్ధికి తెస్తే మన సంసార

జీవితం ఎంత ఆనందమయంగా ఉంటుందో అనుభవించిన ఏ కొద్దిమందికి మాత్రమో అర్థంకాగలదు. ఇది నా అదృష్టం.

ఆమె చేస్తూవున్న సంఘసేవలను గురించి ఇచ్చట కొంత వ్రాయడం సమంజసమే సనుకుంటాను.

పురాతన క్రూర సాంప్రదాయాలమీద చిన్నప్పటి నుండి ఆమెకు అయిష్టం. తన పినతల్లి ఎనిమిది సంవత్సరాల వయసులోనే వితంతువయింది. ఆమె తరుణ వయస్సులో నున్నప్పుడు వెంట్రుకలు తీయించాలని పెద్దవారు ఎన్నో పర్యాయాలు చేసిన ప్రయత్నాలను సుభద్రమ్మగారు విద్యార్థినిగా వున్న కాలంలోనే ప్రతిఘటించి పోట్లాడి, తుదకు జయించింది. కులభేదాలను లక్ష్యపెట్టనందున తన అమ్మమ్మగారికి ఆగ్రహం వచ్చి, మనుమరాలితో దినముల కొలది మాట్లాడడం మానివేసేది.

ఆమెకు 18 సంవత్సరాల వయస్సున వచ్చేసరికముందే "మహిళా భారత సమాజాన్ని (Women's Indian Association) శ్రీ ఆనిబిసెంటు, మిసెస్ జినరాజదాస్ మున్నగు వారితో కలసి స్థాపించిన భాగ్యం ఆమెకు లభించినది. ఆ సంస్థకు హైదరాబాదులో మొట్టమొదట శాఖను స్థాపించి స్త్రీల కష్టాలను తొలగించుటకు పూనుకొన్నది.

పిల్లలను శిక్షించకుండా వారి మనస్తత్వం మెరిగి ప్రేమతో విద్య గరపడం అసాధ్యంకాదు అనే విషయాన్ని

నిరూపించుటకు హైదరాబాదులో బాలికలకు ఒక యెలిమెంటరీ స్కూలును స్థాపించి, దానిని మహిళా భారత సమాజ శాఖ నిర్వహించునట్లు చేసినది.

పాతికేళ్ళ వయసులోనే మద్రాసులో అఖిలభారత మహాసభలో (All India Women's Conference) కార్య నిర్వాహక సభ్యురాలుగా వుండి స్త్రీల ఓటు హక్కును, ఉద్యోగాలకు, ఆనరరీ మేజిస్ట్రేట్లుగా వుండుటకు, శాసన సభా సభ్యులుగా నుండుటకు సాగింపబడిన ఉద్యమాలలో పాల్గొంటూ, పాటుపడ సాగినది. బహు భార్యా నిషేధం, విడాకుల హక్కు, జన్మ నిరోధం మొదలగు విషయాలను గురించి ప్రచారం చేసి, తుదకు తన ప్రాణమిత్రులు ఆగ్రహానికి పాత్రురాలైనది. శారద ఆక్టును సమర్థించి పని చేసింది. స్త్రీలకు ఆస్తిహక్కు విషయంలో ఇప్పటికీ పని చేయుచునే ఉన్నది.

1932-34 సంలలో మధ్య మద్రాసులో స్థాపించిన "రెస్క్యూహోం" (Rescue Home) ను, మాంటిసోరి స్కూళ్ళను డాక్టరు ముత్తులక్ష్మిరెడ్డి, మిసెస్ కజిన్స్, మిస్ బ్యారీలతో కలసి స్థాపించుటేగాక, చాలకాలం వాటి నిర్వాహక కమిటీలలో వుండి పాటుపడింది.

1934_35 లో అఖిలభారత మహిళా మహాసభ మద్రాసు స్టాండింగుకమిటీ మెంబరుగా వుండి కొంతకాలం పనిచేసెను. హిందూకోడు బిల్లు చట్టమగునని గంపెడంత

ఆశతో వున్నది. కాని, దానిని మానివేయడంతో ఆగ్రహ, దుఃఖములతో బాధపడుతున్నది.

స్త్రీల, బిడ్డల అభ్యున్నతికొరకు 1920 నుంచి మద్రాసులో సాగించబడుచుండిన ప్రతి ఉద్యమములోను ముందంజ వేయుచుండెను.

ఇప్పుడు మద్రాసులో శ్రీమతి దుర్గాబాయిగారు ఆంధ్ర మహిళాసంఘం తరఫున ఎన్నెన్నో ప్రజోపయోగకరమైన సంస్థలను ఏర్పాటుచేయుచుండుట ఆమె కెంతో ఆనందదాయకంగా వున్నది. శ్రీమతి దుర్గాబాయిగారు నిర్వహించుచున్న "ఆంధ్రమహిళ" మాసపత్రికలో పిల్లల మనశ్శాస్త్రమును గురించి, నవీన శాస్త్రీయ దృక్పథంతో పెంచవలసిన పద్ధతులనుగురించి ప్రతి నెల రెండుమూడు సంవత్సరాలుగా వ్రాయుచునే ఉన్నది.

నవీన విద్యావిధానాలను శిశు మన స్తత్వశాస్త్రంలో నిపుణురాలైన మిస్. బేరీ సహాయంతో చదివి అడయారులోను, ఋషివాలీలోను శ్రీ జి. వి. సుబ్బారావుగారు నవీన విద్యాపద్ధతులతో నిర్వహించుచుండిన హైస్కూళ్ళలో ఉపాధ్యాయినిగా పనిచేసి, వారిద్దరి మన్ననలను సంపాదించింది. 1925 మొదలు 1930 వరకు నవీన విద్యా పద్ధతులలో శిక్షణపొందుటకు ఆమెవద్దకు కొందరు టీచర్లు ఇండియాలో అనేక ప్రదేశాలనుండి వచ్చుచుండెడివారు. ఇప్పుడుకూడా నవీన విద్యాపద్ధతులను, మనశాస్త్రమును,

పిల్లలను పెంచవలసిన పద్ధతులను గురించి ఎంతో కృషి చేస్తూనే ఉన్నది.

1932 లో కాంగ్రెసు ఉద్యమము ఆమెను బాగా ఆకర్షించిన; శ్రీ బి. జగన్నాధదాసుగారు ఈమెకు మంచి తర్ఫీదు నిచ్చి, ఎన్నో పనులు చేయించుచుండిరి. వారి నిరాడంబరసేవ, వారి స్వచ్ఛమైన దేశభక్తి ఆమెను ఆకర్షించినవి. హరిజనోద్యమాన్ని 1932 లో గాంధీజీ ప్రారంభించిన సందర్భములో మద్రాసులో శ్రీ బి. జగన్నాధదాసు, శ్రీ కె. భాష్యం (మాజీమంత్రి) మున్నగు ప్రముఖులు దాని శాఖను స్థాపించారు. జాతీయోద్యమమములో పనిచేస్తున్న సుభద్రమ్మ జైలుకు సిద్ధపడుతున్న తరుణంలో ఆమె అంగీకారం తీసుకోకుండానే ఆమెను మద్రాసు హరిజన సేవా సంఘమునకు మొట్టమొదటి కార్యదర్శిగాను, శ్రీ ప్రకాశం పంతులుగారిని మొదటి ప్రెసిడెంటుగాను ప్రజలు ఎన్నుకొన్నారు. జైలుకు వెళ్ళకుండ అభ్యంతరం పెట్టినందుకు ఎంతో చింతించినా ప్రజల ఆదేశాన్ని శిరసావహించి, హరిజన సేనకో నిమగ్నురాలై పోయింది. అప్పటినుంచి ఇప్పటికీ ఆమె ఆ ఉద్యమములో పనిచేయుచునే ఉన్నది. 1933 లో కీ॥ శే॥ శ్రీ వి. వెంకటసుబ్బయ్యగారు (సెక్రటరీ, సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసైటీ) శ్రీ వి. భాష్యం అయ్యంగారు, సుభద్రమ్మగారు కలసి ఒక హరిజన బాలికల హాస్టలును స్థాపించారు. దానిని శ్రీ గిరిగారు మొదటిసారి కాంగ్రెసు

మంత్రిగా ఉన్నకాలం (1938-39) లో, వారి సహాయంతో ఒక్కొక్క బాలికకు నెలకు పదిరూపాయల చొప్పున గవర్న మెంటు గ్రాంటును సంపాదించారు. ఆ హాస్టలు దినదినాభి వృద్ధి చెందుతున్నది. ఇప్పుడు వందమంది బాలికలున్నారు. వీరందరికి అన్ని ఖర్చులూ కాంగ్రెసు ప్రభుత్వం భరించి పోషించుచున్నది. వీరికి హాస్టలు కట్టుటకు సుమారు 1 1/2 ఎకరాల భూమిని ఇచ్చారు. ఒక పెద్ద భవనముకూడ శీఘ్రకాలంలోనే తయారుకాగలదని ఆమె ఆశిస్తున్నది.

హాస్టలులో ఉండే దిక్కులేని బాలికలమ ప్రేమించి, వారి ప్రేమను ప్రతిఫలంగా స్వీకరించి తృప్తిపడుతున్నది. వారిని విద్యా వినయ సంపన్నులై ఇల్లాండ్రుగాను, తల్లులు గాను, డాక్టర్లుగాను, టీచర్లుగాను, లాయర్లుగాను వృద్ధికి వచ్చేలా ప్రోత్సహించుతూ, వారు అభివృద్ధిచెందుచుండుటను చూచి పరమానంద భరితురాలవుతూంటుంది.

మా కుటుంబ ఇష్టాగోష్టిలో గాంధీజీనిగురించి ఆమె ఇలా అన్నది:— "ఇంటా బయటా- ఏ రంగంలో గాని - రాజకీయ రంగంలో కాని, సంఘసంస్కరణ క్షేత్రంలో కాని పనిచేయుటకు అహింస, ప్రేమలే సరోత్కృష్ట సాధనాలు. ఇట్టి సాధనముల ద్వారా నిర్మించిన సంఘమే శాంతి సౌభాగ్యములతో విలసిల్లుతుంది; సర్వమానవ కళ్యాణం జరుగుతుంది."

నవీన మనశ్శాస్త్రజ్ఞుల అభిప్రాయంకూడ అదేనని ఆమె అభిప్రాయం.

మా ఇద్దరికి కోరికలు సంఘసేవ చెయ్యాలనేకాబట్టి ఎవరికి తోచిన కార్యాలను వారు చేయుచు, పరస్పర సహాయం చేసుకొంటూ ఒకటి రెండు తరాలు గడిపాము.

స్త్రీలు పురుషులవలెనే శక్తివంతులు కాగలరు. తండ్రులు, భర్తలు సహాయం చెయ్యాలి; లేనిచో వారి శక్తి సామర్థ్యాలు అభివృద్ధి చెందకపోవడమేగాక, కుటుంబములో సంస్కృతి, సంఘంలో అభివృద్ధి రాజాలవు.

స్త్రీలకంటె పురుషులను సహజంగానే గొప్పవారమని గర్వపడుతుంటాము. పురుషులం ఎన్నో వందలు, వేల యేండ్లుగా సంఘాన్ని, దేశాన్ని, ప్రపంచాన్ని నిర్వహించుచున్నాము; కాని, అన్నం, బట్టలు ఇళ్లు మొదలగు సామాన్య మానవావసరాలైనా తీర్చలేకపోతిమి. ప్రపంచ యుద్ధాలతో కోట్ల ప్రజలను క్రూరంగా చంపి, ఎందరినో అనాథలను చేసి. ఆస్తిపాస్తులను నాశనంచేసి, "అన్నమో రామచంద్రా!" అనేలాగా చేస్తున్నాము. మరొక మారణ హోమానికి సన్నాహాలు చేస్తున్నాము. ఆటంబాంబులను, హైడ్రోజన్ బాంబులను తయారు చేస్తున్నాము. ఇప్పటికైనా మన గర్వాన్ని కొంత తగ్గించుకొని, ఈ ప్రపంచ నిర్వహణలో స్త్రీ జాతికికూడ సమాన స్థానం ఇచ్చినచో మనజాతికి మనం చేసినంత అన్యాయం ఇకమీదట జరగదని నాదృఢవిశ్వాసం. నే నీవిధంగా

అంటున్నందుకు పురుషులు నన్ను క్షమిస్తారని ఆశించు తాను.

ఇక బిడ్డల విషయం: ఇద్దరు కూతుళ్లు, ముగ్గురు మరదలుబిడ్డలు, ఒక మేనల్లుడు-వీరందరినీ బాగా చదివించుటకు ప్రయత్నించాము. ఇద్దరు డాక్టర్లు అయ్యారు; ఒకరు యల్. టి ఇద్దరు బి. ఎస్. సి. చదువుతున్నారు. ఒక్క మాత్రమే కాలేజిలో చదువుతూ వివాహం వల్ల మానివేసెను.

వీరందరి విషయంలోను మా ఉద్దేశ్య మేమనగా:-

1. ఎంతవరకు చదువుకు అవకాశాలున్నాయో అంతవరకు చదివించాలి.

2. ఆర్థికంగా ఎవరి స్వార్జితంమీద వారు ఆధార పడాలి. స్త్రీలు భర్తల ఆస్తిపాస్తులమీదకాని, వారి సంపాదనమీద కాని ఆధారపడకూడదని తీర్మానించుకొంటిమి.

2 సంస్కృతికొరకు సంగీత సాహిత్యాలు, లలిత కళలేగాక, సైన్సులు బాగా చదివేలాగున చేశాము. మానవసేవ చెయ్యవలసిందని బోధించాము.

అయితే, వీరందరి విషయంలో మామూలు స్కూళ్ళు, కాలేజీలలో చదివి, తప్పకుండా ప్రతి సంవత్సరం ప్యాసవడానికే వారికి వ్యవధి చాలదు. అందువల్ల సంగీతము, సాహిత్యము, భరతనాట్యము నేర్చుకొనుటకు ఎన్నోతడవలు ప్రయత్నించి మానుకొంటూ వచ్చారు. ఈ సబ్జక్టులు విద్యా సంస్థల "కరికులం"లో తప్పక వుండాలి.

ప్రస్తుత విద్యావిధానం సరిగా లేదు. ముఖ్యంగా పరీక్షా విధానాలు అమానుషంగా ఉన్నాయి. విదేశాల వారి అనుభవాన్నయినా వినియోగించుకొని మన విద్యా విధానంలో మార్పులు ప్రవేశపెట్టనంతవరకు మన బిడ్డలు చాల బాధపడవలసివుంటుంది. వ్యక్తులు ఎంత ప్రయత్నించినా నెరవేరే వీల్లేకుండా సంఘ పరిస్థితులు అడ్డుగా ఉన్నాయి. మనదేశ దురదృష్టాన్ని ఏమనుకోవాలి!

స్వాతంత్ర్య యాత్ర

మోక్షంకొరకు ఎన్నో యాత్రలు చేస్తారు. జీవితం కూడ ఒక యాత్రే! దైవభక్తి, దేశభక్తి మానవసేవలే కదా! ప్రజలు ప్రశాంతంగా జీవించాలనే కదా వీటి ఆదర్శం "సర్వేజనా సుఖినో భవంతు." మానవులు వాస్తవమైన మానవుల్లాగా అనగా సర్వశక్తులను అభివృద్ధికి తెచ్చుకొనుచూ జీవించుటకే కదా ఈ సాధనాలు; ఇతరుల సేవకొరకు, దాస్యం కొరకు కాదు మానవులు జీవించేది.

స్వార్థం ఒకదశలో మానవునికి అవసరం
మంతాకూడ కొంతవరకు అవస
లోని మానవత్వం చక్
పరార్థం పెరుగుతూ

మానవుల కష్టసుఖాల్లో లీనంకావాలి స్వార్థపడుడే దోపిడి గాడుగాను, రాక్షసుడుగాను, చివరకు భస్మాసురుడుగాను పరిణాయం పొందుతాడు.

ఆదిలో మానవుడు మోక్షంకొరకు ఎన్ని ప్రయాసలు పడ్డాడు! తిరుపతిలో ఏడుకొండలు ఎక్కుతాడు. అడవుల్లో, కొండల్లో, భీకర మృగాలచే, దొంగలు, దోపిడిగాండ్రవల్ల ఎందరో చచ్చిపోయారు. చివరకు మానవుడు కష్టాలను జయించి, తాను ఆరాధించే దేవతను దర్శించాడు. సర్వజనులు తనవలెనే మోక్షం పొందాలనే ఆదర్శం కొరకు సోపానాలు కట్టాడు. స్తూపాలు నిర్మించాడు; దేవాలయాలు నిర్మించాడు; గుళ్ళు గోపురాలు కట్టాడు; అందరిని మోక్షం పొందమన్నాడు. అంతవరకు తన ఆత్మకు శాంతి, సుఖము, మోక్షము కలుగవనే ధర్మాన్ని గుర్తించాడు.

కాలానుగుణ్యంగా మానవుని అభిప్రాయాలు మారుతాయి. దైవభక్తే మానవసేవ అవుతుంది; అదే దేశభక్తిగా పరిణమించుతుంది.

ప్రస్తుత కాలంలో దేశసేవే మోక్షసాధనము. 1900 [illegible] త్యం కొరకు, విముక్తి కొరకు, [illegible]కే, నలభైకోట్ల భారతీ [illegible]కే, మన తాతలూ, [illegible]త్య దేవత

ఎక్కడో ఉన్నది. ఆమెను దర్శనం చేసుకోవాలి. వరాలు సంపాదించుకోవాలి. మోక్షం సాధించాలి. అందుకు ఎన్నో కష్టాలు పడాలి. నలభై కోట్ల భారతీయులు సుఖ సంపదలతో జీవించాలి! ఆదే దేశభక్తిలోని సారం.

1900 సంవత్సరంలో యువకులు స్వతంత్ర యాత్రకు బయలుదేరారు. పెద్దలు అడ్డుపడ్డారు. అయితే నేమి? కొందరు యువకులు సాహసించే ప్రయాణం సాగించిరి; కొండల్లోను అడవుల్లోను ఉండే భయంకర మృగాల కన్న క్రూరమానవులున్నారు. తెల్ల రాక్షసులు వారిని కొట్టి జైళ్ళలో వేశారు; చివరకు చంపారు. అయితేనేమి? పెద్దల హితబోధను చెవిని పెట్టలేదు. ఉద్యోగము, దాస్యము, ద్రవ్యము మోక్షసాధనాలు కావని యువకులకు తెలుసు. తెల్ల రాక్షసులతో పోరాడి ఎందరో నశించారు. అయితేనేం? ఏ కొద్దిమంది యువక యోధులో మొదటికొండ ఎక్కారు. అలసిపోయారు. స్వాతంత్ర్య దేవత ఆలయమైనా కనుపించలేదు. "ఔరరిస్టు"లని తిట్లుతిన్నారు.

వారి అగచాట్లు చూస్తూ కొందరు జీవచ్ఛవాల్లాగ ఉండలేకపోయారు. తమ తండ్రులు, తాతలు, ముత్తాతలు ఎన్నో యుద్ధాలు చేసినవారే! అట్టి సంతతివారు అయినందుననే ఇట్టి పౌరుషం కలిగింది. ఔరరిస్టుల సహాయానికి, స్వాతంత్ర్యదేవత దర్శనానికి వెళ్ళారు. ఎందరో నశించిపోయారు. కాని, తమ యాత్రను వదల్లేదు. మరొక

కొండ నెక్కారు. స్వాతంత్ర్య దేవత దర్శనంమాత్రం లభించనేలేదు. కాని, ఆ గదరు వీరులలో చాలామంది ఆహూతి అయ్యారు.

"భయపడవద్దు; నిరాశచెందవద్దు; ఇదిగో వస్తున్నాము లక్షల కోట్ల మందిమి! సంపూర్ణ స్వాతంత్ర్య దేవత దర్శనం అయ్యేవరకు మా సంకల్పము విడువము! రాక్షసులను, దోపిడిగాండ్రను నాశనం చేస్తాము. ధనం, సౌఖ్యం, విజ్ఞానం అందరికి కలిగేలా చేస్తాము" అని గర్జిస్తూ ముందుకు నెట్టుకుంటూ గుంపులు గుంపులుగా, తండోపతండలుగా వచ్చారు జాతీయ యోధులు. గదరు వీరులను రెండో కొండ శిఖరంమీద కలుసుకొన్నారు.

మూడవకొండ ఎక్కడం ప్రారంభించారు ఎంత దూరం! ఎంత ఎత్తు? అయితేనేం? రాక్షసినూకను ధ్వంసం చేస్తూ ముందుకు సాగిపోయారు. కొంతమంది పారిపోయారు; కొందరు దాసులయ్యారు. జాతీయయోధులకు తోడ్పడుతామని ప్రమాణం చేస్తున్నారు.

అదిగో నాల్గవకొండ! ఆ కొండమీద స్వాతంత్ర్య దేవత దేవాలయం ఉన్నది; చూడండి. అయితే "ఆ కొండపై కెక్కడం సాధ్యంకాదు; నిటారుగా వున్నది; చాలా ఎత్తు. జారుతుంది" అని ప్రజాద్రోహులు, దోపిడిగాండ్రు భయపెట్టారు. జాతీయయోధులు ముసలివార య్యారు. ముప్పయి సంవత్సరాల పోరాటంవల్ల నిరసించి

పాయ్యారు. ఇక కొండ ఎక్కలేరు. మనోబలంకూడ క్షీణించిపోతున్నది. చివరకు శత్రువులనే మిత్రులుగ భావించి మోసగింపబడుతున్నారు. మూడవకొండ శిఖరము మీదనుండే గుడివైపు తిరిగి సాష్టాంగ నమస్కారం చేశారు.

"ఓ దేవతా! మేము నీవద్దకు రాజాలము. నీవే మా వద్దకువచ్చి. నీ భక్తులమైన మాకు దర్శన మివ్వాలి" అని ప్రార్థించుతున్నారు. వస్తుందని భక్తులు కలలు గంటున్నారు.

అయితే, ఈ యోధుల బిడ్డలు, మనమలు మోస పోలేదు. నాల్గవకొండ ఎక్కవలసిందేనని సంకల్పించారు. ఎక్కడం ప్రారంభించాను. జారి పడిపోతున్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా ముందుకు దూకుతున్నారు. కొండలు, లోయలు, అడవులు, భీకర మృగాలు యువకయోధుల ధైర్య సాహసాలకు తాళలేక భయపడిపోతున్నాయి. ఏమి సంకల్పదీక్ష! ఏమి సాహసం? ఏమిత్యాగం! ఎంతమంది సశించినా ముందుకాలు ముందే ఉంటున్నది.

అదిగో! గుడిలో జ్యోతి వెలుగుతున్నది. అరుణ కాంతులు విరజిమ్ముతున్నది. ఆ దీపంలో ఉన్నది వీరాధి వీరుల - దేశభక్తుల రక్తం!

అబ్బ! లోయ ఎంత లోతు! శిఖరం ఎంత ఎత్తు! అయ్యో! నేను దూకలేను! అయ్యో! నేను ఎక్కలేను" అన్నాను కాళ్ళ నొప్పులతో.

"తాతగారూ! ఇంతదూరం వచ్చారు. భయపడ వద్దు. ఆ బరువు మొయ్యలేవు! ఆయుధాలు మాచేతికి యివ్వు! మాచేతులు పట్టుకో! మా భుజాలమీద కూర్చో! దేవతాదర్శనం చేయిస్తాము! రా! తాతా! రా!" అన్నారు. యువకయోధులు.

"36 సంవత్సరాల సాధన, తపస్సు జ్ఞాపకముం చుకో! ధైర్యంచెయ్యి! ఒక్కదూకు దూకు! అన్నారు మనుమలు, మనుమరాండ్రు.

"యువకుల్లారా! యోధుల్లారా! మీరు ముందుకు సాగిపోండి! మీ వేగాన్ని కుంటుపరుస్తున్నాను. నాకొరకు కాచుకోవద్దు! నేను విశ్రాంతి తీసుకోవాలి! వెళ్ళండి నాయన్లారా! వెళ్ళండి" అని వేడుకొన్నాను.

"యువకుల్లారా! దేవతను ఏమేమి వరా లడుగు తారు? సంపూర్ణ స్వరాజ్యం మాత్రమే చాలదు. కేవలం ప్రజాప్రభుత్వంకూడా చాలదు. అందరికి అన్నం, ఇండ్లు, బట్టలు, మందులు, చదువు, సంస్కృతి కావాలని అడ గండి. మన నలభై కోట భారతీయులకే కాదు! సర్వ మానవ జాతికి కావాలని కోరండి... చాలదు!... చాలదు! అందరికి రేడియోలు, కార్లు, ఏరోప్లేనులు కావాలని అడగండి. సంశయించవద్దు సుమా! దోపిడితనం పోతే, పదవీ వ్యామోహం పోతే అందరికీ అవి లభిస్తాయి! యుద్ధాలు నశిస్తాయి! అందరం బాగుపడతాం! సమృద్ధిగా వుంటాయి అన్నీ" అని దీవించాను.

MEMORIAL
G. P. R. I.
Acc. No.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA101B117
పుస్తకం పేరు	మేమూ వాదేశము
తారీఖు	31 December 2025
ముందు అట్ట	[redacted]
వెనుక అట్ట	[redacted]
మొత్తం పేజీలు	591
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	
లేని పేజీలు	[redacted] 4TTO48
తయారు చేసినది	
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	SARANYA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	